# జ్యోతిష్య సర్వార్థ చంద్రిక

## ప్రథమ స్కంధము



"జ్యోతిషాచార్య" డా॥ పండిట్ మల్లాది మణి, Ph.D

VICTORY

విక్టరీ

# జ్యోతిష్య సర్వార్థ చంద్రిక

✍

"జ్యోతిషాచార్య"
డా॥ పండిట్ మల్లాది మణి, Ph.D.

శ్రీ వెంకటేశ్వర బుక్ డిపో
# 30-17-3ఎ, వారణాశివారి వీధి, సీతారామపురం,
విజయవాడ - 2. ఫోన్ : 2444156

# జ్యోతిష్య సర్వార్థ చంద్రిక

© Ln. **I. Ramakumar,** PMJF
Immadisetty Akkeswara Rao
Charitable Trust, Vijayawada.

ప్రథమ ముద్రణ : జూలై 2012

**Price : Rs.200/-**

"జ్యోతిషాచార్య"
**డా॥ పండిట్ మల్లాది మణి,** Ph.D.
1-1-730, గాంధీనగర్,
హైదరాబాద్ - 500 080,
**ఫోన్ : 040-65151424**

**Sole Distributors**

**SAI VENKATESWARA BOOK DEPOT**
# 26-27-77, Opp. Bata Show Room,
Station Road, Gandhinagar,
Vijayawada - 520 003
Ph : 0866-6663733, 2444156.

* * *

**SAI VENKATESWARA BOOK DEPOT**
Plot No.3, 103, # 2-4-1085, Sai Lakshmi Niketan,
Opp. Street of Ramakrishna Hospital,
Near Kachiguda Kumar Theatre, Nimboli Adda,
Hyderabad - 500 027
Ph : (040) 65528228, 24653879
Fax : 24745257, Cell : 9346771314

**మనవి :** మాచే ప్రచురించబడిన అన్ని రకముల పుస్తకములు అన్ని ప్రముఖ బుక్ షాపు లలోను, విశాలాంధ్ర మరియు ప్రజాశక్తి బుక్ హౌస్ అన్ని బ్రాంచి లలోను లభించును. లభించని యెడల మమ్ములను నేరుగా సంప్రదించగలరు. పుస్తకాలలో ఏవైనా లోపాలు, తప్పులు ఉన్నా తెలియచేసిన తదుపరి ముద్రణలో సరిచేయగలం. ఏ విషయమైన **ramakumarimmadisetty@yahoo.com** మెయిల్‌కు తెలియ జేయవచ్చును. మీకు కావలసిన పుస్తకాలకు : **SBI online A/c. No. 31712393082 సాయి వెంకటేశ్వర బుక్ డిపో, విజయవాడ** పేరున జమచేసి, మీకు దగ్గర గల ట్రాన్స్‌పోర్టు వివరాలు తెలుపవలెను.

***Published by :* శ్రీ వెంకటేశ్వర బుక్ డిపో, విజయవాడ.**

We have made many efforts to present this book without errors. But some errors might have crept in. We do not take any legal responsibility for such errors and omissions. If you bring them to our notice we shall correct them in our next edition. All disputes are subject to Vijayawada Jurisdiction only.



# కృతజ్ఞతాసుమాంజలి

మాతృభాషాహీనత, మాతృభాషా దారిద్ర్యం, ఈ రెండూ ఒక గొప్ప సంస్కారంగా భావించే తల్లిదండ్రులు, యువత, ప్రభుత్వము ఉన్న ఈ రోజుల్లో ఆంగ్ల భాష సంస్కృతిలో పుట్టి పెరిగి M.A.Literature in English and M.A., Literature in Modern English ఈ రెండూ మొదటి తరగతిలో ఉత్తీర్ణుడైనా, మన మాతృభాషలోని మధురిమను ఆహ్లాదంగా ఆస్వాదిస్తూ మన భాషా ఔన్నత్యాన్ని ప్రజలకు చాటి చెబుతూ పరభాషా పీడను ఆధునిక పాశ్చాత్యధోరణులతో గౌరవించి మాతృభాషను కించపరచడమంటే, సుగుణ సంపన్నురాలైన ధర్మపత్నిని ఒదిలి వేశ్యావాటికలందు సంచరించడమే యని చాటి చెప్పే ధైర్యం సాహసం కలిగిన శ్రీ వడలి సుబ్రహ్మణ్యం నా శిష్యులవడం నాకు గర్వకారణం.

నేను ఈ గ్రంథంలోని అధ్యాయాలను చెప్తూ ఉంటే భాషా శైలిని సమర్థిస్తూ, మెచ్చుకుంటూ, సమయోచిత సందర్భానుసారం తగిన పదములు నాకు అందించడమే కాక తనకు తోచినట్లుగా, అవసరమయిన చోట తగిన నానుడులను ఏరికూర్చి, అక్షర సంధి, అలంకారములను ప్రయోగిస్తూ వ్రాసిన శ్రీ వడలి సుబ్రహ్మణ్యం, శిష్యులవడం నాకు గర్వకారణం.

విసుగు, విరామం లేకుండా రోహిణి కార్తె మండుటెండలలో కూడా సమయభావం పాటించకుండా పిలిచిన ప్రతిసారి వచ్చి శాస్త్రాన్ని చిరునవ్వుతో వ్రాసి పెట్టిన శ్రీ వడలి సుబ్రహ్మణ్యం నా శిష్యులవడం నాకు గర్వకారణం.

ఈ శాస్త్రాన్ని వ్రాసిన శ్రీ సుబ్రహ్మణ్యం గారికి ఈ పుస్తక పుష్ప గుచ్ఛంలోని శుభ గ్రహాలు ఆయనకు భవితంలో, శేష జీవన స్రవంతిలో శుభఫలితాలు ఇవ్వాలని, ఆ శుభగ్రహాలు తమ దుష్ఫలితాలు ఇవ్వరాదని గ్రహాలను నేను ప్రార్థిస్తూ, ఆయనకు నా కృతజ్ఞతకుసుమాంజలి సమర్పిస్తున్నాను.

**- రచయిత**

# రచయితగా నా మాట

ఆంధ్రావనిలో ఎంతోమంది జ్యోతిష శాస్త్ర మహా పండితులున్నారు. వారందరకు నా నమోవాకాలు. బంగారుపళ్లెరమునకైనా గోడ చేర్పు కావాల నేది నానుడి. అందువల్లే నేను వ్రాసిన ఈ గ్రంథం చదివిన పండితోత్తముల ఆశీర్వచనములు నేను మనసారా వినమ్రతగా అర్థిస్తున్నాను. ఈ పుస్తకంలోని అంశాలు చదివి మెచ్చుకునే వారికంటే దానిలోని లోపాలు నాకు విశదముగా విపులీకరించి హంసక్షీర న్యాయంగా శాస్త్ర గూడార్థాలను నాకు విప్పి చెప్పే పండితోత్తములు నాకు గురుదేవులే కాక, పుత్ర ప్రేమతో ఆశీర్వదించే మహోన్నత వ్యక్తిత్వం గలవారుగా భావిస్తాను.

సాటిజ్యోతిష సోదరులకు నా విన్నపం ఏమంటే కీర్తి కాంక్ష, ధనకాంక్షలకు ఆశపడక పరాశర మహామునినే ధ్యానించి ఆయన ఉటంకించిన జ్యోతిష విలువలను పదిమందికి నిస్వార్థంగా చెప్పినపుడు మీకు వాక్శుద్ధి కలుగుతుంది. అసూయ, రాగద్వేషాలకు అతీతంగా ఈ దైవశాస్త్ర పఠనలో నిమగ్నమయి ఈ శాస్త్ర విలువలలోని సత్యాలను గ్రహించి మీరు ఈ మహాశాస్త్రాభివృద్ధికి తోడ్పడుతారని, దానిలోని పరమార్థం గ్రహించి పులకరించి పోవాలని నా ఆకాంక్ష.

నా కాంక్ష తీరిననాడు ఈ దైవశాస్త్ర వ్యాప్తి చెందిననాడు, సుఖ సంతోషాలతోను మన రాష్ట్రం సుభిక్షంగాను, ధన, ధాన్య పాడిపంటలతోను విరాజిల్లుతుందని "ఆంధ్రదేశం" అంటే "పండిత దేశం" అనే పేరుతో వాసిల్లుతుందని నా దృఢవిశ్వాసం.

**- మల్లాది మణి**



Ln. I. Ramakumar, PMJF

# అంకితం

'జ్యోతిష్య సర్వార్థ చంద్రిక' ఈ ప్రథమ స్కంధమును వ్రాయమని నన్ను ప్రోత్సహించినవాడు నేను సంశయిస్తూ ఉంటే వ్రాయగలననే ధైర్యం నూరి పోసినవాడు, శాస్త్ర పరిజ్ఞానాన్ని పదిమందికి పంచిపెట్టాలనే తపన గలవాడు, నాలోని పాండిత్యాన్ని బయటకు తీసినవాడు, ఉదారుడు, నన్ను సమాజంలో ఒక రచయితగా నిలబెట్టిన వాడు, న్యాయాన్యాయ విచక్షణా జ్ఞానం కలవాడు, దానశీలి, ఆర్య వైశ్య కుల శ్రేష్ఠుడు అయిన **శ్రీ ఇమ్మడిశెట్టి రామకుమార్,** విక్టరీ పబ్లిషర్స్ అధినేతకు ఈ గ్రంథాన్ని ఆశీర్వాదాలతో, హృదయానందంతో అంకితమిస్తున్నాను.

– మల్లాది మణి

# కృతజ్ఞతా సౌరభం

శ్రీ మల్లాది మణి గారు ఈ పుస్తకం నాకు అంకితమిస్తున్నానని వ్రాసిన పేజీ వ్రాత ప్రతిలో చూసి నేను నిజంగా నమ్మలేక పోయాను.

నా సంతోష, సంభ్రమాశ్చర్యాలకు అవధులు లేకుండా పోయాయి. ఎందుకంటే నాకు తెలిసినంతవరకు ఏ ప్రచురణకర్తకూ, ఇంతటి విలువ గౌరవం దక్కినట్లుగా నేను వినలేదు. ఇప్పటి దాకా ప్రచురణ కర్తలందరూ ప్రచురణకర్తలుగానే మిగిలిపోయారు తప్ప ఏ ప్రచురణకర్త ఏ రచయిత దగ్గర నుంచి కూడా ఒక పుస్తకం కూడా అంకితభాగ్యం అందుకోలేదు కాని నేను అడుగకుండానే కలలో కూడా ఊహించ కుండానే రచయిత స్వయంగా తన కావ్యకన్యను ప్రచురణకర్త అయిన నాకు సమర్పించి అంకితం చేయడం, అది కూడా వేదాలలో ఓ అంగమైన జ్యోతిషశాస్త్ర గ్రంధానికి కృతిభర్తను కావడం కంటే మహోత్కృష్టమైన గౌరవం ఏముంటుంది కనుక? అలాంటి అదృష్టం నాకు కలిసివచ్చినది.

గౌరవనీయుడు, సద్బ్రాహ్మణుడు, మహాపాండిత్య దురంధురుడు, వాక్శుద్ధి కలవాడని ప్రశస్తి పొందినవాడు. అందరికి తండ్రి లాంటి వాడు అయిన **శ్రీ మల్లాది మణి** గారికి నా మీద ఇంతటి వాత్సల్యం కలగటం నా అదృష్టం వారి పాండిత్యానికి, మరియు ఔదార్యానికి నేను నా కృతజ్ఞసౌరభం వర్షిస్తున్నాను.

**- ఇమ్మడిశెట్టి రామకుమార్**

# ప్రకాశకుల మనవి


ఇంతవరకు శ్రీ మల్లాదిమణి గారి రచనలు మేము ఒక అరడజను పుస్తకాలు ప్రచురించాము. సంతోషమేమంటే మా ప్రచురణలన్ని కొద్ది మాసములలోనే అమ్మకం అయిపోవడం, కాపీలు దొరకడం లేదని మాకు ఫిర్యాదలు రావడం ప్రతిసారి జరుగుతోంది. ఈ ఫిర్యాదులు ఒక ప్రక్క మాకు బాధాకరమైనా, మరియొక ప్రక్క సంతోషం కలిగిస్తోంది. అయినా కూడా పుస్తక పంపక విధానంలో ఉన్న ఈ లోపం మేము సరిచేసుకుంటామని విన్నావిస్తున్నాము. ఎందుకంటే మేము ప్రచురించే దైవశాస్త్ర గ్రంథాలను ఆదరించి మమ్మల్ని ఉత్సాహపరచే పాఠకులందరకు మా కృతజ్ఞతాభివందనములు.

ఇక రచయిత గురించి మేము చెప్పేది మా తరుపున ఏమీ లేదు. ఆయన భాషాశైలి విశిష్టమైనది, సరళమైనది. ఒకసారి చదివిన వాక్యం మళ్లీ చదువనక్కరలేనిది అని మాత్రం మేము ఇదివరలో చెప్పిన విషయం పండితపామఋలందరు నిజమని శ్లాఘిస్తున్నప్పుడు– ముంజేతి కంకణానికి అద్దం ఎందుకు?

ఈ పుస్తకం చదివి, మీ భావస్పందన మరియు సద్విమర్శ మాకు తెలియచేస్తే మా ముద్రణా రాక్షసత్వాన్ని సరిచేసు కుంటాము.

పాఠకులందరికి మరోసారి కృతజ్ఞతలు

ఐ. రామకుమార్
విక్టరీ పబ్లిషర్స్



# విషయసూచిక


**1. ఉపోద్ఘాతము 11**

**2. సౌరరాశులు -మానవ వ్యక్తిత్వాలు 53**

మేషరాశి........................ 55

వృషభరాశి...................... 57

మిధునరాశి...................... 59

కర్కాటకరాశి .................... 62

సింహరాశి....................... 63

కన్యారాశి ....................... 64

తులారాశి....................... 66

వృశ్చికరాశి ...................... 67

ధనూరాశి....................... 68

మకరరాశి ....................... 70

కుంభంరాశి ..................... 72

మీనరాశి........................ 74

| | | |
|---|---|---|
| **3.** | **గ్రహధర్మాలు** | **76** |
| | సూర్యడు ......................... | 76 |
| | చంద్రుడు ......................... | 83 |
| | కుజుడు ......................... | 87 |
| | బుధుడు......................... | 104 |
| | గురువు ......................... | 110 |
| | శుక్రుడు......................... | 115 |
| | శని .............................. | 119 |
| | రాహుకేతువులు ................. | 129 |
| **4.** | **రాశిఫలితాలు** | **135** |
| | సూర్యుడు ......................... | 135 |
| | చంద్రుడు ......................... | 140 |
| | బుధుడు......................... | 150 |
| | గురువు ......................... | 155 |
| | శుక్రుడు......................... | 160 |
| **5.** | **లగ్న స్థానఫలితాలు** | **170** |
| **6.** | **రాశుల ప్రకారం గ్రహఫలితాలు** | **173** |
| | సూర్యుడు ......................... | 173 |
| | చంద్రుడు ......................... | 178 |
| | కుజుడు ......................... | 182 |
| | బుధుడు......................... | 186 |
| | గురువు ......................... | 190 |
| | శుక్రుడు......................... | 193 |
| | శని .............................. | 197 |

| | | |
|---|---|---|
| **7.** | **కాలగమన పరిమాణము** | **202** |
| **8.** | **రాశులు** | **209** |
| **9.** | **గ్రహాలు** | **229** |
| **10.** | **గ్రహాల కారకత్వాలు** | **245** |
| | రవి కారకత్వము ................ | 245 |
| | చంద్రుని కారకత్వము .......... | 245 |
| | కుజుని కారకత్వము ............ | 246 |
| | బుధుని కారకత్వము ............ | 246 |
| | గురువు కారకత్వము ........... | 247 |
| | శుక్రుని కారకత్వము ............ | 247 |
| | శని కారకత్వము ................ | 248 |
| | రాహువు కారకత్వము .......... | 248 |
| **11.** | **మేలాపకం** | **253** |
| **12.** | **వధూవరుల జాతక పరిశీలన** | **265** |
| | లగ్నాధిపతులు .................. | 267 |
| | రాశ్యాధిపతులు.................. | 268 |
| | లగ్నకూటమి..................... | 268 |
| | తారాబలం....................... | 270 |
| | చంద్రస్థానం ..................... | 270 |
| | కాలసర్పదోషం.................. | 271 |
| | మాంగల్యబలం.................. | 272 |
| | కుజదోషం....................... | 272 |
| | ద్విద్వాదశదోషం ................ | 273 |

| | | |
|---|---|---|
| | నవ పంచమదోషం ............. | 273 |
| | షష్టాష్టక దోషం ................. | 273 |
| | వధువు/వరుల ద్వితీయం ...... | 274 |
| | వధువు/వరుల పంచమం ...... | 274 |
| | వధువు/వరుల సప్తమస్థానం ... | 275 |
| | వధువు/వరుల అష్టమస్థానం ... | 275 |
| | గుణమేళన ..................... | 275 |
| | గుణపొంతన .................... | 276 |
| | నాడీదోషం ...................... | 277 |
| | మృగవైరం ...................... | 278 |
| | లగ్నాధిపతి నివాసం ........... | 278 |
| | సప్తమాధిపతి స్థితి.............. | 279 |
| | అష్టమాధిపతి స్థితి .............. | 279 |
| | రజ్జుదోషం ...................... | 279 |
| **13.** | **జాతకంలో దోషాలు** | **281** |
| **14.** | **పుత్ర సంతానం** | **285** |
| | జాతక పొంతనలో ఇతర అంశాలు | 286 |
| | స్త్రీ దీర్ఘము ...................... | 287 |

# అధ్యాయం - 1

## ఉపోద్ఘాతం...

ఈ సువిశాల ప్రపంచంలో అనేక దేశాలు, భాషలు భిన్న మనస్తత్వాలు. అలాగే అనేక ఎడారులు, మహాసముద్రాలు, నదులు, పర్వతాలు ఉన్నప్పటికీ ఇవన్నీ మన భూ గ్రహం మీదే ఉన్నాయి. ఇలా ఎన్ని ఉన్నా అన్నిటికి ఒకే గ్రహం అంటే సూర్యగ్రహం ఉంది. ఆ సూర్య గ్రహం చుట్టూ పరిభ్రమిస్తున్న అనేక గ్రహాలు ఉన్నాయి. ఏ గ్రహమైనా తమ చుట్టూ తాము తిరుగుతూ తమ కక్ష్యలో సూర్యుని చుట్టూ నిరంతరంగా ప్రదక్షిణం చేస్తూ ఉంటుంది. ఈ ప్రదక్షిణ అనేది సృష్టిలో చాలా విచిత్రమైన ప్రక్రియ. ఎందుకంటే అన్నిగ్రహాలు ఒకే కక్ష్యలో పయనించవు. ఏ గ్రహానికి ఆ గ్రహం ఒక కక్ష్య ఏర్పర్చుకొని ఆ కక్ష్యలోనే సూర్యుని చుట్టూ పరిభ్రమిస్తుందే కాని తమంతట తాము కక్ష్యను వదిలి బహిర్గతముకావు. మరియు వాటి గతులు తప్పవు. ఈ గ్రహాల వేగం మరియు పరిణామం మనకు అర్ధమయితే మనం తప్పకుండా సంభ్రమాశ్చర్యాలకు గురి అవుతాము. ఎందుకంటే ఆ గ్రహాల వేగం గాని, ఆ గ్రహం ఇచ్చే ఫలితాలు గాని ఊహాతీతంగా ఉంటాయి. విచిత్రమేమిటంటే ఎంత వేగంగా పోతున్నా గతి తప్పకుండా అలా సూర్యుని చుట్టూ పరిభ్రమిస్తూనే ఉంటాయి. ఈ గ్రహాలు అన్నింటికి అధిపతి సూర్య భగవానుడని మనకందరకు తెలుసు. సూర్యుడు నిశ్చలుడు. తానున్న ప్రదేశాన్నుంచి కదలడు. కాని అన్ని గ్రహాలను తన వైపు ఆకర్షించుకుని ప్రతి గ్రహానికి తన ఆకర్షణ శక్తి ఇచ్చి వాటి వేగాన్ని నిర్దేశిస్తాడు. అందువల్లనే ఒక గ్రహమును మరియొక గ్రహము ఎట్టి పరిస్థితుల్లోను కొట్టుకోదు. ఎందుకంటే ఏ గ్రహమైనా తన కక్ష్య తప్పి బయటకు వచ్చినప్పుడు ఇంకొక గ్రహముతో దగ్గరగా రావడం సంభవిస్తుంది. అలా వచ్చినందువలన తన కక్ష్యలో పరిభ్రమిస్తున్న గ్రహాన్ని తన కక్ష్య నుంచి బయటకు వచ్చిన గ్రహం తప్పక ఢీ కొంటుంది. మానవుని మేధస్సుకు అందలేని పరిమాణం

మరియు వేగం గల రెండు గ్రహాలు ఢీ కొన్నప్పుడు వచ్చే విస్ఫోటన ఫలితం ఎంత దారుణం మరియు భయంకరంగా ఉంటుందో ఊహించడానికే శక్తి చాలదు. ఇలాంటి ప్రమాదాలు సంభవించకుండా గ్రహాధిపతి అయిన సూర్యుడు అలా కక్ష్య తప్పి పరిభ్రమిస్తున్న గ్రహాన్ని రెండవ గ్రహాన్ని తాకకుండా దానిని నిలిపివేయడం లేదా అవసరాన్ని బట్టి వేగం తగ్గించడం లేదా ఇంకా అవసరమైతే అలా అతి వేగంగా ప్రమాదానికి దగ్గరగా వస్తున్న గ్రహాన్ని నిలిపివేయడం కూడా చేస్తాడు. అలా నిలిపిన గ్రహం వల్ల పరిభ్రమిస్తున్న మరొక గ్రహానికి దారి లేకపోతే కక్ష్యనుంచి బయటకు వచ్చియున్న గ్రహాన్ని వెనక్కి కూడ పంపే శక్తి ఒక్క సూర్యునికే ఉంది. ఇలాగ గ్రహ గతులను వేగాన్ని నిర్దేశిస్తాడు కాబట్టే ఆ గ్రహాలకు సూర్యుడే అధిపతి అని మనం తెలుసుకోవాలి. అంటే అన్ని గ్రహాలు సూర్యుని ఆధిపత్యానికి లోబడి ఆయన చుట్టూ ఆయన ఆజ్ఞలో ఉన్న అయస్కాంత శక్తి ప్రకారం పరిభ్రమిస్తూనే ఉంటాయి. సృష్టిలో ఇది ఒక మహాద్భుతమైన ప్రక్రియ. సూర్య భగవానుడే లేకపోతే ఈ భూమి మీద మానవ మనుగడ ఎప్పుడో నశించిపోయి ఉండేది. సూర్యుడు అతి పెద్ద మండుతున్న అగ్నిగోళం. ఆ అగ్ని గోళాన్ని ఆవహించి ఉంటాడు సూర్యుడు. అంతరిక్షంలో సూర్యుని చుట్టూ పరిభ్రమిస్తున్న ప్రతి గోళాన్ని ఒక్కొక్క గ్రహం ఆవహించి ఉంటుంది. కనుక ఆ గోళాన్ని ఏ గ్రహం ఆవహించి యుంటుందో ఆ గ్రహం పేరుతో ఆ గోళాన్ని పిలుస్తారు. అంతేకాని ఆ గోళమే గ్రహం అనుకోకూడదు. ఆ గోళములో ఉన్న పర్వతాలు, లోయలు, దుమ్ము, ధూళి వగైరాలను మనము గ్రహము అనుకోకూడదు. ఆ గోళమును ఆవహించిన గ్రహము సూర్యుని చుట్టూ పరిభ్రమిస్తున్నదంటే అర్థం ఆ గ్రహం యొక్క అత్యంత అపారమైన శక్తితో ఆ గోళం తిరుగుతుంది. అంతేకాని గోళము తనంతట తాను తిరగదు. ఎందుకంటే ఆ గోళమునకు జీవశక్తి లేదు. అందువల్ల జీవశక్తి లేని ఏ పదార్థమునకైననూ చలనశక్తి యుండదు. ఈ గోళమును ఆవహించినటువంటి గ్రహము వల్ల గ్రహముతో పాటు ఈ గోళము కూడా సూర్యుని చుట్టూ పరిభ్రమిస్తూనే యుంటుంది. ఎలాగంటే ఒకవేళ ఏ గ్రహమైనా పరిభ్రమించకుండా ఆగిపోతే ఆ గోళము కూడా ఆ గ్రహశక్తి మరియు ప్రభావము వల్ల ఆగిపోతుంది. ఉదాహరణకు మనము పాదరక్షలు ధరించి ఊరంతా తిరిగితే మనతో పాటు ఆ పాదరక్షలు కూడా అన్ని చోట్లకు ప్రయాణాలు చేస్తాయి. మనము

ఎక్కడ ఆగితే అక్కడే అవి కూడా నిశ్చలమవుతాయి. ఒకవేళ నడకలో మనము వేగం పెంచితే పాదరక్షలకు కూడా వేగం పెరుగుతుంది. మనం వెనక్కి నడిస్తే అవి కూడా మనతో పాటే వెనక్కి నడుస్తాయి. ఇలా గ్రహాల వల్ల గోళాలన్నీ పరిభ్రమిస్తూ ఉంటాయి. ఇంకొక ఉదాహరణ ఏమంటే, మనం ఏ దేవాలయమునకు వెళ్ళినా ఆ పవిత్ర పుణ్య క్షేత్రములోని రాతి విగ్రహానికి మనము పూజలు చేస్తూ ఉంటాము. కాని మనం నిజంగా భక్తి పారవశ్యాలతో పూజించేది ఆ రాతి విగ్రహాన్ని ఆవహించినటు వంటి దైవాన్ని కాని ఆ రాతి విగ్రహాన్ని కాదు.అందువల్లే మనము రాతి విగ్రహాన్ని ఆవహించిన దైవాన్ని స్మరిస్తూ ఆ దైవాన్ని కొలుస్తూ ధూపదీప నైవేద్యాలు చేస్తాము. అదృశ్యముగా ఆవహించియున్న ఆ దైవము మన భక్తి పారవశ్యాలకు తృప్తి చెంది మన మనోభీష్ట ములను నెరవేరుస్తాడు. అలాగే మనము గ్రహములను వారు ఇచ్చే దుష్ఫలితాలను మరియు ఉధృతమైన కీడును తప్పించుకోవడానికి గ్రహములకు అధిపతి అయిన సూర్యోదయ కాలములో మనము మండుతున్న అగ్ని గోళానికే పూజ చేస్తున్నామంటే అర్థం ఆ అగ్ని గోళాన్ని ఆవహించిన సూర్యుడు మన పూజా భక్తి పారవశ్యాదులను గమనించి పాపగ్రహాల యొక్క ఉధృతిని తగ్గించగల్గిన మహా శక్తివంతుడు కాబట్టి మనం ఉషోదయ కాలంలో 'ఆదిత్య హృదయం', సూర్య నమస్కారాలను అత్యంత భక్తి శ్రద్ధలతో చేసుకుంటాము. కాబట్టి గ్రహాలు లేవని, వాటి ఫలితాలు ఉండవని వాదించే జ్ఞానశూన్యులతో మనము వాద ప్రతివాదాలకు తావివ్వకుండా మన హిందూ ధర్మ ప్రకారం మన శాస్త్ర పరిజ్ఞానమును పెంచుకొని ఇహపర సాధనల కోసం మనం నవగ్రహాలను పూజించడం వేల సంవత్సరములుగా వస్తున్నటువంటి మన హైందవ ధర్మం అని మనం మరిచిపోకూడదు.

సూర్యుడు అంతరిక్షంలో అత్యంత అద్భుతమైన కాంతితో వెలిగిపోతూ గ్రహాలన్నింటి గమనాన్ని నిర్దేశిస్తూ ఒక పెద్ద జ్యోతిగా వెలుగుతూ మానవాళికి మనుగడను ఇచ్చే అతి పవిత్రమైన జ్యోతి. ఆ జ్యోతికి లోబడి ఆ జ్యోతి చుట్టూ పరిభ్రమిస్తున్న గ్రహాల కదలికలను గురించి తెలియజెప్పేదే జ్యోతిష శాస్త్రము. అంటే సూర్య ప్రాసాదమైన వెలుగులోని ప్రాభవం తీసుకొని మన జీవిత సరళిని నిర్దేశించే జ్యోతి యొక్క విశ్లేషణ చేయటమే ఈ జ్యోతిష శాస్త్రం. ఇది మహోత్కృష్టమైన శాస్త్రము. అంటే నవగ్రహములు అంతరిక్షంలో వారి వారి పరిభ్రమణ స్థానంలో

యున్న మరియు తమ కక్ష్యలో పయనిస్తున్న మార్గమును బట్టి వచ్చే లేక వారు ఇచ్చే ఫలితాలను మానవాళి మీద ఎలా ఉంటుందో, వర్తమాన, భూత, భవిష్యత్ కాలము లలోని అంశములను వారి పరిభ్రమణాలను అనుసరించి చక్ర రూపంలో లిఖించి వారి స్థితి గతులను గుణించి చెప్పే మహా శాస్త్రమే జ్యోతిష శాస్త్రము. ఈ దైవశాస్త్రము అన్ని శాస్త్రములలో కన్నా మిక్కిలి విశిష్టమైనది మరియు అనంతమైనది. వేదాలలో ఒక ముఖ్యమైన అంశముగా విరాజిల్లుతోంది. ఈ సృష్టి ఏర్పడినప్పటినుండి, ఈ గ్రహశక్తి మానవాళిపై తన ప్రభావం చూపిస్తూనే ఉంటుంది. ఈ భూ ప్రపంచంలో అనేక కోటానుకోట్ల మంది జనన, మరణాలను ఆది నుండి అనుభవిస్తూనే ఉన్నారు. వారి వారి జన్మ సమయ, ప్రాంత, తిథులను బట్టి, ఆ మానవుడికి నిర్దిష్టమైన బ్రహ్మ లిపి వల్లే జీవనసరళిలో సుఖ దుఃఖాలను పూర్వ జన్మ సుకృతమైన ప్రారబ్ద కర్మను అనుభవించడానికి నిర్ణీత సమయంలో గ్రహాల పొందికను బట్టి ఆ శిశువు జన్మం జరుగుతుంది. అందువలన ఆ శిశువుపై గ్రహఫలితాలు తప్పక ఉంటాయి. ప్రతిగ్రహం ఒక్కొక్క ఫలితాన్ని మానవుల మీద తమ ప్రభావాన్ని చూపిస్తూ సుఖ దుఃఖాలను కల్గిస్తూ ఉంటాయి. ఉదాహరణకు సూర్యుని వల్ల మానవుని దేహముపైన, చంద్రునివల్ల మానవుని రక్తము పైననూ, బుధుని వల్ల చర్మముపైననూ, కుజుని వల్ల రాగద్వేషాల పైననూ,శుక్రుని వల్ల శారీరక వాంఛల పైననూ, శని వల్ల నరములపైననూ ప్రభావం చూపుతాయి. ఉదాహరణకు ఒక మానవుడు మండు వేసవిలో సూర్యకిరణ ముల బారిన పడినపుడు అతనికి కోపము, విసుగు, దాహము, నిద్ర, అలసట మొదలైనవి కలుగుతాయి. అంటే సూర్యుడు ఈ పైన చెప్పిన విశేషములకు ఆద్యుడు. అంటే సూర్యకిరణాల వల్ల ఈ అనుభవాలు మనకు కలుగుతున్నాయి. అలాగే ఒక మానవుడు చంద్రుని కిరణములు అతనిపై పడినపుడు అతనికి సంతోషము, ఆహ్లాదము, స్త్రీ వాంఛ, కల్గిన అలసట తీరుట మొదలగునవి కలుగుతాయి. ఈ సత్యాన్ని ప్రతీవారు అనుభవిస్తూ, మరియు చూస్తూనే ఉంటారు. అంటే, ఈ గ్రహాల వల్ల కలిగే భిన్నభిన్న అనుభవాలకు, సూర్య, చంద్రులే కారణమని గ్రహించాలి. ఎందుకంటే సూర్య, చంద్రులు అంతరిక్షంలో ఉన్నా మానవదృష్టికి అందుబాటులో వుంటారు. అందువల్ల ఆ గ్రహ ప్రభావాలను మనం ఒప్పుకొని తీరుతాము. అయినా వారి వల్ల కలిగే అనుభవాలు వేరు వేరుగా ఉన్నాయి. కానీ, మిగిలిన గ్రహాలు మనకు కనపడనంత

దూరంలో ఉండటం వల్ల,కొందరు మూర్ఖులు ఈ గ్రహాలను, శాస్త్రములను నమ్మమని శాస్త్రీకులను, శాస్త్రములను పరిహసించుచూ, తామే అధికులమని ఆత్మవంచన చేసుకొని జీవిస్తూ ఉంటారు. కానీ, నిజంగా మానవ దృష్టికి కనపడనంత దూరంలో ఉన్న ఆ గ్రహాలు కనుక క్రిందికి వస్తే, ఈ భూ ప్రపంచంలో మానవాళి నశించిపోతుంది. ఉదాహరణకు కుజుడు ఎన్నో కాంతి సంవత్సరాల దూరంలో ఉన్నా,ఆ గ్రహ ప్రభావం వల్ల మనకు నైతిక మరియు నైసర్గిక దుష్ఫలితాలు పొందుతూనే ఉన్నాము. అట్టి కుజుడు లేక దుష్టగ్రహాలు దూరంగా ఉండుటయే శ్రేయస్కరము అని భగవంతుని నిర్ణయము. అలా దూరంగా ఉండటమే మానవ మనుగడకు మేలు.

ఎందుకంటే సూర్యుడు ఇప్పుడు ఉన్న ప్రదేశం నుంచి భూమికి దగ్గరగా వస్తే మానవాళికి మనుగడ ఉంటుందా? అలాగే అత్యంత దూరంలో ఉన్న కుజ, శుక్రులు క్రిందకు వస్తే ఆ ప్రభావం ఎలా ఉంటుందో అని ఊహించడానికి కూడా మనవాళి ఉండదు. విపరీతమైన లేక భయంకరమైన ప్రకృతి వైఫల్యాలు సంభవిస్తాయి. ఈ భూమి మీద ఏ జీవి కూడా ప్రాణం పోసుకొని జీవించడం అసాధ్యం. జీవకోటి నశించి పోతుంది. కొన్ని వేల సంవత్సరాల పూర్వమే మన జ్యోతిష్య శాస్త్రజ్ఞులు, ఖగోళ శాస్త్రజ్ఞులు ఏ పరికరములు లేకుండానే గ్రహాల స్థానాలను, వాటి బలాబలాలను, మరియు వారు మనకు ఇచ్చే ప్రభావాలను విశ్లేషించి వివరంగా విశదీకరించారు. అట్టి వారిలో వరాహమిహిరుడు, పరాశరుడు, మంత్రేశ్వరుడు, వశిష్ఠ మహాముని, నారద మహాముని జ్యోతిష్య శాస్త్రములోని రహస్యాలను తమ అద్భుత మేధో సంపత్తు మరియు తమ జ్ఞానదృష్టి చేత గ్రహించి, అమూల్యమైన గ్రంథాలను లిఖించి మానవ జాతికే మహోన్నతమైన శాస్త్ర జ్ఞానాన్ని ప్రసాదించారు. వారు చెప్పిన ఆ శాస్త్ర ముఖ్యాంశాలను, ఈ రోజుక్కూడ పాశ్చాత్య ఆధునిక శాస్త్రవేత్తలు విభేదించక, వారు చెప్పినవన్నీ సత్యమని ఒప్పుకొంటున్నారు. కాబట్టి ఈ మహోజ్వలమైన దైవ శాస్త్రమును కించపరచడం లేక పరిహసిస్తూ శాస్త్రాన్ని ఖండించడం పిడివాదంతో దుర్భాషలాడడం మూర్ఖుల నైజానికి ముంజేతి కంకణమని, వారి శాస్త్ర విహీనతను గ్రహించి వారితో తర్కముల దరికి పోక ఊరకుండుటయే ఉత్తమ పండితుల లక్షణము. ఎందుకంటే భారతదేశంలోని మహా శాస్త్రములను హీనదృష్టితో చూసే, కుసంస్కారులతో మనం ఎప్పుడూ వాదించి వారి మనస్సు రంజింపచేయలేము. ఎందుకంటే మహాఋషి

పుంగవులైన పరాశర, వరరుచి, కాళిదాసు, జైమిని మరియు కళ్యాణవర్మ లాంటి మహా పురుషుల విజ్ఞానాన్ని, జీర్ణం చేసుకొనే విజ్ఞత, మనోసాంద్రత లేనివారితో మనం ఎప్పుడూ ఎంత వాదించినా ప్రయోజనం ఉండదు.

శాస్త్రకోవిదులు వితండ వాదనలను చేసేవారితో ప్రసంగించడం కన్నా"పండితు లైనవారు దిగువందగనుండగ అనేపద్యంలోని సూక్తిని మన గుర్తు చేసుకుంటే మన విచక్షణా జ్ఞానం మనకీ లభిస్తుంది. శాస్త్రాన్ని సరిగా అభ్యసించక, ఈ శాస్త్రంలోని లోతుపాతులను గ్రహించక కొంతమంది కుహానా పండితులు ధనకాంక్షతోనో, లేక కీర్తి కాంక్షతోనో, లేక రెండింటి కాంక్షలతోనో శాస్త్రాన్ని వ్యాపార సరళిలో వక్రించి వచ్చినవారి సంతృప్తి కొరకు, వారిని సంతోషపరచే విధంగా అప్పటికయ్యేది, ప్రస్తుత మాటలాడి వారిని సంతోష పరిచి, ధనమార్జించినా,భవిష్యత్తులో,వారు చెప్పిన ఫలితాలు జరగకపోవడంవల్ల, ప్రజలకు కూడా, ఈ శాస్త్రం మీద నమ్మకం సడలి పోతోంది. జాతక చక్రంను పరిశీలించేటప్పుడు, శాస్త్ర విధానాలను పక్కన పెట్టి తమ ఊహల ప్రకారం జాతకచక్రం విశ్లేషించడం వల్ల వారు చెప్పిన ఫలితాలు ప్రస్ఫుటింపక, శాస్త్రమే భంగపడిపోతోంది. మన అనుభవం, ఊహాశక్తి మహాఋషులు వ్రాసిన గ్రంథముల కంటే గొప్పవి కావు. ఈ సత్యమును ప్రతీవారు గ్రహించి, శాస్త్ర దూషణ చేయక, లేక శాస్త్రజ్ఞులను నిందించక, ఈ శాస్త్రమును పరిపూర్ణముగా పఠించి, పూర్తి విజ్ఞానము సంపాదించిన తరువాత వారి సంశయాలనుఏ పండితుడూ తీర్చలేక పోతే అప్పుడు ఈ శాస్త్రాన్ని వారు విమర్శించినా, ఆ విమర్శకు ఒక అర్థం మరియు విలువ ఉంటుంది. మరియు, ఆ లోపాలను సరిదిద్దే ప్రయత్నంలో పరిశోధనలు జరిగి నిజాన్ని గుర్తించి, ప్రజలకు మరింత జ్ఞానాన్ని పంచిపెట్టడానికి, వారి విమర్శలు ఉపకరిస్తాయి. అంతేకానీ, నక్షత్రాల పేర్లు, రాశుల పేర్లు లేక రాశ్యాధిపతుల పేర్లు తెలియనివారు కూడా, ఆధునిక పోకడలతో ఈ శాస్త్రాన్ని మేము నమ్మమని గాని, లేదా ఈ శాస్త్రం లోపభూయిష్ఠమనిగాని అన్నంత మాత్రాన, శాస్త్రానికి గాని, శాస్త్ర పండితులకు గాని కొంచెమైన ఎగ్గుకాదు. ఎందుకంటే, ఈ శాస్త్రం గురించి ఏమీ తెలియనివారు విమర్శిస్తే, వారు వారి మూర్ఖత్వం చాటుకున్నట్లే అవుతుంది కానీ, శాస్త్రమునకు గాని, శాస్త్ర పండితునికి గాని ఏ మాత్రం చిన్నతనం కాదు అని అందరూ గ్రహించాలి. శాస్త్ర పఠనం చేయకుండా, ఏ శాస్త్రాన్ని విమర్శించే హక్కు గానీ, విజ్ఞత గానీ ఎవరికీ ఉండకూడదు.

ఏ శాస్త్రాన్నయినా చదవకుండా, ఆ శాస్త్రాన్ని గానీ, శాస్త్ర పండితులను గానీ విమర్శించే హక్కు, అర్హత ఎవరికి ఉండదు మరియు ఉండకూడదు. ప్రస్తుత కాలంలో అనేకమంది అనేక పుస్తకాలను ప్రచురిస్తూ ఉన్నారు. వారు వ్రాసినది సామాన్య మానవులకు ఒక పట్టాన కొరకుడు పడదు. మూలగ్రంథాల్లోని, సంస్కృత శ్లోకాలను, సోదాహరణంగా, తాత్పర్య సహితంగా, అత్యంత గ్రాంథిక భాషలో వ్రాసి ప్రచురిస్తున్నారు. ఆ రచనలు చదివిన వారికి సంస్కృత పద భూయిష్ఠమైన ఆ శ్లోకాలుగాని లేక వారు వ్రాసే దండాన్వయ, తాత్పర్య, గ్రాంధిక భాషను చూసి ప్రజలు ఈ శాస్త్రము చాలా కష్టతరమనే అభిప్రాయానికి వస్తున్నారు. అందువలన శాస్త్ర ప్రచారము సరిగా లేక ప్రజలలో జ్యోతిష శాస్త్రము మీద అవగాహన లేదు. ఎందుకంటే, మూలగ్రంథాలు చదివి, అర్థం చేసుకొనే సంస్కృత భాషా పరిజ్ఞానం సామాన్య ప్రజలకు లేదు. ఆశ్చర్యకరమైన విషయమేమంటే, ఆ మూల గ్రంథాలను చదివి, అర్థం చేసుకుని వాటిని తెలుగులో ప్రచురించేటప్పుడు, తమ సంస్కృత పాండిత్యాన్ని గాని, లేక తమ తెలుగు భాష పాండిత్య గ్రాంథిక విలువను చూపించడానికా అన్నట్లు ఉంటుందే కాని, సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండదు. ఒకరోజు ఒకాయన, నా దగ్గరకు వచ్చి "నేను కూడ జ్యోతిష శాస్త్రం చదువుకున్నవాడినే, మంచి ప్రాక్టీసు ఉంది, మా అమ్మాయికి ఒక జాతకం వచ్చింది. నేను చూసినా, మీరు అనుభవజ్ఞులు కాబట్టి, మరియు మంచి పాండిత్యము ఉన్నవారు కాబట్టి, ఒక చిన్న సందేహం తీర్చుకుందామని వచ్చాను. అంతే!" అన్నారు. నేను సాటి పండితునికి ఇవ్వవలసిన గౌరవ మర్యాదలిచ్చి, మీ సందేహం తీర్చగలిగినంత పాండిత్యం నాకుందో, లేదో తెలియదు గాని, సాటి జ్యోతిష్యుడిగా మీరు వచ్చి నా సలహా అడగడం మాత్రం, నాకు సంతోషంగా ఉందన్నాను. నాకు తెలిసినంత వరకు మీ అనుమానాన్ని నివృత్తి చేయడానికే ప్రయత్నిస్తాను అని చెప్పాను. ఆయన నవ్వుతూ "పెరటిచెట్టు మందుకు పనికిరాదంటారు" కదా,కాబట్టి మీ సహాయం, సలహా రెండూ నాకు ముఖ్యమే అన్నారు. నేను మీ అనుమానం ఏమిటి? అన్నప్పుడు ఆయనిలాఅన్నారు.

"తనూభావమయిన" మీనంలో దాంపత్య విచ్ఛిన్న కారకుడు ఉన్నాడు. సంతాన స్థానంలో రాహువు ఉండగా, నపుంసకుడైన బుధ క్షేత్రమయిన కన్యారాశిలో ఆయుః కారకుడు మరియు వ్యయాధిపతితో కలిసి ఉండగా, వారి మీద ధనూరాశ్యాధిపతికి

మిత్రుడైన కుజ సప్తమ వీక్షణ ఉంది. వ్యయస్థానంలో బుధ, రవులు కుజోచ్ఛ స్థానంలో ఉన్నారు. రవి శతృస్థానంలో ఉన్నాడు కాబట్టి, మరియు వ్యయస్థానం కాబట్టి బుధాదిత్య యోగం ఫలిస్తుందా? లాభస్థానంలో పంచమాధిపతి క్షీణ చంద్రుడై, కేతువుతో ఉన్నాడు. ఈ గ్రహస్థితి బట్టి, ఈ వివాహం చెయ్యవచ్చా? మీ అభిప్రాయం చెప్పండి" అన్నాడు.


నాకు ఆయన చెప్పేది లేక చెప్పదలచుకున్నది ఏమిటో అర్థం కాలేదు. అసలు ప్రశ్న ఏమిటో కూడా తెలియలేదు. ఎందుకంటే కొన్ని కంపెనీలు వ్యాపార ప్రకటనల్లో, సాంకేతిక పరిజ్ఞానం అంతా వ్రాసి చూపిస్తారు. ఈ మధ్య ఈ ధోరణి మరీ ఎక్కువయ్యింది. సామాన్య ప్రజానీకానికి, ఆ సాంకేతిక భాష ఏమీ అర్థం కాదు. అదే భాషను సరియైన వాడుక పరిభాషలో చెపితే అందరికీ అర్థం అవుతుంది. ఈయన వాడిన భాష కూడ అత్యంత శాస్త్ర పదభూయిష్ఠమై, వినిన వారికిగాని, వారి ప్రక్కనుండి వింటున్న వారికిగాని ఏమీ అర్థం కాని రీతిలో ఉంది. ఇలాంటి భాష వాడటం వల్ల సామాన్య ప్రజలకు జ్యోతిష్య శాస్త్రం అంటే భయం మరియు అతి క్లిష్టమయిన శాస్త్రమనే భావమేర్పడుతుంది. దీని వల్ల శాస్త్రం నేర్చుకునేందుకు ఉత్సాహపడేవారు కూడా, ఇది ఒక పట్టాన కొరుకుడుపడదని, భయపడడం కూడా జరుగుతుంది. అందువల్ల ఏ పండితుడైనా, తమ పాండిత్యాన్ని క్లిష్టతరం చేసి ఎదుటివారిని అయోమయంలో పెట్టి వారికి అర్థంకాని భాషార్భాటం, డాంబికంగా చెప్పడం, సజ్జన పండిత లక్షణం కాదు. వచ్చిన వారికి అర్థమయ్యే వాడుక భాషలో తాము చెప్పదలచుకున్నది వినయంగాను, వినమ్రతతో చెప్పాలి కానీ వారికి భాష వల్ల భయోత్పాతం కలిగించకూడదు. అలాగే భాషాపటాటోపం చూపించకూడదు. ఉదాహరణకు మనం "మహోదయా! మీ శయన మందిర గవాక్ష రంధ్రము నుండి రెండు బిడాలములు సందడి చేయకుండా క్షీరము గ్రోలనెంచి మీయొక్క భోజనశాల నుండి పాకశాలకు పయనించుటకు ప్రయత్నించుచున్నవి. కాన మీ ధర్మపత్నితో జాగురూకత కమ్మని తక్షణమే హెచ్చరించుడు" అని అంటామా? అలా అంటే మనకి మేథోలోపం ఉందని ఎవరైనా గ్రహిస్తారు. కాబట్టిఅలాంటి భాష ఎప్పుడూ జ్యోతిష్య శాస్త్రంలో వాడకూడదు. ఎందుకంటే పండిత గోష్టిలో గాని లేక పండిత చర్చ మీమాంశ వచ్చినప్పుడు గాని, అక్కడ ఉండేది అందరూ శాస్త్ర పరిజ్ఞానము,


పాండిత్యము ఉన్నవారే కాబట్టి ఒక విధంగా కొంచెం సమర్థించవచ్చు. కాని అన్నిచోట్ల పూర్తిగా సమర్ధనీయముగాదు. ఇది నేను చాలా అనుభవపూర్వకంగా వ్రాస్తున్న విషయం.

ఇంతకీ నా దగ్గరకు వచ్చిన జ్యోతిష్యవేత్త వాడిన భాషకు మనం చక్ర రూపంలో వేసి అర్థం తెలుసుకుందాం.

1. "తనూ భావమయిన మీనంలో దాంపత్య విచ్ఛిన్న కారకుడున్నాడు". దీనికి అర్థం మీన లగ్నంలో కుజుడున్నాడు.
2. "సంతాన స్థానంలో రాహువుండగా, నపుంసకుడైన బుధుని క్షేత్రమయిన కన్యారాశిలో ఆయుఃకారకుడు మరియు వ్యయాధిపతి కలిసి ఉన్నారు". అంటే కర్కాటక రాశిలో రాహువున్నాడు. మరియు కన్యలో శుక్రుడు, శని కలిసి ఉన్నారు. అంటే లగ్న స్థానం నుంచి శుక్ర, శని మీద కుజవీక్షణ ఉంది అని అర్థం.
3. "వ్యయస్థానంలో బుధ, రవులు కుజోచ్ఛ స్థానంలో ఉన్నారు" అంటే మకరరాశిలో బుధుడు, రవి ఉన్నారని అర్థం.
4. లాభ స్థానంలో పంచమాధిపతి క్షీణచంద్రుడై కేతువుతో ఉన్నాడు. అంటే చంద్రుడు, కేతువు కలిసి ధనస్సు స్థానంలో ఉన్నారు.

ఇపుడు ఇది చక్రరూపంలో వేసి చూద్దాం.




ఇపుడు చక్రం పరిశీలిస్తే మనం ఇలా చెప్పాలి.

మీన లగ్నంలో కుజుడు, పంచమంలో రాహువు, సప్తమంలో శుక్ర, శని, వృశ్చికంలో గురు, దశమంలో చంద్ర, కేతువులు, ద్వాదశంలో బుధ, రవి ఉన్నారు. పై వాక్యం చదివితే అతి కొంచెం జ్యోతిష్య పరిచయమున్నా పై చక్రం వేయగలరు.

ఇపుడు ఆయన భాషాడాంబికంతో చేసిన పొరపాట్లు గమనించండి. అదేమిటంటే శుక్రుడు కన్యారాశిలో ఉండడు. లగ్నంలోగాని, కుంభంలోగాని లేక మకర, ధనస్సులోగాని వృశ్చికంలోనే ఉంటాడు. అలాగే రాహువు మిథునంలో ఉండి తీరాలి. కర్కాటకంలో ఉండడు. ఇటువంటి పొరపాట్ల వల్ల ఆయనకు నిజంగా శాస్త్ర పరిమ ఉన్నా, వాడిన భాష వల్ల పొరపాటు చేయడమే గాక, తన స్థిరప్రజ్ఞను నాతో చర్చించి, ఒక అవగాహనకు రావడానికి కలిగే అవకాశం ఆయన పోగొట్టుకోవటమే గాక, ఆయన నుంచి నేను ఏదైనా నేర్చుకునే అవకాశం కూడా నాకు ఆయన ఇవ్వలేదు. కాబట్టి "కొండ అద్దమందు కొంచెమై ఉండదా" అన్న సూక్తిని ఏ పండితుడు మర్చిపోకూడదు. భాషాడాంబికం వల్ల దైవశాస్త్రాన్ని మనం దయ్యాల శాస్త్రం చేయకూడదు. పామరుడికి కూడా అర్థమయ్యే పరిభాష వాడాలి.

పాఠకులు నా భావాన్ని గ్రహించి భాషాదర్పం తగ్గించి సామాన్యులకు కూడా అర్థమయ్యే రీతిలో, సరియైన వాడుక భాషలో మనం చెప్పాల్సింది చెపితే, వారికి మనమీద గౌరవమే కాక, శాస్త్రాభిమానం కూడా కలుగుతుంది. ఆ శాస్త్రాభిమానం కలిగినప్పుడు, ఈ శాస్త్రము నేర్చుకుందామనే కుతూహలం కలుగుతుంది. ఆ కుతూహలమే వారికి శాస్త్రాక్ష్య రాభ్యాసానికి నాంది అవుతుంది. తద్వారా ఎంతోమందికి సేవ చేయగలుగుతారు. వారి భవిష్యత్తుకు మంచి మార్గ నిర్దేశికులు అవుతారు. అదేకాకుండా ఆశ్రయించిన శిష్యులకు శాస్త్ర బోధన చేసి, వారిని కూడా మంచి జ్యోతిష్య శాస్త్రవేత్తలుగా చేసి, శాస్త్ర దానం చేసామనే సంతృప్తి తాము కూడా పొందుతారు. దినదినానికి ఆంగ్ల భాషాప్రభావం వల్ల క్షీణించుచున్నటువంటి, ఈ శాస్త్రానికి ఊపిరిలు ఊది, జీవం పోసి, దేశంలో అనేక శాస్త్రజ్ఞులను తయారు చేసే మహాభాగ్యం పొందుతారు. దీనివల్ల వారికి ఆత్మతృప్తి, గ్రహదీవెన తప్పక ఉంటాయి. ఎందు కంటే ఉదయం నుంచి సంధ్యా సమయం వరకూ ఎన్నో జాతకాలను పరిశీలిస్తూ ఉంటారు. ఆ పరిశీలనలో గ్రహాల బలాబలాలను లెక్కించి, వారి స్థాన,

వీక్షణ మరియు సంయోగప్రవృత్తు లను విశ్లేషించి, మానవుని నుదిటిన బ్రహ్మరాసిన రాతను చక్రరూపంలో లిఖించి వారి జీవిత విశేషాలలోని ముఖ్యాంశాలను అంటే జననం, విద్య, ఆరోగ్యం, కళ్యాణం, సంతానం,మరియు మోక్షసాధనం గురించి చెప్పడానికి శాస్త్రజ్ఞులు అనేక వందల సార్లు గ్రహాల పేర్లు ఉచ్చరిస్తూనే ఉంటారు.కాబట్టి తను, స్వార్థరహితంగా ఇలా గ్రహస్తోత్రం చేయడంవల్ల ఆ శాస్త్రజ్ఞునిస్వజీవిత ములో కష్టములుడిగి వాక్శుద్ధి కలిగి, సంతోషంగా జీవిస్తారు అని మనం మర్చిపోకూడదు.

ఈ భారతావనిలో అనేకమంది మహాపురుషులు కారణజన్ములుగా జన్మించి హిందూ మతానికి, హైందవమతానికి ఒక నిర్దిష్టమయిన జీవిత క్రమ సరళిని నిర్దేశించటమే గాక, వారి, వారి మహెత్కృష్టమయిన జ్ఞానం వల్ల, ఈ విశ్వంలో, అందరికంటే ముందు అనేక శాస్త్రములు రచించి మానవ జీవితానికి మరియు మానవ సుఖ మనుగడకు ఒక విశిష్టమయిన జీవన విధానాన్ని ఏర్పాటు చేశారు. ఒక్కొక్కరు ఒక్కొక్క విద్యలో అత్యున్నత శిఖరాగ్రములను తాకి దైవసంభూతమైన జ్ఞానాన్ని మనకు శాస్త్ర రూపంలో ప్రసాదించారు. ఆది కాలంనుంచీ, ఇప్పటివరకూ ఎందరో మహానుభావులు మన దేశంలో ఉద్భవించి, మానవాళికే ఒక నిర్వచనం మరియు వారి జీవితవిధానం ఎలాగుండాలో భాష్యంచెప్పారు. వారి యొక్క జ్ఞానము మనకు ఈనాటికి కూడా మార్గదర్శకం. వారు రచించిన గ్రంథాలు, ఎన్నటికీ మాయనివీ మరియు మచ్చలేనివీ – అని అందరూ ఒప్పుకొని తీరాల్సిందే. మనం గర్వించదగ్గ ఎన్నో గ్రంథాలు, ముముక్షువులు, మరియు దైవాంశ సంభూతులూ, మహా ఋషులు మనకు వారు ఇచ్చిన అమూల్యమైన కానుకలు. ఉదాహరణకు వాల్మీకి రాసిన రామాయణం, వేదవ్యాసుల వారి మహాభారతంలకు ప్రత్యామ్నాయం ఉందా? లేదని మనకందరకీ తెలుసు. అలాగే జ్యోతిష శాస్త్రములో మనకు మన పూర్వులు వ్రాసిన గ్రంథాలు ఎంతో అమూల్యమైనవి. మనం వాటిని పఠించి, బోధించి మన దేశంలో విజ్ఞానం పెంపొందించాలి. కానీ ధన, కీర్తి కాంక్షలతో లేదా స్వలాభాపేక్షతో ఆత్మవంచన చేసుకుని శాస్త్రాన్ని వక్రీకరించి లేక విజ్ఞానదాయకమయిన, మన పూర్వులు వ్రాసిన వారి గ్రంథములకు వక్రమార్గమేర్పరచి, మన దేశపు ఔన్నత్యము కించపరుచుట వల్ల సామాన్య ప్రజానీకంలో శాస్త్రమంటే అగౌరవం, శాస్త్రవేత్త అంటే చిన్న చూపు కలుగుతున్నాయి. ఎందుకంటే శాస్త్రజ్ఞులను పండితులను ఆహ్వానించి వారితో పాటు

శాస్త్రజ్ఞాన విహీనులను, వితండవాదులను కూడా పిలిచి వారి మధ్య చర్చాగోష్ఠి పెట్టి ప్రజానీకంలో శాస్త్రాన్ని అపహాస్యం చేసే ఈ దూరదర్శిని వారిని విజ్ఞులు ఎన్నడు హర్షించరు కదా, వారి తక్కువ తరగతి వ్యాపార సరళికి ఏహ్య భావం కూడా కలుగుతుంది. లక్షల మంది చూస్తున్నారనీ కనీస ఆలోచన కూడా లేకుండా తాము పండితులుగా చేలామణి అవుతున్నప్పుడు అలా వారిలో వారు వాదాలు వితండ వాదాలకు దిగివచ్చా? ఇది పండిత సాంప్రదాయమా? అందువల్ల పండితులు ధనాపేక్ష వదలి ఇటువంటి కార్యక్రమాలు త్యజించాలి. ఎందుకంటే అశ్వాన్ని, గార్దభాన్ని ఒకే రాట కట్టడానికి ప్రయత్నించి దాని ద్వారా ప్రాచుర్యం పొందడానికి చేసే నీచ వ్యాపార సరలోక్తి దూరదర్శిని కేంద్రాలలో మనం ఎన్నటికి సహకరించకూడదు. నన్ను చాలా టి.వి. ఛానల్సు సంప్రదించాయి. ఆశ చూపాయి. నేను ధన వ్యామోహానికి దాసుడను కానని నొక్కి చెప్పాను. ఎందుకంటే వారు పెట్టిన షరతులు, నియమాలు చాలా అభ్యంతరంగాను నన్ను బానిసగా చేసేవిగాను, ఆ నిబంధనలు ఉన్నాయి. టి.వి.లో కనిపించినంత మాత్రాన ఎవరూ మహా విద్వత్తు కలవాడు విద్వాంసుడూ కాదు. ఇది నిజం. కాని అమాయకులు శాస్త్రపరిజ్ఞానం లేనివారు మాత్రమే టి.విలలో చెప్పేవారే గొప్ప పండితులనుకుంటారు. టి.వి.లలో చెప్పే శాస్త్రం ఎంతవరకు సత్యమో, పాటించ యోగ్యమో మంచి పండితులకే తెలుసు. అదే కాకుండా వేరు వేరు పండితులు ఒకే అంశాన్ని వేరువేరుగా విశ్లేషించడం వల్ల చూపరులకు అయోమయం ఏర్పడుతోంది. ఇది చాలా శోచనీయం. పండితులు ధనకాంక్షకు కీర్తి కాంక్షకు లొంగిపోతే వారికి వాక్శుద్ధి నశిస్తుంది. ఇంకొక విషయం ఏమంటే అర్ధహీనమైన చర్చాలోగోష్టులే కాక శాస్త్ర పండితులను చౌకబారు మనుష్యులుగానో,లేక మూర్ఖ శిఖామణులుగానో, టి.వి.లలో మరియు సినిమాలలో చూపిండం వారిని హాస్య నటులకంటే హీనంగాను, మూర్ఖులుగాను చిత్రీకరించి చూపించడం ఇప్పుడు మరీ ఎక్కువ అయిపోయింది. హాస్యాన్ని అందరూ ఆహ్వానిస్తారు. మనసారా ఆస్వాదిస్తారు. హాస్యం అనే ముసుగు తొడిగి శాస్త్రజ్ఞులను శాస్త్ర పండితులను మరీ కించపరచి చూపించడం ఎంతవరకు సమంజసం? మీరే ఆలోచించండి. అంతవరకు కువిమర్శలు చేయకండి. మన శాస్త్రాలను తక్కువచేసి చూపిస్తున్న టి.వి. ఛానల్సు గాని, సినిమా డైరక్టర్లు కాని బైబుల్, ఖురాన్, గురుగ్రంథ సాహిబ్‌లను అదేవిధంగా చూపించే ధైర్యం, సత్తా

వారికి ఉందా? ఉంటే ఏ టి.వి. ఛానల్‌గాని ఏ సినిమాడైరక్టరు గాని పరమత గ్రంథాలను గాని, చర్చిలోని పాష్టర్సును గాని, మసీదులోని మౌల్వీలను గాని అలా చూపమనండి! దాని ఫలితం ఎలా ఉంటుందో మీరే చూడండి!! అదే కాకుండా ఇలాంటి చర్చాగోష్టి హైందవ మత సాంప్రదాయ, ఆచారముల మీదేగాని ఇతర మతాలలోని లోపాల మీద విమర్శ గోష్టి ఎందుకు పెట్టరు? మీరే ఆలోచించండి. పురుష సంభోగం లేకుండా ఏ కన్య అయినా గర్భం ధరిస్తుందా. వేల సంవత్సరాల క్రితం ఎవరో హత్య చేస్తే మనం ఇప్పుడు క్రూరంగా మనంతట మనమే హింసించుకుని రక్తధారలు ప్రవిస్తే పాప పరిహారమౌతుందా? ఇలాంటి చర్చలు ఎందుకు ధైర్యంగా పెట్టరు? ఒక సర్దార్జీ సిగరెట్ త్రాగినట్లు చూపిస్తే ఏమయింది? అల్లా మీద కార్టూను వేస్తే ఏమయింది? సహనానికి కూడా ఒక హద్దుంది. ఒక శాస్త్రాన్ని మూఢనమ్మకమని ప్రసారం చేసేవారు ఇతర మతాల మూఢనమ్మకాల జోలికి ఎందుకుపోరు? "అలుగుటయే ఎఱుంగని అజాతశత్రువు అలిగిననాడు" అన్న నిజం ఎవ్వరూ మరువ కూడదు. మరిచిపోతే మూకను ఛండాడునప్పుడు ఒక్కండును తమ మొఱాలకింపడ"ని అందరూ గ్రహించాలి. కాబట్టి మన హిందూమత పీఠాధిపతులు, హిందూ మత ప్రచారానికి కంకణం కట్టుకున్నామని ఊరేగే సంఘాల నాయకులు ఏమి చేస్తున్నారు? శాస్త్రాలను అపహాస్యం చేసి చూపించే వారికి గుణపాఠం చెప్పే రోజు దగ్గఱకు వస్తోంది. అలాంటి రోజు వచ్చినపుడు ప్రజావాహిని యొక్క ఆగ్రహావేశాలు చవి చూసేటప్పుడు "ఒక్కండును తమ మొరాలకింపడు" అనే నిజాన్ని అప్పుడే గ్రహిస్తారు. నేను వ్రాసినది కువిమర్శ కాదు. నిజమైన నిజం. ముమ్మాటికి నిజం. ఇది నాలోని హిందూ మతాభిమానం, నాలోని హృదయ స్పందన మాత్రమే. నా ఆవేదనను విజ్ఞులైన పాఠకులు సరిగా అర్ధం చేసుకుంటారని అనుకుంటాను. ఇంకొక విషయం ఏమంటే మనం శాస్త్రాన్ని యథాతథంగా శిష్యులకు బోధించాలి, గాని మన స్వానుభవాన్ని రంగరించుకొని దానికి శాస్త్ర రంగు పులిమి విషయాన్ని మార్చి చెప్పకూడదు. ప్రపంచం అన్ని దేశాలలో కోట్లానుకోట్ల మంది ఈ శాస్త్రాన్ని దైవ శాస్త్రంగా నమ్ముతున్నప్పు ఈ శాస్త్రం మూఢ నమ్మకమని ప్రచారం చేసే వారు మాత్రమే మూఢులని ప్రజా బాహుళ్యంలో వారిపట్ల అసహ్యం పేరుగుతుందని వారు గ్రహించాలి.ఎందుకంటే ప్రపంచ చరిత్రలో జ్యోతిష్యానికి మూల పురుషులు

దైవాంశ సంభూతులు అయిన మునిసమానులైన పరాశర, వరరుచి వంటి వారు వేల సంవత్సరాల క్రితమే మానవ నేత్రాలు చూడలేని గ్రహాలను గుర్తించి, అవి సూర్య ప్రదక్షిణ చేస్తున్నాయని, వాటి వేగాన్ని, బరువును విశదీకరించటమే కాక భూమి నుంచి అంతరిక్షంలో ఎంతదూరంలో ఉన్నాయో తెలియచెప్పడమే కాక ఆ గ్రహాల వల్ల మానవులకు ఎలాంటి ఫలితాలు వస్తాయో కూడా ఒక నిర్దుష్ట రీతిలో క్రోడీకరించారు. వారి రచనలే ఈ రోజుకు కూడా స్థిరంగా ప్రత్యమ్నాయం లేకుండా ప్రపంచం అంతా అంగీకరిస్తుంది. ఈ దైవ శాస్త్రాన్ని కాదవే జ్ఞానం, వివేకం గల వారు వితండ వాదాలకు తావివ్వక గ్రహాల, వేగం, తమ కక్ష్యలో సంచారం వాటి అయస్కాంత శక్తి వాటి ప్రభావం మానవుల మీద లేదని గాని, కాదని గాని ఋజువు చేసి సరియైన మరియు సముచితమై శాస్త్రాన్ని సృష్టించి క్రొత్త భాష్యం చెప్పి ప్రపంచంలో మెప్పు పొంది ఘనకీర్తి సంపాదించుకోవాలి అంతేకాని చౌకబారు మరియు మూర్ఖవిమర్శలు చేయకూడదు. తాము క్రొత్తగా చెప్పిన భాష్యం నిజమైనదని ఋజువు చేస్తే అప్పుడు వారికి, వారు చెప్పిన క్రొత్త భాష్యానికి ఒక విలువ, గుర్తింపు వస్తుంది. జ్యోతిష శాస్త్రాన్ని వ్యతిరేకించేవారు ఈ శాస్త్రాన్ని పూర్తిగా అధ్యయనంచేసి ఆ తరువాత తమ పరిశోధన ప్రారంభించి ఈ శాస్త్రం తప్పు అని ఋజువు చేయండి. అలాంటి ప్రచార ప్రయత్నం కూడా చేయకూడదు. ఎందుకంటే మహోన్నత ఉద్దండ పండితులైన, మరియు సరస్వతీ పుత్రులుగా కొనియాడ బడుచున్న మహాకవి కాళిదాసు, నారద మహర్షి మరియు జైమినియే కాక మంత్రేశ్వరుడు వంటివారు చెప్పిన శాస్త్రాన్ని తప్పుపట్టటం క్షంతవ్యం కాదు. చాలామంది తమ తమ ఉద్దేశ్యములను అసలు రూపము మార్చి కీర్తికాంక్షతో వారి పేరును స్థిరపరచు కొనడానికి కొన్ని వింత పద్ధతులు, శాస్త్ర విధానంలో మార్పులు చేస్తున్నారు. అది సరికాదని నా భావన. ఇలా ఎవరికివారు శాస్త్రాన్ని ఎవరికి తోచిన విధంగా వారు బోధిస్తూ పోతే, అసలు శాస్త్రం మరుగున పడిపోతుందనేదే నా భయం. ఉదాహరణకు అస్సాంలో రంజిత్ భట్టాచార్యపద్ధతి. బెంగాల్‌లో సి.కె. చౌదరి పద్ధతి, యు.పి.లో (ఉత్తరప్రదేశ్‌లో) వినోద్ వల్లభ ఉపాధ్యాయ పద్ధతి, కర్ణాటకలో బి.వి.రామన్ పద్ధతి, మరియు తమిళనాడులో కృష్ణమూర్తి పద్ధతి అంటూ వేరు వేరు పద్ధతులు బోధించడం వల్ల, చక్రము వేసినప్పుడు లగ్నాలే మారిపోతున్నాయి. అదేకాకుండా చక్రంలో ఉండవలసిన

గ్రహస్థితి కూడా, స్థానభ్రంశం కలుగుతుంది. దీనివల్ల గ్రహస్థితి లోపం, వీక్షణాలోపం, సిద్ధ సంయోగ లోపం కూడా ఏర్పడుతుంది అని మనకు తెలుసు. వేరు వేరు జ్యోతిష్యులు, వేరు వేరు ప్రాంతాలలో ఉన్నా శాస్త్ర మూలం ఒక్కటే అని గ్రహించవలసిన ఆవశ్యకత ఇప్పుడు ఉంది. ఈ సత్యం గ్రహించలేక పోవడం వల్ల జ్యోతిష శాస్త్రంలో కూడా వర్గాలు ఏర్పడి రాగ, అసూయ ద్వేషాలతో, మరియు కోపోద్రేకాలకులోనయి సత్య దూరమయిన విమర్శలు చేయడం జరుగుతోంది. ఇది చాలా బాధాకరమైన విషయం. ఇలా ప్రస్తావించడానికి సాహసించినందుకు విజ్ఞులైన పండితులు నా భావోద్రేకాన్ని అర్ధం చేసుకుని, నాకు వారి సద్విమర్శలు అందిస్తారని భావిస్తున్నాను. ఎందుకంటే, కొందరు జ్యోతిష శాస్త్రవేత్తలు అసలు గ్రహాలకున్న వీక్షణ సంఖ్య తప్పు అనో, లేక అసలు వీక్షణలేవనో మరికొందరు వయోపరిమితి బట్టి కుజదోషణ నిర్ణయించాలని, ఇంక కొందరు కుజ దోషం కొన్ని ప్రాంతాల వారికి వర్తించదని ఎవరికి తోచిన విధంగా వారు భాష్యం చెప్పటం ఎంత సమంజసం! అలాగే బ్రాహ్మణులకు గ్రహమైత్రి ముఖ్యం, అంటూ కులాలవారిగా ఎవరికి ఏది ముఖ్యమోపంచాంగాలలో వ్రాస్తున్నారు. గ్రహాలు కులాల ప్రకారం నడుస్తాయా? ఇతర కులాల వారికి గ్రహమైత్రి అక్కర లేదా? ఏలినాటి శనిగాని, లేక అర్ధాష్టమ శనిగాని వచ్చినపుడు శని బ్రాహ్మణులను, వైశ్యులను, క్షత్రియులను లేక శూద్రులను కులాల ప్రకారమే బాధిస్తాడా? ఒక శిశువును అనాధ శరణాలయము నుంచి మనం తెచ్చుకుని పుత్రప్రేమతో పెంచుకుంటే అలా పెంచుకునే తల్లిదండ్రుల కులాన్ని చూసి ఏలినాటి శని ఆ పెరుగుతున్న యువకుడిని బాధిస్తాడా లేక ఏ తల్లి ఆ శిశువుకు జన్మ ఇచ్చిందో ఆ తల్లి కులం ప్రకారం బాధిస్తాడా?ఒకవేళ కులాంతర వివాహాలు ఎక్కువగా జరుగుతున్న ఈ రోజుల్లో ఒక బ్రాహ్మణ కన్య ఒక క్షత్రియుడిని వివాహమాడితే వారి దాంపత్య జీవిత సాఫల్యం వల్ల కలిగిన పుత్రుడిని శని ఏ కులం ప్రాతిపదికగా తీసుకొని బాధిస్తాడో విజ్ఞులు, పండితోత్తములైన పంచాంగ రచయితలు నాకు శాస్త్ర ప్రామాణికంగా జ్ఞాన బోధ చేస్తే మిక్కిలి కృతజ్ఞుడను. అలా చెప్పలేనప్పుడు ఈ శుష్క ప్రవచనాలకు పంచాంగకర్తలు స్వస్తి చెప్పాలి. ఎందుకంటే ప్రజలకు పంచాంగం అంటే అతి నమ్మకం. ఆ నమ్మకాన్ని ఏ పంచాంగ కర్త వమ్ము చేయకూడదు. కులాలపేరుతో ప్రజలతో ఉన్న ఐకమత్యాన్ని విచ్ఛిన్నం చేయకూడదు. పంచాంగ పఠనంవల్ల విజ్ఞానం

పేరగాలేగాని మూర్ఖ, మూఢనమ్మకాలు కలుగకూడదు.

మహా శాస్త్రవేత్తలయిన వరాహమిహిరుడు, పరాశరుడు, మంత్రేశ్వరుడు, వారి స్ఫూర్తిని, జ్ఞానాన్ని మనం గ్రహించి లోక కళ్యాణానికి మన విజ్ఞానాన్ని వినియోగించాలని నా కోరిక. నా వాంఛ సమర్ధనీయం మరియు సమంజసం అని మీరు తలిస్తే నాకు ఆనందంగా ఉంటుంది. మీ స్పందనను తెలియచేస్తే మరీ ఆనందం.

ఈ జ్యోతిష శాస్త్రం అనేది భవిష్యత్తు గురించి చెప్పినా, దీనిలో అనేక అంశాలు ముడిపడి ఉన్నాయి. ఒక్కొక్కరు ఒక్కొక్క విధానాన్ని వారి ఉత్సాహాన్ని బట్టి వృద్ధి చేసుకుని ఆ అంశంలో అత్యంత ప్రావీణ్యం సంపాదించి, ఆ జ్ఞానాన్ని ప్రజలకు పంచిపెట్టే ఉద్దేశ్యంతో వారు అనేక గ్రంథాలు రచించారు. వీటిలో కొన్ని ముఖ్యాంశాలు 1. జాతక విశ్లేషణ, 2. హస్త సాముద్రికము, 3. ప్రశ్నా శాస్త్రము, 4. సంఖ్యా శాస్త్రము, 5. ముహూర్త శాస్త్రము, 6. మేలాపకము మొదలయినవి. ఈ అంశాల గురించి ఎంతోమంది పండితులు ఎన్నో గ్రంథము లను, వారి ప్రజ్ఞాపాటవములను కనబరుస్తూ అత్యంత శ్లాఘనీయంగా మరియు మంచి గ్రాంథిక భాషలో రచించారు. వాటిని చదివిన వారికి ఎంతో జ్ఞానము, శాస్త్రము మీద మంచిపట్టు వస్తుందనుటలో సందేహం లేదు. భూత కాలములో గ్రామాలలో ఒక గ్రామాధి కారి, ఒక వైద్యుడు ఉన్నట్లే ఒక పండితుడు ఉండేవాడు. ఆ పండితుడు ఆ గ్రామంలోనే గాక చుట్టుప్రక్కల ఉన్న చాలా గ్రామాలలో మార్గదర్శిగా ఉండి ఆచార్య దేవునిగా గౌరవింపబడే వాడు. ఆ పండితుడే మత సంబంధమైన పూజలు, వ్రతాలు మరియు దైవ కార్యములకు ముహూర్తములు పెడుతూ వారి భూత, వర్తమాన, భవిష్యత్ ఫలితాలను చెపుతూ ఉండేవాడు.

కాలక్రమేణా జనసాంద్రత పెరిగింది. గ్రామాలు నగరాలయ్యాయి. నగరాలు పట్టణాలుగా అభివృద్ధి చెందాయి. జనసాంద్రత విపరీతంగా పెరుగుతున్నందువల్ల ఏ ఒక్క పండితుడు, ఏ ఒక్క వైద్యుడు సరిపోని పరిస్థితి ఇప్పుడు ఏర్పడింది. దానివల్లన పండితులు తమ పాండిత్యం అంతరించి పోకుండా ఉండడం కోసం గురుకుల పాఠశాలలు స్థాపించివేద శాస్త్ర పారాయణములు నేర్పించడం అనేది మొదలయ్యింది. దీనితో ఏ కొద్దిమందిలో ఉన్న ఈ శాస్త్రము వెలుగున పడి అత్యంత ప్రాముఖ్యం

సంపాదించుకుంది. విద్యాధికులు మరియు ఔత్సాహికులు కూడా శాస్త్రాలను అధ్యయనం చేసి వారు కూడా హైందవ సంస్కార, సంప్రదాయాలకు తక్కువ కాకుండా శాస్త్ర విద్యను ప్రచారం చేస్తున్నారు. పైన చెప్పినట్లు వారి వారికి ఉన్న ఉత్సాహం మరియు శాస్త్ర పరిజ్ఞానంతో ఏ ప్రత్యేక అంశం మీద రచన సాగించినాఅది మానవాళి జాగృతికి తోడ్పాటు అయింది. ముఖ్యంగా దైవ శాస్త్రమని చెప్పబడే ఈ జ్యోతిష్య శాస్త్రం మంచి ఉన్నత స్థానం పొంది ఎంతో ప్రాముఖ్యం సంపాదించు కుంది. ఈ క్రమంలో ప్రముఖులు ఆంధ్రదేశ జ్యోతిష్య పండితులకు గురువైన శ్రీ మధిర కృష్ణమూర్తి గారు చెప్పుకోదగ్గ వారు. వారి పాండిత్యం అతి శాస్త్రీయం, దైవదత్తం మరియు స్వార్థరహితం. ఆయనదర్శన భాగ్యం మరియు ఆయన ఆశీస్సులు పొందినవారు ఏ జ్యోతిష్యుడైన స్వలాభాపేక్ష, లేక కీర్తికాంక్ష లేకుండా ఉంటే అట్టి జ్యోతిష్యునికి నాలుక మీద సరస్వతీ దేవి బీజాక్షరాలు వ్రాసి ఆయన వాక్కుకు శుద్ధి కలిగిస్తుందని ఆయన నాకు స్వయంగా చెప్పి 1991లో నన్ను దీవించారు. ఆయన దీవెన నాకే కాదు మరే జ్యోతిష్యుడైనా ఆయన చెప్పినట్లు ఆచరిస్తే ఆ దీవెన వారికి కూడా దక్కుతుందని నా భావన.

ఆంధ్రదేశంలో ఎందరో మహాపండితులు ఉన్నారు. ముఖ్యంగా తూర్పుగోదావరి జిల్లా పండితులకు, పాండిత్యానికి పుట్టినిల్లు. అలాగే తెలంగాణాలో వేములవాడ మరియు మంథని పండితుల ప్రజ్ఞా పాటవములు అత్యంత శ్లాఘనీయము.

ఎంతోమంది ఎన్నో గ్రంథ రచనలు చేసినప్పటికి అవి చాలవు. ఎందుకంటే, ఒక్కొక్క రచయితకు ఒక్కొక్క భాషాశైలి ఉంటుంది. ఎవరికి ఏ శైలి నచ్చితే ఆ గ్రంథ రచయితను ప్రశంసిస్తారు. ఆయన రచనలను కొని, చదివి, శాస్త్ర విజ్ఞానం పెంచు కుంటారు. అందువల్ల ఎందరు ఎన్ని గ్రంథములు వ్రాసినా, మూల శాస్త్రమునకు భంగము రాకుండా తమదైన శైలిలో చెప్పినప్పుడు ఆ గ్రంథానికి ఒక విలువ, అర్థం ఉంటుంది. ఇదివరలో నేను వ్రాసిన పుస్తకాలను చదివిన ఎందరో నా శైలి, వ్రాసిన తీరు, ఉపయోగించిన పద శబ్దములు చాలా సరళశైలిలో ఉందని సామాన్య ప్రజలకు తేలిగ్గా అర్థమవుతుందని, అందువల్ల కూలంకషంగా అన్ని అంశాలను చేర్చి ఒక గ్రంథం వ్రాయమని నన్ను ప్రోత్సహించారు. వారి మాటకాదనలేక ఎన్నో మహా

గ్రంథాలు, ఎందరో పండితులు తెలుగులో వ్రాసినప్పటికి ఈ గ్రంథ రచన చేయడానికి ఉన్న ఉద్దేశ్యం చంద్రునికి ఒక నూలుపోగు అన్నట్లే తప్ప మిగిలిన గ్రంథాలకి ఈ రచన అతీతం కాదు. ఇలాంటి సాహసం చేసినందులకు వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్న నా సహాధ్యాయులకు, మిత్రులకు నేను ఎల్లప్పుడూ సర్వదా కృతజ్ఞునిగా ఉంటాను.

ఒక ముఖ్య విషయమేమిటంటే మిత్రుడు, సోదర సమానుడు అయిన శ్రీ ఆచంట సుబ్రహ్మణ్యం గారు మొట్టమొదటగా ఒక గ్రంథం వ్రాయమని చెప్పినప్పుడు నేను సంశయిస్తుంటే, 'ఆయన "మీరు ఎలాగా ఒక గ్రంథం వ్రాయగలిగే శక్తి ఉన్నవారు. నేను మరణించే లోపల ఆ గ్రంథం రచిస్తే దానిని చదివి సంతృప్తి చెంది' ఇలాంటి పండిత మిత్రుడు దొరికినందుకు సంతోషించి హాయిగా కన్నుమూస్తాను" అని నవ్వుతూ అన్నారు. ఆయన నవ్వుతూ అన్నా, ఆయన గుండెలోతుల్లోని ప్రగాఢ వాంఛ ఏమిటో నాకు అర్ధమయి పోయింది. నేను ఒక గ్రంథం చిరస్థాయిగా ఆంధ్ర దేశానికి రచించి ఇచ్చి, తరువాత నేను మరణించినా, మీ ద్వారా ఆ పుస్తకం బ్రతికే ఉంటుంది. అని ఆయన నాకు సందేశాత్మక సలహా ఇచ్చారని తెలిసిపోయింది. ఇంతటి ఉదాత్తమైన మరియు స్వార్ధరహితమైన ఆయన అభీష్టం నేను కాదనలేను. ఆయన చెప్పినట్లు మాలో ఎవరు ముందు మరణించినా ఈ గ్రంథం మాత్రం మరణించక స్థిరస్థాయిగా ఉండిపోతుందని వారు ఈ కార్యమునకు నన్ను ప్రోత్సహించి ఆంధ్ర దేశ జ్యోతిష పండితులకు ఆయన చేసిన సేవా ధర్మము, నేను చేసిన ఈ ప్రయత్నము శూత ధర్మము లాంటిదని నేను గ్రహించాను. అందుకే వీలయినంత త్వరలో ఆయన కోరికను నేను మన్నించగలననే ధైర్యంతో ఈ గ్రంధరచనకు సాహసించినప్పుడు శ్రీరామకుమార్ గారు కూడా ఇచ్చిన ధైర్యం స్ఫూర్తివల్ల నాలో ఒక గ్రంథం వ్రాయాలనే కోరిక చిగురు తొడిగింది. రామకుమార్‌గారు గ్రంథం ప్రచురించి ఒక పటిష్టమైన స్థానం నాకు జ్యోతిష్యులలో సంపాదించిపెట్టారనేది వాస్తవం. ఈ గ్రంధరచన అనే యజ్ఞంలో నేను సఫలీకృతుడయ్యానో లేదో విజ్ఞులైన పాఠకులే నిర్ణయించాలి.

ఈ భూమి మీద వెలుగుకు కారణమైనరవిచంద్రులవల్లే మనం మనుగడ సాగిస్తున్నాం. సూర్యచంద్రుల కాంతివల్లే మనకు రాత్రి పగలు అనే తారతమ్యం చక్కగా తెలుస్తుంది. సూర్యుడు ప్రకాశిస్తున్నంత కాలం పగలు. సూర్యుడు కనుమరుగై

నప్పుడు ఆయన కాంతి ఈ భూమి మీద పడక ఈ భూగోళమంతా అంధకారమై పోతుంది. ఆ సమయంలో మనకు చంద్రుడు వెలుగును ప్రసాదిస్తాడు. అంటే ఒక విధంగా మనం సూర్య చంద్రుల వల్ల రాత్రింబగళ్ళు ఏర్పడుతున్నాయని అనుకోవచ్చు. సూర్యుడు మరియు చంద్రుడు ప్రసరించే జ్యోతిలోనిఅద్భుత మైన మానవాతీత శక్తులను గురించి చెప్పేదే జ్యోతి + శాస్త్రము, జ్యోతిషశాస్త్రమంటారు. సూర్యుని వల్ల మానవులకు పశు, వృక్షాదులకు మరియు క్రిమి కీటకాదులకు ఎలా ప్రాణం ఏర్పడు తుందో అలాగే చంద్రుని వల్ల, ఈ భౌతిక భూగోళంలోని ఎన్నో సంభవాలకుచంద్రుడే కారణ భూతుడు. చంద్రుని యొక్క ఉదయ అస్తమయాలకు తీరుగా భూమి యందున్న నదులు, సముద్రాల ఆటుపోటులలోని వ్యత్యాసం మనం గమనించవచ్చు. మనం సముద్రపు ఒడ్డున నిలబడి పౌర్ణమి రోజున సముద్రాన్ని పరికించినట్లయితే ఆ సముద్రం నుంచి వచ్చే అలల మధురిమ సవ్వడి అలల రూపంలో సముద్ర కన్యచేసే నాట్యరవళిలా మనకు ఎంతో ఆహ్లాదం కలిగిస్తుంది. అలాగే అమావాస్య రోజునయితే చంద్ర హీన ఆకాశాన్నేచూసి సముద్రాలు విషమ వదనంతో ఉండి అలల అందెల సవ్వడి చెయ్యక ఒదిగి ఒదిగి సముద్రపు ఒడ్డును సున్నితంగా తాకుతాయే తప్ప ఉవ్వెత్తున ఎగిసిపడవు. ఇంకొక విషయమేమంటే పౌర్ణమి రోజున, సంధ్యా సమయంలో చంద్రుని ఉదయ సమయంలో పక్షులు చేసే కిలాకిలా రావాలు చంద్రుని సంతోషంగా ఆహ్వానిస్తున్నట్లుగా అనిపిస్తుంది. అదే అమావాస్య రోజున పక్షులన్నీ సాయం సంధ్యకు ముందరే అంటే, సూర్యాస్తమయ సమయంలోనే తమ గూళ్లకు చేరుకుంటాయి. అంటే మానవులకు గాని, పశుపక్ష్యాదులకు గాని చంద్రుడు సూర్య కాంతి ప్రసరించనపుడు తాను మార్గదర్శకంగా ఉంటాడనేది ప్రత్యక్ష సాక్ష్యం. ఇంకొక ముఖ్య విశేషమేమిటంటే చంద్రకాంతి మానవుని మేథస్సు మీద కూడ ఎంతో ప్రభావం చూపుతుంద నేది నిర్వివాదాంశం. ఎలా అంటే మనం వైశాఖమాస భానుడి ప్రతాపానికి ఇబ్బందిపడినా, చంద్రకాంతిలో మనం ఎంతో సేద తీరుతాము. అలా ఆరుబయట పవళించినపుడు పగటి ఉష్ణోగ్రతను మర్చిపోయి చంద్రుని యొక్క ఆహ్లాదకరమైన శీతల కాంతిని అనుభవిస్తూ పరవశించిపోతాం. అప్పుడు మనకు విహార యాత్రలు చేయాలని లేక వనమందు ఆటలాడు కోవాలన్న కోరిక కలుగుతుంది. మరియు సహజపరమైన దాంపత్య జీవితంలోనే లైంగిక వాంఛలు కూడ చెలరేగుతాయి.

అంటే మన మనస్సును ఆహ్లాద పరచి సంతోషపెట్టేదిచంద్రుడే. ఇదే విధంగా చంద్రుడు మానవుని మనస్సుపై ఎంతో ప్రభావం చూపుతాడు. అలాగే నేర ప్రవృత్తిలో కూడ చంద్రప్రభావం నేరస్తుని మీద ఎక్కువ ఉంటుంది. అందుకనే క్షీణచంద్రుని సమయంలో అంటే అమావాస్య దగ్గర రోజుల్లో దౌర్జన్య ప్రవృత్తి, చోర, జారత్వం ఎక్కువగా ఉంటాయి. ఈ విషయం శాస్త్రజ్ఞుల పరిశీలనలో అమావాస్య,పౌర్ణమిలలో తీవ్రంగా ఉంటుందని ఋజువయ్యింది. అంటే మన మీద సూర్య కిరణాలు పడినపుడు, ఆ సూర్య కిరణాల ప్రభావం వల్ల దాహం, అలసట, నిస్తేజం, చిరుకోపం, విసుగు మొదలగునవి కలుగుతున్నాయి. అలాగే చంద్ర కిరణాలు మన మీద ప్రసరించినపుడు మనకు ఆహ్లాదం, సంతోషం, లైంగిక వాంఛలు ఏర్పడుతున్నాయి.

ఈ భిన్న మనస్తత్వాలు మనం రోజూ అనుభవించుచున్నవే. సూర్య, చంద్ర కిరణాల వల్ల మనకు ఎలా భావోద్వేగాలు కలుగుతున్నాయో, అలాగే మిగిలిన గ్రహాల అదృశ్యకిరణాలు మనమీద ప్రసరించినపుడు ఆయా గ్రహాలు ఇచ్చే ప్రభావం వల్ల మనం ప్రభావితం అవుతాము. ఒక తేడా ఏమిటంటే సూర్యుని, చంద్రుని మనం చూస్తున్నాము కాబట్టి వారి ప్రభావంమనం కాదనలేకపోతున్నాము. కానీ అంతరిక్షంలో అత్యంత దూరంలో ఉన్న మిగిలిన గ్రహాలఅదృశ్య కిరణాలు కూడా మనమీద పడతాయి. అప్పుడు ఆ కిరణ ప్రభావం వల్ల మన మేధస్సులో మార్పు సంభవిస్తుంది. అలా సంభవించిన మార్పువల్ల మనిషిలోని స్ఫూర్తి, ప్రతిస్పందన ఏర్పడతాయి. ఇది ముమ్మాటికి సత్యం. ఎంతో మంచివాడు, మరియు ఎంతో సాత్వికుడు అని పేరు పొందిన ఒక మనిషి ఒక్కొక్కప్పుడు తీవ్ర కోపతాపాలకు లోనై ఉన్మాదంతో హత్య చేయడం అనేది మనం వార్తాపత్రికలలో చూస్తూనే ఉంటాము. అలాగే ఎంతో దౌర్జన్య, దుర్మార్గ, నేర ప్రవృత్తి గల మనిషి హఠాత్తుగా, మానసిక పరివర్తనకు లోనై మిక్కిలి పుణ్య మూర్తిగా పేరు ప్రఖ్యాతులు సంపాదిస్తాడు. ఉదాహరణకు అలనాటి మహా పరాక్రమవంతుడు, వీరుడు అయిన అశోకుడు శాంతిమూర్తిగా విరాజిల్లాడు. అలాగే అంగుళీమాలుని సత్యకథ మనకు తెలియనిది కాదు. కాబట్టి మన జీవిత సరళిలోని మార్పుకు గ్రహస్థితే కారణమని మనం నొక్కి వక్కాణించగలము. ఒక విషయమేమంటే బ్రహ్మ వ్రాసిన రాతలను తదనుగుణంగా

తగిన సమయాసమయాల్లో జరపడానికి, నిర్దేశించిన దైవ సంభూతులను మనం గ్రహాలని పిలుస్తున్నాము. అంటే మానవుని జీవితంలో ఎవరికి ఎప్పుడు ఎలా జరగాలని ఉందో అప్పుడు అది అలా జరిగేటట్లు చేసే విధికి ప్రతిరూపం గ్రహాలే. ఒక్కొక్క కార్యానికి ఒక్కొక్క గ్రహానికి అధికారం, స్వేచ్ఛ ఉంటుంది. ఈ గ్రహాలు తమ విధులను తప్పకుండా ఎల్లప్పుడూ నిర్వర్తిస్తూ ఉంటాయి. ఉదాహరణకు విధిలిఖితమైన చోట, ఆ విధి ప్రకారం గురు దశలో జన్మించిన ఆ శిశువుకు అత్యంతమైన విద్యనిస్తాడు. బాల్యం నుంచే ఆ శిశువు ఉన్నత విద్యా ప్రమాణాలను అధిరోహించి మంచి విద్యావేత్త గానూ, పండితుడుగానూ విరాజిల్లుతాడు. ప్రారబ్ధ కర్మను బట్టి వేద వేదాంగ మరియు ఆయుర్వేద భిషక్ లేదా ఉన్నత యంత్ర, మంత్ర, తంత్ర శాస్త్రములలో ప్రావీణ్యులై లోక కళ్యాణం చేస్తారు. అంటే గురువు వల్ల మనకు విద్యాప్రాప్తి కలుగుతుందని చెప్పవచ్చు. అలాగే శుక్రుడు సుఖమయ, సంతోష దాంపత్య జీవితం ఇచ్చేందుకు ప్రధానాధికారి అని చెప్పవచ్చు. బ్రహ్మ లిఖితానుసారము భార్యను పురుషునకు లేక భర్తను స్త్రీకి ఎవరిని ఎవరికి జత చేయాలో కూర్చి వారికి వివాహం చేసి తన విధి నిర్వర్తిస్తాడు. అలాగే మిగిలిన గ్రహాలన్నీ కూడ మానవ జీవితంలో ఏర్పడే అన్నిముఖ్య అంశాలకు, వారే కారణభూతులు అని మనం మర్చిపోకూడదు. ఈ సత్యం ప్రతి దేశంలో ప్రతి శాస్త్రవేత్త లేక పండితుడు కాదని అనలేక పోతున్నారు. దానికి ఎన్నో దృష్టాంతాలు కనబడి ఋజువు చేయ బడ్డాయి. అందుకనే అన్ని దేశాలవారు, జ్యోతిష్య శాస్త్రాన్ని అభ్యసిస్తూనే ఉన్నారు. మనం ఈ జ్యోతిష్య శాస్త్రం అంటే ఏమిటో ఎలా చదవాలో నేర్చుకుందాం. ఏ శాస్త్రమైనా నేర్చుకునే టప్పుడు కొన్ని ప్రామాణికాలు పాటించాలి. అలాగే జ్యోతిష్య శాస్త్రంలో కూడా మనం కొన్ని అతి ముఖ్య అంశాలను ప్రప్రథమంగా నేర్చుకుని తీరాల్సిందే. ముఖ్యంగా మనం తెలుసు కోవలసినదేమిటంటే, ఈ భూమి మీద ఏర్పడే ఋతువులు, పగలు, రాత్రులు, ప్రాణికోటిలోని పునరుత్పత్తి సమయములు, వాటి నిర్దేశిత కాలములు ఈ గ్రహ మార్పు వల్లే జరుగుతున్నాయి. ఈ భూమిమీద ఉన్న సముద్రములు, నదులు, పశు పక్ష్యాదులు, అడవులు మొదలగు వాని మీద కూడా గ్రహాల ప్రభావం ఉన్నది. గ్రహముల ప్రభావం వల్లనే వృక్షములు ఫలించుట, జనన మరణములు మొదలైనవి జరుగు చున్నవి. అంతరిక్షంలో ఉన్న గ్రహముల వేగము, దూరము, మరియు వాటి ప్రభావము గురించి, గుణించి

చెప్పుటను ఖగోళ శాస్త్రమంటారు. అలాగే ఆ గ్రహాల ప్రభావం మానవ కోటిపై ఎప్పుడు, ఎలాగుంటుంది – మానవ జీవితాల లోని సుఖదుఃఖములు, కష్ట సుఖములు, జనన, మరణ, విద్యా, ధన, ఆరోగ్య మూలము విశ్లేషించి చెప్పడమే జ్యోతిష శాస్త్రము అంటారు. పైన ఉదహరించినట్లు కాల ప్రవాహమును కొలుచుటకు కొన్ని సాంకేతిక సమయ క్రమబద్ధీకరణ చేయటం మానవుడు నేర్చుకొనినాడు. ఈ కాలం అనేది చాల విచిత్రమైనది. ఇది నిర్విరామంగా సాగిపోతూనే ఉంటుంది. ఈ కాల ప్రవాహాన్ని ఎవరూ ఆపలేరు. అదీ కాకుండా కనీసం దీని యొక్క వేగాన్ని పెంచడంగాని, తగ్గించడం గాని ఎవరూ చేయలేరు. ఈ సాగుతున్న కాలం వల్లే యుగాలు, సంవత్సరాలు, మాసములు మొదలగునవి ఏర్పడుతున్నాయి. ఆదికాలంలో మానవుడు ఈ కాల ప్రవాహాన్ని అర్థం చేసుకుందుకు తన సాయశక్తులా ప్రయత్నించాడు. ఈ కాలగమనం వల్లే వాతావరణంలో మార్పులు, ఋతువులు, నిర్ణీత సమయానికి వస్తున్నాయిని తెలుసుకున్నాడు. అలాగే రాత్రింబ వళ్ళు ఏర్పడుతున్నాయని తెలుసుకున్నాడు. నిర్ణీత సమయాలకు సూర్యోదయ, సూర్యాస్తమ యాలు కలుగుతున్నాయని, అలాగే ప్రతి మాసంలో చంద్ర గమనంలో అమావాస్య, పౌర్ణమిలు ఏర్పడుతున్నాయని గమనించాడు. ఈ గ్రహణశక్తి కలిగిన తరువాత కాలాన్ని కొలవడానికి కొన్ని నిర్దిష్టమైన ప్రామాణికాలు ఏర్పరచుకున్నాడు. ఈ ప్రామాణికాలన్నీ జ్యోతిష శాస్త్రానికి జీవగఱ్ఱ. అందువలన మనం ఈ సాంకేతిక విశేషాలను కొలమానంగా అధ్యయనం చేద్దాం.

ప్రతీ దేశంలోనూ కాలప్రవాహాన్ని కొలవడానికి వంద సంవత్సరాలు ప్రమాణంగా తీసుకున్నారు. 100 సంవత్సరాలు నిండిన తరువాత దానికి ఒక శతాబ్దమని, మళ్ళీ రెండవ నూరు సంవత్సరాలు గడిచిన తరువాత రెండవ శతాబ్దమని పాటిస్తున్నారు. కానీ ఏ సంవత్స రానికీ నామకరణం చేయలేదు. సంఖ్యాపరంగా లెక్కించడమే తప్ప, సంవత్సరానికి పేరు అనే ప్రస్తావన లేదు. కానీ హిందూ దేశంలో కాల ప్రవాహాన్ని కొలవడానికి పాశ్చాత్యదేశాలలో పాటిస్తున్న నూరు సంవత్సరాల కొలమానం కాక మనం 60సంవత్సరాలు ప్రామాణికంగా తీసుకుంటున్నాము. ఈ ఒక్కొక్క సంవత్సరానికి ఒక్కొక్క నామం ఇవ్వబడింది. ఇంత విశేష ప్రజ్ఞ ఏ దేశంలోనూ కానలేము. ఎందుకంటే 2000 సంవత్సరాలకు పూర్వము కాల ప్రవాహాన్ని ఏ దేశములో కూడా కొలవడానికి సూత్రమనేది లేదు. క్రీస్తు జన్మించిన తరువాత

నుండే సంవత్సరములు లెక్కగట్టి కాలప్రవాహాన్ని కొలవడం మొదలుపెట్టారు. అందువల్లే క్రీస్తు శకం అని పిలుస్తున్నాము. కాని హిందూ దేశంలో 5000 సంవత్సరాల నుండే అంటే శాలివాహనుడి కాలం నుంచే మనంశాలివాహన యుగం అని ఇప్పటికీ 5000 సంవత్సరాలుగా కొలుస్తున్నాము. ఇది మన శాస్త్ర పరిజ్ఞానానికి ఒక మకుటాయ మానంగా నిర్వచించవచ్చు. ఇపుడు మనం సంవత్సరాల పేర్లు నేర్చుకుందాము.

ఈ సంవత్సరాల పేర్లను ప్రతివారూ నేర్చుకోతగిందే. ఎందుకంటే మన హైందవధర్మ ప్రకారం మరియు మన సాంప్రదాయ రీతిలో మన దేశంలో అన్ని పంచాంగాలు వ్రాయబడు తున్నవి. ఆ పంచాంగాలలో మన సంవత్సరముల పేర్లు, మాసముల పేర్లు మరియుతిథుల పేర్లు మాత్రమే వ్రాసి కాల ప్రవాహానికి కొలత ఇస్తారు. అందువల్ల ఈ వివరాలను మనం నేర్చుకోవడం మన విద్యుక్తధర్మం. ప్రతీవారు పాశ్చాత్య పోకడలతో ఆధునికత పేరుతోకనీసం మన మాసం, తిథి కూడా తెలుసుకోలేని అజ్ఞానంలోఉన్నారంటే దానికిబాధ్యులు తల్లితండ్రులా? లేక విద్య నేర్పే గురువులా? లేక ప్రభుత్వమా? అనే విషయం విజ్ఞులు మరియు పండితులూ నిర్ణయించాలి. కనీసం పంచాంగం చూడడం రాని అజ్ఞానంలో ఉన్న మన సంతానానికి మన సంస్కారం ఆంగ్ల విద్యతో పాటు నేర్పాలి. అప్పుడు ఆంగ్ల విద్య నేర్చిన ప్రతీవారికీ కూడా మన సాంప్రదాయ, సంస్కారాలలోని విశిష్ఠత తెలుస్తుంది. మన గొప్పతనం మనం తెలుసుకోకుండా మరొకరి సాంప్రదాయాన్ని గౌరవించడం సమంజసంఎప్పుడూ కాదు. కాబట్టి పాఠకులు ఈ విషయాన్ని విస్మరించక మన హైందవమతాన్ని, మన శాస్త్రాలనుగూర్చి తమ సంతానానికి చాటిచెప్పి, వారిలోని వైవిధ్యమైన లేక అజ్ఞానమైన దుష్ట సాంప్రదాయాన్ని పోగొట్టాలి. పాశ్చాత్య మోజులో మనని మనమే మర్చిపోకూ డదు. ఇప్పుడు ఈ క్రింది వరు సలలో సంవత్సరముల పేర్లు 6వరుసలలో ఇస్తున్నాను. ఒక్కొక్క వరుసలో10 సంవత్సరములు ఉంటాయి. 10 సంవత్సరములు అంటే ఒక దశాబ్దం అని అర్థం చేసుకోవాలి. ఒక్కొక్కరోజు ఒక్కొక్క వరుసలోని సంవత్స రాలను మననం చేసినా కూడ, 6 రోజుల్లో మన తెలుగు సంవత్సరాల పేర్లన్నీ తెలిసిపోతాయి. అంటే కనీసం ఒక వారం కూడ కాదు. కాబట్టిమనకు సమయం లేదు అనడం అనుచితం కాదు. ఈ సత్యాన్ని పాఠకులు గ్రహించి మన సంస్కృతి, సంస్కారం, సంప్రదాయం, శాస్త్రపఠనంలో అశ్రద్ధ చేయక నాలోని భావాన్ని గ్రహించి ఈ విద్యకు జీవం పోస్తారని ఆశిస్తున్నాను.

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1. | ప్రభవ | 21. | సర్వజిత్తు | 41. | ప్లవంగ |
| 2. | విభవ | 22. | సర్వధారి | 42. | కీలక |
| 3. | శుక్ల | 23. | విరోధి | 43. | సౌమ్య |
| 4. | ప్రమోదూత | 24. | వికృతి | 44. | సాధారణ |
| 5. | ప్రజోత్పత్తి | 25. | ఖర | 45. | విరోధికృతు |
| 6. | ఆంగీరస | 26. | నందన | 46. | పరిధారి |
| 7. | శ్రీముఖ | 27. | విజయ | 47. | ప్రమోదీచ |
| 8. | భావ | 28. | జయ | 48. | ఆనంద |
| 9. | యువ | 29. | మన్మథ | 49. | రాక్షస |
| 10. | ధాత | 30. | దుర్ముఖి | 50. | నవ |
| 11. | ఈశ్వర | 31. | హేవళంబి | 51. | పింగళ |
| 12. | బహుధాన్య | 32. | విళంబి | 52. | కాళయుక్తి |
| 13. | ప్రమోది | 33. | వికారి | 53. | సిద్ధార్థి |
| 14. | విక్రమ | 34. | శార్వరి | 54. | రౌద్రి |
| 15. | వృష | 35. | ప్లవ | 55. | దుర్మతి |
| 16. | చిత్రభాను | 36. | శుభకృతు | 56. | దుందుభి |
| 17. | స్వభాను | 37. | శోభకృతు | 57. | రుదిరోద్గారి |
| 18. | తారణ | 38. | క్రోధి | 58. | రక్తాక్షి |
| 19. | పార్థివ | 39. | విశ్వాసము | 59. | క్రోధన |
| 20. | వ్యయ | 40. | పరాభవ | 60. | అక్షయ |

ఈ పైన చెప్పిన సంవత్సరముల నామములలో ఎంతో విశేషముంది. ఈ నామములలో కొన్ని ఋషుల పేర్లు, కొన్ని వత్సర ప్రతిఫలం సూచించే పేర్లు మరియు దైవగణ సంభావిత గురువుల పేర్లు ఉన్నాయి. అందువల్ల గ్రహస్తోత్రము చేసినట్లే. ఈ సంవత్సరముల పేర్లు సూర్యోదయ కాలంలో ప్రతినిత్యం జపిస్తే విశేషమైనటువంటి సత్ఫలితాలు కలుగుతాయి. ప్రత్యానుకూలమైన గ్రహములు మనకు వ్యతిరేక

ఫలితములు ఇస్తున్నప్పుడు, వాటిని జపించి, పాప ఫల ఉధృతాన్ని ఎలా తగ్గించు కుంటామో, అలాగే వ్యతిరేక మరియు దుష్ట ఫలితములు వచ్చే సంవత్సరములలో మనకు వత్సర నామజపం వల్ల పాపఫలితాలు, దుష్ఫలితాలు తగ్గి మనం అశాంతికి దూరంగా ఉంటాము. ఇది ముమ్మాటికి నిజం.

ఒక సంవత్సరం అంటే 12 మాసములు. ఈ 12 మాసములను మళ్ళీ 2 భాగములుగా విభజించారు. ఈ విభజనలో ప్రత్యేకత ఏమంటే, భూమి తన చుట్టూ తాను తిరుగుతున్నప్పుడు మరియు సూర్యుని చుట్టూ గూడా తిరుగుతుంది. ఈ భూభ్రమణంలో ఎడమ ప్రక్కనున్న భాగము కుడిప్రక్కకు, కుడి ప్రక్కనున్న భాగము ఎడమ ప్రక్కకు సహజంగా వస్తుంది. అంటే ఉదాహరణకు కుండలు చేసే కుమ్మరి చక్రం తిప్పుతున్నప్పుడు ఆ భ్రమణంలో అతని ఎడమ ప్రక్కనున్న భాగం కుడివైపు కొస్తుంది. అలానే సహజంగా అతని కుడివైపునున్న భాగం ఎడమవైపుకొస్తుంది. కానీ కుమ్మరి కదలకుండా నిశ్చలంగానే ఉంటాడు. ఈ తిరగడం వల్లన ఆ వేగ ప్రాముఖ్యానికి సూర్యుడు 6 మాసములు తూర్పు నుండి పశ్చిమానికి దక్షిణపధంగా పయనిస్తున్నట్లు కనిపిస్తుంది. అలాగే రెండవ భాగమైన 6 మాసములో సూర్యుడు తూర్పు దిక్కునుండి పశ్చిమానికి ఉత్తర దిక్కుగా పయనిస్తున్నట్లు కనిపిస్తుంది. ఈ వత్సర విభజనకు అయనములు అని పేరు పెట్టారు. సూర్యుడు ఉత్తర దిక్కు నుండి పశ్చిమానికి పయనిస్తున్నట్లు కనిపించినప్పుడు ఉత్తరాయణమని, దక్షిణ దిక్కు నుండి పశ్చిమానికి పయనిస్తున్నట్లు కనిపించినప్పుడు దక్షిణాయనమని పిలుస్తారు. అంటే భూమిని 2 భాగాలుగా గుర్తించారు. ఒక్కటి ఉత్తర ధృవం. రెండు దక్షిణ ధృవం. సూర్యుడు మకర రాశిలో ప్రవేశించి మిధునంలో ఆఖరి భాగంలో ఉండే కాలం వరకు ఉత్తరాయణం అంటారు. అలాగే సూర్యుడు మిధునరాశి మంచి మకరరాశిలో ప్రవేశించే వరకు ఉన్న మధ్య కాలాన్ని దక్షిణాయనం అంటారు. ఈ ఉత్తరాయణం, దక్షిణాయణం మనం పరిశీలిస్తే వాతావరణ మార్పులు, ఋతువుల కాల గమనం మనకు స్పష్టంగా తెలుస్తుంది. మహా భారత యుద్ధంలో భీష్మ పితామహుడు అంపశయ్య మీద పరుండి, ఉత్తరాయణ పుణ్యకాలం వచ్చేవరకు ఆగి, అంటే సూర్యుడు మకర రాశిలో ప్రవేశించిన తదుపరి తుది శ్వాస విడుస్తాడు. అలాగే కాశీఖండంలో

భీష్మాచార్యులువారు ఉత్తరాయణ పుణ్యకాలం గురించి వివరంగా చెప్పారు. పాండవుల అజ్ఞాత వాసం ముగించిన పిమ్మట ఉత్తర గోగ్రహణంలో కౌరవుల మీద తొలి జయం పొందుతారు. అందుకనే సూర్యుడు మకరరాశిలో ప్రవేశించిన కాలాన్ని అత్యంత పుణ్యకాలంగా భావించి మనం సంక్రాంతి పండుగ చేసుకుంటాము. అందువల్లే మకర సంక్రాంతి అంటాము.

సూర్యుడు ఒక రాశి నుండి మరో రాశిలో ప్రవేశించే కాలాన్ని సంక్రమణం అంటాము. ప్రతి మాసములోనూ సూర్యుడు సంక్రమణం చేస్తాడు. అందుకనే మన పంచాంగాలలో మాస సంక్రమణం అని ఇస్తారు. ఇంతవరకు మనం సంవత్సరముల గురించి, అయనములగురించి, సూర్య సంక్రమణం గురించి తెలుసుకున్నాము. ఇప్పుడు మనం మాసములగురించి చర్చించు కుందాము. ప్రతి సంవత్సరానికి 12 మాసములని చెప్పుకున్నాం. ఈ 12 మాసములు 3 విధములుగా అమలులో ఉన్నాయి. 1. చాంద్రమాసము 2. సూర్య మాసము. 3. ఆంగ్ల మాసములు.

భారతావనిలో ఆంగ్లేయుల పరిపాలన వల్ల ఆంగ్ల మాసములు ఎక్కువ వాడుకలో నున్నవి. అలా ఉన్నా మనం మన సంప్రదాయ మాసముల గురించి తెలుసుకొనుటకు కూడా ఆవశ్యకత ఉంది.

**చాంద్రమాసం :-** అంటే పౌర్ణమినాడు చంద్రుడు ఏ నక్షత్రంలో ఉంటాడో ఆ నక్షత్రం పేరుతో ఆ నెలను పిలుస్తారు. ఇది ఆంధ్ర దేశమునందు చాల ప్రాముఖ్యత సంతరించుకున్నది. చంద్రుడు పౌర్ణమి నుండి పౌర్ణమికి నక్షత్రము మారినప్పుడల్లా ఆ మాసము పేరు కూడా మారుతుంది. ఉదాహరణకు చంద్రుడు జ్యేష్ఠా నక్షత్రములో ఉంటే జ్యేష్ఠ మాసమని, మఖ నక్షత్రములో ఉంటే మాఘమాసమని అంటాము. అంటే 12 మాసాలకు 12 పేర్లు ఇవ్వబడ్డాయి. అవి ఈ క్రింద ఇస్తున్నాను.

1. చంద్రుడు చిత్తా నక్షత్రంలో ఉంటే “చైత్రమాసము”
2. చంద్రుడు విశాఖ నక్షత్రంలో ఉంటే “వైశాఖ మాసము”
3. చంద్రుడు జ్యేష్ఠా నక్షత్రంలో ఉంటే “జ్యేష్ఠ మాసము”
4. చంద్రుడు పూర్వ/ఉత్తరాషాఢ నక్షత్రంలో ఉంటే “ఆషాఢ మాసము”

5. చంద్రుడు శ్రవణం నక్షత్రంలో ఉంటే "శ్రావణ మాసము"
6. చంద్రుడు పూర్వ/ఉత్తరాభాద్ర నక్షత్రంలో ఉంటే "భాద్రపద మాసము"
7. చంద్రుడు అశ్విని నక్షత్రంలో ఉంటే "అశ్వయుజ మాసము"
8. చంద్రుడు కృత్తికా నక్షత్రంలో ఉంటే "కార్తీక మాసము"
9. చంద్రుడు మృగశిర నక్షత్రంలో ఉంటే "మార్గశిర మాసము"
10. చంద్రుడు పుష్యమి నక్షత్రంలో ఉంటే "పుష్య మాసము"
11. చంద్రుడు మఖ నక్షత్రంలో ఉంటే "మాఘ మాసము"
12. ఆఖరుగా ఫాల్గుణ మాసము అంటారు.

ఇలాగ నక్షత్ర రీత్యా చంద్రుని యొక్క నివాస ప్రాముఖ్యాన్ని బట్టి ఆ నక్షత్రానికి విలువ ఇచ్చి ఆ మాసానికి నక్షత్రం పేరు నిర్ణయించడం ఎంతో విజ్ఞానంతో కూడిన ప్రక్రియ అని వేరే చెప్పనక్కరలేదు.

**సూర్య మాసం :-** సూర్యుడు ప్రతిరాశిలోనూ 30 రోజులు ఉంటాడు. ఒక రాశి నుండి మరొక రాశిలోనికి ప్రవేశించడానికి పట్టే కాలము 30 రోజులు- అంటే 1 మాసం అవుతుంది. అలా సూర్యుడు ఒక రాశిలో ఒక మాసం ఉన్నప్పుడు ఆ రాశి పేరుతో ఆ మాసాన్ని పిలుస్తారు. అంటే మేషంలో ఉన్నప్పుడు మేష మాసమని, వృషభంలో ఉన్నప్పుడు వృషభ మాసమని, అలాగే సూర్యుడు ఏ రాశిలో ఉన్నా, ఆ రాశిలో సూర్యుడు ఉండే కాలాన్ని ఆ పేరుతో పిలుస్తారు. అలాగే 12 రాశులకు 12 మాసాలుగా ఉంటాయి. సూర్య సంచార చక్ర భ్రమణంలో 12 రాశులు పూర్తయిన పిమ్మట 12 మాసములు అయిపోయాయి కాబట్టి 1 సంవత్సరం అయిపోయినట్లు లెక్కిస్తారు. ఈ పద్ధతి ఉత్తర హిందూస్థాన్‌లోనూ, దక్షిణ ప్రాంతంలో తమిళనాడులోనూ ప్రాచుర్యం పొందింది.

**ఇక ఆంగ్ల మాసములు :-** ప్రపంచంలో దాదాపుగా అన్ని దేశములు ఆంగ్ల మాస పద్ధతే పాటిస్తున్నాయి. ఈ ఆంగ్ల పేర్లు ఇక్కడ ఇవ్వనవసరం లేదు. ఎందుకంటే జనవరి నుంచి, డిసెంబర్ దాక ప్రతిమాసం పేరు ప్రతి ఒక్కరికీ తెలుసు. ఈ ఆంగ్ల మాసములు కూడ వ్యక్తుల పేర్ల మీద కూడుకున్నవి. ఉదాహరణకు గ్రీకు వీరుడయిన

ఆగష్టస్ పేరు మీద ఆగష్టు అని వచ్చింది. అలాగే మిగిలిన పేర్లు కూడ ఏర్పడ్డాయి.

ఇప్పుడు మీకు మాసములు ఎట్లా ఏర్పడ్డాయో వాటిని ఎలా అనుసరిస్తున్నారో తెలుసుకున్నారు. ఇక ఋతువుల గురించి తెలుసుకుందాం.

ప్రతి రెండు చంద్ర మాసములకు ఒక ఋతువు ఏర్పడుతుంది. అంటే ప్రతి ఋతువు చంద్రాధిపత్యంలో 2 మాసములు ఉంటాయి. ఇలాగ ఒక సంవత్సరములో 6 ఋతువులు ఏర్పడతాయి. చంద్రుడు పౌర్ణమినాడు ఏ నక్షత్రంలో ఉంటాడో ఆ నక్షత్రం పేరుతో ఆమాసం పిలువబడుతుందని మనం చదువుకున్నాం. ఇప్పుడు చంద్రుడు రెండు మాసముల కొకసారి ఋతువుల మార్పు తెస్తాడని మనం గ్రహించాలి. మొదలగు చైత్ర వైశాఖమాసాలలో చంద్రుడు ఉన్నప్పుడు ఆ రెండు మాసములను కలిపి"వసంత ఋతువు" అంటారు. జ్యేష్ఠ,ఆషాఢ మాసము లలో చంద్రుడు ఉన్నప్పుడు ఆ రెండు మాసములను కలిపి "గ్రీష్మ ఋతువు"అంటారు. శ్రావణ, భాద్రపద మాసములలో చంద్రుడు ఉన్నప్పుడు ఆ రెండు మాసములను కలిసి "వర్ష ఋతువు" అంటారు. ఆశ్వయుజ, కార్తీక మాసములలోచంద్రుడు ఉన్నప్పుడు "శరత్ ఋతువు" అంటారు. మరియు మార్గశిర, పుష్య మాసములలో చంద్రుడుఉన్నప్పుడు "హేమంత ఋతువు" అంటారు. మాఘ, ఫాల్గుణ మాసములలో చంద్రుడు ఉన్నప్పుడు "శిశిర ఋతువు" అంటారు. అంటే మాసము పేరు తెలియగానే మనకు ఆ ఋతువు పేరు తెలిసిపోతుంది. అలాగే ఆ మాసంలో చంద్రుడు ఏ నక్షత్రంలో ఉన్నాడో కూడ తెలిసి పోతుంది. ఇలా ఋతువులు వాటి శీతల,ఉష్ణ, వర్షా భావములను దృష్టిలో పెట్టుకిని మన పూర్వులు ఈ ఋతువుల పేర్లను క్రమబద్ధీ కరించారు. అందువల్ల వాతావరణము లోని మార్పును బట్టి విద్యలేని పామఋలు కూడాఅది ఏ మాసమో తెలుసుకొని తదనుగుణంగా పాడిపంటలు సాగు చేయటంఅనే ప్రక్రియ మనంచూస్తూనే ఉన్నాము.

హిందూ కాలమానము ప్రపంచంలో సరియైన నాగరికత ఏర్పడకముందే మన మహా ఋషులు కాలగణనం చేయటంలో అత్యంత విజ్ఞానమును సముపార్జించి, ఆ కాల గమనాన్ని ఎలా కొలవాలో ముందు తరాల వారికి ఒక నిర్దిష్టమైన కాల పట్టిక నిర్దేశించారు. అన్ని దేశాలలో సంవత్సరం, ఆ పైన100 సంవత్సరముల

వరకే గుణిస్తారు. అలాగ సెంచురి 100 సంవత్సరాలని లిఖిస్తారు. ఎన్ని వందల సంవత్సరాలతే అన్ని వందల సంవత్సరాలు కలుపుకుంటూ పోయి, మిగిలిన భాగంలో ఎన్ని సంవత్సరాలో అవి కూడ లిఖిస్తారు. ఉదాహరణకు ఈ గణితం క్రీస్తు పుట్టిన తేదీ నుండి ప్రారంభం అయింది. అంతేగాని వేల సంవత్సరాలు క్రమబద్ధీకరణ చేసి లిఖించడం అనేది ఇప్పటికి కూడ తెలియదు. ఉదాహరణకు క్రీస్తు పుట్టిన తరువాత నుండి సంవత్సరాలన్నీ లిఖిస్తే ఇప్పటికి దాదాపుగా 2012 సంవత్సరా లని వ్రాస్తారు. అలా 2013, 2014, 2015... ఇలా వ్రాసుకుంటూ వెళ్ళి, 2099 తరువాత 3000, 3001, 3002... అలాగే వ్రాసుకుంటూ వెళతారు. ఇలా వ్రాసుకుంటూ వెళ్ళడంవల్ల భవిష్యత్తులో అంతం అనేది ఎక్కడా ఉండదు. ఒకవేళ ఉన్నా ఈ అంకెను సంవత్సరము లలో కొలవడానికి లక్షలు, కోట్లు వ్రాయవలసి వస్తుంది. ఎందుకంటే దీనికి ప్రత్యామ్నాయం లేదు. ఒక మన హైందవ పద్ధతిలో కాల వేగాన్ని ఒక పరిమితిలో నిర్దేశించారు. అలా నిర్దేశించడం వల్ల మనకు ఖచ్చితంగా కాల గమనాన్ని ఊహించ వచ్చు. ఉదాహరణకు జనవరితో ప్రారంభమైన మాసం డిసెంబర్‌తో అంతమౌతుంది. అప్పుడు మళ్ళీ మాసం జనవరితోనే ప్రారంభం అవుతుంది. అలాగే కొన్ని వేల సంవత్సరాలు అయిన తరువాత కూడ హైందవ పద్ధతిలో ఎన్ని సంవత్సరాలు గడిచి పోయాయో స్పష్టంగా తెలియవస్తుంది. అంటే రోజులు, వారాలు, నెలలు ఎలా లెక్కపెడతామో అలాగే సంవత్సరాలు కూడ మనము లెక్క పెట్టగలము. అంటే సంవత్సరాలకు కూడ పరిమితి అనేది మన పూర్వులు వేలసంవత్సరాలుక్రితమే నిర్ణయించారు. అందువల్ల ఈ సంవత్సరాలు ఒరవడికి నిర్ణీతకాలం నిర్దేశంచడానికి సంవత్సరాలను 4 యుగాలుగా విభజించారు. వాటి పేర్లు ఇప్పుడు తెలుసుకుందాం.


1.కృతయుగం – ఈ కృతయుగంలో17, 28,000 సంవత్సరాలు ఉంటాయి. అంటే కృత యుగం అయిపోయిందంటే ఆదిమానవుడు జన్మించిన కాలం నుంచి 17,28,000 సంవత్సరాలు పూర్తయినట్లు మనం గ్రహించాలి. తరువాత రెండవ యుగం ప్రారంభం అవుతుంది. ఈ రెండవ యుగం పేరే త్రేతాయుగం అంటారు. అంటే ఈ రెండవ యుగములోని 12,96,000 సంవత్సరములు ఉంటాయి. ఈ త్రేతాయుగములోని 12,96,000 సంవత్సరములు కూడా గడిచిపోయాయి. అలాగే మూడవ యుగాన్ని

ద్వాపర యుగము అని అంటాము. ఈ ద్వాపర యుగములో 8,64,000 సంవత్సరాలు ఉంటాయి. ఇవి కూడ కాలగర్భంలో కలిసిపోయాయి. ఆ తరువాత ఆఖరి యుగాన్ని కలియుగంఅంటారు. ఈ కలియుగంలో4,32,000 సంవత్సరాలు ఉంటాయి. ఇప్పుడు 4యుగాల మొత్తం4320000 సంవత్సరాలుగా సంవత్సరాలు కొలవవచ్చు. ఆ తరువాత 4320000 సంవత్సరాల గడిచాక మళ్ళీ నవయుగ ప్రారంభం అవుతుంది. అంటే మళ్ళీ కృతయుగం, త్రేతాయుగం, ద్వాపర యుగం, కలియుగం ఇలా కాలగమనం సాగిపోతూనే ఉంటుంది. మీరు పరిశీలించ వలసినది ఏమంటే మొదటి యుగంలో ఉన్నన్ని సంవత్సరాలు రెండవ యుగంలో లేవు. అలాగే రెండవ యుగంలో ఉన్నన్ని సంవత్సరాలు మూడవ యుగంలో లేవు. అలాగే మూడవ యుగంలో ఉన్న సంవత్సరాల కంటే నాలుగవ యుగంలో ఉన్న సంవత్సరాలు తక్కువ. దీని ప్రకారం చరిత్రలో అత్యంత ముఖ్యమయిన ఘట్టాలను ఖచ్చితంగా ఎప్పుడు జరిగిందో చెప్పగలము. అంటే శ్రీకృష్ణుని జన్మగాని, లేక మహా భారత యుద్ధంగాని మనం స్పష్టంగా తెలుసుకోవచ్చు. ఇంకొక విషయమేమంటే ఈ మొత్తం సంవత్సరాల పరిమితిని కల్పం అంటారు. ఇలాగ మనం సంవత్సరాలను కొలవవచ్చు. ఎన్ని కల్పాలో కూడా తెలుసుకోవచ్చు. ఇది ప్రపంచంలోనే మహాద్భుత కాలగణ కొలమానం మన పూర్వులు చేయగలిగారు ఈ శాస్త్రం మూఢమా? మీరే ఆలోచించండి.

నక్షత్రాలు – అంతరిక్షంలో అనేక వేల నక్షత్రములు మనకు కనపడుతున్నప్పుడు, మన శాస్త్రజ్ఞులు నక్షత్రములు 27 అని ఎందుకు చెపుతారో అనే మీమాంశ ప్రతివారికి కలుగుతూనే ఉంటుంది. నాకు తెలిసిన ఎంతో మంది విద్యాధికులు కూడ ఈ ప్రశ్న వేయటం జరిగింది. అంతరిక్షంలో మొత్తం భాగాన్ని 12 భాగాలుగా విభజించారు. అలా విభజించినపుడు కొన్ని నక్షత్రాలు మొదటి విభజనలోనూ, మరికొన్ని నక్షత్రాలు రెండవ విభజనలోనూ అలా 12 భాగాల్లో నక్షత్రాలు ఇమిడిపోయాయి. మనం భూమి మీద నుంచి అంతరిక్షంలోని నక్షత్ర సముదాయాన్ని పరిశీలించినప్పుడు ఒక సముదాయం ఒక్కొక్క ఆకృతిలో కనపడుతుంది. ఏ ఆకృతిలో నక్షత్ర సముదాయం కనపడుతుందో ఆ ఆకృతి గల నక్షత్ర సముదాయానికి మహా విజ్ఞాని, ఖగోళ శాస్త్ర ప్రముఖుడు, భూత, భవిష్యత్, వర్తమాన కాలములను పొల్లు పోకుండా చెప్పగలిగిన

శాస్త్రకారుడు అయిన వరరుచి ఈ నక్షత్ర సముదాయాలన్నింటికి మనం భూమి మీద నుంచి చూసినప్పుడు ఎలా కనపడుతున్నాయో వాటి వాటి ఆకారాలను బట్టి ఆ నామకరణం చేసాడు. అలా చేసిన అంతరిక్షంలోని దృశ్య భాగాన్ని మనం చూస్తున్న 12 భాగాలకు 12 రాశులు అని పేర్కొన్నాడు. అంటే మేష ఆకారంలో ఉన్న నక్షత్రాలన్నింటిని కలిపి మేషరాశి అని పేర్కొన్నాడు. ఇలా మేష ఆకృతిలో అనేక వేల నక్షత్రాలున్నప్పటికీ ముఖ్యమయిన అతి ప్రాముఖ్యం సంతరించుకున్న నక్షత్రాలను గుర్తించి ఆ ప్రాముఖ్యమయిన నక్షత్రాలకు కూడ నామకరణం చేశాడు. అలా ప్రతీ రాశిలో 3 నక్షత్రాలు ఉండేటట్లు ప్రతిరాశిలోనూ ప్రాముఖ్యమయిన నక్షత్రాలను గుర్తించాడు. అలా గుర్తించిన తరువాత వాటి ఆకారము ననుసరించి ప్రతిరాశికీ ఒక నామకరణం చేశాడు. మనం ఇప్పుడు ఆ రాశుల పేర్లు మరియు వరరుచి చేసిన నక్షత్రాలు ఏ రాశిలో ఉంటాయో నేర్చుకుందాం. ఇంకా వివరంగా చెప్పాలంటే మహాత్మాగాంధీ ఆదేశానుసారం అనేక వేల మంది మన స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నా, అందరి పేర్లు మనం చెప్పము. కానీ అతి ప్రాముఖ్యమయిన స్వాతంత్ర్య యోధుల పేర్లు మాత్రమే చెపుతాము. ఉదాహరణకు జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్, డా॥ రాజేంద్రప్రసాద్ మొదలయినవారు. అలాగే నక్షత్ర సముదాయంలో గొప్ప నక్షత్రాలను గుర్తించి వాటి విలువలను, మరియు ఆ నక్షత్రాలు చేయు శుభాశుభాలను వరరుచి విశ్లేషించాడు. ఇప్పుడు ఈ క్రింది చక్రం చూడండి.

| | | | |
|---|---|---|---|
| మీనం<br>గురువు | మేషం<br>కుజుడు | వృషభం<br>శుక్రుడు | మిధునం<br>బుధుడు |
| కుంభం<br>శని | **సవ్య చక్రం రాశులు వాటి అధిపతులు** | | కర్కాటకం<br>చంద్రుడు |
| మకరం<br>శని | | | సింహం<br>సూర్యుడు |
| ధనుస్సు<br>గురువు | వృశ్చికం<br>కుజుడు | తుల<br>శుక్రుడు | కన్య<br>బుధుడు |




ఈ పై చక్రంలో 12 భాగాలను 12 రాశులు అంటారు. ఒకొక్క రాశిలోనూ 3 ప్రాముఖ్య నక్షత్రములు ఉంటాయి. ఆ రాశికి ఉన్న అధిపతి పేరు మరియు ఆ రాశి పేరు కూడా ఇచ్చాను. గడిలో పైన ఉన్నది రాశి పేరు క్రింద ఉన్నది ఆ రాశి అధిపతి పేరు అని మీరు గ్రహించాలి.


మొదటిరాశి మేషంగానూ, రెండవ రాశి వృషభంగానూ, అలా అన్ని రాశులకు అధిపతులు ఉన్న ఒక్కొక్క రాశిలో 3 నక్షత్రాలు చొప్పున మరియు ఒక్కొక్క నక్షత్రానికి 4 పాదాలు చొప్పున విభజించారు. కానీ ఒక్కొక్క రాశిలో 3 నక్షత్రాలు ఉన్నా వాటి పాదాలు 9ని మించకుండా ఉండేటట్లు నిర్దేశించాడు. ఎందుకంటే ఖగోళమంతా పరిశీలిస్తే వరరుచి ఆ ఖగోళాన్ని 360 డిగ్రీలుగా నిర్ణయించాడు. ఒక్కొక్క నక్షత్రానికి 4 పాదములు చొప్పున 27 నక్షత్రాలకు 27×4=108 పాదములు 12 రాశులలో ఉండేటట్లుగా నియమము. దీని వల్ల ఒక రాశిలో 9 పాదముల అంటే 30 డిగ్రీలు అని మనకు అర్థమవుతుంది. ఎందుకంటే ఒక నక్షత్రములోని పాద ప్రమాణం 30/9=3 డిగ్రీల 20 నిమిషములు ప్రమాణం కలిగి ఉంటుంది. ఉదాహరణకు మేషరాశిలో అశ్విని 4 పాదాలు, భరణి 4 పాదాలు, కృత్తిక 1 పాదం ఉంటాయి. ఈ నక్షత్ర పాదాలన్నీ కూడితే 4+4+1=9 పాదాలు వస్తాయి. అలాగే రెండవ రాశి వృషభరాశిలో మేషంలో ఆఖరి నక్షత్రమయిన కృత్తిక నక్షత్రంలో ఒక పాదమే తీసుకున్నాము కాబట్టి మిగిలిన 3 పాదాలు వృషభరాశిలో కృత్తిక మొదటి నక్షత్రంగా తీసుకొని ఆ రాశిలో కృత్తిక నక్షత్రంలోని మిగిలిన 3 పాదాలు చూపాలి. ఇలా 12 రాశుల్లోనూ 27 నక్షత్రములను, ఒక రాశిలో 9పాదములు మించకుండా మిగిలిన పాదాలను ప్రక్కరాశిలో వేసుకుంటూ వెళ్ళాలి. ఇలా వేసినందువల్ల మీకు రాశి అధిపతి, రాశిపేరు, నక్షత్ర విభజన మరియు వాటి పాదముల సంఖ్య తెలుస్తాయి. మీ సౌలభ్యం కోసం ఈ క్రింద ఒక చక్రం వేసి పై విషయాన్ని మీకు సులభంగా అవగాహన కలిగేందుకు ఇస్తున్నాను. మీరు జాగ్రత్తగా పరిశీలిస్తే చక్రం మీ మనోఫలకం మీద ఉండిపోవాలి. ఇది చాల ముఖ్యం. కాబట్టి ఈ చక్రాన్ని ఔత్సాహికులందరూ విధిగా నేర్చుకోవాలి అని నొక్కి వక్కాణిస్తున్నాను.


| | | | |
|---|---|---|---|
| **మీనం**<br>పూర్వాభాద్ర - 4వ పాదం<br>ఉత్తరాభాద్ర - 1,2,3,4 పాదాలు<br>రేవతి - 1,2,3,4 పాదాలు | **మేషం**<br>అశ్వని 1-2-3-4<br>భరణి 1-2-3-4<br>కృత్తిక 1 | **వృషభం**<br>కృత్తిక 2-3-4<br>రోహిణి 1-2-3-4<br>మృగశిర 1-2 | **మిథునం**<br>మృగశిర 3-4<br>ఆరుద్ర 1-2-3-4<br>పునర్వసు 1-2-3 |
| **కుంభం**<br>ధనిష్ట 3-4<br>శతభిషం 1-2-3-4<br>పూర్వాభాద్ర 1-2-3 | **చక్రం - 1**<br>**"సవ్య చక్రం"** | | **కర్కాటకం**<br>పునర్వసు 4<br>పుష్యమి 1-2-3-4<br>ఆశ్లేష 1-2-3-4 |
| **మకరం**<br>ఉత్తరాషాఢ 2-3-4<br>శ్రవణం 1-2-3-4<br>ధనిష్ట 1-2 | **రాశులలో ఉండే నక్షత్రాలు వాటి పాద విభజన** | | **సింహం**<br>మఖ 1-2-3-4<br>పుబ్బ 1-2-3-4<br>ఉత్తర 1 |
| **ధనస్సు**<br>మూల 1-2-3-4<br>పూర్వాషాఢ 1-2-3-4<br>ఉత్తరాషాఢ 1 | **వృశ్చికం**<br>విశాఖ 4<br>అనూరాధ 1-2-3-4<br>జ్యేష్ఠ 1-2-3-4 | **తుల**<br>చిత్త 3-4<br>స్వాతి 1-2-3-4<br>విశాఖ 1-2-3 | **కన్య**<br>ఉత్తర 2-3-4<br>హస్త 1-2-3-4<br>చిత్త 1-2 |


| | | |
|---|---|---|
| **వృషభం**<br>కృత్తిక 2-3-4<br>రోహిణి 1-2-3-4<br>మృగశిర 1-2<br>**2**<br>**మిథునం**<br>మృగశిర 3-4<br>ఆరుద్ర 1-2-3-4<br>పునర్వసు 1-2-3<br>**3** | **మేషం**<br>అశ్వని 1-2-3-4<br>భరణి 1-2-3-4<br>కృత్తిక 1<br>**1** | **మీనం**<br>పూర్వాభాద్ర-4వ పా<br>ఉత్తరాభాద్ర-1,2,3,4<br>రేవతి-1,2,3,4 పా<br>**12**<br>**కుంభం**<br>ధనిష్ట 3-4<br>శతభిషం 1-2-3-4<br>పూర్వాభాద్ర 1-2-3<br>**11** |
| **కర్కాటకం**<br>పునర్వసు 4<br>పుష్యమి1-2-3-4<br>ఆశ్లేష 1-2-3-4<br>**4** | **చక్రం - 2**<br>**"అపసవ్యం"**<br>**రాశులలో ఉండే నక్షత్రాలు వాటి పాద విభజన** | **మకరం**<br>ఉత్తరాషాఢ 2-3-4<br>శ్రవణం1-2-3-4<br>ధనిష్ట 1-2<br>**10** |
| **సింహం**<br>మఖ 1-2-3-4<br>పుబ్బ 1-2-3-4<br>ఉత్తర 1<br>**5**<br>**కన్య**<br>ఉత్తర 2-3-4<br>హస్త 1-2-3-4<br>చిత్త 1-2<br>**6** | **తుల**<br>చిత్త 3-4<br>స్వాతి 1-2-3-4<br>విశాఖ 1-2-3<br>**7** | **ధనుస్సు**<br>మూల1-2-3-4<br>పూర్వాషాఢ 1-2-3-4<br>ఉత్తరాషాఢ 1<br>**9**<br>**వృశ్చికం**<br>విశాఖ 4<br>అనూరాధ1-2-3-4<br>జ్యేష్ఠ 1-2-3-4<br>**8** |


ప్రతి నక్షత్ర ప్రమాణం 13 డిగ్రీల 20 నిమిషములుగా ఉంటుంది. అంటే ఆ నక్షత్రంలో 13 డిగ్రీల 20 నిమిషములు 4 భాగాలుగా విభజింపబడతాయి. ఏ నక్షత్రములో అయినా సరే మొదటి పాదానికి 3 డిగ్రీల 20 నిమిషములు, రెండవ పాదం వరకు 6 డిగ్రీల 40 నిమిషములు, మూడవ పాదం వరకు 10 డిగ్రీలు, నాలుగవ పాదం వరకు 13 డిగ్రీల 20 నిమిషములు ఉంటాయి. అంటే ప్రతి పాదానికి 3 డిగ్రీల 20 నిమిషములు అని మనం తెలుసుకోవచ్చు. మనకున్న 12 రాశులను వివిధ రకములుగా ఒక సక్రమమైన పద్ధతిలో నిర్వచించారు. ఆ నిర్వచనం వల్ల ప్రతీరాశి యొక్క స్వభావం మనం గ్రహించవచ్చు. రాశి స్వభావం మనకు తెలిసినందువల్ల ఆ రాశి తనలో ఉన్న ఏ గ్రహానికి ఎంత ఫలితాన్ని ఇచ్చేందుకు సహకరిస్తుందో తెలుస్తుంది.ముందు ముందు అధ్యాయాలలో భవిష్యత్తు ఎలా చెప్పాలో నేర్చుకునేటప్పుడు మీకు ఈ రాశి స్వభావాల గురించి వివరంగా విశదమవుతుంది. ఇప్పుడు స్థూలంగా కొన్ని వివరాలు తెలుసుకుందాము. ఈ పన్నెండు రాశుల్లో 6 రాశులు బేసి రాశులు లేక ఓజ రాశులు అంటారు. ఈ బేసి రాశుల పేర్లు మేషం, మిథునం, సింహం,తుల,ధనస్సు, కుంభం, ఇవి పురుష రాశులుగా మనం గుర్తించాలి. మిగిలిన 6 రాశులలో వృషభం, కర్కాటకం, కన్య, వృశ్చికం, మకరం, మీనం వీటిని సరి రాశులు అంటారు లేక యుగ్మ రాశులు అంటారు. ఈ పైన చెప్పిన ఓజరాశులు మరియు యుగ్మరాశులను వాటిస్వభావాలను బట్టిమళ్లీ రెండుభాగాలుగా విభజించారు. అవి బేసి రాశులన్నియు పురుష జాతికి సంబంధించిన రాశులని మరియు యుగ్మరాశులను స్త్రీ జాతికి సంబంధించినవనియు నిర్ణయించారు. ఇప్పటి వరకు మనంఏరాశి అంటే ఏమిటో,ఆ రాశికి అధిపతులెవ్వరో మరియుఏరాశిలో ఏ నక్షత్రాలు ఉంటాయో మరియు స్త్రీ,పురుష రాశులేవో తెలుసు కున్నాం. మనం ఈ రాశుల గురించి ఇంకా కొంచెం వివరంగా తెలుసుకోవాలి. ఈ రాశులను కొన్నింటిని అగ్ని తత్వ రాశులని, మరికొన్నింటిని భూ తత్వరాశులని, మరికొన్నింటిని వాయు తత్వరాశు లని, మరియు కొన్నింటిని జలతత్వరాశులని పేర్కొన్నారు. అంటే అగ్ని, భూమి, వాయువు, జల తత్వములను ఆ రాశులకు ఆపాదించారు. అంటే పంచభూతా లలోని తత్వములను కూడా మనం గ్రహించి ఫలితములు చెప్పగలమని రూఢి అవుతోంది. ఈ 12 రాశులలోని రాశి తత్వాలను తెలుసుకుందాం.



మేషం
సవ్య చక్రం
అగ్ని తత్వ
రాశులు
సింహం
ధనస్సు



మేషం
అపసవ్య
చక్రం
సింహం
ధనస్సు



వృషభం
సవ్య చక్రం
భూతత్వ
రాశులు
మకరం
కన్య


వృషభం
అపసవ్య
చక్రం
మకరం
కన్య


మిధునం
కుంభం
సవ్య చక్రం
వాయుతత్వ
రాశులు
తుల



మిధునం
కుంభం
అపసవ్య
చక్రం
తుల



మీనం
సవ్య చక్రం
కర్కాటకం
జల తత్వ
రాశులు
వృశ్చికం



మీనం
కర్కాటకం
అపసవ్య
చక్రం
కర్కాటకం


1. మేషం, సింహం, ధనస్సు ఈ మూడు అగ్ని తత్వ రాశులుగా గ్రహించాలి.
2. వృషభం, కన్య, మకరం ఈ మూడు భూ తత్వ రాశులుగా గ్రహించాలి.
3. మిథునం, తుల, కుంభం ఈ మూడు వాయు తత్వ రాశులుగా గ్రహించాలి.

4. ఇక మిగిలిన మూడు రాశుల్లో కర్కాటక రాశి, వృశ్చిక రాశి, మీన రాశి. ఇవి జల తత్వరాశులుగా గ్రహించాలి. ఈ రాశులన్నింటికీ వివిధ లింగ భేదమున్నట్లే వాటి బలాబలాలలో కూడా వైవిధ్యం ఉంటుంది. కొన్ని రాశులు సూర్యాస్తమయిన తరువాత బలం పుంజుకుంటాయి. అంటే రాత్రిపూట ఈ రాశులలో మంచి బలం ఉంటుంది. అలాగే కొన్ని రాశులు సూర్య ప్రకాశం ఉన్నప్పుడు అంటే పగటిపూట మంచి బలంగా ఉంటాయి. రాత్రి పూటబలం గల రాశులు మేషం,వృషభం, మిథునం, కర్కాటకం, ధనస్సు,మకరం.ఇవి రాత్రి పూట చాల బలంగా ఉంటాయి. ఇక సూర్యుడు ప్రకాశిస్తున్న సయమంలోబలంగా ఉండే రాశులు సింహం, కన్య, తుల, వృశ్చికం, కుంభం, మీనం. మీరు గమనించ వలసినదేమి టంటే ఒక గ్రహానికి రెండు రాశుల ఆధిపత్యం ఉన్నాకూడ వాటి బలాబలాలలో రాత్రి, పగలు వల్ల వచ్చిన వైవిధ్యం గమనించాలి. ఎందుకంటే ఈ రాశుల యొక్క తత్వాలుమనం సరిగా అర్థం చేసుకోకపోతే మనం చెప్పే ఫలితాలలో అసందిగ్ధత ఏర్పడవచ్చు. అలా అసందిగ్ధత తటస్థించినపుడు మన శాస్త్ర పరిజ్ఞాన లోపం వల్ల మనం ఊహించిన ఫలితాలే అనుభవం వల్ల మనం ఫలితాలు ఊహించి చెపుతాము. అలా చెప్పకుండా ఉండాలంటే రాశ్య, గుణ, గణ, స్థాన పరిస్థితి తప్పక నేర్చుకోవాలి. ఈ రాశులు 12 మూడు భాగాలుగా విభజించబడ్డాయి. ఈ చక్రాలను గమనించండి.






మొదటిగా పృష్ఠోదయ రాశులు, రెండవది శీర్షోదయ రాశులు మరియు ఆఖరిది ఉభయోదయ రాశులు అంటారు.

పృష్ఠోదయ రాశులలో 1.మేషం 2. వృషభం 3. కర్కాటకం 4. ధనస్సు 5. మకరం. ఈ పంచ రాశులను పృష్ఠోదయ రాశులుగా తెలుసుకోవాలి. శీర్షోదయ రాశులంటే 1. మిథునం 2. సింహం 3.కన్య 4.తుల 5.వృశ్చికం 6.కుంభం ఈ షష్ఠ రాశులను శీర్షోదయ రాశులుగా మనం గ్రహించాలి. ఇక ఆఖరిది ఉభయోదయ రాశి – పైన చెప్పిన పృష్ఠోదయ రాశులు 5, మరియు శీర్షోదయ రాశులు 6 పోగా మిగిలిన రాశి మనం తేలికగా ఊహించవచ్చు. అంటే 12 రాశులలో 11 రాశులు క్రమసంఖ్యలో తెలుసుకున్నప్పుడు ఆ సంఖ్యలో లేని రాశి మీన రాశి కాబట్టి అది ఉభయోదయ రాశి అని మనం తేలికగా గ్రహించాలి. అందువల్ల విడిగా చక్రం వేసి చూపించలేదు.

వీటిలో ఒక్కొక్కరాశి ఒక్కొక్క ఫలితాన్నిస్తుంది. అంటే పృష్ఠోదయ రాశులలో ఉన్న ఏ గ్రహమైనా వాటి ఫలితాలు వాటి సంచారంలో అంత్యదశలో ఇస్తాయి. ఇక శీర్షోదయ రాశుల విషయానికొస్తే ఆ శీర్షోదయ రాశులలో ఉన్నటువంటి గ్రహాలు తన ఆరంభదశలోనే ఫలితం ఇవ్వడం ప్రారంభిస్తాయి. మిగిలినది ఉభయరాశి మీనరాశి. దీనికి అధిపతి గురువు. ఏ గ్రహాలు మీనరాశిలో ఉంటాయో ఆ గ్రహాలన్నీ గురు స్థానములోనూ మరియు గురువు ఆధిపత్యములోను ఉంటాయి కాబట్టి ఆ గురువు ప్రభావము వలన ఆ గ్రహాలు ఉత్తేజింపబడి ఎంత కాలం మీన రాశిలో

ఉంటాయో ఆ సమయం అంతా ఎల్లవేళలా అంటే ఆరంభ, మధ్య లేక అంత్యకాలముల నియమిత పరిమితి లేకుండా ఫలితాలు ఇస్తూనే ఉంటాయి.

రాశులలో అనేక అంశాలు భిన్నభిన్న ప్రవృత్తులు మరియు విభిన్నమైన నైసర్గిక స్థాన దిక్కులు, జాతులు మరియు ఆరోగ్య శబ్ద భేద వర్ణ, నివాస, సంతాన మరియు మిగిలిన మరికొన్ని విశేషాలను మనం ఇక్కడ నేర్చుకుందాం.

మానవులలో ఎలాగైతే లింగ భేదం ఉంటుందో అలాగే గ్రహాలలో కూడా లింగ భేదం ఉంటుంది. అంటే గ్రహాలలో కూడా మానవులలో లాగా స్త్రీ, పురుష భేదం ఉంటుంది అని మనం అర్థం చేసుకోవాలి. ఉన్న 12 రాశులలో అర్ధభాగం అంటే 6 రాశులు స్త్రీ రాశులుగాను మరియు 6 రాశులు పురుష రాశులుగాను విభజింపబడ్డాయి. స్త్రీ రాశులలో వృషభం, కర్కాటకం, కన్య, వృశ్చికం, మకరం మరియు మీనం. ఇవి స్త్రీ రాశులు. అలాగే పురుష రాశులలో మేషం, మిథునం, సింహం, తుల, ధనస్సు మరియు కుంభం. ఇవి పురుష రాశులు. ఇక సంఖ్యా విషయానికి వస్తే సంఖ్యలలో రెండు సంఖ్యలుగా ఉంటాయి అని మనకు తెలుసు. ఒకటి బేసి సంఖ్య మరియొకటి సరిసంఖ్య. అలాగే రాశులలో కూడా బేసి రాశులు మరియు సరి రాశులుగా ఉంటాయి. వృషభం, కర్కాటకం, కన్య, వృశ్చికం, మకరం మరియు మీనం ఇవి సరి రాశులు. అలాగే మేషం, మిథునం, సింహం, తుల, ధనస్సు, కుంభం ఈ 6 రాశులు బేసి రాశులు.

ఇక రాశుల యొక్క భిన్న ప్రవృత్తులను మనం గమనించినట్లయితే మేషం, సింహం, ధనస్సు ఇవి అగ్నితత్వ రాశులుగాను, వృషభం, కన్య, మకరం ఇవి భూ తత్త్వ రాశులగాను, మిథునం, తుల, కుంభం ఇవి వాయు తత్వ రాశులుగాను, మరియు కర్కాటకం, వృశ్చికం, మీనం ఈ రాశులన్నియు జలతత్వరాశులుగాను మనం తెలుసుకోవాలి. వీటిలో అన్ని రాశులలోను జలతత్వ ప్రత్యేకత వరరుచి గమనించి కర్కాటక, మకర, మీన రాశులు ఇవి పూర్ణ జల తత్వ రాశులని, వృషభం, ధనస్సు, కుంభం అర్ధ జల తత్వ రాశులని మరియు మేషయం, వృషభం, తుల పాద జల తత్త్వ రాశులని, మిథునం, సింహం, కన్యారాశులుశూన్య జల తత్వ రాశులని వివరించారు. ఉదాహరణకు మనం ఈ రాశులను పరిశీలించి నట్లయితే కర్కాటకం, మకరం, మీనం ఇవి జలప్రాణులు. అందువల్ల ఈ మూడు రాశులు పూర్ణ జల తత్వ

రాశులుగా నిర్ణయించబడ్డాయి. అలాగే మిగిలిన రాశులు కూడా వాటి జల నిక్షేప ఆధారాలను బట్టి ఆ రాశులకు నామకరణం జరిగింది. మనకు భూమి మీద ప్రతిదినంరెండు భాగాలుగా విభజించబడ్డాయి. మొదటి భాగం పగలనియు, రెండవ భాగం రాత్రి అనియు మనకు తెలుసు. సూర్యుడు ప్రకాశిస్తున్న సమయంలో ఆ గ్రహాల అధిపతి కాంతి కిరణాలు భూమి మీద ప్రసరించినప్పుడు మనం పగలు అంటాము. భూమి తన చుట్టూ తాను తిరుగుతున్నందువల్ల 24 గంటల్లో 12 గంటలు సూర్యునికి అభిముఖంగాను మరో 12 గంటలు అధోముఖంగాను ఉండడం వల్ల సూర్య కిరణాలు భూమి మీద అభిముఖంగా ఉన్న ప్రాంతంలో పడి పృష్ఠ భాగంలో సూర్యుని కాంతి కిరణాలు పడవు. అలాగే రాశుల మీద కూడ సూర్యకాంతి పడినప్పుడు మరియు సూర్యకాంతి లేకుండా అంధకారమైనప్పుడు అవి తమ తత్త్వాన్ని బట్టి అంటే తమ సహజ తత్త్వాన్ని బట్టి కొన్ని రాశులు పగలు బలంగాను మరికొన్ని రాశులు రాత్రి బలంగాను ఉంటాయి. అలా పగటిపూటఅంటే సూర్యకాంతి పడినప్పుడు సింహం, కన్య, తుల, వృశ్చికం, కుంభం, మీనం ఈ రాశులు తమ సహజ బలాన్ని పూర్తిగా పెంపొందించుకొని తమలో ఉన్న గ్రహాలకు కూడా ఆ పగటి సమయంలో ఆ గ్రహాల తత్త్వాన్ని బట్టి దుష్ఫలితాలు లేదా సత్ఫలితాలు ఇస్తాయి. ఇక రాత్రిపూట మేషం, వృషభం, మిథునం, కర్కాటకం, ధనస్సు మరియు మకరం ఆ రాశులు రాత్రి పూటబలంగా ఉంటాయి. ఏ గ్రహం అయినా ఈ రాశులలో ఉన్నప్పుడు తన సహజ బలంతోపాటు ఈ రాశి యొక్క నివాస స్థాన బలిమిని కూడా తీసుకుని రాత్రిపూట తమ ఫలితాన్ని ఇస్తాయి.

మనం భూమి మీద నిలబడినపుడు ఎలాగ అయితే దిక్కులను గుర్తిస్తామో అలాగే రాశుల దిక్కులను గుర్తించవచ్చు. మేషం, సింహం, ధనస్సు తూర్పు దిక్కును సూచిస్తాయి. వృషభం, కన్య, మకరం దక్షిణ దిక్కును సూచిస్తాయి. మిథునం, తుల, కుంభం పడమర దిక్కును మరియు కర్కాటకం, వృశ్చికం, మీనం ఉత్తర దిక్కును సూచిస్తాయి. మంచి ఖగోళ శాస్త్ర విజ్ఞాన ఖనులైనవారు ఈ రాశుల యొక్క దిక్కులను వారి వారి జ్ఞానముతో ఈ గ్రహ స్థానములలోని నక్షత్రాలను కూడా గుర్తించి ఆ సమయమును సూచించగలరు. ఇంకొక విషయమేమంటే రాశులలో కూడా వర్ణ భేదము ఉంటుందని జ్యోతిష్య శాస్త్రజ్ఞులు అయిన పరాశరుడు, వరాహమిహిరుడు

మరియు వరరుచి లాంటి మహా పురుషులు నొక్కి వక్కాణించారు. మనం ఈ 12 రాశులలో ఏ రాశి ఏ వర్ణానికి చెందినదో తెలుసుకుందాము. అలా తెలుసుకుంటే ఆ రాశిలో ఉన్న గ్రహం ఎటువంటి సహజ ప్రవృత్తి కలిగిన ఆ రాశి తానున్న రాశి ప్రభావం కూడ సంతరించుకొని తదనుమూలంగా ఫలితాలు ఇస్తారని మనం తెలుసుకోవాలి. మేషం, సింహం, ధనస్సు ఈ మూడు క్షత్రియ వర్ణానికి చెందినవి. మిథునం, తుల, కుంభం, ఇవి వైశ్య వర్ణానికి చెందినవి. ఇక మిగిలిన కర్కాటక, కన్య, మకర రాశులు శూద్ర వర్ణానికి చెందినవని వారు నిర్వచించారు. ఇంక మీరు ఇంకొక విషయం గూడ రాశుల గూర్చి తెలుసుకోవాలి. అవి ఏవంటే ఈ రాశులు తమ తమ సహజ ప్రవృత్తిని బట్టి శబ్దములు ఉద్భవింప చేస్తాయి. కొన్ని రాశులు అనగా మేషం, వృషభం, మిథునం, సింహం, ధనస్సు ఇవి చేసే నాద శబ్దం వినుటకు ఇంపుగాను, మరియు లయబద్ధంగాను ఉండటమే గాక అత్యంత ఉచ్ఛమైన ధ్వని తరంగాలు ఉద్భవింపజేస్తాయి. కన్య, మకరం, కుంభ రాశులు చేసే నాద శబ్దాలు చాలా తక్కువ ధ్వనితో ఉండటమే గాక ఉధృతమైన ప్రకంపనాలు సృష్టించలేవు. అంటే మేషం, వృషభం, మిథునం, సింహం, ధనస్సు రాశుల లాగా ఉధృతమైన శబ్ద తరంగాలు వెలువడవు. కాని ఆ శబ్ద తరంగాలలో సగభాగం మాత్రమే వెలువరిస్తాయి. అంటే అర్ధభాగ ధ్వని మాత్రమే వస్తుంది. ఇక కర్కాటకం, తుల, వృశ్చికం, మీన రాశులు కనీస శబ్ద తరంగాలు గానీ, కనీస ధ్వని కంపనలు గానీ సృష్టించవు. అందువల్ల ఈ రాశులు శబ్ద హీన రాశులుగా మనము గ్రహించవచ్చు. ఇంకొక విషయమేమంటే రాశులలో ఆరోగ్య ప్రవృత్తి కూడ ఉంటుంది. మేష, సింహం, ధనూరాశులు వాత, పైత్య, శ్లేష్మ తత్త్వాలు గల రాశులు. వృషభ, మిధున, కన్య, తుల, మకర, కుంభాలు వాత ప్రవృత్తి కలవి. కర్కాటక మరియు వృశ్చిక రాశులు చాలా శీతల చలి ప్రభావములు గల రాశులు. మనం ముఖ్యంగా ఇంకొక విషయం కూడా తెలుసుకోవాలి. అదేమంటే మేష, కర్కాటక, సింహ, కన్య, వృశ్చిక, మీన రాశులు అల్ప సంతాన రాశులుగా మనం గమనించాలి. వృషభ, ధనస్సు, మకర, కుంభ రాశులు సహజ సంతాన రాశులుగా గుర్తించాలి. మిగిలిన మిధున, తులా రాశులు అతి సంతాన రాశులుగా మనం భావించాలి.

మానవులలో భిన్న, భిన్న దేహచ్ఛాయ కలిగిన మనుషులు ఎలా ఉంటారో అలాగే రాశులు కూడ భిన్న, భిన్న వర్ణాలు కలిగి ఉంటాయని మనం తెలుసుకోవాలి. మేష, సింహ, ధనస్సు సింధూర వర్ణమును కలిగి ఉంటాయి. వృషభ, కర్కాటక, తుల శ్వేత రంగు కలిగి ధవళ చ్ఛాయతో మెరుస్తూ ఉంటాయి. మిథున, కన్య, మకరం నలుపు రంగును కలిగి యుంటాయి. భూమి మీద అనేక ప్రాణులు జీవిస్తున్నా వాటిలోని శరీరాకృతి, సహజ నివాస ప్రవృత్తి భిన్నముగా ఉంటుంది. ఉదాహరణకు చతుష్పాద జంతువులు లేక పాదరహిత ప్రాణులు, జల చరములు ఎలాగో అలాగే రాశులలో కూడా చర రాశులు, స్థిర రాశులు మరియు ద్విస్వభావ రాశులు ఉంటాయని మీరు తెలుసుకోవాలి. మేషం, కర్కాటకం, తుల, మకరం – ఇవి చర రాశులుగా అభివర్ణించబడ్డాయి. వృషభం, సింహం, వృశ్చికం, కుంభం స్థిర రాశులుగా పేర్కొన బడ్డాయి. అదే విధంగా మిగిలిన రాశులైన మిథునం, కన్య, ధనస్సు, మీనం ఇవి ద్విస్వభావ రాశులు లేక ఉభయ రాశులు అంటారు. ఉభయరాశులన్నా లేక ద్విస్వభావ రాశులన్నా ఒకటే కాని వేరు కాదు.

ఈ రాశులలో స్వభావాలను బట్టి 3 రాశులుగా విభజింపబడ్డాయి. 1. మానవ రాశులు–ఈ మానవ రాశులలో క్రమముగా మిథునం, కన్య, తుల, కుంభం, మీనం, ధనస్సు వాటి యొక్క ప్రధమార్ధ భాగం మానవ రాశులు. 2. చతుష్పాద రాశులు–ఈ చతుష్పాద రాశులలో క్రమముగా మేషం, వృషభం, కర్కాటకం, సింహం, ధనస్సు – వాటి యొక్క ద్వితీయార్ధ భాగం చతుష్పాద రాశలుగా పేర్కొన బడ్డాయి. ఒక ముఖ్య విషయమేమంటే మకర రాశి చతుష్పాద రాశి అయినా కూడా మొదటి ప్రథమార్ధ భాగాన్ని మాత్రమే తీసుకోవాలి గాని ద్వితీయ భాగం తీసుకోకూడదు. 3. కీటక రాశి – మిగిలిన ఏకైక రాశి వృశ్చిక రాశి. ఈ వృశ్చిక రాశిని కీటక రాశిఅంటారు.

# అధ్యాయం - 2

## సౌర రాశులు - మానవ వ్యక్తిత్వాలు

మనకున్న రాశులు 12 అని అందరికీ తెలుసు. ఈ భూలోకంలో జన్మించిన ఏ మానవుడైనా సరే ఈ 12 రాశుల విభజనలో ఏదో ఒక రాశిలో జన్మించి ఉంటాడు. రాశి చక్రం అంటే ఏమిటి? ఒక శిశువు జన్మించినప్పుడు అంతరిక్షంలో ఏ గ్రహం ఏ స్థానంలో ఉందో చక్ర రూపంలో తెలియచెప్పటం అన్నమాట. ఆచక్రం 12 భాగాలుగా విభజింపబడి ఉంటుంది. ఒక్కొక్క భాగాన్ని ఒక్కొక్క రాశి అంటారు.

చదరంగం ఆటలోని చక్రంలోని భాగాన్ని ఒక్కొక్క "గడి" అంటారు. అలాగే జ్యోతిష్య చక్రంలోని ఒక్కొక్క భాగాన్ని ఒక్కొక్క రాశి అంటారు. ఈ రాశుల గుర్తింపు కోసం 12 గళ్ళకూ అంటే 12 రాశులకూ 12 పేర్లు పెట్టారు. చదరంగంలోని పావులకు నిర్ణీతమైన స్థలం అనేది నిర్ణయించి ఉన్నా, ఆ పావులు తమ స్థానాలను విడిచి ఎలా తిరుగాడుతూ ఉంటాయో, ఒక దాని బలం మీద మరొకటి ఎలా ఆధారపడి వుంటాయో, అదే విధంగా జాతక చక్రంలో కూడా గ్రహాలకు నిర్ణీత స్థలాలు ఉన్నా, అవి స్థలాలు మారుతూ ఒక దాని బలం మీద మరొకటి ఆధార పడడం జరుగుతోంది. చదరంగంలో పావులు నడుస్తున్నప్పుడు ఏ విధంగా ఇతర పావులకు కష్టసుఖాలు కల్గిస్తాయో అదే విధంగా మానవులకు ఈ గ్రహాలు దుష్ఫలితాలూ, సత్ఫలితాలూ ఇస్తాయి.

ఒక శిశువు ఏ రాశి నడుస్తున్నప్పుడు జన్మిస్తుందో, ఆ రాశి లక్షణాలు ఆ శిశువుకు సంక్రమిస్తాయి. దాదాపు 60 శాతం వరకూ ఆ రాశి లక్షణాలు హేతువాద పద్ధతిలో కాక మనం శాస్త్రీయ పద్ధతిలో చెప్పవచ్చు. ఒక్కొక్కప్పుడు ఇంకా ఎక్కువ శాతం కూడా చెప్పవచ్చు. అలా చెప్పటం రాశి, లగ్నాల వీక్షణలు కలయికలు

పరిశీలించి చెప్పాలి. ఆ ఫలితాలు, అతని జీవితంలోని వాస్తవాలకు చాలావరకూ సరిపోతాయి. అందువల్లనే ప్రపంచంలోని అన్ని దేశాలు ఈ శాస్త్రాన్ని నమ్ముతున్నాయి. తమ భవిష్యత్తు ఏమిటో అసలు తెలియని దానికంటే కొంచెమైనా తెలుసుకోవటం మంచిదనే సామాజిక స్పృహ అన్ని కులాల, మతాల వారికి అన్ని దేశాల్లోనూ ఉంది కాబట్టి ఇంకా ఇది మరణరహితమయిన శాస్త్రం. జ్యోతిష శాస్త్రజ్ఞులు కాలగర్భంలో కలిసిపోతారు గాని జ్యోతిష శాస్త్రం మాత్రం కాదు. ఈ శాస్త్రం సజీవంగా నిల్చి ఉంది. ఇంకా ఎన్ని యుగాలైనా చిరంజీవిగా ఉండిపోతుంది.

ఒక వ్యక్తి యొక్క రాశి నిర్ణయం ఆ రాశి ప్రారంభం అయిన తేదీలో గానీ లేక అంతమవుతున్న తేదీ లోపల గానీ జన్మించి వుంటే ఆ శిశువు జన్మించిన కాలం గంటలు, నిమిషాలూ, గడియలతో సహా ఆ జన్మస్థలం భూమి మీద ఏ అక్షాంశ రేఖాంశ మధ్య వున్నదీ మనం తెలుసుకొని ఆ సమయంలో ఆ రాశిలో చంద్రుడు వున్నాడా లేక ముందు రాశికి పయనించాడా అన్న విషయం నిర్ధారించుకోవాలి. ఏ వ్యక్తియైనా ఒక రాశి ఆరంభంలో జన్మించినా, ఆ రాశికి ముందున్న రాశి యొక్క లక్షణాలుగానీ, లేక ఆ వ్యక్తి ఆ రాశి అంతములో జన్మిస్తే, ఆ రాశి తర్వాత వచ్చే రాశి యొక్క లక్షణాలు గానీ వస్తాయనుకోవటం కేవలం భ్రమే అవుతుంది. అంటే ఏ వ్యక్తి అయినా ఒక రాశి ఆదిలో జన్మించినా, అంతంలో జన్మించినా ఆ ఒక్క రాశి లక్షణాలే వస్తాయి గానీ ముందు రాశి లక్షణాలు గానీ, లేక తరువాత రాశి లక్షణాలు గానీ సంక్రమించవు. ఉదాహరణకు ఒక వ్యక్తి సూర్యుడు ధనూరాశి ఆరంభంలో ఉన్నప్పుడు జన్మిస్తే, ధనూరాశి లక్షణాలే వస్తాయి. అంటే ఎట్టి పరిస్థితులలోనూ ఆ వ్యక్తికి ముందున్న వృశ్చిక రాశి లక్షణాలు రావు. అదేవిధంగా ఆ వ్యక్తే ధనూ రాశిలో అంత్యంలో జన్మించినా అతనికి తరువాతి రాశియైన మకర రాశి లక్షణాలు వుండవు. నిజానికి జాతక చక్రం చూస్తే మీరు జన్మించిన సమయంలో అంతరిక్షంలో గ్రహాలు ఏ వరుస క్రమంలో వున్నాయో, ఏఏ గ్రహాలు కలిసి ఏఏ రాశులలో సంచరిస్తున్నాయో యథాతథంగా చూపించే జిరాక్సు కాపీ అనుకోవచ్చు. జ్యోతిష్య శాస్త్రంలో రాశి యొక్క ప్రభావం అనేది అత్యంత ముఖ్యాంశం. ఎందుకంటే రాశిని బట్టి ఆ వ్యక్తి యొక్క లక్షణాలు కొంతవరకు చెప్పవచ్చు. అయితే ఒక విషయం మాత్రం మనం మరిచిపోకూడదు. అది ఏమిటంటే, ఒకే రాశిలో జన్మించినా, స్త్రీ,

పురుషుల లక్షణాలు ఒకే విధంగా ఉండవు. వారి వారి ఆలోచనలూ, గుణగణాలూ లింగభేదం వల్ల మారిపోతాయి. ఏ వ్యక్తి ఏ రాశిలో జన్మించాడో తెలియగానే అతని మనోభావాలు, గుణగణాలూ శాస్త్ర పరిజ్ఞానం దృఢంగా వున్నవారికి తెలిసిపోతాయి. దానిని బట్టి ఆ మనిషి యొక్క లక్షణాలను అంచనా వేసి, దానికి తగినట్లు అందరితో తలలో నాలుగలాగా, అజాత శత్రువుగా జీవించడానికి ఈ జ్యోతిష్య శాస్త్రం ఉపయోగపడుతుందని నేను అనుకుంటున్నాను. ఈ పుస్తకం పూర్తిగా చదివితే, మీకే అనుభవం పూర్తిగా తెలుస్తుంది. మీ జీవన గమనంలో మీ ప్రయాణం బాధాకరమైన కుదుపులు లేక మీ జీవనం సాఫీగా సాగిపోతుంది. ఇప్పుడు మనం మేషం రాశిలో జన్మించిన పురుషుడు గురించి చెప్పుకుందాము.

## మేషరాశి - పురుషుడు

మేషరాశిలో పురుషుడు చాలా సరదా మనిషి. తేలిక స్వభావం కలవాడు. జీవితంలో తీవ్రతలనూ మరియు ఆటుపోటులనూ తట్టుకోలేడు. ఎంత వయస్సు వచ్చినా వయోభేదం లేకుండా అన్ని వయస్సులలో వాళ్ళతో హాయిగా పలకరించి వారితో సంభాషిస్తూ వాళ్ళను సంతోషబెట్టి తాను సంతోషపడగలడు. ఎవ్వరితోనైనా, చాలా తొందరగా కలిసిపోయే స్వభావం ఉంటుంది. భావోద్రేకం ఎక్కువ. ఊహాతీతమైన కలల్లో జీవిస్తూంటాడు. అందువల్ల కోపం వచ్చినా అంత త్వరగానూ అది తగ్గిపోతుంది. కానీ, అది మనస్సులో గూడు కట్టుకుని పగ రూపంలో ప్రతీకారం కొరకు దాచుకొని ఉండడు. నిజానిజాలను ధైర్యంగా మాట్లాడటం అతనికి వెన్నతో పెట్టిన విద్య. కోపంలో కఠినంగా పరుషంగా మాట్లాడినా అది కోపోద్రేకమే గానీ, నిందా దూషణలు మాత్రం కాదు. ప్రేమ స్రవంతిలో ఇతనికి ఇతనే సాటి. తల్లి తండ్రులు, అన్నదమ్ములు, బంధువుల మీద ఎక్కువ వాత్సల్యం, ప్రేమ చూపుతాడు. తాను నమ్మిన స్త్రీ కోసం జీవితంలో ఎన్నో సాహసాలు చెయ్యగలడు. కాని ఆ స్త్రీని సాధించే వరకూ వదలడు. జీవితాంతం ఒకే స్త్రీతో ఉంటాడు. కానీ తాను మెచ్చిన స్త్రీ తనను నిర్లక్ష్యం చేస్తే వేరే స్త్రీ కోసం వెదుకుతాడు. ఆ స్త్రీతో స్నేహం పెంచుకుంటాడు. కానీ అది స్నేహం వరకే. తన శీలభంగాన్ని చేసుకోడు. మాట దాచుకోలేడు. అన్ని విషయాలలోనూ

త్వరగా బయటపడి పోతాడు. స్త్రీలను ఆకర్షించే స్వభావం ఎక్కువగా ఉంటుంది. వారందరిలోనూ తాను చాలా మంచివాడనే భావం కలిగించి వారందరితో సత్సాంగత్యం చేస్తాడు. మేషరాశి పురుషుడికి వల్లమాలిన ఆత్మాభిమానం వుంటుంది. ఎవ్వరిచేత మాట పడడానికి ఇష్టపడడు. అతను స్వేచ్ఛా జీవిగా వుండాలనే కోరుకుంటాడు. ఈ రాశివారు హాయిగా, స్వేచ్ఛగా కల్మషం లేకుండా స్త్రీ, పురుష భేదం లేకుండా అందరితో నవ్వుతూ, స్నేహం చేసి వారి మనస్సుకు దగ్గర మిత్రులవుతారు. కానీ ఏ స్త్రీతోనూ అశ్లీల సంబంధం పెట్టుకోడు. ఈ రాశిలో జన్మించిన వారు ఎప్పుడూ ముక్కుకి సూటిగా పోయే రకం. డొంక తిరుగుడు మాటలూ, లేక రాజకీయ చతురత వీరికి ఉండవు. ఎదుటివారి మాటలలోని అర్థాల కన్నా వారి గుండెలలో వున్న సారాంశాన్ని చక్కగ చదువగలరు. లలిత కళల మీద ఎక్కువ మక్కువ చూపుతాడు. ఇంద్రజాలం అన్నా, సంగీతం అన్నా ఎక్కువ ఇష్టపడతాడు. ఆటలలో ప్రావీణ్యం వుంటుంది. భార్యాపిల్లల మీద అధిక ప్రేమ ఉంటుంది. తన సంపాదన అంతా తన అవసరాల కన్న ఎక్కువ సంసారం మీదే వెచ్చించడానికి ఇష్టపడతాడు. ఎంత డబ్బు ఉన్నా తాను మాత్రం సామాన్య జీవితమే గడుపుతూంటాడు. తన కోసం డబ్బు ఖర్చుకు ఇష్టపడడు. కానీ తన భార్యాపిల్లలు ఆడంబరాలు, ఆర్భాటాలతో జీవించాలని కోరుకుంటాడు. మేషరాశి పురుషులకు వాక్చాతుర్యం ఎక్కువగా వుంటుంది. సభా గౌరవం పొందుతాడు.మంచి వక్తగా పేరు తెచ్చుకుంటాడు. వారి ప్రసంగం జనాకర్షణగా వుంటుంది. వీరికి సత్యాసత్య విశ్లేషణ మరియు ధర్మాధర్మ విచక్షణా జ్ఞానం బాగా వుంటుంది. తొందరగా అందరినీ నమ్మే స్వభావం. కృతజ్ఞతా భావం ఎక్కువ. అల్ప సంతోషులు. ఎవరి దగ్గరైనా చిన్న సహాయం తీసుకుంటే అది జ్ఞాపకం ఉంచుకొని వారికి పదిరెట్లు సాయం చేస్తారు. సమాజంలో మంచి పేరు కలిగి ధనవంతులుగా చెలామణి అవుతారు. ధనలోపం ఎప్పుడూ ఉండదు.

## మేషరాశి - స్త్రీ

మేషరాశిలో జన్మించిన స్త్రీకి చక్కటి కార్యాచరణ శక్తి, పట్టుదల, దీక్ష వుంటుంది. ఒక్కొక్కప్పుడు పట్టుదల హద్దులు దాటి మొండిగా ప్రవర్తిస్తుంది. తన మీద తనకు చాలా నమ్మకం. ఏదైనా లోతుగా ఆలోచించి ఒక నిర్ణయం తీసుకుంటుంది.

తొందరపాటుతో గానీ, ఆవేశాలతోగానీ ఏ నిర్ణయమూ చెయ్యదు. తాను తీసుకున్న నిర్ణయం ఒక పట్టాన మార్చుకోదు. ముక్కుకు సూటిగా పోయే రకం. మానవతా విలువలకు ప్రాధాన్యం ఇస్తుంది. ఎవ్వరితోనూ శత్రుత్వం పెంచుకోదు. అందువల్ల ఈమెకు శాశ్వత శత్రువులుండరు. లేనిపోని డాంబికాలకు, ఆవేశాలకు పోదు. ఆర్భాటాలూ, దర్జాలూ ఆమెకు ఇష్టం ఉండదు. సగటు జీవితం గడపటానికే ఇష్టపడు తుంది. సహనం తక్కువ. అందువల్ల తాత్కాలిక కోపం ప్రకోపిస్తూ వుంటుంది. ఆ కోపావేశం మళ్ళీ కొద్దిసేపటికే చల్లారిపోయి, అన్నీ మరచిపోయి, మామూలు మనిషి అవుతుంది. ఈమెకు స్వతంత్ర భావాలెక్కువ. ఏ పనికీ ఎవ్వరిమీదా ఆధారపడదు. ఏ పనైనా తాను స్వయంగా చేసుకోవటంలోనే తృప్తి, ఆనందం పొందుతుంది. తొందరగా ఎవ్వరి ఆకర్షణలో పడదు. సంసారిక జీవితంలో భర్తకు అన్ని విధాలా సహకరిస్తుంది. ఏ విషయంలోనైనా ధైర్యంగా ముందుకు సాగిపోయి అనుకున్నది సాధించే పట్టుదల చూపిస్తుంది. ఒకవేళ ఆ పని తను సాధించలేకపోతే అది తేలికగా తీసుకుంటుందిగానీ, విచారపడదు. కుజుని ఆధిపత్యంలో వున్న స్త్రీ గనక, తన భర్త పర స్త్రీని కన్నెత్తిచూసినా సహించదు. భర్త గనక తప్పటడుగు వేస్తే అతనిని ఎన్నటికీ క్షమించదు. అతనినిదూరం గానే ఉంచుతుంది. కానీ సంసారం విచ్ఛిన్నం చేసుకోదు. స్త్రీ, పురుషులతో సమానంగా స్నేహం చేస్తుంది. అది స్నేహం వరకు మాత్రమే. ఏ పురుషుడైనాతొందర పడితే, శాశ్వతంగాఅతనిని దూరంగా వుంచుతుంది. సేవాప్రవృత్తి ఎక్కువ. ముఖ్యంగా అనారోగ్య వంతులకూ, వృద్ధులకూ, స్వయంగా తాను సేవ చేస్తుంది. వారికి స్వాంతన చేకూరు స్తుంది. ఈమె పిల్లల పెంపకంలో అందె వేసిన చెయ్యి. వారికి మంచి క్రమ శిక్షణతో పాటు విద్యాబుద్ధులు నేర్పుతుంది. క్షమాగుణం, దాన గుణం ఎక్కువగా వుంటుంది.

## వృషభ రాశి – పురుషుడు

ఈ రాశిలో జన్మించిన పురుషుడు శారీరకంగా బలంగా వుంటాడు. మంచి ఆరోగ్యవంతుడు. జీవితంలో చాలా వాస్తవాలకు దగ్గరగా ఆలోచిస్తాడు. స్వప్న జగత్తులో తేలిపోడు. ఊహాజనితమైన ఆలోచనలకూ, భావోద్రేకాలకూ లొంగిపోడు. సత్యాన్ని చాలా జాగ్రత్తగా పరిశీలిస్తాడు. పరుల సలహాలు పాటించడు. ఒకవేళ ఆ సలహాలు

నచ్చితే వాటి లోతుపాతులను క్షుణ్ణంగా విశ్లేషించి గానీ వాటిని ఆచరణలో పెట్టడు. జీవిత విలువలూ మరియు నిజాలూ గ్రహించి దానికనుగుణంగా జీవనం సాగిస్తాడు. ఈ వృషభరాశి వారు ఎక్కువ భవిష్యత్తు గురించి జాగ్రత్తపడతారు. ఈ రాశి వారికి తన భార్యా పిల్లల మీద అత్యంత ప్రేమాభిమానాలుంటాయి. విచిత్రం ఏమిటంటే వృషభరాశిలోని పురుషులకు తన భార్యా పిల్లల మీద ఎంత ప్రేమ చూపినా దానికి అనుగుణంగా దీటుగా స్పందించరు.దాని వలన ఈ జాతకుడు తన బాధ్యత నెరవేరుస్తున్నాననుకుంటాడు గానీ, దాని వెనుక ఉన్న నిజమైన ప్రేమను మర్చిపోతాడు. దీనికి కారణం వారి దగ్గర నుండి తనకు రావలసిన గౌరవాభిమానాలు, ప్రేమ సరిగా ఇవ్వకపోవటమే. ముఖ్యంగా వృషభ రాశి పురుషుడి సంసారంలో స్త్రీ ప్రాముఖ్యం ఎక్కువ ఉంటుంది. ఎక్కువ విషయాలలో ఆమెదే తుది నిర్ణయం. అయినా, భర్త ఎక్కువ సార్లు సంతోషంగా తన ఆమోదం తెలుపుతాడు. వృషభ రాశి జాతకుడు సహజంగా, యవ్వనంలో మనస్ఫూర్తిగా తాను కోరిన కన్యను వివాహం చేసుకుందా మనుకున్నా, పరిస్థితుల ప్రభావం వల్ల తన కంటే అన్ని విధాల రూపం, గుణం, విద్య, ధనం, సంపాదనలో సరికాని కన్యను వివాహం చేసుకుంటాడు. అలా చేసుకున్నా ఆ భార్యతో పొరపొచ్చాలు లేకుండానే సంసార జీవనం సాగిస్తాడు. ఈ రాశి జాతకులకు కొంచెం సహనం ఎక్కువ. విమర్శకులను, విమర్శలను తట్టుకునే శక్తి వుంటుంది. కానీ, ఆ విమర్శలే ఎక్కువ కాలం వుంటే ఒప్పుకోడు. ఎందుకంటే భార్యా పిల్లలుహద్దులో ఉండాలనీ, సాంప్రదాయ సిద్ధంగా వుండాలని, పెద్దలకిచ్చే గౌరవంలో ఎట్టి పరిస్థితుల లోనూ లక్ష్మణరేఖ దాటకూడదనీ వారి బలీయమైన విశ్వాసం. ఈ రాశి పురుషుడు విచ్చల విడిగా ధనం ఖర్చు పెట్టడు. ఆచితూచి అవసరానికి మాత్రం ఖర్చు పెడతాడు. ధన విషయంలో చాలా జాగ్రత్తగా ఉంటాడు. ముఖ్యంగా ఏదైనా వస్తువు కొన్నప్పుడు అది ఎంత ఉపయోగం మరియు అది ఎంత కాలం ఉంటుంది అని ఆలోచనే తప్ప ఆ వస్తువు తళుకు బెళుకులను చూసి కొనడు. ఎక్కువ సరదాలు, జల్సాలు, విలాసాల జోలికి పోడు.ఈ రాశి వారికి స్త్రీ వాంఛ ఎక్కువ. కానీతప్పుడు మార్గాలు అనుసరించరు.

## వృషభరాశి - స్త్రీ

వృషభరాశి స్త్రీకి తన మీద తనకు నమ్మకం ఎక్కువ. స్వయంగా ఆలోచించి ఏ నిర్ణయమైనా తీసుకోగలదు. ఇతరులకు కూడా ఆయా సమయా సందర్భాలను బట్టి చక్కటి సలహాల నివ్వగలదు. ఈమె ఇచ్చే సలహాలు కొంచెం కఠినంగా వున్నా, వాస్తవానికి చాలా దగ్గరగా వుంటాయి. మెత్తటి స్వభావం కలవారు, ధైర్యం లేనివారు, ఈమె సలహాలను పాటించలేరు. ఈ రాశి స్త్రీలు అనారోగ్యం అనేది ఎరుగరు. సాధారణంగా మంచి ఆరోగ్యంతో బలంగా ఉంటారు. శారీరక శ్రమ చెయ్యలేరు. తమ పని తాము చేసుకోవటంలోనే వీరికి తృప్తి ఎక్కువ. తమ పని విషయంలో ఎవ్వరి మీదా ఆధారపడరు. మంచి నైతిక విలువలు ఎక్కువ. అన్యాయం, అక్రమాన్ని ధైర్యంగా విమర్శిస్తారు. వీరికి న్యాయాన్యాయ విచక్షణా జ్ఞానం ఎక్కువ. అవినీతికి, అధర్మానికి లొంగరు. మంచి కార్యదక్షత వుంటుంది. ఏ పనికైనా బాగా ఆలోచించి గానీ ముందడుగు వేయరు. తమ నిర్ణయాన్ని మధ్యలో మార్చుకోరు. తాను నమ్మినదాన్ని సాధించే వరకు నిర్విరామంగా ప్రయత్నిస్తూనే వుంటుంది. అందరితో చనువుగా వుంటుంది. మంచి స్నేహశీలి. ఏ వయస్సులో వారినైనా ఆకర్షించి వారితో మంచి సాన్నిహిత్యాన్ని పెంచుకోగలదు. వీరికి సంగీత సాహిత్యాల మీద ఎక్కువ మక్కువ. కొంచెం ప్రవేశం కూడా ఉండవచ్చు. కానీ దాని మీద జీవనం సాగించరు సరికదా వాటిలో మంచి ప్రావీణ్యత సంపాదించలేరు. సంగీతం లాంటిది నేర్చుకున్నా అది మధ్యలోనే ఆగిపోతుంది. ఈ స్త్రీ పిల్లలను మంచి పౌరులుగా తీర్చి దిద్దగలదు. వారిని మంచి క్రమశిక్షణలో పెంచి విద్యాబుద్ధులు నేర్పించగలదు. ఈమె ఒక మంచి భార్యగా, మంచి తల్లిగా, తన పాత్ర పోషించగలదు.

## మిధునరాశి - పురుషుడు

వీరు జీవితములో ఉన్నదానితో, తృప్తి పడక మరో దానికై ఎపుడూ ప్రయత్నిస్తూనే ఉంటారు. ప్రతీ విషయం లేక ప్రతీ వస్తువు రెండు ఉండాలని కోరుకునే మనస్తత్వం ఉంటుంది. ప్రతీ వస్తువు ఉన్నా రెండవ దానికి ప్రయత్నిస్తూనే ఉంటారు. ఉదాహరణకు చిన్న విషయానికి కూడా రెండేసి కావాలని కోరుకుంటారు. రెండు పెన్నులు, రెండు

గడియారాలు, రెండు  పర్సులు, రెండు కళ్లజోడులు – అలాగే ప్రతీది అంటే చివరికి అతనికి రెండవ స్త్రీ మీద కూడా వ్యామోహం ఉంటుంది. ఏ స్త్రీని అయినా తన హావ భావాలతో సులువుగా ఆకర్షించే శక్తి ఉంటుంది. అతని హృదయములోని లోతు ఏ స్త్రీ గ్రహించలేదు. తననే ఆరాధిస్తున్నాడని అనుకొంటుంది. కాని అతని హృదయములో వేరొక స్త్రీ ఉందని అనుమానించలేదు. అతనికి అందం మీద ఆకర్షణ ఎక్కువ. క్రొత్తగా వచ్చిన వస్తువుల మీద, మనుషుల మీద ప్రేమ ఎక్కువ. పాత విషయాలు మరచిపోతారు. వాటిని లేక వారిని దూరంగా ఉంచుతారు. అంటే వీరి అభిప్రాయాలు, స్నేహాలు, వాంఛలు ఎపుడూ మారిపోతూ ఉంటాయి. వీరికి సమాజంలోను, బంధుమిత్రులతోను జనాకర్షణ కలిగి వారిలో ఒకడిగా ఉంటాడు. ఒంటరితనం అసలు నచ్చదు. మనిషిలో మాట చాతుర్యం ఎక్కువగా ఉండటము వల్ల వీరు వ్యాపారంలో గాని లేక కార్యాలయాల్లో గాని జయం పొందుతారు. వీరు మరియు వీరి మనస్సు యొక్క విధానము అంతుపట్టదు. అందరితోను చనువుగా ఉంటారు. ఏ విషయాల్లోనైనా సజావుగాను, మృదువుగాను సోదాహరణంగా చెప్పి అందరి మనస్సును ఆకర్షిస్తారు. వీరు చెప్పేది తప్పు అని తెలిసినా మీరు అతనిని కాదనలేదు. సాధారణంగా వీరు తన మనస్సులోని భావాలను వ్యక్తీకరించకుండా మీకు నచ్చినట్లుగా సంభాషిస్తారు. సాధారణంగా స్త్రీలను ఎక్కువగా ఆకర్షించే స్వభావం వీరికి ఎక్కువ వుంటుంది. ప్రతి స్త్రీ ఈ పురుషుడు తననే గాఢంగా ప్రేమిస్తున్నాడని భావిస్తుంది. ఆ నమ్మకంతో తన హృదయం విప్పి అన్ని విషయాలు అతనితో చెప్పుకొంటుంది. ఈ మిధున రాశి పురుషుడు ఎప్పుడు తన భార్య పిల్లలు తమ బంధువుల మీద అత్యంత ప్రేమ వాత్సల్యాలు కలిగి వుంటారు. ఎట్టి పరిస్థితులలోను పిల్లల్ని దండించడు. వీలయినంత వరకు తన సంభాషణా చతురతతో వాళ్లని సరియైన మార్గంలోకి తీసుకు వచ్చే ప్రయత్నం చేస్తాడు. బుధ గ్రహం అధిపతి కాబట్టి ఇతనికి మంచి విచక్షణ జ్ఞానం ఉన్నత శ్రేణి విద్య కలిగి వుంటాడు. మిధుని రాశి పురుషుణ్ణి వరించే స్త్రీకి తన దాంపత్య జీవితంలో ఎటువంటి తీవ్రకష్ట నష్టాలుండవు. జీవితం సంతోషంగా సాఫీగా సాగిపోతుంది.

# మిధున రాశి - స్త్రీ

ఈ రాశిలో పుట్టిన స్త్రీకి ఒక నిశ్చితాభిప్రాయం వుండదు. పరిస్థితుల ప్రభావాన్ని బట్టి ఆమె ప్రవృత్తి మారుతూ వుంటుంది. అంటే ఆమె అభిప్రాయాలు స్థిరంగా వుండవు. ఎక్కువ ఊహల్లో తేలిపోతు వుంటుంది. ఏదైనా ఒక వృత్తి చేపడితే ఆ వృత్తినే నమ్ముకొని దానిలోని లోతుపాతులు సాధ్యాసాధ్యాలు పరిశీలించి ఒక వున్నతమైన ప్రావీణ్యం సంపాదించి తన ప్రతిభను అందరకు చాటుతుంది. ఈ మిధున రాశి స్త్రీ భర్తకు అత్యంత ప్రేమపాత్రురాలుగా వుంటుంది. ఎందుకంటే తన భర్తకు ఏమి కావాలో ఆ విషయాన్ని ముందే గ్రహించి అతనిని అన్ని విధాల ఆనందింపచేస్తుంది. ముఖ్యంగాపడకగదిలో తన కేళి విలాసాలతో తన భర్తను మనోరంజకంగా అలరిస్తుంది. ఈమెకు సమయస్ఫూర్తి భిన్న లక్షణ సమన్వయంగా వుంటుంది. మనిషి చాలా మృదువుగాను సున్నితముగాను వుంటుంది. ఆమె చపలత్వం వల్ల ఆమె హృదయాన్ని అర్థం చేసుకోవడం కష్టం. ఎందుకంటే ఆమె వస్త్రధారణ గాని లేక ఆమె అభిప్రాయాలుగాని రోజు రోజుకు మారిపోతు వుంటాయి. ఉదాహరణకి ఈ రోజు పదహారు అణాల ఆంధ్రుల ఆడపడుచుగా అంటే నిండుగా చీర, జడ, ముఖం మీద బొట్టు, తలలో పూలతో మంచి గృహిణిగా కనిపిస్తుంది. మరో రోజు మీరు చూసినపుడు మీరే ఆశ్చర్యపోతారు. ఎందుకంటే ఆమె బొట్టు గాజులు లేకుండా చేతికి అందమైన వాచితో మెడలో ఒక సన్నటి గొలుసు వేసుకొని జీన్సు పాంటు తొడుగుకొని చేతులు లేని టీ షర్టు వేసుకొని ఎత్తు మడమల పాదరక్షలతో చేతిలో వ్యానిటీ (Vanity Bag) బ్యాగ్‌తో మిమ్మల్ని 'హాయ్' అంటూ పలకరిస్తుంది. మీరు అవాక్కయిపోతారు. ఎందుకంటే క్రిందటిసారి మీరు కలిసినపుడు పరిపూర్ణ గృహిణిగా నిండుగా పైట కప్పుకొని మృదువుగా నమస్కారాలతో పలకరించిన ఆమె యిపుడు ఆధునిక పాశ్చాత్య ధోరణితో ఆంగ్ల భాషా సమన్వయంతో కలిగిన తెలుగును అప్పడంలా విరిచి భాషరాని వారిలాగ ముద్దుముద్దుగా మాట్లాడటం వల్ల ఆమె మనస్తత్వం ఒక పట్టాన కొరుకుడు పడదు. ఈమెకు స్వతంత్ర అభిప్రాయాలు ఎక్కువ. పూర్తిగా స్వతంత్రురాలుగా వుండి స్వేచ్ఛా ప్రతిపత్తితో జీవించడానికి యిష్టపడుతుంది. ఈమె ఆంక్షలు అధికారం భరించదు. మనస్సులో ఎంత బాధ వున్నా ఎదుట వారికి తెలియకుండా ఆమె మనో

వేదనను తనలోనే దాచుకొని పైకి సంతోషంగానే కనపడు తుంది. అతిథుకులను గౌరవించడం వారితో హుందాగా ప్రవర్తించడం వెన్నతో పెట్టిన విద్య.

## కర్కాటక రాశి - పురుషుడు

ఈ రాశిలో పుట్టిన పురుషునకు ఓర్పు సహనం ఎక్కువ. క్రొత్త పరిచయం కలిగినపుడు కలుపుకోలుతనంగా గబగబా మాట్లాడడు అంటే మితభాషిగా వుంటాడు. సాధారణంగా మెత్తటి స్వభావం కలిగి వివాదాలకు విద్వేషాలకు దూరంగా వుంటాడు. ధనం మీద ఆశ ఎక్కువగా వుంటుంది. తొందరగా ధనాన్ని వ్యయం చేయడు. ప్రతి విషయాన్ని లోతుగా ఆలోచించిగాని ఖర్చు చేయడు. తను చేసే ప్రతి పనికి లేక ప్రతి సహాయానికి ఫలితం ఆశిస్తాడు. ఎక్కువగా ఉచిత సేవలు మరియు ఉచిత సహాయ సహకారాలు ఎవరికీ అందించడు. అంటే ప్రతిపనిని వ్యాపార సరళిలో ఆలోచిస్తాడు. మనిషి నెమ్మదస్తుడుగా వుంటాడు. తన తల్లి మీద విపరీతమైన ప్రేమ కలిగి వుంటాడు. ఈ పురుషునికి పాక శాస్త్రంలో ప్రావీణ్యత వుంటుంది. భోజన ప్రియుడుగా వుంటాడు. సాధారణంగా ఎవరి వంట మెచ్చుకోడు. తల్లిని ప్రేమించినట్లే భార్యను చాల ప్రేమగా చూసుకొంటాడు. తన శీలాన్ని ఎపుడు పోగొట్టుకోడు. కష్టపడి జీవించే స్వభావం. ఆస్తులు ఏర్పరచడంలో గాని వాటిని వృద్ధి చేయుటలోగాని మంచి ఉత్సాహం చూపుతాడు. భార్యను అమితంగా ప్రేమిస్తాడు. ఆమె వియోగం భరించలేడు. నాయక లక్షణాలుంటాయి. ఏదైనా కళలోగాని శాస్త్రంలో గాని ప్రావీణ్యత సంపాదిస్తాడు. ఎటువంటి పరిస్థితులలోను ధర్మం తప్పడు. అందువల్ల మంచివాడుగా సమాజంలో గుర్తింపు పొందుతాడు.

## కర్కాటక రాశి - స్త్రీ

ఈ రాశిలో జన్మించిన స్త్రీ భావకురాలుగా వుంటుంది. సంతోషం వచ్చినప్పుడుఉబ్బి పోవడం ఏదైనా విపత్తు లేక దుఃఖం కలిగినపుడు క్రుంగిపోవడం ఈవిడ యొక్క ప్రత్యేక లక్షణం. ఏ వస్తువును పారవేయడానికి మనస్కరించదు. కాబట్టి యీమె యింట్లోఅన్ని సామాన్లు దాచి పెడుతుంది. ధనం తన అవసరాలకు

ముందు వెనకలు చూడకుండ ఖర్చు పెట్టగలదు. ధనాన్ని ప్రతిపైసా లెక్కకట్టి లాభ నష్టాల బేరీజు వేయడం యీమెకు చేతకాదు. తను అనుకుంటే ఎంత ఖర్చు అయినా చేస్తుంది. ఇష్టం లేకపోతే ఎవరు చెప్పినా ఒకపైసాకూడఖర్చు పెట్టదు. మంచి విద్య తెలివితేటలు మాట చతురత్వం ఎక్కువగా వుంటుంది. అందరికి మార్గదర్శిగా వుంటుంది. దాంపత్య జీవితంలో యీమె వల్ల ఒడుదుడు కులు ఎక్కువగా వుండవు. కామవాంఛ ఎక్కువగా వుంటుంది. అవమానాన్ని భరించలేక ఆ విద్వేషాన్ని మనసులో దాచుకొంటుంది. సమయం వచ్చినపుడు కఠినంగా వ్యవహరించి నిర్దాక్షిణ్యంగా ప్రతీకారాన్ని తీర్చుకుంటుంది. తనకు నచ్చని వారిని ఎపుడూ దూరంగానే వుంచుతుంది. వారితో అవసరం వున్నా ఎట్టి పరిస్థితులలోను వారిని ఆశ్రయించరు. తన భర్త మీద సంతానం మీద ధృతరాష్ట్ర ప్రేమ చూపించక న్యాయ అన్యాయ నిర్ణయం చేసి వారితో మనుగడ సాగిస్తుంది.

## సింహ రాశి - పురుషుడు

ఈ రాశిలో పుట్టినవాడు స్వాభావికంగా బద్ధకస్తుడు. ఎంతో అవసరమైతే గాని ఏ కార్యక్రమాన్ని ప్రారంభించడు. తన స్వలాభం కోసం ఎదుటివారికి నష్టమైనా ఆ పని చేయడానికి వెనుకాడడు. మామూలుగా బుధ స్వభావం కలవాడైనా అవమానం జరిగినపుడు తన హృదయం గాయపడినపుడు వెంటనే ప్రతీకార వాంఛ తీర్చు కుంటాడు. దాంట్లో ఏ సంశయం లేకుండా అతి కాఠిన్యంగా ప్రవర్తిస్తాడు. వీరికి వస్తు నిర్వహణలో చాల వుత్సాహం వుంటుంది. ఏ వస్తువైనా సరే చాల జాగ్రత్తగా వాడుకుంటాడు. క్రొత్తదనంలోగాని ఆధునికతలో గాని వుత్సాహం చూపించడు. అంటే సంప్రదాయాలకు మత సంస్కారాలకు ఎక్కువ విలువనిస్తాడు. మంచి బుద్ధి కుశలత కలిగి ఏ యంత్రమైనా పని చేయనపుడు దాని యొక్క స్థితిగతులను అవలీలగా అర్థం చేసుకొని దానిని ఉపయోగానికి తీసుకు వస్తాడు. అందుకని వీరిని మెకానికల్ ఇంజనీర్స్ అనవచ్చు. వీరికి ఎక్కువ సంతానం కలుగదు. కాని సంతానం మీద ప్రేమ అభిమానాలు చూపిస్తారు. ముఖ్యమైన విషయం ఏమంటే ఈ రాశి వారిని రెచ్చకొట్టకూడదు అని మనం గ్రహించాలి.

## సింహ రాశి - స్త్రీ

ఈ స్త్రీకి ఉద్రేకం కోపం ఎక్కువ. ఎదుట వారిని లక్ష్యపెట్టదు. తను గొప్పదానిని అనే అహం ఎక్కువ వుంటుంది. ఇంకొకరు చేసిన చిన్న తప్పును కూడ క్షమించదు. తాను స్త్రీ అయినా మరొక స్త్రీని ఉన్నత స్థాయిలో చూసినపుడు అసూయ ద్వేషాలు మనస్సులో రగిలిపోతాయి. అంటే మరొక స్త్రీ అందంలో గాని విద్యలో గాని ధనంలో గాని లేక ఏదైనా ఒక కళలో ప్రావీణ్యతను కనబరిస్తే పైకి స్నేహంగా వున్నా హృదయంలో అసూయతను దాచుకొంటుంది. మంచి శరీర సౌష్ఠముతో హుందాగా కనిపిస్తుంది. తనుగాని తన భర్తగాని జీవన స్రవంతిలో పేరు ప్రఖ్యాతులు సంపాదించి అందరికి తాను నాయకురాలు వలె వుండాలని కోరుకుంటుంది. ఎవరి ఆధిపత్యం కూడ తనమీద సహించదు. కోపోద్రేకాలకు లోనైనపుడు ఆ వుద్రేకం కట్టలు తెగి ప్రవహిస్తుంది. సాధారణంగా ఎవరిని నమ్మదు. ఆమెకు క్రీడలు అంటే చాల యిష్టం. దాంపత్య జీవితంలోని రతిక్రీడలో కూడ పురుషుణ్ణి అధిగ మిస్తుంది. కామకళలోని అనుభవాలు అతనికి నిర్దేశించి తానుసుఖిస్తుంది.ఇంటికి వచ్చిన అతిథులను గౌరవించుట యీమె యొక్క ప్రత్యేకత. అతిథులకుకావలసినసహాయ సహకారాలు అందించి వారిమెప్పు కోసంఎదురు చూస్తుంది.అలా సహాయంపొందినవారుసరిగా స్పందించక పోతే ఎన్నడు వారికి ఇంక సహకరించదు. ఈమె జీవితంలో క్రమశిక్షణ పాటిస్తుంది. అందువల్ల సంతానానికి కూడ మంచి క్రమశిక్షణ నేర్పుతుంది. వీలయినంత వరకు అనవ సరంగా ప్రయాణాలు చేయడానికి యిష్టపడరు. ఒక విషయం ఏమంటే యీమెకు సమాజంలో అందరితో పాటు కాకుండా వున్నత స్థానంలో ఉండాలనే కోరిక వల్ల ఆధునిక విలాసాలకు ధనం ఖర్చు పెట్టవచ్చు. కాని దుబారా చేయదు. సింహరాశి కన్యను భార్యగా పొందినవాడు ఆమెను సరిగా అర్థం చేసుకోవాలి. సహనం కూడ పాటించాలి అనే విషయాన్ని మరువరాదు.

## కన్యా రాశి - పురుషుడు

కన్యారాశి పురుషుడు ప్రతివిషయాన్ని కూలంకషంగా ఆలోచించే ఏ నిర్ణయాన్ని అయినా తీసుకుంటాడు. జీవితంలో స్వానుభవం వల్ల ఎక్కువ నేర్చుకొంటాడు. ఇతరుల జీవితాలలోని అనుభవాన్ని అర్థం చేసుకొని తదనుగుణంగా తన దినచర్యను తన

ఆలోచనా విధానాన్ని మార్చుకొంటాడు. ఏ కార్యం తలపెట్టినా పట్టుదలగా అన్ని అడ్డంకులను తొలగించుకొని తన కార్యమును సాధించుకొంటాడు. జీవిత భాగస్వామిని ఎన్నుకొనే విషయంలో చాలా ఆశాజనకంగా ఉంటాడు. ఒక పట్టాన ఎవరినీ ఒప్పుకోడు. నిత్యం తన భార్యలోని లోపాలను గమనించి బాధపడుతూ వుంటాడు. కాని తన లోపాలను ఎంచినపుడు కోపోద్రిక్తుడు అవుతాడు. దాంపత్య జీవితంలోని మధురిమను తన భార్యకు చూపించలేడు. అంతేకాక తాను ఆమెనుంచి ఆస్వాదించలేడు. తన నిర్ణయాలను పరిస్థితులను బట్టి నిర్ణయించుకుంటాడు. ప్రేమ అనే విషయానికి దూరంగా వుంటాడు. వీరికి అత్యంత మేధోసంపత్తి వుంటుంది. అంటే మంచి జ్ఞాపకశక్తి కలవాడిగా వుంటాడు. ఏ విషయాన్ని గాని ఎవరినిగాని మరువడు. అవసరాన్ని బట్టి తన సంప్రదాయ మత కుల బంధనాలను తెంచుకొని క్రమశిక్షణారహితంగా ప్రవర్తిస్తాడు. వస్త్రాలంకరణకు పెద్దపీట వేస్తాడు. ఎప్పుడు భావోద్రేకాలకు లోనుకాడు. తన సంతానం మీద పెద్దగా ప్రేమ వాత్సల్యాలను చూపించడు. సంతానాన్ని పెంచి పెద్ద జేయుట కూడ ఒక విద్యుక్త ధర్మంగానే ఆలోచిస్తాడు గానీ తాను తండ్రి అనే భావుకత తన హృదయంలో వుండదు. అలాగే భార్య మీద గూడ అలాంటి అభిప్రాయం కలిగి వుంటాడు. ఇతనికి ఎక్కువ స్త్రీ వాంఛ వుండదు.

## కన్యా రాశి - స్త్రీ

కన్యా రాశి స్త్రీకి శీలం మీద అంత పవిత్రమైన నమ్మకం వుండదు. ఈ శీలం అనే పేరు స్త్రీ స్వేచ్ఛ స్వాతంత్ర్యములకు అడ్డుగోడలనే అభిప్రాయం వుంటుంది. తాత్కాలిక క్షణిక సుఖం కోసం తన పవిత్ర శీలాన్ని కాపాడుకొనే యత్నం చేయక తన శరీర వాంఛలను వివాహానికి ముందు కూడా తీర్చుకుందుకు సాహసిస్తుంది. పర పురుష వాంఛ ఎక్కువ వుంటుంది. పైకి నిండు గోదావరిలాగ కనిపిస్తున్నా ఆమెలోని వయస్సు మరియు మనసు కామవాంఛ తీర్చుకొనేందుకు సందేహించదు. వివాహం అయిన తరువాత కూడ అక్రమ సబంధాలు వుండవచ్చు. తన పురుషుడి యొక్క లోపాలను అనుక్షణం గమనించి వాటిని సరి చేయడానికి ప్రయత్నిస్తుంది. భర్త మొండిగా వుంటే సహించదు. ఆమె యితరులను విమర్శించుటలో దిట్ట. తన

లోపాలను ఎట్టి పరిస్థితులలోను ఒప్పుకోదు. తనకు తానే ఆలోచించుకొని దేశకాల మాన పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తదనుగుణంగా వస్త్రాలంకరణ నడవడిక మార్చు కుంటూ వుంటుంది. ఈమె నిజాయితి, ధర్మనిరతి అనేవి తన స్వార్ధ లబ్ధి కోసం పరిస్థితులను బట్టి మార్చుకుంటుంది. ఆ లబ్ధి లభించగానే ఎవరి ద్వారా ఆ లబ్ధి కలిగిందో వారిని లక్ష్య పెట్టదు. అవసరం తీరిన తరువాత ఎవరినైనా సరే నిర్లక్ష్యం చేస్తుంది. మొత్తానికి యీమె మనసు అర్ధం చేసుకోవడం కష్టం. ఈమెతో ఎపుడు విభేదించక తందాన తాన అనే మనస్తత్వ ంతో మనం ప్రవర్తించాలి. అపుడే ఆమె వద్ద నుంచి అభిమానం సహకారం లభిస్తుంది.

## తులా రాశి - పురుషుడు

ఈ రాశిలో జన్మించిన పురుషుడు ఏదైన విషయం గురించి ఎవరైనా సలహా అడిగితే వారికి ధర్మబద్ధమైన సలహాలు ఇవ్వగలడు. అలాగే అధిక సంభాషణంతో అడగకుండానే ఉచిత సలహాలు చెప్పి వాటినే పాటించమని మరి మరి నొక్కి చెపుతాడు. పురుషునికి ఆకర్షణీయంగా వుంటాడు. ఎవరినైనా తన మాటలతో సభా ప్రాంగణంలో కూడా అందర్నీ కట్టి పడేస్తాడు. ఇతని మాటలలో ధర్మం న్యాయం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ఎటువంటి పరిస్థితులలోను ఎదుటివారిని నొప్పించడు. ఇతనికి సత్యం గ్రహించే గ్రహణశక్తిచాలావుంటుంది. మంచిబుద్ధి కుశలత మరియు లోక విచక్షణాజ్ఞానం బాగా వుంటుంది. తులా రాశి పురుషుణ్ణి మనం ఏ శంక లేకుండా నమ్మవచ్చు. ఎదుట వారి అభిప్రాయాలను లోతుగా అర్ధం చేసుకొని దానిలోని సత్యాసత్యాలను చక్కగా విశ్లేషించి తగిన తీర్పుగానిసలహా గాని యివ్వగలడు. తన మనసులో భావాన్ని చాలా కాలందాకా దాచుకోగలడు. దాంపత్య జీవితంలో ఎపుడు తన వల్ల తన జీవిత భాగస్వామికి ఎలాంటి యిబ్బంది లేకుండ ప్రేమగా చూసుకొంటాడు. వస్తు నిర్వహణంలో శ్రద్ధ చూపుతాడు. క్రమశిక్షణా రాహిత్యం చట్ట విరుద్ధ కార్యక్రమాలను ఎపుడు సహించడు. అదేకాకుండా అలాంటి వారు కనపడితే వారిని వారు చేసే చట్ట విరుద్ధతా సంఘ విద్రోహ పనులను ధైర్యంగా బహిర్గతం చేస్తాడు కాని భయపడడు.

## తులారాశి - స్త్రీ

ఈ రాశిలో పుట్టిన స్త్రీ మృదువుగాను ఆకర్షణీయంగాను సున్నితమైన మనస్కురాలుగా వుంటుంది. ఎవరి ఊహకు అందని ఆలోచనలు యీమెకు కలిగి తదనుకూలంగా సరియైన తరుణంలో మంచి సలహాలు యిచ్చి కష్టముల నుండి గట్టెక్కిస్తుంది. ఇతరులు తనతో సంభాషించినపుడు ప్రతి వాక్యాన్ని జాగ్రత్తగా విశ్లేషించి వారి నిజ మనస్సును గ్రహిస్తుంది. పొగడ్తలకు లొంగదు. ఇతరుల విషయాల్లోఎన్నడు తల దూర్చదు. ఎపుడు భర్తను అంటి పెట్టుకొనే వుంటుంది. దాంపత్య జీవితంలోని మధురిమను ఎలా ఆస్వాదించాలో యీమెకు పూర్తిగా తెలుసు. పురుషుణ్ణి ఎలా సంతృప్తిపరచాలో తెలిసి అతని ఉన్నత స్థితికి కారణభూతు రాలు అవుతుంది. ఎక్కువ సంతానం ఉండదు. కొద్ది సంతానమే కలిగినా వారిని అత్యంత ప్రేమతో పెంచి, వారికి కూడ మంచి సాంప్రదాయ సంస్కారాలు నేర్పుతుంది. బంధుమిత్రు లలో మంచి పేరు తెచ్చుకొని వారికి కావలసిన సహాయ సహకారాలను తగిన సమయంలో తప్పకుండా అందించి వారి మన్ననలకు ప్రేమకు పాత్రురాలవుతుంది.

## వృశ్చికరాశి - పురుషుడు

ఈ రాశినందు జన్మించిన పురుషుడు తొందరగా ఏ విషయాల్లోను త్వరపడడు. మానసికంగా భయస్తుడు.తన శరీరాన్ని పువ్వులాగా కాపాడుకొంటాడు. చిన్న గాయమైనా అతిగా బాధపడతాడు. తనకు కష్టం వచ్చినపుడు ధైర్యంగా ఎదుర్కొనేశక్తి లేక దూరంగా పారిపోతాడు. మిత్రులు తక్కువగా వుంటారు. ప్రాణమిత్రులకు నిజంగానే ప్రాణమి వ్వగలడు. మానసికంగా ఏ చిన్న గాయమైనా తట్టుకోలేడు. మానసికంగా కృంగి పోతాడు. వీరితో స్నేహం ఎవరికైనా అత్యంత లాభకరం. ఎందుకంటే ఏ స్వలాభం లేకుండ మిత్రులకు ఏ సహాయాన్నైనా చేస్తాడు. ఒక్కొక్కప్పుడు ఉన్నత త్యాగాలు చేసే ఉన్నత మనస్తత్వం వుంటుంది. తనకు నచ్చని వారితో అసలు సంభాషించడు. వారిని దూరంగానే ఉంచుతాడు. ఎవరితోనైనా సరే సర్దుబాటు చేసుకొని నొప్పింపక తానొవ్వక రీతిలో మసులుతూ ఉంటాడు.

## వృశ్చికరాశి - స్త్రీ

ఈ రాశిలో పుట్టిన స్త్రీకి అచంచలమైన ఆత్మ విశ్వాసం ఉంటుంది. ఏ పని అయినా సాధించగలననే నమ్మకం గాఢంగా ఉంటుంది. ఈ రాశి స్త్రీలు పైకి మామూలుగా అమాయకంగా సున్నితంగా కనపడినా వీరి హృదయం మాత్రం కఠినంగానే ఉంటుంది. పొగడ్తలకు స్తుతిపరులకు తేలికగా లొంగే స్వభావం కాదు. కోపం ఎక్కువగా ఉంటుంది. అవమానాలను అసలు సహించదు. సమయం చూసి ప్రతీకారం తీర్చుకుంటుంది. ఈ రాశి స్త్రీలకు తమ భర్త తనకంటే అన్నిటిలోను ఉన్నతంగా ఉండాలని కోరుకుంటుంది. సాదాసీదా వరులను ఇష్టపడదు. ఆమె జీవితంలో ఏ నిర్ణయాలను తీసుకొన్నా, చాలా లోతుగా ఆలోచించి, లాభనష్టాల బేరీజు వేసుకొనిగాని ఒక నిశ్చయాభిప్రాయానికి రాదు. భావోద్రేకాలు ఎక్కువగా ఉంటాయి. కాని పైకి కనపడనివ్వదు. పురుషుని రెచ్చకొట్టి మరీ సుఖిస్తుంది. అలాగే అతనికి స్వర్గం చూపిస్తుంది. కావలసినంత స్వేచ్ఛ భర్తకు ఇచ్చి తాను కూడా అంత స్వేచ్ఛతోనూ విహరించి పులకిరిస్తుంది. వీరు పరిశుభ్రత పాటిస్తారు. అలాగే సమయ విలువలను కూడా విధిగా అనుసరిస్తారు. వృశ్చిక రాశి స్త్రీల మనోభావాలను అర్థం చేసుకోవటం కష్టం. కాని అర్థం చేసుకొని తగిన రీతిలో స్పందిస్తే మీకు ఆస్తి, ఉత్తమభార్య, లేక ఉత్తమ స్నేహితురాలో లేక ప్రియురాలో అవచ్చు.

## ధనూరాశి - పురుషుడు

ధను రాశిలో పుట్టిన పురుషుడు జనాకర్షణ కలిగి ఎక్కువ స్నేహితులు సన్నిహితులతో కలిసి గడుపుతు వుంటారు. మంచి లౌక్యం కలవాడై ఎక్కువగా తన స్వార్థం చూసుకొంటాడు. తాను అవకాశవాదిగా వుండి చేజిక్కిన లాభించే ఏ చిన్న అవకాశాన్నైనా పోగొట్టుకోడు. ఈ రాశివారు ఏ కార్యం ప్రారంభించినా మధ్యలో ఎలాంటి అవాంతరాలు కలిగిన బంధుమిత్రుల సహాయంతో తన మాట చతురతతో ఆ పనిని వాని సహాయంతోనే పూర్తి చేసుకొంటాడు. కాని వారికి దానిలో ఏమి ధన లాభం కలుగకుండ జాగ్రత్తపడి ప్రియ సంభాషణతో అతనిని ఆనందింపచేస్తాడు. ఈ రాశి జాతకునికి చాలసార్లు జయమే కలుగుతుంది కాని ఎన్నడు అపజయం

పొలవ్వడు. ఒక ముఖ్య విషయం ఏమంటే యితనికి అదృష్ట దేవతా కరుణ కటాక్షాలు ఎక్కువగా వుంటాయి. ఎపుడైనా ఒకవేళ తన స్వకార్యంలో ప్రతికూల పరిస్థితులు ఏర్పడినపుడు గాని లేక తన పొరపాటు వలన ఆ కార్యం సఫలీకృతమవకపోతే దానివల్ల వ్యతిరేక పరిస్థితులు ఏర్పడినపుడు మానసిక ఒత్తిడికి లోను కాకుండధైర్యంగా వుంటాడు. నమ్మిన వారిని ఎప్పుడూ నిరాశపరచడు. వారిని గౌరవించి తగిన శ్రమ సహాయ సహకారాలు అందిస్తాడు. కాని ధనరూపేణే సహాయం చేయడు. వృధా ఖర్చు చేయక తను చేసే ప్రతిఖర్చుకు లాభనష్టాలు బేరీజు తప్పకుండా వేసుకొంటాడు. ఈ పురుషుడు బాల్యం నుంచి ఎక్కువ తండ్రికి దగ్గర అవుతాడు. తండ్రిలోని సద్గుణాన్ని చూసి అనుసరిస్తాడు. తల్లిదండ్రుల మీద ఎక్కువ ప్రేమాభిమానాలు కలిగి వారి వృద్ధాప్యంలోఆదరణ చూపిస్తాడు. వారి వార్ధక్యంలో, వారికి వార్ధక్యం అనే భావాన్ని లేకుండా చేస్తాడు, చూస్తాడు.

## ధనూ రాశి - స్త్రీ

ఈ రాశిలో జన్మించిన స్త్రీకి వాచాలత్వం ఎక్కువ. ఆమె మాటలు ఎదుటవారి హృదయాన్ని గాయపరచేటట్లు ములుకులుగా గ్రుచ్చుకొనేటట్లు చేస్తాయి. ఈ సంభాషణలో పెడసరి మాటలు ఎక్కువగా దొర్లుతాయి. కాని ఎదుట వారిమనసును గాయపరిచే ఉద్దేశ్యంతో సంభాషించదు. ఎవరు ఏమనుకొన్నా సరే కుండబ్రద్దలు కొట్టినట్లుగామాట్లాడడంయిామె సహజ లక్షణం. ఎదుటివారి లోపాలను బహిర్గతం చేయడంలో యిామె సిద్ధహస్తు రాలు. లౌకికం తెలియకుండా పరిస్థితులను గమనించ కుండా నిజాన్ని నిష్టురంగా పదిమందిలో చెప్పగలదు. చాల కలుపుగోలుతనంగా వుండే మనస్తత్వం. తనలో దుఃఖాన్ని బహిర్గతం చేయకుండా పదిమందిలోను సరదాగా నవ్వుతు గడపగల్గే మనస్తత్వం. చాల చనువుగా అందరితోను వుండటం చేత కొంత మంది యిామె నడవడికను తప్పుగా అర్థం చేసుకొంటారు. కాని యిామెకు మంచి నడవడిక వుండి సంప్రదాయాల విలువలను గౌరవిస్తుంది. తనను నమ్మిన వారిని ఎపుడు కించపరచదు. అలాగే తాను నమ్మిన వారిని ఎపుడు గౌరవిస్తూనే వుంటుంది. ఇంటి పనులపై అంతగా శ్రద్ధ చూపించదు. తనకు తానుగా గృహంలోని వస్తువుల సర్దుబాటు చేయదు యింటి పరిశుభ్రత ఎవరైనా చేస్తే ఆనందిస్తుంది. అంటే

యింటిపనుల యందు తాను యిష్టం చూపదు. అందువల్ల యీామె ఇల్లు సగటు మధ్య తరగతి కుటుంబ యింటిలాగే వుంటుంది కాని పెద్ద భవనంలో ఉన్నా ఆ యింటిని అలంకరించదు. వంట విషయంలో కూడ శ్రద్ధ చూపక తినేవారి మెప్పుదల ఆశించక తనకు తోచిన విధంగా రుచులకు ప్రాధాన్యం యివ్వక వండి వారుస్తుంది. అందువల్లే యీామెకు మంచి గృహిణిగా పేరు రాదు.

## మకరరాశి - పురుషుడు

ఈ రాశినందు పుట్టిన పురుషుడు తాను చేయదలచుకొన్న కార్యక్రమాన్ని అది పూర్తి చేసే వరకు అవిరామకృషి జరుపుతూనే వుంటాడు. ఆ కృషిలో ఎన్ని అడ్డంకులు ఎదురైనా తన లక్ష్యసాధన మఱచిపోడు. ఆఖరికి పట్టుదలతో విజయం సాధిస్తాడు. ఏదో సాధించాలని తపన ఎక్కువ వుంటుంది. సాధారణంగా ఒంటరితనం కోరుకోడు. ఎపుడు స్నేహితుల మధ్య గడుపుతూ వుంటాడు. ఈ పురుషుడికి నచ్చని అంశం అంటూ ఏది ఉండదు అంటే రాజకీయాలు, వ్యాపారం, వ్యవసాయం, వేదాంత, పురాణేతి హాసాలు లాంటి అంశాల మీద గాని లేక లలితమైన ప్రాపంచిక కళా నిర్దుష్టమైన సంగీతం, సినిమాలు వాటి గురించి ఎక్కువ సేపు తన ఊసుపోక కోసం గంటల తరబడి మాట్లాడానికి యిష్టపడతాడు. ఊక దంపుడు ఉపన్యాసాలు చేయడంలో సిద్ధహస్తుడు. ఇతరుల యొక్క జీవిత సరళిని వారి నిత్యకృత్యాలను తెలుసుకోవాలనే ఆసక్తి కుతూహలం ఎక్కువ. ప్రతివారి జీవితంలో తొంగి చూసి వారి కుటుంబ రహస్యాలను తెలుసుకొంటే గాని తృప్తి చెందరు. వీరు అందరికి తాము ఎంత గొప్ప వారో తెలియజెప్పటానికి ఎక్కువ ఆత్రుత చూపుతారు. పరిచయం లేని వ్యక్తులకు కూడ సమయ సందర్భాలు పాటించక ఉచిత సలహాలు యిస్తూ వుంటారు. అడగకుండానే సహాయ సహకారాలు ఎవరికైనా అందించడానికి ముందుకువస్తారు. ఆ సహాయములోని అంతరార్థము తమ స్వలాభమని యితరులు గమనించరు. వీరికిఏదైన లలిత కళ మీద ఎక్కువ అభిమానం ఆసక్తి వుంటుంది. ప్రతి విషయంలోను తమకుతెలిసిన విషయాన్ని యితరులకు చెప్పి తాను ఎంత తెలివిమంతులో అని సూచిస్తారు. వీరి ఆరోగ్యం చాల బాగుంటుంది. సాధారణంగా ఎపుడు అనారోగ్యానికి లోనుకారు. సమాజంలో అందరి తోను మసలుతు వున్నా ఆ

సమాజంలో వచ్చే మార్పుల వల్ల వీరు ఆ మార్పుల ప్రభావంవల్ల తమ యొక్క జన్మ స్వభావాన్ని ఎన్నటికి మార్చుకోరు. ఆధునిక వస్త్రాలంకరణ, పాశ్చాత్యసంస్కృతిని అసలు యిష్టపడరు. ఆ మార్పులోని మంచిని గ్రహిస్తారు గాని మిగిలిన తక్కువతరగతి సంస్కార విహీనమైన సాంప్రదాయాలను ఎప్పుడు సమర్ధించరు. ఒక విషయం ఏమంటే భవిష్యత్ లో తాను ఎవరికి అందనంత ఉచ్ఛస్థితిలోకి ఎదగాలని చేతిలో వున్న పండును జారవిడుచు కొంటారు. అంతర్లీనంగా వుండే తన స్వార్ధాన్ని ఎప్పుడు చేజార్చుకోక లాభం పొందుతారు. ఏ లాభం లేకుండా ఎవరికి ఏ సహాయం చేయరు. ఒకవేళ చేసినా ఆ సహాయాన్ని మఱచిపోక అవసరం వచ్చినపుడు వాడుకుంటాడు. కైకేయి లాగ వాడుకుంటారు.

## మకర రాశి - స్త్రీ

ఈ మకర రాశి స్త్రీకి వుండే ప్రత్యేక లక్షణం సమాజంలో తమ గుర్తింపు కోసం ప్రాకులాడుట అంటే కీర్తి కాంక్ష ఎక్కువ. అందువల్లే వీరికి సంగీతం, నాట్యం, నటనాశక్తి, రాజకీయం, రాజకీయాల్లో ప్రవేశిస్తారు. మంచి సంగీత విద్వాంసురాలుగా గాని, రాజకీయ నాయకురాలిగా ఉంటే సమాజంలో మంచి గుర్తింపు వుంటుందని వారి భావన. ప్రతి రోజు ప్రతిక్షణం అత్యంత వున్నత స్థితికి ఎలా వెళ్లాలి అనేది వీరి ఆలోచన. అందువల్ల పెద్దవారితో పరిచయాలు పెంచుకొంటుంది. వారి యొక్క సహాయంతో తన స్థాయిని పెంచుకోవాలని తాపత్రయపడుతుంది. అందరితోను కలసిమెలసి వారికి యిష్టమైన అంశాన్ని మాట్లాడుతూ వారిని ప్రోత్సాహిస్తుంది. వారిని ఎన్నడు వ్యతిరేకించదు. తన సంపాదన, కీర్తి కోసం వివాహ జీవితాన్ని కూడా త్యాగం చేస్తుంది. అందువల్ల సుఖమయమైన దాంపత్య జీవితం వుండదు. తనకంటే తక్కువ వారిని లేక తనకు ఉపయోగపడని వారిని దరి చేరనివ్వదు. వీరు ఆకర్షణీయంగా వుంటారు. అమాయకంగాను మృదువుగాను సంభాషిస్తారు. మంచి వస్త్రాలంకరణ యందు మక్కువ ఎక్కువ. తన మాటే చెల్లుబాటు కావాలనే వుద్దేశ్యంతో భర్తతో కూడ కర్కశంగా ప్రవర్తిస్తుంది. భర్తని గౌరవించక తగిన విలువ యివ్వక ఆతనిని చిన్న చూపు చూస్తుంది. తన సంసారం మీద ధృత రాష్ట్ర ప్రేమ కనబరుస్తుంది. అందువల్ల యీమె పెంపకంలో పెరిగిన సంతానం కూడ యీ గుణాలతోనే

వ్యక్తీకరిస్తారు. ఆత్మవిశ్వాసం వున్నా అహంకారంగా యితరులకు కనబడుతుంది. ఈ రాశి స్త్రీని వివాహం చేసుకొన్న పురుషుడికి చాల సహనం, ఓర్పు, ఉదాసీనత వుండాలని మరచిపోకండి.

## కుంభరాశి పురుషుడు

కుంభరాశి జాతకులకు భావోద్రేకం ఎక్కువ అయినా కూడ చాల వాస్తవిక వాదిగా ఉంటాడు. సమాజంలోని నైసర్గిక పరిస్థితులను ఖచ్చితంగా అంచనావేసి సరియైన విమర్శలనుచేసి ప్రజాబాహుళ్యాన్ని ఒక క్రమపంథాలో నడిపించగల కార్య దక్షత వీరికి ఉంటుంది. అందువల్ల ఒక్కొక్కప్పుడు ప్రజాహితం కోరిన సత్యాన్ని బహిరంగంగా విమర్శించుట వలన కొంత మందికి అప్రియులుగా ఉండవచ్చు. వీరికి హాస్యచతురత్వం ఎక్కువ. తాము చెప్పదలచుకొన్నది సూటిగా చెప్పడమే వీరి లక్ష్యం. తమను విమర్శించేవారిని, వారి యొక్క విమర్శనలను ఉదాసీనతతో తీసుకొంటారు. వీరు చామనచ్ఛాయ రంగు కలిగి సరిసమాన ఎత్తు కలిగి ఉంటారు. చూడడానికి గంభీరంగా కనిపిస్తారు. వారికి సన్నటి మెడ వెడల్పు అయి భుజద్వయం కలిగి ఉంటారు. పృష్ట భాగం పెద్దదిగా ఉంటుంది. వీరు స్వేచ్ఛాప్రియులు. వీరికి మనోవ్యాకులత కలిగినప్పుడు గాని దుఃఖం వచ్చినప్పుడు గాని తమ బాధను ఇతరులతో పంచుకొనక ఒంటరిగా ఉండడానికి ఇష్టపడతారు. వీరికి విప్లవాత్మకమైన అభిప్రాయాలు ఉంటాయి. పాత సాంప్రదాయాలను గుడ్డిగా నమ్మక ఆధునికత్వంలోని మేలు, తార్కికంగా అనుసరిస్తారు. ఈ కుంభరాశి వారు ఎప్పుడు రేపు గురించి ఆలోచిస్తారు గాని ఈ రోజు అనే దాని మీద ఆలోచన ఉండదు. భవిష్యత్తు వారికి చాల ముఖ్యం. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తహతహలాడుతారు. నిండు కుండలాగ తొణకరు బెణకరు కాని వారి హృదయ లోతులలో గంభీరమైన నిర్ణయాలఖని ఉంటుంది. అందుకని ప్రపంచం అంతా యీ రోజు గురించి ఆలోచిస్తే వీరు రేపటి గురించి ఆలోచించి ఆ రేపు అనేది వచ్చినప్పుడు అయోమయంలో పడరు. మాట చేత కూడ నిదానంగా ఉంటాయి. ముఖ్యమైన విషయం ఏమంటే ఎవరినైనా ఓదార్పు చేయడానికి వీరికి వీరే సాటి అలాగే కోపోద్రిక్తులైన వారిని బుజ్జగించటంలోను అనునయనం చేయడంలోను వీరి సహనం ప్రతిభ అమోఘంగా

ఉంటుంది. వీరు తరుచు తమ నిర్ణయాలను మార్చుకొని అలా నిర్ణయం ఎందుకు మార్చోకోవలసివచ్చిందో వివరంగా చెప్పి అందరిని మెప్పించగలిగిన సామర్థ్యం వీరికి ఎక్కువగా ఉంటుంది. ఈ జాతకులు తమ అభిప్రాయాలను నిర్మోహమాటంగా చెప్పగలరు కాని వారి ఉద్దేశ్యాలను ఎవరి మీద బలవంతంగా రుద్దరు. తమ మాటలను వినని వారికి దూరంగా ఉంటారు. ఏ విషయాన్ని అయినా ఎవరితోనైనా సరే పదేపదే చెప్పడానికి యిష్టపడరు. ఎదుటి వారి మనస్తత్వాన్ని తేలికగా గ్రహించి తదనుగుణంగా నడచుకుంటారు. వీరు ముక్కుకు సూటిగా పోయేవారు. అబద్ధం, మోసం, కుటిలత్వం, లౌక్యం లాంటివి వీరికి నచ్చవు వీరు ఎప్పుడు ఋణం తీసుకోవడం. గాని ఋణం యివ్వడం గాని చేయరు. ఋణం ఇచ్చే బదులు ఉచితంగా యివ్వడం మేలని వీరి భావం. వీరు నిజమైన అదర్శవాదులుగా ఉంటారు. సమాజ సేవ, సంఘసేవ అవసరం వచ్చినప్పుడు తప్పక చేస్తారు. కాని ప్రజాసేవ సంఘసేవయని శుష్క ప్రవచనాలు వచించరు.

## కుంభరాశి స్త్రీ

ఈ రాశిలో జన్మించిన స్త్రీకి ప్రపంచజ్ఞానం ఎక్కువ ఉంటుంది. ఆలోచనలు భవిష్యత్తును తాను నిర్ణయించే దిశగా పయనిస్తాయి. సేవా తత్పరత ఎక్కువగా ఉంటుంది. వ్యక్తిగత న్యాయంలోను, సామాజిక న్యాయంలో తేడాలను చక్కగా విశ్లేషించుకుంటుంది. ఎక్కువ శారీరక సుఖానికి వెంపర్లాడక చక్కని గృహిణిగా తన బాధ్యతను నిర్వర్తిస్తుంది. తన బాధను తనలోనే దాచుకొని పైకి చిరునవ్వుతో మసలుగలదు. వీరికి నచ్చని మనుషులు గాని వస్తువులు గాని వదిలివేయడానికి ఏమాత్రం సంకోచించరు. అందువల్లే కుంభరాశి స్త్రీలలో విడాకులు ఎక్కువని గమనించవచ్చు. వైవాహిక జీవితంలో వీరికి నైతికత చాల ముఖ్యం. ఈ నిజాయితి లేకపోతే భర్తను కూడ భరించక అతని నుంచి విడాకులు తీసుకొంటుంది. ఈ రాశి స్త్రీ ఎప్పుడు అప్పు అడగదు. ఒక వేళ అవసరార్థం ఏమైనా తీసుకొన్న మాటకు కట్టుబడి సమయానికి చెల్లించి వేస్తుంది. అలాగే ఇతరులు తీసుకొన్న ఋణం వారు తగిన సమయంలో చెల్లించకపోతే కఠినంగా వ్యవహరిస్తుంది. ఈ రాశి స్త్రీలు ఆకర్షణీయంగాను ప్రసన్నతతో ఉట్టిపడుతుంది. తాను నమ్మిన న్యాయ కోసం పట్టుదలతో

తుది వరకు పోట్లాడుతారు. ఎక్కువ సానుభూతి సహాయం చేసే స్వభావం, ఇతరులలోని లోపాలను వారికి సున్నితంగా తెలియజెప్పి వారిలో మార్పు తేవడం వీరి సహజలక్షణం. వీరు ఇతరుల మీద ఆధారపడక తమ పనులను తామే చేసుకొంటారు గాని ఇతరుల మీద ఆధారపడరు. వీరికి మంత్ర విద్యల మీద దైవ శాస్త్రాల మీద ఎక్కువ నమ్మకం ఉంటుంది. పునర్జన్మ, కర్మసిద్ధాంతం మీద వారికి ఉండే నమ్మకం మిగిలిన ఏ రాశి వారికి ఉండకపోవచ్చు. వీరికి అసూయ అనేది తెలియదు. ఇతరులలోని ఔన్నత్యాన్ని పాండిత్యాన్ని మేధోసంపత్తిని, గుర్తించి వారికి చేదోడువాదోడుగా ఉండి వారి యొక్క గొప్పతనాన్ని ఇతరులకు చాటి చెప్పడం వారిలోని ప్రత్యేకత. అసూయలేని వారై యిలాంటి ప్రవృత్తితో మెలిగే వారు యీ రాశి వారు మాత్రమే. వీరి ఆహార్యం శిరోజాలంకారం వీరి ప్రత్యేకతను చాటుతాయి. వీరికి సహనం ఎక్కువ. అందరిని మానవీయతతో పలకరించి అభిమానించే స్వభావం కలవారు. తమపర భేదము లేకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించే న్యాయబుద్ధి వారికి ఉంటుంది. కష్టపడి పనిచేసే తత్త్వం ఉంటుంది. ఏ వస్తువునైనా ఎక్కువకాలం వాడుకోవాలని జాగ్రత్త వహిస్తుంది.

## మీనరాశి పురుషుడు

వీరు భావోద్రేకాలతోను ఊహాలోకంలోను ఎప్పుడు విహరించరు. సృజనశక్తి ఎక్కువ. నిజజీవితంలో అనుభవాలను క్రోడికరించుకొని భావిజీవితానికి పునాదులు వేసుకొంటారు. సాధారణంగా 35 సంవత్సరాల వయస్సులో వీరికి మంచి అభివృద్ధి వస్తుంది. సత్యం, ధర్మం, ధార్మికత వీరికి ఎక్కువ. ఎవరికి అన్యాయం చేయరు. వీరికి ముందు విద్య శాస్త్రజ్ఞానం, లలితకళా జ్ఞానం భాషాపటిమ ఉంటాయి. కాని వాటిలో ఉన్నత స్థితికి ఎదగలేరు. సామాన్యమైన ధనసంపాదన సుఖమయమైన దాంపత్యజీవితం ఉంటుంది. పుత్ర సంతానం ఉండకపోవచ్చు. వీరికి సామాన్యమైన సంపాదన మాత్రమే ఉంటుంది. స్త్రీ వాంఛ ఎక్కువ. ఎక్కువ స్త్రీ వ్యామోహం ఉన్నా అది పరులకు తెలియని ప్రణయ రహస్యంగానే మిగిలిపోతుంది. కడుపులోని రహస్యం ఎన్నడు బహిర్గతం కాదు. సాధారణంగా వీరు నిదానంగా మాట్లాడం ఏపని అయినా తీవ్రంగా ఆలోచించి ఒక నిర్ణయానికి వస్తారు. పెద్ద గొంతుతో మాట్లాడుటగాని

పెద్దగా వాదులాటలు గాని ఎన్నడు చెయ్యరు. వీరికి (కీలెరిగి) వాత పెట్టుటివెన్నతో బెట్టిన విద్య. అంటే తమ సమయం వచ్చే వరకు వేచి ఉంటారు. వీరికి జాలి, సానుభూతి ఎక్కువ. అందాన్ని ఆరాధించే గుణం ఎక్కువగా ఉంటుంది. మేష, సింహ, రాశి స్త్రీలతో వీరి మనస్తత్వం కలువదు. ఎక్కువ శరీరధారాధ్యం ఉండదు. కాని అపారమైన మేధోసంపత్తి ఉంటుంది. వీరికి ఉన్న జ్ఞాపకశక్తికి వీరికి వీరేసాటి. వీరు ఎప్పుడు కూడ జనసందోహంలోకి చొచ్చుకుపోరు. భార్యపిల్లల మీద తన ప్రేమను తన మదిలో తలచుకొని వారిపట్ల తన భాధ్యతలను పరిపూర్ణంగా నిర్వహిస్తారు.

## మీనరాశి స్త్రీ

వీరు చాల ఆకర్షణీయంగాను చెదరని చిరునవ్వుతోను కనిపిస్తారు. వీరి అందం కంటే ఆకర్షణ ఎక్కువ. ఏ పురుషుడు అయినా సరే మీన రాశి కన్యను చూసినపుడు ఆకర్షితుడవుతాడు. మీనరాశి స్త్రీ, ఎప్పుడు ప్రసన్నతగాను పరిశుభ్రంగాను కనిపిస్తుంది. ఎప్పుడు కూడ తన భర్తను అధిగమించడానికి ప్రయత్నం చెయ్యదు. తన భర్త మీద ప్రగాఢమైన నమ్మకం ఉంటుంది. తన జీవితంలో అతని యొక్క రక్షణ ఎప్పుడు కోరుకుంటుంది. పొరపాటునకూడ తన భర్తను పదుగురిలో చులకన చేసి మాట్లాడదు. పైగా అతనిని ఉన్నత లక్షణాలు ఉండే పురుషునిగా చిత్రీకరిస్తుంది. వీరు విద్యలో ఉన్నత ప్రమాణాలు సాధిస్తారు. చాలా మృదు స్వభావులు మరియు సున్నితమనస్కులు. చిన్న విషయానికి కూడ బాధపడే మనస్సు వీరికి ఉంటుంది. భయోత్పాతానికి గురి అయినప్పుడు ధైర్యంగా ఎదురునిలవలేక నిష్క్రమిస్తారు. వీరికి నిగ్రహశక్తి ఎక్కువ. తన సంతానం మీద అతి మక్కువ కలిగి వారిని ఉన్నత స్థితికి ఎదుగుదలకు చాల శ్రమిస్తుంది. వీరికి స్వయంసంపాదన ఉంటుంది. ఆధునిక పోకడలకు పోక సాంప్రదాయ సిద్ధంగానే మంచి ఉన్నత కుటుంబ స్త్రీగా కనపడుతుంది. వారిని చూస్తే ఒక ఆత్మీయురాలును చూసినట్లుగా ఉంటుంది. ఒకసారి చూచి మాట్లాడిన తరువాత ఆమె రూపం మదిలోంచి ఎప్పుడు తొలగిపోదు. ఈమెలోని స్త్రీత్వం గలగల పారే పరవళ్లు కృష్ణనదిలాగకాక నిండు గోదావరిలాగ పరిపూర్ణంగా ఉంటుంది. ఈ స్త్రీ నూటికి నూరు పాళ్లు సుగుణవంతురాలు మరియు ఇంటికి దీపం యిల్లాలని అక్షరాల ఋజువు చేసే గృహిణిగా మీరు గ్రహించాలి.

# అధ్యాయం - 3

## గ్రహధర్మాలు

జ్యోతిష శాస్త్రంతో ఎన్నో గ్రంథాలు ఎందరో మహాపండితులు వ్రాశారు. ఎంతమంది ఎన్ని గ్రంథాలు వ్రాసినా ఆ గ్రంథాలన్నీ మనకున్న గ్రహాల బల, వీక్షణ, స్థాన, మరియు సంయోగం మీదే విశ్లేషణ గావించారు. అంటే ఒక్కొక్క గ్రహం ఇచ్చే ఫలితాలు మనకు స్పష్టంగా తెలియచెప్పారు. గ్రహాలు తొమ్మిది అని మనకు తెలుసు. ఈ నవగ్రహాలలో ఏ గ్రహానికి ఏ రాశి యొక్క ఆధిపత్యం ఉందో మనం ముందు అధ్యాయంలోనే నేర్చుకున్నాము. రవి, చంద్రులకు తప్ప ఇతర గ్రహాలన్నిటికి రెండేసి రాశులు ఆధిపత్యం ఉంది. ఒక్క సూర్య చంద్రులకే అలాంటి ఆధిపత్యం లేదు. ఎందుకంటే రెండేసి రాశుల ఆధిపత్యం కలిగి ఉన్న ఆ గ్రహాలకు వక్రగతి, స్థంభన లాంటివి సహజం. కాని రవిచంద్రులకు వక్రగతి, స్థంభన లాంటివి ఉండవు. ఒక నిర్దుష్టమైనకక్ష్యలో తన సరియగు వేగప్రయాణానికిఎటువంటి పరిస్థితుల లోను మార్పుఉండదు. అలా నిరంతరం చక్రభ్రమణం చేస్తూనే ఉంటాయి. అందువల్లే సూర్య చంద్రుల రాశులు మిత్ర రాశులగా ఉటంకించారు. గ్రహాలకు అధిపతిగా సూర్యుడిని ఈ భూమిమీద ఉన్నా మానవజాతి అందరూ కొలుస్తారు. ప్రాణదాతగా పూజిస్తారు. అందువల్ల మనం ఒక్కొక్క గ్రహాన్ని పూర్తిగా అవగాహన చేసుకోవాలి. అలా ఒక అవగాహన కావాలంటే మనం గ్రహ జీవిత విశేషాలను చదవాలి కాబట్టి మనం ఇప్పుడు గ్రహాధిపతి అయిన సూర్యునితో మొదలుపెడదాం.

## సూర్యుడు

అంతరిక్షంలో అత్యంత కాంతివంతంగా ఉదయ సాయంత్రాలలో సిందూరపురంగులో కన్నులకు పండుగగా గోళాకారంలో సువర్ణవర్ణంతో మెరిసిపోతూ ఉంటాడు. అపహార్ణ సమయంలో తీక్షణమైన ఉష్ణకిరణాలు ప్రసరింపచేస్తూ తనను

ఎవరూ నగ్న నయనములలో చూడలేనంత తీక్షణంగా కాంతి పుంజములు వెదజల్లుతూ ఉంటాడు. జ్యోతిష శాస్త్రంలో సూర్యుడిని సాధారణంగా గౌరవ భావంగా రవి అని పేర్కొంటారు. ఈ రవి అన్ని గ్రహాలకు అధిపతి. అంతరిక్షంలో చక్రభ్రమణం చేసే ప్రతిగ్రహము సూర్య ప్రదక్షిణ చేస్తూనే ఉంటుంది. అలా ప్రతిగ్రహం సూర్య ప్రదక్షిణ చేసేటప్పుడు ఒక్కొక్కసారి తమ తమ స్థిర కక్ష్య మార్గం గురించి బయటపడటం లేక నిర్దుష్ట వేగం కంటే ఎక్కువ వేగంగా పయనించడం లేకవేగం తగ్గించడం లాంటివి చేస్తాయి. అలా ఒక గ్రహం వేగం పెంచినపుడు మరొక గ్రహం దాన్ని ఢీ కొట్టవచ్చు అలా కాకుండా గ్రహాధిపతి అయిన సూర్యుడు తన అత్యంత ప్రచండమైనఅయ స్కాంత ఆకర్షతో గ్రహాల వేగాలను సరి చేసి మరల వాటిని తమ కక్షలలో ప్రవేశింప చేస్తాడు. అందువల్ల సూర్యుడు గ్రహ భ్రమణములను ఒక్కొక్కపుడు వక్రగతిలో ఉంచడం, స్థంభన చేయడం మరొకసారి వేగాన్ని పెంచడం చేస్తాడు. అంటే గ్రహాల పరిభ్రమణములన్ని సూర్యుని ఆజ్ఞ మేరకే భ్రమిస్తాయని మనం అనుకోవచ్చు. ఉదాహరణకు నాలుగు రోడ్ల కూడలిలోఉన్న ట్రాఫిక్ సిగ్నల్సు ఎలా వాహనాలను నియంత్రిస్తాయో అలాగా సూర్యుడు గ్రహాల పయన వేగాన్ని అనుకూలమైన పద్ధతిలో ప్రమాదరహితంగా నియంత్రిస్తాడని మనం అనుకోవచ్చు.

జోతిష్య శాస్త్రం మొత్తం గ్రహాల మీద ఆధారపడి వాటి నైజం, సహజ ప్రవృత్తి, వీక్షణ, సంయోగం స్థాన బలిమిని పరిశీలించి మనం ఫలితాలు చెప్పడం అనేది ముఖ్యమైన విశ్లేషణ అని తెలుసు. ఆ విశ్లేషణలో భూత, వర్తమాన, భవిష్యత్ కాలాల జీవితసరళిని మనం చెప్తాం. అటువంటప్పుడు మనం ప్రతిగ్రహం యొక్క సహజ జీవిత చరిత్రను తెలుసుకోవడం అతి ముఖ్యమైన విషయమని మనం గ్రహించాలి. ఎందుకంటే గ్రహా సహజ ప్రవృత్తిని తెలుసుకోకుండా ఆ గ్రహాలు ఎలాంటి ఫలితాలు యిస్తారో చెప్పడం సాధ్యం కాదు. మనం ఒకవేళ ఊహించి చెప్పినా కూడ ఆ ఫలితాలు వాస్తవానికి దూరంగా వుంటాయే తప్ప నిజ జీవితంలోని సంఘటనలను విడమర్చి విప్పి చెప్పలేం. వాస్తవానికి ఊహించి చెప్పినది శాస్త్ర సమ్మతం కాదు. గ్రహ పరిశీలనానంతరం చెప్పే ఫలితాలు శాస్త్రానుకూలంగా వుంటాయి కాబట్టి ఆ ఫలితాలు నమ్మతగినవిగా వుంటాయి. మనం యిప్పుడు ప్రతి గ్రహం యొక్క కారకత్వాన్ని గురించి తెలుసుకొందాము.

మొదట గ్రహాధిపతి అయిన సూర్య భగవానుని గూర్చి క్షుణ్ణంగా తెలుసు కొందాము. సూర్యుణ్ణి జ్యోతిషశాస్త్రంలో ఎక్కువగా రవి అనే పేరుతో పిలుస్తూ వుంటారు. ఈ సూర్యుణ్ణి కొందరు ఆదిత్యుడు అని కూడ జ్యోతిష శాస్త్రంలో వాడుతారు. ఉదాహరణకు, బుధుడు మరియు సూర్యుడు ఒకే రాశిలో కలిసి వుంటే ఆ కలియిక వల్ల ఆ జాతకులకు శుభఫలితం కలుగుతుంది. అలా కలిగిన శుభ ఫలితాన్ని యోగం అని అంటారు. అలాగ బుధ సూర్యుడు ఏకరాశిలో కలిసివున్నప్పుడు ఆ యోగాన్ని బుధా ఆదిత్య యోగమని అంటారు. మౌలికంగా సూర్యుడు నిశ్చలుడు. సంచాల గ్రహాలకు అతీతంగా స్థిరస్థితిలో వుంటాడు. అన్ని గ్రహాలు సూర్యాధిపత్యానికి లోబడి సూర్యుని యొక్క అత్యంత అయస్కాంత ప్రభావంతో సూర్యుని చుట్టు ప్రదక్షిణాలు చేస్తునే వుంటాయి. ఈ ప్రదక్షిణాలు సవ్యమార్గాలలోనే సూర్యుని చుట్టూ తిరుగుతు వుంటాయి. అందువల్లే మన హిందూ సాంప్రదాయంలో మనం ఏ మందిరానికి వెళ్లినా నవగ్రహాలకు సవ్యంగానే ప్రదక్షిణ చేసి సత్ఫలితాలు పొందుతాము. అంటే తమ భగవానుడు అయిన సూర్యుని చుట్టూ ఎలా తిరుగుతాయో అలాగే మనం సత్ఫలితాలకోసం గ్రహ ప్రదక్షిణలు చేయాలని శాస్త్ర ఉవాచ. ఒక విషయం ఏమంటే అంతరిక్షంలో అన్ని గ్రహాలు తమ తమ కక్ష్యలో సూర్యభ్రమణం చేస్తూవున్నా ప్రతి గ్రహం ఒకే వేగంతో పయనించవు. ప్రతి గ్రహానికి ఒక నిర్దుష్టమైన వేగాన్ని సూర్యుడు ప్రసాదిస్తాడు. అవసరాన్ని బట్టి గ్రహాల వేగాన్ని పెంచడం తగ్గించడం మరియు స్థంభన యింకా వక్రగతిలాంటివి నియంత్రిస్తూగ్రహాల భ్రమణాన్ని ఒకదానితో మరొకటి 'ఢీ' కొట్టకుండా యీ యావత్తు ప్రపంచాన్ని కాపాడుతాడు.

సూర్యుడు సకల లోకాలకు వెలుగును ప్రసాదించడమే కాక, మానవ జీవితము నకు కావలసినంత వేడిమిని ప్రసరింపజేస్తూ మానవ మనుగడకే ప్రాణదాత అయిన అత్యంత పవిత్ర గ్రహం సూర్యుడని మన అందరకు తెలుసు. అందువల్లనే మానవులు ఏ దేశమందైనా సూర్యుడిని భగవానుడుగా ఎంచి సూర్యోపాసన భక్తిశ్రద్ధలతో చేస్తారు. సూర్యుడు మాఘశుద్ధ సప్తమి ఆదివారం కృత్తిక నక్షత్రంలో జన్మించాడు. అతని జన్మతో అంధకారంలో వున్నప్రాణ రహిత యీ భూమి మీద వెలుగు పడిప్రాణోత్పత్తి జరిగింది. అందువల్లే మానవకోటికి అంతకు అతి పవిత్రుడుగా ప్రాణదాతగా సూర్య

భగవానుడిని కొలుస్తారు. ఎందుకంటే సూర్యకాంతి లేకుండ ఏ జీవి జీవించలేదు. సూర్యుడు కశ్యప మహాముని కుమారుడు. ఇతనికి యిద్దరు భార్యలు, వారి పేర్లు ఛాయ మరియు ఉష. సూర్యుడు ప్రభవనామ సంవత్సరంలో జన్మించాడు. అంటే సూర్యుని జన్మతో మనకు నక్షత్ర సంఖ్య గుణించడం మొదలవుతుంది. అందువల్లనే మనకున్న 60 సంవత్సరాలలో ప్రధమ సంవత్సరం ప్రభవ నామ సంవత్సరంతో ప్రారంభం అవుతుందని గ్రహించాలి. సూర్యునిది కాశ్యపస గోత్రం. మామగారి పేరు విశ్వకర్మ.

జాతక చక్రంలో రవి సింహరాశికి అధిపతి. అంటే మేషం నుండి లెక్క పెట్టినపుడు పంచమ రాశి అయిన క్షేత్రాధిపతి. తన ఆధిపత్యంలో ఉన్న రాశిలో మఖ నక్షత్రంలో4 పాదాలు అలాగే పుబ్బ నక్షత్రంలో 4 పాదాలు ఉత్తరలోని మొదటి పాదం ఉంటాయి. తన రాశిలో ఉన్నా ఆ నక్షత్రాలకు ఆధిపత్యం మాత్రం వేరు గ్రహాలకు ఉంటాయి. మఖ నక్షత్రానికి కేతువు, పుబ్బ నక్షత్రానికి శుక్రుడు అధిపతులు. కాని ఉత్తర నక్షత్రానికి అధిపతి సూర్యుడే అని మనం గమనించాలి. ఉత్తర నక్షత్రమే కాకుండా రవికి కృత్తిక, ఉత్తరాషాఢ నక్షత్రాల మీద ఆధిపత్యం ఉంది. మఖ, పుబ్బ, ఉత్తర నక్షత్రాలలో మొదటి నక్షత్రం అంటే మఖ, రాక్షస గణానికి చెందినది. మిగిలిన రెండు నక్షత్రాలు అంటే పుబ్బ మరియు ఉత్తర మానవగణానికి చెందినది. మేషరాశిలో సూర్యుడు ఉచ్ఛస్థితిలో వుంటాడు. అంటే అత్యంత బలంగాను మరియు మిక్కిలి తేజస్సుతోను మరియు తీవ్రమైన ఉష్ణంతో మిక్కిలి తేజరిల్లుతూ వుంటాడు. అందుకనే ప్రధమ రాశి మేషం సూర్యునికి ఉచ్ఛ క్షేత్రమని మహా పండితులు ఋషులు మనకుతెలియచెప్పారు.అయినాకూడ తులా రాశిలో నిర్బలుడు అవుతాడు. ఒక విషయం ఏమంటే సూర్యచంద్రులు తప్ప మరి అన్ని గ్రహాలకు రెండు రాశులకు ఆధిపత్యం వుంటుంది. కాని సూర్యచంద్రులకు మాత్రం ఏకారాశి ఆధిపత్యం వుంటుంది. సూర్యునికి సింహరాశి స్వక్షేత్రం. సూర్యుడు ప్రతి రాశిలోను ముప్పై రోజులుంటాడు. ఆ 30 రోజుల అనంతరం తదుపరి రాశులలో ప్రవేశిస్తాడు. ప్రతిరాశిలోను 30 రోజులు వుంటాడు. కాబట్టి ఒకరోజును ఒక డిగ్రీగా ఏర్పరచి మొత్తానికి రాశిలో 30 డిగ్రీలుంటాయని నిర్ణయిం చారు. అంటే సూర్యుని యొక్క ప్రభావాన్నే తీసుకొని

డిగ్రీలను ఏర్పాటు చేసారు. ఎందుకంటే ఈ కాల నిర్ణయం సూర్యప్రభావానికి లోబడి వుంటుంది.మరియే గ్రహం కూడ ఒక రాశిలో 30 దినములుండుట సంభవించదు. సూర్యుడు ఒక రాశిలోంచి ముందు రాశికిజరిగినపుడు అలా జరిగే మధ్య కాలాన్ని సంక్రమణం అని అంటారు.సూర్యుడు ప్రతిరాశినుంచి30 రోజుల తరువాత అంటే ఒక మాసం తరువాత తదుపరి రాశులకు జరుగుతూ అలా 12 రాశులలో 12×30 = సుమారుగా 365 రోజులు కాలం తీసుకొంటాడు. దానినే మనం ఒక సంవత్సర మని అంటాము. దానిబట్టి మాసాలు, సంవత్సరాలు గుణించగల్గుతున్నాం. ఈ చక్రభ్రమ ణంలో సూర్యుడు తూర్పు నుంచి పడమరకు ఉత్తర దిశగా పయనించినపుడు ఉత్తరాయణ మని, దక్షిణ దిశగా పయనించినపుడు దక్షిణాయమని అంటారు. అయనం అంటే ఆరుమాసా లని అర్థం. సూర్యుడు జనవరి 13 లేక 14 నుండి ఉత్తర దిశగా జూన్ 13 లేక 14 వరకు పయనిస్తాడు. ఇలా పయనించినపుడు ఉత్తరాయణ పుణ్యకాలమని అంటారు. ఈ కాలంలో ఏ కార్యం తలపెట్టినా శుభం కల్గుతుందని మన విశ్వాసం.అందుకనే మహా భారత యుద్ధంలో భీష్మాచార్యుల వారు అంపశయ్య మీద పరుండి ఉత్తరాయణపుణ్యకాలం వచ్చే వరకు వేచివుండి ఉత్తరాయణ పుణ్యకాలం వచ్చిన తరువాతనే తనువు చలించి స్వర్గధామం చేరుకొన్నాడు.ఎందు కంటే భీష్మాచార్యుల వారు తనకు యిష్టం వచ్చినపుడు తనువు చాలించే శాక్తికేయ వరప్రసాదుడు. ఈ ఉత్తరాయణం సూర్యుడు మకరరాశిలో ప్రవేశించిన సమయం నుంచి ప్రారంభ మవుతుంది. ఈ సమయాన్ని మనం అత్యంత భక్తి శ్రద్ధలతో సూర్యుణ్ణి ఆరాధిస్తాం. సూర్యుడు మకర రాశిలో ప్రవేశించిన తేది నుండి ఒక్కొక్క రాశిలో ఒక మాసం వుంటూ ఆరు మాసాల తరువాత మిధున రాశిలో సుమారు జూన్ 15వ తారీఖున ప్రవేశిస్తాడు. అప్పటి నుంచి దక్షిణాయనం ప్రారంభం అవుతుంది. మళ్లీ ప్రతి రాశిలోను ఒక మాసం చొప్పున వుంటూ తూర్పు నుండి దక్షిణ దిశగా ప్రయాణిస్తూ మళ్లీ మకర రాశిలో ప్రవేశించే వరకు ఆ కాలాన్ని దక్షిణాయనం అని మనం తెలుసుకోవాలి. సూర్యుడు మకర రాశిలో ప్రవేశించినపుడు ఆ సమయంలో పుణ్య నదులలో స్నానాలు చేస్తారు. అత్యంత భక్తి శ్రద్ధలతో గ్రహాధిపతియైన ఆదిత్యుని ఆరాధించి దానధర్మాలు చేసి పండగ చేసుకొంటారు. ఈ పండగే మనం మకర సంక్రాంతి అని అంటాం. సూర్యుడు మకర రాశిలో ప్రవేశించాడు

కాబట్టి మకర సంక్రమణం అని కూడ అంటారు. ఈ ఉత్తరాయణం పుణ్యకాలంలోనే ఎక్కువ శుభకార్యాలు చేస్తారు. ఎందుకంటే ఏ కార్యం తలపెట్టినా ఏ అడ్డంకి రాక ఆ శుభకార్యం నిర్విఘ్నంగాను మరియు జయంగాను జరగుతుందని మన హిందూమత విశ్వాసం, అందువల్లనే మహాభారతంలో అర్జునుడు ఉత్తర గోగ్రహణంలో తన పాంచజన్యం పూరించి పూర్తి జయాన్ని పొందుతాడు. అలాగే కురు మహా సంగ్రామంలో భీష్మాచార్యులవారు అంపశయ్యపై పరుండి ఉత్తరాయణ పుణ్యకాలం వరకు వేచివుండి సూర్యభగవానుడు మకరరాశిలో ప్రవేశించిన పిమ్మట తనువు చాలించాడు. శారీరకంగా సూర్యుడు పురుషుడు. రుధిరవర్ణ సింధూర రంగులో అత్యంత వైభవంతో ఊహించలేనిఉష్ణంతో ప్రతిభావంతంగా తేజస్సుతో వెలిగిపోతూ ప్రతిక్షణం ఉష్ణాన్ని ప్రజ్వలింపజేస్తూ వుంటాడు. అందుకనే ఏ జీవి తన నగ్న నయనాలతో సూర్య దర్శనం చేయలేదు. ఏ జాతకుడుఅయినా సరే సూర్య మహా దశలో వున్నపుడు రవి ప్రభావం అతని మీద పడుతుంది. అందు వల్ల ఆ రవి మహా దశలో ఆ జాతకుడు ఎక్కువ కోపోద్రేకాలకు లోనవుతాడు. చాల పౌరుషంగాను నాయక లక్షణాలు కలిగి వుంటాడు. ఆత్మాభిమానం ఎక్కువగా వుంటుంది. కాని అతని కోసం తాత్కాలికం మరియ క్షణికం. క్షమాగుణం ఎక్కువ వుంటుంది. కోపించిన వారిపైన పగ ప్రతీకార వాంఛ లేక క్షమా భిక్ష అనుగ్రహిస్తాడు. అంటే సూర్య మహార్దశలో కోపోద్రేకాలే కాక ధర్మగుణాలు క్షమాభిక్ష, జాలితనం ఎక్కువగా వుంటాయి. ధనాదాయం కలిగి ఆ ధనాన్ని న్యాయబద్ధంగాను మరియు ధర్మకార్యాలకై వినియోగిస్తాడు. సాధారణంగా ఎట్టి రుగ్మతలకు లోను కాడు. బంధుమిత్రులతో మంచి సఖ్యంగా వుంటాడు. అంటే సూర్యుడు అత్యంత తేజస్సుతో వెలుగుతున్నట్లు ఏ జాతకుడు అయినా సరే సూర్య మహాదశలో అన్ని విషయాలలోను జయం పొంది కార్యసాధకులుగా రాణిస్తారు. ఒక ముఖ్య విషయం గమనించ తగ్గ విషయం ఏమంటే రవి మహర్దశ అంత్య సమయాలలో సూర్య సంధ్యా సమయంలో అస్తమించినట్లుగానే యీ జాతకునకు రవి మహర్దశలోనే వైభవం తగ్గి కొన్నిసార్లు లేమికి లోనై అనుకోని విధంగా కష్టనష్టాలు చవి చూస్తూ మానసికంగా బాధపడతాడు. తల్లితండ్రుల తోను, బంధుమిత్రులతోను వాదనలు చేసి వారితో సత్సంబంధాలను పోగొట్టుకొని అందరితో శత్రుత్వాన్ని

పెంచుకొంటాడు. ఇంకొక విషయమేమంటే రవి మహర్దశలో జాతక గ్రహస్థితిని బట్టి కొంత మంది జాతకులకు కొన్ని దుష్ఫలితాలు కూడ వస్తాయి. సూర్యుడు ఆ జాతకుని భార్య అనారోగ్యం వల్ల ధన నష్టం, వృధా ఖర్చులాంటి ఫలితాలు యిస్తాడు. నడివయసులో ఏ జాతకునికైనా రవి మహర్దశ వచ్చినట్లైతే ఆ జాతకుడు ఖల్వాటుడు అవుతాడు. అదేకాకుండా గుండె, వెన్నుముక, చేతి మణికట్టు మొదలైన అంగాలకు అనారోగ్యం కల్గి ఆ అనారోగ్యం అతను మరణించే వరకు వుండిపోతుంది. స్త్రీ అయితే ఎడమ కంటికి పురుషునికి కుడి కంటికి అనారోగ్యం కలిగి దృష్టిలోపం కూడ సంభవించవచ్చు. నయనాలకు శుక్లములుపెరిగి శస్త్ర చికిత్సకు లోనవుతారు. ఎంత వైద్య సహాయం పొందినా సూర్య ప్రభావం వల్ల పూర్తిగా నివారణ లేదు. కాని బాధ పరితప్త హృదయుడై ఉన్న ఆ జాతకునికి ఉధృతమైన దుష్ఫలితాలను తగ్గించుకోవడానికి దైవ బలం కూడా కావాలి. అందువల్ల ఆ జాతకుడు సూర్య భగవానుని, సూర్యోదయ కాలంలోను ఆదిత్య హృదయం పఠించి సూర్యుని మూల మంత్రాన్ని భక్తి శ్రద్ధలతో జపిస్తే తనకు వ్యాధి వల్ల కలిగే శారీరక బాధ నుంచి ఎంతో ఉపశమనం పొందు తాడు. మీ సౌలభ్యం కొఱకు సూర్య మూల మంత్రం ఇక్కడ ఇస్తున్నాను. "ఓం- హ్రాం- హ్రీం-హ్రీం-సమ్- సూర్యాయ నమః" ఈ మంత్రాన్ని మధ్యలో ఆపకుండ ప్రతిసారి ఒకే శ్వాసలో భక్తి శ్రద్ధలతో ఉచ్ఛరించాలి. పూజానంతరం నిండుదోసెడు నీరు తీసుకొని సూర్యునికి అర్ఘ్యం వదలాలి. నీరు దోసిలలోకి తీసుకొనునపుడు రెండు అరచేతుల మధ్య భాగం నుంచి నీరు ప్రవహించకుడా జాగ్రత్త వహించాలి. ఇలా ఆ జాతకుడు ఉపశమనం కోసం తనకు రవి మహర్దశ ఉన్నంత కాలం ప్రతిరోజు నియమ నిష్టలతో చేయాలి. ఇలా ప్రతి నిత్యం చేయుట వల్ల రవి మహర్దశలో కలిగే తీవ్ర దుష్పరిణామాలు తగ్గి శారీరక బాధ విముక్తుడవుతాడు.

జాతక చక్రంలో పంచమ రాశి సింహరాశి. ఈ రాశికి ఆధిపత్యం సూర్య భగవానుడిదే. ఈ రాశి పురుష రాశి స్థిర రాశి అగ్ని తత్వం గలది. సూర్యుడు క్షత్రియ కులానికి చెందినవాడు. శారీరకంగాపురుషుడు. కాబట్టి సింహరాశిని పురుషరాశిగాతీసుకొంటారు.ఆదిత్యుడు జన్మించిన రోజును ఆదివారంగా నామకరణం చేసి ఆ దినానికి ఆధిపత్యం ఆయనకే కలిగించారు.

# చంద్రుడు

చంద్రగ్రహం అందానికి ఆకర్షణకు ప్రతిరూపం. ఏ కన్య అయినా అందాల రాశిగా వున్నపుడు ఆమె ముఖాన్ని చంద్రబింబంతో పోలుస్తారు. ఎందుకంటే గ్రహాల అన్నిటిలోను అత్యంతమైన ఆహ్లాదాన్ని యిస్తూ మన కంటికి కనబడే చల్లని వాతావారణం కలిగించే అందమైన గ్రహం చంద్రుడే. మనకు రాత్రి సమయంలో సూర్యకాంతి లేనపుడు భూలోక వాసులకు వెలుగు ప్రసాదించే ఉన్నత గ్రహం చంద్రుడే అని మనకు తెలుసు. చిన్న పిల్లలు యవ్వనులు మరియు వృద్ధులు కూడ చంద్రుని చూసి మిక్కిలి సంతోషపడతారు. ఒక్కమాటలో చెప్పాలంటే మానవాళి హృదయాలను దోచుకొనే శక్తి కలవాడు చంద్రుడే. ఇతని అందం అనన్యసామాన్యం పైగా శీతలమైన ఆహ్లాదకర కాంతితో దినదినాభివృద్ధి చెందుతూ వెలిగి పోతుంటాడు. జాతక చక్రంలో చతుర్ధరాశియైన కర్కాటక రాశికి అధిపతి. తన రాశి నుంచి ఉన్న పంచమి రాశిలో అంటే వృశ్చిక రాశిలో చంద్రుడు దుర్బలుడవుతాడు. కర్కాటక రాశి చరరాశి మరియు ఆ రాశిలో తనకు సముడైనను గురువు ఉచ్ఛస్థితిలో వుంటాడు. చంద్రుడికి గురువు సముడే కాని మిత్రుడు కాడు. కాని గురువుకు చంద్రుడు మిత్రుడే కర్కాటరాశి శూద్ర రాశి మరియు జల తత్వం కలది. విచిత్రమేమంటే చంద్రుడు మనం పురుషునిగా వ్యవహరిస్తాం. కాని చంద్రుడు శారీరకంగా స్త్రీ గ్రహం. చంద్రుడికి సూర్యునిలాగే ఒక రాశి మీదే ఆధిపత్యం వుంటుంది. అందువల్ల ఆయనకు స్వక్షేత్రం కర్కాటక రాశి మాత్రమే అవుతుంది. ఈ కర్కాటక రాశిలో ఉన్న నక్షత్రాలు పునర్వసు, పుష్యమి, ఆశ్లేష వుంటాయి. కాని పునర్వసులో ఆఖరి పాదం, మిగిలిన పుష్యమి ఆశ్లేష నక్షత్రాలకు ఒక్కొక్క నక్షత్రానికి నాలుగు పాదాల చొప్పున ఎనిమిది పాదాలు వుంటాయి. కాని ఈ మూడు నక్షత్రాలు కర్కాటక రాశిలో వున్న ఆ నక్షత్రాధిపతులు వేరు. పునర్వసు నక్షత్రానికి గురువు, పుష్యమి నక్షత్రానికి శని మరియు ఆశ్లేష నక్షత్రానికి అధిపతి బుధుడు అని మనం మర్చిపోకూడదు. కాని రోహిణి, హస్త, శ్రవణం యీ నక్షత్రాలకు అధిపతి చంద్రుడు అంటే ఏ రాశిలో అయినా వున్న నక్షత్రాలకు ఆధిపత్యం ఆ రాశ్యాధిపతి కాదు, అలాగే ప్రతిరాశిలోను వున్న నక్షత్రాలకు ఆధిపత్యం వేరే గ్రహానికి వుంటుంది. ఈ కర్కాటక రాశిలో వున్నా మొదటి రెండు నక్షత్రాలు దైవ నక్షత్రాలు.

మూడవ నక్షత్రమైన ఆశ్లేష రాక్షస గణానికి చెందింది. అంటే పునర్వసు పుష్యమి దైవ నక్షత్రాలుగాను ఆశ్లేష నక్షత్రం రాక్షస నక్షత్రంగాను గ్రహించాలి. కర్కాటక రాశిలో గురువు సరిగ్గా మధ్యభాగంలో అంటే 15 డిగ్రీలలో ఉచ్ఛస్థితిలో వుండి బలమైన ఎదురులేని శుభ ఫలితాలు ఇస్తాడు. చంద్రుడు వృషభరాశిలో అంత్య దశలో అంటే 28 డిగ్రీలు ఉచ్ఛస్థితిలో వుంటాడు. కాని ఆ రాశిలోనే కృష్ణ పక్షం అయితే తిథుల రీత్యా క్షీణ చంద్రుడు కాబట్టి దుర్బలుడవుతాడు. చంద్రుడు కులరీత్యా వైశ్య శ్రేష్టుడు వయస్సు 70 సంవత్సరాలు. చంద్రునికి ముత్యమంటే చాల మక్కువ. శ్వేత వర్ణం అంటే బహు ప్రీతి. అందుకనే చంద్రుడు ఎపుడు శ్వేతవర్ణ వస్త్రాన్నే ధరిస్తాడు. అతను ధరించే ధావళీలు కూడ శ్వేత వర్ణంగానే వుంటాయి. భూమిలో నాల్గవ వంతు వుంటూ 27 1/3 రోజులలో ఒక చక్ర భ్రమణంలో పూర్తిచేస్తాడు. చంద్రుడు కార్తీక శుద్ధ దశమి సోమవారం సౌమ్య నామ సంవత్సర ఉత్తరాషాఢ నక్షత్రంలో జన్మించాడు. అందుకనే ఆయన జన్మించిన రోజుకు సోమవారమనే నామకరణం కలిగి ఆ సోమవారానికి ఆధిపత్యం ఆయనకిచ్చారు. చంద్రుడు భార్య పేరు రోహిణి. ఆయనది అత్రేయస గోత్రం. ఒక ముఖ్యమైన విషయం ఏమంటే చంద్రుడు స్వయం ప్రకాశితుడు కాదు. అందువల్ల అత్యంత శోభాయమానంగా దివ్య తేజస్సుతో వెలుగుతున్న సూర్యకాంతిని గ్రహించి ఆ కాంతి కిరణాలలోని ఉష్ణాన్ని తాను భరించి ఆ సూర్యకాంతిని శీతలపరిచి భూమి మీదకు ఆహ్లాదమైన వెన్నెల రూపంలో ప్రసరింపజేస్తాడు. అంటే ఎండలో సూర్యునిపై నుండి ఆ సూర్యకాంతిని ఒక దర్పణం మీద పడేటట్లు చేసి ఆ దర్పణం మీదపడిన సూర్యకిరణాలనుగోడమీద ప్రతిబింబిస్తే ఆప్రతిబింబంలోని కాంతి చల్లగానే వుంటుందని మనకు తెలుసు. దర్పణం సూర్య ఉష్ణాన్ని గ్రహించినపుడు వున్న వేడి తాను ప్రసరింప జేస్తున్న కిరణాలకు ఎలా ఉష్ణం వుండదో అలాగే చంద్రుడు దర్పణంలాగ సూర్యునికి భూమికి మధ్య దర్పణంలాగ వుంటాడు. అందువల్లే మనకు చంద్రుడు యిస్తున్న సూర్యకాంతిని వెన్నెలని అంటున్నాము. స్వయం ప్రకాశిత శక్తి లేని చంద్రుడి వలె యీ అద్భుత ప్రక్రియను చేయడం ఏ గ్రహం వల్ల కాదు. చంద్రుడుకి స్వక్షేత్రమైన కర్కాటక రాశి జలతత్వ రాశికాబట్టి సూర్యవేడిమి అతనిని బాధించదు, అదే కాకుండ చంద్రుడు జల తత్వరాశి కాబట్టి యీ భూగోళం మీద వున్న సముద్ర జలాలు, అన్ని పౌర్ణమికి ఉత్తేజపడి ఆ

చంద్రుని అయస్కాంత ప్రభావం వల్ల పెద్ద పెద్ద కెరటాలతో నింగికి ఎగరటంమనం చూస్తూనే వుంటాం. అందుకనే ఆ సముద్ర జలాలలో వున్న ముత్యాలు చంద్రునికి ప్రీతి. అందువల్ల చంద్ర మహర్దశలో ఏ జాతకుడునైనా ముత్యాలు మరియు ధవళ వస్త్రాలు ధరిస్తే మనసులోని ఒత్తిడి ఆందోళన తగ్గి మానసిక ప్రశాంతత కల్గుతుంది. ఏ జాతకుడుకైనా చంద్ర మహర్దశ 10 సంవత్సరాలు ఉంటుంది. చంద్రుడు తన చక్ర భ్రమణంలో అంతరిక్షంలో తన కక్ష్యలో పయనిస్తున్న పుడు ఏ నక్షత్రంలో వుంటాడో ఆ నక్షత్రంతో ఆ మాసాన్ని పిలుస్తాం. ఉదాహరణకు : చంద్రుడుచిత్త నక్షత్రంలో వున్నపుడు చైత్ర మాసమని, విశాఖ నక్షత్రంలో వున్నపుడు వైశాఖమని, జ్యేష్ఠలో వున్నపుడు జ్యేష్ఠ మాసమని వ్యవహరిస్తాం. అంటే చంద్రుని వల్ల మాసములు ఏర్పాటు చేసుకొన్నాం. మహమ్మదీయులు కూడ యిదే పద్ధతిని పాటిస్తారు. అంటే మన భారతావనిలో కాక, మిగిలిన తురుష్క దేశాలన్నిటిలో పాకిస్తాన్, బంగ్లాదేశ్, బెలూచిస్తాన్, ఆఫ్ఘనిస్థాన్, ఈజిప్టు మొదలైన దేశాలలోనే కాక ఆఫ్రికా ఖండంలోని కొన్ని ద్వీపాలలో కూడ యీ పద్ధతే పాటిస్తారు. కర్కాటకరాశి నిషిద్ధ బలరాశి అంటే చంద్రుడు రాత్రివేళ బలంగా వుంటాడు.

వృద్ధి చంద్రుడిని పుణ్యగ్రహంగాను, క్షీణ చంద్రుని పాప గ్రహంగాను తీసుకోవాలి. అంటే కృష్ణ పక్షంలో చంద్రుడు ఏ రాశిలో వున్నా ప్రతిదినం క్షీణిస్తు వుంటాడు కాబట్టి ఆక్షీణ దశలో సత్ఫలితాలు యివ్వలేడు. అందువల్ల జోతిష్య శాస్త్రంలో క్షీణచంద్రుని పాపగ్రహం గానే భావిస్తారు. అదే చంద్రుడు శుక్ల పక్షంలో దినదినాభివృద్ధి చెందుతూ వుంటాడు కాబట్టి సత్ఫలితాలు యిస్తాడు అంటే ఏ మాసంలోనైనా సరే శుద్ధ దశమి నుంచి బహుళ చవితి వరకు చంద్రుడు పూర్ణ తేజో వైభవ కళావంతుడుగా బలంగా వెలుగుతూ వుంటాడు.కాబట్టి ఆ సమయంలో చంద్రుణ్ణి శుభ చంద్రుడిగా భావిస్తారు. అదే విధంగా కృష్ణ పంచమినుంచి శుద్ధ నవమి వరకు తేజోవిహీనుడు అవుతు వుండడం వల్ల మరియు ప్రతి దినం అతనిలోని కళాకాంతులు తగ్గిపోతూ క్షీణిస్తూ వుంటాడు కాబట్టి శుభ ఫలితాలు యివ్వలేడు. అందువల్లే ఆ సమయంలో చంద్రుణ్ణి పాపగ్రహంగా తీసుకొంటారు. ఇలాగ జరిగే మార్పు ఏ గ్రహానికి లేదు. ఇక ముఖ్య విషయం ఏమంటే చంద్రుడు తన కక్ష్యలో

ఎపుడు వాయవ్య దిక్కును సూచిస్తూ పయనిస్తాడు. చంద్రుడు స్థూలాకారంగాను ధవళ వర్ణంలోను ప్రకాశిస్తాడు. చక్కని అకర్షణ కలిగిన రూపం మరియు అందం కలవాడు. మిక్కిలి స్నేహాభిలాషి. అందువల్లనే అంతరిక్షంలో చంద్రునికి ఏ గ్రహంతోను శత్రుత్వం లేదు. రవి బుధులు తప్ప మిగిలిన గ్రహాలన్ని సమానులే. రవిబుధులు మిత్రులు మిగిలిన గ్రహాలన్ని సమానులు కాబట్టి ఏ గ్రహంతోను శత్రుత్వం లేదని మనం గ్రహించాలి. చంద్రునికి సూర్యుని మాదిరిగానే వక్రగతి వుండదు. ఎప్పుడు సవ్యంగా ఋజుగతిలో పయనిస్తాడు. ఇతను తన చుట్టు తాను తిరుగుతూ భూమి చుట్టు తిరుగుతాడు. ఇలా భూప్రదక్షిణం ఒకసారి చేయడానికి ఒక మాసం తీసుకుంటాడు. అంటే చంద్రుడునికి భూ ప్రదక్షిణం చేయడానికి ఒక మాసం పడుతుంది. ఈ మాసంలో కూడ ఒక పక్షం దినాలు వృద్ధి చంద్రుడినిగాను మరొక పక్షం హీన చంద్రునిగాను వున్నా తన కక్ష్యలో తన చుట్టూ తాను తిరుగుతూ భూ ప్రదక్షిణం మాత్రం ఆపడు, అలా తిరుగుతున్న సమయంలో భూమికి 15 రోజులు దగ్గరగా వస్తూ,ఆ వచ్చిన నాటి నుంచి మళ్లీ దూరంగా పయనిస్తాడు. అలా పయనించే సమయంలో సూర్యునికి దగ్గర అవుతున్న కొద్ది ఒక కళ తక్కువగా కన్పిస్తాడు. సూర్యచంద్రులు ఒకే రాశిలో వున్నపుడుఅది మనకు అమావాస్య అవుతుంది. అలాగే ఆరు రాశులు ఎక్కువ దూరం అయినపుడు పౌర్ణమి అవుతుంది. అంటే చంద్రుని గమనం వల్లే తిధులు పక్షములు మాసాలు ఏర్పడుతున్నాయని మనం అర్థం చేసుకోవాలి.

అంతరిక్షంలోని ప్రతి గ్రహ చక్ర భ్రమణంలో ఒక వైపుగా సూర్యుడు మరొక వైపు చంద్రుడు ఒకరికొకరు సరిగ్గా $180^0$ డిగ్రీలలో వుంటారు. వీరిద్దరికి మధ్య వున్న $90^0$ డిగ్రీలలో వున్న కక్ష్యలోకి భూమి ప్రవేశించినపుడు సంపూర్ణ చంద్ర గ్రహణం వస్తుంది. అంటే సూర్యుని నుంచి ఒక దిక్కుగా 90 డిగ్రీలు మరియు చంద్రుడి నుంచి మరియొక దిక్కుగా వున్న మధ్య కక్ష్యలో వున్నపుడే సంపూర్ణ చంద్ర గ్రహణం అవుతుందని గ్రహించాలి. ఎందుకంటే చంద్రుని కంటే ఆకార పరిమాణ ములో భూమి చాల పెద్దది. దాని వల్ల భూమి యొక్క నీడ చంద్రుని పూర్తిగా కప్పివేస్తుంది. అంటే భూమి తన చుట్టు తాను తిరుగుతూ వుండడం వల్ల ఆ భ్రమణ వేగాన్ని బట్టి భూమి మీద నీడ కొంచెం కొంచెంగా చంద్రగ్రహం మీద పడి అంత్య

దశలో భూమి నీడ చంద్రుని పూర్తిగా కప్పివేస్తుంది. అంటే సూర్యకాంతి చంద్రుని మీద పడకుండా సూర్యచంద్రులకు అడ్డంగా భూమి వస్తోంది కాబట్టి ఆ సూర్యకాంతి చంద్రుని మీద పడదు. చంద్రుడు స్వయంప్రకాశకుడు కాదని ముందే చెప్పుకొన్నాం. అలా స్వయం ప్రకాశకుడు కాదు కాబట్టి మరియు భూమియొక్క నీడ చంద్రుని మీద పడి ఆ గ్రహాన్ని పూర్తిగా కప్పివేస్తుంది. అంటే భూభ్రమణంలో చంద్రుని నీడ కొద్ది కొద్దిగా పడుతూ పాక్షికగా మనకు కనబడుతూ వుంటాడు. అలాగే భూమి తన చక్రభ్రమణంలో దూరంగా జరుగుతున్నపుడు మళ్లీ పాక్షికంగా ప్రత్యక్షమవుతూ వుంటాడు. ఇలా భూభ్రమణం వల్లే చంద్రగ్రహణం కొన్ని దేశాలలో పాక్షికంగాను మరికొన్ని దేశాలతో పూర్తిగాను ఏర్పడుతుంది.

## కుజుడు

ఈ భూ ప్రపంచంలో కుజానుగ్రహం లేకుండా ఏ దంపతులు అయినా సరే శారీరక మానసిక సాంఘిక మరియు సామాజిక సౌఖ్యాన్ని పొందలేరు. కుజానుగ్రహం లేకుండా వుంటే ఆ దంపతుల మధ్య అన్యోన్యత, సఖ్యత లోపించి యిద్దరు కోపావేశాలకు లోనయి భవిష్యత్తులో సంభవించే కష్టనష్టాలు, మరియు పేరు ప్రతిష్టలు గురించి ఆలోచన శక్తి నశించి మూర్ఖపు పట్టుదలతో దాంపత్యం విచ్ఛిన్నం చేసుకొంటారు. ఒక విచిత్రమేమంటే కుజదోషం వున్నపుడు వారు సమాజంలో భార్య భర్తలుగా నివసిస్తారు గాని వారి మధ్య ప్రేమానురాగాలు, సహాయ సహకారాలు లోపించడమే కాకుండ శారీరక సంబంధం లేకుండా జీవిస్తారు. ఒక్కొక్కపుడు యిద్దరిలో ఒకరికి అక్రమ సంబంధాలు వుండవచ్చు. ఒక మాటలో చెప్పాలంటే కుజుని వల్లే దుష్పరిమాణం దంపతుల మీద ఎలా వుంటుందో ఊహించలేనిది. ఎప్పుడు ఎవరికి కుజ హాని ఎలా జరుగుతుందో ఎవరు ఊహించి చెప్పలేరు. ఎందుకంటే కుజదోషం వల్ల ఒక్కొక్కపుడు స్త్రీకి వైధవ్యం పురుషుడికి విధురత్వం సంప్రాప్తించవచ్చు కాని జాతకంలో ఎవరికైనా సరే – కుజుడు బలంగా వుంటే శుభఫలితాలు యిస్తాడు. బలహీనంగా వుంటూ దుష్ఫలితాలు యిస్తాడని కొందరి పండితుల అభిప్రాయం. కుజుడు ఆకారంలో పొట్టివాడు. ఆయన నిత్య అనుష్టాన పూజా దురంధరుడు. అధిష్టాన దేవత సుబ్రహ్మణ్య స్వామి, కుజ మహర్దశలో సుబ్రహ్మణ్య స్వామిని పూజించిన కుజుని కొలుచుట

శాస్త్రోక్తం మరియు ధర్మబద్ధం. కుజపూజ చేయకుండ సుబ్రహ్మణ్య స్వామిని పూజించిన ఫలితం అంతంత మాత్రమేనని గ్రహించాలి. ఎవరికైన సరే ఏ జాతక చక్రంలోనైనా సరే కుజునికి మేష మరియు వృశ్చిక రాశులకు అధిపతి కుజుడే అంటే మేషం నుంచి అష్టమ రాశియైనవృశ్చికం మరియు అక్కడ నుండి షష్టమ రాశియైన మేషరాశి యీ రెండు రాశులు కుజక్షేత్రాలుగా చెప్పబడ్డాయి. ఈ రెండు రాశులకు అధిపతి కుజుడే, మేషరాశిలో సూర్యుడుఉచ్ఛంలో వుంటాడు. ఇది పురుషరాశి అందుకనే మేషరాశిని పురుష రాశిగా గ్రహించాలి. కుజుడుఒక్కొక్క రాశిలో 45 రోజులు వుంటూ 12 రాశులలోను పయనిస్తూ సుమారు ఒకటిన్నర సంవత్సరాలకి చక్ర భ్రమణం పూర్తి చేస్తాడు. ఈ రాశిలో అశ్విని4 పాదాలు, భరణి నాలుగు పాదాలు, కృత్తికకు మొదటి పాదం వుంటాయి. ఈ నక్షత్రాలు కుజ రాశిలో వున్నా కూడ అశ్విని నక్షత్రానికి కేతువు, భరణి నక్షత్రానికి శుక్రుడు, కృత్తికా నక్షత్రానికి రవి అధిపతులు. కాని కుజాధిపత్యంలో మృగశిర, చిత్త, ధనిష్ట యీ నక్షత్రాలకి కుజుడు అధిపతి. ఈ నక్షత్రాలలో మొదటి నక్షత్రమైన మృగశిర రెండు పాదాలు వృషభంలోను మిగిలిన రెండు పాదాలు మిధునంలో వుంటాయి. ఇది దైవ నక్షత్రంగా పేర్కొనబడింది. మిగిలిన రెండు నక్షత్రాలు అంటే చిత్త, ధనిష్ట రాక్షస నక్షత్రాలుగా భావింపబడ్డాయి. చిత్త మొదటి రెండు పాదాలు కన్యారాశిలోను మిగిలిన రెండు పాదాలు తులా రాశిలోను వుంటాయి. కాని మకర రాశిలో ధనిష్ట మొదటి రెండు పాదాలు వుంటాయి. మేషరాశి చరరాశి. అగ్నితత్వపు రాశి. ఇక వృశ్చిక రాశిలో విశాఖ ఆఖరిపాదం. అంటే నాలుగవ పాదం. అనురాధా నాలుగు పాదములు, జ్యేష్ఠ నాలుగు పాదములు వుంటాయి. ఇది జలతత్వపు రాశి, బ్రాహ్మణ రాశి, స్థిరరాశిగా పేర్కొనబడింది. చంద్రుడు వృశ్చికరాశిలో బలహీనపడి దుర్బలుడు అవుతాడు.

కుజుడు మకరరాశిలో 28 డిగ్రీలలో ఉచ్ఛంలో వుంటాడు. కుజుడు కర్కాటక రాశిలో అంటే తన ఉచ్ఛస్థానమైన మకరం నుంచి సప్తమ స్థానమైన కర్కాటక రాశిలో బలహీనపడి దుర్బలుడవుతాడు. అందువల్లనే కర్కాటక రాశిలో కుజుడున్నపుడు కుజ దోషం లేదని నిశ్చయించారు. ఎందుకంటే కుజుడు తాను దుర్బలుడు అవటం వల్ల ఏ దుష్ఫలితం యివ్వలేక అచేతనుడు అయిపోతాడు. అలా దోషం యివ్వలేని కుజుడు దోషస్థానంలో వున్నప్పటికి అంటే లగ్న ద్వితీయ చతుర్ధ, సప్తమ, అష్టమ,

ద్వాదశ సాధనాల్లో వున్నప్పటికి చాలాసార్లు కుజదోషం పుణ్యగ్రహ వీక్షణం వల్ల వేరే గ్రహ సంయోగం వల్ల మరియు స్థానరాశి వల్లను, అదే కాక జాతకుని జన్మ నక్షత్రం వల్ల కుజదోషం పరిహారమగును. ఈ పరిహారం ఎలా వుంటాయో ముందు ముందు నేర్చుకొందాం. నవగ్రహాలలో కుజుడుది మూడవ స్థానం. కుజునికి అంగారకుడు అనియు మంగళుడనియు పిలుస్తారు, కుజుడు మనస్తత్వ రీత్యా చాలా క్రోధి. మిక్కిలి కోప స్వభావం కలవాడు. యుద్ధ నైపుణ్యుడు, అత్యంత పరాక్రమశీలి మరియు ధైర్యవంతుడే కాక యుద్ధ నిపుణుడు. అత్యంత సాహసి. శత్రు సంహారంలో యుద్ధ భూమిలో దయా దాక్షిణ్యాలు లేక శత్రువులను చీల్చి చెండాడి క్రూరంగా వధించువాడు. పైగా అత్యంత హృదయ కాఠిన్యం గలవాడు. రణరంగంలో అత్యంత ప్రావీణ్యం గలవాడు. అపజయమన్నది ఎరుగనివాడు.

భార్యాభర్తల అన్యోన్యతను సహింపలేక వారి మధ్య విభేదాలు, విద్వేషాలు, వాగ్వి వాదాలు కలిగించి దాంపత్య విచ్ఛిన్నం చేయడంలో దిట్ట. గ్రహ సామ్రాజ్యంలో కుజుడు సైన్యాధ్యక్షుడు. కుజదోషం వల్ల ఎవరికైనా కల్యాణ యోగాన్ని దూరం చేస్తూ కల్యాణ ఘడియ లను అందకుండ వివాహ కాలాన్ని పొడిగిస్తూ వుంటాడు. ఈ కుజ దోషం వల్ల వధూవరుల మానసిక ప్రవృత్తిలో మార్పు సంభవించి కాబోయే జీవిత భాగస్వామిని తొందరగా ఎంచు కోనియ్యడు. దురాశ పెరగడం వల్లమరియు లోపాలుమాత్రమే పరిశీలించడం వల్లే వివాహాలు ఆలస్యమవుతున్నాయి. దీనికి కారణం కుజుడే. కుజదోషం వల్ల వివాహాలు ఆలస్యమవడం, కుదిరిన వివాహం ఆకస్మికంగా ఆగిపోవడం, దాంపత్య జీవితంలో సుఖసంతోషాలు లోపించడం, యిద్దరిమధ్య వియోగం స్త్రీకి పర పురుష సంబంధం మరియు పురుషుడికి పరస్త్రీ సాంగత్యం మరియు దాంపత్య విచ్ఛిన్నం రెండవ వివాహ దోషం లాంటి ఉధృతమైన దోషాలు కుజుని వల్లనే సంభవిస్తాయి. ముఖ్య గమనిక ఏమంటే కుజుని పూజించడం వల్ల లేక కుజ ప్రార్థన వల్ల లేక నియమ నిష్ఠలతో ఏ విధంగానైనా సరే కుజుని ఆరాధించిన ఆ కుజునికి యొక్క ఉధృత ప్రభావం తగ్గుతుందే కాని కుజదోషం పూర్తి దుష్ఫలితం హరించిపోదు. ఇతని వాహనంమేక. అందుకనే కుజుడు మేషవాహనుడుగా పిలుస్తాం. కుజునిది భారద్వాజస గోత్రం. రాక్షస నామ సంవత్సర ఆషాఢ బహుళ

చతురర్దశి మంగళవారం ఉదయం సూర్యోదయ సమయాన మృగశిర నక్షత్రంలో జన్మించాడు. ఇతని తల్లి పేరు వికేశి. తండ్రి శివుడు. భార్య పేరుజ్వాలిని. శాంత స్వభావురాలు, మరియు చెరగని చిరునవ్వుతో ఆకర్షణీయంగా వుండే అతి పవిత్రమైన గృహిణి. కుజుడు సూర్యునికి దక్షిణ దిశలో త్రికోణాకారంగా వున్న మండలంలో రక్త వర్ణంతో సిందూర రూపంలో కనిపిస్తూ రుద్రరూపంతో గంభీరంగా వుంటాడు. కుజుని గురించిస్కంద పురాణంలోను, కాశీ ఖండంలోనూ మహాభారతంలోని భీష్మ పర్వంలోను నిశితంగా విశదీ కరించారు. ఈతడు ఆరోగ్యం,శత్రువులతో పోరాటం, భూవనరుల వివాదం, ధనాదాయఋణ బాధలు, సోదర సోరదీ వివాదాలు మరియు ముఖ్యంగా భార్యభర్తల మధ్య అన్యోన్యత మొదలగు అంశాలకు కారకత్వం కలవాడు. ఈ పై అంశాలకు దుష్ఫలిత సత్ఫలిత పరిణామా లకు బాద్యత గల కారకత్వం గలవాడు. మనం కుజుడు లగ్న ద్వితీయ చతుర్ధ సప్తమఅష్టమ ద్వాదశ స్థానాలలో వున్నపుడు దోషం వుంటుందని చెప్పుకొన్నాం. ఒకవేళ పై స్థానాలలో ఏ రాశియైనా స్థిర మరియు ఉభయ రాశులో వుంటేదోషం ఉధృతమని గ్రహించాలి. కుజదోషాన్ని నిర్ణయించినపుడు కుజుడు కనుక పాపగ్రహం సంయోగంలో వుంటే దోషం ఎక్కువని శుభగ్రహ సంయోగంలో వుంటే దోషం తక్కువని అర్ధం చేసుకోవాలి. కాని శుక్రుడు పుణ్య గ్రహమైనా కూడ ఎవరి జాతక చక్రంలోనైనా సరే కుజునితో కలిసి వుండరాదు. ఏకరాశిలో కుజ శుక్ర సంయోగం చాల తీవ్ర దోషం మరియు ఉధృతంగా దోషభూయి ష్టమైన దుఃఖ పరిణామాలు ఆ దాంపత్య జీవితంలో సంభవిస్తాయి. ముఖ్యంగా దాంపత్య విచ్ఛిన్నం అవుతుంది. ద్వికల్యాణదోషం కలుగుతుంది.

కుజ దోష నిర్ణయం మీద అనేకమంది అనేక విధాల భాష్యం చెప్పడం వల్ల సమాజంలో శాస్త్ర పరిచయంలేని సామాన్య ప్రజలకు భయోత్పాతం కలిగి భయ భ్రాంతులకు లోనై చక్కటి వివాహ సంబధాలను అజ్ఞానంతో సరియగు శాస్త్ర పరిజ్ఞానం లేని మిడి మిడి జ్ఞానం వారు కుజదోష నిర్ణయం శాస్త్ర పద్ధతిలో చేయకపోవడం వల్లను కుజ దోష నివారణలకున్న పరిహారములు సరిగా శాస్త్ర శోధన చేసి ప్రచించడం లేనందు వల్ల మంచి సంబంధాలు ఒక్కొక్కపుడు వదులుకోవడం లేక కుజ దోషంతోవున్నా వారికి వివాహం చేయించడం వల్ల సామాన్య ప్రజలు శాస్త్ర ఉనికిని

శంకించే దైన్య స్థితికి శాస్త్ర పరిజ్ఞాన విహీనులే కారణమని ఉద్ధండులైన పండితులు మరి మరి హెచ్చరిస్తున్నారు. కాబట్టి సరియైన అనుభవం గల పండితుల చేత జాతక పరిశీలన చేయించి వివాహం నిశ్చయం చేయుట ముదావహం.ఒక గమనించ తగ్గ విషయం ఏమంటే ధన సంపాదనే ముఖ్యమనే ధ్యేయంగా జ్యోతిష్య శాస్త్రం చదవని వారు ఆగమ శాస్త్రం లేక కృష్ణ యజుర్వేదం మాత్రమే చదివి జ్యోతిష శాస్త్రములో ఏ ప్రావీణ్యత లేకున్నా జాతక ఫలితాలు చెప్పడం ఆనవాయితి అయిపో యింది. ముఖ్యంగా ప్రస్తుత కాలంలో ప్రతివారు వధూవరుల జాతక పొంతనలు పరిశీలించి ఆ వధూవరులకు జాతకపొంతన కుదిరినది లేక కుదర్లేదని నిర్ణయం చేస్తున్నారు. ఇది చాల బాధాకరం మరియు ప్రమాదకరం. ఎందుకంటే రెండు కుటుంబాల కలయికను జాతక రీత్యా నిర్ణయించినపుడు అత్యంత శ్రద్ధతో మరియు వివేకంతో శాస్త్రానుకూలంగా నిర్ణయించాలి గాని మిడి మిడి జ్ఞానంతోను లేక పంచాంగం చదివి వాటిలో యిచ్చిన అంశాలను బట్టి జాతక నిర్ణయం చేయడం ఎట్టి పరిస్థితులలోను క్షంతవ్యం కాదు. అందువల్ల సామాన్య ప్రజ సరియైన అనుభవం గల జ్యోతిష శాస్త్రజ్ఞుడినే సంప్రదించాలి గాని తమ యింటికి వచ్చే పురోహితుని గాని తాము రోజు వెళ్లే గుడి పూజారిని గాని సంప్రదించకూడదు. ఎందుకంటే తమ యింటికి వచ్చే పురోహితుడు సంవత్సరాల నుంచి వస్తూ వుంటాడు కాబట్టి సహజంగానే ఆయన మీద కొంత అభిమానం ఏర్పడుతుంది. కొంత కాలానికి ఆ అభిమానమే నమ్మకంగా మారిపోతుంది. అందువల్ల ఆయన చెప్పినదే వారికి శిరోధార్యమవుతుంది. కాని ఆయన జ్యోతిష్య శాస్త్రంలో నిష్ణాతుడా కాదా అని ఆలోచన మదిలోంచి తొలగిపోతుంది. అలాగే కొందరు తమ మేనమామ కుమారుడో మరే బంధువైనా కాస్త జ్యోతిష్య శాస్త్రంలో ఉత్సాహం చూపితే ఆతని నిర్ణయం కూడా అతి తేలికగా నమ్మడమే కాక ఆ బంధువు చెప్పినదే వేదమని అమాయ కత్వంలో వుంటారు. సహజంగా తమ బంధువనే ప్రేమ వాత్సల్యం తప్ప ఆ బంధువుకు ఈ శాస్త్రంలో ఎంత ప్రావీణ్యముందో వారికి తెలియదు. అలాంటప్పుడు ఆ బంధువు యిచ్చే సలహాలు నమ్మి తాము వివాహ విషయంలో అంటే మేలాపకం నిర్ణయం చేయడం ఎన్నటికి వాంఛ నీయం కాదు. కాబట్టి మనం ఎపుడైనా సరియైన అనుభవజ్ఞుడు అయిన పండితుణ్ణి సంప్రదించాలి. ఒకవేళ పుజారి అయినా, పురోహితుడైనా

ప్రత్యేకంగా జ్యోతిష శాస్త్రం చదువుకుని ఉంటే ఫరవాలేదు. మీరు ఎవరినైనా సంప్రదించేటపుడు పై అంశాలను దృష్టిలో వుంచుకోవాలి. ఎందుకంటే కుజ దోష నిర్ణయం చేయడం చాలా అనుభవం మరియు జ్యోతిష్య శాస్త్రం ప్రావీణ్యం కావాలి. కుజదోష నిర్ణయం మరియు వాటి పరిహారములు క్షుణ్ణంగా వచ్చి తీరాలి. లేకపోతే దోష భూయిష్టమైన నిర్ణయాల వల్ల దాంపత్య జీవితంలో సుఖసంతోషాలు లోపించడమే కాక వారి జీవితంలో సంతోషం తృప్తి కొరతపడి ఒక్కొక్కపుడు దాంపత్య విచ్ఛిన్నం కావచ్చు ఇంకా తీవ్రమైన దుష్ఫలితం కగలవచ్చు అని అందరు గ్రహించాలి. ఇంకో విషయం ఏమంటే కొందరు ఒక పండితుడు చేసిన నిర్ణయాన్ని నమ్మక ఎందుకైనా మంచిదని మరియొక పండితుడుకి చూపించి వారి సలహా కూడా తీసుకొంటారు. ఇలా చేయడం ఎన్నటికి సమర్థనీయం కాదు. ఎందుకంటే మనం మొదటి పండితుడి దగ్గరకు వెళ్లినపుడు ఆయన మీద నమ్మకంతోనే వెళతాం. కాని ఆయన చెప్పినది మరొక పండితుని ద్వారా ఆ జాతకాలను విశ్లేషించుకోవడం తమ సంకుచిత స్వభావానికి పరాకాష్ట. ఎందుకంటే మొదటి పండితుడి దగ్గరకు వెళ్లినపుడు ఆయన మీద నమ్మకంతోనే వెళతాం. అలా వెళ్లిన తరువాత ఆయన నిర్ణయాన్ని నమ్మకపోతే ఆయన దగ్గరకు వెళ్లక మొదటి సారే రెండవ పండితుడు దగ్గరకే వెళ్లాలి. అంతేగాని మొదటి పండితుడిచ్చిన నిర్ణయాన్ని మరొక పండితుడు చేత పరిశీలింప చేయడం దుష్ట సంప్రదాయం. ఎందుకంటే మనకు ఎపుడైనా అనారోగ్యం కలిగినపుడు ఒక వైద్యుణ్ణి సంప్రదిస్తాం. ఆ వైద్యుడు మన ఆరోగ్యస్థితిని పరీక్షించి తగిన ఔషధులు రాసి యిస్తాడు. మనం ఆయన ఔషధాలు మరొక వైద్యుడి దగ్గరకు తీసుకు వెళ్ళి మొదటి రాసి యిచ్చిన ఔషధాలు సరియైనవి అవునో కాదో నిర్ణయించమని ఎవరూ ఎన్నడూ అడగరు. ఎందుకంటే తమ వైద్యుడి మీద వున్న నమ్మకమే. అలాగే మొదటి పండితుడిచ్చిన నిర్ణయాన్ని శంకించకూడదు. ఎందుకంటే యిద్దరు వైద్యులు వేరే వేరే ఔషధాలు వ్రాసి యిస్తే వారిద్దరు వ్రాసి యిచ్చిన ఔషధాలు సేవింపము. అలాగే వేరు వేరు పండితులు భిన్నాభిప్రాయాలు యిచ్చినపుడు ఏది పాటించాలో తెలియక అయోమయంలో పడి విచక్షణా రహితంగా శాస్త్రాన్నే దూషిస్తారు. ఇలా దూషణ చేయడం పరపాటి అయిపోయింది. కాబట్టి అవివేకంతో శాస్త్ర దూషణ చేయక మొదటి పండితుడిచ్చిన సలహాను పాటించడం విజ్ఞత అనిపించుకొంటుంది.

ఎందుకంటే మొదటిసారే మంచి శాస్త్ర పరిజ్ఞానం, అనుభవం గల వారినే సంప్రదించాలి. ఇక కుజాచారం గురించి తెలుసుకొందాము. ఏ జాతక చక్రంలోనైనా సరే అది పురుష జాతకంగాని లేక స్త్రీ జాతకమైన కుజుడు చంద్ర స్థానం నుంచి గాని శుక్ర స్థానం నుంచిగాని లగ్న స్థానం నుంచి గాని మరియు ద్వితీయ స్థానంలోను సప్తమ స్థానం లోను అష్టమ స్థానంలోను మరియు ద్వాదశ స్థానంలోను వుంటే ఆ జాతకుడికి కుజదోషం వుందని మనం అర్థం చేసుకోవాలి. కాని ఈ కుజదోషానికి మహా పండితులు దైవాంశ సంభూతులైన మహార్షులు కుజుడు పై స్థానాలలో వున్నా కూడ ఎల్లప్పుడు దుష్ఫలితాలనే యిస్తాడని భయోత్పాదంలో పడకూడదని ఆ కుజదోషానికి అనేక సడలింపులు వున్నాయని మనకు తేల్చి చెప్పారు. సహజంగా కుజదోషం వల్ల ఎక్కువ దాంపత్య జీవితంలో కష్టనష్టాలు వస్తాయి. కుజుని యొక్క దయా దాక్షిణ్యాలు లేకుండా ఏ దంపతులు అయినా సరే సుఖశాంతు లతోను మరియు సౌభాగ్య సౌశీల్యంతోను ప్రేమా వాక్యాలతో జీవించలేరు. ఎందుకంటే దాంపత్య జీవితంలోని మధురిమను నాశనమొనర్చు అధికారం కుజునికి ఒక్కనికే వున్నది. అందువల్లే కుజుని దాంపత్య విచ్ఛిన్న కారకుడుగా పేర్కొంటారు. వధూవరుల మధ్యనున్న ఆకర్షణ, ఆనందం హరించి వేసి ఆహ్లాదకరమైన జీవితాన్ని నశింపజేస్తాడు. అందువలనే ప్రతివారు కుజదోషానికి భయపడతారు. ఇపుడు మనం కుజదోష పరిహారాలు గురించి వివరంగా తెలుసుకొందాం.

1. కుజుడు ఏ స్థానంలో వున్నా సరే ఆ స్థానం మీద బుధుని వీక్షణ ఉంటే కుజ దోషం పరిహారమవుతుంది. అంటే బుధుడు కుజుడు సమసప్తమాలుగా వుంటే ఆ బుధుని సప్తమ వీక్షణం వల్ల కుజదోషం పరిహారం అవుతుంది.

2. గురువు వున్న స్థానం నుంచి కుజుడు కనుక పంచమంలో గాని లేక సప్తమంలో గాని మరియు నవమ స్థానంలో గాని వుంటే కుజ దోష పరిహారమవుతుందని గ్రహించాలి.

3. అలాగే చంద్రుడున్న స్థానం నుంచి కుజుడు సప్తమ స్థానంలో వుంటే కుజదోషం వుండదు. అంటే సప్తమ చంద్రుని వీక్షణ అలాగే బుధుని సప్తమ వీక్షణ మరియుగురువుయొక్క పంచమ సప్తమ నవమ వీక్షణ కుజుడు మీద వున్న కుజదోష

పరిహారమగును. దీనిని వీక్షణ దోష పరిహారమంటారు. అంటే పైన చెప్పిన గ్రహాల వీక్షణం వల్ల పరిహారమైంది. ఇక కుజుడు చంద్రునితో కలిసివున్నా లేక గురునితో కలిసి వున్నా లేక బుధునితో కలిసి వున్న కుజదోషం పరిహారం అవుతుంది. ఇలా పరిహారమైన దానిని గ్రహ సంయోగ దోష పరిహారమంటారు.

ఎవరైనా సరే మేషం, వృశ్చికం, సింహం, కర్కాటకం, ధనుస్సు లగ్నాలలో జన్మిస్తే వారికి కుజదోషం వుండదు. అలాగే కుంభ మీనరాశి వారికి కుజుడు ఎక్కడున్నా సరే కుజ దోషం వుండదు. మీ సౌలభ్యం కొరకు యీ క్రింద కుజదోష వివరాలను సూత్రప్రాయంగా ఉటంకిస్తున్నాను. మీరు జాగ్రత్తగా పరిశీలించి అవగాహన చేసుకొనగలరు.

## లగ్నం నుంచి

1. మిథునం/కన్యలలో రెండవ స్థానమైతే
2. తులా/వృషభాలలో 12వ స్థానమైతే
3. మేషం/వృశ్చికాలలో నాలుగవ స్థానమైతే
4. మకర/కర్కాటకాలలో ఏడవ స్థానమైతే
5. ధనుస్సు/మీన రాశులలో ఎనిమిదవ స్థానమైతే

} కుజదోషం వుండదు.

పై పట్టికను బట్టి కుజుడు కనుక ఏ క్షేత్రంలో వుంటే దోషం వుండదు అని మీకొక అవగాహన కలిగింది. పైన చెప్పిన క్షేత్రములలో కుజ పరిహారమైనపుడు కుజదోషక్షేత్ర పరిహారమంటారు.

ఇపుడు మనం ఏ నక్షత్రంలో జన్మించిన జాతకులకు కుజదోషముండదో యీ క్రింద నిచ్చిన నక్షత్రాలను బట్టి తెలుసుకొనగలరు.

| | | | |
|---|---|---|---|
| 1. అశ్విని | 2. మృగశిర | 3. స్వాతి | 4. పునర్వసు |
| 5. పుష్యమి | 6. ఆశ్లేష | 7. ఉత్తర | 8. అనురాధ |
| 9. పూర్వాషాఢ | 10. ఉత్తరాషాఢ | 11. శ్రవణం | 12. ఉత్తరాభాద్ర, రేవతి |

ఇలా నక్షత్ర రీత్యా కుజదోష పరిహరము వున్నప్పుడు తారా కుజ దోష పరిహారమంటారు లేక నక్షత్ర కుజదోష పరిహారమంటారు. మీరు యింతవరకు

కుజుని యొక్క దోష పరిహారం గ్రహ వీక్షణ వల్ల, గ్రహ సంయోగం వల్ల, క్షేత్రస్థాయి వల్ల జన్మ నక్షత్రం వల్ల కుజ దోష పరిహారం ఎలా అవుతుందో తెలుసుకొన్నాం. మనం ఇదివరలో కుజుడు కనుక లగ్న ద్వితీయ, చతుర్థ సప్తమ అష్టమ, ద్వాదశ స్థానాలలో వుంటే కుజ దోషముంటుందని తెలుసుకొన్నాం. అలాగే కుజదోష పరిహారాలు కూడ ఎలా వుంటాయో నేర్చుకొన్నాం. ఇప్పుడు కుజదోషాలు మరొక పట్టిక ఈ క్రింద యిస్తున్నాను. దీనిని బట్టి కుజ పరిహారాలు మీరు పూర్తిగా అర్థం చేసుకొనగలరని నా భావన.

## 1. లగ్నం నుంచి

1. మేషంలో రెండవ స్థానమైతే
2. మిథునంలో నాల్గవ స్థానమైతే
3. తులా/వృశ్చికాలలో ఎనిమిదవ స్థానమైతే
4. ధనుస్సులో ఏడవ స్థానమైతే
5. మీనంలో నాల్గవ స్థానం/ ఏడవ స్థానమైతే

} కుజదోషం వున్నట్లే.

ఇంకొక ముఖ్య విషయం ఏమంటే శుక్రుడు సప్తమాధిపతి అయి తన స్వక్షేత్రాలు అయిన వృషభ తుల రాశులలో వుంటే కుజదోషం వుండదు. అంటే మేష లగ్నం వారికి తులా రాశి, సప్తమ స్థానం అవుతుంది. అప్పుడు శుక్రుడు సప్తమ రాశియైనతులా రాశిలో వుంటే కుజ దోషం వుండదు. అలాగే వృశ్చిక లగ్నం వారికి వృషభ రాశిసప్తమ స్థానమవుతుంది. ఆ సప్తమ స్థానమైన వృషభంలో శుక్రుడు వుంటే కుజ దోషంవుండదు.

ఒక ముఖ్యమైన చక్రం యీ క్రింద యిస్తున్నాను.

<table>
<tr><td></td><td>కు</td><td></td><td></td></tr>
<tr><td></td><td colspan="2" rowspan="2">రాశి</td><td></td></tr>
<tr><td></td><td>శ</td></tr>
<tr><td>రా</td><td></td><td></td><td></td></tr>
</table>

ఈ జాతక చక్రంలో గ్రహస్థితి పరిశీలించి మీరు కుజదోషం వుందని గ్రహించాలి. ఈ చక్రంలో జాగ్రత్తగా పరిశీలిస్తే శనిమీద పంచమ కుజవీక్షణ, మరియు రాహువు మీద శనియొక్క పంచ వీక్షణ, మరియు రాహువు యొక్క పంచమ వీక్షణ శని మీద అంటే మూడు పాపగ్రహాలు ఒకరికొకరు పంచ స్థానాల్లో వున్నారు కాబట్టి తీవ్రమైన కుజ దోషంగా గ్రహించాలి. ఎందుకంటే కుజునికి మరియు శనికి పంచమ వీక్షణలు లేకున్నా, ఈ గ్రహస్థితి మాత్రం తీవ్రదోషమని గ్రహించాలి.

ఇంకొక ముఖ్య విషయం ఏమంటే ఎపుడైనా సరే పురుషులకు ద్వితీయ, ద్వాదశ స్థానాల్లోను, స్త్రీకి అయితే చతుర్ధ సప్తమ స్థానాలలోను దోషం ఉధృతమని మనం తెలుసుకోవాలి. మనం లగ్నం నుంచి గాని చంద్రుడి నుంచి గాని శుక్రుని నుంచి గాని లెక్కపెట్టినపుడు ద్వితీయ, చతుర్ధ, సప్తమ, అష్టమ, ద్వాదశ సాధనాలలో కుజుడు వుంటే దోషమని చెప్పుకొన్నాం. ఈ కుజదోష నిర్ణయంలో కొందరు అలా లగ్నం నుంచి లెక్క పెట్టినపుడు మధ్యలో శూన్యస్థానమున్నా లేక గురువు వున్నాకుజ దోషముండదని చెప్పుచున్నారు. ఇది వాస్తవం కాదు. పైగా యీ వాదనకు శాస్త్ర ప్రమాణికం లేదు. అందువల్ల యిటువంటి వారి ఊహాజనితమైన నిర్ణయాలనుమీరు స్వీకరింపరాదు. అలాగే లగ్నం నుంచి కుజుని వరకు లెక్కపెట్టినపుడు ఏ రాశిలోనైనా ఎక్కువ గ్రహాలుండి మరొక రాశి శూన్యమై వుండి లేక ఒకే గ్రహమున్నా కూడా కుజుడు కనుక పైన చెప్పిన స్థానంలో వున్నట్లుగా గ్రహించాలి. ఇక కుజ దోషంఏలా పరిహారమవుతుందోఈ అధ్యాయంలోనే వెనుక పుటలలో ముందుగానే తెలుసుకొన్నాం.

ఇపుడు మనం కుజ దోష ప్రభావం ఏమిటి? ఈ దోషం వల్ల ఎటువంటి కష్టనష్టాలు కలుగుతాయి. మరియు దాంపత్య జీవితంలో ఏ ఏ అరిష్టాలు జరగవచ్చో తెలుసుకొందాం. ఈ దోషాలు వున్న గురువీక్షణ వల్ల గాని నక్షత్రరీత్యాగాని, సంయోగ మరియు స్థాన పరిహారమైన ఆ దోష ప్రభావ ఉధృతం చాలవరకు హరిస్తుందే కాని దుష్పరిణామం పూర్తిగా తొలగిపోదు. అందువల్ల ఎవరైనా స్వయంగా తామే ప్రతినిత్యం కుజపూజ చేసుకొని కుజహాని నుంచి విముక్తి పొందాలే కాని కుజగ్రహానికి మనకు ఒక మధ్యవర్తిని ఏర్పాటుచేసి ఆ మధ్యవర్తి చేత పూజ చేయిస్తే మనకు కుజుని వల్లే కలిగే ఆ దుష్ఫలితాలు కడతేరి పోతాయని చాలమంది అమాయకంగా ఏ పూజారితో

లేక పురోహితుడుకో ధనమిచ్చి ఆయన చేసిన పూజల వల్ల మన కుజబాధ తొలిగిపోయిందని విశ్వసించడం పూర్తిగా అసమంజసం. ఎందుకంటే ఈ ప్రపంచంలో ఏ మతం వారైనా సరే వారి పూజలు లేక అర్చనలు వారే స్వయంగా చేసుకొంటారు గాని లంచం ఇచ్చి పుణ్యం కొనుక్కోవటమనేది లేదు. అంటే మహమ్మదీయులు యీ రోజు కూడ తమకు తామే స్వయంగా ఉపవాసాలు చేసి నిష్టగాను భక్తితోను నమాజ్ చేసుకొంటారు. అలాగే క్రైస్తవులు కూడ చర్చిలకు వెళ్లి స్వయంగా మనం పురాణాలు విని, ధర్మసూక్ష్మాలు తెలుసుకొన్నట్లుగా క్రైస్తవులు చర్చిలో మత బోధలు విని తమ మత సంస్కార ప్రకారం నడచుకొంటారు. మన హిందూ దేశంలో ఆంగ్లేయుల పరిపాలన మొదలు అయిన తరువాత అమాయకులు అయిన ప్రజలకు "మీకు పుణ్యప్రాప్తి కావాలంటే మీ తరపున మేము ప్రార్థిస్తాం" అని వారిని ప్రలోభపెట్టి మత ప్రచారానికి మరియు మత మార్పిడికి దోహదం చేసుకొంటున్నారు. ఇది చూసి మనం మన మత సాంప్రదాయాన్ని మరచి ధనమదంతో గాని లేక తమకు దేవుని ప్రార్థించే సమయంలేదని సాకు చెపుతూ మూర్ఖ వాదన చేస్తున్నారు. మన శాస్త్రాల ప్రకారం దేవుని మనసా, వాచా, కర్మ అత్యంత భక్తి శ్రద్ధలతో దేవుని నామం ఒకసారి స్మరించినా ఆ భగవానుడు కరుణ జూపి కడగండ్లు తొలగిస్తాడని చెపుతున్నాయి. కాని కొందరు ధనకాంక్ష చేత మీ తరపున మేము దేవుని ప్రార్థిస్తాం అని ఆశ చూపి వాంఛనీయం కాని రీతిలో అమాయకులను అజ్ఞానంలో ముంచి అధర్మ సంపాదన చేయుచున్నారు. ఇలా ఒకరి తరపున మరొకరు ప్రార్థిస్తే మనం నిత్యానుష్టానం సంధ్యావందనం వ్రతములు, పూజలు ఏమి చేయనక్కర్లేదు. ఉదాహరణకు మీరు వినాయక చతుర్థిగాని లేక సత్యన్నారాయణ వ్రతంగాని మరియు ఏ యింటిలోనైనా గృహిణి వరలక్ష్మి వ్రతం మానివేసి ధనమిచ్చి మరొకరి చేత చేయించుకోవచ్చు అని చెపితే మీరు నమ్ముతారా? అలాగే ఏ గ్రహానికైనా ఎన్ని వేల సార్లు జపం చేయాలో, నిర్ణయించి ఆ జపాన్ని మీ తరుపున ముగ్గురు లేక నలుగురు జపిస్తామనే వాదన ఎంత మూర్ఖమైనదో మీరే ఆలోచించండి. ఎందుకంటే మన హిందూ ధర్మశాస్త్రాలలో ఎవరైనా వాయిదా పద్ధతులలో పరులచే పూజలు చేయించడం సరియైనదే అయితే ఒక యింటిలోసుమారు ఐదుమంది సభ్యులున్నపుడు వినాయక చతుర్థి రోజున ఒక్కొక్కరు వినాయక వ్రతకల్పం కొంచెం కొంచెం చేసి వెళ్లిపోతే

అలాగే ఆ యింటిలోని సభ్యులందరు ఒక్కొక్కరు కొంచెం కొంచెం చేసి ఆ పూజ పూర్తి చేస్తే ఆ వ్రత పూజఫలం అందరికి పూర్తిగా దక్కుతుందా? మీరే ఆలోచించండి. ఇంకొక ముఖ్య విషయం ఏమిటంటే నిజంగా పుణ్యఫలం దక్కేటట్లు అయితే కోటి శిష్యులు గల వశిష్ట మహాముని కోట్ల మంది రాక్షస మూక కలిగిన రావణబ్రహ్మ ఎందుకు శివుని గురించి వేయి సంవత్సరాలు తపస్సు చేసాడు? శిష్యుల చేతనే చేయించచ్చు గదా? కాబట్టి మన గ్రహశాంతికి మనమే స్వయంగా భక్తి శ్రద్ధలతో పూజ చేసుకోవాలి వేరే ఏ విధమైన ప్రలోభాలకు లొంగకూడదు. ఈ విషయం మీద మీకు ఒక పూర్తి అవగాహన రావాలంటే నేను వ్రాసిన "కాలసర్ప దోషం" అనే పుస్తకంలో 9వ అధ్యాయం చదవండి. కాబట్టి యీ క్రింద చెప్పిన కుజదోషం కలవారు ఆ దోషఫలితాన్ని అర్థం చేసుకుని తదనుగుణంగా జాతక పరిశీలన చేసి ఫలితాలు ఎలా వుంటాయో విశ్లేషించాలి. ఇప్పుడు మనం కుజుడు వల్ల ఏ దుష్ఫలితాలు వస్తాయో తెలుసుకొందాం. అంటే స్థాననివాసం బట్టి కుజునియొక్క ఫలితాలు మార్పు చెందుతూ వుంటాయి. అంటే కుజహాని ఒకే విధంగా వుండదు. ఆ రాశిని బట్టి సంయోగం బట్టి, వీక్షణ బట్టి కూడ ఫలితాలు మారుతాయి.అందు వల్ల కుజుడు ఆ గ్రహం యిచ్చే ఫలితాలు ఎలా వుంటాయో నేను యీ క్రింద యిస్తున్నాను.

1. జన్మ లగ్నంలో గనుక కుజుడు వుంటే ఆ జాతకునికి శరీర నష్టం కలుగవచ్చు. అంటే ప్రమాదరీత్యాగాని వ్యాధి రూపేణా గాని తన శరీరంలోని ఒక అంగమును శస్త్రచికిత్స ద్వారా వైద్యులు ఆ జాతకునికి తొలగించవచ్చు.

2. ద్వితీయస్థానంలో కుజుడు వుంటే ఆ జాతకునిలేక ఆ జాతకురాలి కుటుంబం లోని సుఖసంతోషాలు హరించి వేస్తాడు. అంటే కుటుంబ నష్టానికి కారకుడవుతాడు. కుటుంబం వృద్ధి చెందడానికి అడ్డుపడిన వంశాభివృద్ధికి నష్టాన్ని కలుగజేస్తాడు. ఎలా అంటే ఆ జాతకురాలికి గర్భస్రావాలు, మృత శిశువు జన్మించడం,జన్మించిన శిశువు మరణించడం లాంటివి. ఎక్కువ జరుగుతాయి. ఇదేకాకుండా కుటుంబం అంటే, మౌలికంగా దాంపత్య జీవితమే. ఆ దాంపత్య జీవితంలో భార్య భర్తల మధ్య కలహాలు, విద్వేషాలు, కలిగించి తద్వారా వారి కుటుంబ జీవితంలో ఆనందం, సుఖసౌఖ్యాలు లేకుండా చేస్తాడు. వివాహం చాలా ఆలస్యమవుతుంది.

3. నాల్గవ స్థానంలో కుజుడుంటే ఆస్తి నష్టం, గృహ నష్టం పంట భూములు తోటలు మరియు భూ వనరుల నష్టాలకు కారణభూతుడవుతాడు. అంటే వంశపారం పర్యంగా వచ్చిన ఆస్తిపాస్తులను నిలుపుకోలేకపోవడంతో పాటు ఆస్తి అంతయు నష్టపోవడం లేక అన్యాక్రాంతం జరుగవచ్చు. సహజంగా ఏర్పడే ప్రకృతి వైపరీత్యాలలోని భూకంపం, వరదలు, తుఫానులు మరియు అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు అందరికంటే కూడా వీరే ఎక్కువగా నష్టపోతారు. ఈ నష్టం అత్యంత తీవ్రంగా కలడానికి కారణం చతుర్ధస్థాన కుజుడని మనం భావించవచ్చు. కుటుంబంలో భార్యాభర్తల మధ్య తీవ్రమైనా భేదాభిప్రాయాలు వచ్చి వారు విడిపోవచ్చు.

4. సప్తమ స్థానంలో కుజుడుంటే ఆ జాతకునకు భార్య వియోగం సంభవించవచ్చు. భార్యా వియోగమనేది రెండు రకాలు వుంటుందని తెలుసుకోవాలి. ఒకటి ఆ వియోగం మరణం వల్ల సంభవించవచ్చును. లేక దాంపత్య విచ్ఛిన్నం కావచ్చు. ఇలా ఏ విధంగా నైనా భార్య నష్టం కలిగినపుడు సప్తమ కుజదోషమని మనం గ్రహించవచ్చు. అది కాకుండ భార్యభర్తలు యిద్దరు రాగద్వేషాలకులోనై కోపోద్రేకాలు అహంకార పూరితమైన నిరంతర కలహాలతో మానసిక ఒత్తిడితోను ఆందోళనతోను చక్కని దాంపత్య జీవితాన్ని నష్టపరుచుకొని బాధపడతారు. పురుషుడు నీచ స్త్రీ సాంగత్యానికి వెనుకాడక పరస్త్రీతో అక్రమసంబంధం ఏర్పరచుకొని భార్యను హింసిస్తాడు. అదే స్త్రీ జాతకమైతే ఆమెకు పర పురుష సంబంధం వుండి మిక్కిలి పతనం చెందుతుంది. సౌశీల్యం విలువ తెలియక కామవాంఛితయై భర్తకు ద్రోహం చేస్తుంది. దీనివల్ల ఒక్కొక్కపుడు దాంపత్య విచ్ఛిన్నానికి ఒక కారణం కావచ్చు.

5. అష్టమ స్థానంలో స్త్రీకి కుజుడు వుంటే వైధవ్యం రావచ్చు. వరుడికి అష్టమంలో కుజుడు వుంటే అనేక వ్యాధి పీడితుడై అల్పాయుష్కుడిగాను మధ్యమ లేక నడివయసులో మరణిస్తాడు. లగ్నం నుంచి అష్టమంలో వుంటే కుజ దోషం చాలా ఉధృతమని గ్రహించాలి. ఈ అష్టమ కుజుని వల్ల వచ్చే తీవ్ర దుష్ఫలితాలు యీ క్రింద యిస్తున్నాను.

(a) భార్యాభర్తల మధ్య కలహాలు కార్పణ్యాలు ఏర్పడి దాంపత్య జీవితంలోని సుఖసంతోషాలు అనుభవింపక లేకపోవడం కాక ఒకరి పైన ఒకరికి హేయభావం పెంచుకొంటారు.

(b) మానసిక ఒత్తిడితోను మరియు తీవ్ర ఆందోళనతోను జీవిస్తారు. ఒకరిపైన ఒకరికి ప్రేమాభిమానాలు నశించి దాంపత్య జీవితంలో సుఖసంతోషాలను చేతులార పాడు చేసుకొంటారు. భార్యభర్తల మధ్య అనురాగం లోపించడమే కాక ఈర్ష్య ద్వేషాలు ప్రజ్వరిల్లి దాంపత్య విచ్ఛిన్నం చేసుకొంటారు. లేక ఆ స్త్రీ భర్తను విసర్జించి మరొకనితో సహజీవనం చేస్తుంది. లేక రెండవ వివాహం చేసుకొంటుంది.

(c) ఏ వరునికైన తన జాతకంలో లగ్నస్థానం నుంచి ద్వితీయ స్థానంలోను మరియు ద్వాదశ స్థానంలోను కుజదోషం కనుక వుంటే ఆ దోషం చాల ఉధృతమని మనం గ్రహించాలి. ఒకవేళ ద్వాదశ స్థాన కుజగ్రహస్థితి వల్ల ఆ జాతకులు హఠాన్మరణం పొందుతారు. దానివల్ల వారి సంసారం అల్లకల్లోలమై వారు అనేక బాధలు పొందుతారు.

ఇక మనం ఇదివరలో కుజుడు చంద్రునితో గాని బుధునితో గాని లేక గురువుతో గాని కలిసి వుంటే లేక యీ మూడు గ్రహాల వీక్షణమున్నా కుజదోష ముండదని చెప్పుకున్నాము. అలాగే కుజదోషం పరిహారం అవుతుందని కూడా తెలుసుకొన్నాం. అంటే కుజదోషం ఉధృతం తగ్గుతుందని చెప్పుకున్నాం కాని అసలు కుజదోషం పూర్తిగా తొలగిపోతుందని మనం అనుకోకూడదు. అంటే ఒకే రాశిలో కుజుడు చంద్రుడు కలిసి ఉంటే కుజ ప్రభావం తగ్గినా ఆ జాతకునికి చంచలస్వభావం స్థిరబుద్ధి లేకపోవడం పరస్త్రీ వ్యామోహం, అధిక కామవాంఛ మొదలగు స్వభావాలు కలిగి వుంటాడు. భార్యను చులకనగా చూడడమే కాక ఆమెను నిర్లక్ష్యం చేయవచ్చు.

2. ఒక రాశిలో కుజుడు బుధుడు కలిసి వుంటే ఆ జాతకుడు తన భార్య మీద ఈర్ష్య అసూయ పెంచుకొంటాడు. ఆమె విజ్ఞానాన్ని తెలివితేటలను మెచ్చుకోక కించపరుస్తాడు. వీలు కలిగినపుడల్లా కోపోద్రిక్తుడై ఆమెను కఠిన భాషతో అవమానించడం గాని ఏదో ఒక కారణమున నిందారోపణం చేస్తూ వుంటాడు. అధికంగా ఆమెను నొప్పించే సంభాషణ చేసి తాను సంతృప్తుడవుతాడు. భార్య అంటే కామం తీర్చే యంత్రంగా భావిస్తాడు గాని ఆమెను సహజ మానవ వాత్సల్యంతో చూడడు. ఆమె సలహాలను త్యజించి తన యిచ్ఛ రీతిని నిర్ణయం తీసుకొని మూర్ఖత్వంతో ప్రవర్తిస్తాడు.

3. కుజునితో శని కలిగి వుంటే ఆ జాతకంతో రెండు పాప గ్రహాలున్నాయని మనం మరువరాదు. ఎందుకంటే కుజుడు యిచ్చే దుష్ఫలితాలు మరియు శని యిచ్చే దుష్ఫలితాలు యీ రెండు దోషాలు ప్రజ్వరిల్లి ఆ జాతకుని ప్రభావితం చేయడం వల్ల అతను దాంపత్య జీవితంలో అన్ని వున్నా సంతుష్టి చెందక ఏమి లేనట్లే బాధపడుతూ వుంటాడు. చిన్న చిన్న లోపాలు భార్య భర్తల మధ్య ఎప్పుడు వుంటాయని అలా వుండడం వారి వారి నైజం వల్ల మరియు పెరిగిన వాతావరణం వల్లను లేక సంప్రదాయ సిద్ధమైన కుటుంబ సంస్కారం వల్ల ఈ లోపాలు తప్పవని గ్రహించక భావోద్రేకానికి లోనై కోపిష్టివానిగా మారుతాడు. కుజ శనుల కలియక వల్ల ఎక్కువ సంపాదనపరుడు కాలేడు ఒకవేళ తాను సంపాదించినా, ధనాన్ని వృధాగా ఖర్చు చేస్తాడు. సంసారంలో ముఖ్యంగా తన సుఖం చూసుకొంటాడు. భార్యభర్తల మధ్య అనురాగం వుండదు. వారిద్దరి మధ్య కలహాలు వుండి సంతోషం లేక అసంతృప్తితో జీవిస్తారు. కాని దాంపత్య విచ్ఛిన్నం కాదు.

4. కుజుడు రాహువుతో కలిసి వుంటే ఆ జాతకునికిగాని జాతకురాలికి గాని వివాహం యుక్తవయసులో జరుగక ఆలస్యంగా వివాహం జరుగుతుంది. అదే కాకుండా భార్యాభర్తల మధ్య వయోభేదం ఎక్కువగా వుండడానికి అవకాశం వుంది. భార్య అందంగాను ఆకర్షణీయంగాను వుంటుంది. కాని ఈ జాతకుడు మాత్రం కుజ రాహుల యొక్క ప్రభావం వల్ల మాటలలోను మరియు చేతలలోను మోటుగాను వుండి మిదిమి వయస్సులో వున్న మానవుని శరీరాకృతి కలిగి వుంటాడు. ఒక ముఖ్యమైన విషయం ఏమంటే ఈ జాతకుడు అల్పాయుష్కుడై వుండవచ్చు. పూర్ణాయుర్దాయం లేక నడివయస్సులో మరణించవచ్చు. అంటే తాను భార్యకంటే ముందే చనిపోవడం జరుగుతుంది. ఒక మాటలో చెప్పాలంటే కుజ రాహువు కలిగి వున్న పురుషుడిని వరించిన స్త్రీకి వైధవ్యం ఆమె నడివయసులో కలుగవచ్చు. కుజరాహులు కలిసియున్న అత్యంత నిశితంగాను లగ్న ద్వితీయ, సప్తమాష్టమాలు రాశులకు మరియు వాటి మీద వుండే వీక్షణ క్షేత్రస్థాయి గమనించకుండా ఎట్టి పరిస్థితులలోనైనా వివాహం చేయరాదు.

5. కుజుడు కేతువు కలిగి వుంటే దాదాపుగా కుజ రాహువు యొక్క సంయోగ ఫలితాలు ఎలా వుంటాయో చాల మట్టుకు ఆ ఫలితాలే వస్తాయి. ఇంకొక విషయం ఏమంటే వారి జీవితంలో వారిద్దరి మధ్య రక్తి మరియు అనురక్తి లోపించి అశాస్త్రీయమైన పూజలు జపాలు మరియు విలువ, విద్యా లేని తాంత్రికులను మరియు బాబాలు, స్వాముల వారిని పూజించి వారిని నమ్మి దాంపత్య సుఖానికి దూరంగా వుంటారు. ఒక్కొక్కపుడు ఆ జాతకుడు సన్యాసం తీసుకోవడానికి వెనుకాడడు. అంటే సుఖమైన సంసార జీవితాన్ని మూఢ నమ్మకంతోను అంధ విశ్వాసంతోను భార్య బిడ్డలను త్యజించి భిక్షాన్నంతో జీవిస్తాడు.

6. ఎవరి జాతకంలోనైనా సరే కుజునితో రెండు లేక మూడు పాపగ్రహాలుండి సప్తమంలోగాని లేక ద్వితీయ స్థానం గాని లేక యీ రెండు స్థానాల్లో కూడ పాపగ్రహాలుంటే ఆ జాతకునికి వివాహ యోగం లేదు. ఒకవేళ వివాహం అయినా ఆ వివాహమైన కొన్ని మాసాలకే ఆ దాంపత్యం విచ్ఛిన్నమై దంపతులు యిద్దరు విడిపోతారు. ఈ పైన చెప్పిన దుష్ప్రభావాలు స్పష్టంగా ప్రతిబింబించకపోయినా ఆ ఫలితాలు సూక్ష్మస్థాయిలో వుంటాయి. సంసారంలో సంతోషం, ఆనందం లోపిస్తాయి.

7. ఏ వధువు జాతకంలోనైనా కుజుడు వున్న రాశి స్థానం నుంచి తృతీయ, పంచమ, సప్తమ, నవమ, ఏకాదశ రాశులలో ఏ గ్రహాలు అయితే వున్నాయో ఆ గ్రహాలిచ్చే ఫలితాల లక్షణాలు ఆమె భర్తకు వుంటాయి అని గ్రహించాలి.

కుజ దోషం మీద అనేక పండితులకు వేరు వేరు అభిప్రాయాలున్నాయి. అలాగే మినహాయింపులు కుజ దోష సడలింపులకు భిన్నాభిప్రాయాలు వున్నా మనం శాస్త్ర సమ్మతమైన వాటినే మనం పరిగణలోకి తీసుకోవాలి. ఎందుకంటే ఎందరో రామాయణం వ్రాసినా వాల్మీకి రామాయణమే హిందూ మతస్థులకు శిరోధార్యం. అలాగే ఎందరో మహా భారతాన్ని వ్రాసినా, వ్యాస భగవానుడు వ్రాసిన మహాభారతం మనకు ప్రామాణికమై వుంది. అలాగే జ్యోతిష్య శాస్త్రంలో పరాశర మహాముని, నారద మహాముని, వరరుచి, ఆర్యభట్టు, మంత్రేశ్వరుడు ఆదిగా గల గ్రంథములు. మనకు మార్గదర్శకము అవుతుంది. కాని మిగిలిన వారు రచించిన గ్రంథములు వారి వారి స్వానుభవం వల్ల వ్రాసినవే కాని శాస్త్రంలోని మధురిమకు సత్యదూరం

కాదని మనం గ్రహించాలి. అందువల్ల ప్రస్తుత కాలంలో ఎన్నో పద్ధతులు ఏర్పడ్డాయి. KP పద్ధతి అని B.V. Raman పద్ధతి అని, పూర్వ పద్ధతి, అని లేక అధునాతన పద్ధతి, అని లౌడ్నక్ సిద్ధాంతమని వేరు వేరు భిన్నాభిప్రాయాలు వెలిబుచ్చినా వాటిలో కొన్ని శాస్త్రమునకు విరుద్ధంగా వున్నాయి. కాని మూల సూత్రాలు మౌలికంగా ఒకటేకాబట్టి మీ గురువులు చెప్పినదే శిరోధార్యమని మరువవద్దు. అతి ముఖ్యమైన విషయం ఏమంటే వధూవరులకు యిద్దరకు కుజదోషమున్నా యిద్దరకు కుజదోషం వుండి పరిహారమైనా కాకపోయినా మిగిలిన గ్రహస్థితి అనుకూలంగా వుంటే ఆ వివాహం జరుపవచ్చు. కాని వధూవరులలో ఒకరికి వుండి మరొకరికి లేకున్నా లేక ఒకరికే పరిహారమైనా ఆ వివాహం చేయకూడదు. జాతకం పరిశీలించ మని వచ్చిన వారు మనలను ప్రభావితం చేస్తారు ఎందుకంటే జ్యోతిష్యుల చేత ఒప్పుదల పొందగలిగితే తాము అనుకొన్న కోరిక తీరుతుందనే కాక, తాము వాంఛించిన సంబంధం వివాహం జరపవచ్చని ఆకాంక్ష ఎక్కువగా వుంటుంది. కాని ఏ జ్యోతిష్యుడు ఎట్టి పరిస్థితులలో కూడా వచ్చిన వారు నొచ్చుకుంటారనో లేక నిరాశపరులు అవుతారనో అనుకొని ఏ జ్యోతిష్యుడు ఆత్మవంచన చేసుకొని సత్యమును దాచకుండా నిజనిజాలను వారికి సున్నితంగా మృదుభాషలో వెల్లడించాలి. ఎందుకంటే వివాహమనేది జీవితంలో ఎవరికైనా ఒకసారి చేయడమే అత్యున్నతం. అందుకనే వివాహం నూరేళ్ల పంట అని అంటారు.

అతి ముఖ్య విషయం ఏమంటే ఏ జాతకంలోనైనా సరే కుజ శుక్ర సంయోగం ఉన్నా, లేక సప్తమ లగ్న, చతుర్ధ స్థానాలలో ఉన్న శుక్రునిపై కుజవీక్షణ ఉన్నా వారి దాంపత్య జీవితం తప్పకుండా విచ్ఛిన్నమైపోతుంది. అసూయలు, ద్వేషాలు ప్రజ్వరిల్లి విరోధం, విద్వేషం పెరిగి అహంకార కోపావేశాలతో తమ దాంపత్య జీవితం విచ్ఛిన్నం చేసుకుని తర్వాత అన్ని విధాల తక్కువ తరగతి అయిన భాగస్వామిని పొంది అసంతృప్తి జీవితం గడుపుతారు. కుజ శుక్ర సంయోగం అత్యంత ప్రమాదాన్ని దాంపత్య జీవితంలో చూపిస్తుంది. గురువు యెక్క కుజదోషం పరిహారమయినా కూడా వివాహము ఆలస్యం అవుతుంది. అందువల్ల కల్యాణ యోగం వచ్చినప్పుడు వివాహం చేసుకోవాలి. విశేష వీక్షణ దోషం తగ్గుతుంది కాని దోషం పూర్తిగా హరించిపోదు. ఇది సత్యం.

# బుధుడు

మనకున్న నవగ్రహాలలో చతుర్థస్థానం, బుధస్థానంగా గమనించవచ్చు. ఈ బుధుడు ఆంగీరస నామ సంవత్సర మార్గశిర శుద్ధ సప్తమి పూర్వాభాద్ర నక్షత్రంలో బుధవారం జన్మించాడని శాస్త్ర ఉవాచ. జాతక చక్రంలో బుధునికి కూడా రెండు రాశుల ఆధిపత్యం కలిగి వుంటుంది. మేషం నుంచి తృతీయ స్థానమైన మిథున రాశికి బుధుడు అధిపతి. ఈ రాశి పురుషరాశి. ఈ రాశిలో మృగశిర రెండు పాదాలు అంటే తృతీయ, చతుర్ధ పాదాలు తరువాత ఆరుద్ర నక్షత్రంలో నాలుగు పాదాలు మరియు పునర్వసు నక్షత్రంలో మొదటి మూడు యీ రాశిలో వుంటాయి. అంటే చంద్రుడు ఎవరి జాతకచక్రంలోనైనా సరే మిథున రాశిలో వున్నపుడు ఆ జాతకులకు రాశి మిథునరాశియే అవుతుంది. అంటే ఈ రాశిలోచెప్పిన నక్షత్రములలోని ఏ పాదంలో జన్మించినా లేక ఏ నక్షత్రంలో జన్మించినా చంద్రుడు మిథున రాశిలో వున్నాడు కాబట్టి వీరికి మిథునరాశియే అవుతుంది. ఎవరికైనా బుధుని దశ 17సంవత్స రాలు ఉంటుంది. బుధుడు చంద్రునికి పుత్రుడు. భార్య పేరు మాయాదేవి.బుధునిది ఆత్రేయస గోత్రం. బుధుని ఆధిపత్యంలో ఉన్న మిథునరాశిలో రాహువు ఉచ్ఛంలో వుంటాడు. కాని రాహువు ఉచ్ఛస్థితి నిర్ణయంలో కొన్ని భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఎందుకంటే రాహువు వృషభరాశిలోనే ఉచ్ఛంలో వుంటాడనే వాదన కూడ వుంది. ఈ నిర్ణయం మీరు మీ గురువుల వద్ద తెలుసుకొని వారి అభిప్రాయాలను గౌరవించి ఫలితాలు చెప్పడం మీకు సమంజసం.

బుధుడికి మేషం నుంచి షష్టమరాశియైన కన్యారాశికి కూడ ఆధిపత్యం వుంది. ఈ కన్యారాశి స్త్రీ రాశి మరియు భూతత్త్వరాశి. మిథున రాశిలాగ పురుష రాశి కాదు. శూద్రరాశిగా వ్యవహరిస్తారు. ఈ కన్యా రాశిలో బుధునికే ఉచ్ఛస్థానం వుంటుంది. ఒక్క విషయం మీరు గమనించవలసింది ఏమంటే తన ఆధిపత్యంలో ఉన్న కన్యారాశిలో తనకే ఉచ్ఛస్థితి వుంది. ఈ విధంగా మరే గ్రహానికి లేదు. బుధుడు కుల రీత్యా వైశ్యుడు. శారీరకంగా నపుంసకుడు రజోగుణం గలవాడు. మౌలికంగా శుభగ్రహం పరమ స్వార్ధపరుడు ఎందుకంటే ఈ బుధుడు శుభగ్రహాలో వున్నపుడు శుభఫలితాలు యిస్తాడు. పాపగ్రహాలతో వున్నపుడు పాప ఫలితాల్నే

యిస్తాడు. ఒకవేళ ఒకే రాశిలో ఒక శుభగ్రహం మరియొక పాపగ్రహం తనతో వుండినపుడు ఆ పాప శుభగ్రహాలలో ఏ గ్రహం బలంగా వుందో ఆ గ్రహం యిచ్చే ఫలితాలే యిస్తాడు. అంటే ఒక పాపగ్రహం ఒక పుణ్య గ్రహం కలిసివున్నపుడు ఆ రెండు గ్రహాలలో ఏ గ్రహం బలంగా వుంటే ఆ గ్రహఫలితాలు ఇస్తాడని అర్థం. కాని ఎప్పుడు సూర్యునితో కలిసిగాని లేక సూర్యునికి ఎప్పుడూ ద్విద్వాదశ స్థానాల్లో గాని వుంటాడే తప్ప మరో స్థానంలో ఎక్కడా గాని వుండడు. ఎందుకంటే బుధునికి మిత్రగ్రహాలు రెండే రెండు. ఒకటి సూర్య గ్రహం రెండవది శుక్రగ్రహం. అందువల్ల ఎప్పుడూ బుధుడు శుక్ర మరియు రవి వున్న స్థానాల్లోగాని లేక వారి స్థానాలకు ద్విద్వాదశ స్థానాల్లోనే వుంటాడు కాని వేరొక రాశులలో వుండనేరడు. శుక్రుడు బుధునికి మిత్రుడైనా కూడ కన్యారాశిలో ఆతను దుర్బలుడుగానే వుంటాడు. దీనిని కొందరు శుక్రునికి కన్యారాశి నీచమని వ్యవహరిస్తారు. ఈ రాశిలో ఉత్తరా నక్షత్రంలోని ద్వితీయ, తృతీయ మరియు చతుర్థ పాదములు, హస్త నక్షత్రములోని నాలుగు పాదములు మరియు చిత్తా నక్షత్రంలోని ప్రథమ ద్వితీయ పాదములు వుంటాయి. బుధునికి రెండు రాశుల ఆధిపత్యం వున్నా మిథున రాశివారికి మరియు కన్యారాశి వారికి ఒకే ఫలితాలు యివ్వడు. ఎందుకంటే వారి జన్మ నక్షత్రం భేదం వల్ల మరియు ఆ జన్మ నక్షత్రాధిపతులు వేరు వేరుగా ఉండటం వల్ల బుధుడు ఫలితాలు కూడా వేరువేరుగానే వుంటాయి గాని ఒకేలాగ వుండవు. అలాగే మిథున కన్యారాశుల తత్వాలు వేరు కాబట్టి అంటే మిథునరాశి వాయు తత్వం కలది, కన్యరాశి భూతత్వం కలది కాబట్టి ఫలితాలు వేరుగా వుంటాయి. బుధుడు తన చక్రభ్రమణ సమయంలో తన సంచారంలో ప్రతి సంవత్సరం మూడుసార్లు వక్రగతి పొందుతాడు. బుధుడు అత్యంత పాండిత్యం కలవాడు మరియు సకల విద్యాపారంగతుడు, సూర్య భగవానునికి ప్రీతిపాత్రమైన మిత్రుడు, మంచి వాక్యం తెలిసినవాడు. గ్రహ సభలో మంచి వక్త మరియు గణాంక శాస్త్ర పాండిత్యంలో ఉద్దండుడు. బుధుడు కన్యారాశిలో 15 డిగ్రీల ఉచ్చంలో వుంటాడు. స్వతహాగా సాత్విక తత్వం కలవాడు. సహనశీలి అత్యంత తీక్షణమైన సూర్యభగవానుని ఉష్ణంను భరించి సహనంతో సూర్యుని రాశిలోను లేక సూర్యుడు ఉన్న ముందు వెనుక రాశులలోనే వుండగలిగే బుధునకు ఎంత సహనమో మనం వూహించ వచ్చు. ఈ బుధుడు జ్యోతిష్యం, తర్కం, వ్యాకరణం, వేదోపనిషత్తులు,

యంత్ర, తంత్ర,మంత్ర శాస్త్రములందు అసామాన్య పాండిత్యం కలవాడు. పరోపకారి. స్నేహాభిలాషి. అందువల్లే బుధునకు చంద్రుడు తప్ప ఎవ్వరు శత్రువులు లేరు. ఏ జాతకుడికైనా సరే వారి జాతకములో బుధుడు కనుక బలంగా ఉంటే ఆ జాతకునకు బుద్ధి కౌశల్యం వాక్పటిమ, సంభాషణా చతురత మరియు కావ్య గ్రంథం, శాస్త్రములందు ప్రావీణ్యం ఉంటుంది. అత్యధిక నేర్పుతో ప్రజల మనస్సును ఆకట్టుకొనే విధంగా ఉపన్యాసాలు చేసి ప్రజల మెప్పు పొందుతాడు. అనర్గళమైన భాషా నైపుణ్యం కలిగి గ్రంథ రచన చేసి ప్రజల మెప్పును పొందుతారు. వారి గ్రంథాలు చిరస్థాయిగా నిలబడతాయి. విద్యావంతులతోను, పండితులతోను, శాస్త్రవేత్తల తోను, వారి వారి అనుభవాలను గురించి చర్చించి తన చతుర సంభాషణతో వారికిఆప్తుడు అవుతాడు. ఉపాధ్యాయ వృత్తిలో చక్కగా రాణిస్తారు. ఇంతటి మంచి లక్షణాలు కలిగి వున్న మరియు శాస్త్ర ప్రావీణ్యత వున్నా, బుధుడు కనుక జాతక చక్రంలో ఆతనికి వక్రగతి కలిగిన లేక బలహీనపడిన మరియు శత్రు క్షేత్రంలో వుండినా అంటే బుధుడు కర్కాటక రాశిలో వున్నా లేక రాహువు, కేతువు, శని గ్రహాలతో కలిసి వున్నా లేక యీ మూడు పాపగ్రహాలలో ఏ ఒక్కరితోనైనా కలిసివున్నా బుధుని ప్రభావ ఫలితం సడలిపోతుంది. బుధునికి ఉన్న సహజ శుభ లక్షణాలను సూర్యునికి మేఘం అడ్డువచ్చి నట్లుగా శుభలక్షణాలు ప్రతిబింబింపవు. శని యొక్క తృతీయ, సప్తమ, దశమ, వీక్షణలు లేక రాహుకేతువులు పంచమ, సప్తమ, నవమ, ద్వాదశ వీక్షణాలు మరియు క్షీణ చంద్రుని యొక్క సప్తమ వీక్షణ వున్నా ఆ జాతకుని నాలుక మొద్దుబారిఉంటుంది. ఆ జాతకునికి ముద్దమాట కూడా ఉండవచ్చు. నాలుకకు సరియైన పదును లేకపోవడం వల్ల అతని ఉచ్చారణలో అక్షర లోపం స్పష్టంగా కనిపిస్తుంది. బుధదోషం వుంటే ఆ జాతకునికి జన్మతః నత్తి వుంటుంది. కాని ఆ బుధ దశ పూర్తిగా అయిపోయిన తరువాత గురు మహర్దశ దగ్గరకు వస్తున్నప్పుడు ఆతని నత్తి బాధనుంచి ఉపశమనం పొంది స్పష్టంగా మాట్లాడగలడు. అందువల్ల నత్తి వున్నవారు బుధ మంత్రం రోజుకు తొమ్మిది సార్లు ఉదయం మరియు తొమ్మిదిసార్లు రాత్రి శ్రద్ధగా భక్తితో పఠించి దీపం చేస్తే సరస్వతీ కటాక్షం కలిగి మాటలో స్పష్టత ఏర్పడి నత్తి తొలగిపోతుంది. దేవి వుపాసకులు సలహాలను పాటిస్తే శుభం కలుగవచ్చు. ఇక బుధుడు వక్రమార్గాన వున్నట్లయితే ఆ జాతకుడు అసత్యం ఎక్కువ పలుకుతాడు. మాటలలో సత్యం ఉండదు.

పస లేని వ్యర్ధ ప్రసంగాలు చేస్తూబంధు మిత్రుల వద్దను, బుధ వర్గంలోను ఎగతాళికి గురి అవుతారు. మూర్ఖత్వం స్పష్టంగా కనబడు తుంది. కుజ బుధులు కలిసి వుంటే ఆ జాతకులు వాచాలత్వం మరియు అప్రియ సంభాషణలతో తమ అజ్ఞానాన్ని ప్రదర్శించి అందరిలోను చులకన అవుతారు. ఎందుకంటే ఒక్కొక్కపుడు ఆతని సంభాషణలోను వాక్య పద ప్రయోగంలోను సభ్యత లోపించి అశ్లీల పదాలు కూడ దొర్లుతాయి. అదేకాకుండా తన సంభాషణలో ఎదుటి వారిని కించపరుస్తూ అవమానించే పద్దతిలోను వారిని మూర్ఖులుగా చిత్రిస్తూ తనకున్న భావాలను ఎదుటి వారికి చెప్పడంలో సౌమ్యత లేకుండా ఉద్రేకంతోను మరియు కోపాహంకార ఉన్మాదియై పెద్ద గొంతులో వాగ్వివాదం చేస్తారు. లగ్నంలోగాని అష్టమంలో గాని బుధుడు దుర్బలుడైతే ఆ జాతకుడి కంఠస్వరంలోని మృదుత్వం నశించి వినడానికి కఠినంగాను మోటుగాను వుంటుంది. ఆతని సంభాషణలో సౌమ్యత హీనమై జుగుప్సాకరమైన పెద్ద స్వరంతో ఉండి వినడానికి యింపుగా వుండదు. దీర్ఘవాక్యాలు మాట్లాడతాడు. తాను చెప్పదలచుకొన్నది ఒక వాక్యంలో చెప్పగల్గిన నైపుణ్యం నశించి ఆ వాక్యాన్ని వ్యాకరణరహితంగా ముక్కలు ముక్కలుగా చేసి మాట్లాడతారు. తనకు తెలిసిన విషయం ఒకే వాక్యంలో చెప్పలేక అసహ్యకరమైన వాక్య పదజాలంతో అసందర్భ ప్రలాపనలు చేస్తూ ఇతరులను అవమానపరచే విధంగాను, ఎగతాళి చేసే పద్ధతిగాను ఉంటుంది. సభాగౌరవాన్ని పాటించరు. బుధుడు శనితో కలిసి వుంటే నంగినంగిగా మాట్లాడతాడు. మాటల్లో స్పష్టత లేక మాట్లాడేటప్పుడు శ్రమ పడడం జరుగుతుంది. ఆ శ్రమ వల్ల అతను సంభాషించేటప్పుడు అతని స్వరంలో స్వరశుద్ధి లేకపోవడం వల్ల ధ్వనిలోకి హెచ్చు తగ్గులు కనబడతాయి. బుధుడు కేతువుతో కలిసి ఉంటే తన సంభాషణ చతురతతో యితరులను వాదోపవాదంలో గాని పండిత చర్చలలో గాని ప్రత్యర్థులను పడగొట్టగలగడం వెన్నతో పెట్టిన విద్య.ఒకే ఒక మాటతో యితరుల గౌరవాలను, విలువలను హరియింపజేసి అందరి చేత మెప్పుదల పొందుతారు. కాని మిత భాషిగానే వుంటారు.అధికంగా సంభాషించే స్వభావం వీరికి వుండదు. బుధకేతువులు కలిసి శత్రు క్షేత్రంలో వుండి ఆ క్షేత్రం మీద పాప వీక్షణం వుంటే ఆ జాతకుడు మూగవాడవుతాడు. బుధుడు కనుక రవితో కలిసి వుంటే ఆ కలయిక వల్ల ఆ జాతకునికి ఒక శుభయోగం ఏర్పడుతుంది.ఆదిత్యుడు అంటే సూర్యుడు. ఈ సూర్యుడు

బుధునితో కలిసి ఉన్నప్పుడు బుధాదిత్య యోగమంటారు. ఈ యోగం వల్ల మంచి కంఠస్వరం కలిగి సంభాషణంలో సాహిత్య పదములు చక్కగా దొర్లుతూ ఉంటాయి. వాక్య ప్రయోగమును మధ్యలో ఆపడం గాని పదాలకు తడుముకోవడంగాని చేయక, బహు చక్కని శోభాయమానంగా పదముల పొందికలతోవాక్యాన్ని ముగిస్తారు. సంభాషణలో చక్కని ప్రజ్ఞా పాటవాన్ని ప్రదర్శిస్తాడు. ఈ జాతకుని వాక్యములోని పదములు సుకుమారంగాను మరియు సున్నితం గాను ఉండి ప్రజల ప్రశంస పొందుతారు. (నేను వ్రాసిన యోగ ప్రాశస్త్యంఅనే పుస్తకంలోఅన్ని యోగముల వివరాలు విపులంగా చర్చించాను. ఔత్సాహికులు ఆ పుస్తకమును చదివితే బుధాదిత్య యోగాన్ని గురిచి కూలంకషంగా ఒక అవగాహన మీకు వస్తుంది.)

బుధుడు కనుక తన స్వక్షేత్రంలో వున్నా లేక ఉచ్చరాశిలో ఉన్నా అంటే కన్యలో వున్నా మరియు మిత్ర క్షేత్రములలో వున్నా అంటే బుధుడు కర్కాటకంలో ఉన్నా మరియు శుక్రరాశులైన వృషభ, తులా రాశులలో వున్నా మరియు లగ్న స్థానం నుంచి అష్టమ స్థానంలో ఉన్నా లేక వేరే ఏదైనా శుభగ్రహంతో కలిసి ఉన్నా ఆ జాతకుడు మంచి శాస్త్రపారంగతుడై చక్కని వాక్పటిమ కలిగి ఉత్తమ పాండిత్య బుధ వర్గంలో ఒకరిగా వుంటూ సభాగౌరవం పొందుతాడు. అలాగే బుధుడు లగ్నం నుండి ద్వితీయ స్థానంలో వున్నా లేక షష్టమ స్థానమందున్నా,షష్టమ స్థానంలో వుండి శుభవీక్షణ ఉన్నా, లేక కేంద్ర స్థానాలలో అయిన లగ్న చతుర్ధ, సప్తమ,దశమ సాధనాలలో శుద్ధ బుధుడుగా నున్న మంచి ఉన్నత విద్య కలిగి లోక విచక్షణ జ్ఞాన మందును, ధర్మాధర్మ పరిజ్ఞానమందును, ఆతడు లౌకిక జ్ఞానంతో పేరు ప్రతిష్టలు సంపాదించి అజాత శత్రువుగా కీర్తి గడించి సమాజ సేవ చేసి మంచి జ్ఞానవంతుడుగా, ధర్మశీలిగా రాణిస్తాడు. బుధుని మీద గురువు యొక్క పంచమ, సప్తమ, నవములలో ఏదో ఒక వీక్షణ ఉండికర్కాటక రాశిలో గాని మకరకుంభ రాశులలో గాని పాప వీక్షణ లేకుండా ఉండి శుద్ధ బుధునిగా ఉన్నట్లయితే ఆతనిని మనం సరస్వతి పుత్రునిగా భావించవచ్చు. ఏదైన ఒక దైవ శాస్త్రంలో అత్యంత పాండిత్యాన్ని సంపాదించి ఉన్నతమైన మంచి శాస్త్ర నైపుణ్యం కలిగి ఉంటాడు. అదీ కాక, ఆ దైవ శాస్త్రాల మీద రచనలు చేసి తన పాండిత్యాన్ని ప్రజలకు పంచిపెడతాడు.

బుధుడు మన దేహంలోని నరాలు, చేతులు, భుజములు, కంఠం, జీర్ణకోశం, నాశిక మరియు నాలుక మొదలైన అంగములకు అధిపతిగా వుంటాడు. అంటే మీరు గమనించవలసినది ఏమంటే మానవ శరీరములోని ముఖ్యమైన పై భాగాలకు యీ బుధుడు అధిపతిగా గమనించాలి. ఈ అంశాలకు ఎవరికైనా ఏదైనా రుగ్మత కలిగినపుడు శ్రద్ధాభక్తులతో ప్రతి బుధవారం బుధుని పూజించడం వల్ల వ్యాధియొక్క ఉధృతం తగ్గి చాల వరకు బాధా నివారణ కలిగి ఉపశమనం పొందుతారు.

బుధునికి ఆకు పచ్చ రంగు అంటే అధిక ప్రీతి. అందువల్ల ముదురు ఆకుపచ్చగా ఉన్న మంచి జాతి రత్నాన్ని శరీరానికి తాకుతున్నట్లుగా ఉంగరంలో గాని లేక మెడగొలుసులో గాని లాకెట్టులో గాని వేసి ధరిస్తే బుధానుగ్రహం కలుగుతుందని పండితుల నిశ్చితాభిప్రాయం. మనం శుభకార్యాలందు బుధ గ్రహానికి ఆహ్వానం పలుకుతున్నట్లుగా ఇంటికి గాని లేక ఏదైనా శుభ కార్యం చేస్తున్న ప్రదేశంలో కాని ఆకుపచ్చ రంగు కలిగిన మామిడిఆకులు,పచ్చి కొబ్బరి మట్టలు మరియు అరటి చెట్లు కట్టుట వల్ల బుధునికి సంతుష్టి కలిగి శుభకార్యం చేసే మానవులను దీవిస్తాడని ఋషిపుంగవులు మనకు శెలవిచ్చారు. అలాగే బుధుని పూజించే టప్పుడు ఆకుపచ్చ పూలతో బుధుని పూజించడం లాభదాయకంగా ఉంటుంది. ఆకుపచ్చ పూలుఅంటే సంపంగి మరియు ఆకుపచ్చ కనకాంబరములుమొదలగునవి. బుధునికి యిష్ట మైన లోహం పాదరసం. పాదరసం బుద్ధికి జ్ఞానానికి మరియు విజ్ఞానానికి ఒక సంకేతం. అందువల్లనేమనంఎవరినైనా వారి మేధో సంపత్తిని మెచ్చుకొనేటప్పుడువారిబుద్ధి పాదరసం లాటిది అని ఉదహరిస్తాం అంటే అతనికి బుద్ధికి బృహస్పతి లాంటి వాడని ఉపమానం.బుధ గ్రహం నవగ్రహాలలో అన్నింటికన్న పరిమాణంతోచాల చిన్నది.కాని ఆతనుమాత్రమే సూర్యునికి అతి దగ్గరలో నిలువగల్గి ఆతని మిత్రత్వం సంపాదించి ఆయన చుట్టూ ప్రదక్షిణం చేస్తూ వుంటాడు. పైగా సూర్యునితో కలయిక వల్ల బుధాదిత్య యోగం ఏర్పరచుకొంటాడు. బుధుడు, గురు క్షేత్రమైన మీనరాశిలో దుర్బలుడవుతాడు. బుధుడు వర్తులాకారం కలవాడు అంటే పూర్ణచంద్రునిలాగా గుండ్రని ఆకారం కలవాడు. ఇతని వయస్సు 20 సంవత్సరాలు. బుధుడు ఆశ్లేష జ్యేష్ట రేవతి నక్షత్రాలకు అధిపతి.సూర్యునికి దగ్గరగా వుండి ఆతని మిత్రత్వం

సంపాదించి అస్తంగత్వం లేక ఉండగల్గిన గ్రహం ఒక్క బుధుడు మాత్రమే. పుణ్యగ్రహా లైన గురువుమరియు శుక్రులకు కూడా సూర్య సంయోగం వల్ల అస్తంగత్వ దోషం ప్రాప్తిస్తుందని మనం మరువరాదు.

## గురువు

జాతకచక్రంలోని దశలు పరీక్షించినపుడు గాని లేక గురువు యొక్క స్థాన స్థితిని మరియు ఆయనకున్న విశేష వీక్షణ స్థితిని పరిశీలించి విశ్లేషించడం ప్రతి పండితుడు చేసే మొట్టమొదటి అంశంగా భావించవచ్చు. ఎందుకంటే గ్రహాలన్నింటికి గురువే ఆధిపత్యం వహిస్తాడు. అట్టి ఆధిపత్యం గల గురువు కనుక బలంగాను, శుభంగాను వుంటే మిగిలిన గ్రహాలు ఒకవేళ ఏ ఏ స్థానాలలో వుండినా తమ యొక్క గురువైన బృహస్పతి విశేష శుభవీక్షణ వల్ల తమ ఉధృతాన్ని తగ్గించుకొని తామిచ్చే దుష్ఫలితములు తీవ్రతరం చేయవు. అందువల్ల గురువు అత్యంత శుభగ్రహమని, గురుబలం ఎక్కువగా వున్న జాతకులకు వారి జీవన స్రవంతిలో అన్ని విధాల అంటే విద్యలో, జ్ఞానంలో, పాండిత్యంలో రాణిస్తారు అనేది నిశ్చయం. గురుబలం ఎంత ఎక్కువగా వుంటే ఆ జాతకునిది అంత ఉత్తమ జాతకమని భావించాలి. ఈ గురు దశ ఎవరి జాతకంలోనైనా సరే పదహారు సంవత్సరాలు వుంటుంది అంటే గురువు ప్రవేశించిన నాటి నుంచి గురు దశ ప్రారంభమై ఆ దినం నుంచి పదహారు సంవత్సరాలు పూర్తిగా గురు దశ ఉంటుంది. గురువు తల్లి పేరు తార. గురువు యొక్క భార్య వైవస్వత మనువు కూతురు ఇల. ఆమె మహా పతివ్రత. ఉత్తమోత్తమ విద్యా, సంగీత సాహిత్యాలయందు నిష్ణాతురాలుగా బ్రహ్మపురాణంలో చెప్పబడింది. గురువు యొక్క కుమారుని పేరు పురూర వుడు. వైశాఖ బహుళ చతుర్దశి గురువారం భరణి నక్షత్రంలో జన్మించాడు. ఇతని వయస్సు ముప్పై సంవత్సరాలు. ఇతను చంద్రుని పుత్రుడు. అయినా కులరీత్యా బ్రాహ్మణోత్తముడుగా పేర్కొనబడ్డాడు. సాత్త్విక స్వభావం కలవాడు. మిక్కిలి స్వాంతన స్వభావం కల్గి సౌమ్యుడుగా ప్రసిద్ధి గాంచినాడు. సత్ప్రవర్తనుడు మరియు ఏ దంపతులకైనా పుత్రసంతాన కారకుడు. అందుకనే జ్యోతిష్యం శాస్త్రంలోను గురువు పుత్రకారకుడుగా ప్రాచుర్యం పొందాడు. శారీరక రీత్యా యితడు పురుషుడు. ఇతడు పునర్వసు, విశాఖ,

పూర్వాభాద నక్షత్రములకు అధిపతి. మన జాతక చక్రంలో ఈ గురువుకు కూడ ద్విరాశాధిపత్యం వుంది. మొదటిది మీనరాశి మరియొకటి ధనురాశి. ఈ రెండు రాశులకు ద్వాదశరాసులలో పాపగ్రహాధిపత్యమేవుంటుంది. అయినా గురుస్థానానికి పాపకర్తరీ దోషము వుండదని గ్రహించాలి. పైగా తన స్వక్షేత్రంలో వున్న గురువు బలంగా వుండి శుభఫలితాలే యిస్తాడు. ధను రాశిలో మూల నక్షత్రంనాలుగుపాదాలు, పూర్వాషాఢ నాలుగు పాదాలు, ఉత్తరాషాఢ ఒక పాదం వుంటుంది. ఈ రాశిలో కేతువు ఉచ్ఛస్థితిలో వుంటాడు. కాని కొంతమంది కేతువుకు ఉచ్ఛస్థానం వృశ్చిక స్థానమని నిర్ణయిస్తారు. గురువు తన చుట్టూ తాను తిరగడానికి పది గంటలకాలం తీసుకొంటాడు. అలాగే సూర్య ప్రదక్షిణానికి ఒక పుష్కర సమయాన్ని తీసుకొంటాడు.

మానవ శరీరంలో భాగమైన తొడలు, పిరుదులకు ఏమైనా రుగ్మత కలిగినపుడు గురువును పూజించుట శ్రేయస్కరం. అలా పూజించడం వల్ల బాధ తగ్గి ఉపశమనం పొందు తారు. మహాభారత సంగ్రామంలో భీమ సుయోధనులగదా యుద్ధం జరుగు తున్నపుడు ఆ సమయంలో భీముని లగ్నం మీద బలమైన గురు వీక్షణ వుండటం వల్లన మరియు సుయోధ నుని జాతక చక్రంలో గోచారరీత్యా గురువు అస్తంగతుడై వక్రగతిలో వుండడం వల్లనమహాబల శాలిగదా యుద్ధంలో సరిసమానముగా యుద్ధ ప్రావీణ్యత గల సుయోధనుడు కూడ భీమునికి గురువు యొక్క వీక్షణ బలం వల్ల సుయోధనుని ఊరువులు ఛేదించి తన ప్రతిజ్ఞను దిగ్వి జయంగా నెరవేర్చు కొన్నాడు. గురుబలం లేని సుయోధనుడు ఊరువులు విచ్ఛిన్నమై మరణిం చాడు. అలాగే గురు బలం ఉన్న భీముడు సుయోధనునిఊరువుల మీదగదా ఘాతాలతో మోది తన ప్రతీకారం తీర్చుకుంటాడు.

గురువు తాను ఏ రాశిలో వున్నా ఆ రాశినుంచి పంచమ, సప్తమ, మరియు నవమ స్థానాలను వీక్షిస్తాడు. అంటే ప్రతి గ్రహం తాను ఉన్న స్థానం నుంచి సప్తమ స్థానాన్నివీక్షిస్తుంది. కాని గురువు సప్తమ స్థానమే కాక అధికంగా పంచమ స్థానం మరియు నవమ స్థానాల్ని కూడా వీక్షిస్తాడు. ఈ అధిక వీక్షణులను విశేష వీక్షణలుగా జ్యోతిష్య శాస్త్రంలో చెప్పబడింది. గురువు కర్కాటక రాశిలో $5^0$ డిగ్రీల ఉచ్ఛంలో వుంటాడు. అందువల్లే గురువుకు తనఉచ్ఛాధి పత్యం వల్ల కర్కాటక రాశి అధిపతియైన

చంద్రుణ్ణి మిత్రునిగానే భావిస్తాడు. లగ్నాధిపతిగురువు తోకలిసి వుంటే మోక్షప్రాప్తి కల్గుతుంది. కాని ఆ లగ్నాధిపతి శుభగ్రహమై వుండాలి. అలాగే పాపగ్రహ సంయోగం మరియు పాప గ్రహవీక్షణ ఉండకూడదు. (మోక్షప్రాప్తి ఎలా కలుగు తుందో ఎవరికి వస్తుందో జాతకచక్రం ద్వారా తెలుసుకుందామనే అభిలాష వున్నవారునేను వ్రాసిన "జాతక మోక్ష ప్రదాయిని" అనే పుస్తకం చదివితే మీరు వివరాలు విపులంగా తెలుసుకోవచ్చు.) మీన రాశిలో శుక్రుడు $270^0$ డిగ్రీలలో ఉచ్ఛంలో వుంటాడు. ఈ రాశిలో పూర్వాభాద్ర నాల్గవ పాదం ఉత్తరాభాద్రలోని అన్ని పాదాలు మరియురేవతి నక్షత్రంలో నాలుగు పాదాలు ఉంటాయి. మీనరాశి జలతత్వరాశి. స్త్రీ రాశి మరియు బ్రాహ్మణరాశిగా పేర్కొనబడింది. గురువు మహాపండితుడు సర్వ విద్యాపారంగతుడు. మిక్కిలి సహాయకారి. వేదవేదాంగ శాస్త్ర పారంగతుడు. ఉత్తమ బ్రాహ్మణునకు వుండవలసిన సాత్విక స్వభావం పూర్తిగా కలవాడు. వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, వ్యాకరణం, తర్కశాస్త్రం, మధురమైన రచనాశక్తి మరియు ఉన్నతమైన, శోభాయమాన మైన వాక్య పదజాలంతో నిత్యం సత్యమే సంభాషిస్తూ అందరికి ఆహ్లాదకరమైన భాషనుఉపయోగిస్తూ అందరి ప్రమోదకరంగా వీనుల విందుచేస్తాడు. గురు మహర్దశలో ఆ జాతకునికి అన్ని విధాల మేలు కలుగుతుంది. తాను అనుకొన్నది సాధించిజయం పొందడమే కాక ఉన్నత శిఖరాలను అధిరోహిస్తాడు. ఎందుకంటే గురువును కాదని కాని లేక ఆయనను వ్యతిరేకించిగాని ఏ పాపగ్రహం కూడ ఆయన వీక్షణలోవున్నప్పుడు ఆ జాతకునికి హాని చేయడం లేక దుష్ఫలితాలను ఇవ్వడం లాంటివి చేయవు. గురు వీక్షణ,తన మీద పడినప్పుడుఅత్యంత క్రోధి రక్తపిపాసిగ్రహసామ్రాజ్యంలో సైన్యాధ్యక్షుడు, క్రూర మనస్తత్వం గలవాడు, మరియు దాంపత్య విచ్ఛిన్న కారకుడు అయిన కుజుడు కూడ గురు వీక్షణ ఉన్నప్పుడు అచేతనుడై తన ఉధృతాన్ని కోల్పోతాడు. అందువల్ల కుజుడు యిచ్చే దుష్ఫలితాలు లేక తీవ్ర పరిణామాలు ఇవ్వక నిర్వీర్యం అయిపోతాడు. అందువల్లే జ్యోతిష్య పండితులు గురువీక్షణం ఉంటే కుజహాని ఉండదని విశ్లేషిస్తారు.

గురువు తన మిత్ర క్షేత్రములలో మరియు ఉచ్ఛ క్షేత్రమైన కర్కాటకంలో ఉన్నప్పుడు అట్టి దశలో ఆ జాతకునికి అన్ని కార్యాలు సానుకూలించి జయం కలిగే కారకత్వాన్ని కలిగిస్తాడు. అంటే గురువుకు సింహరాశి, కర్కాటకరాశి, కుజ రాశులు

అయిన మేష వృశ్చిక రాశులు మిత్ర రాశులని గ్రహించాలి. ఒకవేళ గురువు తన శత్రు క్షేత్రంలో ఉన్నపుడు లేక అస్తంగతుడు అయినపుడు అత్యంత శుభఫలితాలు యియ్యలేడు. నిస్సహాయంగా వుండి దుర్బలుడు అయిపోతాడు. అయినా కూడ సాత్విక బ్రాహ్మణత్వం వల్లను మరియు గ్రహము లకు గురు బ్రహ్మ అయిన పుణ్యంవల్ల తాను నిస్సహాయ స్థితిలో వున్నఆ జాతకుడిని మానసిక వత్తిడి మరియు ఆందోళనకు గురిచేయక మరియు అన్న వస్త్రాలకు లోటు చేయక సమాజంలో నైతిక విలువలను సంస్కార ప్రాధాన్యతను తగ్గింపక మంచి మనిషిగా జీవింప చేస్తాడు. గురువు ఏ జాతకునికైనా సరే తన మహర్దశ నుంచి శత్రుక్షేత్రంలో ప్రవేశించేటపుడు కాని లేక దుర్బల స్థానానికి పయనించేటపుడు గాని ఏదో విధంగా ఆ జాతకునికి తగినంతయధా శక్తి మేలు చేసి పోతాడు. ఆ సమయంలో ఆ జాతకునికి భూ, ధన లాభములు, స్థిరాస్తి సంపాదన, వృత్తి, వ్యాపార, వ్యవసాయ, ఉద్యోగములందు లాభం కలిగిస్తాడు. కాని ఒక్కొక్కపుడు పాపగ్రహ ప్రభావ స్థితి వల్ల డబ్బు చేతికి అందనీయకుండ ఆ పాపగ్రహం అడ్డుపడుతుంది. ఇది చాల ముఖ్యమైన విషయమని మనం గ్రహించాలి.

గురువుకు పసుపు రంగు అంటే ప్రీతి. అందువల్లే గురువు యొక్క ఆశీర్వాదం పొందడానికి పసుపు రంగు కల రత్నాన్ని శరీరానికి తగిలేటట్లుగా ధరించడం మంచిది. మన హిందూమతంలో గురువు యొక్క ప్రభావం మన అందరకు తెలుసు కాబట్టి గురు ప్రీతి కోసం మన గృహాలలో ప్రతి గదిలోని గడపలకు పసుపు రంగు పూయడం గురువు యొక్క ఆశీర్వాదం కోసమేనని అర్థం చేసుకోవాలి. అంటే గురువుయందు ప్రీత్యర్థం కోసమే గృహాలకు పసుపు రంగు వేయడం, అలాగే పూజా మందిరానికి లేక పూజాగదికి పసుపు రంగు వేయడం ఆనవాయితీగా వస్తున్న ఆచారం.అలాగే పూజలు చేసేటపుడు కూడ దేవుని పీటలను పసుపు రంగుతో అలంకరిస్తే ఆ పసుపు రంగు వల్ల గురువు ప్రసన్నుడు అవుతాడు. గురు ప్రసన్నత వల్ల ఆ గృహస్తునికి పుత్ర సంతానం కలగడం, లేక స్త్రీ సంతానం కలిగినా ఆ స్త్రీ సంతానానికి మంచి విద్యా మరియు సంగీత సాహిత్యాలలోని మెలకువలలో ఆధిక్యం గడించి మంచి ప్రావీణ్యత పొందుతారు. అలాగే ఆ పసుపు రంగు మీద గురువుకి మిత్రుడైన కుజునికి యిష్టమైన ఎరుపు రంగుతో అలంకరిస్తే ఆ ఎరుపురంగు వల్ల కుజుడు సంతుష్టుడు అవుతాడు. ఆ కుజ సంతసం వల్ల భార్యా భర్తల మధ్య అనురాగం

ఆప్యాయత ఏర్పడుతుంది. వారిద్దరి మధ్య సహకార సఖ్యతలుంటాయి. అందువల్లే వివాహ సమయంలో తప్పకుండా పసుపు బట్టలు ధరించడం ఒక ఆచారంగా మారింది. వధువుకు వివాహ సమయంలో పసుపు రంగు గల మధుపర్కంలో ఎరుపు చుక్కలు లేక ఎరుపు అంచుగల చీరనే ధరియింప జేస్తారు. అలా చేయడం వల్ల గురు కుజులు యిద్దరు ప్రసన్నులవుతారు. శుభ సంతానం గురువు వల్లను మరియు సుఖదాంపత్యం కుజుని వల్లను కలుగుతుంది. గురువు మన దిన ప్రమాణంలో సూర్యోదయ కాలం నుంచి సూర్యాస్తమయం వరకు చాల బలోన్నతుడుగా వుంటాడు. అందువల్ల గురుపూజ ఎప్పుడూ సూర్యుడు ప్రకాశిస్తున్న సమయంలో చేయడం చాలా శుభదాయకం. సూర్యోదయానికి ముందుగాని లేక సూర్యా స్తమయం తరువాత గాని గురు పూజ చేస్తే అలా చేసిన వారికి ఆశించినంత శుభఫలితాలు వుండకపోవచ్చు. గురువు స్వయంగా స్వయంగతుడు. గురువు తీపి పదార్థం అంటే యిష్టపడతాడు. ఆయనకు తీపి పదార్థముల మీద మక్కువ ఎక్కువ. అందువల్లే గురువు యొక్క ఆశీర్వాద ఫలితంకోసం గృహిణులు నోములు, వ్రతాలు చేసినపుడు పసుపు రంగు కలిగిన శనగలు దానం చేస్తారు. వచ్చిన స్త్రీలకు ఆహ్వానితులైన పేరంటాళ్ల పాదాలకు పసుపు పూసి అందరికీ కూడ గురువు యొక్క శుభ ఫలితం కలగాలని కోరుకొంటారు. ఇంకొక ముఖ్య విషయం ఏమంటే ఏ శుభకార్యంలో అయినా సరే పసుపు రంగు కలిగిన శనగపప్పు మరియు పసుపు రంగు కల్గిన బెల్లం యీ రెండు కలిపి పూర్ణం చేసి గురువుకు నైవేద్యం పెట్టడం పరిపాటి. ఎందు వల్లనంటే గురువుకు యిష్టమైన పసుపు రంగు ఆయనకిష్టమైన తీపి కలయికతోను పూర్ణం చేస్తారు. ఇలా చేసి ఆయనకు నైవేద్యం పెడతారు. గురువుకు ఆహారంగా పసుపు కలిపిన అన్నాన్ని పులిహోరగా చేసిపెట్టడం కూడ మన ఆచారం. కాని ప్రస్తుత పరిస్థితులలో మన హైందవ మత సంప్రదాయాలకు విరుద్ధంగా తియ్యటి పూర్ణపు బూరెలను తీసేసి కారం నిండిన ఆకుపచ్చ రంగు కలిగిన పచ్చి మిరపకాయ బజ్జీలు చేయడం అలాగే సాత్విక ఆహారమైన పులిహోర బదులుగా నిషిద్ధమైన ఉల్లి వెల్లుల్లి మసాల దినుసులు కలిపి పులావు చేయడం ఒక హేయమైన సంస్కృతి. ఆధునికులమనే భ్రమలో పడి మన ఆహారపు సంప్రదాయాన్ని మరియు హైందవ మత విశ్వాసాన్ని ధ్వంసం చేస్తూ మనకు మనమే అరిష్టాలనుకొని తెచ్చుకొంటున్నాము. ఇలా చేయడం క్షంతవ్యం

కాదు. పాశ్చాత్య పోకడలను గొప్పగా గుర్తించి మన మత విశ్వాసాలను విసర్జిస్తే మనం గొప్పదని భావించే ఆ ఆధునిక పాశ్చాత్య పోకడే మనల్ని ఏదో ఒక రోజున ధ్వంసం చేస్తుందని మనం మరచి పోకూడదు.

ఒక ముఖ్యమైన విషయం ఏమంటే అత్యంత సాత్వికుడు, పరోపకారి పరమబ్రాహ్మ ణోత్తముడుఅయిన గురువుయొక్క పుత్రుడే కుజుడు.అందువల్లనే తన తండ్రి వీక్షణతన మీద వున్నప్పుడు కుజుడుస్తబ్దుడై దుష్ఫలితాలు యివ్వడానికి సాహసించ నేరడనేది నిశ్చల పండితాభి ప్రాయం.

## శుక్రుడు

మన జాతక చక్రంలో శుక్రునికి కూడా రెండు రాశులకు ఆధిపత్యం వుంది. మొదటిది మేష మిథునాల మధ్య ఉన్న వృషభరాశి, రెండవది కన్య, వృశ్చిక రాశుల మధ్య నున్న తులారాశి. ఈ రెండు రాశులకు అధిపతి శుక్రుడే. శుక్రుని ఆధిపత్యంలో వున్న వృషభరాశిలో కృత్తిక రెండు, మూడు నాలుగు పాదాలు, రోహిణి నక్షత్రంలోని ప్రథమ ద్వితీయ పాదాలు ఈ నక్షత్రాలలోని కృత్తిక నక్షత్రానికి అధిపతి రవి. రోహిణి నక్షత్రానికి అధిపతి చంద్రుడు. మృగశిర నక్షత్రానికి అధిపతి చంద్రుడు అని మనం గుర్తు పెట్టుకోవాలి. ఇక తులారాశిలో చిత్త నక్షత్రంలోని మూడు మరియు నాలుగు పాదాలు స్వాతి నక్షత్రంలోని మొత్తం నాలుగు పాదాలు, విశాఖ నక్షత్రం ఒకటి, రెండు మూడు పాదాలు ఉంటాయి. శుక్రాధిపత్యంలో వున్న తులారాశిలోనే ఉంటాయి. తులారాశి పురుషరాశి, వాయుతత్వం గల రాశి వైశ్య కులానికి చెందిన రాశిగా పేర్కొనబడింది. ఈ తులారాశిలో శని ఉచ్ఛంలో ఉంటాడు. ఇది చరరాశి మరియు స్త్రీ గ్రహం. వృషభరాశి స్త్రీ రాశి మనం "శుక్రుడు" అని పురుష నామంలో పిలిచినా శుక్రుడు స్త్రీ గ్రహమని మనం తెలుసుకోవాలి. ఈ రాశి భూతత్వరాశి. బ్రాహ్మణ కులానికి చెందినదిగా పేర్కొనబడింది. ఈ వృషభరాశిలో చంద్రుడు ఉచ్ఛస్థానంలో ఉంటాడు. దీనిని స్థిరరాశిగా వ్యవహరిస్తారు. శుక్రుడు ఏ రాశిలో అయినా 30 రోజులుంటూ అంటే ప్రతి రాశిలోను సుమారుగా ఒక మాసం వుంటూ పన్నెండు రాశులలో ప్రయాణం చేసి ఒక సంవత్సరంలో చక్రభ్రమణం పూర్తి చేస్తాడు.

శుక్రుడు పార్థివ నామ సంవత్సర శ్రావణ శుద్ధ ద్వాదశి జ్యేష్ట నక్షత్రంలో జన్మించాడు. భార్గవస గోత్రానికి చెందినవాడు. భృగుమహర్షి పుత్రుడు. ఇతనికి ఇద్దరు భార్యలు. మొదటి భార్య పేరు ఊర్జవాణి. రెండవ భార్యపేరు సుకీర్తిగా చెప్పబడింది. శుక్రుని శుక్రాచార్యులుగా వ్యవహరిస్తారు. ఎందుకంటే ఆచార్యుడు అంటే గురువు. ఈ శుక్రువు రాక్షసులకు గురువు. కాబట్టి రాక్షస వంశమునకు చెందిన వారందరు శుక్రుని తమ గురువు కాబట్టి శుక్రాచార్యులుగా పిలిచి గౌరవిస్తారు. ఇతడు రజోగుణం కలవాడు. కులరీత్యా బ్రాహ్మణుడు, పరోపకారి. మానవులందరికి కల్యాణ యోగ కారకుడు. శుక్రుని యొక్క ప్రభావం వల్లే వివాహం కాలం నిర్ణయించబడుతుంది. జాతకంలో శుక్రమహాదశ వచ్చినపుడు ఆ మహాదశలో శుక్ర అంతర్దశ వివాహం ఎవరికైనా తప్పకుండా కల్యాణం అవుతుంది. ఎందుకంటే శుక్రుడు కల్యాణ యోగకారకుడు మరియు వివాహయోగములకు మరియు ఆ వివాహములలో జరిగే గౌరిపూజ, అంకురార్పణ, స్నాతకం, యిష్టదేవతాహ్వానం మరియు శోభాన గర్భదానములకు కారత్వం కలవాడు కాబట్టి శుక్రుని యొక్క కరుణా వీక్షణ లేకుండ ఎవరికీ వివాహం కాదు. అని మనం గ్రహించాలి. అంటే ఎవరి జాతక చక్రంలో అయినా సరే శుక్రుడు బలంగా వుండి పాప సంబంధం లేకుండా వున్నప్పుడు ఆ గోచార సమయంలోగాని లేక దశాంతర్దశలలో గాని తప్పక వివాహం అవతుంది. అలా వివాహ కాలం అంటే కల్యాణయోగం కలిగినపుడు అన్య సంబంధములు లేని, పసలేని కోర్కెలతో గాని, దురాశ చేతగాని వివాహానికి సుముఖులు కాకుంటే ఆ వివాహ సమయం వెళ్లిపోతే శుక్రదాక్షిణ్యం వచ్చేవరకు ఎటువంటి పరిస్థితులలో వివాహం కాదని ప్రతివారు యీ ముఖ్య విషయం గమనించాలి. కాబట్టి విజ్ఞులైన వారు జ్యోతిష్య పండితుల సలహా మేరకు కల్యాణ యోగంలో వివాహం చేయుట శోభకృతి మరియు వారికి శోభాయమాన జీవితం వుంటుందని గ్రహించాలి. కాక, బాహ్య సౌందర్యానికి ధన విలువలకు ప్రాముఖ్యత నిచ్చి కల్యాణ యోగం లేని సమయంలో వివాహం చేసుకొన్నా, ఆ వివాహంలో దాంపత్య జీవితంలో అసంతృప్తి సుఖసంతోషాలు లోపించి ఎడారిజీవితం మోడువారిన వృక్షం వలె ఆయుర్దాయ మంతయు గడిపేస్తారు. అలా కాకుండా మంచి కల్యాణ యోగం వున్నప్పుడు మరియు

మంచి గుణ సంపన్నుడు, మేథో సంపత్తి గలవాడు, మతకులాచార సంప్రదాయ సంస్కారాలను గౌరవించే కుటుంబంలో జన్మించిన మరియు ఉత్తమ విద్యను కలిగిన భాగస్వామిని అల్పమైన విలువ లేని లోపములను భూతద్దములో చూసి ఆ వివాహమును వదలి వేయడంలో ఔచిత్యం కానరాదని వధూవరుల తల్లిదండ్రులు గ్రహించాలి. ఉదాహరణకు : ఉత్సవ విగ్రహములు సువర్ణ ఛాయ కలిగి మెలిసి పోతూ వుంటాయి. ఉత్సవాల సమయంలో ఆ విగ్రహాలను సందర్శించిన వారందరు "భళీ" యని మెచ్చుకొన్న ఆ కార్యాలు ఉత్సవదినములు ముగిసినంతనే ఆ విగ్రహము లను నిత్య పూజకు అనర్హత ఆపాదించి చీకటి గదిలో బంధించి వేస్తారు. మరుసటి దినం నుంచి మళ్లీ తిరుపతిలో గాని ఏ క్షేత్రంలో అయినా గాని సువర్ణకాంతులు మెరుపులేని నల్లటి రాతి విగ్రహానికే శోభాయమానంగా నిత్యపూజలు ధూప దీప నైవేద్యాలతో పూజలు సల్పెదరు. అలాగే ఉత్సవ విగ్రహంలాగ బాహ్య సౌందర్యంతో విరాజిల్లుచున్న భాగస్వామిని ఎన్నుకుంటే ఆ దాంపత్య విచారం విరక్తి కలిగి దుః ఖమయమైన జీవితం గడుపుతారు. ఇవి ముమ్మాటికి సత్యం ఎందుకంటే విద్య వల్ల విజ్ఞత, వివేకం, వినయం ఉండాలి గాని, పాశ్చాత్య సంస్కారం, అహంకార గర్వములు, భాషా దారిద్ర్యం వుండరాదు. ప్రతివారికి శుక్ర దశలో కల్యాణయోగం వుంటుంది. ఆ సమయంలో వివాహం చేసుకోవడం చాల ఉత్తమం. శుక్రునికి సూర్యచంద్రులిద్దరు శత్రువులే. బుధుడు. శని మాత్రం మిత్రులు శుక్రుడు ఎప్పుడు సూర్యునికి ద్విద్వాదశ రాశులలోనే వుంటాడు. కాని ఏకరాశిలో సూర్య సంయోగం కలిగినపుడు శుక్రుడు బలహీనపడి అస్తంగతుడు అవుతాడు. కాని నిశీధ సమయంలో సూర్యాస్తమైన తరువాత ఒక లగ్నం దాటిన తరువాతే బలం పుంజుకుంటాడు. ఒక గొప్ప విషయం ఏమంటే శుక్రుడు మాత్రమే మృత సంజీవని అనే అమోఘమైన మరియు అసామాన్యమైన దైవాంశ సంభూత బలం కలిగిన అమోఘమైన మంత్రములను నేర్చినవాడు. సూర్యోదయసమయంలో బలోపేతుడుగా వుండనేరడు. అంటే రాత్రిపూట శుక్రప్రభావం ఎక్కువ వుంటుంది. కాబట్టి ఏ దంపతులు అయినా ఆ నిశీధ సమయంలో అనురాగంతో ఉంటారు. అందువల్లే వారిలో సంభోగ వాంఛ కలిగి సృష్టి క్రమాన్ని ఆగకుండ యుగయుగాలుగా మానవాళి మనుగడకు దోహదం చేస్తారు. అందువల్లే సూర్య ప్రకాశ సమయంలో భార్య భర్తల మధ్య ప్రేమాభిమానాలు వుంటాయే గాని కామ

రక్తి లేక జడత్వం ఆవహిస్తుంది. అందువల్లే వారిద్దరు శారీరక సుఖానికి పగలు యిష్టపడరని మనం గ్రహించాలి. ఎందుకంటే సూర్య ప్రవేశ సమయంలో శుక్రబలం వుండదు కాబట్టి వారిద్దరి మధ్య శరీర వాంఛ కలుగదు. ఒకవేళ ఏ దంపతులైన పగటి పూట కామవాంఛతో సంభోగం చేస్తే, ఆ సమయంలో స్కలితమైన పురుషుని వీర్యం వల్ల ఆ స్త్రీ గర్భం దాలిస్తే ఆ సంతానం క్రూర ప్రవృత్తితోను అహంకార దౌర్జన్యతతోను జీవిస్తారు. అందువల్లే చాల తక్కువమంది మాత్రమే జంతువధ చేసే వృత్తిని ఎంచుకుంటారు. అలాగే సూర్య ప్రభావం జడత్వం కలిగిన మెదడుతో తలారులుగా జీవిస్తారు. శుక్రగ్రహం పుణ్య గ్రహం కాబట్టి సాత్విక గుణం గల బ్రాహ్మణోత్తముడు కాబట్టి ఎప్పుడూ శుభఫలితాలే యిస్తాడు. ఆయన యిచ్చే శుభఫలితాలలో ప్రతిభావంతమైనది, శోభాయమానమైనది కల్యాణ కారకత్వమే. శుక్రుడు నిష్ట నియమాలు కలవాడు, సౌమ్యుడు మరియు ధర్మమూర్తి. సృష్టికార కత్వమును కల్గిన మూల పురుషుడు కాబట్టి సృష్టి చేసే బ్రహ్మదేవునికి అత్యంత ప్రీతిపాత్రుడు మరియు స్నేహితుడు. వయస్సు ఏడు సంవత్సరాలు. తెల్లని వజ్రమంటే ఎక్కువ ప్రీతి. శుక్రుడు కనుక జాతకంలో హీనపడి వుంటే ఆ జాతకునికి సంతోషకరమైన దాంపత్య జీవితం వుండదు. ఒకవేళ శుక్రుడు బలహీనపడి కుజుడు ఎక్కువ బలంగా వుంటే ఆ జాతకుని దాంపత్య జీవితం విషాదం అవుతుంది. కుజ శుక్రుల జాతకంలో ఏ రాశిలో వున్నా సరే ఆ కలయిక చాల ఉధృత దుష్ఫలితాలు యిస్తాయని మనం గ్రహించాలి. ఎందుకంటే శుక్రుడు దాంపత్య కారకుడు. కుజుడు దాంపత్య విచ్ఛిన్న కారకుడు. వీరిద్దరి కలయిక వున్న జాతకులకు దాంపత్యజీవితం దుఃఖమయమవు తుంది. తీవ్రమైన దుష్ఫలితాలు వస్తాయి. విభేదాలు, విద్వేషాలు, విరోధాలు వారి జీవనంలో చోటు చేసుకొంటాయి. అహంకార ప్రతీకార వాంఛలతో రగిలి పోతారు. ఆ పైన దాంపత్యం విచ్ఛిన్నం చేసుకొంటారు. కుజ, శుక్ర గ్రహాల బలాన్ని బట్టి వారిలో ఒకరు తన భాగస్వామిని హత్య కూడ చేయవచ్చు. అందువల్ల శుక్రుడు బలహీనపడిన జాతకాన్ని సరిగా విశ్లేషించి పొంతన కుదిరిందో లేదో నిర్ణయించాలి. ఈ విషయంలో ఏ అలక్ష్యం పనికిరాదు. ఎందుకంటే ఇద్దరికి శుక్రబలం లేకుండా వివాహం చేస్తే ఆ దాంపత్యం సరిగా వుండక అనేక తీవ్ర మానసిక ఒత్తిళ్లకు లోనై

జీవితంలోని మాధుర్యాన్ని ఆస్వాదించలేక అన్ని విధాల భంగపడి తమ జీవితము దుఃఖమయం చేసుకొంటారు. ఇది ముమ్మాటికి సత్యంకాబట్టి మేలాపకాన్ని తేలికగా చూడొద్దని మరియు ఈ విషయంలోరాజీపడకూడదనిమనవి చేస్తున్నాను.

## శని

ఎవరైనా సరే శని పేరు చెప్పగానే భయపడతారు. ఎందుకంటే శని చక్రభ్రమణంలో అన్ని దశలు వచ్చినట్లే శని దశ కూడ వస్తుంది. ఆ దశ ఎవరైనా సరే అనుభవింపక తప్పదు. ఒకవేళ మనకి యిష్టం వచ్చినపుడు కావలసిన గ్రహస్థితి కల్పించుకొని ఆ గ్రహస్థితిలో మనకు కావలసిన మహాదశ అంతర్దశ ఏర్పరచుకొనే సౌకర్యం వుంటే కనుక ఎవరు శని మహర్దశ కోరుకోరు. శని యిచ్చే ఫలితాలు చాల దారుణంగాను మరియు అత్యంత దుఃఖమయంగాను వుంటాయి. ఎవరి జీవితంలో నైనా ఆహ్వానం లేకుండగానే శని మహర్దశ మరియు శని యొక్క ఏలినాటి శని దశ వస్తాయి. అంటే మన యిష్టాయిష్టాలతో పనిలేకుండా మన జీవిత స్రవంతిలో ప్రవేశించి తన దుష్పరిణామాలు యిస్తాడు. అందుకనే మనకుయిష్టం లేని వారు మనకు తారసపడినపుడు మనకు ఏదైనా దుష్ఫలితం కలిగితే అలా తారసపడిన వ్యక్తిని శనిలా దాపురించాడని మనం నిందిస్తాం. అంటే శని వల్ల దుష్ఫలితాలు కలగటం సహజమే అయినా ఆ శని ఎల్లప్పుడు దుష్ఫలితాలే యిస్తాడనేది నిజం కాదు. ఎందుకంటే శని ప్రభావం వల్ల మనకెంతో శుభం కూడ జరుగుతుంది. మన జీవన ప్రయాణంలో శని ప్రభావం వల్ల ఉచ్ఛ స్థితికి చేరడం, సభా పూజ్యత కలిగి సభాగౌరవం పొందడం, మంచి ధన ఆదాయం కల్గడం, ఎన్నడూ అనుకోని శుభములు కలుగుతాయి. కాబట్టి మనం శనిని నింద చేయడం సమంజసం కాదు. ఆయన్ను దుష్పరిణామాలకు, దారిద్ర్యానికి, ధన నష్టానికి, సంపాదించిన పేరు ప్రతిష్టలు నశించిపోవడానికి మాత్రమే కారకుడు అని అనుకోకూడదు. ఎందుకంటే ఈ పైన చెప్పిన వాటికి వ్యతిరేకంగా ఒక్కొక్కప్పుడు అన్ని శుభఫలితాలు యిస్తాడు.

ఈయన ప్రమోద నామ సంవత్సరం పుష్యమాసం బహుళ అష్టమి శనివారం స్వాతి నక్షత్రంలో జన్మించాడు. భార్యపేరు జ్యేష్టాదేవి. కాశ్యపశ గోత్రం. నల్లటి దేహ ఛాయ గలవాడు. ఇతని వాహనం కాకి. జాతకచక్రంలో శని మకర, కుంభరాశు

లకు అధిపతి. శని ఆధిపత్యంలోని విశేషం ఏమంటే తనకున్న ఆధిపత్యంలోని రెండు రాశులు ఒక దాని ప్రక్కన ఒకటి వుంటాయి. మిగిలిన ఏ గ్రహమునకు యిలాంటి మహా పదవి లేదు. మకర రాశిలో ఉత్తరాషాఢ రెండు, మూడు, నాలుగు పాదాలు, శ్రవణం నక్షత్రంలో మొత్తం నాలుగు, పాదాలు మరియు ధనిష్ఠ నక్షత్రంలో మొదటి రెండు పాదాలు వుంటాయి. మీరు గమనించవలసిన ముఖ్య విషయం ఏమంటే శనికి రెండు రాశుల ఆధిపత్యంలోను మకర రాశి స్త్రీ రాశి మరియు కుంభరాశి పురుషరాశియైన తాను మాత్రం నపుంసకుడేయని గ్రహించాలి. శని మకర రాశి ప్రారంభంలోను, కుంభరాశి అంత్యంలోను ఎక్కువ బలంగా వుంటాడు. అంటే తన దశ అంత ఆ జాతకుని బాధిస్తూ ఉంటాడని మనం తెలుసుకోవాలి. మకర రాశి దక్షిణ దిక్కుని, కుంభరాశి పడమటి దిక్కును సూచిస్తాయి. మకర రాశి నలుపు వర్ణం మరియు కుంభరాశి పసుపు వర్ణంగా వుంటాయి. శనిని పాపగ్రహంగా జ్యోతిష్యులు విశ్లేషించినా అంత్య దశలో అందరికి దుష్ఫలితాలే, కాక కొందరికి శుభ ఫలితాలు కూడా యిస్తాడు. తన మీద శుభ వీక్షణం వున్నా లేక తాను శుభగ్రహంతో కలిసి వున్నా తన వల్ల కోల్పోయిన పూర్వ ప్రభావాన్ని కొంత మాత్రమే యిస్తాడు. అలా కాకుండా పాపగ్రహవీక్షణ ఉన్నా లేక పాపగ్రహ కలియిక వున్నా తాను చేసిన హానిని పునరుద్ధరించక అలాగే వెళ్లిపోతాడు. తండ్రిపేరు రవి. తల్లి పేరు ఛాయ దేవి. మానసికంగా క్రూర మనస్తత్వం కలవాడు. దయా దాక్షిణ్యాలు లేకుండా ప్రతి ఒక్కరిని యథాశక్తి బాధిస్తాడు. నల్లని దేహచ్ఛాయతో వుంటాడు. కులరీత్యా శూద్రుడు. మిక్కిలి తమో గుణం కలవాడు. ఎవరికి సహాయం చేయడానికి మనస్సు ఒప్పుకోక పోగా హాని చెయ్యడానికి మాత్రం అత్యంత ఉత్సాహం చూపి తన యొక్క తీక్షణమైన ప్రవర్తనతో ఆ జాతకుడి జీవన స్రవంతి మీదే దయారహితంగా దెబ్బకొడతాడు. ఇతనికి లోహాలలో ఇనుప ఖనిజం ఎక్కువ మక్కువగా ఉంటాడు. అందుకని శని యొక్క రథ చక్రాలు మరియు ఆయన కూర్చునే రథపీఠం మొదలైనవి యినుముతోనే చేసి ఉంటాయి. ఒక ముఖ్యమైన విషయం ఏమంటే ఏ జాతకుడికైనా తన చక్రంలో తులాలగ్నం అయి వుండి అంటే శని లగ్నంలో ఉచ్ఛలో వుండి కర్కాటకమై వుండి ఆ లగ్నరాశులలో వేరే ఏ గ్రహాలు లేకుండావుంటే ఆ జాతకునికి ఉన్నతమైన అధికారం శాస్త్ర పరిజ్ఞానం వుంటుంది. ఆయన అధికారంలోదర్పం,

హోదా ఉంటుంది. ఎవరూ కూడ ఆయనకు ఎదురు మాట్లాడి నిలువలేరు. పండిత సభలలోను మరియ పండిత గోష్టిలోను చక్కటి పాండిత్య పాటవాన్ని ప్రదర్శించి సభాపూజ్యుడు అవుతాడు. అనంతమైన పేరు ప్రఖ్యాతులు ధనదాన్యాలు సంపాదిస్తాడు.

మానవజాతిలోని జీవన స్రవంతి యొక్క జాతక రహస్యాలు శని గ్రహంలోనే నిక్షిప్తమై వుంటాయి. అందువల్లనే మనకి కలిగే కష్టనష్టాలకు శనే కారణభూతుడని భావిస్తాం. శనీశ్వరుడు తనకు తానుగా ఎవ్వరికి బాధ కాని ఖేదం కాని కలిగించడు. కాని బ్రహ్మ లిఖితానుసారం తన ధర్మాన్ని మాత్రం విస్మరింపక యథాతథంగా తన బాధ్యతలను నెరవేరు స్తాడు. శని తానున్న స్థానం నుంచి తృతీయ, సప్తమ, దశమ స్థానాలను వీక్షిస్తాడు. ఇతనికి నలుపురంగు యిష్టం. నల్ల నువ్వులు, నల్లబట్టలు, నలుపు వర్ణమైన బొగ్గు, నల్ల మినుములు శని ప్రీత్యర్థం శనిగ్రహ పూజల్లో వాడుతాం. ఆ పూజానంతరం ఆయన సంతృప్తి కొఱకు ఈ పైన చెప్పిన వస్తువులు దానం చేస్తాం. శని దేహ ఛాయ సహజ నీలిరంగుకు సరి పడే నీలిరంగు రత్నాలు ధరిస్తే శనికి ఆహ్లాదకరంగా వుంటుంది. ఈ నీలి రంగు రత్నాలుపొదిగిన ఆభరణాలు లేక నల్ల వస్త్రాలు ధరించిన లేక నలుపు వర్ణమైన వస్తువులు దానం చేసిన శని సంతృప్తుడు అవుతాడని మన భావమే కాని శని ఎప్పుడు ఇలాంటి చిన్న చిన్న ప్రక్రియలకు లొంగే స్వభావం కలవాడు కాదు. అంటే శనికి ప్రీతికరమైన ఏ వస్తువులనైనా దానం చేసినా లేక ధరించినా మరియు త్యజించిన శని హాని తగ్గి మనం సంతోషం పొందుతామనేది ఒక ఆశ భావమే. ఎందుకంటే ఎవరూ కూడ దానిలోని నిజానిజాలు ఖచ్చితంగా ధృవీకరించలేక పోతున్నారు. ఎందుకంటే శని తన ప్రభావంతో సాక్షాత్ త్రిమూర్తులను కూడ ఆయన దశ వచ్చినపుడు వేధించి బాధించే అత్యంత శక్తి కలవాడు. కాబట్టి ఎవరైనా స్వయంగా శని ప్రార్థన చేసుకోవడం వల్ల మానసిక స్థైర్యం కలగటమే తప్ప శని ప్రభావం ఎన్నటికి తగ్గదు. శని ఎప్పుడూ ధనం మీద, పరువు ప్రతిష్ట మీద దయాహీనంగా దెబ్బకొడతాడు. క్షమాగుణం లేనివాడు కాబట్టి అత్యంత గ్రహాధికారకతతో బలోపేతుడు కాబట్టి ఆయన మంత తంత్ర రుద్ర దాన పూజలకు లొంగనివాడు. శనికి వగరు అంటే ఇష్టం. వగరు ప్రభావం వల్ల పచ్చి దొండకాయలు, అరటిపూవు,పచ్చిఅరటికాయ, పొగడపండు మరియు,దూటచేసిన

వంటకాలు ఇతనికి ఇష్టం. ఈ రాశి మకరరాశి భూతత్త్వరాశి మరియు శూద్రరాశిగా చెప్పబడింది. చరరాశి. ఈ మకర రాశిలో కుజుడు ఉచ్ఛంలో వుంటాడు. గురువు దుర్బలుడై బలహీనపడి పోతాడు. ఈ గ్రహం నపుంసక గ్రహం. శని ఏ రాశిలోనైనా రెండున్నర సంవత్సరాలుంటూ పన్నెండు రాశులలోను చక్రభ్రమణం పూర్తి చేస్తాడు.

కుంభరాశిలో ధనిష్టా నక్షత్రంలో మూడు నాలుగు పాదాలు, శతభిష నక్షత్రంలో అన్ని పాదాలు, పూర్వాభాద్ర నక్షత్రంలో మొదటి మూడుపాదాలు వుంటాయి. ఇది వాయు, తత్వరాశి. వైశ్యకుల రాశి. ఇది స్థిర రాశిగా నిర్ణయించ బడింది. శని తులారాశిలో ఉచ్ఛంలో వుంటాడు. కాని మేషరాశిలో అచేతనుడై బలహీనుడవుతాడు. ఎందుకంటే గ్రహాలన్నింటికి అధిపతియైన సూర్య భగవానుడు ఉచ్ఛస్థితిలో వుంటాడు. అంటే మేషరాశిలో వున్న రవి ఎక్కువ తేజస్సుతోమరియు అత్యంత ఉష్ణంతోను ప్రజ్వరిల్లుతూ తేజోమయంగాను మరియు సువర్ణ కిరణాలు ప్రసరిస్తూ తేజస్సుతో కాంతులీనుతు విరాజిల్లుతాడు. అందువల్ల శని రవి పుత్రుడు అయినా సరే ఆయన ముందు నిలువలేక తన బలం కోల్పోయి వుంటాడని మనం గ్రహించాలి. శనికి కర్కాటకం, సింహం, మేషం, వృశ్చికరాశులు శత్రురాశులుగా జ్యోతిష్య శాస్త్రంలో చెప్పబడింది.

## ఏలినాటి శని

మనం ఇంతవరకు శని గురించి విపులంగా తెలుసుకున్నాము. ఇప్పుడు మనం ఏలినాటి శని అంటే ఏమిటో, ఆ ఏలినాటి దశలో శని ఫలితాలు ఎలా వుంటాయో వివరంగా తెలుసుకొందాం. ఏలినాటి శని అనే మాట చాలమంది వాడుతూ వున్నా దాని ప్రభావం గురించి గాని ఏలినాటి శని తనకు ఎప్పుడు ప్రారంభం అవుతుందో చాలమందికి తెలియదు. శని ప్రభావం వేరు. ఏలినాటి శని ప్రభావం వేరు అని మనం తెలుసుకోవాలి. చాలమంది గోచార శని మరియు అర్ధాష్టమ శని అని కూడ వాడుతూ వుంటారు. కాని ఏ శని ప్రభావ మర్మం ఏమిటో చాలమందికి తెలియదు. శని ఎప్పుడూ దుష్ఫలితాలను యిస్తాడనుకోవడం వారి అమాయకత్వమే కాని మరొకటి కాదు. ఎందువల్లనంటే శని మేలు కూడ చేసి మంచి ఉచ్ఛస్థితికి కారణభూతుడు అవుతాడు. మనం యిప్పుడు ఏలినాటి శని అంటే

ఏమిటో, జాతక చక్రంలో ఏలినాటి శని వివరణ ఎలా విశ్లేషించుకోవాలో మరియు ఆ శని హాని ఎలా వుంటుందో మరియు ఏలినాటి శని ఎప్పుడు అంతమవుతుందో వివరంగా తెలుసు కొందాం. అదే కాకుండ ఏలినాటి శని మరియు అర్ధాష్టమ శని వాటి దశలు మరియు శని ప్రారంభదశలో మధ్యమ దశలో, మరియు అంత్య దశలో శని యిచ్చే ఫలితాలు నేర్చుకుందాం.

ఏ జాతకుడికైనా జన్మ రాశిలో గాని అక్కడ నుండి ద్వితీయ స్థానంలో గాని లేక ఆ జన్మ రాశికి ద్వాదశంలో శని వుంటే ఆ సమయాన్ని ఏలినాటి శని అంటారు. అంటే జాతక చక్రంలో జన్మరాశికి అంటే చంద్రుడున్న స్థానానికి ముందురాశిలో శని కనుక ప్రవేశిస్తే అలా ప్రవేశించిన సమయం నుంచి ఆ జాతకునకు ఏలినాటి శని ప్రారంభమైనది అనిమనం తెలుసుకోవాలి. ఈ చక్రం చూడండి.

చంద్రుడున్నది కర్కాటకరాశి శని మిధునంలో ప్రవేశించినప్పటినుంచి ఏలినాటి శని ఆరంభమయిందని గ్రహించాలి. మిధునరాశిలో రెండున్నర సంవత్సరాలు, పూర్తి అయిన తర్వాత కర్కాటకంలో ప్రవేశించి రెండున్నర సంవత్సరాలు అక్కడ పూర్తి చేసుకుని ఆఖరి దశగా సింహరాశిలో ప్రవేశిస్తాడు. ఇలా ఏడున్నర సంవత్సరాలు శని పీడ అనుభవించాలి. అలా ప్రారంభమైన సమయం నుంచి ఆ రాశిలో రెండున్నర సంవత్సరాలు వుంటాడు. ఆ తరువాత ముందు రాశి నుంచితరువాత రాశియైనజన్మ రాశిలో అంటే చంద్రుడు వున్న స్థానం యొక్క రాశిలోనికి ప్రవేశిస్తాడు.ఆ రాశిలో కూడ రెండున్నర సంవత్సరాలు వుంటాడు. అక్కడ నుంచి తరువాత స్థానమునకు అంటే చంద్రుడు వున్న స్థానంలో నుండి ద్వితీయ స్థానంలోకి ప్రవేశిస్తాడు. అక్కడ కూడ రెండున్నర సంవత్సరాలు వుంటాడు. అంటే ఏ జాతకుడికైనా సరే జన్మ రాశి నుంచి ద్విద్వాదశ స్థానాలలో ఐదు సంవత్సరాలు వుంటాడు. అలాగే రెండున్నర సంవత్సరాలు వుంటాడు. అంటే ఆ జాతకుడు ఏలినాటి శని ఒక్కొక్క రాశిలో రెండున్నర సంవత్సరాల చొప్పున మొత్తం మూడు రాశులు కలిపి ఏడున్నర సంవత్స రాలు వుంటాడు. ఉదాహరణకు మీన రాశిలో చంద్రుడు వున్నపుడు ఆ జాతకుడు మీనరాశిలో వున్న నక్షత్రంలో జన్మించినను అదే జన్మ రాశి అవుతుంది. అంటే శని కుంభరాశిలో ఏ దినమైతే ప్రవేశిస్తాడో ఆ దినము నుంచే ఆ జాతకునికి ఏలినాటి శని ప్రారంభ

మైనదని తెలుసుకోవాలి. అలాగే కుంభ రాశి నుంచి రెండున్నర సంవత్సరాలు తరువాత మీన రాశిలోకి ప్రవేశిస్తాడు. అక్కడ రెండున్నర సంవత్సరాలు గడిపి తదుపరి మేషరాశిలోకి ప్రవేశిస్తాడు. ఇలా శని ఏ జాతకుడికైన తన జన్మరాశికి ద్విద్వాదశ స్థానాల్లో తన రాశి స్థానంలోను శని వున్నపుడు ఆ శనియున్న కాలమంతా ఏలినాటి శని అని అర్థం చేసుకోవాలి. ఇప్పుడు మనం ఎవరికైనా ఏలినాటి శని ఎలా ప్రారంభం అవుతుందో ఒక్కొక్క రాశిలో ఎంత కాలం వుంటాడో మరియు ఏలినాటి శని ఎప్పుడు పరిసమాప్తమవుతుందో తెలుసుకొన్నాం. ఇప్పుడు శని మనకు మూడు దశలలో ఒక్కొక్క రాశిలో రెండున్నర సంవత్సరాలు వుంటూ మొత్తం మూడు దశలలోను ఏడున్నర సంవత్సరాలు బాధిస్తాడు. అంటే ఏలినాటి శని ప్రారంభమైన నాటి నుంచి ఆ జాతకుడికి దుష్ఫరిణామాలు కలుగుతూనే ఉంటాయి మరియు హఠాత్తుగా తన స్థితి ఒక్కమారుగా తారుమారై అనుకోని దుస్సంఘటనలు ఎదురై భేదపడతాడు. మనం ఇప్పుడు శని ముందు రాశిలో ప్రవేశించినపుడు ఏ ఫలితాలు యిస్తాడో తెలుసుకొందాం. శని ఏ రోజున తన జన్మరాశియైన ద్వాదశ రాశిలో ప్రవేశిస్తాడో ఆ దినం నుంచి ఏలినాటి దశ ప్రారంభం. ఆ దినం నుంచే శని బాధిస్తాడు. శని ప్రవేశించగానే అన్ని కష్టాలు నష్టాలు దుస్సంఘటనలు ఒకటి మీద ఒకటి పడుతూ వుంటాయి. ఆ జాతకుడికి వృత్తి వుద్యోగాలలో చిక్కులు ప్రారంభమవుతాయి. ఉద్యోగంలో అయితే అధికారులతో భేదాభిప్రాయాలు కలిగి అవమానాలు పొందుతారు. వ్యాపారమైతే వ్యాపారం కుంటుపడి నష్టాల పాలవుతాడు. వృత్తిగాని ఉద్యోగం కాని వ్యాపారంగాని ఏమి చేస్తున్న సరే దానిలో వచ్చే ఆదాయం తగ్గి ఆర్థిక యిబ్బందులకు లోనవుతాడు. ఉద్యోగులకు స్థానభ్రంశం కలగడం, కేసులలో యిరుక్కోవడం, శిక్షలు పడటం జరుగుతాయి. ఉచ్ఛస్థితిలో వున్న వ్యాపారస్తులకు కూడ మెల్ల మెల్లగా వ్యాపారంలో లావాదేవీ తగ్గటం కాని లేక అమ్మకాలు సరిగా లేకపోవడం, ఇచ్చిన అప్పులు వసూలు కాకపోవడం, స్థిరాస్తులు లేక స్వగృహం లేక వ్యాపార స్థలం అగ్నికి ఆహుతి కావడం లేదా తుఫాను వరదల వల్ల నష్టం కలిగి దుఃఖిస్తారు. చోరుల పాలైన సొమ్ము రాబట్టుకోలేరు. ప్రతి పనికి బంధు అడ్డంకులు కలుగుతాయి మరియు బంధుమిత్రులతో విభేదాలు విద్వేషాలు తెచ్చుకొని వారికి దూరమవుతాయి. ఈ ఫలితాలు శని ద్వాదశ స్థానంలో వున్నపుడు కలుగుతాయి. ఇక శని ద్వాదశ

స్థానం నుంచి జన్మరాశిలో ప్రవేశించినపుడు ఆ జాతకునికి శని తన సంచారంలో ప్రథమ దశ అయిన రెండున్నర సంవత్సరాలు పూర్తి చేసుకొని తన ద్వితీయ దశలోకి ప్రవేశించాడని మనం అర్థం చేసుకోవాలి. ఈ సమయంలో అనేక ఇక్కట్లు అనారోగ్యం బాధలు మొదలవుతాయి. శారీరక రుగ్మతలు కలుగుతాయి. కొన్నిసార్లు ప్రమాదాలు జరిగి తీవ్రంగా గాయపడతారు. మానసిక ఒత్తిడి మరియు ఆందోళన ఎక్కువై కుటుంబంలో కష్టాలు, కలహాలు ఎక్కువౌతాయి. ఈ దశలో ఆ జాతకులకు కోపోద్రి కాలు మరియు ఆగ్రహావేశాలు ఎక్కువై దాంపత్య జీవితంలో సుఖం కోల్పోయి భార్యభర్తల మధ్య అనురాగం ప్రేమ నశించి శత్రుత్వంతోను జడత్వంతోను జీవనాన్ని సాగిస్తారు. కాని శని యొక్క ప్రభావం వల్ల దాంపత్య విచ్ఛిన్నం ఎప్పుడూ కాదు. భార్య భర్తల మధ్య అవగాహన తగ్గి ఒకరి మీద ఒకరు కినుక వహించినా విడిపోవడం మాత్రం జరగదు. ఎందుకంటే ఎప్పుడూ పేరు ప్రతిష్టల మీద ధన ఆదాయం మీద తీవ్రమైన దెబ్బకొడతాడు కాని తాను మాత్రం దాంపత్య విచ్ఛిన్నానికి కారణభూతుడు కాడు గ్రహాధికారములలో దాంపత్య విచ్ఛిన్న కారకత్వ అధికారం ఒక్క కుజునికే వున్నదని మనం గ్రహించాలి. అందువల్ల ఏలినాటి శనిలో ఎప్పుడు భార్య భర్తలు ఇక్కట్లు అనుభవిస్తారే తప్ప వారు యిద్దరు విడిపోరు. ఈ సమయంలోనే జన్మరాశిలో శని వున్నపుడు తాను సంపాదించిన పేరు ప్రతిష్టలు నశించి చెడ్డవారుగా సమాజంలో పేరుబడి తీవ్రమైన అవమానాలకు మరియు పరాభవాలకు లోనవుతారు. హృదయం, ఊపిరితిత్తులు, కాలేయం యీ అంగములకు సంబంధించిన వ్యాధులకు లోనై శారీరకంగా బాధ అనుభవిస్తారు.

ఇలా శని జన్మరాశి సంచారం పూర్తి చేసుకొని అతని జన్మరాశి నుంచి ద్వితీయ స్థానంలో ప్రవేశించినపుడు యీ దశను శనియొక్క ఆఖరి దశగా భావించాలి. ఈ దశలో జాతకునికి అనేక ఆశలు శని కల్పిస్తాడు. అందువల్ల ధన సంపాదనకు దగ్గర మార్గాలు అవలంబించి వున్నది కూడ పోగొట్టుకుంటాడు. ఈ దశలోనే ఏ జాతకుడికైనా జూదక్రీడలకు మరియు అధర్మమైన అక్రమ సంపాదనకు మార్గం చూపే దుష్టసాంగత్య సహవాసానికి లోనవుతాడు. శని ఆశలు కల్పించి భ్రమలో ముంచి నిరాశలకులోను చేస్తాడు. శిరస్సు, శిరస్సులోని అంగాలకు కలిగే వ్యాధులను

ప్రకోపింప చేస్తాడు. ఒక్కొక్కపుడు లగ్న గ్రహస్థితి మరియు లగ్నాధిపతులు వారి స్థానవీక్షణ వల్ల సంయోగం వల్ల మరణానికి కూడ గురి కావచ్చు. ఏ జాతకుడు ఎప్పుడు మరణిస్తాడో ఏ దశలో ఏ అంతర్దశ వచ్చినపుడు మారకత్వం కలుగుతుందో నేను వ్రాసిన "జాతక మోక్షప్రదాయిని" చదవండి.

ఏలినాటి శని మానవులందరికి మత కుల ప్రమేయం లేకుండా ప్రతి ముప్పై సంవత్సరాలకు వస్తుంది. అలాగ వచ్చిన ప్రతిసారి ఏడున్నర సంవత్సరాలు వుంటాడు. అలా వచ్చిన ప్రతి శని దశలోను బాధిస్తాడు. ఆధునికత భావాలతో గాని అహంకారంతో గాని గ్రహాలు వారిచ్చే ఫలితాలు నమ్మకపోయినా శని మాత్రం వారి నమ్మకాన్ని లేక అపనమ్మకాన్ని పరిగణనలోనికి తీసుకోకుండా నమ్మని వారిని కూడ బాధిస్తాడు. ఇది ముమ్మాటికి సత్యం మరియు శాస్త్ర ఉవాచ.

మొదటిసారిగా వచ్చిన ఏలినాటి శనిని మంగు శని అంటారు. మంగు అంటే మంగళుడు అని అర్థం. అనగా మంగళుడు అన్న మరో నామం కలిగిన కుజుడు దంపతులను ఏలా బాధిస్తాడో శని కూడ అలాగే దయాహీనంగా బాధిస్తాడు. అందువల్లే మంగు శని అంటారు. ముప్పై సంవత్సరాలు తరువాత రెండవసారి వచ్చిన శని దశ ప్రారంభించినపుడు అతని జీవన సరళి మారి ధన ధాన్య కనక వస్తు వాహనాదులు ధన స్థిరాస్థులు సంపాదించి భోగభాగ్యాల లోతుల తూగుతాడు. కష్టనష్టాలు అన్ని దూదిపింజల లాగ ఎగిరిపోతాయి. కోల్పోయిన పూర్వపు వైభవాన్ని తిరిగి పొంగుతాడు. దూరమైన బంధుమిత్రుల విద్వేషాలు మరచి స్నేహభావంతో దగ్గర అవుతారు. సంతానం వల్ల సౌఖ్యం పొందుతారు. ఉద్యోగంలో వున్నత పదవిని అధిరోహిస్తారు. వ్యాపారంలో అయితే పట్టిందల్లా బంగారమై ధనం విపరీతంగా సంపాదిస్తారు. ఇలా జీవితంలో అన్ని విధాల పాలు పొంగినట్లు శని జీవితాన్ని పొంగిస్తాడు. అందుకనే ఈ సమయాన్ని పొంగు శని అంటారు.

శని మూడవసారి ఆ జీవితంలో ప్రవేశించినపుడు ఈ శనిని మృత్యు శని అంటారు. కొంతమందికి మూడవ ఏలినాటి శని దశ రాకపోవచ్చు. ఎందుకంటే కొంతమందికి వారి జీవిత స్రవంతిలో రెండవ సారి వచ్చినప్పుడే మరణించడానికి అవకాశం వుంటుంది. ఇంకొక విషయం ఏమంటే ఏ జాతకునికైనా జన్మరాశి నుంచి చతుర్థ, అష్టమ, దశమ రాశి స్థానాలలో శని ప్రవేశించినపుడు ఆ రాశిలోవున్న

శనిసమయాన్ని అర్ధాష్టమమరియు దశమ శని అంటారు. ఈ సమయం కూడ దోషభూయిష్టంగా వుండి ఆ జాతకులు అనేక విధాల కష్టనష్టాలకు లోనై శని చేత బాధింపబడతారు. ముఖ్యంగా అనారోగ్యం, ఇంటిలోని పెద్దల మరణం,ఆర్థిక పరమైన చిక్కులు వచ్చి శోకప్రాప్తి కలుగవచ్చు.అర్ధాష్టమ శనిగురించి మనం ఇపుడు తెలుసు కొన్నాం. శని గోచార రీత్యా జన్మరాశి నుంచి చతుర్ధరాశిలో ప్రవేశించినపుడు ఆ చతుర్ధ రాశిలో రెండున్నర సంవత్సరాలు సంచారం చేస్తాడు. ఆ శని యొక్క సంచార సమయంలో ఆ జాతకునికి అనేక చిక్కులు చికాకులు పడి మానసిక ఒత్తిడికి లోను అవుతాడు. కుటుంబ సభ్యుల సహకారం పొందలేడు. ఏ పనిని సాధించ లేకపోవడం మరియు అన్ని పనులందు నష్టం వాటిల్లడంలాంటివి జరుగుతాయి. అర్ధాష్టమ సమయంలో అభివృద్ధి అసలు వుండదు.

ఇప్పుడు అష్టమ శని గురించి తెలుసుకొందాము. గోచారరీత్యా జాతకునికి జన్మరాశి నుంచి అష్టమ రాశిలో శని ప్రవేశించినపుడు అష్టమ శని అంటాం. ఈ సమయంలో తలచిన కార్యం కలిసి రాకపోవడం తన కృషికి తగిన ఫలితం దక్కకపోవడం లేక తాను చేసే కృషికి ఆటంకం కలుగడం లాంటివి జరుగుతాయి.ఆస్తులు, భూములు మొదలగునవి అమ్మడం వల్ల ఆ స్థిరాస్తులు నష్టం పోవడమే కాక ఆ అమ్మగా వచ్చిన ధనం హారతి కర్పూరంలాగ ఆశ్చర్య రీతిలో హరించుకు పోతుంది. తీవ్ర అనారోగ్యం కలగడమే కాకుండ కొందరికి మరణ ప్రాప్తి కలుగుతుంది. అందుకనే అర్ధాష్టమ పని కంటే అష్టమ శని అంటే దుష్ఫలితాలు చాల తీవ్రంగా ఉంటాయని మనం అర్ధం చేసుకోవాలి. గోచారరీత్యా శని తృతీయ, పంచమ, సప్తమ, నవమ, ఏకదశా స్థానాల్లో వున్నప్పుడు బాధించక ఆయన వల్ల ఎటువంటి హాని జరగక మంచి సుఖప్రదమైన జీవితమే గడుపుతాం. శని బాధనుంచి ఉపశమనం పొందాలంటే ప్రతిరోజు సూర్యాస్తమయమైన తరువాత శని స్తోత్రం స్వయంగా చదువుకొని శనిని ప్రార్ధించి నల్ల మట్టితో చేసిన ప్రమిదలో నువ్వుల నూనె పోసి దీపారాధన చేయాలి. దీపారాధనకు చేసే వత్తులు నల్లరంగులో వుండాలి. ముఖ్యంగా మనం గమనించ వలసినది ఏమంటే ప్రతి శనివారం శనికి తైలాభిషేకం చేసి శని విగ్రహాన్ని నల్ల వస్త్రంతో అలంకరించాలి. పూజానంతరం వెనుకకు చూడకుండా బయటకు వచ్చి పాద హస్త ముఖ ప్రక్షాళనం

చేసుకోవాలి. అలా చేసుకొన్న తరువాతే వారి ముఖం ఎవరైనా చూడవచ్చు. లేకపోతే శని పూజ చేసుకొన్న వారిని వదిలి చూసిన వారిని శని పట్టుకుంటాడని ప్రతీతి. దీనిలో సత్యాసత్యాలు గూర్చి విమర్శన చేయక ఈ ఆచారం పాటించిన నష్టం కాదు. శని పూజ గురించి వివరంగా తెలుసుకోవాలంటే శని దేవతా పూజ విధానం గూర్చిన పుస్తకం చదవచ్చు.

శని ఒక్కొక్కపుడు తాను ప్రవేశిస్తున్న సమయంలో అత్యంత శుభ ఫలితాలను యిచ్చి లాభం చేకూర్చటమే కాక ఎంతో మేలు చేస్తాడు. అంటే కొందరికి శని యొక్క ప్రవేశ సమయంలో చాల యోగిస్తాడు. జీవితంలో అన్ని రకాల శుభ సుఖ భోగభాగ్యాలిస్తాడు. కాని తాను నిష్క్రమించే సమయంలో తాను ఇచ్చిన ఫలాలన్ని వెనక్కి తీసుకొన్నట్లుగా చిత్రంగా అన్ని భోగాలు భాగ్యాలు పోయి పాదుషాగా ఉన్న ఆ జాతకుని జీవితాన్ని ఫకీరులాగ చేసి వెళ్లిపోతాడు. అదేవిధంగా శని తన సంచార సమయంలో ప్రథమంగా ప్రవేశించినపుడు దుష్ఫలితాలు యిస్తే ఆఖరి దశలో అన్ని సుఖసౌఖ్యాలు, భోగభాగ్యాలు యిచ్చి ఎక్కువ మేలు చేసి వెళతాడు.

కాబట్టి ఎవరికైనా హఠాత్తుగా భోగభాగ్యాలు అత్యున్నత పదవి అంతు లేని సంపాదన, భూ, ధన, కనక వస్తు వాహనాలు మరియు కీర్తి ప్రతిష్ఠలు అన్ని ఒక్కసారిగా వచ్చిపడితే శని మహాత్మ్యమని తెలుసుకోవాలి. అలాగే అవి అన్ని హరించుపోతు వుంటే శని దశ పూర్తి అవుతోందని గ్రహించవచ్చు.

ఇక దశమ శని గురించి నేర్చుకొందాం. ఎవరికైనా తన జన్మ రాశి నుంచి దశమ స్థానంలో శని ప్రవేశించినపుడు అలా ప్రవేశించిన శనిని కష్ట శని లేదా కంటక శని అంటారు. కంటకం అంటే కష్టమని అర్థం. కష్ట శని అన్నా లేక కంటక శని అన్నా నామాంతర భేదమే గాని ఫలితాలలో భేదం ఉండదు. ఈ సమయంలో జాతకునికి పై అధికారులతో భేదాభిప్రాయాలు వస్తాయి. అందువల్ల ఉద్యోగంలో తాను సర్దుబాటు చేసుకోలేక వుద్యోగ విరమణ చేస్తాడు. అంటే కంటక శని వల్ల కంటకాలను తానే కొనితెచ్చుకొంటాడు క్రొత్త ఉద్యోగం వచ్చినా అది ఎక్కువ కాలం నిలవదు. అవమానాలకు లోనవుతారు. తప్ప శ్రేయోభిలాషులు ఇచ్చిన మంచి సలహాలను పాటించక కష్టనష్టాల బారిన పడతాడు. ఆదాయం తగ్గి వ్యయం ఎక్కువై

దరిద్ర బాధను అనుభవిస్తాడు. చట్ట వ్యతిరేక పనులు చేసి కొందరు న్యాయస్థానాల తీర్పు వల్ల కఠిన శిక్షలు అనుభవిస్తారు. కారాగార శిక్ష కూడ అనుభవించవచ్చు. ఇలాంటి శిక్ష నుండి తాను తప్పించుకోవడానికి ఎవరు సహాయపడరు, అదేకాకుండ తన పూర్వపు వైభవం కోల్పోవడం వల్ల ఆ పదవిగాని లేక ఆ పూర్వ స్థితి గాని ఎందుకు కొఱగావు.

## రాహు కేతువులు

మన జాతక చక్రంలో రాహు, కేతువులకు ప్రత్యేక స్థానాలు కేటాయింపబడలేదు. ఈ రెండు గ్రహాలు ఛాయాగ్రహాలుగా చెప్పబడ్డాయి మరియు ఈ రెండు గ్రహాలను పాపగ్రహాలుగా విశ్లేషిస్తారు. మనము భూమి మీద నుంచి అన్ని గ్రహాలను అత్యంత శక్తి గల దూరదర్శిని యంత్రాలతో పరిశీలిస్తున్నాము. కాని రాహు, కేతువులను దర్శించటము ఎవరి తరము కాలేదు. ఎందుకంటే వాటి స్థానాలు మానవ మేధో సంపత్తుకు అందనంత దూరంలో వున్నాయి. ఈ రాహు, కేతువుల నీడ మిగిలిన గ్రహాల మీద పడినప్పుడు ఆ నీడ యొక్క ఛాయను చూసి వాటిని ఛాయా గ్రహాలుగా పేర్కొన్నారు. మన ఋషి పుంగవులు మరియు సరస్వతీ కటాక్షము కల మహోన్నత జ్యోతిష శాస్త్ర పండితులు అంటే కాళిదాసు, పరాశరుడు మరియు నారద మహాముని లాంటి ఉద్దండులు రాహు, కేతువులు ఇచ్చే ఫలితాలను తమ తమ గ్రంథములలో విపులముగా విశదపరిచారు. ఆ మహనీయుల జ్ఞాన సంపత్తు వల్లే మనము రాహు, కేతువులు ఇచ్చే ఫలితాలను నేర్చుకున్నాము.

రాహువు రాక్షస నామ సంవత్సర భాద్రపద మాసం బహుళ చతుర్దశి రోజున హస్తా నక్షత్రముతో జన్మించాడు. ఈతని భార్య పేరు కరాళి. ఇతను పైఠానస గోత్రమునకు చెందినవాడు. కశ్యప మహామునికి పౌత్రుడు. ఇతని తల్లి పేరు సింహిక. తండ్రి నామధేయం విప్రచిత్తి. కేతువు భార్యపేరు ధూమ్ర జింహ్వాకి. వీరిది జైమిని గోత్రం.

రాహు, కేతువులకు ప్రత్యేకముగా సహజ కారకత్వ స్వభావాలు అంటూ ఏమీ లేవు. ఒక వేళ వున్నా మానవ మేధస్సు ఈ రాహు, కేతువులు ఇచ్చే కారకత్వ ప్రభావాన్ని మానవ మేధో బలము సరిపోదు. రాహు, కేతువుల యొక్క కారకత్వ

నిజ స్వభావాన్ని అర్థం చేసుకొని వారి గుణాలను విశదీకరించి చెప్పగలిగిన శాస్త్ర పరిజ్ఞానము గల ఉత్తమ గ్రంథాలు మనకు అందుబాటులో లేవు. అందుకనే ఈనాటికీ రాహు, కేతువులను ఛాయాగ్రహాలుగానే చెప్పు కుంటాము. కొంతమంది రాహువు శుభఫలితములు ఇస్తాడని, కేతువు పాపఫలితాలు ఇస్తాడని మరికొంతమంది రాహు, కేతువులు ఇద్దరూ పాప ఫలితాలు ఇస్తారని, వారి వారి అనుభవ ముల వల్ల వారి అభిప్రాయములను తెలియచేస్తున్నారు. మనము అన్ని అభిప్రాయాలను పరిగణలోనికి తీసుకొని మనకు అనుకూలమైన అభిప్రాయములను ఫలితాలుగా చెప్పాలి. నిజానికి రాహు, కేతువుల గురించి ఎక్కువ ఏమీ తెలియదు కాబట్టి జాతక చక్ర పరిశీలనలో రాహు, కేతువులకు ఎక్కువ ప్రాముఖ్యత కొందరు శాస్త్రవేత్తలు ఇవ్వడం లేదు.

రాహువు శారీరకముగా స్త్రీ గ్రహము. ఆరుద్ర, స్వాతి, శతభిషం నక్షత్రాలకు అధిపతి. ఆరుద్ర నక్షత్రం మిధున రాశిలోను, స్వాతి నక్షత్రం తులా రాశిలోను, శతభిషం నక్షత్రం కుంభరాశిలోను వుంటాయి. కేతువు శారీరకముగా పురుష గ్రహము. అశ్విని నక్షత్రం, మఖ నక్షత్రం, మూల నక్షత్రములకు అధిపతి. రాహువు మరియు కేతువుల ఇద్దరిది తమోగుణము. రాహువు ఏ గ్రహము కక్ష్యలో వుంటే ఆ గ్రహ ఫలితాలు ఇస్తాడు లేదా శని ఇచ్చే ఫలితాలు ఇస్తాడు. రాహువుకు శని, బుధుడు, శుక్రుడు మిత్రులు. గురు గ్రహానికిసముడు. రవి, చంద్రులకు మరియు కుజునకు శత్రువు. రాహువు స్వభావికంగా క్రూరుడు, అసత్యవాది, మోసకారి, బుద్ధిహీనుడు మరియు కపటి, విశ్వాసఘాతకుడు. అసాధ్యరాగ పీడితుడు దైవ ద్వేషి, పొడుగైన ఆకారం కలవాడు. కులరీత్యా మ్లేచ్ఛుడు. నల్లని శరీర రంగు కలవాడు. రాహువు లాగే కేతువు కూడ క్రూరుడు. ఇద్దరూ కఠినులు ఎక్కువ హాని,అపకారము చేయువారు. రాహువు నీలి మరియు నలుపు కలిసిన వర్ణంతో వుంటాడు. రాహువు మిథున రాశిలో ఉచ్ఛంలో వుంటాడు. కాని మిథునరాశికి సప్తమం అయిన ధనూరాశిలో దుర్బలుడై వుంటాడు. కేతువు వృషభరాశిలో ఉచ్ఛంలో వుంటాడు. వృషభరాశికి సప్తమం అయినవృశ్చిక రాశిలో దుర్బలుడుగా వుంటాడు. ఈ విషయంలో కొన్ని భిన్నాభిప్రాయాలున్నాయి. కేతువు చైత్రమాసం, బహుళ చతుర్దశి సోమవారం, రేవతి నక్షత్రంలో జన్మించాడు. కేతువు యొక్క కన్నులు అగ్నిగోళాల్లాగా ఎఱ్ఱటి రక్తవర్ణంతో

మెరుస్తూ ఉంటాయి. పెద్ద శరీరము కలవాడు. శస్త్రయుతుడు, ధూమ్రవర్ణుడు, ధూమపానాసక్తుడు. ఈ శ్లోకం చూడండి.

**శ్లో :** రక్తోగ్రదృష్టి విషనాగు దగ్రదేహః
సశస్త్రః పతితశ్చ కేతుః।
ధూమ్రధ్యుతీర్ధూమప ఏవ నిత్యం
వ్రణాంకి తాంగశ్చ కృశో నృశంశః।

(ఈ శ్లోకం 13వ శతాబ్దంలో మంతేశ్వరుడు చేత వ్రాయబడింది. గమనించ వలసిన విషయం ఏమంటే 13వ శతాబ్దంలో ధూమపానం ఉందా అనే మీమాంస నాకు కలిగింది. మంత్రేశ్వరుడు ఇలా ఎందుకు వ్రాశాడో ఆయన మనోభావనఏమిటో పండితోత్తములు నాకు దీని అర్ధం విశదీకరిస్తే వారికి నేను కృతజ్ఞుడుగా ఉంటాను)

రాహువు భూత, ప్రేత, పిశాచ, రాక్షస గణాలకు అధిపతి. శ్మశాన శక్తులు, మంత్ర తంత్ర దుష్టశక్తులు మరియు క్షుద్ర దేవతలు రాహువు ఆధీనంలోనే వుంటాయి. రాహువు వాటిని సమీకరించి వాటి ద్వారా మనల్ని బాధిస్తాడు. ఏ జాతక చక్రంలోనైనా రాహవు కనుక బలోపేతుడై వుంటే ఆ జాతకుడిని విపరీతముగా పీడించి మానసిక భయో వికారాలకు కారణభూతుడై ఆ జాతకునిలో ఉన్మాద శక్తిని ప్రేరేపించి ఒక్కొక్కసారి అతనికి మతి భ్రమణానికి కూడ కారకుడు అవుతాడు. ఈ రాహు గ్రహము పిచ్చి, ఉన్మాదము, రాక్షస ప్రవృత్తి మరియు పైశాచిక భావనలు మొదలైన వ్యాధుల ప్రకంపనాలను మానవ మదిలో సృష్టించి వారి చేత దుర్మార్గం, దౌర్జన్యం, ఒక్కొక్కసారి హత్యా నేరాలను కూడ చేసేందుకు కావలసిన కోపోద్రే కాలను ప్రజ్వరిల్లింప చేసేటట్లుగా పురికొల్పుతాడు. ఎవరైనా చాలా దౌర్జన్యంగాను, దయా హీనంగాను మరియు క్రూర మనస్తత్వంతో వుంటే ఆ జాతకుడు రాహు ప్రభావం వల్ల పీడింప బడుచున్నాడని మనము గ్రహించవచ్చు. రాహువు మినుములు లేక మినపప్పుతో చేసిన వంటకాలు అంటే ఇష్టపడతాడు. కాని మినుములతో చేసిన కారపు పదార్థాలు అంటే ఎక్కువ మక్కువ.ఆ పదార్థాలను ప్రీతిగా భుజించి, సంతుష్టుడు అవుతాడు. అందుకనే రాహువు యొక్క బాధల నుండి విముక్తి పొందడానికి అతనిని పూజించిన తరువాత భక్తులు ఆయనకు భక్తితో మినప గారెలు నైవేద్యం పెడతారు. ఆ సంతృప్తి

వలన వాయు రూప, వస్తు రూపంలో ఉండే మన పెద్దలు రాహు యొక్క ఆధీనంలో వుండటం వలన మనము ఆబ్దికంలో మినప గారెలు చేస్తాము. దాని వల్ల మనకు పెద్దల ఆశీర్వాదము లభిస్తుందని రాహువు ఆధీనంలో వున్నా మన పెద్దలకు రాహువు వల్ల ఏ బాధ ఉండదని మన విశ్వాసం. ఈ విశ్వాసం వల్లనే మనము అపర కర్మలు చేయు దినములందు గాని లేక మాతాపితరుల శ్రాద్ధ కర్మలు చేయునప్పుడు గాని మనము తప్పక మినప వంటకాలను చేసి నైవేద్యం పెడతాము.

ఎవరి జాతక చక్రంలోనైనా సరే రాహు, కేతువుల మధ్య ఉన్న రాశులలో అన్నిగ్రహాలు కూడి వున్నపుడు ఆ గ్రహస్థితిని కాల సర్పదోషం అంటారు. ఈ దోషం వల్ల అనేక రకాల దుష్ఫలితాలు ఆ జాతకునికి కలుగుతాయి. (కాల సర్ప దోషం గురించి మీరు విపులంగా తెలుసుకోవాలంటే నేను వ్రాసిన "కాల సర్ప దోషం" అనే పుస్తకాన్ని చదవండి) ఒక ముఖ్య గమనిక ఏమంటే జాతక చక్రంలో రాహు, కేతువులను లెక్కించేటప్పుడు సవ్యచక్రంలో అపసవ్యంగాను, అపసవ్యచక్రంలో సవ్యంగా మాత్రమే లెక్కించాలి. ఎందుకంటే అన్ని గ్రహాలు మాదిరిగా కాకుండా ఈ గ్రహాలు అపసవ్యంగా చక్ర భ్రమణం చేస్తాయి. మనం అన్ని గ్రహాలు రాహు, కేతువుల మధ్యే వుండాలని చెప్పుకున్నాము. కొందరు శాస్త్ర పరిజ్ఞానం సరిగా లేనందువల్ల కేతు, రాహుల మధ్య అన్ని గ్రహాలు వుంటే కాల సర్ప దోషం ఉందని వాదన చేయుచున్నారు. ఈ వాదన శాస్త్ర సమ్మతం కాదు. ఇంకొక విషయం ఏమంటే రాహు, కేతువుల మధ్య అన్ని గ్రహాలు ఉన్నా ఆ గ్రహాల పొందికలో మధ్యలో ఒక శూన్య రాశి కనుక వుంటే కాల సర్ప దోషం లేదని మరికొందరి వాదన. ఈ వాదన కూడ శాస్త్ర సమ్మతం కాదు. ఇంకొకవిషయం ఏమంటే రాహు, కేతువుల మధ్య అన్ని గ్రహాలు ఉండి అలా కాల సర్ప దోషం ఏర్పడినప్పుడు ఆ జాతక చక్రంలో లగ్న స్థానము రాహు, కేతువుల మధ్య ఉన్నా లేక కేతు, రాహుల మధ్య ఉన్నా కాల సర్ప దోషం వున్నట్లుగానే భావించాలి. కాలసర్పదోష నిర్ణయంలో లగ్న స్థానం యొక్క పాత్ర ఏమీ వుండదు. ఎందుకంటే లగ్నం అనేది ఒక గ్రహము కాదు. ఈ విషయం మనము మరువకూడదు.

కాలసర్ప దోష నివారణార్థం ఏ జాతకుడైనా దోషం ఉన్నపుడు కాళహస్తిలోగాని, రామేశ్వరంలోగాని స్వయముగా వెళ్లి పూజ చేసుకోవాలి.

కాళహస్తిలోనే ఎందుకు పూజ చేయాలంటే ద్రౌపది దేవికున్న తీవ్ర కాల సర్ప దోషం వల్ల స్వయంవరంలో అర్జునుని వరించినా, దోషం వల్ల పంచభర్తృక అయినది. ఈ దోష నివారణార్థం ద్రౌపది చేత కాళహస్తిలో పాండవులు కృష్ణభగవానుని సలహామేరకు ద్రౌపదికున్న దోష నివారణార్థం ఆమె చేత పూజ చేయించారని ప్రతీతి. అలాగే సీతామాతకు కాలసర్ప దోషం వల్లనే ఆమె దాంపత్య జీవితంలో ఎక్కువ కాలం వియోగం అనుభవించింది. రామరావణ యుద్ధానంతరం రాములవారు రామేశ్వరంలోనే సీతా అమ్మవారిచే కాల సర్ప దోష నివారణార్థం పూజ చేయించి ఆమె వియోగ దోషం నివారించారని మన హిందూ మత నమ్మకం. కాబట్టి కాళహస్తిలో గాని లేక రామేశ్వరంలో గాని వధూవరులు స్వయంగా అక్కడికి వెళ్లి పూజ చేసుకోవాలి. ఒక్క విషయం ఏమంటే కాల సర్ప దోషం వున్నపుడు కొంత మంది రాహు కేతువుల గురువైన సుబ్రహ్మణ్యస్వామిని పూజిస్తే చాలు అని సలహా యిస్తారు. కాని దోషం వున్నప్పుడు రాహు కేతువులు సుబ్రహ్మణ్య స్వామిని పూజ చేసిన తప్పులేదు కాని ఎవరి వల్ల దోషం కలిగిందో వారిని కూడా తప్పకుండా పూజించాలి గాని నిర్లక్ష్యం చేయరాదని గ్రహించాలి. అందువల్ల కాళహస్తిలో గాని రామేశ్వరంలో గాని కాలసర్పదోషం వున్నవారు ఆ ప్రదేశాలకు వెళ్లి దైవ దర్శనం చేసుకొని భక్తితో రాహు కేతువులకు పూజ చేసుకొంటే సత్ఫలితాలు వస్తాయని పండిత నిశ్చితాభిప్రాయం. ఒక ముఖ్య విషయం ఇక్కడ ప్రస్తావిస్తాను. కాళహస్తిలో గాని, రామేశ్వరంలోగాని, రాహు కేతువులకు పూజ చేయడానికి వెళ్లి వచ్చిన వారు చాలా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అది ఏమంటే జన సందోహం ఎక్కువగా ఉండటం వల్ల పూజారులు సరిగా పూజ చేయటం లేదని "తూతూ మంత్రమే" తప్ప భక్తి శ్రద్ధలు ఆ పూజారులలో ఏ కోశానా లేకపోగా సభ్యత, సంస్కారాలు రెండూ లేకుండా అమర్యాదగాను అనౌచితంగాను ప్రవర్తిస్తున్నారనేది వారి సంభాషణలోని ముఖ్య సారాంశం. ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు గారిని సంప్రదించడానికి ఆయన అందుబాటులో ఉండడని, ఎంతో దూరం నుంచి ఎంతో ధనాన్ని ఖర్చు చేసి శ్రమ పడి వెళితే అక్కడి వాలంటీర్లు భక్తులను బలవంతంగాను దౌర్జన్యంగా నెట్టివేస్తున్నారని వాపోయారు. కాబట్టి ఎవరైనా రాహు కేతువుల పూజ చేసుకోదలచుకొంటే హైదరాబాదు దగ్గర యాదగిరి గుట్ట

దగ్గర కుందా సత్యన్నారాయణ గారి ఆధ్వర్యంలో సురేంద్రపురిలో అత్యంత ఆధునిక సౌకర్యాలతో ప్రతి గ్రహానికి ఒక్కొక్క గుడి ప్రత్యేకంగా నిర్మించి ఛైర్మన్ శ్రీ కుందా సత్యన్నారాయణ ఎంతోమందికి అలుపెరుగని సేవ, ఓర్పు, సహనంతో చేస్తున్నారని నాకు చాలామందిచెప్పారు.కాబట్టి మీరు సురేంద్రపురి(యాదగిరిగుట్ట)లో ప్రశాంతంగా పూజ చేసుకోవచ్చు. అక్కడి పూజారి శ్రీ శ్రవణాచారిగారిని మీరు సంప్రదించండి. ఆయన చాలా మిత్రభావంతో, మర్యాదపూర్వకంగాను అన్ని విషయాలు వివరంగా విసుగు లేకుండా వివరిస్తారు. ఆయన సెల్‌ఫోన్ నెంబరు 9963689080. మీరు నెంబరు వ్రాసి పెట్టుకొని పదిమందికి చెప్తే వారికి మీరు కూడాసేవ చేసినట్లే అవుతుంది.

# అధ్యాయం - 4

## రాశి ఫలితాలు

### సూర్యుడు

ఈ అధ్యాయంలో మనం ద్వాదశ రాశులో ఏ గ్రహం ఏ రాశిలో ఉంటే ఎలాంటి ఫలితాలు ఇస్తాయో తెలుసుకొందాం. దీనివల్ల జాతక చక్రం పరిశీలించి నపుడు మీకు ఆ జాతకుని మనోభావాలు, నడవడిక, అంతర్గహింతంగా ఉన్న అలవాట్లు మీరు గ్రహిస్తారు. ఇప్పుడు మొదటగా ఈ గ్రహాధిపతి అయిన రవితో ప్రారంభిద్దాం.

రవి మేషమందు ఉన్నపుడు జన్మించినవారు మంచి శాస్త్ర పరిజ్ఞానం కలిగి తర్కం, వ్యాకరణం, ఛందస్సు, సాహిత్య పఠనంలో ఆసక్తి కలిగి స్వయంగా ఏదో ఒక శాస్త్రంలో ప్రావీణ్యత సంపాదించి మంచి శాస్త్ర పండితుడిగా పేరు ప్రతిష్టలు సంపాదిస్తారు. ఉన్నత విద్య అభ్యసించి లోక విచక్షణా పరిజ్ఞానంతో ధర్మనిరతిని పాటించి అందరికి మార్గదర్శకులుగా అవుతారు. స్వయంగా శాస్త్ర రచనలు చేసే అంతస్థుకు ఎదిగి తమ పాండిత్యాన్ని మరియు శాస్త్ర విజ్ఞానాన్ని తమ రచనలతో సమాజానికి పంచిపెడతారు. వారి రచనలు సంస్కృత పద భూయిష్టమై నారికేళ ఫల న్యాయంగా కాక కదళీఫలము వలె మృదువైన మరియు సరళ భాషలో జన బాహుళ్యానికి చెప్పగలిగిన భాషా పటుత్వం కల నైపుణ్యం కలవారుగా ఉంటారు. వీరు యుద్ధ విద్యలో ప్రావీణ్యత గడించి పరాక్రమవంతులుగాను మరియు ధైర్య సాహసాలు కలిగిన శూరులుగా ఉంటారు. కళలయందు అభిమానం మెండుగా వుండి కళాకారులను ఆదరించి వారిని గౌరవిస్తారు. ఈ జాతకులకు తమ దాంపత్య జీవితం మీద ఎక్కువ అభిమాన లాలసలు కలిగి భార్యతో విభేదములు రానీక సరససల్లాపములతో ఆమెను రంజింపజేస్తాడు. దీనివల్ల దాంపత్య జీవితంలో సుఖసంతోషాలు ఆనందం ఆహ్లాదం వెల్లివిరుస్తాయి. బంధుమిత్ర సమాజంలో శాంతి స్వభావుడిగా పేరొందుతాడు. మంచి ఆరోగ్యం కలిగి అలసట లేకుండ తాము చేపట్టిన పనిని పూర్తి చేసే వరకు విశ్రాంతి పొందదు. వీరి ఊహలు, భావనలు,

ఆలోచనలు ఎప్పుడూ వాస్తవానికి దగ్గరగా ఉండడం వలన వారి అంచనాలు తప్పవు. వీరితో ఎవరైనా గాని శత్రుత్వం పెంచుకొంటే లేక వీరి పట్ల ద్వేషం పెంచుకుంటే ఈ మేష జాతకులముందు వారు. వీరి శక్తి ధాటికి నిలువ లేక తమ ఓటమిని అంగీకరింపవలసి వస్తుంది. ఒక్కొక్కపుడు వారితో శాస్త్ర చర్చతోగాని పండిత గోష్టిలో గాని లేక రాజకీయ ప్రకంపనలలో గాని వీరితో సంధించి అపజయం పొంది అపఖ్యాతి పాలవుతారు. సుందర రూపం గలవారు. మంచి దేహచ్ఛాయ మరియు శరీర దారుఢ్యం కలిగి ఆరోగ్యవంతుడై పూర్ణాయువుగా జీవిస్తాడు.

**సూర్యుడు వృషభరాశిలో ఉంటే :**

ఈ జాతకులు అందరికి మిత్రులే అవుతారు. ఆ మిత్రులకు ఈ జాతకుని మీద మంచి అభిమానం ఆప్యాయత కలిగి తమ స్నేహ ధర్మాన్ని అవసరమైనప్పుడు వీరికి అత్యంత మేలు, ఉపకారం చేస్తారు. వీరి రూపం, దేహచ్ఛాయ మరియు అంగ సౌష్టవం ఆకర్షణీయంగా ఉంటుంది. సహజంగావీరికి శత్రువులుఎవరు ఉండరు. బంధుమిత్రులలోను మరియు సమాజంలోను అందరికి ఇష్టులుగానే ఉంటారు. వీరిని ద్వేషించే వారు కాని, వీరితో శత్రుత్వం ఉండే వారు కాని ఉండరు. మంచి సహనం ఓర్పు ఉంటుంది. తమ నిర్ణయాలను నిదానంగా ఆలోచించి న్యాయపద్ధతిలో నిర్ణయం తీసుకొంటారు. ఆ నిర్ణయాలు ధర్మబద్ధంగా ఉంటాయి. తమ కార్యసాధనలో మంచి వ్యవహారదక్షత చూపించి తమ కార్యక్రమాలను జయంగా జరుపుకొంటారు. వీరికి స్త్రీలను త్వరగా ఆకర్షించే రూపం, స్వభావం మాట చతురత ఉంటాయి. వీరు రతిక్రీడలో తమ సమర్ధత చూపించి స్త్రీల చేత మంచి మెప్పు పొందుతారు. మరియు ప్రీతిపాత్రులవుతారు. వీరికి అలంకారప్రియత్వం, విందుభోజనములందు ఆసక్తి మెండు. వీరికి లలిత కళలయందు మరియు సంగీత సాహిత్యములందు అభిరుచి కలిగి ఆ కళాకారులను, సాహిత్యకారులను గౌరవించి ఆదరిస్తారు.

**సూర్యుడు మిథున రాశిలో ఉంటే :**

ఈ జాతకులకు మంచి మేధోసంపత్తి కలిగి అత్యంత జ్ఞాపక శక్తి ఉండటం వీరికి ఒక ప్రత్యేకత. ఏ విషయాన్నైనా అంత త్వరగా మర్చిపోక అన్ని విషయాలను మరియు సంఘటనలను వాటి వరుస క్రమంలోనే గుర్తు పెట్టుకొంటారు. భౌతిక

శాస్త్రము, పదార్థ విజ్ఞాన శాస్త్రములందు ఉత్సాహము కలిగి ఆ శాస్త్రములనే వృత్తిగా ఎన్నుకుంటారు. వీరికి ఎప్పుడూ ధన లోపం ఉండదు. ఉదారబుద్ధి కలిగి అందరకీ మేలు చేస్తారు. తన వృత్తిలో మంచి నైపుణ్యము సంపాదించి నేర్పరిగా ఉంటారు. బుధగ్రహ దాక్షిణ్యము చేత జ్యోతిష శాస్త్రము లేక హస్త సాముద్రికమునందు ప్రావీణ్యత గలవారుగా ఉంటారు. మంచి రూపము కలిగి జనాకర్షణీయంగా ఉంటారు. ధర్మ, న్యాయ నిరతులను పాటిస్తూ పెద్దలందు మరియు పండితులందు వినయ విధేయతలు గలవారగుదురు. ఒక్కొక్కప్పుడు ఈ జాతకుని తండ్రికి ఇద్దరు భార్యలు గాని లేక పరస్త్రీ సంబంధము ఉండవచ్చును.

## సూర్యుడు కర్కాటక రాశిలో ఉంటే :

ఈ జాతకులు సర్వగుణ సంపన్నులు మితిమించి ఉదారముగా దానములు చేయుదురు. మంచి రూపము గలవారు అగుదురు. అవమానములు సహింపలేనివారు మరియు ఎక్కువ ఆత్మాభిమానము కలవారు. కఠినముగా మాట్లాడలేనివారుగా ఉందురు. మంచి ధన సంపాదన గలిగి ఆస్తి అంతస్తులు పెంచుకుని సమాజములో పేరు, ప్రఖ్యాతులు సంపాదించుదురు. బంధువులతో గాని మిత్రులతో గాని ఎక్కువ మెప్పుదల పొందలేరు. ఎందుకంటే వీరి జ్ఞాన శక్తికి సరిగా తూగలేరు. చంద్రరాశి అవుట వలన వీరు అంత్య దశలో కఫము చేత తీవ్రముగా అనారోగ్యముతో బాధపడి మరణింతురు.

## సూర్యుడు సింహరాశిలో ఉంటే :

ఈ జాతకులు చాల రౌద్రముగాను వెఱుపు ఎరుగని ధైర్య సాహసములు కలవారుగా ఉండి ఎంతటి శత్రువులనైనా సరే సునాయాసముగా ఓడిస్తారు. వీరికి మంచి దేహదారుఢ్యము కలిగి ఏ సాహసమైననూ చేయుటకు వెనుకాడరు. చూపరులకు గంభీరముగా కన్పించుదురు. యుద్ధనీతియందు అత్యంత ప్రావీణ్యము కలిగిశూరులుగాను,పరాక్రమవంతులుగాను విలసిల్లుతారు.

## సూర్యుడు కన్య రాశిలో ఉంటే :

ఈ జాతకులు సున్నితంగాను, మృదువుగాను ఉంటారు. నాజూకువంతమైన దేహము కలిగి అరచేతులకు సన్నటి వ్రేళ్ళు కలిగి ఆ అరచేతులు సున్నితంగాను

మెత్తగా దూదిలా వుంటాయి. మంచి ఆరోగ్యము కలిగి ఎక్కువ శ్రమ పడే శక్తి వీరికి ఉంటుంది. స్వకార్యములు ఎవరికీ వప్పగింపక తామే స్వయంగా చేసుకుంటారు. కఠినమైన మనసు కలిగి తమ వాక్పటిమతో చతురముగా సంభాషించి తమ పనిని విజయవంతము చేయగలిగే చతురత ఉంటుంది. వీరి చేతి వ్రాత లోని అక్షరములు ముత్యాలవలె ఉండి అందముగా ఉంటాయి. పండితుల మీద కళాకారుల మీద మంచి గౌరవ, భక్తి భావములు ఉంటాయి. గమనించ వలసిన ముఖ్య విషయమేమంటే ఈ జాతకులకు మాతృభక్తి ఎక్కువ. తమ తల్లి మీద అత్యంత ప్రేమాభిమానాలు ఉంటాయి. వీరు తొందరగా ఎవరితోను మాట కలపక బిడియంగా ఉంటారు. తమ సంతానమంటే ధృతరాష్ట్ర ప్రేమ చూపిస్తారు.

## సూర్యుడు తుల రాశిలో ఉంటే :

ఈ జాతకులు జీవితముతో ఎక్కువ భాగము ఒంటరిగా గడుపుతారు. అలా ఒంటరిగా ఉండటం వలన ఎక్కువ ధన వ్యయం చేస్తారు. అలా ధన వ్యయం చేసినందుకు బాధపడతారు గాని తిరిగి మళ్లీ అదే పని చేస్తారు. వీరికి దూర ప్రయాణాలన్నా, లేక విదేశీ యానమన్న ఆ శక్తి మెండు. వీరు చపలచిత్తము కలిగి మాటలయందు మరియు చేతలయందు స్థిరత్వము లేకపోవడం వల్ల వీరిని ఎవరూ నమ్మరు. వీరు అవకాశవాదులుగా ముద్ర వేయబడతారు. అధిక స్త్రీ వాంఛ కలిగి పర స్త్రీలతో అక్రమ సంబంధాలు రహస్యముగా నడుపుతారు. ఆత్మ స్తుతి, పర నింద అనే నైజము వీరికి సరిగా కూడుతుంది. వీరు ఎవరికైనా సరే శారీరక శ్రమతో కూడిన సహాయము మాత్రమే చేస్తారు. గాని ఇతరత్రా ఏమీ కించిత్తు మేలు కూడ చేయరు. డాంబికములు మరియు దర్పము గలిగిన శుష్క పస లేని ప్రసంగములు చేయుచూ సమాజంలో చులకన అవుతారు.

## సూర్యుడు వృశ్చిక రాశిలో ఉంటే :

ఈ జాతకులు మంచి పరాక్రమవంతులు, ధైర్య సాహసాలు గలవారుగా ఉంటారు. ఈ సాహస ప్రక్రియలో జయించుటకు మోసము, కుతంత్రములు చేయుటకు కూడ వెనుకాడక అధర్మము, అన్యాయములను పాటించక శత్రువులకు హాని చేయుదురు. వీరికి సమాజములో మంచి గౌరవము, పేరు ప్రఖ్యాతులు ఉండవు.

నీచ స్త్రీ సాంగత్యము మరియువేశ్య స్వభావము కలిగి హేయమైన జీవితము గడుపుదురు. నమ్మినవారిని తమ స్వలాభము కొఱకు హాని చేయుటకు కూడ వెనుకంజ వేయరు. ఈ జాతకులు పరమ లోభులు, స్వార్ధపరులు మరియు క్రూర స్వభావము గలిగి పగ, ద్వేషాలను మరువక ప్రతీకారము తీర్చుకుంటారు. వీరి దుష్ట స్వభావము వలన తల్లిదండ్రులు, భార్య, సంతానము చేత గూడ ద్వేషింపబడుదురు.

## సూర్యుడు ధనూ రాశిలో ఉంటే :

ఈ జాతకులు మంచి విద్య, శాస్త్ర పరిజ్ఞానము కలిగి లోక విచక్షణా జ్ఞానముతో ఏ నిర్ణయాన్నైనా తీసుకుంటారు. మంచి ధన సంపత్తులు గలిగి, ధనాభావ లోటును చూడరు. ఎందుకంటే వీరు భాగ్యవంతులుగా ఉండి తమ వృత్తిలో మంచి ధన సంపాదన చేస్తారు. అందరిని మెప్పించే శక్తి గలిగిన, వ్యవహార దక్షత గలిగి ఉంటారు. అందువలన వీరిని మంచి కార్య సాధకులుగా అనుకోవచ్చును. ఓర్పు, సహనము ఎక్కువ. ఈ జాతకులు విమర్శలనుగాని, విమర్శకులను గాని ఎక్కువ పట్టించుకోరు. బంధుమిత్రులందరకు సహాయ సహకారములు అందించి అందరిలోను మంచివారు గాను, ప్రతిభావంతులుగాను పేరు తెచ్చుకుంటారు. మంచి ఆరోగ్యము, దేహ దారుఢ్యము గలిగి పూర్ణాయువులుగా జీవిస్తారు.

## సూర్యుడు మకరరాశిలో ఉంటే :

ఈ జాతకులు పరమ లోభులుగా ఉంటారు. వ్యాపార లావాదేవీలలో గాని, ధన విషయములలోగాని చాల ఖచ్చితంగా వుంటారు. ఏ కార్యమునందైనా ధైర్యము చూపక పిరికివారుగా ఉంటారు. చపలచిత్తము ఎక్కువ. దేశాటనము, యాత్రా స్థలాలను దర్శించటం అంటే మక్కువ ఎక్కువ. వీరికి పితృ సంబంధమైన ఆస్థి కలసి వస్తుంది. భోజన ప్రియులు. తమకు సంక్రమించిన పిత్రార్జితమును దురాశ చేత నష్టపరచుకుని వంత చెందుతారు.

## సూర్యుడు కుంభరాశిలో ఉంటే :

ఈ జాతకులు నీచ మనస్తత్వము కలవారు. పరస్త్రీలందు ఆసక్తి కలవారు. బుధ వర్గములోనూ, పండిత సమూహములోనూ పనికిరానివారుగా ఉందురు.

పరస్త్రీ వాంఛతో ప్రాణమిత్రునికి కూడ ద్రోహము చేయుదురు. శరీరఛాయ నల్లగా ఉండి, దుష్టబుద్ధి గలిగి, తన సంభాషణనందు ఎక్కువ అశ్లీలము ఉచ్ఛరిస్తారు. జీవితమంతా సుఖ సంతోషములు లోపించి తమ మూర్ఖబుద్ధిచేత దుఃఖముతో కాలము గడుపుదురు. కోపిష్టి మరియు మొండితనము ఎక్కువ గలిగి అందరిలోనూ చులకన అగుదురు.

### సూర్యుడు మీన రాశిలో ఉంటే :

ఈ జాతకులకు సత్సంగ పరిచయం, బుధ వర్గములో ప్రియత్వము ఉంటాయి. మంచి స్నేహితులు గలిగి ప్రాజ్ఞతో జీవిస్తారు. వీరి ముందు ఎంతటివారైనా సరే ఎదురు మాటలాడలేక స్తబ్ధులయిపోతారు. మంచి పుత్ర సంతానము గలవారుగా ఉంటారు. ఎల్లవారి తోనూ ప్రేమగా మాట్లాడుతూ తమ కార్య సాధన చేసుకుంటారు. ఆ కార్యసాధన నిమిత్తము అసత్యములు కూడ చెప్పగలరు. ఈ జాతకులకు శత్రువులుండరు. బంధుమిత్రులకు మరియు సమాజములో అందరికి కూడ ప్రీతిపాత్రులుగానే చలామణి అవుతారు. ముఖ్యముగా స్త్రీలయితే మంచిరూపము గలిగి చాల ఆకర్షణీయంగాను మరియు రూపవతులుగానూ ఉంటారు. ధర్మాధర్మ విచక్షణా జ్ఞానము ఈ జాతకులకు ఎక్కువ. జీవితములో ఎప్పుడూ ధనధాన్యాలకూ, అన్నవస్త్రాలకు లోటు ఉండదు. మంచి వ్యక్తులుగా జీవిస్తారు. సూర్యుడు ద్వాదశ రాశులలో ఉంటే ఆయన ఇచ్చే ఫలితాలు ఎలా ఇంతవరకు ఉంటాయో విశదంగా నేర్చుకొన్నాము. ముందు అధ్యాయంలో చంద్రుడు ఇచ్చే ఫలితాలు ఎలా ఉంటాయో ద్వాదశ రాశులలో చంద్రభావాలను నేర్చుకొందాం.

## చంద్రుడు

ఇప్పుడు మనం చంద్రుడు ఏ రాశిలో ఉంటే ఏ ఫలితాలు యిస్తాడో తెలుసు కొందాము.

### చంద్రుడు మేషరాశిలో ఉంటే :

ఈ జాతకులు నక్షత్రములు అశ్విని నాలుగు పాదాలు, భరణి నాలుగు పాదాలు మరియుకృత్తిక మొదటి పాదమే ఉంటుంది. అంటే ఎవరి జాతకములోనైన

చంద్రుడు కనుక మేషరాశిలో ఉందంటే వారి రాశి మేషరాశిఅవుతుంది. ఈ రాశిలో జన్మించినవారికి సాధారణంగా మంచి దేహచ్ఛాయ మరియు సువర్ణ వర్ణం కల ముఖ వర్చస్సు ఉంటుంది. విశాలమైన ముఖవర్చస్సు ఉంటుంది. విశాలమైన ముఖాకారం కనుముక్కు తీరుచూడ ముచ్చటగా ఉండి అందంగా ఆకర్షణీయంగా ఉంటారు. ధనార్జనలో లోపం ఉండదు. తక్కువ విద్య, ఉన్నా తమ తెలివితేటలు ఉపయోగించి ధనము సంపాదిస్తారు. ఎప్పుడూ కూడ ధన లోపం అనేది వీరికి ఉండదు. అంటే ధనవంతులుగానే జీవిస్తారు. వీరికి మానాభిమానాలు ఎక్కువగా ఉంటాయి. మంచి ఆత్మాభిమానం కల్గి గౌరవంతోను మరియు పౌరుషంతోను జీవిస్తారు. పురుషులయితే పరస్త్రీ వ్యామోహం కామవాంఛ ఎక్కువగా ఉంటాయి. స్త్రీలయితే రతిక్రీడలలో ఎక్కువ స్వేచ్ఛగాను ఉత్సాహంగాను పాల్గొంటారు. ఈ జాతకుల కనుపాపలలోని తెల్లదనం స్వచ్ఛంగా పాలవలె తెల్లగా శ్వేతవర్ణంలో మెరుస్తు ఉంటాయి. ఈ జాతకులకు చాల పట్టుదల మరియు శ్రమ చేసే సామర్థ్యం ఎక్కువగా ఉంటుంది. స్వయంసేవ మీద ఎక్కువ నమ్మకం. ఎప్పుడు ఎవరిని యాచించరు.

**చంద్రుడు వృషభరాశిలో ఉంటే :**

ఈ జాతకులకు మంచి సహనశక్తి ఉంటుంది. ఏ విషయంలోను తొందర స్వభావం చూపించరు. ఏ విషయాన్ని అయినా క్షుణ్ణంగా చిటికెలో అర్థం చేసుకొనే వితరణ ఉంటుంది. వీరు. మరొకరు మాట్లాడుతున్నప్పుడు వారి సంభాషణం లోని పదజాలమును ఎక్కువగా విసర్జించి వారి సంభాషణంలోని గూడార్థమును మాత్రమే గ్రహిస్తారు. హంస పాలు నీరు ఎలా వేరు చేస్తుందో అలాగే వీరు పెదవులలోని పదజాలాన్ని మరియు హృదయంలోని భావాన్ని ఇట్లే పసిగడతారు. తొందరపడి ఉద్రేకాలకు లోనుకారు. ఏ విషయాన్నైనా చాల లోతుగా పరిశీలించి విమర్శ నాభావంతో విశ్లేషించుకొనే మేధోసంపత్తి కలిగి వుంటారు. పురుషజాతకమైతే ఆ జాతకునిలో స్త్రీలవలె మృదుత్వం, లాలిత్యం, మరియు నాజూకుతనం వారి నడవడికలో కనపడుతుంది. కాని మంచి పురుషాకృతి మరియ దేహదారుఢ్యం కలిగి వుంటారు. వెన్నలాంటి హృదయం కలిగి ఉంటారు. జాలిగుండె కలవారు. ఎక్కువ దాన గుణం కల్గి సమాజసేవకు తోడ్పడుతారు. విధి వైపరీత్యాలు కలిగినపుడు సమాజసేవకు

నడుం బిగించి స్వయంగా విధి వంచితులకు యథాశక్తి సేవ చేస్తారు. అంటే మానవతా దృక్పథంతో ఎవరైన ఆపదలలో చిక్కుకున్నపుడు సహాయపడతారు.

## చంద్రుడు మిథునంలో ఉంటే :

ఈ రాశి జాతకులకు బాల్యం నుండి విద్యాసక్తి ఉంటుంది. ఉన్నత విద్యను అభ్యసిస్తారు. ఛందస్సు, వ్యాకరణం, వాక్పటిమ మరియు భాషాజ్ఞాన పటుత్వం ఉంటుంది. సభాకర్షణీయంగా సంభాషించే చతురత కలిగి ఉంటారు. మంచి వక్తగా పేరు పొందుతారు. ఏదైన ఒక శాస్త్రంలో మంచి ప్రజ్ఞాపాటవాలు సంపాదించి పేరు ప్రతిష్టలు సంపాదిస్తారు. వీరికి వ్యాపార సరళి ఎక్కువ ఉంటుంది. ఏ విషయంలోనైనా లాభనష్టాలు బేరీజు వేసుకొని తమకు అనుకూలంగా ఉండేటట్లుగా నిర్ణయం తీసుకొంటారు. కొంతమందికి సవతి తల్లి ఉండవచ్చు లేదా దత్తత పోయి మారుతల్లి ప్రేమలో పెరిగి పెద్దవారు అవుతారు.

## చంద్రుడు కర్కాటకంలో ఉంటే :

వీరు మంచి భోగభాగ్యాలు అనుభవిస్తారు. వాహన యోగం, రజిత పళ్లెర భోజనం ఎప్పుడూ ఉంటుంది. మిత్రుల అందరిలోను తలమానికంగా ఉంటారు. వీరికి హస్తసాము ద్రికం జ్యోతిష శాస్త్రాలలో ఆసక్తి మెండుగా ఉంటుంది. కృతజ్ఞతా భావం వీరికి ఎక్కువగా ఉంటుంది. పెద్దలయెడల గౌరవ భక్తి భావాలు ఉంటాయి. జీవితంలో కష్టసుఖాలుసమానంగా అనుభవిస్తారు. అంటే కష్టసమయంలో మిక్కిలి క్రుంగిపోవటం, సుఖసంతోషాలు కలిగినపుడు ఉప్పొంగిపోవడం లాంటివి ఉండవు. వీరికి సేవాతత్పరత ఎక్కువగా ఉంటుంది. తాము శ్రమకోర్చిఇతరులకు సహాయం చేస్తారు. ఈ జాతకులకు మంచి ధర్మనిరతి, నిజాయితీ ఉంటాయి. శాస్త్రమన్నా శాస్త్ర పండితులన్నా గౌరవ భావం చూపిస్తారు. మృదు స్వభావం కలిగి మృదు భాషణ చేస్తారు. ఎప్పుడూ కూడ ఎవరితోను కలహించడానికి ఇష్టపడరు. కఠిన పదజాలం ఏనాడు ఉపయోగించరు. విద్యాదానం శాస్త్ర దానం అంటే ఎక్కువ ఆసక్తి కలిగి ఉంటారు. ధనాపేక్ష లేకుండ విద్యా దానం చేస్తారు. వీరికి కలహ లక్షణం ఉండక పోవడం వల్ల మరియు శ్రమదానం చేయడం వల్ల వీరికి శత్రువులు ఉండరు. హాని చేసే మనస్తత్వం కాని పగ, ప్రతీకార వాంఛగాని ఉండవు.

## చంద్రుడు సింహరాశిలో ఉంటే :

ఈ జాతకులు విశాల ముఖం కలిగి ఉంటారు. కళ్లు, ముక్కు, నోరు ఒకదాని కొకటి దగ్గరగా ఉండి చుట్టూ ముఖ కైవారం ఖాళీగా ఉంటుంది. చిన్న చిన్న కళ్లు ఉంటాయి. తీక్షణమైన చూపు ఉంటుంది. వీరు స్త్రీల మీద ఎక్కువ విరక్తి భావం కల్గి ఉంటారు. స్త్రీలంటే ఎక్కువ గౌరవమీయక చులకన భావంతో చూస్తారు. దాంపత్య జీవితంలో భాగస్వామికి సరియైన విలువ ఇవ్వక మిడిసిపాటుతోను, దర్పముతోను వ్యవహరిస్తారు. మాంస భక్షణ మీద ఎక్కువ మక్కువ ఉంటుంది. సహజంగానే వీరి మాటలలో ఎదుటివారిని కించపరిచే పదజాలం ఉపయోగించడం మరియు మాటల్లోనే కాక చేతలలో కూడ కాఠిన్యత కనిపిస్తుంది. దుర్మార్గ ప్రవృత్తి ఎక్కువ. మంచి దేహదారుఢ్యం కలిగి ఆరోగ్యవంతులుగా ఉంటారు. వీరికి కామవాంఛ తక్కువ. సంతానం స్వల్పం. బంధుమిత్రుల్లో మంచి ఆప్యాయత గౌరవం పొందుతారు. వీరికి తల్లియెడ అవ్యాజమైన ప్రేమ కల్గి ఉంటారు. మాతృభక్తి ఎక్కువ. వృద్ధాప్యంలో తల్లికి ఓర్పు సహనంతో శ్రమకోర్చి ఎంతో సేవ చేస్తారు.

## చంద్రుడు కన్యలో ఉంటే :

ఈ జాతకులకు స్త్రీ అంటే విలాసజీవితానికి పనికివచ్చే ఒక యంత్రంలా భావిస్తారు. స్త్రీ వాంఛ ఎక్కువ. స్త్రీ సుఖం పొందేటందుకు ఎంతటి నీచకార్యమైనా చేస్తారు. న్యాయాన్యాయ విచక్షణాజ్ఞాన శూన్యులై నీచస్త్రీ సాంగత్యానికి కూడ దిగజారుతారు. ఒక్కొక్కపుడు కామావేశానికిలోనై స్త్రీలను బలాత్కరించడానికి కూడ వెనుకాడరు. మంచి పలువరుస కలిగి పొడవైన చేతులు ఉండి ఆకర్షణీయమైన చూపుతో అందంగా ఉంటారు. వీరు వారి మనస్సు లోని భావాలు కన్నుల ద్వారా చెప్పగలరు. ఉన్నత విద్య అభ్యసిస్తారు. దైవభక్తి ఉంటుంది. ఒక్క స్త్రీ విషయంలో తప్ప మిగిలిన అన్ని అంశాల్లో ఆదర్శప్రాయంగా ఉంటారు. భార్యతో ఆనందమైన జీవితం గడుపుతారు. కాని స్త్రీ విషయంలో మాత్రం వీరిని నమ్మలేం. స్త్రీ వాంఛతో మానసిక దౌర్బల్యానికిలోనై శారీరక సుఖం కోసం వావి వరుసలు లేక ఏ స్త్రీతోనైనా అక్రమ సంబంధం కలిగి ఒక్కొక్కపుడు భాత్రు మిత్ర ద్రోహానికి కూడ తలపడతారు.

## చంద్రుడు తులారాశిలో ఉంటే :

ఈ జాతకులను మనం తేలికగా గుర్తుపట్టవచ్చు. వీరి ముఖం చూడగానే కనిపించేది వీరి పెద్ద ముక్కే. అంటే ముక్కు పొడవుగా ఉంటుంది. విశాలమైన కనుదోయి కలిగి చూడడానికి ఆకర్షణీయంగా ఉంటారు. చూడడానికి బొద్దుగాను లావుగాను ఉంటారు. ఏ కార్యక్రమమైనా జయప్రదంగా పూర్తి చేస్తారు. అంటే కార్యసాధనలో మంచి నేర్పు ఉంటుంది. మంచి కార్యదక్షత కలిగి కార్యాచరణలో సంపూర్ణ విజయం సాధించడానికి మంచి ప్రణాళికలను ఊహారచనలను చేస్తారు. తమ కార్య సాధనలో పట్టుదల కలిగి ఎన్ని అడ్డంకులు వచ్చినా భయపడక ధైర్యంగా ముందుకు సాగిపోతారు. కొంతమందికి ద్వితీయ వివాహదోషం ఉండవచ్చు. జీవితంలో అన్ని భోగభాగ్యాలు అనుభవిస్తూ అందరితోను సఖ్యతతోను స్నేహభావం కలిగి నలుగురికి సహాయం చేస్తూ అందరి మెప్పునుపొంది మంచిపేరు తెచ్చు కొంటారు. చంద్రుడు వృశ్చిక రాశిలో ఉంటే ఈ జాతకులు చాలా లుబ్ధులుగా ఉంటారు. ధన విషయంలోకాని లేక మరేదైనా ధన సంబంధమైన లావాదేవీలలో నిక్కచ్చిగాను, కఠినంగాను ఉండి తన స్వలాభానికి ప్రతి నిముషం అంచనా వేసుకొంటారు. శరీరం మోటుగా ఉంటుంది. మాటలో కరకుదనం, పెళుసుదనం స్పష్టంగా కాన వస్తాయి. కోపాధారిగా ఉంటారు. సమయ సందర్భములు కలిసి వచ్చినపుడు తమ స్వలాభం కోసం చౌర్యానికి మరియు మోసానికి వెనుకాడరు. న్యాయాన్యాయ విచక్షణం లేకుండా ధనార్జన కోసం తప్పుడు మార్గాలు అనుసరి స్తారు. వేశ్యా ప్రవృత్తి, పర స్త్రీ వాంఛ ఎక్కువగా ఉంటుంది. ఆధునికమైన విషయలోలత పోకడలు ఎక్కువ. ధనం విషయ లోలత పోకడలు ఎక్కువ. ధనం విషయంలో బంధుమిత్ర సోదరులతో కూడ విభేదాలు విద్వేషాలు పెంచుకొంటారు. ఎందుకంటే వీరికి ధనమే మూలం.

## చంద్రుడు ధనూ రాశిలో ఉంటే :

ఈ జాతకులు సహజంగా ఆకారంలో పొట్టిగా ఉంటారు. కాళ్లు చేతులు లావుగాను బలంగాను పొట్టిగాను ఉంటాయి. వీరి అరచేతులు చాల మందంగాను చిన్నవిగాను ఉంటాయి. చేతి వేళ్లు చాల పొట్టిగా లావుగా ఉంటాయి. వీరు చాల స్వలాభపరులు మాటలో తియ్యదనం చేతల్లో లేమితనం ఉంటుంది. అందరిని నమ్మినట్లుగా ఉండి కాని ఎవ్వరిని నమ్మరు. వీరు అందరితోను సఖ్యతగా మెలగలేరు

ఎవరికి ఉపకారం చేయరు ఎవరిని నమ్మరు. చంద్రుడు మకరంలో ఉంటే ఈ జాతకులకు మంచి కళాతృష్ణ ఉంటుంది. సంగీత వాయిద్యాల మీద ఎక్కువ ఇష్టత అనురక్తి ఉంటుంది. భాషాభిమానం మెండు. కుల సంప్రదాయాలను ఎక్కువగా మన్నిస్తారు. ధర్మాన్ని న్యాయాన్ని తమ దృష్టిలో ఉంచుకొని ఏ కార్యమునైనా చేస్తారు. ఎప్పుడూ కూడ ధర్మానికి వ్యతిరేకంగాను అనైతికంగాను ఏ పని చేయరు. మంచి పొదుగరిగా ఉంటారు. జీవితంలో ఎప్పుడూ కూడ విలాసాల జోలికి పోరు, ఆధునిక పోకడలు అంటే అయిష్టత కలిగి సంప్రదాయ సంస్కారాలను మాత్రమే పాటిస్తారు. తాము ఎంత సంపాదించినా సామాన్య జీవితమే గడుపుతారు. మంచి పేరు ప్రతిష్టలు గడిస్తారు. నాయకత్వ లక్షణాలు ఎక్కువగా ఉంటాయి.

**చంద్రుడు కుంభరాశిలో ఉంటే :**

ఈ జాతకులు వసుతహ చాల నీచమనస్కులుగాను సంకుచిత స్వభావం కలవారై యుంటారు. మత సాంప్రదాయాలను కుల సంస్కారాలను పాటించరు. దైవభక్తి లేకను మరియు పెద్దలయందును తల్లిదండ్రులయందును గురువులయందును గౌరవభావాలులేక వారిని కించపరుస్తూ మూర్ఖత్వంతో జీవిస్తారు. సామాజిక సంప్రదాయాలకు దూరమై మత్స్యమాంసాదులను భక్షిస్తూ, మద్యానికి దాసులై, జారత్వబుద్ధితోనీచస్త్రీసాంగత్యానికి బానిసలై హేయమైన జీవితం గడుపుతారు. అహంకారం అసూయ ద్వేషాలు కలిగి ఉండి ఈ జాతకు డంటే హేయభావం కలిగేటట్లుగా జీవితాన్ని గడుపుతారు. ధన సంపాదన బాగానే ఉంటుంది. కాని ఆ ధనాన్ని వేశ్యల పాలు చేసి వృద్ధాప్యంలో మానసిక క్షోభ అనుభవిస్తారు. ఎందుకంటే జీవితంలో ఎవరితోను సత్సంబంధాలు లేక ఎవరికి ఏ మాత్రమైన స్వల్ప ఉపకారం చేయక పోగా హాని చేసే మనస్తత్వం కలిగి ఉంటారు. అందువల్ల వీరు భార్యబిడ్డల ప్రేమ కోల్పోవడమే గాక అంత్య జీవితంలో రుగ్మతకు లోనై ఎవరి సేవలు పొందక పశ్చాత్తా పంతో మరణిస్తాడు. వీరికి ధనంగాని, విద్యగాని, బంధుమిత్రుల ప్రేమగాని, అంత్య సమయంలో అక్కరకురావు.

**చంద్రుడు మీన రాశిలో ఉంటే :**

ఈ జాతకులకు బాల్యం నుంచే విద్యాసక్తి మెండుగా ఉంటుంది. ఏ విద్యలో అయినా శ్రద్ధా భక్తులతో అభ్యసిస్తారు. తమ విద్యలో తెలివితేటలను చూపి మంచి

విద్యార్థిగాగుర్తింపు పొందుతారు.మంచి శాస్త్రాభిమానం.ఏ శాస్త్రమునైనా సరే అకుంఠిత దీక్షతోఅభ్యసించి శాస్త్ర పరిజ్ఞానాన్ని పొంది మంచి విద్యావేత్తలుగా రాణిస్తారు. మంచి ఆకర్షణ ఎపుడూ చిరునవ్వుతోనే ఉంటారు. వీరి మాటతీరు చాల మృదువుగాను సానుకూలంగా ఉంటుంది. లలిత కళలందు ఆసక్తి ఎక్కువ జీవితంలో ఎప్పుడైన సరే మంచి పనులు చేయడానికి వెనుకాడరు. ఎపుడు అందరికి సహాయకారులుగా ఉంటారు. దాంపత్య జీవితంలో వీరి పాత్ర అన్ని అంశాల్లోను తలమానికంగా ఉంటుంది. అంటే ధనార్జనలోను, సంతాన పెంపకంలోను, బంధు మిత్రులకు సహాయ సహకారాలు అందించుటలోను వీరు ఎక్కువ ఆసక్తి కనబరుస్తారు.

ఇంతవరకు మనం ద్వాదశభావాల్లో చంద్రుడు ఉంటే ఫలితాలు ఎలా ఉంటాయో నేర్చుకొన్నాం. అలాగే మనం ఇప్పుడు కుజుడు ద్వాదశభావాల్లో ఉన్నప్పుడు ఎలాంటి ఫలితాలు ఇస్తాడో తెలుసుకొందాము.

**కుజుడు మేషరాశిలో ఉంటే :**

ఈ జాతకులు ముఖంలో మంచి వర్చస్సు ఉంటుంది. ముఖంలో తేజస్సు స్పష్టంగా కనబడుతుంది. వీరి మాటలలోగాని చేతలలో గాని వారి అకుంఠిత కార్య దీక్ష, మరియు పట్టుదల స్పష్టంగా కనిపిస్తూ ఉంటాయి. ధైర్య సాహసాలు ఎక్కువ. ఏ కార్యమును తలపెట్టినా మధ్యలో ఎన్ని అడ్డంకులు వచ్చినా అధైర్యం చెందక స్వయం కృషితో ఆ కార్యాన్ని విజయ వంతంగా పూర్తి చేస్తారు. స్నేహితులందరిలోను ముఖ్యవ్యక్తిగా మెలుగుతాడు. నాయకత్వ లక్షణాలు కలిగి ఉంటాడు. శత్రుత్వం కలిగినపుడు ఆ శత్రువులను క్షమించక ప్రతీకారం తీర్చుకొంటారు. స్త్రీ వాంఛ ఎక్కువ. కొంతమందికి పరాయి స్త్రీలతో అక్రమ సంబంధాలు ఉంటాయి. వీరు ఎట్టి పరిస్థితుల లోను ఎవరు ఊహించలేనంత రహస్యంగా ఆ అక్రమ సంబంధాన్ని కొనసాగిస్తారు.

**కుజుడు వృషభరాశిలో ఉంటే :**

ఈ జాతకులకు ధన లోపం ఎక్కువగా ఉంటుంది. ఎంత సంపాదించినా వీరికి ఆ సంపాదనకు తగినంత వ్యయం ఎప్పుడు కనపడుతూ ఉంటుంది. ఒకవేళ శ్రమపడి సంపాదించి నిల్వ చేసినా అలా కూడబెట్టిన ధనం అనుకోని ఆకస్మిక వ్యయాలు ఎదురై ఆ ధనమంతా హరించిపోతుంది. పెద్దలు ఇచ్చిన భూ స్థిరాస్థులు

ఉన్నా దాని వల్ల ఎక్కువ ఆదాయం ఉండదు. కాని వారి జీవిత గమనంలో ఇలా వచ్చిన స్థిరాస్థి వల్ల ధన లోపం నుంచి కొంచెం ఊరట కలుగుతుంది. వీరికి సంగీత సాహిత్యములందు ఎక్కువ మక్కువ. వాయిద్య పరికరాలు అంటే మోజు చూపుతారు. కళాకారులను అభిమానించి గౌరవిస్తారు. వారికి ఎవరైనా హాని చేస్తే దానిని ఎన్నడు మరువక మరల సమయం వచ్చినపుడు ప్రతీకారం తీర్చుకొంటారు. ఆ సమయంలో కఠినంగా ఉండి తన ప్రతీకార వాంఛ తీర్చుకోవడానికి నిర్దాక్షిణ్యంగా తమ పగ సాధిస్తారు. బంధువులతో గాని శత్రువులతో గాని కూడ ఇదే విధంగా పగ సాధిస్తారు. అంటే తమ పగ తీర్చుకోవడానికి తమ తర భేదం పాటించకుండా కఠినంగా వ్యవహరిస్తారు. తన సోదరుడైనా దుర్యోధనుని మీద భీముడు ప్రతీకారవాంఛతో రగిలిపోయి దర్యోధనుని నిర్దాక్షిణ్యంగా సంహరిస్తాడు. అంటే అంత ప్రతీకార వాంఛ ఈ జాతకులకు ఉంటుందని మనం గ్రహించాలి. సమయం వచ్చినప్పుడు తమ పగ తప్పక సాధించుకుంటారు.

### కుజుడు మిథునంలో ఉంటే :

ఈ జాతకులకు ఉన్నత విద్య ఉంటుంది. విద్యార్జనలో చక్కటి కృషి చేసి విద్యను ఉత్తమ మార్గాలో నేర్చుకొని ఆ విద్య వల్ల సంఘంలో ఒక గుర్తింపు తెచ్చుకుంటారు. మంచి శాస్త్ర పరిజ్ఞానం కలిగి ఉంటారు. ముఖంలో స్త్రీలను ఆకర్షించేటట్లుగా ముఖ సౌందర్యం కలిగి ఉంటారు. అందువల్ల స్త్రీలకు ఇష్టులుగా ఉంటారు. స్త్రీ పరిచయం ఎక్కువగా ఉండుట వల్ల వారితో మంచి స్నేహసఖ్యతలు ఉండుట వల్ల వీరు స్త్రీ పక్షపాతిగా వ్యవహరిస్తారు. అనేక శాస్త్రాంశాల మీద రచనా వ్యాసాంగాలను వ్రాసి తమ శాస్త్ర పరిజ్ఞానమును పదిమందికి పంచుతారు. ఏదైన ఒక శాస్త్రంలో నిష్ణాతతను సాధించి ఆ శాస్త్రం మీద ఒక కావ్యం వ్రాయుటగాని ఆ శాస్త్రములోని పండితులు వ్రాసిన గొప్ప కావ్యములకు భాష్యం చెప్పుటగాని చేయగలరు. వీరికి మాతృదేశాభిమానం మెండు. వ్యాపార రీత్యాగాని మరే విధంగాని, వృత్తిపరంగా గాని వీరు దూర దేశాలలో స్థిరపడినా, మాతృదేశాన్ని మాత్రం మఱచిపోరు. మంచి కార్యదర్శకులుగా ఉండి తమ కార్య సాధనలో అందరితోను అనుకూలంగా వ్యవహరించి తమ కార్యాన్ని పూర్తిగా సఫలం చేసుకొంటారు. వీరికి అందమైన సంసార జీవితం ఉంటుంది. భార్యాభర్తల మధ్య సరాగ అనురాగాలతో సంతోషకరమైన జీవితం ఉంటుంది. వీరికి ధనం, ఆస్తిపాస్తులకు లోటు ఉండదు.

**కుజుడు కర్కాటకంలో ఉంటే :**

ఈ జాతకులు జీవిత పర్యంతం కష్టజీవులుగానే ఉంటారు. ఏ పని గూడ వీరికి సులభంగాకలిసిరాదు. ప్రతిపనిని కష్టపడి సాధించవలసిందేగాని సునాయాసంగా ఏమి లభించదు. వీరికి ఎక్కువభోజనప్రియత్వం ఉంటుంది. మాంసాహారులైతే అనేక రకాల జంతువుల పక్షుల మరియుజలచరాల మాంసమంటే పరమప్రీతికరం. మాంసం లేని ఆహారంఎంత రుచికరమైనా వీరికి నచ్చదు. వీరి జీవిత భాగస్వామి ఎంత తెలివైన వారైన వారి సలహాలను పాటించక తరువాత వచ్చేదుష్ఫలితాల వల్ల వేదనతో జీవిస్తారు. జీవితంలో అభివృద్ధి లేక ఒక నిర్దుష్టమైన ప్రణాళిక లేక జీవితమంతా తాత్కాలిక బుద్ధితో వివేక శూన్యులై ఒడుదుడు కులకు లోనవుతారు. తాత్కాలిక బుద్ధి వల్ల 'రేపు' అనే ఆలోచన లేక ధనవ్యయం చేస్తారు.

**కుజుడు సింహరాశిలో ఉంటే :**

వీరు కోపిష్టులుగా ఉంటారు. అహం, పౌరుషం ఎక్కువగా ఉంటాయి. మిత్రులను మరియు బంధువులను తమ వాచాలత్వం చేత కించపరుస్తూ మొండితనం, పట్టుదల కలిగి ఆత్మస్తుతి,పరనిందతో జీవిస్తారు. తమ స్వజనులతో కూడ కలహించి కోపోవేశాలకులోనై విరోధభావం పెంచుకొంటారు. మాంసభక్షణ యందు మంచి అభిరుచి కలిగి ఉంటారు. అసహనం, అసూయ వీరికి ఎక్కువ. పుత్రసంతానం కలిగి పుత్రుల వల్ల వృద్ధాప్యంలో సేవాసుఖాలు పొందుతారు.

**కుజుడు కన్యారాశిలో ఉంటే :**

వీరికి ధర్మనిరతి కలిగి దైవ చింతన కలిగి ఉంటారు. సున్నిత మనస్కులై మృదు స్వభావులుగా ఉంటారు. వీరికి మంచి ఆరోగ్యం ఉన్నా శరీర దారుఢ్యం ఉండదు. వీరు మృదువుగాను కోమలంగా ఉంటారు. మంచి ధనాదాయం కలిగి ఐశ్వర్యవంతులుగా ఉంటారు. సభాగౌరవం పొందుతూ పండిత పామరులచేత పూజలు అందుకొంటూ మానసికరీత్యా ఎక్కువ ధైర్య సాహసములు చేయలేరు. ఏ పనికైనా ముందుగానే లోతుగా ఆలోచిస్తారు. పిరకితనం ఎక్కువ వున్నా పట్టుదలకు మరియు కార్యసాధనకు లోపం ఉండదు.

కుజుడు కనక, తులా రాశిలో ఉంటే ఆ జాతకులకు ఏదైనా అంగవైకల్యం కాని, లేక శారీరక చిన్న లోపం ఉండవచ్చు. కానీ అది బహిర్గతం కాదు. ఉదాహరణకు ముద్దమాట, నత్తి, చేతులు పొట్టిగా ఉండుట, అలాగే దొడ్డి కాళ్ళుగా ఉంటాయి. నడుస్తూ ఉంటే రెండు మోకాళ్ళు ఒకటికి ఒకటి తగులుతూ ఉంటాయి. మంచి మనస్కులు, బుద్ధిమంతులు మిక్కిలి పరోపకారులుగా ఉంటారు. బంధువులతోను, మిత్రులతోనూ కలిసి మెలిసి ఉండి వారందరిలో మంచివాడనే పేరు సంపాదిస్తారు. వీరికి పరస్త్రీ వ్యామోహం ఎక్కువగా ఉంటుంది. అక్రమ సంబంధాలకు వెనుకాడరు. వేశ్యా వాటికలందు ఉత్సాహం చూపుతారు.

**కుజుడు వృశ్చికరాశిలో ఉంటే :**

వీరికి వ్యాపారదక్షత ఎక్కువగా ఉంటుంది. ఏ వ్యాపారంలోనైనా సరే వీరికి ఎక్కువ ఆదాయం వస్తుంది. ఎందుకంటే వీరి వ్యాపార సరళి ఉత్తమంగాను, సులభమార్గాన, ఎక్కువ లాభం గడించే చాకచక్యం ఉంటుంది. తమ వ్యాపార వ్యవహారములలో లాభనష్టా బేరీజు వేసుకోవటంలో వీరికి వీరే సాటి. సాధారణంగా అసత్యం చెప్పే లక్షణం వీరికి వుండదు. కానీ చట్ట వ్యతిరేక వ్యాపారాలు చేసి ధనమార్జిస్తారు. స్త్రీలందు ఎక్కువ ఆశ ఉంటుంది. కుజుడు కనుక ధనస్సులో ఉంటే వీరికి మంచి శరీరదారుఢ్యం ఉన్నా, అనారోగ్యంతో బాధపడతారు. తీవ్రమైన రుగ్మతలు లేక పోయినా తరచు ఏదో ఒక అనారోగ్యం కలగటం వల్ల బాధపడుతూ ఉంటారు. అదేకాక వీరు, చిన్న చిన్న ప్రమాదాల వల్ల గాయపడుతూ ఉంటారు. సేవా ధర్మం కలిగి పరులకు ఉపకారం చేస్తారు. వీరి సంభాషణలలో ఎక్కువ అహం, గర్వం తొణికిసలాడుతూ వుంటాయి. వీరు పైకి ఎంతో డాంబికంగాను మరియు దర్పంగాను వున్నా, వేరొకరి దయా ధర్మాల మీద ఆధారపడి జీవనం సాగిస్తారు.

**కుజుడు కనుక మకరంలో ఉంటే :**

ఈ జాతకులకు అత్యుత్తమమైన విద్యా జ్ఞానం కలిగి గొప్పగా ధనం ఆర్జిస్తారు. వీరికీ కార్యసాధనలో మంచి నేర్పు ఉంటుంది. సమయా సమయాలను చక్కగా ఆకళింపు చేసుకొని దానికి అనుకూలంగా ఆలోచించి అనుకున్నవన్నీ సాధించి సుఖమైన భోగ జీవితం గడుపుతారు. జీవనస్రవంతిలోని సత్యాసత్యాలను అవగాహన చేసుకొనే

నేర్పు వీరికి ఉంటుంది. వీరికి మంచి మనస్సు మరియు దైవచింతన కలిగి ఎపుడూ ధర్మపథంలోనే నడుస్తారు. శీలవంతులుగా ఉండి బంధుమిత్రులలో నమ్మకమైన వ్యక్తిగా పేరు తెచ్చుకుంటారు.

**కుజుడు కుంభంలో ఉంటే :**

ఈ జాతకులు కోపిష్టులుగాను, మూర్ఖులుగాను ఉంటారు. వివేకశూన్యులై, వితండ వాదన చేస్తూ లోక విచక్షణ జ్ఞానం లేకుండా మొఱటు ఆలోచనలతో మొండిగా వుంటారు. తాను పట్టిన కుందేటికి మూడే కాళ్ళు అనే మనస్తత్వం వీరికి వుంటుంది. వీరు మతాచారాలను గానీ, కుల సాంప్రదాయాలనుకానీ పాటించక ఆచారవిహీనులై జీవిస్తుంటారు. ప్రజలందరకు అయిష్టులుగా ఉండి వారి వద్ద నుంచి సహాయసహకారాలను పొందక దుఃఖమయ జీవితం గడుపుతారు.

**కుజుడు మీన రాశిలో ఉంటే :**

ఈ జాతకులకు మంచి ఆరోగ్యం ఉండకపోవచ్చు. తరచు ఏదో విధమైన శారీరక రుగ్మతతో బాధపడుతు ఉంటారు. వీరికి పుత్ర సంతానం లేకపోవచ్చు. చూపరులకు అందవిహీనంగాను, మొరటుగాను ఉండి ఆకర్షణ విహీనంగా కనపడతారు. అంటే వీరిని అందవిహీనులుగా చెప్పవచ్చు. మాతృదేశం వదలి విదేశాలలో తనకంటే కులంలోను, గోత్రంలోను ఆచార వ్యవహారాలు మరియు సాంప్రదాయాలలో హీనంగా ఉన్న వారి చేతి క్రింద ఉద్యోగం చేస్తూ వారి దయా ధర్మ భిక్ష తీసుకొని బంధుమిత్రులకు మరియు తల్లిదండ్రులకు, స్వజనాలకు దూరంగా ఉంటూ, అనాథగా జీవిస్తూ ఆ జీవితమే ఎంతో ఉత్తమమనే భ్రమలో ఉండి తాము గొప్పవారమనే భావన కలిగి ఉంటారు. కానీ మానసిక ఒత్తిడి, ఆందోళన ఉండటమే కాక అభద్రతా భావనతో జీవితం గడుపుతూ ఉంటారు.

## బుధుడు

ఇంతవరకు మనం కుజుడు ద్వాదశరాశులలో ఉంటే ఏ ఫలితం ఉంటుందో నేర్చుకొన్నాం. అలాగే ఇప్పుడు బుధుడు ఏ రాశిలో ఉంటే ఏ ఫలితం యిస్తాడో విపులంగా చర్చించుకుందాము.

## బుధుడు మేషరాశిలో ఉంటే :

సాధారణంగా ఈ జాతకులు చాల ఆకర్షణీయంగాను చూపరులు మెచ్చుకొనే అందం ఉంటుంది. కన్ను ముక్కు తీరు ముఖంలో చక్కగా తీర్చిదిద్దినట్లు ఉంటాయి. స్త్రీలను చూడగానే ఎవరైనా సరే ఆకర్షితులవుతారు. ఈ జాతకులకు మంచి ఉన్నత విద్య ఉంటుంది. వీరి విద్యాభ్యాసం ఒడుదుడుకులు లేకుండా ఉన్నత స్థాయిలో సాగిపోతూ ఉన్నత శ్రేణి ఫలితాలు పొందుతారు. విద్యాభ్యాసంలో ఏకసంథా గ్రాహులుగా ఉంటారు. వీరికి మంచి శాస్త్ర పరిజ్ఞానం కలిగి తెలివైన వారుగా శోభిల్లుతారు. కాని తమ కార్యసాధన కోసం అసత్యం పల్కడానికిగాని మోసం చేయడానికి గాని వెనుకాడరు. లలిత కళలంటే ఎక్కువ మక్కువ చూపుతారు. సంగీతం అంటే సంగీత వాయిద్యాలంటే కూడ ఇష్టులుగా ఉంటారు. వీరు ఎక్కువ స్త్రీ వాంఛ పరులుగా ఉంటారు. అందువల్ల ఎక్కువగా స్త్రీలతో రతిలో పాల్గొనడం వల్ల శుష్కించిన శరీరంతోను అనారోగ్యంతోను బాధపడతారు. ధన సంపాదన విషయంలో స్వలాభ పరాయణత్వం ఉంటుంది. జీవితంలో అన్ని విషయాలలో వ్యాపార సరళిలో ఆలోచించి తమకు వచ్చే లాభనష్టాలు బేరీజు చేసుకొని తదనుగుణంగా నిర్ణయాలు తీసుకొంటారు. తమకు ఏమి ప్రయోజనకారిగా వుండని విషయం అయితే ఎవరికి సహాయం చెయ్యరు.

## బుధుడు వృషభరాశిలో ఉంటే :

ఈ జాతకులకు మంచి పాండిత్యం గ్రంథరచనాశక్తి, శాస్త్ర పరిజ్ఞానం ఉంటుంది. ఉన్నత విద్యలో రాణిస్తారు. మంచి వాక్పటిమ కలిగి తమ వాక్చాతుర్యంతో ఇతరులను మెప్పిస్తారు. తమ సంభాషణలలో హాస్య రసం తొణికిసలాడుతుంది. మంచి దృఢనిర్ణయం శక్తి కలిగి తమ కార్యసాధనలో నిమగ్నమై జయం పొందుతారు. బంధుమిత్రులకు మరియు పరిచయ వ్యక్తులకు కూడా స్వలాభాపేక్ష లేకుండ సహాయం చేస్తారు. దానశీలత కలిగి ఉంటారు. బుధుడు మిథునంలో ఉంటే ఈ జాతకులకు ఆధునిక పోకడలు ఎక్కువ. అలంకార ప్రియులుగా ఉంటారు. సాంప్రదాయికం కంటే నాగరికత అంటే ఎక్కువ ఉత్సాహం చూపుతారు. అంటే వీరు సాంప్రదాయ హద్దులను దాటి నాగరికతను పాటించడానికి ఇష్టం చూపుతారు. తమ ధనం ఎక్కువ అలంకార వస్తువులకు మరియు నాగరికమైన వస్త్రాలకు వినియోగిస్తారు.

అందరితోను అతి ప్రేమగా, వాత్సల్యంగాను స్నేహభావంతో మాట్లాడిన ఆ భావాలన్నీ తాత్కాలికమే. కాని హృదయ స్పందన రాదు. వీరికి వంశపారంపర్యంగా పెద్దల నుంచి నగ నాణ్యాలు ధనం, స్థిరాస్తి రావచ్చు. ఈ జాతకులకు స్త్రీ సంతానం ఎక్కువ ఉంటుంది. ఒక్కొక్కపుడు వారి సంభాషణ వల్ల వివాదాలకు లోనగుదురు. అంటే వ్యతిరేక భావాల్ని గూడ ముఖం మీదే విమర్శిస్తారు. అందువల్ల వివాదాలు వస్తూ ఉంటాయి.

**బుధుడు కర్కాటక రాశిలో ఉంటే :**

వీరికి మాతృదేశాభిమానం చాల తక్కువగా ఉంటుంది. అంటే పరదేశాల మీద వారి జీవన గతుల మీద ఎక్కువ అభిమానం పెంచుకొంటారు. విదేశయానం చేయడానికి లేక విదేశాలలో నివసించడానికి ఎక్కువ ప్రాధాన్యత చూపుతారు. సమయ సందర్భాలను బట్టి ప్రజ్ఞతో సంభాషించి ప్రతిభా పాటవంతో కార్యసాధన చేస్తారు. స్త్రీ పరిచయాలకు ఎక్కువ మోజు చూపుతారు. చిత్త చాంచల్యం ఎక్కువగా ఉంటుంది. వీరికి అసూయ ద్వేషాలు ఎక్కువగా ఉంటాయి. ఏ విషయాన్నైనా స్వార్ధచింతనతోను సంకుచిత స్వభావంతోను ఆలోచిస్తారు. ఎవరివద్ద నుండి అయినా తాము పొందిన సహాయం మరొకరికి చెప్పరు.

**బుధుడు సింహరాశిలో ఉంటే :**

ఈ జాతకులకు ఆవేశం ఎక్కువ ఆలోచన తక్కువగా ఉంటుంది. మందబుద్ధిగా ఉంటారు. ఇతరుల మాట వీరెన్నడు లెక్కచెయ్యరు. జ్ఞానశూన్యులుగా ఉండి విద్యా ప్రమాణాలలో రాణించలేక దిగువ శ్రేణిలో విద్య కలిగి ఉంటారు. కాని వీరికి మంచి మాట చతురత్వం ఉన్నా వారి సంభాషణంలో జ్ఞానపస ఉండదు. అంటే ఊకదంపుడు ఉపన్యాసంలాగ ఉంటుంది. వీరి సంభాషణలో మనం ఎంత వెతికినా అర్ధసత్యాలు కనపడవు. ఎందుకంటే అనుభవహీనత అసత్య దృఢత్వం ఎక్కువ ఉంటుంది. బుధుడు కన్యారాశిలో ఉంటే వీరికి జన్మతః మంచి గ్రహణ శక్తి మేధో సంపత్తు ఉంటుంది. ఇతరుల సంభాషణలోని అంతరార్థం ఇట్టే గ్రహిస్తారు. వీరికిజ్ఞాపకశక్తి ఎక్కువ. ఏ విషయాన్నైనా లేక ఏ సంఘటనైనా వరుస క్రమంలో గుర్తు ఉంటుంది. ఆ వివరాలన్ని యథాతథంగా పూస గ్రుచ్చినట్లు వరుస క్రమంలో వివరించగలరు. గణిత శాస్త్రమందు కొన్ని లేక గణిత సంబంధమైన ఖగోళ శాస్త్రం

మరియు భౌతిక శాస్త్రములాంటి శాస్త్రములందు వీరికి ప్రావీణ్యత ఉంటుంది. వీరికి మంచి వాక్చతురత కలిగి ఎంతటి కఠిన విషయాన్నైనా దారపు చిక్కుముడి విడదీసినట్లు విడమర్చి సరళరీతిలో చెప్పగలరు. బంధుమిత్రులలో మంచివారుగా పేరు సంపాదించుటయే కాక జనాకర్షణ కలిగి ఉంటారు. వీరికి మంచి సహన శీలత ఉంటుంది. సమయ సందర్భాలు లేకుండ అహంకారమునకులోనై తాత్కాలిక కోపోద్రేకాలకు లోనై ఇతరులను నిందించటం, దూషించటం లాంటి తొందరబాటు వీరికి ఉండదు. వీరికి ధర్మార్థ విచక్షణా జ్ఞానం కలిగి ఉదారులుగా ఉంటారు. క్షమాభిక్ష పెట్టుటలో వారి ఉదారత్వం తొణికిసలాడుతు ఉంటుంది.

## బుధుడు తులారాశిలో ఉంటే :

ఈ జాతకులకు న్యాయాన్యాయ వితరణ శక్తి ఎక్కువగా ఉంటుంది. లలిత కళలందు ఎక్కువ మక్కువ కలిగి కళాకారులను గౌరవిస్తారు. వారి యొక్క ధనాభావశక్తిని బట్టి కళలను కళాకారులను పోషిస్తారు. వీరికి పెద్దల యందు గౌరవం మరియు గురుభక్తి మెండు. ఉన్నత విద్యను అభ్యసిస్తారు. సంస్కృతి సంప్రదాయం, మరియు కులాచారా విలువలను ఎపుడు లక్ష్మణరేఖగా భావించిదానినిదాటరు. వీరికి మంచివాక్పటిమకలిగి సభాగౌరవం పొందుతారు.

## బుధుడు వృశ్చికరాశిలో ఉంటే :

ఈ జాతకులకు ఈ జాతకులు మందబుద్ధి మూర్ఖులు జ్ఞానశూన్యులై ఉంటారు. ఏ విద్యయందును ఉన్నత శ్రేణిని అధిరోహించజాలరు. ఒకవేళ విద్యనభ్యసించిన వారిలోని సంస్కార హీనత, మొండితనం,వారి సంభాషణంలో కనిపిస్తూనే ఉంటుంది. ఎందు కంటే తాము చెప్పేది తప్ప ఇతరులు చెప్పేదాన్ని అంతరార్థం గ్రహించే శక్తి వీరికి ఉండదు. కాబట్టి వారి మూర్ఖత బయలుపడుతూనే ఉంటుంది. ఎక్కువగా శరీర శ్రమచేసి ధన సంపాదన చేస్తారు. ధర్మవిరుద్ధమైన ధన సంపాదన చేసి ఆ ధనమదంతో పాపకర్మలు చేస్తు జీవిస్తారు.

## బుధుడు ధను రాశిలో ఉంటే :

ఈ జాతకులకు మంచి నియమనిష్టలు కలిగి మతాచారమందు కులాచార మందు విశ్వాసం ఉండి పెద్దలను గురువులను గౌరవిస్తూ దైవచింతన కలిగి ధర్మబద్ధంగా

జీవిస్తారు. వీరికి దైవశాస్త్రాలందు ఎక్కువ ప్రావీణ్యత ఉంటుంది. దైవ శాస్త్రములంటే వేదములు ఉపనిషత్తులు మరియు భారత భాగవతాల్లాంటి పవిత్ర గ్రంథాలను అభ్యసించి వాటిలో పాండిత్యాన్ని సంపాదిస్తారు. కులశ్రేష్టులుగా గౌరవింపబడతారు. విద్యాబోధయందు వీరికి మంచిప్రావీణ్యం ఉంటుంది. సభాపూజ్యత, రాజపూజ్యత లాంటి గౌరవాలు పొంది సమాజంలో గౌరవ ప్రతిష్టలు సంపాదిస్తారు. సహనశీలులు గాను ఉదార స్వభావులుగాను ఉంటారు.

## బుధుడు మకరంలో ఉంటే :

వీరు జీవితంలో ఊహల్లో జీవిస్తూ భావుకులుగా ఉంటారు. కార్యదక్షత తక్కువగా ఉంటుంది. ఏ కార్యం తలపెట్టినా ఆ కార్యాన్ని పూర్తిగా నెరవేర్చలేరు. విద్యావిహీనులుగా ఉండి మూర్ఖత్వంతో జీవితం గడుపుతారు. వీరు స్త్రీ ద్వేషులుగా ఉండి స్త్రీలకు అప్రియులుగా ఉంటారు. దాంపత్య జీవితంలో తన సతికి/పతికి తగినంత విలువ గౌరవం ఇవ్వక మూర్ఖమైన వితండవాదాలకు తరుచు తెరతీస్తూ ఉంటారు. ఈ జాతకులకు బహుశా సంతాన యోగ్యత ఉండకపోవచ్చు. ఒక ముఖ్య విషయం గమనించ తగ్గ విషయం ఏమంటే ఈ జాతకులకు లగ్న స్థానం నుండి పంచమ స్థానంలో రాహువు ఉండి ఆ పంచమ స్థానరాహువు మీద శని యొక్క సహజ లేక విశేష వీక్షణలు ఉంటే సంతానం ఉండదు. బహుశా స్త్రీఅయితే వంధ్యగాను, పురుషుడైతే నపుంసకుడుగాను ఉండడానికి అవకాశం ఉంది.

## బుధుడు కుంభరాశిలో ఉంటే :

ఈ జాతకులకు పరిశుభ్రత చాల తక్కువగా ఉంటుంది. వారు ధరించే వస్త్రాలు మురికిగాను రజక సామర్థ్యం చేయనివిగా ఉంటాయి. కేశ సంస్కారమందు వీరికి శ్రద్ధ ఉండదు. ముఖ ప్రక్షాళనం చేయక జిడ్డు ముఖంతో కనపడతారు. వీరి వస్తువులు కాని లేక పరుండే ప్రక్క బట్టలుగాని శుభ్రం లేక మాసిపోయి ముడతలు పడి ఉంటాయి. వీరికి తమకంటే తక్కువ తరగతి కులాల్లో ఉన్న వ్యక్తులతో ఎక్కువ సాంగత్యం ఉంటుంది. కులాచార సంప్రదాయాలు కట్టుబాటులు గౌరవించరు. బంధు మిత్రులతోను సమాజంతోను శతృత్వం తెచ్చుకొంటారు. వ్యర్థ సంభాషణ జుగుప్సాకరమైన భాషను ఎక్కువగా మాట్లాడుతారు. వీరి మాటల్లో సంస్కార విహీనత

సాంప్రదాయ హీనత కనబడుటయే కాక వారి భాషలో మృదుత్వం మధురిమ వినబడదు. వీరికి సత్కర్మలందు ఆసక్తి మెండు. వృద్ధాప్య సమయంలో ఎక్కువ దైవభక్తి, దైవపూజలు చేస్తూ ఆధ్యాత్మిక రసాన్ని గ్రోలుతారు.

**బుధుడు మీనరాశిలో ఉంటే :**

వీరికి విదేశయాన మోజు ఎక్కువగా ఉంటుంది. మాతృదేశాన్ని వదలి విదేశాలలో స్థిరపడడానికి ఎక్కువ ఆసక్తిని చూపుతారు. విదేశాలలో విద్యార్జన, ధనార్జన మరియు స్థిర నివాసం కలిగి ఉంటారు. సాధు స్వభావులుగా ఉండి సున్నితంగా మాట్లాడుతారు. విధేయత, విజ్ఞానం ఎక్కువగా కల్గి యుంటారు. ఉన్నత విద్య అభ్యసిస్తారు. మంచి విద్యావంతులుగా విలసిల్లుతారు. శాస్త్రములను పఠించి శాస్త్ర పరిజ్ఞానమును చక్కగా అవగాహన చేసుకొంటారు. విద్యావిషయాలలో ఇతరులకు మార్గదర్శకులు అవుతారు. మంచి బోధనా పటిమ ఉంటుంది.

ఇంతవరకు బుధుడు ఏ రాశిలో ఉంటే ఏయే ఫలితాలిస్తాడో నేర్చుకొన్నాము. ఇప్పుడ మిగిలిన గ్రహాలు కూడ ఏయే రాశులలో ఉంటే ఏయే ఫలితాలు ఇస్తారో తెలుసుకొందాం.

## గురువు

మనం ఈ అధ్యాయంలో గురువు ఏ రాశిలోఉంటే ఏఫలితం ఇస్తాడో తెలుసు కొందాం.

**గురువు మేషరాశిలో ఉంటే :**

ఈ జాతకులకు మంచి ఆరోగ్యం ఉంటుంది. ఎప్పుడూ కూడా అనారోగ్యంతో గాని లేక ఏదైనా అసాధ్య మొండి రోగములతోగాని బాధపడరు. ఒకవేళ ఏదైన రుగ్మత ఉంటే అది తాత్కాలికమేగాని దీర్ఘ కాల వ్యాధిగా ఉండి దేహబాధ అనుభవించరు. మంచి శారీరక దృఢత్వం బలం కలిగి ఉంటారు. జీవితంలో దరిద్రమనేది ఎరుగరు. ఎప్పుడు ధనలోపంతో బాధపడరు. ఐశ్వర్యవంతులుగా ఉండి నగలు, నాణ్యాలు, మణిమాణిక్యాల మరియు స్థిరాస్తులు కలిగి ఉంటారు. స్వయంగా ఆభరణాలు ధరించడానికి ఎక్కువ మక్కువ చూపుతారు. భోగ భాగ్యాలు

అనుభవిస్తారు. కాని వీరికున్న ధనధాన్యాల వల్ల ఐశ్వర్యం వల్ల గర్విష్టులై తమ జీవన ప్రవంతిలో ఉదారత కోల్పోతారు. భార్య పిల్లలు చక్కటి సుఖం ఆనందంతో జీవిస్తారు.

## గురువు వృషభంలో ఉంటే :

ఈ జాతకులు చాల సుందరమైన ముఖాకృతి కలిగి చూపరులకు ఆకర్షణీయంగా కనబడతారు. మంచి శరీరచ్ఛాయ కలిగి దేహదారుఢ్యంతో ఆరోగ్యంగాను బలంగాను ఉంటారు. కులాచార మతాచార సాంప్రదాయ సంస్కృతులను గౌరవిస్తూ వాటి నియమాలను తప్పక పాటిస్తారు. జ్ఞానంలోను విజ్ఞానంలోను ప్రతిభ కల్గి నిజ జీవితంలో నిర్ణయాలు తీసుకొనునపుడు ధర్మాధర్మ అంశాలను పరిగణలోనికి తీసుకొన్న తరువాతనే ఒక నిర్ణయానికి వస్తారు. వీరికి ఇతరుల యొక్క మనోభావాలను మరియు వారిలోని అంతర్గత మనస్తత్వాలను గ్రహించగలరు. దైవభక్తి కలిగి మతాధిపతులను దైవశాస్త్ర పండితులను గౌరవిస్తారు. సంగీత సాహిత్యములందు మరియు సాంస్కృతిక కార్యములందు ఎక్కువ ఉత్సాహం చూపుతారు. సాధారణంగా వృషభరాశి జాతకులకు తమ జీవిత భాగస్వామితో సత్సంబంధాలు కలిగి దాంపత్య జీవితంలో అన్ని విధాల సంతృప్తి చెంది సంతోషమయ మైన జీవితం గడుపుతారు. ఏదో ఒక శాస్త్రంలో తప్పకుండా మంచి ప్రతిభ కలిగి, ప్రావీణ్యతను సంపాదిస్తారు.

## గురువు మిథునరాశిలో ఉంటే :

ఈ జాతకులు బాల్యం నుంచే విద్యలో ఉత్సాహం కనబరుస్తారు. విద్యార్జనలో అందరికంటే ఎక్కువ ప్రతిభను కనబరిచి గురువుల మన్ననలను పొందుతారు. విద్యాభ్యాసంలో ఎపుడు అపజయం ఉండదు. మంచి సృజనాశక్తి కలిగి రచనా వ్యాసంగాలు చేస్తారు. బంధుమిత్రులలో మంచి ఉన్నతమైన వ్యక్తిగా గౌరవింపబడతారు. సంపన్నులుగా ఉండి భోగభాగ్యాలు అనుభవిస్తారు. జీవితంలో వీరికి ఎపుడూ ఆర్థిక ఇబ్బందులు చవి చూడరు. పెద్దల యెడ గౌరవం కలిగి పండితపూజ చేసి సభాముఖంగా వారికి గౌరవ ప్రతిష్టలను ఇనుమడింప చేసుకుంటారు. వీరు సమాజంలో మంచి పేరు ప్రతిష్టలు సంపాదిస్తారు.

**గురువు కర్కాటక రాశిలో ఉంటే :**

ఈ జాతకులు ఉన్నత విద్య కలిగి యోగ్యులుగా ఉంటారు. ఉద్యోగంలో ఉన్నత పదవి పొందుతారు. వీరికి లోక విచక్షణాజ్ఞానం విజ్ఞత ఎక్కువ, పరోపకారులుగా ఉండి ఎవరికైనా మేలు చేస్తారు. సమాజంలో ఉన్నత వ్యక్తిగా పేరొంది అందరిచేత గౌరవింపబడుతూ అందరికి ఇష్టుడుగా ఉంటాడు.

**గురువు సింహరాశిలో ఉంటే :**

ఈ జాతకులను మూర్ఖులుగా చెప్పవచ్చు. ఎందుకంటే వారుచెప్పినదేవేదమని వితండ వాదమునకు సిద్ధపడతారు. ఎవరి సలహాలను తీసుకోక వారి అభిప్రాయాలను గౌరవించక తమ నిర్ణయమే సరియైనది అని వాదిస్తారు. వీరికి పట్టుదల ఎక్కువ వీరు అందరితోనువిరోధ మును పెంచుకొంటారు. అత్యంత స్వార్థపరులుగా ఉండి కోపోద్రికాలకు లోనవుతారు.పగ, ప్రతీకార వాంఛ వీరికి ఎక్కువ. ఒక్కొక్కపుడు దయాహీనంగాను క్రూరవైఖరి అవలంభిస్తారు.

**గురువు కన్యారాశిలో ఉంటే :**

వీరు మంచి రూపం కల్గి ఆకర్షణీయంగా ఉంటారు. ఎక్కువ అలంకార ప్రియత్వం ఉంటుంది. ఆశ ఎక్కువగా ఉంటుంది. కొంచెం అసూయా ద్వేషాలు ఉంటాయి. భోగలాలసత మీద ఎక్కువ వాంఛ కలిగి అవకాశం వచ్చినపుడు తమ వాంఛను నెరవేర్చుకొంటారు. సాత్వికంగాను మరియు మృదువైన లేక శరీరం కలిగి శ్రమకోర్చి పనులు చేయలేరు. మేధో సంపత్తు కలిగి భాగస్వామికి మంచి సలహాలు అవసర కాలంలో ఇయ్యగలరు. సదాచార పరాయణులై ధర్మాన్ని పాటిస్తారు. తన సంతానం మీద భార్య మీద ఎక్కువ వాత్సల్యాన్ని చూపుతారు. స్త్రీగాని, పురుషుడుగాని తన దేహధర్మం చక్కగా నిర్వహిస్తాడు.

**గురువు తులారాశిలో ఉంటే :**

ఈ జాతకులకు లలిత కళలందు ఎక్కువ మక్కువ. లలిత కళలందు పట్టు సాధించిన పస ఉన్న కళాకారులంటే చాలగౌరవంఅభిమానంఉంటుంది.వారికి అన్ని సహాయ సహకారాలు అందిస్తారు. స్వయంగా వీరికి ఏదైనా ఒక లలిత కళయందు

మంచి ప్రావీణ్యం ఉంటుంది.సంగీత వాయిద్యాల మీద బహుశా ఎక్కువ శ్రద్ధకనపఱిచి ఆ వాయిద్యం మీద మంచి నైపుణ్యం సంపాదిస్తారు. మతాచారములందు మరియు పీఠాధిపతుల యందు ఎక్కువ భక్తి శ్రద్ధలు కలిగి ఉంటారు. వీరికి స్త్రీలను ఆకర్షించే శక్తి ఎక్కువగా ఉంటుంది. అందువల్ల బహు స్త్రీ సాంగత్యం ఉంటుంది. కాని నీచస్త్రీ సాంగత్యానికి దిగజారరు. పైగా వావి వరుసలు కులగోత్రాలను నిర్లక్ష్యం చేయక వేశ్యాసాంగత్యానికి గాని లేక వివాహితులతోగాని ఏ విధమైన సంపర్కానికి లోబడే మనస్తత్వం వీరికి ఉండదు. జీవితంలో ఎన్నడు ధనలోపం ఉండదు. మంచి సంతానం కలిగి ఉంటారు. సంతాన సౌఖ్యం వారి వల్ల వచ్చే గౌరవాభి మానాలు పొందుతారు. వీరికి శిష్యులు మరియు అభిమానించే మిత్రులు ఎక్కువగా ఉంటారు. సమాజంలో మంచిపేరు ప్రఖ్యాతులు సంపాదించుకొంటారు. న్యాయ విచక్షణా జ్ఞానం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల వీరు ఇచ్చే న్యాయ విశ్లేషణ ఎన్నడూ విమర్శలకు లోనుకాదు.

## గురువు వృశ్చిక రాశిలో ఉంటే :

వీరికి ప్రజాబాహుళ్యాన్ని ఒక క్రమపద్ధతిలో నడిపించి తమ కార్యాన్ని సాధించే నాయక లక్షణాలు ఉంటాయి. రాజకీయ చతురతలో చాణుక్యుని వంటివారు. పేరుప్రఖ్యాతుల కోసం దానాలు ధర్మాలు చేసి కళాకారులను సత్కరిస్తారు. జీవితంలో ఎక్కువ అనారోగ్యంతో బాధపడతారు. సంతాన సుఖం ఉండదు. లేక సంతానమే ఉండకపోవచ్చు. ఉన్నా, స్త్రీ సంతానమే కలిగి పురుష సంతానం లేకపోవచ్చు.

## గురువు ధను రాశిలో ఉంటే :

ఈ రాశిలో జన్మించినవారు సద్గుణ సంపన్నులు సత్ప్రవర్తన కలవారై సభాగౌరవం సభాపూజ్యత పొందుతారు. మంచి ఉన్నత విద్యకలవారై తమ వృత్తిలో రాణిస్తారు. ప్రజలకు మార్గదర్శకంగా ఉంటారు.బంధుమిత్రులలో మంచి వ్యక్తిగా పేరు తెచ్చుకొంటారు. విదేశాలకు యానం చేసి అక్కడ తమ ప్రతిభాపాటవాలు ప్రదర్శించి పేరు ప్రఖ్యాతులు సంపాదిస్తారు.

## గురువు మకర రాశిలో ఉంటే :

ఈ జాతకులు ఎప్పుడు నమ్మదగ్గ వ్యక్తులు కారు. మోసం ద్రోహచింతన ఎక్కువ. మనసునిండాక్రౌర్యందుర్మార్గపుఆలోచనలుఉండితమస్వార్థంకోసందౌర్జన్యంగా

ప్రవర్తిస్తారు. వారి సంభాషణలో మూర్ఖత్వం ఎక్కువ పాలు కనిపిస్తుంది. విద్యావిహీనులుగా ఉండి విద్వత్ శ్రేణిని గౌరవింపక వారిని హేయంగా విమర్శిస్తారు. కులాచార మత సంప్రదాయా లను తుంగలో త్రొక్కి భ్రష్ట జీవితం గడుపుతారు. మాంసభక్షణ యందు చాల ఇష్టం కలిగి ఉంటారు.

## గురువు కుంభరాశిలో ఉంటే :

వీరు ఓర్పు కలిగి సహనశీలురుగా ఉంటారు. సాత్విక స్వభావం కలిగి దైవభక్తి, దర్మనిరతి కలిగి ఉంటారు. యజ్ఞయాగాదులు వ్రతాలు పూజాలు మొదలైన వాటియందు ముందు నిలబడి ఉత్సాహంగా పాల్గొని, ఆ శుభకార్యాలు దిగ్విజయంగా జరగడానికి తోడ్పడతారు. వీరికి అనారోగ్యబాధ ఎక్కువ. బహుశా అసాధ్య మొండి రుగ్మతలతో బాధపడతారు. తాత్కాలిక ఉపశమనమే తప్ప ఆ రుగ్మత వారిని విడిచిపోదు.

## గురువు మీనరాశిలో ఉంటే :

ఈ జాతకులకు ఏ విద్యయందైనా ప్రావీణ్యత ఉంటుంది. విద్యాసక్తులై ఉన్నతశ్రేణి విద్యనుఅభ్యసించి తమ పదవిలో ఉన్నతాధికారాన్ని పొందుతారు. దైవశాస్త్రములందు ఇష్టత కలిగి వేదవేదాంగ పండితులు అవుతారు. పురాణ ఇతిహాసాలలోని సారాంశమును ప్రజలకు విప్పి చెప్పగల్గిన వాక్పటిమ మరియు నేర్పరితనం ఉంటుంది. మంచి వక్తలుగా ఉండి ధర్మోపదేశాలను ఆశువుగా వల్లించి సభాపూజ్యత అందుకొంటారు. భోగభాగ్యాలు అనుభవిస్తూ ధన సంపాదనలో ఎవరికి తీసిపోరు. ఏ కార్యక్రమమైనా తమ ప్రజ్ఞాప్రతిభలతో సాధించి ప్రజలకు మేలు చేస్తారు.

ఇంతవరకు ఏ గ్రహం ఏ రాశిలో ఉంటే ఏ ఫలితం ఇస్తాడో వివరంగా తెలుసుకొన్నాం. ఒక విషయం ఏమంటే ఏ గ్రహం ఏ రాశిలో ఉన్నా మౌలికంగా ఆ రాశి క్షేత్ర స్థితియొక్క ఫలితాన్ని కూడా  ఇస్తాడని మనం భావించాలి. మీరు ఈ అధ్యాయాన్ని మరోమారు చదివితే మీకు ఒక అవగాహన ఏర్పడుతుంది.

**ఉదా :** గురువు పుణ్యగ్రహమైనా, మకరరాశి క్షేత్రబలాన్ని గ్రహించి ఎక్కువ దుష్ఫ లితాలే ఇస్తాడని గ్రహించండి.

# శుక్రుడు

ఈ అధ్యాయంలో మనం శుక్రుడు ఏ రాశిలో ఉంటే ఎలాంటి ఫలితాన్ని ఇస్తాడో మనం క్షుణ్ణంగా నేర్చుకొందాం. శుక్రుడు పుణ్యగ్రహమైనా, సంయోగ స్థితి, క్షేత్రస్థితి మరియు వీక్షణస్థితి ఫలితాలు వస్తాయని మీరు మఱచిపోకూడదు. అంటే శుక్రుని వల్ల దుష్ఫలితాలు కూడ సంభవించవచ్చు. అలాగే కొందరికి శుభఫలితాన్నే ఇస్తాడు. మీరు ఈ క్రింది రాశులలో ఇచ్చిన శుక్రుని ఫలితాలు గమనిస్తే మీకు ఒక చక్కటి అవగాహన కల్గుతుంది. ఇపుడు మనం ఒక్కొక్కరాశిలో ఉన్న శుక్రుని ద్వాదశ భావాలను పరిశీలిద్దాం.

## శుక్రుడు మేషంలో ఉంటే :

ఈ జాతకులకు నేత్ర సంబంధమైన వ్యాధులు ఉండవచ్చు. రేచీకటి, వర్ణ అంధత్వం, పిల్లి కళ్లు లేక మెల్ల కన్ను, చిన్న వయసులోని హ్రస్వ, దీర్ఘ దృష్టి లోపాలు ఉంటాయి. నడివయసులో నేత్ర శుక్లములు తొలగించుట లేక మరే విధమైన అనారోగ్యం వల్ల నేత్ర శస్త్ర చికిత్స జరుగవచ్చును. వీరికి పటాలోపం డాంబికం ఉండి, మేకపోతు గాంభీర్యం చూపిస్తారు. కాని మనసా ధైర్యవంతులు కారు. అంటే మనో నిబ్బరం, మనో ధైర్యం ఉండవు. వితండవాదం మరియు మూర్ఖవాదం చేస్తూ ఉంటారు. వీరికి మిత్రులు తక్కువ మరియు శత్రువులు ఎక్కువ. స్వయంబుద్ధి కంటే పరబుద్ధిని ఆశ్రయిస్తూ అంటే ఇతరులను అనుకరిస్తారు. ఉన్నత విద్య ఉండినా, ఎక్కువ విద్యాసక్తి విద్యాభ్యాసంలో అత్యున్నత ప్రావీణ్యం కాని ప్రతిభాపాటవాలు గాని ఉండవు. వీరికి పరస్త్రీ వ్యామోహం, పరస్త్రీ వాంఛ ఎక్కువ. వీరి సంభాషణంలో దర్పం, డాంబికం కనపడుతూ ఉంటుంది మరియు ఆ సంభాషణలో ఎక్కువ అసత్య సంభాషణే ఉంటుంది. అనవసర ప్రసంగం చేసి తమ వాచాలత్వం ప్రదర్శించబోయి ఇతరుల దృష్టిలో వీరికున్న మూర్ఖ ప్రజ్ఞ తామే ప్రదర్శిస్తారు.

## శుక్రుడు వృషభరాశిలో ఉంటే :

ఈ జాతకులు సహజంగా సాధు స్వభావం కలవారుగా ఉంటారు. సహనం, ఓర్పు ఎక్కువగా ఉంటుంది. నెమ్మదస్తులుగా ఉంటారు. శ్రమకోర్చి వృత్తిలో రాణిస్తారు.

పరోపకారులుగా ఉంటారు. పరిశుభ్రత పాటిస్తూ అలంకార ప్రియులుగా ఉంటారు. మిత భాషులుగా ఉంటారు. వారి సంభాషణలో మంచి లోక విచక్షణా జ్ఞానం, జీవిత లక్ష్యం కనిపిస్తూఉంటాయి. ముఖ్యంగా కృత్తిక నక్షత్ర జాతకులైతే నాయక లక్షణాలు ఉండటమే కాక, లలిత కళలందు ఎక్కువ మక్కువ చూపుతారు. శాస్త్ర విజ్ఞానంలోగాని లేక సంగీత సాహిత్యాలలో గాని ఉత్సాహం చూపి ఆయా అంశాలలో ఉన్నత ప్రమాణాలు సాధిస్తారు.

**శుక్రుడు మిధునరాశిలో ఉంటే :**

వీరికి ఆలోచనాశక్తి మరియు ఇతరుల సంభాషణలోని ఆంతర్యాన్ని స్పష్టంగా పసికట్టగల చాకచక్యం, నేర్పు ఉంటాయి. ఉత్తమ విద్య మరియు ఉత్తమ శాస్త్ర పరిజ్ఞానం కలిగి ఉంటారు. సంగీత సాహిత్యాలలో గాని లలిత కళలలో గాని ఎక్కువ మక్కువ చూపుతారు. స్వయంగా వీరికి కళాపోషణ ఉంటుంది. కళాకారులను శాస్త్రవేత్తలను తగురీతిలో సత్కరించి వారి పట్ల తమకున్న అభిమానాన్ని చాటుకొంటారు. భోజన ప్రియులు పైగా విందు భోజనాన్ని ఎన్నడు వదలుకోరు. కొంచెం స్త్రీ వ్యసనం కూడ ఉండవచ్చు.

**శుక్రుడు కర్కాటక రాశిలో ఉంటే :**

ఈ జాతకులు మంచి రూపం మరియు ఆకర్షణ కలిగి ఉంటారు. కన్ను, ముక్కుతీరు, తీర్చి దిద్దినట్టుగా ఉండి గుండ్రని ముఖం కల్గి ఉంటారు. విద్యలోగాని లేక లలిత కళలందు గాని ఉత్తమశ్రేణి ప్రావీణ్యం సంపాదిస్తారు. ముఖ్యంగా సంగీతమందు లేక సంగీత వాయిద్యము లందు మంచి నేర్పు సంపాదించి కీర్తి ప్రతిష్టలు పొందుతారు. కాని వీరుతమ విద్యను ఆ విద్యలోని రహస్యములను శిష్యులకు బోధించక సాటి పండిత సహ కళాకారులను అహంభావంతో విమర్శిస్తారు. కాని తమ విద్యలోని ప్రావీణ్యత వల్ల వీరికి ఎదురు ఉండదు.

**శుక్రుడు సింహరాశిలో ఉంటే :**

ఈ జాతకులకు ఎప్పుడు మానసిక ఒత్తిడి, మనోవ్యాకులత మరియు ఆందోళనలతో బాధపడుతూ ఉంటారు. సరియైన నిర్ణయాలు సరిగా తీసుకోలేరు

సరికదా ఇతరులు ఇచ్చిన మంచి సలహాలను కూడ పాటించడానికి వీరి మనస్సు ఒప్పుకోదు. అంటే తమ నిర్ణయమే ఉదాత్తం మరియు లాభదాయకం అనే భ్రమలో జీవితాంతం గడిపేస్తారు. భార్య వల్ల ధనాదాయం స్థిరాస్తులు, సంపద వస్తుంది. చక్కటి దాంపత్య జీవితం గడుపుతారు. అలంకార ప్రియులుగాను భోగలాలసులు గాను ఉంటారు.

**శుక్రుడు కన్యారాశిలో ఉంటే :**

ఈ జాతకులకు సహజంగానే ఓర్పు సహనం ఉంటాయి. మోహమాటస్తుడు గాను , సాత్వికుడుగాను ఉంటారు. ఇతరులకు సహాయం చేయడానికి వెనుకాడరనే గాని తమ స్వలాభం అనే మాట మర్చిపోరు. చక్కటి నగిషి చెక్కటం చిత్రలేఖనం లాంటి కళలందు నేర్పు కలిగి ఉంటారు. సమాజంలో అందరితోను మిత్రత్వం కలిగి మెలగుతాడు. బిడియం ఎక్కువ.

**తులారాశిలో శుక్రుడు ఉంటే :**

ఈ జాతకులు స్వార్జితమైన సంపాదనయందు ఎక్కువ నమ్మకం కలిగి ఉంటారు. కష్టపడి ధర్మ సంపాదన చేస్తారు. మంచి వ్యాపార దక్షత కలిగి వ్యాపారంలో మిక్కిలి లాభాలు ఆర్జిస్తారు. కాని స్థిరమైన ఆలోచనలు లేక ఎక్కువ చపలచిత్తంతో ఉంటారు. కుల సాంప్రదాయా లను పాటిస్తూ బంధువులతోను, మిత్రులతోను సామరస్యంగా ఉంటారు. వీరికి దైవభక్తిమెండు. పూజ పునస్కార పుణ్యకార్యాలు చేస్తూ తీర్థయాత్ర లందు మరియు యజ్ఞ యాగ క్రతువులందు పాల్గొంటారు.

**శుక్రుడు వృశ్చిక రాశిలో ఉంటే :**

ఈ జాతకులు మిక్కిలి కుటిల స్వభావులు. ఇతరులకు హాని చేయుటకు వెనుకాడరు. హింసాప్రవృత్తి ఎక్కువ. దుర్మార్గపు ఆలోచనలు ఎక్కువ. నమ్మిన వారిని కూడ మోసం చేస్తారు. వీరికి ఉన్నత విద్య ఉన్నా లేక మంచి ఏదైన ఒక లలిత కళయందు ప్రావీణ్యం ఉన్నా, ఆ జ్ఞానాన్ని అధర్మంగా స్వలాభానికే వాడుకుంటారు.

**శుక్రుడు ధనస్సులో ఉంటే :**

ఈ జాతకులకు శాస్త్ర పరిజ్ఞానం, భాషాపద ప్రయోగం, శాస్త్ర పాండిత్యం ఎక్కువగా ఉంటుంది. వేదవేదాంగ పండితులై, దైవశాస్త్రాలను కూలంకషంగా

అభ్యసించి శిష్యులకు బోధిస్తారు. మహాజ్ఞానులుగా ఉండి ప్రజలందరికి పూజనీయులుగా ఉంటారు. మంచి రూప లావణ్య గుణాలు కలిగి అత్యుత్తమలోక విచక్షణాజ్ఞానం కలిగి వారికులానికేమంచిపేరు తెస్తారు.

## శుక్రుడు మకర రాశిలో ఉంటే :

ఈ జాతకులు బుద్ధిహీనులు. పాపకర్మలు చేసేవారుగా ఉంటారు. అధర్మ పరాయణు లుగా ఉండి నమ్మినవారిని మోసం చేస్తారు. అత్యంత కాముకత కలిగి ధర్మ విచక్షణను మఱచి నీచ స్త్రీ సాంగత్యానికి బానిసలవుతారు. తల్లిదండ్రులను, గురువును మరియు శాస్త్ర వేత్తల విద్యావేత్తల గొప్పతనాన్ని తెలియక వారిని అపహాస్యం చేస్తారు. మాంస భక్షణయందు ఎక్కువ మక్కువ చూపుతారు.

## శుక్రుడు కుంభరాశిలో ఉంటే :

ఈ జాతకులకు సామాన్య విద్య ఉంటుంది. సమాజంలో సగటు జీవితం గడుపు తారు. జీవితంలో ఎక్కువ కాలం రుగ్మతలతో బాధపడతారు. అనారోగ్యం వల్ల ఎక్కువగా శారీరక మానసిక బాధలు అనుభవిస్తారు.

## శుక్రుడు మీనరాశిలో ఉంటే :

ఈ జాతకులు ఉన్నత విద్యను అభ్యసించి మంచి జ్ఞానం సంపాదిస్తారు. భాషా పరిజ్ఞానం కలిగి శాస్త్ర ప్రవచనాలను అర్ధం చేసుకొంటారు. పరోపకారం దానగుణం ఉంటుంది. పాత్ర ఎరిగి దానం చేయడంలోను వీరు సిద్ధహస్తులు. బంధుమిత్రులతో కలిసి మెలిసి వారిలో మమేకమైపోతారు. వీరు సత్యమే పలుకుతారు. సాధారణంగా అసత్యం పలికే వారంటే వీరు అయిష్టంగా ఉంటారు.

మనం ఇంతవరకు ఏ గ్రహం ఏ రాశిలో ఉంటే ఏ ఫలితాలు ఇస్తాయో ఒక క్రమ పద్ధతిలో నేర్చుకొంటున్నాము. ఇప్పుడు ఈ వరుసలోనే శని ఏ రాశిలో ఉంటే ఏ ఫలితాలు ఇస్తాడో తెలుసుకొందాం.

## శని మేషరాశిలో ఉంటే :

ఈ జాతకులకు క్రూరత్వం, ఎక్కువగా ఉండి దౌర్జన్య ప్రవృత్తి గలవారై హింసకు వెనుకాడరు. దౌర్జన్యం, దుర్మార్గం వీరి సహజ గుణాలు వారి మాటలలో కోపాగ్రహా

వేశాలు స్పష్టంగా కనబడతాయి. దయాదాక్షిణ్యాలు మరియు జాలి అనేది చాల తక్కువ. సామాజికంగాను ధనాభావంలోను చాల కష్టపడతారు. జీవితంలో దారిద్ర బాధ అనుభవిస్తూ సంతోషరహితమైన దుఃఖజీవితం అసంతృప్తితో గడుపుతారు. దారిద్ర బాధ వల్ల సంకుచిత స్వభావం స్వార్ధ పరాయణత్వం పెంచుకొని అధర్మ సంపాదనకు వెనుకాడరు. వీరికి ఎక్కువగా అసూయాద్వేషాలు ఉంటాయి.

## శని వృషభరాశిలో ఉంటే :

ఈ జాతకులకు జీవితంలో స్థిరత్వం ఉండదు. అనేక విధములుగా వివిధ రీతులలో ధనార్జన చేస్తారు. ప్రత్యేకంగా స్థిరంగా ఒక వ్యాపారముగాని ఒకే ఉద్యోగము చేయడంగాని వీరి అభిమతం లేదు. పైగా ఉన్న వృత్తిని వదలి దురాశతో మరో వృత్తిని అవలంభిస్తారు. ఈ విధముగా జీవితంలో వృత్తులు మారుస్తూ ఉంటారు. విచక్షణా జ్ఞాన రహితంగా స్త్రీ వాంఛతో అక్రమ సంబంధములు పెట్టుకొని వారితో శరీర వాంఛలు తీర్చుకొంటారు. అంతేకాక వేశ్యావాటికలందు సంచరిస్తూ ఉంటారు. అధర్మం, అన్యాయం, అసత్యం అనేవి వీరు ఆలోచించక, తమ ఇచ్ఛారీతిలో నడచి మోసం, ద్రోహం చేస్తారు. శారీరక శ్రమ చేసి ధనార్జన చేస్తారు. మూర్ఖత్వం, కోపం ఎక్కువగా ఉండి డాంబికంతో వ్యర్ధప్రసంగం చేస్తారు.

## శని మిధునరాశిలో ఉంటే :

ఈ జాతకులకు దాంపత్య జీవితంలో అనురాగం, ఆనందం, సఖ్యత తక్కువగా ఉంటాయి.తన జీవిత భాగస్వామి చేత చులకనగా చూడబడతారు.అందువల్ల బంధుమిత్రులలోవీరికి సముచిత స్థానం,గౌరవం ఉండదు.సమాజంలో ఇచ్చిన మాటను నిలుపుకోలేక అపహాస్యం పాలవుతారు. భార్య సంపాదన మీద మక్కువ ఎక్కువ.

## శని కర్కాటక రాశిలో ఉంటే :

ఈ జాతకులు జన్మతః మంచి తెలివితేటలు కల్గి ఉన్నత విద్యను అభ్యసిస్తారు. విద్యలో మంచి చురుకుగా ఉండి ఉన్నత విద్య ఆర్జించిన, ఆ విద్య వల్ల మంచి ఉద్యోగం లేక తమ వృత్తిలో రాణింపు ఉండదు. అందుచేత దారిద్ర బాధ అనుభవిస్తారు. ఎప్పుడు ఎవరికి కించిత్ సహాయము చేయకపోగా, వీలైతే హానికూడా

చేసి సంతృప్తి చెందేటంత చెడ్డ మనస్సు గలిగినవారై ఉంటారు. ఏదో ఒక అనారోగ్యంతో బాధపడుతూనే ఉంటారు.

**శని సింహరాశిలో ఉంటే :**

ఈ జాతకులకు సాటి మానవులంటే ఏమీ కనికరం ఉండదు. దయాదాక్షిణ్యాలు తక్కువగా ఉంటే కఠిన మనస్కులై ఉంటారు. క్రూరత్వం వీరికి ఎక్కువగా ఉంటుంది. బంధుమిత్రులంటే ప్రేమాభిమానాలు ఉండవు. పైగా వారంటే ఏమీ గౌరవం చూపరు. ఎవరికి ఎప్పుడు ఏమీ సహాయ సహకారాలు అందించరు. చాలా కోపిష్టులుగా ఉండి శత్రుత్వం వచ్చినప్పుడు వారి మీద తీవ్ర బల ప్రయోగానికి వెనుకాడరు. ధర్మాధర్మ విచక్షణా జ్ఞానం వీరికి అసలు ఉండదు. తన స్వార్థం కోసం పుణ్య పాపాలతో పని లేకుండా తన ప్రయోజనం కోసం తమకు కావల్సిన పనిని అవసరమైతే దుర్మార్గము మరియు దౌర్జన్యప్రవృత్తితో సాధిస్తారు.

**శని కన్యారాశిలో ఉంటే :**

ఈ జాతకులు మెత్తటి మనస్సు కలవారై సాధారణంగా ఓర్పు సహనం కలిగి సాధు స్వభావులుగా ఉంటారు. లలిత కళలందు మక్కువ ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా సంగీత, నాట్య, నటనలలో ఉత్సాహం చూపుతారు. సంతాన సుఖం ఎక్కువ. వీరికి స్త్రీ వాంఛ మెండు. అక్రమ సంబంధాలు వేశ్యాప్రవృత్తి ఎక్కువ. స్త్రీని తనివి తీరా అనుభవిస్తారు.

**శని తులారాశిలో ఉంటే :**

ఈ జాతకులకు విదేశాలలో ఎక్కువగా ధనార్జన బాగుంటుంది. స్వదేశ సంపాదన కన్నా విదేశ సంపాదనే వీరికి కలిసి వస్తుంది. పరదేశాలలో విదేశీయులకు విధేయులుగాఉండి వారిచ్చే ధనాన్ని గొప్పగా భావించి వారికి బానిసలుగా బ్రతుకు తారు. చాలా శ్రమ చేసి ధనాన్ని కూడబెడారు. పరుష పదాలను, అవమానాలను తేలికగా తీసుకొని విదేశీయుల చేతి క్రింద రెండవ తరగతి జీవితాన్ని గడుపుతారు గాని స్వదేశానికి తిరిగి వెళ్లడానికి వీరు ఇష్టపడరు. స్త్రీ కాముకత్వం ఎక్కువ.

## శని వృశ్చిక రాశిలో ఉంటే :

ఈ జాతకులకు పైకి కనపడని చోర ప్రవృత్తి ఉంటుంది. తమకు నచ్చిన చిన్న చిన్న వస్తువులను దొంగిలించి సంతోషించడం వీరి నైజం. అతి తక్కువ విలువ అయినా, అలవోకగా అంగడిలో దొరికే వస్తువైనా సరే, వీరు దొంగిలించడానికి వెనుకాడరు. వీరు ఎవ్వరితోను మిత్ర భావం లేక అందరిచేత శత్రువులుగానే చూడబడతారు. అపకారం చేయడమంటే వీరికి సరదా. నీతి న్యాయధర్మాలు అసలు పాటించరు. తిండిపోతులుగా ఉంటారు.

## శని ధనూరాశిలో ఉంటే :

ఈ జాతకులు మంచి విద్య కలిగి విజ్ఞానవంతులౌతారు. మంచి జ్ఞాన విమర్శ చేసే అపారమైన శక్తి ఉంటుంది. స్వయంగా తాము గొప్ప జ్ఞానవంతులుగా ఉంటారు. విద్యలో ఉన్నత ప్రామాణికాలు సాధిస్తారు. మంచి కార్యదీక్ష కలిగి తమ వృత్తిలో నైపుణ్యం సంపాదిస్తారు. ఉన్నత స్థితికి చేరుకుంటారు. బంధుమిత్రులలో తెలివైన వారుగాను మంచివారుగాను పేరు తెచ్చుకుని ప్రశంసింపబడతారు.

## శని మకరరాశిలో ఉంటే :

ఈ జాతకులకు మాతృదేశంకంటే పరదేశం అన్నా, పరదేశీయులన్నా ఎక్కువగా మక్కువ చూపుతారు. పరదేశాలలో నివశించడానికి ఇష్టపడి అక్కడ పేరు ప్రఖ్యాతులు తమ వృత్తిలో సంపాదించి మంచి ధనార్జన చేస్తారు. ఏదో ఒక శాస్త్రములో మంచి ప్రతిభ పాటవాన్ని కలిగి ఆ విద్య వల్ల లాభం పొందుతారు. లలిత కళలందు ఇష్టం కలిగి సంగీత, వాయిద్య పరికరాలంటే మోజు చూపిస్తారు. స్వయంగా ఏదో ఒక వాయిద్య పరికరాన్ని వాయించే నేర్పు, నైపుణ్యము సంపాదిస్తారు. మంచి శాస్త్రపటిమ కలిగి ఉంటారు. పరస్త్రీ సాంగత్యం ఎక్కువగా ఉంటుంది. స్త్రీ సుఖం ఎక్కువగా అనుభవిస్తారు.

## శని కుంభరాశిలో ఉంటే :

ఈ జాతకులు కోపిష్టులుగా ఉండి తరచు ఆగ్రహావేశాలకు లోనవుతారు. కోపంలో వాచాలత్వం ఎక్కువగా ఉండి తక్కువ తరగతి భాష వాడతారు. ఎవరితోను

మంచి సఖ్యత దీర్ఘ కాలం ఉండదు. దుష్టసాంగత్యం కలిగి వ్యసనాలకు బానిసై జూద ప్రవృత్తితో జీవిస్తూ చాలి చాలని ఆదాయంతో దుఃఖమయ జీవితం గడుపుతారు.

**శని మీన రాశిలో ఉంటే :**

ఈ జాతకులకు మంచి మేధోసంపత్తు ఉంటుంది. ఉన్నత ప్రమాణాలైన విద్య అభ్యసించి విజ్ఞులుగా జీవిస్తారు. మిక్కిలి లోక విచక్షణా జ్ఞానం కలిగి దైవశాస్త్రము లందు పండితులవుతారు. బంధుమిత్రులకు సహాయ సహకారాలందించి వారి వృద్ధికి, జీవనానికి మార్గదర్శకులవుతారు. ధర్మాధర్మ, న్యాయం న్యాయ విశ్లేషణలో వీరికి వీరే సాటి. ధర్మ జీవితం గడుపుతూ దాంపత్య జీవితం సుఖమయం చేసుకొని హాయిగా ఆనందంగా జీవిస్తారు.

ఇంతవరకు మనం సప్త గ్రహాలు ఏ రాశిలో ఏ గ్రహం ఉంటే ఎలాంటి ఫలితం ఆ జాతకునకు ఇస్తాయో నేర్చుకున్నాము. మీరు గ్రహించవలసిన విషయం ఏమంటే మౌలికంగా నేను ఉటంకించిన లక్షణాలు తప్పక ప్రతి జాతకునకు ఉంటాయి. కాని ఆ లక్షణాలలో కొంతమందికి ఉధృతంగాను మరి కొంతమందికి తేలికగాను ఉండవచ్చు. ఎందుకంటే గ్రహం ఏ రాశిలో ఉన్నా, ఆ క్షేత్ర స్థల వీక్షణ మరియు సంయోగం కూడా జాగ్రత్తగా పరిశీలించాలని మనం మర్చిపోకూడదు. ఎందుకంటే ఉదాహరణకు, గ్రహాల క్షేత్ర స్థితి అంటే గురువు మకరరాశిలో ఉన్నప్పుడు తన బలాన్ని కోల్పోతాడు. తగినంత శుభఫలితాలను ఎటువంటి పరిస్థితులలోను ఇవ్వలేడు. అలాగే వీక్షణ అంటే ఏ గ్రహమైనా దుష్ఫలితం ఇస్తుందనుకున్నప్పుడు ఆ గ్రహం మీద వీక్షణ వల్ల దుష్ప్రభావం పోతుంది. కుజుని మీద గురుని వీక్షణ వల్ల కుజదోషం పూర్తిగా హరిస్తుంది. అలాగే సంయోగం అంటే రెండు గ్రహాల కలయిక. ఒక జాతక చక్రంలో కుజుడు, శుక్రుడు కనుక కలిసి ఉంటే వారి ప్రభావం తీవ్రమై శుక్రుడు, కుజుడు కలిసి దాంపత్య విచ్ఛిన్నం చేస్తారు. కాబట్టి గ్రహాల రాశి ఫలితాలు ఇంతవరకు నేర్చుకున్నారు. మనకున్న నవగ్రహాలలో సప్త గ్రహాల గురించి నేర్చుకున్నా ఇంక రెండు గ్రహాలు గురించి కూడా మీరు నేర్చుకోవాలి. ఆ రెండు గ్రహాలే రాహుకేతువులు. రాహు కేతువులు మానవ శక్తి ఊహించలేనంత దూరంలో ఉన్నారు. కాబట్టి వాటి సంగతి పూర్తిగా మనం తెలుసుకోలేకపోయినా పరాశరుడు, వరరుచి

మొదలైనవారు ఆనాడే రాహుకేతువుల యొక్క ఛాయ (నీడ) మిగిలిన గ్రహాల మీద పడుతోందని గ్రహించి ఆ నీడని ఆధారంగా చేసుకొని తమ అత్యున్నత దివ్యదృష్టి, మేధోసంపత్తుతో వారిచ్చే ఫలితాలు ఎలా ఉంటాయో స్పష్టంగా ప్రపంచానికి చాటి చెప్పారు. ఆ గ్రహం సందర్శనం అసామాన్యం అసాధ్యం కాబట్టి, వాటి నీడనే గుర్తించగలి గారు కాబట్టి ఆ రెండు గ్రహాలను ఛాయా గ్రహాలని నిర్వచించారు. అందువల్లనే రాహు కేతు గ్రహాలను ఛాయాగ్రహాలుగా చెప్పబడు తున్నాయి. అయినా కూడా రాహుకేతువులకు ఉచ్ఛనీచస్థానాలు కనుగొని వాటి స్థానాలు చెప్పగలిగారు. రాహువు ఉచ్ఛక్షేత్రం మిథునరాశియని, నీచక్షేత్రం ధనూరాశి అని, అలాగే కేతువుకు వృషభరాశి ఉచ్ఛస్థితి అని అలాగే వృశ్చిక రాశి నీచక్షేత్రమని చెప్పబడినది. కొంత మంది రాహవుకు వృషభరాశి ఉచ్ఛమని ఉటంకించినా అది సవ్యము కాదు. ఎందుకంటే వృషభ రాశ్యాధిపతి శుక్రుడు. రాక్షస గురువు. అటువంటి శుక్రాధిపత్య క్షేత్రంలో రాక్షసుడైన రాహువుకు ఉచ్ఛస్థానం ఉండడానికి వీలుపడదు అని మనం గ్రహించాలి. అలాగే సింహరాశికి అధిపతి సూర్యుడు. గ్రహాధిపతి అయిన సూర్యుని క్షేత్రంలో వేరే గ్రహానికి ఆధిపత్యం ఉండడానికి వీలుకాదు. కాబట్టి విజ్ఞులు ఈ విషయాన్ని గమనించాలి.

# అధ్యాయం - 5

## లగ్నస్థాన ఫలితాలు

మన జాతక చక్రంలో 12 రాశులు ఉంటాయని మనకు తెలుసు. ఒక్కొక్క రాశిలో ఒక్కొక్క గ్రహం ఉండినప్పుడు ఆ గ్రహం ఆ రాశి స్థానప్రభావం వల్ల ఏ ఫలితం ఇస్తాడో క్రిందటి అధ్యాయాల్లో నేర్చుకొన్నాం. ఇప్పుడు జాతక చక్రంలోని ద్వాదశ భావాల యొక్క గుణ సంపత్తి మరియు వాటి కారకత్వాలు మనం ఇప్పుడు తెలుసుకొందాము. ఇలా తెలుసుకోవడం అతి ముఖ్యమని చదువరులు గ్రహించాలి. ఎందుకంటే చాలమంది రాశుల సంఖ్య చెప్పకుండా దానికి బదులుగా అన్ని రాశులుకు ఒక్కొక్క నామకరణం చేసి ఆ నామాన్ని వాడుకలోకి తెచ్చినందు వల్ల చాల మందికి ఏ రాశి ఏ ప్రభావం ఇస్తుందో తెలియకుండా పోతోంది. ఇది చాల బాధాకరమైన విషయం. ఎందుకంటే కుటుంబ స్థానం, కళత్రస్థానం, లాభస్థానం, వ్యయస్థానం పదే పదే వాడడం వల్ల కుటుంబ స్థానం అంటే ఒక్క కుటుంబం గురించే ఆ రాశి ఫలితాలు తెలుసుకోవచ్చనే దృఢ నిశ్చయమే గాని యింకా ఇతర విషయాలు తెలుసుకోవచ్చనే ఆలోచన ఉండదు. ఉదాహరణకు : కుటుంబ స్థానం అంటే జాతకుని యొక్క వినయ విధేయతలు, మానసిక స్థిరత్వం, సంభాషణా చాతుర్యం, వాక్పటిమ, గణితంలో నైపుణ్యం, మారకత్వం, భోజనరీతి ఇంకా ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చు. కాబట్టి జ్యోతిషులు ఎప్పుడు ద్వాదశ రాశులలో ఏ రాశిని గూర్చి వివరించదలచు కొన్నా ఆ రాశి యొక్క సంఖ్యను లగ్న స్థానం నుండి లెక్కించి ఉటంకించడం సబబైన విషయం. ఉదాహరణకు కుటుంబ స్థానం అనే బదులు ద్వితీయ స్థానమని, కళత్ర స్థానమనే బదులు సప్తమ స్థానమని, పుత్ర స్థానమనే బదులు పంచమ స్థానమని అనడంలో, ఎక్కువ ఔచిత్యం కనిపిస్తుంది. పైగా స్పష్టత ఉంటుంది. ఇప్పుడు ఏ స్థానం ఏ ఫలితాలు ఇస్తుందో తెలుసుకొందాం.

**లగ్నస్థానం :**

ఏ జాతక చక్రంలోనైనా, ఏ రాశిలో అయితే 'ల' అనే అక్షరం కనిపించినపుడు

ఆ రాశి లగ్న స్థానమని గ్రహించాలి. ఈ లగ్న స్థానం జాతకుని యొక్క శరీర పొందిక, దృఢత్వం, శరీర సౌష్టవం, అవయవముల పొందిక, ఆరోగ్యం, మేధోసంపత్తి, ఆలోచనా, విధానం, మనశ్శాంతి, కీర్తి ప్రతిష్టలు, తలిదండ్రుల లేక వారసులపోలికలు మరియు వారి గుణాలు, వృద్ధాప్య జీవితవిధానం, జీవనోపాయం, వృత్తి ఉద్యోగ వ్యాపారాలు,కార్యదీక్ష, పట్టుదల, వృత్తి నైపుణ్యం మొదలగునవి మనం తెలుసుకోవచ్చు.

## ద్వితీయ స్థానం :

జాతకుని యొక్క వినయ విధేయతలు, నడవడిక, మానసిక స్థిరత్వం, సభా చతురత, మంచి వాగ్ధాటి, ఏదైన ఒక శాస్త్రంమీద పట్టు, గణితం, గణాంకములలో ఆతని చురుకుదనం, ధన సంపాదన, ధన పొదుపు ఖర్చులు, బంధుమిత్రులలో అతని సంబంధ బాంధవ్యాలు, ప్రేమానురాగాలు, మారకత్వం, భోజనరీతి, దాంపత్య జీవితంలోని మధురిమలు మరియు పదనిసలు వారి మధ్య ఉన్న ప్రేమ వాత్సల్యాలు గురించి తెలుసుకోవచ్చును.

## లగ్నాధిపతి తృతీయ స్థానంలో ఉంటే :

ఆ జాతకులుకు ధైర్యం, కార్యదీక్ష, పౌరుషం, మానాభిమానాలు ఎక్కువగా ఉంటాయి. ధన సంపాదనలో ఒక క్రమమైన విధానాన్ని రూపొందించుకొని ఆ నిర్దుష్టమైన ప్రణాళిక ప్రకారం లాభనష్టాలు బేరిజు వేసుకొంటూ ధనం కూడ బెడతారు. అందువల్ల వీరికి ధన లోపం లేక సర్వ సంపదలతో తులతూగుతారు. మంచిఉదార బుద్ధి కలిగి సమాజంలోను మరియు బంధుమిత్రులలోను మంచి వ్యక్తిగా గౌరవం పొందుతారు. జాగరూకతతో తాను సంపాదించిన ఐశ్వర్యాన్ని సద్వినియోగం చేస్తారు. దుర్వ్యసనాలు లేకుండా సజ్జన సాంగత్యం కలిగి సంతోషకరమైన జీవితాన్ని గడుపుతారు.

## లగ్నాధిపతి చతుర్ధస్థానంలో ఉంటే :

ఈ జాతకులకు తల్లిదండ్రుల ప్రేమాభిమానాలు ఎక్కువ ఉంటాయి. బాల్యం నుండి ఏ విధమైన లోపం ఎరుగక కావలిసినవన్ని తల్లిదండ్రుల ద్వారా పొంది ఆనందమయ జీవితాన్ని గడుపుతారు. వీరికి సోదరులతో ఐకమత్య భావం ఉంటుంది. చూడడానికి కన్ను, ముక్కు తీరు చక్కగా ఉండి చూపరులకు ఆకర్షణీయంగా కనబడతారు. వీరికి స్త్రీ వాంఛ ఎక్కువ కాని ఏకపత్నీవ్రతుడుగానే ఉంటారు.

## లగ్నాధిపతి పంచమస్థానంలో ఉంటే :

ఈజాతకులు మధ్య తరగతి కుటుంబీకులుగా మనుగడ గడుపుతారు. జీవితంలో ఎక్కువ ఉన్నత స్థితికి పోవడం గాని తక్కువ తరగతి జీవన ప్రయాణంలో పడిపోవుట గాని జరుగదు. జీవితం అంతా సాఫీగా సజావుగాను సాగిపోతుంది. వీరికి అత్యంత అభిమానం మరియు మొహమాటం ఎక్కువ. అనవసర ప్రసంగం చేసే వారి నుండి దూరంగా ఉంటారు. మరియు వీరు మితభాషులుగా ఉంటారు. అన్యాయం, అధర్మం, అవినీతి అంటే గిట్టదు, దేశమాత కుల సంప్రదాయాలను గౌరవిస్తారు.

## లగ్నాధిపతి షష్టమ స్థానంలో ఉంటే :

ఈ జాతకులు ఎక్కువ శరీర శ్రమతో జీవిస్తారు. అంటే తమ వృత్తిలో సరియైన నిద్రాహారములు లేక తరచు ప్రయాణాలు చేయడం, భార్య బిడ్డలకు దూరంగా ఉంటూ ఎండ వానలకు మరియు శీతోష్ణస్థితి బారిన పడి శరీర శ్రమకు అలవాటు పడి జీవన భృతి సంపాదిస్తారు. సాధారణంగా ఏ విషయాన్ని సమర్ధవంతంగా అర్ధం చేసుకోలేక పదుగురితోను వివాదాలు కొనితెచ్చుకొంటారు. వృత్తిలో కూడ అసంతృప్తితో ఉంటారు. తమకు తోచినదే సరియైనదని భావించి ఇతరుల సలహాలను లక్ష్యపెట్టరు. వీరి మీద బంధు మిత్రులకు సదభిప్రాయం ఉండదు.

## లగ్నాధిపతి సప్తమ స్థానంలో ఉంటే :

వీరు మంచి తేజస్సు కలిగి చిరునవ్వు మొగంతో ఆకర్షణీయంగా ఉంటారు. మంచి దేహచ్ఛాయ కలిగి ఉంటారు. వీరు సద్గుణ సంపన్నులు మరియు దుర్వ్యసనాలు దుష్టసాంగత్యంగాని లేక తమ జీవిత భాగస్వామితో సంతోషమైన దాంపత్య జీవితం గడుపుతారు. మంచిశీలం కలిగి ఉన్నతాభిప్రాయాలతో జీవిస్తారు. ఏ విద్యలోనైనా రాణించి ఆ విద్యలో తమ ప్రత్యేకమైన నైపుణ్యం కనబరుస్తారు. అన్ని విద్యలలోను ఒక మంచి అవగాహన ఏర్పరుచుకొని జీవన విధానంలోని ఒడుదుడుకులు అర్ధం చేసుకుంటారు. కార్యసాధకులుగా జీవిస్తారు. ప్రలోభాలకు దురాశలకు లొంగక జీవితంలో వాస్తవికతను గ్రహిస్తారు.

## లగ్నాధిపతి అష్టమస్థానంలో ఉంటే :

ఈ జాతకులకు చేతివాటం ఎక్కువ. చౌర్యబుద్ధి కలిగి ఉంటారు. నీచ మనస్కులు,

అతికాముకులు మరియు అత్యాశపరులు. ధన విషయమందు సంకుచిత స్వభావం కలిగి లోభులుగా ఉంటారు. దేహారోగ్యం సరిగా ఉండదు.ఎక్కువ ఏదో ఒక రుగ్మతతో బాధపడుతునే ఉంటారు. స్వార్థపరులు. సచ్ఛీలత ఉండదు. నమ్మదగ్గ వ్యక్తులు కారు.

**లగ్నాధిపతి నవమ స్థానంలో ఉంటే :**

ఈ జాతకులకు మంచిశరీరఆరోగ్యం కలిగి మంచి శరీర దారుఢ్యంతో దీర్ఘాయువులుగాజీవిస్తారు.అతి లోభులు, కాని భాగ్యవంతులు.వీరి సంభాషణంలోఅతి తియ్యదనం,స్నేహభావం కనపడుతుంది. కాని అవి శుష్క ప్రవచనాలు, శూన్య హస్తాలని గ్రహించాలి. తన కుటుంబీకులతో సౌఖ్యమైన జీవితం గడుపుతారు. వీరికి హాస్య చతురత కలిగి ఉండటం వల్ల వీరి సంభాషణంలో ఎక్కువ సునిశితహాస్యం ఉంటుంది.

**లగ్నాధిపతి దశమ స్థానంలో ఉంటే :**

వీరు జీవితంలో కష్టపడి తాము అనుకొన్న శిఖరాగ్రాలకు చేరుకొంటారు. విద్యలోను,కళలందు లేక వ్యాపారమందు ఎందులోనైనా సరే కార్యదక్షతతో కష్టపడి ధనం సంపాదిస్తారు. అధర్మ సంపాదన చేయరు.ఉదారత్వం కలిగిఅందరితోనే స్నేహ భావంతో మెలుగుతారు.అవసరమైనపుడు ఎవరికైనా సహాయం చేయడానికి వెనుకాడరు. వీరికి తండ్రి వల్ల ఆదాయం, ఆస్తులు, పేరు ప్రతిష్టలు కలుగు తాయి. తండ్రియొక్క వృత్తిని కూడ ఎంచుకొని, తండ్రితోపాటే సమానమైన హోదా అనుభవిస్తారు.

**లగ్నాధిపతి ఏకదశాస్థానంలో ఉంటే :**

వీరు మంచి బుద్ధి కలిగి సాత్వికులుగా ఉంటారు. ఏ విషయంలోనైనా సరే అన్ని కలిసి వస్తాయి. అందువల్ల జీవితంలో వీరికి లాభమే తప్ప నష్టమెరుగరు. సచ్ఛీలత, సత్ప్రవర్తన వారి సొత్తు. ఉదారబుద్ధి, దయాదాక్షిణ్యం కలిగి మంచి మానవత్వం కలిగిన వారిగా పేరుపొందుతారు.

**లగ్నాధిపతి ద్వాదశ స్థానంలో ఉంటే :**

వీరు మూర్ఖులు, వితండ వాదులు, కోపిష్టులుగా ఉంటారు. డాంబికాలు,దర్పం వారి మాటలతో స్పష్టంగా కనబడుతుంది. వ్యర్థప్రసంగాలు చేసి తమ అజ్ఞానాన్నిచాటు కొంటారు. ధనం యొక్క విలువ తెలియక ఎంత సంపాదించినా కొంచెం కూడ నిలువ చేయక ఎక్కువ ఖర్చు చేస్తారు. దేహసౌఖ్యం లేక అనారోగ్యంతో బాధపడతారు.

# అధ్యాయం - 6

## రాశుల ప్రకారం గ్రహఫలితాలు

మనం ఈ అధ్యాయంలో ఒక గ్రహం ఏ రాశిలో ఉంటే ఆ గ్రహం ఎలాంటి ఫలితం, ఆ రాశిలో ఇస్తాడో తెలుసుకుందాము. ఇంతవరకు లగ్నాధిపతి ఏ రాశిలో ఉంటే ఏ ఫలితం ఇస్తాడో తెలుసుకొన్నాము. అలాగే లగ్న స్థానం నుండి లెక్కపెట్టినప్పుడు ద్వాదశ రాశులలో ఏ గ్రహం ఎన్నో స్థానంలో ఉందో ఆ స్థానంలో ఆ గ్రహం వల్ల ఎలాంటి ఫలితం వస్తుందో కూడా మనం నేర్చుకోవాలి. అందువల్ల ఈ క్రింద గ్రహాల ప్రకారం ఒక క్రమపద్ధతిలో ద్వాదశ భావాల ఫలితాలు ఇస్తున్నాను. మీరు ఒకటికి రెండుసార్లు చదివి అర్థం చేసుకోవాలి.

## సూర్యుడు

సూర్యుడు గాని లేక మరో గ్రహం కాని ఎవరి జాతకంలో అయినా సరే ఆ గ్రహం లగ్నం నుంచి ఏ స్థానంలో ఉన్నాడు మరియు ఏ రాశిలో ఉన్నాడు అనే పరిశీలన చేసి ఆ గ్రహం ఇచ్చే ఫలితం చెప్పాలి. అంటే లగ్నస్థానం నుంచి ఒకరి జాతకంలో పంచమ స్థానంలో సూర్యుడు ఉన్నప్పుడు ఇచ్చే ఫలితాలు మరొకరి జాతకంలో అదే పంచమ స్థానంలో సూర్యుడిచ్చే ఫలితాలు వేరువేరుగానే ఉంటాయి. ఎందుకంటే ఒకరికి మిథున లగ్నం అయినప్పుడు ఆ మిథున స్థానం నుంచి తులా రాశి పంచమ స్థానం అవుతుంది. అలాగే మరొకరికి ధనుర్లగ్నం అయినప్పుడు ఆ ధనుస్సు నుండి పంచమ స్థానం మేషరాశి అవుతుంది. మీరు తెలుసుకోవలసినది ఏమంటే ఇద్దరి జాతకాలను పంచమ స్థానంలో సూర్యుడు ఉన్నప్పటికి ఆ సూర్యుడిచ్చే ఫలితాలు వేరువేరుగానే ఉంటాయి. ఎందుకంటే మొదటి జాతకునికి సూర్యుడు తులా రాశిలో ఉండుట వల్ల దుర్బలుడయ్యాడు. లేక శక్తి విహీనుడవుతాడు. తులలో సూర్యుని శత్రువయిన శని ఉచ్చస్థితిలో ఉంటాడు. అందువల్ల తులలో సూర్యుడు ఇచ్చే ఫలితాలు శుభరహితంగా ఉంటాయి. అలాగే రెండవ జాతకంలో సూర్యుడు

మేషరాశిలో ఉన్నందువల్ల ఆయనకు మిత్రక్షేత్రమే కాక ఉచ్ఛక్షేత్రం కూడ అవుతుంది. అందువల్ల సూర్యుడు మేషరాశిలో ఇచ్చే ఫలితాలు వేరే విధంగా ఉంటాయి. అందువల్ల ఏ గ్రహం అయినా ఒక రాశిలో ఉన్నప్పుడు లగ్నం స్థానం నుంచి ఎన్నో స్థానంలో ఉన్నాడు మరియు ఏ రాశి స్థానంలో అనే విషయం సరిగా బేరీజు వేసుకొని ఫలితాలు చెప్పాలి. అంతేకాని, ఫలానా రాశిలో ఏ గ్రహమైన ఉన్నప్పుడు, యిది ఫలితమని మూసపోసిన విధంగా ఫలితాలు చెప్పకూడదు. నేను గమనించినది ఏమంటే చాల మంది విద్యార్థులు ఇదే విధంగా నేర్చుకొని ఫలితాలు చెప్పడం వల్ల ఆ ఫలితాలు చాలవరకు తప్పిపోతున్నాయి. ఎందుకంటే ప్రతి విద్యార్థి ఆ గ్రహవీక్షణ, కేంద్రం, కోణం, సంయోగం, తాత్కాలిక మిత్రత్వం మొదలగు అన్ని విషయాలు పరిగణనలోకి తీసుకొని ఒక నిర్ణయానికి రావాలి తప్ప ఫలానా రాశిలో ఫలాన గ్రహం ఉందికాబట్టి ఇది ఫలితమని చెపితే యిక జ్యోతిషశాస్త్రం ఎవరు అభ్యసించనక్కర్లేదు. ఎందుకంటే రాశులు గ్రహాల పట్టికను తయారు చేసి ఆ పట్టికను మననం చేసుకొని ఆలామననం చేసుకొన్న వారు జ్యోతిష విద్వాంసులని అనుకొంటే శాస్త్రాన్ని విధ్వంసం చేసినట్లే. ఎందుకంటే ఏ పండితుడు కూడ ఇలా ఫలితాలు చెప్పడు. చెప్పినా ఫలించవు.

రవి లగ్న స్థానంలో ఉంటే వీరికి ఉన్నతమైన ఆశయాలు, ఆదర్శాలు ఉంటాయి. జీవితంలో క్రమశిక్షణకు ఎక్కువ విలువ యిస్తారు. క్రోధితురులుగా ఉండి కార్యదీక్షలో విజయం సాధిస్తారు. సాత్వికత, సహనం, ఓర్పు తక్కువగా ఉంటాయి. అవసర మైనప్పుడు దయా దాక్షిణ్యాలు లేకుండా కఠినంగా వ్యవహరించగలరు. తమ నిర్ణయాన్ని ఎవరైనా తప్పు పట్టినప్పుడు సహించలేరు. పైగా వారితోవాదానికి దిగి శత్రుత్వం కూడ తెచ్చుకొంటారు.

## రవి లగ్నం నుండి ద్వితీయ స్థానంలో ఉంటే :

ఈ జాతకులు ఎప్పుడూ ధనలోపంతో బాధపడతారు. ఒక విధంగా చెప్పాలంటే దారిద్ర్య బాధను అనుభవిస్తారు. వంశపారంపర్యంగా వచ్చిన స్థిరాస్తి, ధనం, నగలు అన్నీ హరించుకుపోతాయి. అందువల్ల జీవనభుక్తి గడపడం కోసం అవినీతి మార్గాలలో ధనం సంపాదించి, ఆ సంపాదనతో జీవిస్తారు. అత్యాశ, దురాశ ఎక్కువగా ఉంటాయి. మితిమీరిన ధన వ్యామోహం ఉంటుంది. న్యాయాన్యాయ విచక్షణ జ్ఞానం లోపించి

ఇతరులను పీడించి ధనం సంపాదిస్తారు. సమాజంలో ఎక్కువ గౌరవప్రతిష్టలు లేక తక్కువ తరగతి వ్యక్తిగా పరిగణించబడతారు. బంధుమిత్రుల నుండి సహాయ సహకారాలు పొందలేరు. నిలకడ లేని జీవితం కొనసాగిస్తారు.

## రవిలగ్నం నుండి తృతీయ స్థానంలో ఉంటే :

ఈ జాతకులకు సోదరులు ఉండరు. అంటే వీరి తలిదండ్రులకు వీరు ఏకపుత్రుని గానే ఉండిపోతాడు. ఒకవేళ సోదరులున్నా వారితో సఖ్యత సౌభ్రాతృత్వం ప్రేమాభిమానాలుండవు. స్వార్ధ చింతన ఎక్కువగా ఉండి తమ స్వలాభమే ధ్యేయంగా పెట్టుకొని అన్నదమ్ములతో సహకరించరు. నిలకడ లేని జీవితం సాగిస్తారు.

## రవిలగ్నం నుండి చతుర్ధ స్థానంలో ఉంటే :

ఈ జాతకులు ఎప్పుడు దరిద్రబాధ అనుభవిస్తారు. సంపాదించిన ధనాన్ని సక్రమమైన మార్గంలో ఖర్చుపెట్టక, ఆ ధనాన్ని ఒక ప్రణాళిక ప్రకారం ఖర్చు చేయక విచ్చల విడిగా వ్యయం చేసి ధనాన్ని పోగొట్టుకొంటారు. మళ్లీ ధనం లభించినప్పుడు కూడ భవిష్యత్తును ఆలోచించక ఇదే రీతిలో దుబారా చేస్తారు. వంశ పారంపర్యంగా వచ్చిన స్థిరాస్తి తాకట్టు పెట్టడమో లేక అమ్మడమో చేసి, ఆ నిధులను కూడ దుర్వినియోగం చేసి ధనలోపంతో బాధపడతారు. అంటే ధనమున్నప్పుడు అహంకారం, అది పోగొట్టుకొనినప్పుడు మానసిక దౌర్బల్యంతో బాధపడతూ అజ్ఞానంలోనే ఉంటారు. కాని తమ జీవనసరళిలో మంచి మార్గాన్ని ఏర్పరచుకోవాలని ఒక గుణపాఠం నేర్చుకోరు. వీరు బంధువుల నుండి మిత్రుల నుండి ఏమి సహాయ సహకారాలు పొందలేరు. ఎందుకంటే ధనం సంపాదించినపుడు దర్పంగా ఉండడం, లేనపుడు తక్కువ తరగతి జీవితం గడపడం వల్ల వీరి మీద ఎవరికీ గౌరవం ఉండదు.

## రవి లగ్నంలో స్థానం నుండి పంచమములో ఉంటే :

ఈ జాతకులు చిత్త చాంచల్యం ఎక్కువ. అందువల్ల తప్పుడు నిర్ణయాలు తీసుకొని జీవితంలో నష్టపోతారు. వీరి తొందరపాటు వల్ల దాంపత్య జీవితంలో భార్యబిడ్డలకు సుఖసంతోషాలు లోపిస్తాయి. అందువల్ల కుటుంబసభ్యులు అన్నీ ఉన్నా ఏమి లేని వారి వలె సుఖరహిత జీవితం గడుపుతారు. వీరి జీవితం చుక్కాని లేని

నావలాగ పయనిస్తుంది. నిర్ణయలోపం వల్ల జీవితంలో కష్టనష్టాలు కొనితెచ్చు కొంటారు. అనారోగ్యంతో బాధపడి పూర్ణాయువుగా జీవించక మధ్య వయస్కులుగా జీవించి తమ బాధ్యతలు నెరవేరకుండా దుఃఖంతో మరణిస్తారు.

## రవిలగ్నం నుంచి షష్టమ స్థానంలో ఉంటే :

ఈ జాతకులు మిక్కిలి అవకాశవాదులు. శాశ్వత మిత్రులు ఉండనే ఉండరు. వీరి జీవితమంతా మిత్రులను అవసరానికి వాడుకొనే వ్యక్తులుగానే ఉంచుకొంటారేమో గాని మిత్రృత్వంలోని మాధుర్యాని చవిచూడరు. వీరి జీవితం సజావుగానే సాగి పోతుంది. అంటే ఎక్కువగా ఒడుదుడుకులు లేక సంతోషమైన సగటు జీవితం గడుపుతారు. కాని భార్య బిడ్డలతో కూడా అవకాశవాదాన్నే ప్రయోగిస్తారే కాని వారి ప్రేమను పొందలేరు. ఈ రాశి వారికి తమ మీద తమకు గాఢనమ్మకం ఉంటుంది. తొందరగా ఎవరిని నమ్మరు. అందువల్ల భార్య వారి అసమర్ధతను గ్రహించి తదను గుణంగా నడుచుకొంటుంది.

## రవి లగ్నం నుండి సప్తమంలో ఉంటే :

ఈ జాతకులు అన్ని విధాల హీన జీవితం గడుపుతారు. దారిద్ర్య బాధ అనుభవిస్తారు. వివాహ జీవితం సాఫీగానే ఉంటుంది కాని భార్య భర్తల మధ్య దైనందిన జీవితంలో ఉండవలసిన సఖ్యత సంతోషం లోపిస్తుంది. పరుషపదజాల సంభాషణ మరియు అప్రియమైన భాష వాడుతూ ఉంటారు. ఎప్పుడైనా కోపోద్రేకాలకు లోనైనప్పుడు వారి భాషలోను ఉచ్చారణలోను అశ్లీల పదాలు దొర్లుతాయి. ప్రతివారి తోను వ్యర్ధ ప్రసంగం చేసి వారితో వాదులాడి శత్రుత్వం పెంచుకొంటారు. బంధుమిత్రు లలో వీరికి గౌరవ భావం ఉండదు. ముఖ్యంగా స్త్రీలకు అయిష్టులుగా ఉంటారు. ఎందుకంటే అతని మాటలు చేతలు స్త్రీలను కించపఱచే విధంగా ఉంటాయి. స్త్రీ అంటే తమ సుఖానికి ఒక యంత్రంలాంటిదని చెప్పకనే చెప్తారు.

## రవి లగ్నం నుంచి అష్టమంలో ఉంటే :

ఈ జాతకులు ఎక్కువ ధన లేమితో బాధపడతారు. కష్టతరమైన జీవితం గడుపుతారు. జీవితం అంతా ధనలోపం వల్ల అనేక బాధలు చికాకులు, మానసిక

వ్యధలు అనుభవిస్తారు. సమాజంలో అనామకులుగా ఉండిపోతారు. జీవితంలో ఏ కార్యం సాధించలేక కాకి చిరకాలం అన్న రీతిలో వీరి జీవన విధానం నడుస్తుంది.

## రవి లగ్నంనుండి నవమ స్థానంలో ఉంటే :

వీరికి హాస్య చతురత ఎక్కువ. వీరి భాష ప్రసంగాలలో సున్నితమైన హాస్యం తొణికిసలాడుతూ ఉంటుంది. వీరి పరిభాష మృదువుగాను మరియు వినడానికి వినసొంపుగాను ఉంటుంది. మంచి మిత్రులు కలిగి ఉంటారు. వారి నుండి సహాయ సహకారాలు పొందుతారు. బంధువులతో కూడ సాదరంగా ఉంటారు. కాని తండ్రితో ఎక్కువ విభేదం ఉంటుంది. దాని వల్ల వ్యాకుల పడి భిన్నులవుతారు.

## రవి లగ్నం నుండి దశమ స్థానంలో ఉంటే :

ఈ జాతకులకు మంచి విచక్షణ, జ్ఞానం ఉంటుంది. పట్టుదలతో తమ కార్యసాధనలో కృతకృత్యులవుతారు. ధన సంపాదనలో నేర్పు, నైపుణ్యం కనపబరచి ధర్మ పద్ధతిని ధనం సంపాదిస్తారు. ఐశ్వర్యవంతులుగా ఉండి భోగభాగ్యాలు అనుభవిస్తారు. ధనకనక వస్తు వాహన మొదలగు సౌకర్యములు కలిగి జీవితంలో దేనికి లోటు లేకుండ సుఖప్రదమైన జీవితం గడుపుతారు. ఉదారత్వం కలిగి బంధుమిత్రులను వారి కష్టసమయంలో ప్రేమవాక్యాలను చూపిస్తూ ఓదార్పుతో వారిని ఆదరిస్తారు. ప్రజాసహితముగా ఉండి అందరి మన్ననలను పొందుతూ జీవితం అంతా సంతోషంగా గడుపుతారు. వీరికి పుత్రసంతానం ఉంటుంది. ఆ పుత్ర సంతానం వల్ల అన్ని విధాల సుఖపడతారు. వృద్ధాప్యంలో వారి సేవలను అందుకొంటారు.

## రవి లగ్నం నుండి ఏకాదశ స్థానంలో ఉంటే :

ఈ జాతకులకు ఉన్నత విద్య ఉంటుంది. మంచి శాస్త్ర పరిజ్ఞానం కలిగి ఆ శాస్త్ర విద్యలో ఉన్నత స్థితికి ఎదుగుతారు. మంచి లోక విచక్షణా జ్ఞానం కలిగి ధన సంపాదన చేసి తమ జీవిత ప్రయాణంలో దేనికి లోటు లేక ధనికులుగా జీవిస్తారు. మంచి ఆరోగ్యం ఉంటుంది. శరీర దారుఢ్యం కలిగి బలంగా ఉంటారు. పైకి ప్రజాహితులుగా ఉన్నా వారి మనస్సులో అసూయ ద్వేషాలు ఎక్కువగా ఉంటాయి. అవి బహిర్గతం కావు.

## రవి లగ్నం నుండి ద్వాదశ స్థానంలో ఉంటే :

ఈ జాతకులు మూఢులు. బుద్ధిహీనులుగా ఉంటారు. వీరి మనస్సును ఎవరు రంజింపచేయలేరు. జ్ఞాన శక్తి తక్కువ. లోకవిచక్షణా జ్ఞానం లేక వివేక శూన్యులుగా ఉంటారు. ఏ విద్యలోను రాణింపరు. ఒకవేళ విద్య ఉన్న ఆ విద్యకు తగినంత గుర్తింపు గాని రాణింపు గాని తెచ్చుకొనే సమర్థత వీరికి ఉండదు. శారీరక దారుఢ్యం లేక అనారోగ్యం పాలవుతారు. తండ్రితో విభేదించి తప్పుడు మార్గాల బారిన పడి జీవితమంతా కష్టాలతో బాధపడతారు. వీరి జీవితం చాల దైన్యంగా ఉంటుంది.

# చంద్రుడు

ఈ అధ్యాయంలో మనం రవి లగ్నస్థానం నుంచి ఏ రాశిలో ఉంటే ఏ ఫలితాలు వస్తాయో రాశి ప్రకారం ఒక క్రమ సంఖ్యలో నేర్చుకొన్నాం. ఇప్పుడు మనం చంద్రుని గురించి తెలుసుకొందాం. అంటే లగ్నస్థానం నుండి లెక్కపెట్టినప్పుడు గాని లేక లగ్నంలో ఉన్నప్పుడు గాని చంద్రుడు వల్ల మనకు ఏ ఫలితాలు కలుగుతాయో వివరంగా నేర్చుకొందాం.

## చంద్రుడు లగ్నస్థానంలో ఉంటే :

ఈ జాతకులకు ఆలోచనాపరిధి మిక్కిలి ఎక్కువగా ఉంటుంది. వీరి భావనశక్తి మరియు భావావేశం ఈ రెండు సమతుల్యంగా ఉంటాయి. వీరికి ధైర్యం తక్కువ. మొండిగా సాహసించి ఏ పనికి తలపెట్టరు. కార్యసాధన కోసం క్షుణ్ణంగా ఆలోచించి ఆ తర్వాతే ఒక నిర్ణయానికి వస్తారు. కాని ప్రతిఫలం గాలికి వదలక శ్రమపడతారు. అంటే కార్యసాధనలో కీడెంచి మేలెంచమన్నట్లుగా ఆలోచిస్తారు. కాని ఆ పని యందు ఉపేక్షభావం చూపించరు. భావుకత ఎక్కువ. సున్నిత మనస్కులుగా ఉంటారు. వ్యతిరేక పరిస్థితులు సంభవించినప్పుడు అవసరమైన దానికంటే ఎక్కువగా మనస్తాపం చెందుతారు. స్వభావంగా నెమ్మదస్తులు మరియు శాంతికాముకులు. వీరి మాటలలో వారి సాత్విక స్వభావం, సౌమ్యం ప్రస్ఫుటంగా గోచరిస్తాయి. ఎవరిని బాధించరు. మానవతా దృక్పథం కలిగి ఇతరులు ఇక్కట్లలో ఉన్నపుడు వారికి యథాశక్తి సహాయ సహకారాలు అందిస్తారు.

## లగ్న స్థానం నుండి చంద్రుడు ద్వితియంలో ఉంటే :

ఈ జాతకులకు ఎవరితోను సఖ్యత ఉండక శాశ్వత మిత్రత్వం అనేది లేక ఎవరితోను సరిపడక ఒంటరి జీవితం గడుపుతారు. ఒకవేళ ఏ ఇద్దరు లేక ముగ్గురు మిత్రులున్న వారితో ప్రాణ స్నేహం. లేక ఏదో కాలక్షేపానికి పనికి వచ్చే మిత్రత్వమే తప్ప కష్ట సుఖాలు పంచుకొనే హృదయ స్పందన ఉండదు. ఎవరిని నమ్మలేరు. తమ విషయాలన్నీ చాల గుట్టుగా ఉంచుతారు. కంఠస్వరంలో మెత్తదనం ఉంటుంది. హెచ్చు స్వరంతో మాట్లాడలేరు. ధనానికి లోపం ఉండదు. భోగజీవితం గడుపుతారు. కాని జీవితంలో తమకేదో లోపించినట్లు విచారిస్తూ అనవసరమైన ఆందోళనకు ఆవేదనకు గురి అవుతూ ఉంటారు. నిజానికి వారికి జీవితంలో అన్ని విధాల తృప్తి గల జీవితమే ఉంటుంది.

## లగ్న స్థానం నుండి చంద్రుడు తృతీయంలో ఉంటే :

ఈ జాతకులకు బాల్యం నుంచే విద్యయందు అభిలాష ఉత్సాహం కనుపఱుస్తారు. విద్యాభ్యాసంలో సహాధ్యాయుల కన్న మెరుగుగా ఉంటారు. ఉన్నతమైన విద్యను గడిస్తారు. మంచి ప్రపంచ జ్ఞానం కలిగి విలక్షణమైన ఆలోచనాశక్తి కలిగి ఉంటారు. జీవితంలో సోదరులతో సత్సంబంధాలు ఉంటాయి. సోదరుల మీద ప్రేమవాత్సల్యాలుకలిగి అవసర సమయాలలో వారి మీద ఆధారపడి లేదా వారికి అవసరమైనంత సహాయం చేస్తూ తృప్తి చెందుతారు. ఏదో ఒక శాస్త్రంలో గాని లేక ఒక భాషలో గాని మంచి నైపుణ్యం సంపాదించి విద్వాంసులుగా ఉంటారు. తమ జీవితంలో దేనికీ లోటు ఉండదు. అంటే భోగభాగ్యాలు మణిమాణిక్యాలు సంపాదించక పోయినా ఆత్మ సంతృప్తితో సంతోషంగా చిరునవ్వుతో జీవిస్తారు. వీరికి కార్యదక్షత ఎక్కువ. మత కుల సంప్రదాయాలను గౌరవించి, మతపీఠాధిపతులను, ఉన్నతశ్రేణి కళాకారులను గౌరవించటం వారి ప్రత్యేకత.

## లగ్నం స్థానం నుండి చంద్రుడు చతుర్థంలో ఉంటే :

ఈ జాతకులకు తల్లి అంటే ఎక్కువ భక్తి గౌరవాలు ఉంటాయి. ఆమె మాటను ఎపుడు కాదనలేరు. మాతృభక్తి ఎక్కువని చెప్పవచ్చు. అందువల్ల తల్లి తరుపున బంధువులతో సఖ్యంగా ఉంటూ వారికి కావలసిన సహాయ సహకారాలు యథాశక్తితో

అందిస్తూ, వారితో కలిసి మెలసి ఉంటారు. వీరికి జాలి గుణం ఎక్కువ. అందువల్ల ఇతరుల కష్ట సుఖాలను చక్కగా అవగాహన చేసుకొని వారికి సహాయపడుతారు. జీవితమంతా సుఖశాంతులతో గడిచిపోతుంది. మంచి ముఖ వర్చస్సు కలిగి మంచి దేహచ్ఛాయ ఉండుట వల్ల తమ అందాన్ని ముఖస్తుతి చేసే వాళ్లంటే ఇష్టపడతారు.

## లగ్నంలో స్థానం నుంచి చంద్రుడు పంచమంలో ఉంటే :

ఈ జాతకులకు పురుష సంతానం తప్పకుండా ఉంటుంది. వారికి కలిగిన పిల్లలు చాల ఆకర్షణీయంగా అందంగాను ఉంటారు. వీరి సంతానాన్ని వారి రూపురేఖ లను గమనించినవారు ఆ పిల్లలను మెచ్చుకోకుండా ఉండలేరు. వృద్ధాప్యంలో సంతానం వల్ల సుఖం పొందుతారు. వారి సేవలను అందుకొంటారు. వీరికి స్వభావసిద్ధంగా పిఱికితనం భయం ఎక్కువ. అందువల్ల ఏ నిర్ణయం త్వరితంగా తీసుకోలేరు. మంచి మేధోసంపత్తు తెలివితేటలతో కార్యసాధన చేసుకొంటారు. వీరికి మిత్ర సంఖ్య ఎక్కువ. కొంచెం చేతివాటుతనం ఉండుట వలన ఆశకు లోనై చిన్న వస్తువైనా లేక ధరలో అతి తక్కువ వస్తువైనా తస్కరిస్తారు. తినుబండారాల మీద మక్కువ ఎక్కువ. తన ఇంట్లో చిన్నతనంలోను బాల్యంలోను మరియు పెద్దరికంలోను తల్లికి భార్యకి తెలియకుండా తినుబండారాలను దొంగిలించి తినడం అలవాటుగా ఉంటుంది.

## లగ్నం స్థానం నుంచి చంద్రుడు షష్ఠమంలో ఉంటే :

ఈ జాతకులు మూర్ఖత్వంతోను అంధత్వంతోను వితండ వాదాలుచేస్తు శత్రుత్వం కొని తెచ్చుకొంటారు. ఆవేశకావేశాలెక్కువ. సమయసందర్భాలుచూడక తమ వాచాలత్వం చేత అందరిలోను చిన్నపోతారు. ఎవరి దగ్గర నుంచి సహాయ సహకారాలు పొందక బాధపడతారు. వీరికి మిత్రులుఉండరు. అజీర్ణంమరియుఉదరవ్యాధులతో బాధపడతారు.

## లగ్నం స్థానం నుండి చంద్రుడు సప్తమంలో ఉంటే :

వీరు వివాహం చేసుకొనే కన్య రూపంలోను, ఆకర్షణలోను, గుణములోను మరియు ఉద్యోగంలోను మరియు అన్నిటిలో వీరికంటే ఉన్నతస్థితిలో ఉంటుంది. వీరు స్త్రీలకు ఇష్టుడుగా ఉంటారు. తమ వాక్చాతుర్యం చేత భార్యను ఎప్పుడూ సంతోషంగా ఉంచి ఆమె చే ఆరాధింపబడతాడు. దాంపత్య జీవితంలో ఎన్నడు ఒడుదుడుకులు ఉండక వీరి సంసార జీవితం ఆనందమయంగాను సాఫీగాను సాగిపోతుంది.

## లగ్న స్థానం నుండి చంద్రుడు అష్టమంలో ఉంటే :

వీరు పుట్టుకతో మంచి తెలివితేటలు, గణనీయమైన మేధోసంపత్తు కలిగి ఉంటారు. ప్రపంచజ్ఞానం ఎక్కువ. సమయ సందర్భాలు గ్రహించి తదనుగుణంగా లౌక్యంగా జీవిస్తారు. మంచి ముఖవర్చస్సు కలిగి ఆకర్షణీయంగా ఉంటారు. బాల్యంలో బాలారిష్టదోషంతో గాని లేక మరేమైనా రుగ్మతతోగాని బాధపడవచ్చును. సామాన్య ధన సంపాదన కలిగి సగటు జీవితం సాగిస్తారు.

## లగ్న స్థానంనుంచి చంద్రుడు నవమ స్థానంలో ఉంటే :

వీరికి దైవశాస్త్రాలు, పురాణోపనిషత్తులు అంటే ఎక్కువ మక్కువ. కులపెద్దలను గౌరవిస్తారు. కులాభిమానం మతాభిమానం ఎక్కువ. మఠాధి, పీఠాధిపతులను భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. దైవపూజలు పండుగలు వైదిక కార్యాలు చేస్తారు. పవిత్రమైన జీవితం గడుపుతారు. వీరికి యోగ్యులైన సంతానం కలుగుతుంది. దాంపత్య జీవితంలో సుఖసంతోషాలు చవి చూస్తారు. సభామర్యాద, ప్రజాగౌరవం పొందుతారు.

## లగ్న స్థానం నుంచి చంద్రుడు దశమంలో ఉంటే :

వీరి జీవితమంతా ఉద్యోగం చేసే గడుపుతారు. ప్రభుత్వపరమైన అధికారపూరిత మైన పదవి పొందుతారు. మంచి ధనార్జన ఉంటుంది. వాహన భృత్య సౌఖ్యాలు ఉంటాయి. మంచి మనసు కలిగి దానధర్మాలు చేస్తారు. మంచి శరీరాకృతి కలిగి అందంగాను ఆకర్షణీయంగాను ఉంటారు. ధన సంపత్తు బాగా ఉటుంది. పురుష సంతానం ఎక్కువ. జీవితంలో కార్యదర్శకులుగా పేరుపొంది కష్టసాధ్యమైన కార్యములు గూడ అవలీలగా సాధిస్తారు. సుఖభోగ భాగ్యాలతో ఆనందమయ జీవితం గడుపుతారు. మంచివారుగా పేరు తెచ్చుకొని బంధుమిత్రులతో కలిసి మెలసి వారిలో ఒకరిగా జీవిస్తారు. తనవంతుగా వారికి యథాశక్తిగా సహాయసహకారాలు అందిస్తారు.

## లగ్నం స్థానం నుంచి చంద్రుడు ఏకాదశ స్థానంలో ఉంటే :

వీరికి మంచి ఆరోగ్యం ఉంటుంది. ఎన్నడు ఏ రుగ్మతలతో బాధపడరు. ధనసంపాదన కలిగి ఆనందమయ జీవితం గడుపుతారు. కార్యదక్షత కలిగి తాము అనుకొన్న పనులను సాధిస్తారు. సగటు జీవితం గడుపుతారు.

## లగ్నం స్థానం నుంచి చంద్రుడు ద్వాదశ స్థానంలో ఉంటే :

వీరు కుటిలురు. నమ్మదగిన వ్యక్తులు కారు. తమ స్వలాభం కోసం ధర్మం, నీతి నియమాలను నిర్లక్ష్యం చేసి ఇతరులను బాధించి ధన సంపాదన చేస్తారు. వీరి సంపాదన, వృత్తిలో కూడ అంతా అన్యాయం, దుర్మార్గం, అవినీతి ఎక్కువ. దుర్జన సాంగత్యములు ఎక్కువ. ఏదో ఒక వ్యసనం తప్పక ఉంటుంది. వీరి వల్ల కన్న తల్లిదండ్రులకు మనోవ్యథ వ్యాకులత దుఃఖం కల్గుతుంది. తమ కులానికి చేటు, చెడ్డపేరు తెస్తారు. శత్రువులు ఎక్కువగా ఉంటారు. నీచ పద్ధతిలో ధనం ఆర్జిస్తారు.

# కుజుడు

ఇంతవరకు మనం గ్రహాలలో సూర్యుడు మరియు చంద్రుడు లగ్న స్థానాలనుంచి లెక్కపెట్టినప్పుడు ఏ రాశిలో ఉంటే ఏ ఫలితాలు ఇస్తాయో నేర్చుకొన్నాం. ఇప్పుడు మనం కుజుడు లగ్నం నుంచి ఏ రాశిలో ఉంటే ఏ ఫలితాలు ఇస్తాడో తెలుసుకొందాం.

## కుజుడు లగ్నస్థానంలో ఉంటే :

ఈ జాతకులకు సాహసం మరియు పట్టుదల ఎక్కువ. వారి ఆలోచనలు ఒక నిర్ణీత పరిధిలో ఉండవు. చాలా చంచలమైన స్వభావం మరియు స్త్రీల విషయంలో చిత్త చాంచల్యం మరీ ఎక్కువ. వారి నిర్ణయాలకు వారే కట్టుబడక సమయానుకూలంగా తమ యిచ్ఛారీతిలో ప్రవర్తిస్తారు. జీవిత భాగస్వామితో భేదాభిప్రాయాలు అనవసరంగా కొని తెచ్చుకుంటారు. కొంతమందికి గ్రహస్థితిని బట్టి ఆయుర్దాయం తక్కువగా ఉంటుంది. నడి వయసులో మరణించవచ్చు. అంటే మధ్యమాయుర్దాయమే ఉంటుంది. కాని ఈ జాతకుల మారకత్వంను యిచ్చే గ్రహాల పరిస్థితి లగ్న మరియు అష్టమ స్థానాలరీత్యా గమనించాలి అనే విషయం మనం మఱచిపోరాదు. వీరికి కోపం ఎక్కువ. అలాగే ఉద్రేకాలకులోనై జీవిత భాగస్వామితో విభేదించి దాంపత్య జీవితంలో సుఖ సంతోషాలు కోల్పోతారు.

## కుజుడు లగ్నస్థానం నుండి ద్వితీయ స్థానంలో ఉంటే :

ఈ జాతకులు మూర్ఖులు మొండివారు. తాను పట్టిన కుందేలుకు మూడేకాళ్లు అనే వాళ్లు మరియు విద్యా విహీనులు. ఒకవేళ విద్య ఉన్నా కూడ వివేకశూన్యులుగానే

ఉంటారు. దుర్జన సాంగత్యానికి పాలుపడతారు. అట్టి దుర్జనులతో చేతులు కలిపి జుగుప్సాకరమైన పనులు చేయడానికి సాహసిస్తారు. వీరంటే బంధుమిత్రులకు సదభిప్రాయం కాని లేక గౌరవం గాని ఉండవు. వారితో విభేదించి చెడ్డపేరు తెచ్చుకొంటారు. వీరి ప్రవర్తన వల్ల తల్లిదండ్రుకు మనోక్షోభం కల్గుతుంది. తల్లిదండ్రులను బాధపెట్టి వారికి మనోవ్యాకులత కలిగిస్తారు. సరియైన ధనార్జన లేక ధనలోపంతో బాధపడతారు. సగటు జీవితం కంటే తక్కువ తరగతి జీవితం గడుపుతారు. దాంపత్యంలో వాదాలకు తెరతీస్తారు. జీవిత భాగస్వామితో సహకరించరు.

**కుజుడు లగ్నస్థానం నుంచి తృతీయంలో ఉంటే :**

వీరికి పెద్దల నుంచి వంశ పారంపర్యంగా స్థిరాస్థి వస్తుంది. పాడిపంటలు ఉంటాయి. మంచి తెలివి తేటలు కలిగి సమాజ ధర్మాన్ని కూలంకషంగా జీర్ణించుకొని తదనుగుణంగా ప్రవర్తిస్తూ పేరు ప్రఖ్యాతులు సంపాదిస్తారు. కార్యదక్షత పట్టుదల కలిగి ఎంతటి సాహసమైన చేసి కష్టనష్టాల కోర్చి తమ కార్యసాధనలో విజయాన్ని సాధిస్తారు. వీరికి బహుశా అన్నదమ్ములు ఉండకపోవచ్చు.

**కుజుడు లగ్నం నుంచి చతుర్ధంలో ఉంటే :**

ఈ జాతకులకు అత్యాశే కాకుండా, దురాశపరులుగా కూడా ఉంటారు. జీవితంలో దేనికి సంతృప్తి చెందక జీవితమంతా అసంతృప్తితోనే జీవిస్తారు. తమ జీవితంలో ఉన్న లోపాలను తలుచుకొంటు దుఃఖపడుతూ ఉంటారు. కాని ఆ లోపాలు సరిచేసుకొనేందుకు ప్రయత్నించరు. వీరికి అత్తమామలతో గాని జీవిత భాగస్వామితో గాని సత్సంబంధాలు కలిగి ఉండక వారితో తీవ్రమైన భేదాభిప్రాయాలు కలిగి ఉంటారు. తల్లిదండ్రులతో విభేదించి స్వగృహం వీడి వేరే గృహంలో నివసిస్తారు. వీరికి బంధుప్రీతి ఉండదు. జీవిత భాగస్వామితో విరోధం తెచ్చుకొని అహంకారంతో ప్రవర్తించి వారి దాంపత్యం విచ్చిన్నానికి వారే మూల కారకులవుతారు. ద్వితీయ కల్యాణ దోషం ఉంటుంది. స్వయంకృతాపరాధం వల్ల ఈ దోషం వస్తుంది.

**కుజుడు లగ్నం నుండి పంచమంలో ఉంటే :**

ఈ జాతకులకు బహుశా సంతానదోషం ఉండొచ్చు. అంటే పుత్రసంతానం లేకపోవడం కాని జన్మించిన శిశువు మరణించడం గాని భ్రష్టుడైన కుమారుడుగాని

ఉండవచ్చు. కాని వీరికి లౌక్యం ఎక్కువ. సముచిత సంభాషణలలో ప్రజ్ఞ కలిగి ధనదాన్యంలో దేనికి లోపం లేక ఆనందమయ జీవితం గడుపుతారు. మంచి మిత్రులు ఉంటారు. మృదుభాషణ, సౌమ్యత వీరికి పెట్టని ఆభరణాలు. స్వయంకృషితో ధనం సంపాదిస్తారు.

## కుజుడు లగ్నం నుంచి షష్టమంలో ఉంటే :

ఈ జాతకులకు మంచి ఆరోగ్యం ఉంటుంది. శరీర దారుఢ్యంతో మోటుగా కనబడతారు. వారి సంభాషణాలలో మరియు చేతలలో కూడా వారి మొరటుతనం స్పష్టంగా కనబడుతుంది. తిండిపోతులుగా ఉంటారు. ఎక్కువ కామ వాంఛ కలిగి ఉంటారు. పరస్త్రీ వాంఛ ఎక్కువ. కాని బంధుమిత్రులలో మంచి గుర్తింపు ఉంటుంది.

## కుజుడు లగ్న స్థానం నుంచి సప్తమంలో ఉంటే :

ఈ జాతకులు ఎప్పుడు ఏదో రుగ్మతతో బాధపడతారు. దీర్ఘకాలం రోగపీడితులుగా ఉంటారు. అనారోగ్యం వీరిని నడి వయసులో కృంగదీస్తుంది. దుష్ట సాంగత్యం ఎక్కువ. దయాదాక్షిణ్యాలు లేక మానవీయతను మట్టి కలిపి జీవిత భాగస్వామిని హింసించి సాంప్రదాయ, సంస్కార శాస్త్ర విరుద్ధమైన పనులు పాపభీతి లేకుండ చేస్తారు. వివాహం చాల ఆలస్యమవుతుంది. దాంపత్య జీవితంలో సఖ్యత, సహనం ఓర్పు లేక దాంపత్య విచ్ఛిన్నం చేసుకొంటారు. ద్వితీయ కల్యాణ దోషం ఉంటుంది. వివాహం చాల ఆలస్యంగా అవుతుంది. భార్యతో సఖ్యత సరిగా ఉండక ప్రతిదినం వాదులాడుట వల్ల పరస్పర అభిప్రాయ భేదాలు విరోధం కల్గి ఆ దాంపత్యం విచ్ఛిన్నమవడానికి కూడ అవకాశం ఉంది.

## లగ్న స్థానం నుండి కుజుడు అష్టమంలో ఉంటే :

ఈ జాతకులకు చాల తక్కువ తరగతిలో ఉన్న విద్యా విహీనులు, లోక విచక్షణా రహితులు మరియు హేయమైన బానిస వృత్తిలో గాని లేక అధర్మ సంపాదన చేసే వారితో గాని ఎక్కువ స్నేహం ఉంటుంది. అంటే అనారోగ్యంతో గాని లేక ఏదైనా దీర్ఘకాల రుగ్మతతో గాని బాధపడతారు. జీవితంలో ధనహీనులై సరియైన సంపాదన లేక ఒక వేళ మంచి సంపాదన ఉన్నా ఆ ధనాన్ని నిల్వ చేయడం గాని,

వివేకంతో గాని నిల్వ చేసే సామర్థ్యం ఉండదు. ఎప్పుడు ఏదో ఒక అసంతృప్తితోనే బాధపడతారు. వీరికి సంతృప్తి ఏ కోశాన ఉండదు. మిక్కిలి స్వార్థపరులుగా ఉండి తమ స్వలాభం చూసుకొంటారు. అత్యాశ మరియు దురాశ ఈ రెండు సమపాళ్లలో ఉండి తమ ధన వ్యామోహానికి అడ్డుకట్ట వేయరు.

## లగ్న స్థానం నుంచి కుజుడు నవమ స్థానంలో ఉంటే :

వీరికి నీచ మనస్తత్వం ఎక్కువ. ధర్మనిరతి లేక అధర్మంగా ప్రవర్తిస్తారు. వీరికి శాస్త్ర పాండిత్యంగాని లేక శాస్త్రజ్ఞులను పండితులను గౌరవించేటంతటి ఔన్నత్యం ఉండదు. అదే కాక వారి మీద చులకన భావం ఉంటుంది.

## లగ్న స్థానం నుండి కుజుడు దశమ స్థానంలో ఉంటే :

వీరికి సమాజంలో విలువైన గౌరవ ప్రతిష్టలు ఉంటాయి. జనప్రఖ్యాతులుగా ఉంటారు. ఉన్నత ఉద్యోగం, అధికారం, హోదా, వృత్తిలో జయం పొంది మంచి ఆదాయంతో ఆనందమయమైన జీవితం గడుపుతారు. బాల్యం నుండి విద్యాభ్యాసంలో అపజయమన్నది ఎఱుగక ఉన్నత విద్యను సాధిస్తారు. మంచి సంతానం కల్గి వారి వల్ల వృద్ధాప్యంలో సేవలు పొందుతారు.

## లగ్న స్థానం నుండి కుజుడు ఏకాదశ స్థానంలో ఉంటే :

ఈ జాతకులకు అత్యంత సంతృప్తికరమైన జీవితం సాగిస్తారు. ఎప్పుడూ ఉన్నత ప్రమాణాలు కలిగిన సుఖాలు, భోగాలు అనుభవిస్తారు. ప్రతి విషయంలోను తాము సంపాదించిన దానికి లేక లభించినదానికి సంతృప్తి పడి తమ మనస్సును ఆహ్లాదపరచుకొంటారు. అంతేకాని ఎండమావుల కోసం పరుగెత్తరు. అందువల్ల వీరికి జీవితంలో అసంతృప్తి అనేది ఉండదు. కార్యదీక్ష, పట్టుదల ఎక్కువ. వీరి జీవన విధానంలో సుఖసంతోషాలు, భోగభాగ్యాలు శాంతిసౌఖ్యాలే తప్ప ఎన్నడు కూడా విచారవిషాద శోకాలు అనేవి తెలియకుండ ఆనందమయ జీవితం గడుపుతారు.

## లగ్నం నుండి కుజుడు ద్వాదశ స్థానంలో ఉంటే :

ఈ జాతకులకు మంచి రూపం ఉండదు. అంద విహీనులుగాను ముఖ వర్చస్సు లేక మొరటుగాను కన్పిస్తారు. మాటలలో కాఠిన్యం వివేకశూన్యత స్పష్టంగా

బహిర్గతమవుతుంది. మూర్ఖులు, మొండివారిగానే కాక దుష్టులుగా సమాజంలో ముద్ర వేయబడతారు. నీచకార్యం చేయుటలో సిద్ధహస్తులు. వారి సంపాదన చాల భాగం అక్రమార్జనగానే ఉంటుంది. వీరు చట్టవిరుద్ధమైన పనులు, చౌర్యం, జూదం లాంటి అసాంఘిక కార్యక్రమాల్లో పాల్గొని కారాగార శిక్ష కూడ అనుభవించవచ్చు.

మనం ఒక వరుస క్రమంలో లగ్న స్థానం నుంచి ప్రతి గ్రహం ఏ రాశిలో ఉంటే ఏ ఫలితం ఇస్తాడో నేర్చుకుంటున్నాం. ఈ క్రమంలో మనం సూర్యుడు, చంద్రుడు, కుజుడు ఈ ముగ్గురి గ్రహాల గురించి వారిచ్చే ఫలితాలు ఎలా ఉంటాయో వివరంగా తెలుసుకొన్నాం. ఇప్పుడు బుధ గ్రహం గురించి తెలుసుకొందాము.

# బుధుడు

## బుధుడు లగ్న స్థానంలో ఉంటే :

ఈ జాతకులు మంచి మనస్సు కలవారు. బుద్ధిమంతులుగా ఉంటారు. సత్ప్రవర్తన కలిగి తమ నడవడికలో లేక దైనందిక జీవితంలో ఎటువంటి లోపాలు లేకుండా చూసుకొంటారు. బుద్ధి పాదరసంలా పని చేస్తుంది. తమ ఆలోచనా విధానంలో ఎంతో వాస్తవికత ఉంటుంది. ఉన్నత విద్య గడిస్తారు. కావ్యాలు, శాస్త్రాల పఠనమందు ఉత్సాహం చూపుతారు. ముఖ్యంగా గణిత శాస్త్రంలో ప్రావీణ్యత కలిగి యుంటారు. మంచి ఆరోగ్యం కలిగి చక్కటి దేహచ్ఛాయ కలిగి ఉంటారు. కన్నుముక్కు తీరు చక్కగా తీర్చిదిద్దినట్లుండి చూపరులకు ఆకర్షణీయంగా కనపడతారు. మంచి వక్తగా పేరుపొంది సభాగౌరవం పొందుతారు. బంధుమిత్రులందరకు అభిమానులుగా ఉంటారు. పరిపూర్ణమైన ఆయుషుతో జీవిస్తారు.

## బుధుడు లగ్నస్థానం నుండి ద్వితీయంలో ఉంటే :

ఈ జాతకులకు మంచి వాక్పటిమ, సమయస్ఫూర్తి, హాస్య చతురత మిక్కిలిగా ఉంటాయి. ధర్మాధర్మ జ్ఞానం కలిగి బంధుమిత్రులతో కలసి మెలిగి వారికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తారు. శాస్త్రములను పఠించడానికి ఉత్సాహం చూపి ఏదో ఒక శాస్త్రంలో మంచి పరిజ్ఞానం సంపాదిస్తారు. ముఖ్యవిషయం ఏమంటే వీరు స్వార్జిత ధన సంపాదకుడుగా ఉండి ధనం విలువను తెలిసికొని వ్యయం

చేస్తారు. భోజన ప్రియులుగా ఉంటారు. వస్త్రాలంకారములో శ్రద్ధచూపుతారు. ముఖంలో చిరునవ్వు చెఱగిపోదు.

## బుధుడు లగ్నస్థానం నుండి తృతీయంలో ఉంటే :

వీరు తక్కువ తరగతి అయినా చేతి పనులు నేర్చుకొని శరీరశ్రమ చేసి జీవిస్తారు. తన వృత్తి ధర్మంలో తమ లాభం కోసం ఇతరులను ప్రలోభపెట్టి వారిని మోసం చేసి స్వార్థపరత్వంతో ధనం సంపాదించడానికి వెనకాడరు. వీరికి కపటం, చిత్త చాంచల్యం ఎక్కువ. ఎంత సంపాదించినా ఆ సంపాదనను సరియైన రీతిలో వ్యయం చేయడం తెలియక జీవితమంత దరిద్రబాధ అనుభవిస్తారు.

## బుధుడు లగ్నస్థానం నుండి చతుర్థంలో ఉంటే :

ఈ జాతకులకు జీవిత పరమార్థంలోని రహస్యం తెలియక సంపాదన లేకుండ పరుల ఇళ్లల్లో ఎక్కువకాలం గడుపుతారు. స్వయంగా ధన సంపాదనకు ప్రయత్నించరు. భార్య పిల్లల సంపాదనతో జీవిస్తారు. వీరు కుటుంబ సభ్యులలో విలువలు కోల్పోయి జీవితమంతా అసంతృప్తితోను, దుఃఖంతోను గడుపుతారు. పైకి మాత్రం దర్పం డాంబికం కనబరుస్తూ పసలేని ప్రసంగాలు చేస్తు అగౌరవంగా చూడబడతాయి. జీవితకాలంలో ధనలోపం ఎక్కువ అనుభవిస్తారు. వాహన సౌఖ్యం ఉండకపోవచ్చు.

## బుధుడు లగ్న స్థానం నుండి పంచమంలో ఉంటే :

వీరికి ఓర్పు సహనం ఎక్కువ. సహనశాలురుగా ఉంటారు. వీరి సంభాషణలో సున్నితం సౌమ్యం స్పష్టంగా గోచరిస్తాయి. వివేక జ్ఞానం కలిగి ఎవరిని నొప్పించక తానొవ్వక లౌక్యంతో జీవిస్తారు. సుస్సాంగత్య సజ్జన సావాసం మాత్రమే ఉంటాయి. ఎందుకంటే గంగి గోవు పాలు గరిటెడైనా చాలనే ఉద్దేశ్యం. ఐశ్వర్యవంతులుగా జీవిస్తారు. పుత్ర సంతానం తప్పక ఉంటుంది.

## బుధుడు లగ్నస్థానం నుండి షష్టమంలో ఉంటే :

ఈ జాతకులు శాంతిప్రియులు. ఏ విషయంలోనైనా మంచి చెడ్డలు విశ్లేషించి ఒక నిర్ణయం తీసుకొంటారు. వీరి సంభాషణంలో భాష స్పష్టత మరియు ఎప్పుడు సత్యసంధత ఉండి తమ మనోభావాన్ని లౌక్యం లేక రూఢిగా విశదీకరిస్తారు. అందువల్ల

వీరి భావ ప్రకటనలోని నిజాయితి గాని సత్యప్రకటన గాని అప్రియంగా ఉండుట వల్ల అప్పుడప్పుడు విమర్శలకు గురి అవుతారు.

**బుధుడు లగ్న స్థానం నుండి సప్తమ స్థానంలో ఉంటే :**

ఈ జాతకులకు మంచి రూపురేఖలు కలిగి అందంగాను, ఆకర్షణీయంగాను మరియు మంచి మేధోసంపత్తు కలిగిన కన్యను భార్యగా పొందుతారు. బహుశా వీరిది ప్రేమ వివాహం కావచ్చు మరియు తన కంటే తక్కువ జాతి స్త్రీ కావచ్చు. కాని ఈ జాతకుల కంటే తాను వరించిన కన్య అన్ని విషయాలలో ఉన్నత స్థితిలో ఉంటుంది. భార్య వల్ల ధనం, స్తిరాస్థి లభిస్తుంది. ఆనందమయ జీవితం గడుపుతారు. ఆమె భర్త జీవనగతిలో మార్గదర్శకంగా అన్ని విధాల సహకరిస్తు ఆతని జీవితానికి ఒక నిర్దుష్టమైన విలువలను చేకూర్చి అతని జీవన నౌకకు చుక్కానిగా ఉంటుంది.

**బుధుడు లగ్నస్థానం నుండి అష్టమంలో ఉంటే :**

ఈ జాతకులు సమాజంలో తమ విలువలను పెంచుకొని స్వయం కృషితో పేరు ప్రఖ్యాతులు సంపాదిస్తారు. కులశ్రేష్టులుగా కొనియాడబడి బంధుమిత్రులకు మార్గదర్శిగా ఉంటారు. కాని ధనలోపం ఉంటుంది. నాయక లక్షణాలు కలిగి ప్రజలను ఒక త్రాటి మీదకు తీసుకొచ్చి, వారిని ఒక పంథాలో నడిపించే శక్తి సామర్థ్యాలు కలిగి ఉంటారు. వీరికి అభిమానులు ఎక్కువగా ఉంటారు.

**బుధుడు లగ్నస్థానం నుండి నవమ స్థానంలో ఉంటే :**

వీరు బాల్యం నుండి విద్యాభ్యాసంలో ఉత్సాహం చూపి విద్యనభ్యసిస్తారు. ఉన్నత విద్య పాండిత్యం ఎక్కువ. ఎక్కువ కావ్యాలు చదువుతారు. దైవశాస్త్రాలలో రచనా వ్యాసంగాలు చేస్తారు. ఆర్థిక లోపం అనేది తెలియక జీవితం అంతా ఐశ్వర్యవంతు లుగా ఉండి భోగభాగ్యాలుగా అనుభవిస్తారు. ముఖ్యంగా వీరికి చక్కటి భాష, విమర్శనాత్మక దృష్టి, వాక్పటిమ కలిగి జీవిత ఉత్తరార్థంలో మంచి పాండిత్య శాస్త్రాను భవం సంపాదించి మంచి రచనలు చేస్తారు. ఆ రచనలు పండిత పామరులకు కూడ మార్గదర్శకాలుగా నిలిచిపోతాయి. పుత్ర సంతానం తప్పక ఉంటుంది. వారు కూడ విద్యలో ఉన్నతస్థితికి ఎదిగి మంచి ధన సంపాదన కలిగి ఐశ్వర్యవంతులుగా జీవిస్తారు. స్థిరాస్తి అనుభవిస్తారు. పరిపూర్ణమైన ఆరోగ్యంతో దీర్ఘాయువులుగా జీవిస్తారు.

## బుధుడు లగ్నస్థానం నుంచి దశమ స్థానంలో ఉంటే :

ఈ జాతకులకు మంచి విద్య ఉంటుంది. విద్యాభ్యాసంలో మంచి ఉత్సాహం చూపి విద్యను ఆసక్తితో ఆకళింపు చేసుకుంటారు. మాటలలో చతురత్వం, వారి వాక్చాతుర్యం, సమయస్ఫూర్తి స్పష్టంగా కనిపిస్తుంది. బోధనాపఠిమ ఎక్కువగా ఉండటం వల్ల ఉపాధ్యాయ వృత్తిలో రాణిస్తారు. ఎప్పుడు చూపరులకు మంచి వస్త్రాలంకరణతో కనిపిస్తారు. అలంకార ప్రియులుగా ఉండి స్త్రీలను ఆకర్షిస్తారు. అందువల్ల వారితో సహాయసహకారాలు పొందుతారు కాని తన శీల భంగం చేసుకోరు. కార్యదీక్ష కలవారై జీవితంలో ఒడిదుడుకులు ఏర్పడినప్పుడు ఖిన్నులవక వాస్తవికతతో సత్యమార్గాన్ని శోధించి, ఆ మార్గాన్ని అనుసరించి తమ లక్ష్యాన్ని సాధించుకుంటారు. మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదిస్తారు.

## లగ్నస్థానం నుంచి బుధుడు ఏకాదశ స్థానంలో ఉంటే :

ఈ జాతకులు జన్మతః సద్గుణ సంపన్నులు. సత్ప్రవర్తన కలిగి జీవనశైలిలో ధర్మం పాటిస్తారు. న్యాయాన్ని విడువరు, అధర్మాన్ని పోషించరు. మంచి ధన సంపాదన కలిగి ఆ ధనాన్ని సద్వినియోగపరుస్తారు. ఐశ్వర్యవంతులై జీవితంలో దేనికి లోటు లేకుండా భోగభాగ్యాలు అనుభవిస్తారు. తమ వృత్తిలో ఉన్నత శిఖరాలకు ఎదిగి అనేక సేవకులు కలిగి ఉంటారు. విచక్షణా జ్ఞానంతో మెసలుతూ అందరితో మంచి వారుగా పేరు తెచ్చుకుంటారు.

## లగ్నస్థానం నుంచి బుధుడు ద్వాదశ స్థానంలో ఉంటే :

ఈ జాతకులు మిక్కిలి మూర్ఖులుగాను, పౌరుషహీనులుగాను ఉంటారు. వారి సంభాషణలో భాషా దరిద్రం, వితండవాదమే కాక పసలేని డాంబిక దర్పాలు తొంగి చూస్తూ ఉంటాయి. మొండితనం ఎక్కువ వల్ల ఇతరులిచ్చే మంచి సలహాలను లెక్క చేయక వారిని అవహేళన చేయడానికి కూడా వెనుకాడరు. ఇతరులలో ఉన్న గొప్ప గుణాలను గ్రహించే శక్తి యుక్తులు లేక వారలను గౌరవింప నేర్వరు. కోపం, అహంకారాలలో ఉండి బంధుమిత్రులలో చెడ్డపేరు తెచ్చుకుంటారు. తమ జీవితం అంతా శుష్క ప్రవచనములలో గడుపుతూ అసంతృప్తి మరియు సంతోషరహితమైన జీవితం గడుపుతారు.

# గురువు

ఈ అధ్యాయంలో మనం గురువును గురించి నేర్చుకుందాము. అంటే ముందు చెప్పిన అధ్యాయాలలో లాగే గురువు లగ్న స్థానం నుంచి ఏ రాశిలో ఉంటే ఏ ఫలితం ఇస్తాడో రాశిక్రమంలో తెలుసుకుందాము.

## గురువు లగ్నస్థానంలో ఉంటే :

ఈ జాతకులకు సగటు జీవనసరళి మాత్రమే ఉంటుంది. కాని దైనందిక జీవితంలో చెప్పుకోదగ్గ ఆటుపోటులుగాని, ఒత్తిళ్లు, ఆందోళనలుగాని ఉండవు. అనుకున్న పనులు అన్నీ సమంగా సాధించుకుపోతారు. పెద్ద అడ్డంకులు గాని లేక ఆటంకాలుగాని ఎదుర్కోరు. శరీరారోగ్యం బాగుంటుంది. సామాన్యంగా ఎటువంటి రుగ్మతలకు లోనుగారు. దీర్ఘ కాల వ్యాధులు లాంటివి లేక ఆరోగ్యంగా ఉంటారు. మంచి పేరు తెచ్చుకుంటారు. ఇతరులకు యధాశక్తి సహాయం చేస్తారు.

## లగ్నస్థానం నుంచి గురువు ద్వితీయ స్థానంలో ఉంటే :

ఈ జాతకులకు ఉన్నత విద్యాభిలాష ఉండటం వల్ల మంచి గుర్తింపు గలిగిన విద్యనభ్యసించి సమాజంలో సముచిత స్థానం సంపాదిస్తారు. మంచి వాక్చాతుర్యం ఉంటుంది. పదిమందిలో మంచి సంభాషణ చేసి తమ భాషా పటిమతో అందరిని ఆకట్టుకుంటారు. జీవితం అంతా మంచి ఆరోగ్యంతో ఉంటారు. సహజీవనంలో నైసర్గికముగా వచ్చే సామాన్య అనారోగ్యం తప్ప పెద్ద రుగ్మతలకు లోనుకారు. వీరికి భోజన ప్రియత్వం ఎక్కువ. అందువల్ల రకరకాల పిండివంటలు, భోజన రుచులలో మార్పుకు ఇష్టం చూపుతారు. విందు భోజనాలంటే మక్కువ చూపుతారు.

## లగ్నస్థానం నుంచి గురువు తృతీయంలో ఉంటే :

వీరికంటే మూర్ఖులు, కోపిష్టులు మరియు మొండివారు ఎవరూ ఉండరంటే అతిశయోక్తి కాదు. ఎక్కువ అసత్యమే పలుకుతారు. అవసరంలేకున్నా అబద్ధమాడడం వీరి నైజం. సదాచార సంపన్నత విడచి కులాచారాన్ని పాటించక హేయమైన పనులకు దిగి హేయమైన జీవితం గడుపుతూ అదే ఆనంద జీవితమనే మూర్ఖత్వంతో ఉంటారు. మాంసభక్షణ, జారతనము మరియు జూదరితనము కలిగి అలాగే జీవిస్తారు.

వేశ్యావాంఛ కలిగి నీచస్త్రీ సాంగత్యానికి పాల్పడి అనేక వివాదాలలో చిక్కుకుని అందరిచేత ద్వేషింపబడుతూ ఎవ్వరి సహాయ సహకారాలు అందుకోక ఒంటరిగా దీన జీవితం గడుపుతారు.

## లగ్నస్థానం నుంచి గురువు చతుర్థంలో ఉంటే :

వీరు మంచివారుగా పేరు తెచ్చుకొని బంధుమిత్రులలో గౌరవం పొందుతారు. సభాగౌరవం పాటించి సభాగౌరవం పొందుతారు. జీవితంలో స్వయం సంపాదన కలిగి మిక్కిలిగా ధనార్జన చేస్తారు. ధన విలువలను తెలుసుకొని ధనాన్ని వృధాచేయక స్థిరాస్థి ఏర్పాటు చేసుకుంటారు. నగలు నాణ్యాలు కొనుగోలు చేస్తారు. ఆధునిక జీవనంలో కావలసిన అన్ని వస్తువులను సమకూర్చుకుని ఐశ్వర్యవంతులుగా జీవిస్తారు. ఉన్నత శ్రేణి జీవన సరళి ఉంటుంది. సత్సాంగత్యం, పేరు ప్రతిష్టలు సంపాదిస్తారు. కార్యదీక్ష కలిగి పట్టుదలతో తమ కార్యాన్ని సాధిస్తారు. అపజయం అన్నది ఎప్పుడూ వీరు చవి చూడరు. ఏ కార్యక్రమమైన ఒక ప్రణాళికా పద్ధతిలో నిర్వహిస్తారు.

## లగ్నస్థానం నుంచి గురువు పంచమంలో ఉంటే :

వీరికి మంచి బుద్ధి కలిగి సత్ప్రవర్తనులుగా జీవిస్తారు. అన్యాయం, అధర్మం చేయడానికి వీరి మనసు ఒప్పుకోదు. సజ్జన సాంగత్యం కలిగి లోకవిచక్షణా జ్ఞానంతో జీవన విలువలను అర్థం చేసుకొని తదనుగుణంగా తమ జీవనశైలిని మార్చుకుంటారు. జీవితంలో దేనికి లోటులేక అన్ని విధాల సుఖసంతోషాలతో జీవనయాత్ర సాగిస్తారు.

## లగ్నస్థానం నుంచి గురువు షష్టమంలో ఉంటే :

వీరికి అనారోగ్యం ఉంటుంది. మంచి ఆరోగ్యవంతులుగా ఉండరు. దీనికి తోడు ధనలోపం వల్ల దారిద్ర్య బాధ అనుభవిస్తారు. అన్న వస్త్రాలకు కూడా లోపించి క్షుద్బాధతో బాధపడతారు. సమాజంలో విలువ గుర్తింపు లేక అపఖ్యాతి పాలై దుర్బలులుగాను, దీనులుగాను జీవితం వెళ్లదీస్తారు.

## లగ్నస్థానం నుంచి గురువు సప్తమంలో ఉంటే :

వీరికి జన్మతః మంచి రూపురేఖలు కలిగి మంచి ఆకర్షణీయంగా ఉంటారు. మంచి సౌందర్యవంతులుగా చెప్పవచ్చు. విద్యాభ్యాసంలో అన్ని మెళకులను

సునాయాసంగా నేర్చుకొని ఉన్నతవిద్యను అభ్యసిస్తారు. సంభాషణలో చతురత కలిగి సత్యమే మాట్లాడుతారు. రచనా వ్యాసంగాలు చేసి సమాజంలో పేరు ప్రతిష్టలు గడిస్తారు. సుఖమైన దాంపత్య జీవితం గడుపుతారు. అనుకూలవతి, గుణవతి, విద్యావతి, ధనవతి అయిన భార్యను పొందుతారు. ఆనందమయ జీవనం సాగిస్తారు.

## లగ్నస్థానం నుంచి గురువు అష్టమంలో ఉంటే :

మంచి ఆరోగ్యం కల్గి దృఢకాయులో ఉంటారు. ఎన్నడూ అనారోగ్యం లేక రుగ్మతలతో బాధపడరు. సామాన్యమైన విద్య ఉంటుంది. పూర్ణాయువులుగా జీవిస్తారు. బంధు మిత్రులలో మంచి వక్తలుగాను, నమ్మదగ్గ వ్యక్తులుగాను పేరు సంపాదించి వారి చేత గౌరవింపబడతారు.

## లగ్నస్థానం నుంచి గురువు నవమంలో ఉంటే :

వీరికి లలితకళలందు ఎక్కువ మక్కువ కలిగి ఉంటారు. శాస్త్ర పరిజ్ఞానం ఉంటుంది. సంగీత సాహిత్యాలలో ఏదైనా ఒక దాంట్లో నిష్ణాతులగా పేరొందుతారు. సభాపూజ్యతలందుకుంటారు. అందంగాను, ఆకర్షణీయంగాను ఉంటారు. కులాచారాలను గౌరవిస్తూ దైవచింతన కలిగి, వైదిక కర్మలను భక్తి శ్రద్ధలతో ఆచరిస్తారు. వ్యవహారదక్షత కలిగి ఉంటారు. బంధుమిత్రులకు మార్గదర్శకంగా ఉండి వారితో మంచి పేరు సంపాదించి వారి చేత గౌరవిపంబడతారు.

## లగ్నస్థానం నుంచి గురువు దశమంలో ఉంటే :

సంఘంలో గౌరవ ప్రతిష్టలు సంపాదిస్తారు. జీవితంలో ఎలాంటి ఒడిదుడుకులు లేక మంచి సుఖ జీవితం గడుపుతారు. ధన లోపం ఎప్పుడూ ఉండదు. అనేక దాన ధర్మాలు చేసి పేరు ప్రతిష్టలు గడిస్తారు.

## లగ్నస్థానం నుంచి గురువు ఏకాదశ స్థానంలో ఉంటే :

వీరు కష్టించి కృషితో ధనం ఆర్జిస్తారు. గొప్ప విద్యావంతులు కానేరరు. అయినా జీవిత విలువలు తాము చక్కగా ఆకళింపు చేసుకొని అందరిలో కలిసి వారి చేత గౌరవంగా చూడబడతారు. బహుశా సంతానం ఉండకపోవచ్చు. కాని బహు సంతానవతియైన కన్యను వివాహమాడితే ఫలం ఉంటుంది. కాని పుత్ర సంతానం ఉండకపోవచ్చు.

## లగ్నస్థానం నుంచి గురువు ద్వాదశ స్థానంలో ఉంటే :

వీరికి మూర్ఖత్వం, బుద్ధిమాంద్యం ఎక్కువ. విద్యావిహీనులుగా ఉండి వివేక శూన్యత్వంలో సంభాషించి నవ్వులపాలవుతారు. చాలా తక్కువ స్థాయి జీవితం గడుపుతారు. వీరు జీవితంలో ఏమీ సాధించలేరు. జీవితం అంతా ఏదో ఒక లోపం ఉండి దుఃఖమయ జీవితం వెళ్లదీస్తారు.

# శుక్రుడు

ఈ అధ్యాయం కళత్ర కారకుడైన శుక్రుని గురించి తెలుసుకుందాము. శుక్రుని గురించి వివరంగా నేను ముందు అధ్యాయంలో వ్రాసినాను కాబట్టి మీకు శుక్రగ్రహం గురించి మంచి అవగాహన ఉంటుంది. కాబట్టి ఇప్పుడు ఆ శుక్రగ్రహం లగ్న స్థానం నుంచి లెక్కపెట్టినప్పుడుఏ రాశిలో ఉంటేఏ ఫలితాలు ఇస్తాడోకూడామనం నేర్చుకోవాలి.

## లగ్నస్థానంలో శుక్రుడు ఉంటే :

ఈ జాతకులకు మంచి రూపురేఖలు కలిగి అందంగా ఉంటారు. మంచి ఆకర్షణీయంగా ఉండి చూసే వారికి వీరిమీద స్నేహ భావం ఏర్పడుతుంది. శరీరం నాజూకుగా ఉండి అంగాలన్నీ తీర్చిదిద్దినట్లుంటాయి. ముఖంలో లేతదనం కనిపిస్తుంది. వయసు మీరినా ఆ వయసు యొక్క ఛాయలు కనపడక చిన్నవారిలాగే ఉండి తక్కువ వయసు ఉండే తీరున కనబడతారు. అనారోగ్యం లేక దీర్ఘాయువులుగా జీవిస్తారు. వీరి ముఖవర్చసు ఇతరులను ఆకర్షిస్తుంది. ఈ ఆకర్షణకు మిక్కిలిగా స్త్రీలులోను అవుతారు. మంచి అందమైన, రూపవతి అయిన భార్యను పొందుతారు. దాంపత్య జీవితంలో సంతోషం ఆనందం ఇమిడి ఉంటాయి. భార్యకు ఇష్టుడుగాను, ఆరాధ్య దేవతగాను ఉంటాడు. భార్యతో రతిక్రీడలో ఆమెను కరిగించి పులకరింప జేస్తాడు. తాను కూడా స్వేచ్ఛగా ఇచ్ఛ వచ్చిన రీతిలో కామ సుఖం అనుభవిస్తాడు. అందువల్ల ఆ స్త్రీ ఇతనిని మిక్కిలిగా స్వేచ్ఛగా రెచ్చగొడుతూ శారీరక సుఖం ఇస్తుంది.

## లగ్న స్థానం నుంచి శుక్రుడు ద్వితీయ స్థానంలో ఉంటే :

ఈ జాతకులు ధనసంపాదనలోని నేర్పు మెళకువలు తొందరగా ఆకళింపు చేసుకొని నేర్పుతో ధన సంపాదన చేసి స్థిరాస్థులు ఏర్పరుచుకుంటారు. వీరికి జీవితంలో

ధన సంపాదనలో అపజయం లేక నష్టాలు ఎన్నటికి కలుగవు. నగలు నాణ్యాలు సంపాదిస్తారు. ఐశ్వర్యవంతులుగా ఉండి భోగభాగ్యాలు అనుభవిస్తారు. జీవితం అంతా ఆనందంగా గడచిపోతుంది. మిక్కిలి భోజనప్రియులుగా ఉంటారు.

## లగ్న స్థానం నుంచి శుక్రుడు తృతీయంలో ఉంటే :

ఈ జాతకులకు సామాన్య విద్య మాత్రమే ఉంటుంది. బాల్యం నుంచి కూడ విద్యాభ్యాసంలో ప్రతిభాపాటవాలు కన్పించవు. తెలివితేటలు లేక ఏ విషయంలోనైనా అర్థం చేసుకొందుకు సమయం తీసుకొంటారు. సూక్ష్మగ్రాహులుగా ఉండక మొద్దుబారిన మేధోసంపత్తు కలవారిగా ఉంటారు. ధన లోపం ఎక్కుగా ఉండి జీవితంలో ఎక్కువ దరిద్ర బాధ అనుభవిస్తారు. తన భార్యకు లోబడి హేయమైన జీవితం గడుపుతారు. వీరికి స్వయం సంపాదన లేకపోవచ్చు. ఒకవేళ ఉన్నా తగినన్ని అవసరాలకు సరిపడదు. భార్య సంపాదన ఎక్కువగా అనుభవిస్తారు. దాంపత్య జీవితంలో కష్టనష్టాలు మరియు ఒడిదుడుకులు ఎక్కువ. బద్ధకస్తులై సరియైన సంపాదన లేక భార్య సంపాదనతో జీవితమంతా మూర్ఖత్వంతో వృధా చేసుకొని వాయస జీవితం గడిపి అనామకులుగా మరణిస్తారు.

## లగ్న స్థానం నుంచి శుక్రుడు చతుర్థంలో ఉంటే :

ఈ జాతకులకు సమయస్ఫూర్తి ఎక్కువ. మంచి మాటకారితనం ఉండి తమ వాక్చాతుర్యంతో పదిమందిలో కలిసిమెలసి చలాకిగా ఉషారుగా ఉంటారు. బంధు మిత్రులందరితోను సఖ్యత పెంచుకొని, వారిలో మంచి మనిషిగా గుర్తింపు తెచ్చు కొంటారు. యథాశక్తి యితరులకు సహాయం చేస్తూ తమ అవసరాలకు వారి వద్ద నుండి కూడ సహాయం పొందుతారు. మంచి రూపం గుణం కలిగి జీవతంలో దేనికి లోపం లేక సుఖసంతోషాలతో జీవిస్తారు.ఆధునిక భావాలు ఎక్కువగాఉండి ఏ ఊరిలోగాని ఏ దేశంలో ఉన్నాగాని వారితో కలిసిపోయిఆ నైసర్గిక జీవితం గడుపుతారు.

## లగ్న స్థానం నుంచి శుక్రుడు పంచమంలో ఉంటే :

మంచి తెలివి కలిగి గొప్ప వక్తగా పేరు సంపాదిస్తారు. ఎవరికి కష్టమొచ్చినా వారి కష్టములను ఆదుకొందుకు ముందు వరుసలో ఉండి సహాయసహకారాలు

మరియు మంచి సలహాలు అందిస్తారు. వీరికి ధన సంపాదనలో లోపం రాదు. ధనార్జన చేసి సుఖాలు అనుభవిస్తారు. స్థిరాస్తులు ఏర్పరచుకొంటారు. అందంగా ఆకర్షణీయంగా ఉంటారు. బహుశా పుత్రసంతానం, మరియు స్త్రీ సంతానం తప్పక ఉంటుంది. ఆ సంతానం చాల అందంగా ఉంటారు. మంచి ముఖ వర్చస్సు కలిగి ఆకర్షణీయంగా ఉంటారు.

## లగ్న స్థానం నుంచి శుక్రుడు షష్టమంలో ఉంటే :

ఈ జాతకులు బుద్ధిహీనులు మరియు మూర్ఖులుగా ఉంటారు. తాపట్టిన కుందేలుకు మూడేకాళ్లు అనే మొండితనం ఎక్కువ ఉంటుంది. ఇతరుల సలహాలను లెక్కచేయక తామే ఎక్కువగా బుద్ధి కుశలత గలవారు అనే భ్రమలో ఉంటారు. ఎక్కువ ఆవేశం కోపం కలిగి అందరితో వితండ వాదం చేసి వారిని అప్రియమైన భాషలో నిందించి శత్రుత్వం కొనితెచ్చుకొంటారు. వీరికి స్త్రీ వాంఛ ఎక్కువ. వావి వరుసలు లేకుండ, కులగణాలను  గమనించక నీచస్త్రీలతో అక్రమసంబంధాలు ఏర్పరచుకొంటారు. ధనం ఐశ్వర్యం ఉంటుంది.

## లగ్న స్థానం నుంచి శుక్రుడు సప్తమంలో ఉంటే :

ఈ జాతకులకు వచ్చే జీవిత భాగస్వామి అత్యంత సౌందర్యవతియై మంచి రూపం ఆకర్షణ మరియు మంచి అంగసౌష్టవంతో ఉంటారు. దాంపత్య జీవితంలో సంతోషం, ఆహ్లాదం, హాయి ఉంటుంది. భార్యాభర్తల మధ్య మంచి సఖ్యత, అనుబంధం ఉంటుంది. ఒకరినొకరిని అర్థం చేసుకొని సుఖమయమైన సంసార జీవితం గడుపుతారు. ఈ జాతకులు సున్నిత స్వభావలుగా ఉండి శాంతికాముకులుగా జీవిస్తారు. నెమ్మదస్తులు మరియు మెత్తటి మనస్సు గలవారిగా ఉంటారు. ఎవరితోగాని ఏ విధమైన వాదులాటకు గాని అనేక అసందర్భ చర్చలకుగాని పోరు. భార్యను అపురూపంగా చూసుకొంటారు. ధనధాన్యాలు బాగా ఉంటాయి. తన భార్య ద్వార ధనం, స్థిరాస్తులు, నగనాణెములు సంప్రాప్తిస్తాయి.

## లగ్న స్థానం నుంచి శుక్రుడుఅష్టమంలో ఉంటే :

వీరు అలంకార ప్రియులు మరియు భోగలాలసులుగా ఉంటారు. వీరి వస్త్రధారణలో వీరి ఐశ్వర్యం మరియు భోగలాలస స్పష్టంగా కనబడతాయి. చేతినిండా

ధనం ఉంటుంది. ఎన్నడు కూడ ధనలోపం అనేది తెలియకుండా జీవిస్తారు. మంచి ఆరోగ్యం కలిగి పూర్ణాయుష్కులుగా జీవిస్తారు.

**లగ్న స్థానం నుంచి శుక్రుడు నవమంలో ఉంటే :**

వీరికి మంచి శరీర దారుఢ్యం ఉంటుంది. ఎలాంటి అనారోగ్యానికి గాని లేక ఏమైనా రుగ్మతలతో బాధపడడం అనేది ఉండదు. ధన సంపాదనకు లోటు ఉండదు. జీవితంలో కావలసిన అన్ని సదుపాయాలను పొందుతారు. దాంపత్య జీవితంలో భార్యభర్తల మధ్యసఖ్యత కలిగి అనురాగ అనురక్తులతో సంసారం సాగిస్తారు. పెద్దల యెడ విధేయత సామాజికంగా కావలసిన లోకజ్ఞత కలిగి బంధుమిత్రులతో కలిసి మెలిసి మంచి వ్యక్తిగా గుర్తింపు తెచ్చుకొంటాడు.

**లగ్న స్థానం నుంచి శుక్రుడు దశమంలో ఉంటే :**

వీరికి మంచి భాషాజ్ఞానం కలిగి మృదువైన సంభాషణాలతో తమ కార్యాలను సాధించుకొంటారు. మంచి వాక్పటిమ మరియు సమయస్ఫూర్తి కలిగి వీరు అందరికి మిత్రులుగా ఉంటారు. లలితకళలందు ఎక్కువ మక్కువ చూపిస్తారు. ముఖ్యంగా సంగీత నాటకరంగాల్లో మంచి నేర్పు నైపుణ్యం కలిగి ఏదో ఒక వాయిద్యంలో గాని, ప్రత్యేకమైన ఒక పాత్ర వేదిక మీద పోషించడం గాని వీరికి వీరే సాటి అని అనిపించుకుంటారు. సంఘంలో పేరుప్రతిష్టలతో తమ ప్రత్యేకతను చాటుకొంటారు. కాని ఐశ్వర్యవంతులుగా కాక సగటు జీవితం గడుపుతారు. వీరికి పరస్త్రీ వాంఛ ఎక్కువ. రహస్యమైన అక్రమ సంబంధం ఉండవచ్చు.

**లగ్న స్థానం నుంచి శుక్రుడు ఏకాదశ స్థానంలో ఉంటే :**

వీరికి తమ జీవితంలో ఎప్పుడు సుఖసంతోషాలు ఆనందమే తప్ప శోక దుఃఖాలు అనేవి ఎరుగరు. వీరి జీవితం నవ్వులు నదిలో పువ్వుల నావలో కూర్చున్న విధంగా ఒడుదుడుకులు లేని జీవనం సాఫీగా సాగిపోతుంది. తోటి మానవుల మీద ఎక్కువ ప్రేమాభిమానాలు దయాదాక్షిణ్యాలు కలిగి ఉంటారు. వీరికి శత్రువులు ఉండరు. చేతినిండా పుష్కలంగా ధనం ఉంటుంది.

### లగ్న స్థానం నుంచి శుక్రుడు ద్వాదశంలో ఉంటే :

ఈ జాతకులు సామాన్యమైన జీవితం గడుపుతారు. ఆధునిక సదుపాయాలను అనుభవించలేరు. సామాన్యమైన ఉద్యోగం చేసి ఆ వచ్చిన దాంతో సంతృప్తిపడి భార్యపిల్లలతో ఆనందమయమైన జీవితం గడుపుతారు. మంచిపేరు సంపాదించి బంధుమిత్రులలో గౌరవం పొందుతారు.

## శని

మనంఇంతవరకు సప్తమ గ్రహాల్లో ఆరు గ్రహాలగురించివివరంగా నేర్చుకున్నాం. అంటే లగ్న స్థానం నుంచి ద్వాదశ భావాల్లో ఏ గ్రహం ఏ రాశిలో ఉంటే ఆ రాశిలో ఉన్న గ్రహం ఇచ్చే ఫలితాలు ఎలా ఉంటాయో ఒక క్రమ పద్ధతిలో నేర్చుకున్నాం. ఈ అధ్యయనంలో సప్తమ గ్రహాల్లో ఆఖరి గ్రహమైన శనిగ్రహం గురించి నేర్చుకొందాం. ఒక ముఖ్య విషయం ఏమిటంటే శనికి ప్రత్యేక శక్తి ఉంటుంది. అదేమిటంటే శనికి ఒక వ్యక్తిని నిరంతరముగా ఏడున్నర సంవత్సరాలు పీడించగలడు. ఇలాంటి పీడ మిగిలిన ఏ గ్రహం వల్ల కలుగదు. అలాగే శని పీడనంలో ఏలినాటి శని, అర్ధాష్టమ శని,అష్టమ శని మరియు దశమ శని అని వివిధ భావాల్లో ఉన్నప్పుడు ఆ జాతకుడు అనేక కష్టనష్టాలకు గురి అవుతాడు. అనారోగ్యం, వృత్తి వ్యాపారాలలో నష్టం, రుణ బాధలు, మనోవ్యాకులత మరియు మరణంకూడ సంభవిస్తాయి. ఈ శని గురించి నేను వ్రాసిన ముందు అధ్యాయం ఒకసారి మీరు చదివి దాన్ని అర్థం చేసుకొంటే శని యొక్క ఫలితాలు ద్వాదశ భావాలలో ఎలా ఉంటాయో మీకు సులువుగా బోధపడు తుంది. వీరి దేహచ్ఛాయ నలుపు. శరీర దారుఢ్యం కలిగి మొరటుగా కనిపిస్తారు.

### శని లగ్నంలో ఉంటే :

ఈ జాతకులు కోపిష్టులై నిందాపూర్వకమైన మరియు అప్రియమైన కఠినమైన సంభాషణంతో గాని లేక పసలేని విమర్శ ధోరణితో గాని వితండవాదాలకు తెరతీసి ఇతరుల మనస్సును నొప్పిస్తారు. వీరు భాషలో అప్రియత్వం, మోటుదనం ఎక్కువగా ఉండి తక్కువరకమైన పదజాలాన్ని ఉపయోగిస్తూ ఏకవచన సంబోధన చేస్తూ పండిత, పామరులతో కూడ ఒకే విధమైన భాష వాడుతు సమయస్ఫూర్తి లేక ఇతరులను బాధిస్తూ ఉంటారు.

## లగ్న స్థానం నుంచి శని ద్వితీయంలో ఉంటే :

ఈ జాతకులకు వారి ముఖాలలో ఏమీ అందంగాని, ఆకర్షణగాని ఉండదు. ముఖంలోని కనుగోయి నాసిక, నోరు, పెదవులు చాల అందవిహీనంగా ఉంటాయి. ధనవంతులుగా ఉంటారు. పరదేశాలలో నివసిస్తూ తన వారికి అంటే తల్లిదండ్రులు, బంధుమిత్రులకు దూరంగా ఉండి ఒంటరి జీవితం గడుపుతూ పరదేశీయుల సేవచేస్తూ ఆ జీవితమే పరమార్ధమనుకొనే అజ్ఞానంలో ఉంటారు. మాతృదేశమన్నా, మాతృభాషన్నా తమ కులాచార సంప్రదాయాలన్నా వారికి ఒక హేళన భావం ఉంటుంది. అదే కాకుండా, పరదేశస్తుల సంప్రదాయాన్ని పొగడుతూ మాతృ భూమి మీద కువిమర్శలు చేస్తూ నలుగురిలో తమ మూర్ఖత్వాన్ని తమకు తామే చాటుకొంటారు. ఇతర దేశాలలో ఎన్ని భోగభాగ్యాలు అనుభవించినా మాతృదేశ బంధుత్వం కంటే మరొక్కటి మిన్నకాదని ఎన్నడు గ్రహించలేరు.

## లగ్న స్థానం నుంచి శని తృతీయంలో ఉంటే :

వీరు జన్మతః కఠినాత్ములు, క్రూరమనస్కులు, హింసాప్రవృత్తి కలవారు. ధర్మాధర్మ విచక్షణా జ్ఞానం లేక నీచమార్గాలలో ధనం ఆర్జిస్తారు. దౌర్జన్య ప్రవృత్తి ఎక్కువగా ఉంటుంది. ప్రతీకార వాంఛ శాశ్వత పగ వీరికి ఉంటుంది. సజ్జన సాంగత్యం ఉండదు. దుర్జన సాంగత్యం చేసి స్నానపానాదులు, పరిశుభ్రం లేకుండ సంప్రదాయ సంస్కార హీనులుగా ఉంటారు.

## లగ్న స్థానం నుంచి శని చతుర్థంలో ఉంటే :

వీరికి మంచి వాహన యోగం ఉంటుంది. అనేక రకాల ఆధునిక వాహనాల్లో ప్రయాణం చేస్తారు. బంధుమిత్రుల సహాయ సహకారాలు అందిపుచ్చుకొంటారు. వారి సానుభూతి ఈ జాతకుని మీద ఎక్కువగా ఉంటుంది. ఆందరి నుంచి సహాయసహకారాలు అందుతున్నా ధనసంపత్తు ఎక్కువగా ఉన్నా మంచి వాహనయోగం ఉన్నా వీరికి జీవితంలో సౌఖ్యం తక్కువ. ఎందుకంటే ఎక్కువ సమయం అనేక రకాల అనారోగ్యాలతో గడుపుతారు. వివిధ రకాల వ్యాధులు పీడిస్తూ ఉంటాయి. ఎక్కువ జ్ఞాన సంపద లేనందువల్ల అవివేకంతోను అమాయకత్వంతోను ప్రవర్తిస్తూ జీవితమంతా వృధా ప్రయాసతో గడిపివేస్తారు.

## లగ్న స్థానం నుంచి శని పంచమంలో ఉంటే :

వీరు జీవితంలో ఎక్కువ మిత్రులు లేక ఒంటరి జీవితం గడుపుతారు. బంధు మిత్రులతో కలిసి ఉండక స్వయంగా వారికి దూరంగా ఉంటూ ఒంటరిజీవితం గడుపుతారు. అతి తక్కువ స్థాయిజీవితం మరియు హీనంగా హేయమైన జీవితం అనుభవిస్తారు. సంతానం ఉండకపోవచ్చు. ఒకవేళ ఉండినా కూడా వారి వల్ల ఎక్కువ దుఃఖమే కలుగుతుంది. పుత్ర సంతానం ఉండకపోవచ్చు.

## లగ్న స్థానం నుంచి శని షష్టమంలో ఉంటే :

ఈ జాతకులు మంచి ముఖాకృతి కలిగి అందం మరియు ఆకర్షణతో ఉండి చూపరులకు ఇష్టులుగా ఉంటారు. వీరి ముఖంలో సౌభాగ్యం, స్నేహభావం స్పష్టంగా కనబడుతూ ఉంటాయి. మంచి ఆరోగ్యం కలిగి విద్యావికాసమందు జ్ఞానం కలిగి మంచి ఉన్నత విద్యను అభ్యసిస్తారు. అందరితోను కలిసి మెలిసి సమైఖ్యంగా ఉంటారు. అందువల్ల వీరు శత్రురహితులుగా చెప్పవచ్చు. ఏ కార్యమైనా కాని ముందుగా ఒక ప్రణాళికబద్ధంగా చేసుకొని తదనుగుణంగా ఒక నిర్దుష్టమైన సరళిలో కార్యదీక్షతో, పట్టుదలతో తమ కార్యాన్ని సాధిస్తారు. అన్న వస్త్రాలకు లోటు ఉండదు. సచ్ఛీలత గుణగణసంపత్తు వీరికి ఉంటుంది.

## లగ్న స్థానం నుంచి శని సప్తమంలో ఉంటే :

వీరు జీవితమంతా ఏదో ఒక అనారోగ్యంతో ఎప్పుడు బాధపడుతునే ఉంటారు. కొంతమందికి దీర్ఘకాల వ్యాధులు కూడ ఉండవచ్చు. అహంకారం కలిగి బుద్ధిమాంద్యంతో పాపపు పనులు చేస్తారు. వీరికి కోపం, అహంకారం మరియు ఉద్రేకం వల్ల తమ జీవితంలో ఏ వృత్తిలోను రాణించక సతమతమవుతూ ఉంటారు. ఎక్కువ ధన సంపాదన లేక జీవితంలో దరిద్రబాధ అనుభవిస్తారు. వీరికి దుష్టసాంగత్యం ఎక్కువగా ఉంటుంది. వ్యసనాలకు అలవాటుపడి ఆ వ్యసన ప్రభావం వల్ల దాంపత్య జీవితంలోని మధురిమను ఆస్వాదించ లేక తన జీవిత భాగస్వామిని మానసికంగా ఒత్తిడికి గురి చేసి ఆమెను తీవ్రంగా బాధిస్తారు. దాంపత్యంలో విరోధభావాలు చెలరేగి ఇద్దరి మధ్య పరిపూర్ణమైన మరియు సంతోషకరమైన సఖ్యత సుఖసంతోషాలు లోపిస్తాయి. మూర్ఖులు మొండివారుగా ఉండి సజ్జన సలహాలను పెడచెవిన పెడతారు.

## లగ్న స్థానం నుంచి శని అష్టమంలో ఉంటే :

ఈ జాతకులకు సరియైన ఆరోగ్యస్థితి ఉండదు. అనారోగ్యంతో రుగ్మతలతో బాధపడుతూ ఉంటారు. సామాన్య ఆరోగ్యం కూడ ఉండకపోవచ్చు. బలహీనులుగా ఉండి శక్తి సామర్థ్యాలు లేక ఏ కార్యమును సాధించలేక అశక్తులుగా జీవిస్తారు. బహుశా వీరు నడి వయసులో మరణించవచ్చు. అంటే వీరికి ఏలినాటి శని రెండవసారి ప్రవేశించిన తరువాత చంద్రుడున్న స్థానంలో శని ప్రవేశించిన అంత్య సమయంలో వీరు మృత్యుబారిన పడవచ్చు లేక చంద్రుడి నుంచి ద్వితీయ స్థానంలో శని ప్రవేశించిన మరణం సంభవించవచ్చు.

## లగ్న స్థానం నుంచి శని నవమంలో ఉంటే :

ఈ జాతకులకు ధనార్జనే ధ్యేయంగా ధన వ్యామోహంతో ధర్మాధర్మ విచక్షణా జ్ఞానం లేక అహంకారంతో అన్యాయంగా సంపాదన చేస్తారు. అంటే ధర్మ నిషిద్ధమైన వ్యాపారాలు చేసి ఎక్కువ ధనం సంపాదించినా ఆ ధనాన్ని నిలుపుకోలేరు. బంధు మిత్రులతో మంచి సంబంధ బాంధవ్యాలు ఉండక వారితో శతృత్వం పెంచుకొంటారు. ధనసంబంధమైన విషయాలలో అందరితో కఠినంగా ప్రవర్తించి పుత్రులతో కూడ భేదాభిప్రాయాలు కలిగి అంత్య సమయంలో దుఃఖంతో మరణిస్తారు. ఎంత డబ్బు ఉన్నా సుఖహీనులుగానే జీవిస్తారు. సమాజంలో చెడ్డవారుగా ముద్రపడి గౌరవ హీనులుగా జీవితం గడుపుతారు.

## లగ్న స్థానం నుంచి శని దశమంలో ఉంటే :

ఈ జాతకులు మంచి ఉన్నత విద్య అభ్యసిస్తారు. విద్యావంతులుగాను, పండితులుగానుఉంటారు. జ్ఞాన సంపన్నులుగా పేరుపొంది సభాగౌరవం పొందుతారు. మత సంప్రదాయాలను గౌరవిస్తూ పుణ్యకార్యాలు ఎక్కువ చేస్తారు. మంచి కార్యదక్షత కలిగి ఐశ్వర్యవంతులుగా సుఖసంతోషాలతో జీవిస్తారు. ఉన్నత పదవులు పొంది పేరు ప్రఖ్యాతులు పొందుతారు.

## లగ్న స్థానం నుంచి శని ఏకాదశంలో ఉంటే :

వీరికి మంచి ఆరోగ్యం కలిగి ఏ రుగ్మత బారిన పడకుండ పరిపూర్ణ ఆయుష్కులుగా జీవిస్తారు. ధనార్జన బాగుంటుంది. ధన, కనక, వస్తు, వాహనాది

సౌఖ్యాలు కలిగి ఆనందమయ జీవితం గడుపుతారు. దాంపత్యంలో సుఖసంతోషాలు వెల్లివిరుస్తాయి. వీరి సంతానం సద్గుణ సంపన్నులుగా ఉంటారు. బంధుమిత్రులకు ఆప్తులుగా ఉంటారు.

## లగ్న స్థానం నుంచి శని ద్వాదశంలో ఉంటే :

ఈ జాతకులు దళితులుగాను ధనహీనులుగాను ఉంటారు. ఋణబాధలు ఎక్కువ. ఎవ్వరితోను సఖ్యత లేక అందరితోను వితండ వాదములు మూర్ఖ ప్రజ్ఞను ప్రదర్శించి శతృత్వం కొనితెచ్చుకొంటారు. మనసులో కాఠిన్యం చేతలలో కౌర్యం ఎక్కువ. చిన్న విషయాలకు కూడ కోపోద్రికాలకులోనై వారి మీద పగ, ద్వేషం పెంచుకొంటారు. లజికజ బిడియాలు వదలి హేయమైన జీవితం గడుపుతారు. ధనం ఉన్నప్పుడు ధనం విలువ తెలియక విచ్చలవిడిగా వ్యయం చేయడం, ధనం లేనపుడు కృంగిపోవడం వీరికి పరిపాటే. కాని గుణపాఠం నేర్చుకోరు. అంత్య సమయంలో కూడ దరిద్ర బాధతో చనిపోతారు.

# అధ్యాయం - 7

## కాలగమన పరిమాణము

మనం ఈ అధ్యాయంలో కొన్ని మౌలిక ముఖ్యాంశాల గురించి వివరంగాను విశదపఱుచుకొందాం. ఎందుకంటే కాల ప్రవాహం యొక్క వేగమును ఎవ్వరు కూడ ఆపటంగాని తగ్గించడం గాని, పెంచడం గాని చేయలేరు. ఈ మార్పులు చేయలేని కారణంగానే మనం కాలగమనాన్ని సక్రమంగా కొలవడం జరుగుతోంది. అంటే శాశ్వతమైన నిర్దుష్టవేగంతో పయనించే కాలాన్ని మనం సంవత్సరములుగాను, మాసాలుగాను లేక పక్షాలుగా గాని, వారాలు గాని నిర్ణయించుకుంటున్నాము. ఒకవేళ ఈ కాలగమనంలో వేగంలో మార్పు ఉన్నట్లయితే ఎవరు కూడ కాలగమనాన్ని కొలవలేరు. ఎందుకంటే ఉదాహరణకు ఏడు సూర్యోదయములు జరిగిన తరువాత మనం ఆ కాలగమనాన్ని ఒక వారంగా నిర్ణయించుకొన్నాం. అంటే ఒక సూర్యోదయం నుండి మరొక సూర్యోదయమునకు మధ్య నున్న కాలమును ఇరువది నాలుగు గంటల కాలంగా లెక్కించి దానిని ఒక దినముగా గణనం చేయుచున్నాము. అలాగే నాలుగు వారములు ఒక మాసమని, 12 మాసములు ఒక వత్సర కాలమని నిర్ణయించుకొన్నాము. ఒక వేళ కాలప్రవాహ వేగంలో హెచ్చు తగ్గులు ఉంటే ఈ గణనం ఎట్టి పరిస్థితులలోని సరికాదు. అలాగే అన్ని గ్రహాలు తమ కక్షలో తమ చుట్టు తాము తిరుగుతూ సూర్యుని చుట్టు పరిభ్రమిస్తున్నప్పుడు ఒక ప్రదక్షిణానికి పట్టే సమయాన్ని గుణించి తద్వారా గ్రహదశలు మనం నిర్ణయించుకొంటున్నాం.

ప్రస్తుతకాలంలో ఆంగ్లవిద్యా ప్రభావం వల్ల మన హైందవమాస కాల వేగాన్ని కొలిచే పద్ధతి గురించి అసలు కొంచెంకూడ తెలియని అజ్ఞానంలో చాలమంది ఉన్నారని మనం ఒప్పుకొన్నప్పుడు మనం మన పిల్లలకు కాలనిర్ణయం గురించి ఒక కథలాగ చెప్పినా వారికి జ్ఞాన బోధ చేసినట్లే అవుతుంది. మా పిల్లలు ఆంగ్ల విద్య చదివారు "తెలుగు రాదండీ" అని గొప్పగా చెప్పి ఉప్పొంగిపోయే తల్లిదండ్రులను చూస్తే వారి సాంప్రదాయమేమిటో ఎవరికైనా అర్థం అయిపోతుంది. ఎందుకంటే

భాషా దరిద్రం మరియు సాంప్రదాయ దరిద్రం ఈ రెండు గొప్ప ఆభరణాలుగాను మరియు ఉన్నత సంపత్తుగా భావించినా, నిజానికి వారు జ్ఞానశూన్యులని మనం అర్థం చేసుకోవాలి. అందుకనే ప్రతివారికి శాస్త్ర పఠనాశక్తి మరియు శాస్త్ర పరిజ్ఞానం కొంచెమైనా ఉండాలి.

ఈ కాల వేగాన్ని మనం ఎలా కొలుస్తున్నామో స్థూలంగా పరిశీలిద్దాం. ప్రపంచ దేశాలన్ని నూరు సంవత్సరాల కాలాన్ని ఒక శతాబ్దముగా పేర్కొనడం వల్ల ఒక శతాబ్దం గడిచినది అంటే నూరు సంవత్సరాలు గడిచినట్లుగా అర్థం చేసుకొంటాం. ఉదాహరణకు క్రీస్తు మరణించిన తరువాత అప్పటి నుంచి లెక్కిస్తూ వచ్చిన సమయాన్ని శతాబ్దములలో వ్రాయడం జరుగుతోంది. అంటే ఇప్పుడు రెండువేల పన్నెండు (2012) కాబట్టి క్రీస్తు మరణించిన తరువాత ఇరవై శతాబ్దములు అంటే 20×100=2000 సంవత్సరములు గడిచి ఒక పుష్కరకాలమైందని అర్థం చేసుకొంటాము. ఈ సంఖ్యా వాచక గణన పాశ్చాత్య దేశాలలో అనుసరిస్తారు. క్రీస్తు పూర్వమే కొన్ని వేల సంవత్సరాలు ముందే మన భారతీయులు ఈ కాలగమనాన్ని కొలవడంలో అత్యంత ఆశ్చర్యకరమైన దోషరహితమైన విశేష ప్రజ్ఞతో తమ శాస్త్ర పరిజ్ఞానాన్ని రుజువు చేసుకొన్నారు. ఎలాగంటే పాశ్చాత్యులలాగ కాక అరవై సంవత్సరములే ఒక నిర్దుష్టకొలమానంగా తీసుకొని ఒక్కొక్క సంవత్సరానికి ఒక్కొక్క ప్రత్యేకమైన నామకరణం చేసి చూపించారు. అలా నామకరణం చేయబడ్డ సంవత్సరాలు గ్రహచక్ర భ్రమణంలో కొలవబడి మరిఆ సంవత్సరమే మరల తిరిగి తిరిగి వస్తుంది. ఉదాహరణకు ప్రభవ నామ సంవత్సరం పూర్తియైన తరువాత రెండవ సంవత్సరం విభవ నామ సంవత్సరము ప్రారంభమవుతుంది. ఇలా అరవై సంవత్సరములు పూర్తియైన తరువాత మరల అవే నామములతో తిరిగి వరుసగా వస్తాయి. మనం ఈ సంవత్సరముల పేర్లు అన్నీ తప్పక మననం చేసుకోవాలి. ఎందుకంటే ఈ రోజు కూడ పంచాంగాలలో సంవత్సర ములకు తెలుగు సంవత్సర నామములనే వ్రాస్తారు. ఇప్పుడు మీ సౌలభ్యం కోసం ఈ అరవై సంవత్సరాలు పేర్లను ఆరు దశాబ్దములుగా విభజించి ఆరు వరుసలలో ముందు అధ్యాయంలో ఇచ్చాను మొదటి వరుసలో పూర్తియైన పది సంవత్స రాలను ఒక దశాబ్దంగా గ్రహించాలి. ఇలాగ అన్ని వరుసలలో ఉన్న సంవత్సరములు పూర్తియైనపుడు ఒక "షట్ద శమ వత్సరాలు" లేక ఉలేంద్రము అంటారు.

ఆరు నెలల కాలాన్ని ఒక ఆయనమంటారు. ఇలాంటి రెండు ఆయనములు ఒక సంవత్సరమంటారు. ఈ రెండు ఆయనములను ఉత్తరాయణమని మరియు దక్షిణాయమని వ్యవహరిస్తున్నారు. ఈ నామకరణంలో కూడ విశేష ప్రజ్ఞ కనబఱచారు. ఎలాగంటే సూర్య భగవానుడు ఉత్తర ధృవమునందు సంచరించు మొత్తం కాలం ఆరు నెలలుగా ఉంటుంది. సూర్యుడు ఉత్తర దిక్కున సంచరిస్తాడు కాబట్టి ఉత్తరాయణ మని పిలుస్తారు. అలాగే సూర్యుడు దక్షిణ ధృవంలో సంచరించే ఆరు నెలల కాలాన్ని దక్షిణాయంగా పేర్కొనబడింది. ఇది అర్థం చేసుకోవాలంటే ఒక చిన్న ఉదాహరణ ఇస్తున్నాను. మీరు మీ ఇంటి ముందు నిలబడి చూసినపుడు సూర్యుడు మీకు ఎడమ చేతివైపు నుండి పశ్చిమానికి పయనించినపుడు ఉత్తర దిశగా పయనించడం మీరు చూస్తారు. కాబట్టి మీరు ఈ సమయాన్ని ఉత్తరాయణంగా అర్థం చేసుకోవాలి. అలాగే ఒక ఆరు నెలల తరువాత అదే స్థలంలో సూర్య సంచారాన్ని గమనించునపుడు సూర్యుడు మీ యొక్క కుడి చేతి వైపునుండి పయనించి పశ్చిమానికి చేరుతుండడం మీరు గమనిస్తారు. వేల సంవత్సరాల క్రితమే ఈ అద్భుత సూక్ష్మ విషయాన్ని జ్యోతిష మరియు ఖగోళ శాస్త్రజ్ఞుడైన 'వరరుచి' మహాముని కనుగొని ముందు తరాల శాస్త్రజ్ఞులకు మార్గదర్శకుడు అయ్యాడు. సూర్యుడు ధనురాశిలో నుంచి మకరరాశిలోనికి మారేటప్పుడు, సంక్రమణం చేసినప్పటి నుంచి ఉత్తరాయణం ప్రారంభమవుతుంది. ఉన్న పన్నెండు రాశుల్లో ఆరు రాశుల్లో ఒక్కొక్క రాశిలో సూర్యుడు 30రోజులు చొప్పున ఉండి తరువాత రాశిలోనికి పయనిస్తాడు. ఆ రాశిలో కూడా 30 రోజులు ఉంటాడు. ఇలాగ మకరరాశిలో ప్రవేశించిన సూర్యుడు మిథునరాశి వరకు పయనించే కాలాన్ని ఉత్తరాయణమంటారు. ఆ తరువాత ఆరు నెలలు అంటే కర్కాటకరాశి నుంచి ధనురాశి వరకు సూర్యుడు సంచరించే కాలాన్ని దక్షిణాయనం అంటారు. మీకు తేలికగా అర్థమయ్యేందుకు పాశ్చాత్య పద్ధతిలో చెప్పాలంటే జనవరి 13 నుండి జూన్ 14 వరకు ఉత్తరాయణమని జూన్ 15 నుండి మళ్ళీ జనవరి 12 వరకు దక్షిణాయనమని అంటారు. ఇలాగ మనకు కాలగమనాన్ని కొలవడం సూర్యుని సంచార పద్ధతి ప్రకారం నిర్ణయించబడింది.

మనం సంవత్సర నిర్ణయం తెలుసుకొన్నాము. ఇప్పుడు మాసముల గురించి తెలుసుకొందాము. మాసాన్ని మన దేశంలో మూడు విధాలుగా లెక్కిస్తారు.

చాంద్రమాసం రెండవది సౌరమాసం, మూడవది ఆంగ్ల మాసములు. ఈ మూడు విధాల మాసాల లెక్కింపు మన దేశంలో బహుళ ప్రచారంలో ఉన్నాయి. మొదటి పద్ధతి చాంద్రమాసం గురించి మనం నేర్చుకొందాం. చంద్రుడు తన సంచారంలో ఒక్కొక్క నక్షత్రంలో ప్రవేశించి 27 నక్షత్రాల దాక పయనిస్తాడు. ఆ 27 నక్షత్రాల భ్రమణం పూర్తియైన తరువాత మళ్లీ మొదటి నక్షత్రంలో ప్రవేశిస్తాడు. అంటే అశ్విని నక్షత్రంలో ప్రవేశించిన చంద్రుడు ఒకదాని వెంట ఒకటి ప్రతి నక్షత్రంలోను ప్రవేశిస్తూ ఆఖరి నక్షత్రమైన రేవతి నక్షత్రంలో ప్రవేశిస్తాడు. ఆ తరువాత మళ్లీ మొదటి నక్షత్రమైన అశ్విని నక్షత్రంలో పునఃప్రవేశిస్తాడు. ఇలాగ ఆది నుండి చంద్రుడు ఈ ప్రక్రియను కొనసాగిస్తునే ఉంటాడు.

పన్నెండు మాసాల పేర్లు ఇక్కడ ఇస్తున్నాను. మననం చేసుకుంటే మనకు ఎంతో సహాయకారిగా ఉంటుంది.

| | | |
|---|---|---|
| 1. చైత్రం | 5. శ్రావణం | 9. మార్గశిరం |
| 2. వైశాఖం | 6. భాద్రపదం | 10. పుష్యం |
| 3. జ్యేష్టం | 7. ఆశ్వీయుజం | 11. మాఘం |
| 4. ఆషాఢం | 8. కార్తీకం | 12. ఫాల్గుణం |

ఒక్కొక్క నక్షత్రంలో చంద్రుడు ఒక మాసం ఉంటాడు కాబట్టి ఆ మాసానికి నక్షత్ర నామకరణం చేయడం జరిగింది. ఉదాహరణకు చంద్రుడు చిత్త నక్షత్రంలో ఉన్నప్పుడు చైత్రమాసమని, విశాఖ నక్షత్రంలో వైశాఖ మాసమని, జ్యేష్ఠ నక్షత్రంలో ఉంటే జ్యేష్ఠ మాసమని,శ్రవణ నక్షత్రం శ్రావణ మాసమని, ఇలాగ చంద్రుడు పౌర్ణమి రోజున ఏ నక్షత్రంలో ఉంటే ఆ రోజు నుంచి ఆ నక్షత్ర నామంతో ఆ మాసంప్రారంభ మవుతుంది. అంటే పౌర్ణమి నుంచిమళ్లీ పౌర్ణమి దాక ఉండే మాసాన్నిచంద్ర సంచార రీత్యా మనం లెక్కిస్తున్నాము. ఆంధ్ర దేశంలో ఉన్న తెలుగు వారందరు ఈ పద్ధతినే అనుసరిస్తారు. కాగా, మహమ్మదీయులు కూడ ఈ పద్ధతినే పాటిస్తారు. అందుకనే మనకు పున్నమి రోజు పుణ్య తిథిగా భావించి శుభకార్యములు జరుపు కొంటారు.

ఇప్పుడు మనం సౌరమానం గురించి తెలుసుకొందాం. సూర్యుడు ప్రతిరాశి లోను 30 రోజులు ఉంటాడని మనం చెప్పుకొన్నాం. ఆ ముప్పై రోజులు తరువాత తదుపరి రాశిలోకి ప్రవేశిస్తాడు. అలా ప్రవేశించే పద్ధతిని సంక్రమణం అని కూడ

తెలుసుకొన్నాం. అందుకనే పంచాంగాలలో మాస సంక్రమణం అనే అంశాన్ని మీరు చూస్తూనే ఉంటారు. అంటే ఆ పంచాంగంలో ఏ తేదీలో మాస సంక్రమణమని ఇస్తారో ఆ తేదిన సూర్యుడు తానున్న రాశి నుంచి ముందున్న రాశిలోకి ప్రవేశిస్తున్నాడని అర్థం. అందువల్ల ఆ రోజు నుంచి క్రొత్తమాసం ప్రారంభమవుతుందని పంచాంగకర్తలు మనకు సూచిస్తున్నారు. కాబట్టి కొంతమంది సూర్యుడు సంక్రమణం చేసిన దినంనుంచి క్రొత్తమాసంగా లెక్కిస్తారు. అంటే మళ్లీ 30 రోజులు అయిన తరువాత సూర్యుడు క్రొత్తరాశిలోకి ప్రవేశించినపుడు ఆ దినానికి కూడ మాస సంక్రమణమని ఇస్తారు. ఇలాగ ఒక్కొక్క రాశిలో సూర్యుడు 30 రోజులు ఉంటూ 12 రాశులలోకి సంక్రమణం చేస్తూనే ఉంటాడు. ఈ ప్రక్రియ ఆది నుండి జరుగుతూనే ఉంది.

సూర్యుడు ఏ రాశిలో ఉన్నాడో ఆ రాశి పేరును ఆ మాసానికి నామకరణం చేయడం జరిగింది. అంటే మేషరాశిలో ఉన్నప్పుడు మేషమాసమని, వృషభ రాశిలోని వృషభమాసమని అలాగే 12 రాశుల్లో సూర్యుడు ఉన్నప్పుడు ఆ రాశి పేరును బట్టి ఆ మాసాన్ని పిలుస్తారు. ఈ పద్ధతి తమిళనాడులో విశేష ప్రచారంలో ఉంది. అందుకని వారి పంచాంగాలలో విషయాలు మన పంచాంగాలలోని విషయాలలో వైవిధ్యం ఉంటుంది. అందుకనే వారికి అమావాస్య శుభదినంగా పాటిస్తారు. కాని మనం పౌర్ణమి తిథిని శుభంగా భావిస్తాం. మౌలికంగా చంద్రమానం, సూర్యమానం ఎలాగ లెక్కిస్తారో తెలుసుకొన్నారు.

ఇప్పుడు పాశ్చాత్య దేశాలలో నివసించే వారు మాసమును ఎలా కొలుస్తారో మేము పెద్దగా ఇక్కడ విపులీకరించటం అనవసరం. ఎందుకంటే వారు 360 దినాలను 30 రోజులు చొప్పున విభజించి ప్రతి 30 రోజులకు ఒక నామకరణం చేసారు. దాన్ని మనం జనవరి, ఫిబ్రవరి, మార్చి... etc., అని పిలుస్తున్నాం.

సంవత్సరం అంటే మూడు వందల అరవై దినాలు కాబట్టి ఒక మాసములో 30 రోజులు మరియొక మాసంలో 31 దినాలు చొప్పున గుణించి మాసములను నిర్ణయం చేసారు. శేషకాలమును నాలుగు సంవత్సరములకొకసారి లీపు సంవత్సరం గుణించి ఫిబ్రవరి నెలలో 29 రోజులుగా నిర్ణయించారు. ఈ నాలుగు సంవత్సరముల్లో ఫిబ్రవరి మాసంలో 28 రోజుల చొప్పున తీసుకొన్నారు. ఇది పాశ్చాత్య పద్ధతి. ఈ

విషయం అందరికి తెలుసు కాబట్టి మరియు బహుళ ప్రచారంలో ఉంది కాబట్టి పాశ్చాత్య పద్ధతి మీద విశదంగా విశ్లేషించలేదు.

ఇప్పుడు మనము ఋతువుల గురించి తెలుసుకుందాము. రెండు చంద్రమాసములు కలిపిన సమయం ఒక ఋతువుగా ఉంటుంది. అంటే ప్రతి రెండు మాసములకు ఋతువు మారుతుంది. అందువల్ల ఒక సంవత్సర కాలంలో, అంటే 12 నెలల్లో ఆరు ఋతువులు వస్తాయి. ఏ మాసములలో ఏ ఋతువులు ఉంటాయో కూడా మనం తెలుసుకోవాలి. తెలుగు మాసములే ప్రమాణంగా తీసుకోవాలి గాని ఆంగ్ల మాసాలు మాత్రం కాదు.

ఈ క్రింద మాసములు – ఋతువులు పేర్లు ఆ ఋతువులు యొక్క వాతావరణంలోని మార్పులు మరియు ఋతుప్రభావములు గమనించండి.

చైత్ర, వైశాఖ మాసములు – వసంత ఋతువు.

జ్యేష్ట, ఆషాఢ మాసములు – గ్రీష్మ ఋతువు

శ్రావణ భాద్రపద మాసములు – వర్ష ఋతువు

ఆశ్వీయుజ కార్తీక మాసములు – శరదృతువు

మార్గశిర పుష్య మాసములు – హేమంత ఋతువు

మాఘ ఫాల్గుణ మాసములు – శిశిర ఋతువు

నేను పైన ఇచ్చిన మాసాలు, వాటిలో వచ్చే ఋతువుల పేర్లతో బాటు ఆయా ఋతువుల వాతావరణ ప్రభావాలను కూడా చదివి మననం చేసుకోవాలి.

ప్రాచీన కాలము నుంచి కూడా మన దేశంలో జ్యోతిష శాస్త్ర పండితులు కాలగణన చేయడంలో విశేషమైన ప్రతిభకనపరచారు.వేలసంవత్సరాలను కొలవడానికి ఒక నిర్దుష్టమైన గణనా పద్ధతి ముందు తరాల వారికి వారసత్వంగా ఇచ్చి వెళ్లారు. ప్రపంచంలో ఏ దేశంలోనూ కూడా ఇంత విశేషప్రజ్ఞ గల కాల గణనాంక పద్ధతి ఎవ్వరు కనుగొనలేదు. ఇవి తత్పరల నుంచి ఒక కల్పము వరకు విభజించారు. ఒక కల్పం అంటే 4,32,00,00,000 అంటే నాలుగు వందకోట్ల ముప్ఫయి రెండు లక్షల సంవత్సరములని అర్థం. ఈ క్రింది కాల కొలమాన విభజన చూడండి.

60 తత్పరలు – 1 పర

60 పరలు – 1 విలిప్త

60 విలిప్తలు – 1 లిప్త

60 లిప్తలు – ఒక విఘడియ

60 విఘడియలు – ఒక ఘడియ

60 విఘడియలు – 1 రోజు


మీరు గమనించవలసినది ఏమంటే 60 లిప్తలంటే ఒక విఘడియ కాలం – అంటే 24 సెకనులు అంటే అర నిముషం కంటే తక్కువ కాలం. అలాగే ఒక ఘడియ అంటే 24 నిమిషాలు – రెండు ఘడియలంటే 48 నిమిషాల కాలము. ఈ కాలసమయాన్నే ఒక ముహూర్త కాలము అంటారు. అంటే ఒక ముహూర్త లగ్నప్రమాణము 48 నిమిషాలుగా మీరు అర్థం చేసుకోవాలి. ఒక్క క్షణము అనే మాటను మనం తరచు వాడుతూనే ఉంటాము. కాని క్షణం మారితే నిమిషానికన్నా తక్కువ సమయం అని అందరూ అనుకుంటారు కాని అది తప్పు. ఎందుకంటే క్షణం అంటే 4నిమిషాల కాలం అని మనం గుర్తుంచుకోవాలి. సమయాన్ని కొలవడానికి ఇంకా సూక్ష్మంగా కాలవిభజన చేసినా నేను ఇక్కడ ఆ వివరాలను పొందుపరచలేదు. ఎందుకంటే పాశ్చాత్య పద్ధతిలో గల కాల వేగాన్ని నిమిషాలు, సెకండ్ల వరకే కొలుస్తున్నాము. కాబట్టి ఇంకా సూక్ష్మ విభజన మనం తెలుసుకొని ప్రజా ప్రయోజనానికి ఉపయుక్తం కాదు.

# అధ్యాయం - 8

## రాశులు


ఈ అధ్యాయంలో మనం రాశుల గురించి విపులంగా తెలుసుకుందాము. ఎందుకంటే రాశుల స్వభావాలు, వాటి తత్త్వములు ఆ రాశులలో ఉంటే నక్షత్రములు వాటి పాద విభజనలు ఇత్యాది మీద ప్రతి జ్యోతిష్యునకు ఒక మంచి అవగాహన ఉండి తీరాలి.

మానవులు తమ గుర్తింపు కోసం ఏ విధంగా పేర్లు పెట్టుకుంటారో అదే విధంగా రాశులకు కూడా ఒక గుర్తింపు కోసం ప్రతిరాశికి ఒక పేరు పెట్టాడు. నిజానికి అంతరిక్షంలో అనేక కోట్ల నక్షత్రాలు ఉన్నప్పటికి అవి గుంపులు గుంపులు ఉండటం వల్ల ఒక గుంపు నక్షత్రాలు మొత్తం భూమి మీద నుంచి పరిశీలిస్తే ఏ ఆకారం కన్పిస్తుందో అలా కనిపించే ఆకారము గల పేరు ఆ నక్షత్ర గుంపుకుపెట్టాడు. ఇలా 12 గుంపులుగా విభజించి ప్రతి గుంపు నక్షత్రాల పొందికలో ముఖ్యమైన నక్షత్రాలను తీసుకొని ఆ నక్షత్రాలను తీసుకొని ఆ నక్షత్రాలను 27 నక్షత్రాలు మాత్రం ముఖ్యమైనవిగా గుర్తించి ప్రతి నక్షత్రమునకు ఒక పేరు పెట్టాడు. అంతరిక్షంలోని నక్షత్రాల గుంపుకి రాశి అని పేరు పెట్టాడు. వేల సంవత్సరాల క్రితమే వరరుచి అనే భారతీయ ఖగోళ శాస్త్రజ్ఞుడు ఇంతటి మహోత్కృష్ట శాస్త్ర పద్ధతిని ప్రవేశపెట్టి ప్రపంచానికే ఆదర్శ పురుషుడే గాక, మానవ కోటికి ఖగోళ శాస్త్ర ఆది గురువుగా ఈ నాటికి నిలచి ఉన్నాడు. వరరుచి చెప్పిన సిద్ధాంతాన్ని ప్రపంచంలో ఏ దేశస్థుడు కాదనలేక పోయాడు. అంతటి మహా జ్ఞాని మన భారతీయు డవడం మనకు గర్వ కారణం. మన ఈ అధ్యాయంలో రాశుల గుఱించి తెలుసుకుందా మనుకున్నాము. కాబట్టి రాశి చక్రము వేసి చూపిస్తాను. అంతరిక్షమంతయు 12 భాగాలు విభజించి 12 రాశులుగా చక్ర రూపంలో వరరుచి వేసి చూపించాడు. ఆయన చూపిన పద్ధతి చాలా శ్లాఘనీయము మరియు ఉన్నతము కాని కొంతమంది ఈ చక్రాన్ని కాలక్రమేణా వేరువేరుగా వారి వారికి నచ్చిన పద్ధతి ప్రకారం ప్రచారంలోనికి తెచ్చారు. ఇక్కడ వాటి గురించి తెలుసుకుందాము.





ఈ విధమైన చక్రాన్ని సవ్య చక్రం అంటారు. అంటే మేషరాశి నుంచి మీన రాశి వరకు గ్రహాలన్ని సవ్యంగా తిరుగుతాయి. అంటే మనం గుళ్లో ప్రదక్షిణం చేసే పద్ధతిలో తిరుగుతాయి. ఈ చక్రం చూడగానే ఇది సవ్య చక్రమని, ఈ చక్రంలో గ్రహాలు ఎడమ నుంచి కుడి వైపుకు చక్రభ్రమణం చేస్తాయి. కాని కొందఱు ఈ సవ్య చక్రం వేసి గ్రహాలను అపసవ్యంగా వేస్తారు. ఇది సాంప్రదాయానికి విరుద్ధం. ఎందుకంటే అపసవ్య చక్రం కూడా ప్రత్యేకంగా వాడుకలో ఉంది. కాబట్టి సవ్య చక్రంలో అపసవ్యంగా గ్రహాలు వేయడం, లేకపోతే అపసవ్య చక్రంలో గ్రహాలు సవ్యంగా వేయడం అనే ప్రక్రియ చదువరులను గందరగోళంలో పడేయడమే అని నా ఉద్దేశ్యం. ఈ సవ్య చక్రం ఆంధ్రదేశమంతా బహుళ ప్రచారంలోను, వాడుకలోను ఉంది.

ఇప్పుడు ఈ రెండో చక్రాన్ని చూడండి.




ఈ విధమైన చక్రాన్ని ఆంధ్ర దేశంలో తూర్పు ప్రాంతములో మాత్రమే వేస్తారు. ఈ చక్రంలో అన్ని గ్రహాలు అపసవ్యంగా వేసి చూపిస్తారు. ఈ అపసవ్య చక్రాన్నితూర్పు పశ్చిమ గోదావరి, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాలో వాడతారు. గమనించవలసిన దేమంటే ముఖ్యంగా తూర్పు గోదావరి జిల్లా పండితులు కొందఱు నవాంశ చక్రంలో లగ్న స్థానం చూపించరు. లగ్నం లేకుండా చక్రాన్ని వేసినా ఆది జీవరహితమైన శరీరంలాంటిది. కాబట్టి లగ్నం నవాంశ చక్రంలో కూడా తప్పక వేయాలని పండితులకు నా మనవి.




ఈ చక్రం ఎక్కువగా ఉత్తర హిందూ స్థానంలో వాడతారు. దీనిలో ప్రత్యేకత ఏమంటే లగ్న స్థానం మారదు. ఉదాహరణకు సింహలగ్నంలో జన్మించితే బొమ్మలో 'లగ్నం' అని వ్రాసిన స్థానంలో లగ్నం వేసి సింహరాశి 5వ రాశి కాబట్టి అక్కడ సింహరాశి అని మనకు తెలియడానికి ఆ రాశి నెంబరు వేస్తారు. ఇక్కడ చక్రంలో "లగ్నంలో" "9" అనే సంఖ్య వేశాను. అంటే 9వ రాశి లగ్నమయిందని మనం గ్రహించాలి. ఇలా 9వ రాశి పేరు ఏమిటో మీరు తెలుసుకోవాలి. అప్పుడే లగ్నంరాశి పేరు తదుపరి రాశి స్థానం ఏమిటో తెలుస్తుంది. కాబట్టి మీ సౌలభ్యం కోసం రాశుల పేర్లు సవ్య, అపసవ్య చక్రాలలో వేసి చూపిస్తున్నాను. ఈ రాశి స్థానాలు గాని వాటి పేర్లు గాని మారవు. ముఖ్య విషయం ఏమంటే రాశులు లెక్కపెట్టేటపుడు లగ్న స్థానం నుంచే అని మీరు గ్రహించాలి. అదే కాకుండా సవ్య చక్రంలో సవ్యంగాను, అపసవ్య చక్రంలో అపసవ్యంగానే గణన చేయాలి. ఈ విషయంలో పొరపాటు చేయకూడదు. ఇప్పుడు ఈ క్రింది చక్రాలను గమనించండి.

| | | | |
|---|---|---|---|
| మీనం 12 | మేషం 1 | వృషభం 2 | మిధునం 3 |
| కుంభం 11 | **సవ్యం** | | కర్కాటకం 4 |
| మకరం 10 | | | సింహం 5 |
| ధనుస్సు 9 | వృశ్చికం 8 | తుల 7 | కన్య 6 |





పై చక్రాలు పరిశీలిస్తే మొదటి రాశి ఎప్పుడూ మేషమే అవుతుంది, రెండవ రాశి వృషభమే అవుతుంది. అలాగే అన్నీ రాశులు ఒకటవ నెంబరు నుంచి 12వ నంబరు వరకు చక్ర రూపంలో వేసి చూపించాను మీరు రాశుల పేర్లు మనం చేసుకోవాలి. సవ్యచక్రమైనా అపసవ్యచక్రమైనా కూడా రాశి సంఖ్యల గాని, లేక ఆ రాశిస్థానాల పేర్లు అనీ ఒకే వరుస క్రమంలోనే ఉన్నాయి. ఏ ప్రాంతము వారు వారి గురువు నేర్పించిన పద్ధతిలో అభ్యాసం చేసుకోవాలి. గమనిక ఏమంటే సవ్యచక్రం వేసి అపసవ్యం వేసి గ్రహాలను వేసి చూపించడం, లేక అపసవ్య చక్రం వేసి గ్రహాలను సవ్యంగా వేసి చూపించడం సాంప్రదాయ విరుద్ధం. అవగాహన కొఱకు వ్రాసి పేర్లు వ్రాశామని చెప్పినా, అది సరి కాదు. తప్పు పద్ధతిలో గ్రహాలు వేసి ఆ దోష నివారణార్థం రాశి పేర్లు వ్రాశామని సరిపుచ్చటం దోష పరిహారం కాదు. ఎందుకంటే తెలిసినప్పుడు దోషమే చేయకూడదు అని నా వాదన.

ఇప్పుడు ఆ రాశి పేర్లు తెలుసుకున్నారు కాబట్టి రాశుల అధిపతుల పేర్లు కూడా మనం తెలుసుకోవడం అత్యంత ముఖ్యం. ఎందుకంటే రాశి పేరు చెప్పగానే ఆ రాశ్యాధిపతి ఎవరో వెంటనే చెప్పగలగాలి. ఏమాత్రం ఆలోచన పనికిరాదు.

ఈ క్రింది చక్రాలలో ప్రతి రాశిలోను, రాశుల పేర్లు, ఆ రాశ్యాధిపతి పేర్లు ఇస్తున్నాను. గమనించండి.

| | | | |
|---|---|---|---|
| మీనం<br>గురువు<br>12 | మేషం<br>కుజుడు<br>1 | వృషభం<br>శుక్రుడు<br>2 | మిధునం<br>బుధుడు<br>3 |
| కుంభం<br>శని<br>11 | **సవ్య** | | కర్కాటకం<br>చంద్రుడు<br>4 |
| మకరం<br>శని<br>10 | | | సింహం<br>రవి<br>5 |
| ధనుస్సు<br>గురువు<br>9 | వృశ్చికం<br>కుజుడు<br>8 | తుల<br>శుక్రుడు<br>7 | కన్య<br>బుధుడు<br>6 |




పైన సవ్యచక్రం పరిశీలిస్తే ఒక విషయం మీరు తేలికగా గ్రహించవచ్చు. అదేమంటే చక్రంలో పై వరుస నాలుగు రాశులలో ఎవరెవరు అధిపతులో చక్రం క్రింది వరుసలో కూడా అదే క్రమంలో వారే అధిపతులుగా ఉన్నారు. మీకు ఎడమ వైపు పై వరుసలో మొదటి రాశి క్రింది వరుసలో మొదటి రాశికి కూడా గురువే అధిపతి. ఈ రెండు గురాధిపత్యం కలిగిన రాశుల మధ్య ఉన్న రెండు రాశులకు కూడా శని అధిపతిగా ఉన్నాడు. అలాగే చక్రం పై వరుసలో 2వ రాశి, క్రింది వరుసలో రెండవ రాశులకు కుజుడే అధిపతి. అలాగే చక్రంలో పై వరుసలోని మూడవరాశికి క్రింది వరుసలోని మూడవ రాశికి వరుసలోని శుక్రుడే అధిపతి. ఇంక చక్రంలో పై వరుస ఆఖరి రాశికి, క్రింది వరుసలోని ఆఖరు రాశికి బుధుడే అధిపతి. కాబట్టి మీరు ఈ విషయాన్ని అర్ధం చేసుకుంటే చక్ర స్వరూపం మీకు మస్తిష్కంలో నిలచి పోతుంది. ఎన్నటికి మరచిపోరు. ఇప్పుడు పై వరుసలో చివరి రాశిలో ఉన్న బుధరాశికి క్రింది వరుసలో చివరి రాశిలో ఉన్న బుధునికి మధ్య ఉన్న రెండు రాశులకు చంద్రుడు మరియు సూర్యుడు అధిపతి అని గమనించండి. ఈ విధంగా చక్రాన్ని విశ్లేషించుకుంటే మీకు ఒక్కొక్క అధిపతికి రెండు రాశుల ఆధిపత్యం ఉందని, మీరే గ్రహిస్తారు. ఒక్క సూర్యచంద్రులకు మాత్రమే ఒకే రాశి యొక్క ఆధిపత్యం ఉందని కూడా మీకు తేలికగా అర్ధమయిపోతుంది. ఇక్కడ క్రింద ఇచ్చిన చక్రం పరిశీలిస్తే మీకు చక్రం, చక్రంలోని రాశులు, ఆ రాశి అధిపతులు జ్ఞాపకం ఉండిపోతాయి.

| | | | |
|---|---|---|---|
| మీనం<br>గురువు | మేషం<br>కుజుడు | వృషభం<br>శుక్రుడు | మిథునం<br>బుధుడు |
| ↕ | ↕ | ↕ | ↕ |
| ధనుస్సు<br>గురువు | వృశ్చికం<br>కుజుడు | తుల<br>శుక్రుడు | కన్య<br>బుధుడు |


ఇప్పుడు మనం ఏ రాశిలో నక్షత్రాలు ఏ క్రమంలో ఉంటాయో తెలుసుకొందాం. ఒక్కొక్క రాశిలో మూడు నక్షత్రాల చొప్పున ఉంటాయి. ఒక్కొక్క నక్షత్రానికి నాలుగు పాదాలు ఉంటాయి. అంటే నక్షత్రం ఉండే సమయం నాలుగు భాగాలుగా వివరించ బడింది. ఒక్కొక్క నక్షత్రం ఒక రాశిలో నాలుగు పాదాలతో ఉన్నా నియమం ఏమంటే ఆ రాశిలో ఉన్న నక్షత్రాల పాదాలు అన్ని కలిపితే తొమ్మిది పాదాలకు మించ కూడదు. ఉదాహరణకు మేషరాశిలో అశ్వని, భరణి, కృత్తిక అనే నక్షత్రాలే ఉంటాయి. ఒక్కొక్క నక్షత్రానికి నాలుగు పాదాలు ఉంటాయి. కాబట్టి మొదటి నక్షత్రమైన అశ్వనికి నాలుగు పాదాలు, రెండవ నక్షత్రమైన భరణికి నాలుగు పాదాలు ఉంటాయి. మూడవ నక్షత్రమైన కృత్తికకు నాలుగు పాదాలు ఉన్నా నియమం ప్రకారం ఒక రాశిలో తొమ్మిది పాదాలు మించరాదు కాబట్టి మేషరాశిలో కృత్తిక మొదటి పాదమునే తీసుకొని రెండు మూడు నాలుగు పాదాలు వృషభరాశిలో చూపించాలి. ఇలాగ ప్రతిరాశిలోను తొమ్మిది పాదాలు ఉండేలాగ నక్షత్రాల పాదాలు సర్దుబాటు చేయాలి. అలాగే యిప్పుడు వృషభరాశిలో కృత్తిక మూడు పాదాలు వేసిన తరువాత తదుపరి నక్షత్రమైన రోహిణిలో నాలుగు పాదాలు చూపాలి. తరువాత నక్షత్రమైన పునర్వసును వేసి ఆ నక్షత్రానికి రెండు పాదాలే చూపించాలి. ఇలాగ చక్రం అంతా నక్షత్రాలు పాదాలు సర్దుబాటు చేసుకొంటూపోవాలి. మీకు తేలికగా అర్థం అవడానికి ఈ క్రింద చక్రం వేసి ప్రతిరాశిలోను ఉండే నక్షత్రాల పేర్లు వాటి పాదాలు ఏ నక్షత్రానికి ఏ రాశిలో ఎన్నెన్ని ఉంటాయో నేను చక్ర రూపంలో చూపిస్తున్నాను. కాబట్టి ఈ

చక్రాన్ని మననం చేసుకోవాలి. పొరపాటున కూడ పాద విభజనలో దోషం దొర్లకుండ చూసుకోవాలి. ఎందుకంటే రాశి స్థానం చంద్రుడు ఏ పాదంలో ఉన్నాడో ఆ నక్షత్రం పాదం ఏ రాశిలో ఉందో ఆ స్థానమే ఆ జాతకునకు రాశి స్థానం అవుతుంది. కాబట్టి మనం పొరపాటు చేస్తే జాతకమునకు ఒక్కొక్కప్పుడు రాశి స్థానమే మారిపోతుంది. కాబట్టి మీరు జాగ్రత్తగా ఈ క్రింద ఇచ్చిన చక్రాన్ని అభ్యసించండి.


| | | | |
|---|---|---|---|
| మీనం<br>పూర్వాభాద్ర-4<br>ఉత్తరాభాద్ర<br>1-2-3-4<br>రేవతి 1-2-3-4 | మేషం<br>అశ్వని<br>1-2-3-4<br>భరణి 1-2-3-4<br>కృత్తిక 1 | వృషభం<br>కృత్తిక 2-3-4<br>రోహిణి<br>1-2-3-4<br>మృగశిర 1-2 | మిధునం<br>మృగశిర 3-4<br>ఆరుద్ర1-2-3-4<br>పునర్వసు1-2-3 |
| కుంభం<br>ధనిష్ట 3-4<br>శతభిషం 1-2-3-4<br>పూర్వాభాద్ర 1-2-3 | **రాశులలో ఉండే<br>నక్షత్రాలు<br>వాటి పాదాలు** | | కర్కాటకం<br>పునర్వశు 4<br>పుష్యమి<br>1-2-3-4<br>ఆశ్లేష 1-2-3-4 |
| మకరం<br>ఉత్తరాషాఢ 2-3-4<br>శ్రవణం 1-2-3-4<br>ధనిష్ట 1-2 | | | సింహం<br>మఖ 1-2-3-4<br>పుబ్బ 1-2-3-4<br>ఉత్తర 1 |
| ధనుస్సు<br>మూల 1-2-3-4<br>పూర్వాషాఢ<br>1-2-3-4<br>ఉత్తరాషాఢ 1 | వృశ్చికం<br>విశాఖ 4<br>అనూరాధ<br>1-2-3-4<br>జ్యేష్ట 1-2-3-4 | తుల<br>చిత్త 3-4<br>స్వాతి 1-2-3-4<br>విశాఖ 1-2-3 | కన్య<br>ఉత్తర 2-3-4<br>హస్త 1-2-3-4<br>చిత్త 1-2 |

మీరు గ్రహించాల్సిన సుళువు ఏమంటే మేషం నుంచి మీనం వరకు నక్షత్రాలు పేర్లు వాటి పాదాలు ఒక వరుస క్రమంలో వేసుకుంటూ పోతున్నపుడు మేషంలో నక్షత్రాలలో 3వ నక్షత్రానికి అంటే కృత్తికకు ఒక పాదమే వచ్చింది. మళ్ళీ కృత్తిక నుంచి లెక్కపెట్టి నక్షత్రాలు వాటి పాదాలు వేసుకుంటూ పోతే మళ్లీ కృత్తికా నక్షత్రం నుంచి మూడవ నక్షత్రమైన మృగశిర వచ్చింది. మళ్లీ మృగశిర నక్షత్రం నుంచి లెక్క పెట్టి నక్షత్రాలు వాటి పాదాలు వేసుకొంటూ పోతే మృగశిర నుంచి మూడవ నక్షత్రమై పునర్వసు నక్షత్రం వచ్చింది. అలాగే మళ్లీ పునర్వశు నక్షత్రం నుంచి లెక్కపెట్టి నక్షత్రాలు వాటి పాదాలు వేసుకొంటూ పోతే పునర్వశు నక్షత్రానికి మూడవ నక్షత్రమైన ఆశ్లేష వచ్చింది. మీరు గమనించవలసినది ఏమంటే మొదటి రాశిలో అంటే మేషంలో ఆఖరి నక్షత్రానికి ఒక పాదం, రెండవ రాశిలో అంటే వృషభంలో ఆఖరి నక్షత్రానికి రెండు పాదాలు, మూడవ రాశిలో అంటే మిధునంలో ఆఖరి నక్షత్రానికి 3 పాదాలు నాలుగవ రాశిలో అంటే కర్కాటకంలో ఆఖరి నక్షత్రానికి నాలుగు పాదాలు వచ్చాయి. మళ్లీ

ఇదే పద్ధతి అన్ని రాశులతో ప్రతిబింబిస్తుంది కాబట్టి ఎక్కువ కష్టం లేకుండా రాశులలో ఉన్న నక్షత్రాలు వాటి పాదాలు మీకు తేలికగా అర్థం అవుతాయి. ఇంతవరకు మీరు ఖగోళమంతా పన్నెండు రాశులుగా విభజించబడిందని ప్రతిరాశికి ఒక పేరు ఉందని ఆ రాశికి అధిపతియైన గ్రహం ఎవరో కూడా తెలుసుకొందాం. అలాగే ఏ నక్షత్రం ఎన్ని పాదాలతో ఏ రాశిలో ఉంటుందో కూడ స్పష్టంగా తెలుసుకొన్నాం. ఈ పన్నెండు రాశుల్లో ఒక్కొక్క రాశికి 30 డిగ్రీలు ఉంటాయి. అంటే 30 రోజులుగా మనం తీసుకోవచ్చు. అలాగ 30×12=360 డిగ్రీలుగా మనం గుర్తించాలి. సూర్యుడు ఒక రాశిలో 30 రోజులు ఉంటాడు. మొదటి రోజు ఒక డిగ్రీ అని రెండవ రోజు రెండవ డిగ్రీగాను మూడో రోజు మూడవ డిగ్రీగాను ఆ రాశిలో 30 డిగ్రీలు పూర్తి అయినప్పుడు సూర్యుడు 31వ డిగ్రీలో ప్రవేశిస్తాడు. అంటే మొదటి రాశిలో 30 రోజులు గడిపి రెండవ రాశిలోకి ప్రవేశిస్తాడన్నమాట. ఇలాగ ప్రతి రాశిలోను 30 రోజులు ఉంటూ 12 రాశులలో 12×30=360 రోజులు గడిపి తన సంచారం పూర్తి చేసుకొంటాడు. ఇలా ఒకసారి పూర్తి అయిన కాలాన్ని ఒక సంవత్సరం అంటారు. ఈ రాశులలోబేసి రాశులనియు మరియు సరి రాశులనియు విభజన చేసారు. బేసి రాశులంటే మేషం, మిధునం, సింహం, తుల,ధనుస్సు,కుంభం. ఈ ఆరు రాశులను బేసి రాశులుగా చెప్పబడ్డాయి. ఈ క్రింది చక్రాన్ని గమనించండి. బేసి రాశులను ఓజ రాశులుగా కూడా వ్యవహరిస్తారు.





చక్రంలో బేసి రాశులు





చక్రంలో బేసి రాశులు

పైన చూపిన చక్రాలలో బేసి సంఖ్యలు వేసిన, రాశులు పేర్లు బేసి రాశులని తెలుసుకోవాలి. అలాగే కొన్ని రాశులను సరి రాశులుగా చెప్పబడ్డాయి. అంటే చక్రంలో

మేషం నుంచి లెక్కించినపుడు ప్రతి సరి రాశిని సరి రాశిగానే చెప్పబడ్డాయి. ఈ సరి రాశులను అంటే వృషభం, కర్కాటం, కన్య, వృశ్చికం మకరం మీనం, ఈ ఆరు రాశులను యుగ్మ రాశులుగా వ్యవహరిస్తారు. ఈ క్రింది చక్రమును గమనించండి.




చక్రంలో సరి రాశులు





చక్రంలో సరి రాశులు

పై చక్రంలో ఉన్న ప్రతి సరి రాశిలో ఉన్న రాశి పేరును మీరు గమనించండి. ఈ రాశులన్ని సరి రాశులుగా జ్ఞాపకం ఉంచుకోవాలి. ఎందుకంటే బేసి రాశులన్నియు పురుష రాశులని సరి రాశులన్ని స్త్రీ రాశులని తెలుసుకోవాలి. అలా తెలుసుకోవడం వల్ల రాశి పేరు ఉచ్ఛరించగానే ఆ రాశి పురుష రాశో స్త్రీ రాశో మనం తేలికగా గ్రహించవచ్చు. పురుష రాశికి, స్త్రీ రాశికి కారకత్వాలు వేరు వేరుగా ఉంటాయి కాబట్టి మనం లింగభేదం గుర్తించడం సమంజసం. ఇక రాశి తత్త్వాల విషయానికే వస్తే ఈ పన్నెండు రాశులది ఒకే తత్త్వం కాదు. ఈ రాశులను నాలుగు విధాలుగా విభజించబడ్డాయి. అవి అగ్నితత్త్వ రాశులు, భూతత్త్వ రాశులు, వాయు తత్త్వ రాశులు మరియు జల తత్త్వ రాశులు. మీ సౌలభ్యం కోసం నేను ఏ రాశులు ఏ తత్వం కల్గి ఉంటాయో పైన చెప్పిన వరుస క్రమంలో క్రింద పొందుపరుస్తున్నాను.

| | | |
|---|---|---|
| అగ్నితత్త్వ రాశి | :- | మేషం, సింహం, ధనుస్సు |
| భూతత్త్వరాశి | :- | వృషభం, కన్య, మకరం |
| వాయుతత్త్వరాశి | :- | మిధునం, తుల, కుంభం |
| జలతత్త్వరాశి | :- | కర్కాటకం, వృశ్చికం, మీనం. |


ఈ క్రింది చక్రాన్ని పరిశీలించండి.

| | | | |
|---|---|---|---|
| మీనం జలతత్వం | మేషం అగ్ని తత్వం | వృషభం భూతత్వం | మిధునం వాయు తత్వం |
| కుంభం వాయు తత్వం | **రాశుల తత్వాలు** | | కర్కాటకం జలతత్వం |
| మకరం భూ తత్వం | | | సింహం అగ్ని తత్వం |
| ధనుస్సు అగ్ని తత్వం | వృశ్చికం జల తత్వం | తుల వాయు తత్వం | కన్య భూతత్వం |





మనం రాశుల బలాలు ఎలా ఉంటాయో కూడా తెలుసుకుందాం. రాశుల బలాలు రెండు భాగాలుగా విభజించబడింది. మొదటిది పగలు బలంగా ఉండే రాశులు, రెండవది రాత్రిపూట బలంగా ఉంటే రాశులు. అంటే పగలు బలంగా ఉండే రాశులు సూర్యాస్తమయమైన తర్వాత తమ బలాన్ని చాలా భాగం కోల్పోతాయి. అంటే సూర్యుడు ప్రకాశిస్తున్న సమయంలో శక్తివంతంగాను బలంగాను ఉంటాయి. అలాగే రాత్రిపూట బలంగా ఉండే రాశులు సూర్యుడు ప్రకాశిస్తున్న సమయంలో వాటి శక్తి కోల్పోతాయి. అంటే సూర్యోదయం నుంచి సూర్యాస్తమయమే మధ్య

కాలంను పగలుగా తీసుకోవాలి. అలాగే మళ్లీ సూర్యాస్తమయమయినప్పటి నుంచి మళ్లీ సూర్యోదయమయ్యే వరకు ఉన్న నిషేధకాలాన్ని రాత్రిగా తీసుకోవాలి. పగలు బలంగా ఉండే రాశులు సింహం, కన్యా, తుల, వృశ్చికం, కుంభం, మీనరాశులు. అలాగే రాత్రి బలంగా ఉండే రాశులు మేషం, వృషభం, మిథునం, కర్కాటకం, ధనస్సు, మకరాలు. ఈ క్రింది చక్రం గమనించండి.





పగలు బలంగా ఉండే రాశులు





పగలు బలంగా ఉండే రాశులు

రాత్రి బలంగా ఉండే రాశులు మేషం, వృషభం, మిథునం, కర్కాటకం, ధనుస్సు, మకరాలు. ఈ క్రింది చక్రం గమనించండి.





రాత్రి బలంగా ఉండే రాశులు





రాత్రి బలంగా ఉండే రాశులు

ఈ రాశుల పన్నెండింటినీ మళ్లీ మూడు భాగాలుగావాటి యొక్క శక్తి బలాల ప్రకారం విభజించారు. అవి 1. పృష్టోదయ రాశులు 2. శీర్షోదయ రాశులు 3. ఉభయ రాశులు.

**1.పృష్ఠోదయ రాశులు :** మేషం, వృషభం, కర్కాటకం, ధనస్సు, మకరం ఈ పంచరాశులను పృష్టోదయ రాశులు అంటారు. ఏ గ్రహాలైనా ఈ పృష్టోదయ రాశులలో ఉన్నప్పుడు ఆ గ్రహాలు తమ అంత్య దశలో ఫలితాలు ఇస్తాయి. ఆ ఫలితాలు శుభ ఫలితాలు కావచ్చు లేక అశుభ ఫలితాలు కావచ్చు. ఈ క్రింది చక్రం గమనించండి.





పృష్టోదయ రాశులు





పృష్టోదయ రాశులు

**2. శీర్షోదయ రాశులు:** మిథునం, సింహం, కన్య, తుల, వృశ్చికం, కుంభాలు శీర్షోదయ రాశుల క్రిందకు వస్తాయి. ఏ గ్రహమైనా ఈ రాశులలో ఉన్నప్పుడు ఆ గ్రహాల దశ వచ్చినప్పుడు ప్రారంభదశలోనే ఫలితాలు ఇస్తాయి. ప్రారంభ దశలోనే అవి యోగిస్తాయి. గ్రహస్థితిని కూడా పరిగణనలోకి తీసికొని ఫలితాలు ఎలాంటివో నిర్ణయించాలి. శుభా శుభ ఫలితాలు ఏమైనా కావచ్చు అని మనం గుర్తుంచుకోవాలి. ఈ క్రింది చక్రం పరిశీలించవచ్చు.




శీర్షోదయ రాశులు




శీర్షోదయ రాశులు


**3. ఉభయోదయ రాశి :** ఈ పేరు ప్రకారం మీకు మీరే ఉభయోదయ రాశులు ఎలా ఫలితాలు ఇస్తాయో తెలుసుకుని ఉంటారు. మొదటి చెప్పబడిన పృష్టోదయ రాశుల

అంత్యంలోను, శీర్షోదయ రాశులు ప్రారంభంలోను ఫలితాలు ఇస్తాయని మనం చెప్పుకున్నప్పుడు మిగిలిన ఒక్క మీన రాశి మాత్రం ఉభయోదయ రాశి పేరు ప్రకారం ఉభయ సమయాలలో తమ ఫలితాలను ఇస్తుంది. అంటే మీన రాశిలో ఉన్న గ్రహాలు తమ దశ వచ్చినప్పుడు ఫలితాలు అన్ని వేళలా ఇస్తునే ఉంటాయి. కాని శుభ ఫలితాలు అయినా, ఆశుభఫలితాలు అయినా ఆ దశా కాలమందు జాతకులు, ఆ దశాంతమయ్యేవరకు అనుభవిస్తూనే ఉంటారు.

మీరు ఇక్కడ గ్రహించవలసినది ఏమంటే ఎవరైనా ఫలితాలు ఏ జాతకులకైనా చెప్పేటపుడు ఈ రాశులు బలాబలాలు కూడా పరిగణనలోకి తప్పకుండా తీసుకోవాలి. ఉదాహరణకు గురువు పృష్టోదయ రాశిలో అంటే మేష, వృషభ, కర్కాటక, ధనస్సు, మకరంలో ఉన్నపుడు గురువు ఆ రాశిలో ప్రవేశించాడు. గురు దశ కూడా ఉందికాబట్టి యోగిస్తాడని, శుభఫలితాలే వస్తాయని చెప్పకూడదు. ఎందుకంటే గురువుఉదాహరణకు ధనస్సు అంటే తన స్వక్షేత్రం ఉన్నా ఆ రాశి పృష్టోదయ రాశి కాబట్టి గురువు తన దశలో అంత్యంలోనే యోగిస్తాడుఅని గ్రహించాలి.అంటే గురువు గాని లేకఏ గ్రహమైనా ఫలితాలు ఇచ్చేది ఆ రాశి నివాసస్థితి, మరియు దశా స్థితి తప్పక విశ్లేషించుకోవాలి.

రాశుల యొక్క దిక్కులను కూడా మనం తెలుసుకుందాము. అంటే ఏ రాశి ఏ దిక్కును సూచిస్తాయి. మరియు ఏ దిక్కుకు ఆ రాశి సంకేతమో మనం తెలుసుకోవాలి. మేషం, సింహం, ధనస్సు తూర్పు దిక్కును సూచిస్తాయి. మరి వృషభం, కన్య, మకరం, దక్షిణ దిక్కును సూచిస్తాయి. అలాగే మిథునం, తుల, కుంభం పడమర దిక్కును సూచిస్తాయి. మిగిలిన రాశులైన కర్కాటకం, వృశ్చికం, మీనం. ఇవి ఉత్తర దిక్కును సూచిస్తాయి. ఈ క్రింది చక్రం చూడండి.

| | | | |
|---|---|---|---|
| మీనం ఉత్తరం | మేషం తూర్పు | వృషభం దక్షిణం | మిధునం పడమర |
| కుంభం పడమర | **సవ్యం** | | కర్కాటకం ఉత్తరం |
| మకరం దక్షిణం | | | సింహం తూర్పు |
| ధనుస్సు తూర్పు | వృశ్చికం ఉత్తరం | తుల పడమర | కన్య దక్షిణం |




మనం అందరం మానవులమైనా మనలో కుల నిర్ణయం జాతి నిర్ణయం ఎలాగ ఉందో రాశులలో కూడ అలాగే జాతి నిర్ణయాలు ఉన్నాయి. వృషభ, వృశ్చిక మీన రాశులు – ఈ మూడు రాశులు బ్రాహ్మణ రాశులుగా పేర్కొనబడ్డాయి. మేషం, సింహం, ధనుస్సు – ఈ మూడు రాశులు క్షత్రియ రాశులని పేరొందాయి. అలాగే మిధున తుల కుంభ – ఈ మూడు రాశులు వైశ్య రాశులుగా చెప్పబడ్డాయి. మిగిలిన కర్కాటకం, కన్య, మకరం – ఈ మూడు రాశులను శూద్ర రాశులుగా వ్యవహరిస్తున్నాం.

ఈ క్రింది చక్రం చూడండి.

| | | | |
|---|---|---|---|
| మీనం బ్రాహ్మణ | మేషం క్షత్రియ | వృషభం బ్రాహ్మణ | మిధునం వైశ్య |
| కుంభం వైశ్య | **సవ్యం** | | కర్కాటకం శూద్ర |
| మకరం శూద్ర | | | సింహం క్షత్రియ |
| ధనుస్సు క్షత్రియ | వృశ్చికం బ్రాహ్మణ | తుల వైశ్య | కన్య శూద్ర |

రాశుల జాతులు





రాశుల జాతులు

ఏ గ్రహమైనా ఏ రాశిలో ఉంటుందో ఆ రాశి యొక్క జాతి లక్షణాలను కూడా ఆ గ్రహం ఇచ్చే ఫలితాలలో ప్రతిబింబిస్తాయి. అందువల్ల మనం ఈ విషయాన్ని కూడ ఫలితాలు చెప్పేటప్పుడు పరిగణనలోకి తీసుకోవాలి.

రాశులలో మరి మూడు రకాలు రాశులు ఉన్నాయి. హ్రస్వ రాశులనియు, రెండవది దీర్ఘ రాశులని మరియు సమ రాశులు అని మూడు విధాలుగా విభజింపబడ్డాయి. మేషం, వృషభం, కుంభం, మీనం ఇవి హ్రస్వ రాశులుగా తీసుకోవాలి. తదుపరి మిథునం, కర్కాటకం, ధనుస్సు, మకరం ఇవి సమరాశులుగా తీసుకోవాలి. ఇప్పుడు మిగిలిన రాశులైన సింహం, కన్య, తుల, వృశ్చికం దీర్ఘరాశులుగా తీసుకొనబడ్డాయి.

| | | | |
|---|---|---|---|
| మీనం హ్రస్వ | మేషం హ్రస్వ | వృషభం హ్రస్వ | మిథునం సమ |
| కుంభం హ్రస్వ | **సవ్యం** | | కర్కాటకం సమ |
| మకరం సమ | | | సింహం దీర్ఘ |
| ధనుస్సు సమ | వృశ్చికం దీర్ఘ | తుల దీర్ఘ | కన్య దీర్ఘ |

హ్రస్వ దీర్ఘ సమ రాశులు





హ్రస్వ దీర్ఘ సమ రాశులు

రాశులలో కొన్ని రాశులు శబ్ద గ్రహణం, శబ్దోత్పత్తే కాక శబ్దహీనంగా కూడ ఉంటాయి. అలాగే కొన్ని రాశులు అర్ధం స్వర రాశులుగా చెప్పబడ్డాయి. మేషం, వృషభం, మిథునం, సింహం, ధనుస్సు రాశులు ఎక్కువ శబ్ద కారకత్వం కలవి. అంటే ఈ రాశులు తమ శబ్దోత్పత్తిలో ఎక్కువ ఉధృతంగా ఉంటాయి. కన్య, మకర, కుంభ రాశులు అర్ధ స్వర రాశులుగా పండిత నిర్ణయం చేయబడింది. ఈ రాశులు యొక్క శబ్దోత్పత్తి అర్ధస్వరంగానే ఉంటుంది గాని తీవ్రమైన, లేక ఉధృతంగా ధ్వనిని సృజించలేవు. అలాగే మిగిలిన రాశులైన కర్కాటకం, తుల, వృశ్చికం, మీన రాశులు శబ్దహీన రాశులుగా గ్రహించారు.

ఈ క్రింది చక్రం చూడండి.

| | | | |
|---|---|---|---|
| మీనం ధ్వని హీనం | మేషం ఎక్కువ ధ్వని | వృషభం ఎక్కువ ధ్వని | మిథునం ఎక్కువ ధ్వని |
| కుంభం అర్ధ స్వర | **సవ్యం** | | కర్కాటకం శబ్ద హీనం |
| మకరం అర్ధ స్వర | | | సింహం ఎక్కువ ధ్వని |
| ధనుస్సు ఎక్కువ ధ్వని | వృశ్చికం ధ్వని హీనం | తుల ధ్వని హీనం | కన్య అర్ధ స్వరం |

రాశుల శబ్దోత్పత్తి





రాశుల శబ్దోత్పత్తి

నిజానికి మనం ఆలోచించి చూస్తే మేషం, వృషభం, సింహం లాంటి జంతువులు ఎక్కువ ధ్వనిని చేయగలవు. కర్కాటకం, వృశ్చికం, మరియు మీనములు ధ్వనిహీనంగా ఉంటాయి. దీనిని బట్టి లగ్నములు ఏ రాశి స్థానములో ఉంటే ఆ జాతకులకు ఉన్న కంఠస్వరమును గుర్తించవచ్చు. అలాగే వృశ్చిక, మీన రాశులు లగ్నముగా గలవారు సున్నిత సంభాషణ చేయగలరు గాని వారి కంఠంలో ఎక్కువ ధ్వని వినిపించదు అని మనం గ్రహించవచ్చు. మానవులలో ఒకే శరీరతత్వం అందరికి ఉండదు. వేరు వేరుగా ఉంటాయి. అలాగే గ్రహాలలో కూడా రాశి తత్వాలు వేరు వేరుగా ఉంటాయని మన పూర్వులు ధృవీకరించారు. రాశులకు ఆరోగ్య సూత్రాలను కూడ వర్తింప చేసారు. మేష, సింహ, ధనుస్సులు పిత్త ప్రకృతి గలవి. వృషభ, మిథున, కన్య, తుల, మకర, కుంభములు– ఈ రాశులన్ని వాత ప్రకృతి గలవి. మిగిలిన కర్కాటక, మీన, వృశ్చిక రాశులు శీతల ప్రకృతి గలవి.

ఈ క్రింది చక్రం చూడండి.

| | | | |
|---|---|---|---|
| మీనం శీతలం | మేషం పిత్త | వృషభం వాత | మిథునం వాత |
| కుంభం వాత | **సవ్యం** | | కర్కాటకం శీతలం |
| మకరం వాత | | | సింహం పిత్త |
| ధనుస్సు పిత్త | వృశ్చికం శీతలం | తుల వాత | కన్య వాత |

రాశుల శరీర తత్వాలు





రాశుల శరీర తత్వాలు

మనం ఫలితాలు చెప్పేటప్పుడు జాతక లగ్నం ఏ రాశిలో ఉందో గమనించి వారి శరీరతత్వాన్ని ఊహించవచ్చు.


రాశులలో సంతానం గురించి కూడా పండితులు విశ్లేషించారు. మేష, కర్కాటక సింహ, కన్య, వృశ్చిక, మీన రాశులు అల్ప సంతాన రాశులుగా మన పూర్వ సిద్ధాంత జ్యోతిష గణం నిర్ణయించారు. అలాగే వృషభ, ధనుస్సు, మకర, కుంభ రాశులు

సమ సంతాన రాశులుగా చెప్పారు. మిగిలిన రాశులైన మిథున, తుల రెండు రాశులు అతి సంతాన రాశులుగా నిర్ణయించారు. కాబట్టి ఈ విషయాన్ని కూడ ఫలితాలు చెప్పేటప్పుడు పరిగణనలోకి తీసుకోవాలి.

ఈ క్రింది చక్రం గమనించండి.




రాశుల సంతాన సంజ్ఞలు





రాశుల సంతాన సంజ్ఞలు

మనం జాతక చక్రంలో పంచమ భావం పరిశీలించేటప్పుడు ఇక్కడ ఇచ్చిన పై చక్రాన్ని విస్మరించకూడదు.

మానవుల్లో ఈ భూమి మీద అందరు కలిసి నివసిస్తున్నా వారి నివాస స్థలాలలో వైవిధ్యం మనం గ్రహించగలం. ఎందుకంటే కొందరు పర్వత ప్రాంతాల్లోను, కొంతమంది గ్రామాల్లోను, మరికొంతమంది అరణ్యములందును నివసిస్తున్నారు. అంతేకాకుండా కొందరు భూమిమీద మాత్రమే ఉంటారు. మరికొంతమంది నదీనద సముద్రతీర ప్రాంతాల్లో నివసిస్తూ ఉంటారు. ఇవన్నీ కాక మరికొందరు ఆదిమవాసులు వంటివారు కొండగుహల్లోను కొండ బిల్వంలోను ఇప్పటికి నివసిస్తున్నారు. ఈ రకాల జాతులు ఆఫ్రికా ఖండంలో ఉంటారని మనకు తెలుసు. ఇక ముఖ్య గమనిక ఏమంటే మానవులు అందరు భూమి ఉపరితలం మీదే జీవిస్తున్నా వారివారి రాశిని బట్టి వారి నివాసాల్లో ఎంతో వైవిధ్యమున్నదో గమనించండి. అందుకనే పండితోత్తములు ఈ రాశులను వేరువేరుగా విభజించి వారి నివాస స్థలం ఎలా ఉండగలదో ఒక సూక్ష్మ పద్ధతిలో చెప్పారు. ప్రస్తుత కాలంలో మానవాభివృద్ధి మరియు కాలప్రభావ ఆధునికత వల్ల నివాస స్థలాలు ఏర్పడుతున్నా మనం తార్కికంగా విశ్లేషించి చూస్తే వారి

| | | | |
|---|---|---|---|
| మీనం జలం | మేషం పర్వత | వృషభం గ్రామ | మిధునం గ్రామ |
| కుంభం జలం | సవ్యం | | కర్కాటకం అరణ్యం |
| మకరం పర్వత | | | సింహం అరణ్యం |
| ధనుస్సు పట్టణ | వృశ్చికం బిల్వం | తుల పట్టణ | కన్య పర్వత |

రాశుల నివాస వివరాలు





రాశుల నివాస వివరాలు

రాశులలో మానవులలాగే రంగు కూడా వైవిధ్యంగానే ఉంటుంది. అంటే భూమి మీద నుంచి మనం చూసినపుడు ఏ రంగులో కనిపిస్తాయో తెలుసుకుందాం. యూరోప్‌లో మనుషులు కందగడ్డ రంగులోను, అమెరికాలో ఎఱుపు తెలుపు కలిసి గులాబి రంగులోను, చైనాలో పసుపు పచ్చ రంగులోను అలాగే ఆఫ్రికాలో నల్లగాను ఎలా ఉంటారో అలాగే రాశులలో కూడా రంగులు వివిధ రకాలుగా ఉంటాయి. మేషం, సింహం, ధనుస్సులు ఎఱుపు గలిగి ఉంటాయి. వృషభ, కర్కాటక, తుల రాశులు శ్వేత వర్ణము కలిగి ఉంటాయి. మిథున, కన్య, మకరం నలుపురంగు కలిగి ఉంటాయి. వృశ్చికం, కుంభం, మీనం పసుపు రంగు కలవిగా చెప్పబడ్డాయి. ఈ క్రింది చక్రం గమనించండి.

| | | | |
|---|---|---|---|
| మీనం పసుపు | మేషం ఎరుపు | వృషభం శ్వేత | మిధునం నలుపు |
| కుంభం పసుపు | సవ్యం | | కర్కాటకం శ్వేత |
| మకరం నలుపు | | | సింహం ఎరుపు |
| ధనుస్సు ఎరుపు | వృశ్చికం పసుపు | తుల శ్వేత | కన్య నలుపు |

రాశుల వర్ణం





రాశుల వర్ణం

ఇంకొక విషయం ఏమంటే ఈ రాశులలో చర రాశులు, స్థిరరాశులు మరియు ద్విస్వభావ రాశులుగా మూడు విధములుగా విభజించబడ్డాయి. మేషం, కర్కాటకం, తుల, మకరం రాశులన్నీ చరరాశులనియు, వృషభం, సింహం, వృశ్చికం, కుంభం స్థిరరాశులనియు మిగిలిన మిథునం, కన్య, ధనస్సు, మీనం ద్విస్వభావ రాశులుగా పేర్కొనబడ్డాయి. అంటే ద్విస్వభావ రాశులుగా పేర్కొన్న రాశులు మిథున కన్యలకు బుధునియొక్క ఆధిపత్యంలో ఉన్న రాశులు. అలాగే ధనస్సు, మీనం గురువు యొక్క ఆధిపత్యంలో ఉన్న రాశులు అంటే సవ్యచక్రంలో ఎడమవైపు ఉన్న పై వరుసలోని ప్రథమ రాశి, క్రింది వరుసలోని ప్రథమరాశి. ఈ రెండు గుర్వాధిపత్యంలోనివి. అలాగే మనకు కుడివైపు ఉన్న పై వరుసలోని చివరి రాశి మరియు క్రింది వరుసలో కుడివైపు ఉన్న చివరి రాశి ఈ రెండు రాశులు ద్విస్వభావ రాశులు గుర్తించవచ్చు. ఇంకా తేలికగా చెప్పాలంటే సవ్య చక్రంలో నాలుగు మూలలో ఉన్న నాలుగు రాశులూ ద్విస్వభావ రాశులుగా మీరు గుర్తుపెట్టుకోవచ్చు. అలాగే మేషరాశి స్థిరరాశిగా ఉంది కాబట్టి ఆ రాశి స్థానం నుంచి ప్రతి నాలుగో స్థాన రాశి స్థిరరాశి అవుతుంది. అంటే చరరాశి ఒక దానినుంచి మరొకటి ఎప్పుడు నాలుగో స్థానంలోనే ఉంటుంది. అలాగే స్థిరరాశి కూడా ఒకదాని నుంచి ప్రతి నాలుగో స్థానం స్థిర రాశి అవుతుంది. అంటే ద్విస్వస్వభావ, చర, స్థిరరాశులు ఒక స్థానం నుంచి మరొక నాలుగో స్థానం అదే రాశి అవుతుంది అని గ్రహించండి. ఈ క్రింది చక్రం పరిశీలించండి.

| | | | |
|---|---|---|---|
| మీనం ద్విస్వభావ | మేషం చర | వృషభం స్థిర | మిథునం ద్విస్వభావ |
| కుంభం స్థిర | **సవ్యం** | | కర్కాటకం చర |
| మకరం చర | | | సింహం స్థిర |
| ధనుస్సు ద్విస్వభావ | వృశ్చికం స్థిర | తుల చర | కన్య ద్విస్వభావ |

రాశుల చలన స్వభావం




రాశుల చలన స్వభావం

మన దేశపు కొన్ని ప్రాంతాలలో 12 మాసాలకు 12 రాశులు పేర్లు పెట్టుకొని ఆ విధానాన్నే అనుసరిస్తూ మాసపేరును రాశి పేరే పెట్టుకొన్నాము. ఉదాహరణకు చైత్రం-మేషమాసం, వైశాఖం-వృషభమాసం, జ్యేష్ఠం-మిథున మాసం ఇలా 12 రాశుల పేర్లతో 12 మాసాలను పిలుస్తారు. ఇది తమిళుల సాంప్రదాయం.

ఇంకొక విషయం ఏమంటే రాశులను కూడా మానవరాశులని, జంతు రాశులని మరియు కీటక రాశులని కూడా విశ్లేషించారు. జంతురాశులను కొంతమంది చతుష్పాద రాశులని కూడా వ్యవహరిస్తారు. ఈ అధ్యాయంలో మనం స్థూలంగా రాశుల గురించి అన్ని విషయాలు స్థూలంగా విశదంగా చదివినా ఇంక రెండు చిన్న విషయాలు కూడా మీకు విశదీకరిస్తాను. అదేమంటే మిథున, కన్య, తుల, కుంభ, ధనస్సు రాశులయొక్క మొదటి సగభాగములు నరరాశులు చెప్పబడ్డాయి. అలాగే మేషం, వృషభం, సింహం, ధనస్సు యొక్క రెండవ సగభాగము మరియు మకర రాశి యొక్క మొదటి సగభాగము చతుష్పాద రాశులుగా పేర్కొనబడ్డాయి. వృశ్చికరాశిని కీటక రాశి అని పిలుస్తారు. మీరు ముందు అధ్యాయానికి పోయేముందు ఈ అధ్యాయాన్నే మళ్లీ ఒకసారి శ్రద్ధగా చదవండి. రాశుల కారకత్వాలు మరియు వాటి స్వభావాలు పూర్తిగా తెలుసుకుంటే గాని రాశుల మీద ఒక అవగాహన ఉండదు. అలా లేకుంటే మనం ఫలితాలు చెప్పినవి సరికాక పోవచ్చు. అందువల్ల ఈ అధ్యాయం మొత్తం మళ్లీ ఒకసారి తప్పకుండా చదవండి.

# అధ్యాయం - 2

## గ్రహాలు

ముందు అధ్యాయంలో మీరు రాశుల గురించి పూర్తిగా తెలుసుకున్నారు. జ్యోతిషశాస్త్రంలో రాశి అనేది పంచప్రాణాలలో ఒకటి కాబట్టి మనం రాశుల గురించి ఒక అవగాహనకు వచ్చాము. ఇప్పుడు మీకు గ్రహాల గురించి వివరంగా అన్ని విషయాలు విపులంగా విశదీకరిస్తాను. మనకున్నవి సప్తగ్రహాలు అని అందరకూ తెలుసు. ఈ సప్తమ ఆ గ్రహాల పేర్లే మనం వారాలకు పెట్టుకొన్నాము. వారం అంటే ఏడు రోజులు కాబట్టి ఏడు గ్రహాల పేర్లు వరుస క్రమంలో ప్రతి దినానికి ఒక్కొక్క పేరు పెట్టుకొని ఆ పేరుతోనే ఆ దినాన్ని పిలుచుకుంటున్నాము. ఆదిత్యుడు అంటే రవి, పేరు మీద ఆదివారమని, చంద్రుడు అంటే సౌమ్యుడు కాబట్టి సోమవారమని, బుధుని పేరు మీద బుధవారమని, గురువు పేరు మీద గురువారమని, శుక్రుని పేరు మీద శుక్రవారమని అలాగే శని పేరు మీద శనివారమని పిలుచుకుంటున్నాము. ఈ గ్రహాలను మనము భూమి మీద నుంచి అత్యంత శక్తి గల దుర్భిణి ద్వారా వీక్షించగలము. కాని ఇంకా రెండు గ్రహాలు ఉన్నాయి. అవి రాహువు మరియు కేతువు గ్రహాలుగా చెప్పబడ్డాయి. ఈ రెండు గ్రహాలు మానవ మేథస్సుకు కూడా అందనంత దూరంలో ఉన్నాయి. ఏ పరికరము కూడా వాని ఆకార ఉనికి, ఖచ్చితంగా నిర్ణయించలేదు. కాని ఆ గ్రహాలు అంతరిక్షంలో సంచార భ్రమణంలో ఉన్న వాటి నీడలు మిగిలిన గ్రహాల మీద పడుతున్నాయి. కాబట్టి ఛాయాగ్రహాలుగా పేర్కొన్నారు. మన పూర్వ జ్యోతిష పండితులు వేల సంవత్సరాలకు పూర్వమే మనకు ఈ సృష్టి రహస్యాన్ని విప్పి చెప్పారు. ఈనాటికి కూడా ఏ మానవుడు ఆ గ్రహాలను ఏ పరికరంతోను చూడలేకపోతున్నడనేది సత్యం.

ఈ గ్రహాలతో పాటు పాశ్చాత్యులు రాహుకేతువులను విడిచి తమ దృష్టికి అందిన మరికొన్ని గ్రహాలను జ్యోతిష శాస్త్రంలో వాడుతున్నారు. అవి వరుణుడు (URANUS), ఇంద్రుడు (NEPTUNE), యముడు (PLUTO). ఈ మూడింటిని

గ్రహాలుగానే లెక్కిస్తారు. హైందవ శాస్త్ర ప్రకారం ఈ ముగ్గురు మనకు గ్రహాలు కారు. వీరు దిక్పాలకులు మాత్రమే ఈ నిజాన్ని మనం గ్రహించాలి. ఎందుకంటే మన శాస్త్రాల వివరణ ఎంతో స్పష్టంగాను మరియు ఎంతో ప్రామాణికంగాను ఉండటమే కాక వాస్తవిక విషయాన్ని ఋజువు చేస్తుంది. ఎందుకంటే మనకు దిక్పాలకులు ఎవరో గ్రహాలు ఎవరో సుస్పష్టంగా మన పూర్వులు నిర్వచించారు. కాబట్టి ఈ విషయంలో మనకు ఎలాంటి సందేహం లేదు. ఇప్పుడు కొన్ని పాశ్చాత్య దేశాలు కూడా మన పూర్వ జ్యోతిష పండితులు విశదీకరించిన విధంగా వారు కూడా రాహు, కేతువులను కూడా రెండు గ్రహాలుగా లెక్కించి నవగ్రహాలు ఉన్నాయని
116 అంగీకరించారు.

మన అందరికి నవగ్రహాలు అన్ని తెలుసు. కాని ప్రతి గ్రహానికి ఒక ఉపగ్రహం కూడ ఉంటుందని మనం జ్ఞాపకం ఉంచుకోవాలి. దీనివల్ల మనం జాతక చక్రం పరిశీలించేటప్పుడు ఒక జాతకునికి ఫలితాలు ఎలా ఉంటాయో నిర్ణయం చేసుకొని చెపుతున్నపుడు ఉపగ్రహం ఇచ్చే ఫలితం కూడ మనం విశ్లేషించికొని ఫలితాలు చెపితే ఆ ఫలితాలు వాస్తవికతకు దగ్గరగా ఉంటాయనడంలో సందేహం లేదు. అందువల్ల ఏ గ్రహానికి ఏ ఉపగ్రహం తెలుసుకొందాం. రవి యొక్క ఉపగ్రహాన్ని కాలమనియు, చంద్రుని ఉపగ్రహాన్ని పరివేషమనియు, కుజునకు ధూమమనియు, బుధునికి అర్ధప్రహారం, గురునకు యమకంటకమనియు, శుక్రునకు కోదండమనియు, శనికి గుళికనియు, రాహుకు పాతమనియు, కేతువుకు ఉపకేతవనియు అని ప్రత్యేకంగా ఉపగ్రహాలున్నాయి. మనం ఈ ఉపగ్రహాలను పరిగణలోనికి తీసుకోకుండా గ్రహాలను మాత్రమే చక్రాలలో చూపిస్తాము కాబట్టి ఉపగ్రహాల గురించి ఏ వివరణ ఇవ్వలేదు.

మానవులలో అందరు ఒకే తీరున ఉండరు. సన్మార్గులు, సచ్ఛీలురు ఎలా ఉంటారో అలాగే దుర్మార్గులు, దుష్టులు కూడ ఉంటారని మనకు తెలుసు. మంచి
6 వారు మంచి పనులు చేస్తూ అందరి శుభమే కోరుతారు. అలాగే దుష్టులు దుష్టకార్యాలు చేసి అందరిని బాధిస్తారు.

మనకున్న నవగ్రహాలలో కూడ ఈ సరళి కనుపిస్తుంది. అంటే వాటిలో కొన్ని గ్రహాలు పుణ్యగ్రహాలుగాను మరికొన్ని గ్రహాలు పాపగ్రహాలుగాను చెప్పబడ్డాయి.

మనం గమనించ వలసినది ఏమంటే మానవులోలాగే కొన్ని గ్రహాలు సమయస్థితిని బట్టి కొన్నిసార్లు పుణ్యఫలితాలను మరికొన్నిసార్లు పాపఫలితాలను ఇస్తాయి.

మనం పుణ్యగ్రహాలు ఏమిటో పాపగ్రహాలు ఏమిటో విశదంగా తెలుసుకుందాము. సూర్యుడు గ్రహాధిపతియైనా, ఆదిత్య భగవానుడుగా మనం కొలిచి ఆరాధిస్తున్నా, సూర్యుడు పాపగ్రహమే. సూర్యుడు ఎప్పుడు పాపఫలితాలే ఇస్తాడు. అంతేకాకుండా ఏ గ్రహమైనా తన కక్షలో అంతరిక్షంలో సంచారం చేస్తూ సూర్యుడు దగ్గరగా వచ్చినపుడు ఆ గ్రహం పుణ్యఫలితాలు ఇచ్చేదైనా శక్తిహీనుని చేసి ఆ గ్రహం ఇచ్చే పుణ్యఫలితాలను హరించివేస్తాడు. అంటే తాను సహాయం చేయకపోయినా సహాయం చేసే గ్రహానికి కూడా అడ్డుపడతాడు. అందువల్ల గ్రహాలకు గురువైన, గురువు సూర్యునికి దగ్గరగా వచ్చినపుడు గురువిచ్చే శుభఫలితాలను ఇవ్వనీయడు. ఇలాగ ఏ గ్రహమైనా ఒకే రాశిలో సూర్యునితో ఉన్నప్పుడు, శక్తిని కోల్పోయి బలహీనులు అవుతారు కాబట్టి ఆ స్థితిని అస్తంగత్వం అందుకని పుణ్యగ్రహాలైన గురువుగాని లేక శుక్రుడు గాని సూర్యునితో కలిసినప్పుడు ఆ మాసమంతా గురుమౌఢ్యమి అంటారు.లేదా శుక్రమౌఢ్యమి అందువల్ల గురు బలం లేకుండా ఏ కార్యం తలపెట్టినా అది దిగ్విజయం కాదు. అందువల్ల గురుమూఢమిలో ఏ శుభకార్యాలు చేయకూడదు. అలాగే దాంపత్య సంతోషానికి ఆనందానికి మూల కారకుడైనా శుక్రుడు అంతరిక్షంలో చక్రభ్రమణం చేస్తున్నప్పుడు సూర్యుడు ఉన్న రాశిలో ప్రవేశించినపుడు సూర్య ప్రభావం వల్ల తన శక్తిని కోల్పోయి దాంపత్య జీవనానికి జీవగఱ్ఱ అయినా అనురాగం ప్రేమ వాత్సల్యాలు సుఖసంతోషాలు ఆ దంపతులకు ఇవ్వలేడు. అందువల్ల శుక్రమౌఢ్యంలో వివాహాలు చేయరాదు.

చంద్రుడు శుభఫలితాలు మరియు అశుభ ఫలితాలు కూడా ఇస్తాడు. ఈ శుభాశుభఫలితాలు తాను ఉన్న స్థితి కళల మీద ఆధారపడియుంటుంది. ఎందుకంటే చంద్రకళలు ఆ చంద్రునికే పరిమితం మిగిలిన గ్రహాలకు స్థితికళలు లేవు. అందువల్ల చంద్రుడు వృద్ధి చంద్రుడుగా ఉన్నప్పుడుగాని లేక పూర్ణచంద్రుడుగా వెలిగిపోతూ ఉన్నప్పుడు శుభఫలితాలు ఇస్తాడు. అంటే పున్నమి చంద్రుడు ఎప్పుడు శుభుడే. ఈ చంద్రుడు పున్నమి దాటిన రోజునుంచి క్రమంగా క్షీణిస్తూ ఒక పక్షం రోజులు

తరువాత అదృశ్యమైపోతాడు. అసలు కనపడని ఆ దినాన్ని దుర్దినంగా భావించి ఆ రోజున ఏ శుభకార్యములు చేయరు. కాగ, పితృతర్పణం గతించి వారి గతుల కోసం పూజ చేయటం లాంటి అపర కర్మలే చేస్తారు. ఒక విశేషం ఏమంటే చంద్రుడు ఏ మాసంలో అయినా శుద్ధ దశమి నుంచి బహుళ చవితి వరకు వృద్ధి చెందుతాడు కాబట్టి పూర్ణ కళావంతుడు కాబట్టి ఆ సమయంలో చంద్రుడు శుభగ్రహంగా చెప్పబడింది. కాబట్టి ఈ దినాలలో చంద్రుడు శుభుడే. శుభఫలితాలే ఇస్తాడు. అలాగే బహుళ చవితి నుంచి బహుళ దశమి వరకు శుద్ధ పంచమి నుంచి శుద్ధ దశమి వరకు మధ్యమ కళలు ఉంటాయి కాబట్టి తాను తన స్థితిని బట్టి శుభాశుభ మిశ్రమ ఫలితాలు ఇస్తాడు. బహుళ ఏకాదశి నుంచి శుద్ధ చవితి వరకు చంద్రుడు కళావిహీనుడు కాబట్టి పాపఫలితాలే ఇస్తాడని మనం గ్రహించవచ్చు.

ఇక బుధుని విషయానికి వస్తే బుధుడు అవకాశవాదిగా ఉంటాడు. అంటే శుభగ్రహములతో కలిసినప్పుడు ఆ గ్రహంతో కలిసి వారి ప్రీత్యర్థం శుభఫలితాలనే ఇస్తాడు. కాని తాను పాపగ్రహాలతో కలిసి ఉన్నప్పుడు వారి పాప చింతనను పరిగణనలోకి తీసుకొని పాపఫలితాలే ఇస్తాడు. అంటే జాతక చక్రాన్ని విశ్లేషించేటప్పుడు బుధునియొక్క నివాసం ఆ రాశిలో ఏ గ్రహంలో కలిసి ఉన్నాడో మనం తప్పకుండా గమనించాలి. స్వస్థానంలో ఉన్నా కూడా బుధుడు పాపగ్రహ సంయోగం వల్ల పాపఫలితాలే ఇస్తాడు. ఒక చమత్కారమేమంటే బుధుడు సూర్యునికి అతి దగ్గరగా పోయినా సూర్య ప్రభావం వల్ల అస్తంగతుడు కాడు. అంటే సూర్యుడు ఒక బుధుని మాత్రమే మిత్రుడుగా గ్రహించి ఆ బుధునికి తన రాశిలోకి వచ్చినప్పుడు యోగఫలితం ఇస్తాడు. ఈ యోగం బుధాదిత్యయోగమంటారు. సూర్యోష్ణాన్ని భరించగలిగే బలం సూర్యుడు అనుగ్రహిస్తాడు. ఒక్క బుధగ్రహంనకు మాత్రమే అస్తంగత్వం లేదు. బుధుడు గ్రహాధిపతియైన సూర్యుణ్ణి వెన్నంటే ఉంటాడు. అందువల్ల బుధుడు చాల బుద్ధిశాలియని ప్రశస్తి. ఆ బుధుని ఆరాధిస్తే బుద్ధిమాంద్యం తొలగిపోతుందని పండితాభిప్రాయం.

కుజుడు పాపగ్రహముగానే విశ్లేషించారు. ముఖ్యంగా కుజునికి దాంపత్య జీవితంలోని మధురిమను మంట కలిపి భార్య, భర్తల మధ్య అసూయ ద్వేషాలను

పెంపొందించి దాంపత్య విచ్ఛిన్నం చేసే కుజదోషాధికారం ఉంది. పైగా కుజుని వల్లే అక్రమ సంబంధాలను వ్యభిచారములు, పరపురుష వాంఛ లేక పరస్త్రీ వ్యామోహం లాంటి దుర్వ్యసనాలను ప్రకోపింపజేస్తాడు. జాతక చక్రంలో కుజుని యొక్క ప్రభావాన్ని ప్రతి పండితుడు సరిగా అర్థం చేసుకోవాలి. కుజదోషాన్ని తేలికగా అంచనా వేయరాదు. నేను వ్రాసిన కుజ దోషం అనే అధ్యాయాన్ని చదవండి.

శుక్రుడు శుభగ్రహంగానే చెప్పబడింది. మానవ జీవితంలోనే దాంపత్య మాధుర్యాన్ని ఆస్వాదింపజేసే శక్తి, రక్తి అనుగ్రహిస్తాడు. శుక్రుడు వల్ల సంతోషమైన ఆనందకరమైన సుఖసంతోషాలు దంపతుల మధ్య వెల్లివిరిస్తాయి. శుక్రుడు బలంగా ఉంటే ఆ జాతకుడు ఆహ్లాదకరమైన జీవితం గడుపుతాడు. ఒకవేళ శుక్రబలం హీనమైతే దాంపత్యం భ్రష్టుపట్టిపోతుంది. భార్యభర్తలు విడిపోయి మానసిక వ్యాకులత అను భవిస్తాడు. గురువు గ్రహాలన్నింటికి గురుస్థానంలో ఉండి గురువుగా ఆరాధించ బడుతున్నాడు. మనం గురువు పుణ్యగ్రహంగా అర్థం చేసుకోవాలి. గురు వీక్షణం వల్ల అన్ని దోషాలు హరిస్తాయని అన్ని జ్యోతిష గ్రంథాలు తేటతెల్లంగా నొక్కి వక్కాణిస్తున్నాయి. అలాగే గురు సంయోగం ఏ రాశిలో అయినా పాపగ్రహంతో ఉంటే ఆ పాపగ్రహం ఇచ్చే దుష్ఫలితం హరించిపోతుంది. అందుకని కుజుని మీద గురువీక్షణ ఉన్నప్పుడు ఆ కుజదోషం లేదని చెప్పబడింది. గురువు పుణ్యగ్రహం అయినా మారక కారకత్వ విషయాలలో ఇతర గ్రహాలతో కలిసి మారకత్వం ఇస్తాడు. ఇలా మారకత్వం ఇచ్చినంత మాత్రాన గురువు పాపగ్రహం కాదు, ఉదా: వృషభం, మిథునం, కర్కాటకం, కన్యా, తుల, మకరం, కుంభం లగ్నాలకు మారకత్వ కారకత్వానికి మూల కారకుడే. అంటే మనకున్న 12 లగ్నాలలో సప్తమ లగ్న జాతకులకు గురువు కూడ ఇతర గ్రహాలతో చేరి వారి మరణానికి కారకుడు అవుతాడు.

శని గ్రహాన్ని పాపగ్రహంగానే నిర్ణయించారు. శని పాపగ్రహమైనా దశను బట్టి మరియు గోచార సంచారాన్ని బట్టి తన ఫలితాలు ఇస్తాడు. శనికి ఒక జాతకుడిని శని ఏడున్నర సంవత్సరాలు పట్టి పీడించే మహాశక్తి ఉంది. మనం దానినే ఏలినాటి శని అంటారు. ఈ శని పాప గ్రహమైనందు వల్ల ఎక్కువ పాపఫలితాలే ఇస్తాడు. శని వల్ల దరిద్రం, అనారోగ్యం, పెద్దల మరణం, ఆస్తినష్టం మరియు మనోవ్యథ

లాంటి తీవ్రమైన దుష్ఫలితాలు ఇస్తాడు. ఈ సమయంలో తీవ్రమైన దుష్ఫలితాలు ఇస్తాడు. ఈ సమయంలో పేరు ప్రతిష్టలు కూడ నశించి అవమానాలపాలవుతాడు.

రాహుకేతువుల గురించి మనకు కొన్ని లక్షణాలు మాత్రమే తెలుసు. వీరు ఇచ్చే ఫలితాలు పాపఫలితాలే. అందువల్ల వీరిని పాపగ్రహాలుగానే పరిగణించాలి.


మానవులులాగే గ్రహాలలో కూడ లింగభేదం ఉన్నట్లుగా పరాశరుడు, వరరుచి మొదలైన మహామహులు నిర్ధారణ చేసారు. రవి, కుజ, గురు గ్రహాలు పురుష గ్రహాలని, చంద్ర, శుక్ర, రాహువులు స్త్రీ గ్రహాలని చెప్పబడింది. మిగిలిన మూడు గ్రహాలు బుధ, శని, కేతువులను నపుంసక గ్రహాలుగా వర్ణించారు. అలాగే గ్రహాలలో కూడ జాతి భేదం ఉంది. గురు,శుక్రులు బ్రాహ్మణులు. రవి, కుజులు క్షత్రియులు, బుధ, చంద్రులు వైశ్యులు, శని శూద్రుడు కాగా, రాహుగ్రహం చండాలుడుగాను కేతు గ్రహం మ్లేచ్ఛుడు.

గ్రహాలకు వాటి శరీర వర్ణన కూడ చెప్పబడింది. గురువు పసుపు రంగు, శుక్ర చంద్రులు తెలుపు, రవి, కుజులు ఎరుపు, బుధుడు ఆకుపచ్చ, శని నీలం, రాహువు నలుపు. కేతువు చిత్ర వర్ణం కలవాడు. మనం గమనిస్తే మానవుల మరియు గ్రహముల మధ్య సమీప వర్ణములను ఆ గ్రహముల ప్రభావం ఊహించవచ్చు. అంతరిక్షంలో ఉన్న గ్రహాలు వేరు వేరు రంగులలో ఉన్నట్లే భూగ్రహం మీద ఉన్న మానవులు కూడా ఆ గ్రహాల వర్ణములతోనే జన్మించారు. ఉదా: ఆఫ్రికాలో రాహుగ్రహం యొక్క నలుపు వర్ణం ప్రజలకి వచ్చింది. గురువుకు ఉన్న పసుపు రంగు చైనా, జపాన్ ప్రజలకు వచ్చింది. అలాగే శుక్ర చంద్ర గ్రహాల యొక్క శ్వేత వర్ణం అమెరికావాసులకు వచ్చింది. రవి కుజ గ్రహాల ఎరుపు వర్ణం కెనడా, ఐస్‌లాండ్, స్కాండ్‌నివియా, పోలెండు, నార్వే, స్వీడను ప్రజలకు వచ్చింది. అలాగే కేతు గ్రహం యొక్క చిత్ర వర్ణం, భారతదేశ ప్రజలకు వచ్చింది. అందువల్ల ఈ వర్ణ సంస్కారమే కాక ఇతర అన్ని అంశాలు ప్రజలకు ఒకటే అవడం అనేది సుస్పష్టం. అందువల్ల మనకు అంతరిక్ష గ్రహాలకు దగ్గర సంబంధం ఉందని మనం గమనించవచ్చు. దీని మీద జ్యోతిష పండితులు పరిశోధన చేస్తే ఎన్నో నిజాలు మనకు బోధపడతాయని నా ఊహ.

గ్రహాలలో కూడా చరగ్రహములు కొన్ని స్థిర గ్రహములు కొన్ని ఉన్నాయి. అలాగే కొన్ని గ్రహములు ద్విస్వభావ గ్రహాలుగా చెప్పబడినాయి. ఏదైనా గ్రహం చరరాశిలో ఉందా, స్థిరరాశిలో ఉందా, లేక ద్వి స్వభావ రాశిలో ఉందా అని మనం తప్పక గమనించాలి. ఎందుకంటే ఏదైనా గ్రహం ఇచ్చే ఫలితం ఎవరితో కలిసి ఉన్నాడు, ఎవరి చేత చూడబడుతున్నాడనేకాక ఏ రాశిలో ఉన్నాడో ఆ రాశి యొక్క స్వభావము బట్టి గ్రహ ఫలితం ఉంటుంది. ఉదాహరణకు ద్వితీయ, ద్వాదశాధిపతులు ఇద్దరూ చరరాశిలో ఉన్నాలేక ద్వితీయ నవమ రాశులలో చరరాశి గ్రహధిపతులున్నా ఆ జాతకునికి విదేశయానం ఉంటుంది. కాబట్టి ఏ గ్రహమైనా రాశి యొక్క ప్రభావం కూడా ఫలితం ఇచ్చేటప్పుడు చూపిస్తుంది.

ఇక దిశలను కూడా మనం తెలుసుకోవాలి. ఎప్పుడూ రవి తూర్పు దిశనే సూచిస్తాడు. కుజుడు దక్షిణ దిక్కును సూచిస్తాడు. శని పశ్చిమ దిక్కును మరియు బుధుడు ఉత్తర దిశను సూచిస్తాడు. ఇంకొక విషయం ఏమంటే దిశలతోపాటు కొన్ని గ్రహాలు దిక్కులను కూడా సూచిస్తాడు. ఎలాగంటే శుక్రుడు ఆగ్నేయమును, రాహువు నైఋతిని, చంద్రుడు వాయువ్యమును గురువు ఈశాన్యమును సూచిస్తారు.

ఈ క్రింది చక్రం గమనించండి.



ఆరోగ్యరీత్యా రవి,కుజులు పిత్తప్రవృత్తి, చంద్ర,శుక్రులు కఫ ప్రవృత్తి, శని, రాహువులు వాత ప్రవృత్తి గలది మిగిలిన బుధ గురు గ్రహాలు సమధాతు ప్రవృత్తి కలవని గ్రహించాలి. గ్రహాల వయస్సు మనం పరిశీలిస్తే మనం కొంచెం ఆశ్చర్యపడక తప్పదు. ఎందుకంటే మానవ కాలప్రమాణ గణనం, గ్రహాల జన్మగణలలో ఎంతో వైరుధ్యం ఉంటుంది. రవికి 50 సంవత్సరాలు, చంద్రునికి 70 సంవత్సరాలు, కుజునికి 16 సంవత్సరాలు, బుధునికి 20 సంవత్సరాలు శుక్రునికి 7 సంవత్సరాలు. ఇంక శని, రాహు, కేతు గ్రహాలకు 100 సంవత్సరాలు వయసుందని మన పూర్వ జ్యోతిష పండితులు నిర్ధారణ చేశారు. అంటే అందరికంటే పెద్ద వయసు కలవాడు శని అని, అందరికంటే పిన్న వయస్కుడు శుక్రుడు అని మనం తెలుసుకున్నప్పుడు శుక్రుడు అని పిన్న వయస్కుడు ఇది మీకు ఆశ్చర్యం కలిగినా ఇది సత్యమనేది నిజం.

ఇక గ్రహాలలో ఒక్కొక్క గ్రహానికి ఒక్కొక్క ధాన్య దినుసులు అంటే ప్రీతి. రవికి గోధుమలు, చంద్రునికి బియ్యము, కుజునికి కందులు, రాహువుకు మినుములు, గురువుకు శెనగలు, శనికి నువ్వులు, బుధునికి పెసలు, శుక్రునికి బొబ్బర్లు, కేతువుకు ఉలవలు. అందువల్లే మనం ఏ గ్రహానికి శాంతిపూజ చేస్తామో ఆ గ్రహానికి ఇష్టమైన ధాన్యం దానం చేస్తాము. ఉదా: కుజపూజ చేసి కందులు దానం ఇస్తారు. ఎందుకంటే కుజునికి ఎఱుపురంగు అంటే ప్రీతి. అలాగే గురుపూజ చేసి శనగలు దానం చేస్తారు. ఎందుకంటే గురువుకు పసుపురంగు అంటే ఇష్టుడుగా ఉంటాడని పండిత ఉవాచ. మానవ శరీరంలో ఉన్న ముఖ్యమైన అంగాలుకు కూడా గ్రహాధికారం ఉంది. ఏ భాగం వల్ల మనకు బాధ కలుగుతోందో ఆ అంగానికి అధిపతిని మనం పూజిస్తే మనకు సాంత్వన, స్వస్థత చేకూరుతుంది. రవి ఆత్మను, చంద్రుడు మనస్సును, కుజుడు జలమును, బుధుడు వాక్కును, గురువు జ్ఞానమును, శుక్రుడు కామమును, శని దుఃఖమును సూచిస్తారు.

ఇక గ్రహ బలాబలాల విషయానికి వస్తే రవి, శుక్ర, గురువులు పగలు బలవంతులు. శని, చంద్ర, కుజులు రాత్రి సమయంలో బలంగా ఉంటారు. బుధుడు రాత్రి, పగలు కూడా, అంటే ఉభయ కాలమందు కూడా బలవంతుడుగానే చెప్పబడ్డాడు. ఈ బలనిర్ణయంలో ఇంకొకటి కూడా మీరు తెలుసుకోవాలి. అదేమిటంటే పూర్ణ చంద్రుడు, గురువు, బుధుడు, శుక్రుడు సౌమ్యగ్రహములు అంటే శాంతి ప్రియత్వము

గలవి. ఈ గ్రహాలు దక్షిణాయంలోని శుక్ల పక్షమందు దక్షిణాయన కాలంలో బల వంతులు అలాగే క్షీణచంద్రుడు, రవి, కుజ, శని, రాహు కేతువులు, క్రూర గ్రహములు. ఈ గ్రహాలు ఉత్తరాయణ పుణ్య కాలంలో కృష్ణ పక్షములో బలంగా ఉంటారు. గ్రహరుచులు అంటే రవి కారమును, చంద్రుడు ఉప్పును, కుజుడు చేదుని, బుధుడు షడ్రుచులన్నిటిని – గురువు తీపిని, శుక్రుడు పులుపును, శని వగరులను ఇష్టపడతారు.

మనం ఇప్పుడు గ్రహాల రూప, స్వరూపాలను గమనిస్తే గ్రహాధిపతియైన సూర్యుడు మనకు గోళాకారంలో గుండ్రంగా కనపడినా సూర్యుని అసలు స్వరూపం చతురస్రాకారమని మనం తెలుసుకోవాలి. చంద్రుడు స్థూలకాయుడుగా ఉన్నాడు. కుజుడు చతుష్కోణములలో ఉంటాడు. బుధగ్రహం గుండ్రంగాను అలాగే గురువు కూడా గుండ్రంగాను, శుక్రుడు ఖండంగాను రాహు కేతువులు అత్యంత దీర్ఘ స్వరూపం కలిగి ఉంటాడు.

గ్రహస్థానాలు గురించి చెప్పాలంటే రవి కుజులు వాయువునందును, చంద్రుడు జలమునందును, బుధుడు భూమిమీదను గురువు బహిర్ప్రవేశ స్థలములందును శుక్రుడు అగ్నియందును శని రాహువులు ఆకాశమందున్న స్థానములలో ఉంటారు. ఇంతవరకు ఈ అధ్యాయంలో మన రాశుల గురించి పూర్తిగా అన్ని విషయాలను విపులంగా తెలుసుకున్నాము. ఇప్పుడు ఏ గ్రహం ఒక రాశిలో ఎంతకాలం ఉంటుందో కూడా మనం తెలుసుకుందాము. క్రింద గమనించండి. గ్రహసంచార సమయం తెలుస్తుంది.

**సూర్యుడు**

| | | |
|---|---|---|
| బుధుడు | – | 30 రోజులు |
| చంద్రుడు | – | 2 1/4 రోజులు |
| కుజుడు | – | 45 రోజులు |
| శుక్రుడు | – | 30 రోజులు |
| గురువు | – | 12 నెలలు |
| రాహు/కేతు | – | 18 నెలలు |
| శని | – | 30 నెలలు |

చంద్రుడు అతి తక్కువ కాలం ఉంటాడు. అలాగే రాహుకేతువులు ఎక్కువ కాలం ఉంటారు.

తరచి చూస్తే గ్రహాలకున్న అన్ని గుణగణాలు మానవులకున్నాయని మనం అర్థం చేసుకోవచ్చు. గ్రహాలలో లాగానే మనకు కూడా తాత్కాలిక మిత్రత్వం, దేహచ్ఛాయ, రుచులలో ఇష్టాఇష్టాలు, స్థాన బలిమి, మిత్ర సంయోగ బలం ఇలా అన్నీ గ్రహలక్షణాలు మానవులకు వచ్చాయి. అంటే గ్రహాల ప్రభావం మానవులమీద ఎంతో ఉందని స్పష్టమౌతోంది. ఇంకా మనకు తెలియని ఎన్నో సృష్టి రహస్యాలు ఎన్నో ఉన్నాయి. మనం పాశ్చాత్య మోహంలో పడి శాస్త్ర పఠనమునకు స్వస్తి చెప్పడం వల్ల మన హిందూ దైవ శాస్త్రాలన్నీ వాటి విలువను కోల్పోతున్నాము. అలా కాకుంటే జ్యోతిష్య శాస్త్ర సార్వభౌములు ఈ విషయంలో తగిన పరిశోధనలు జరిపి శాస్త్ర నూతన ప్రామాణికల విలువను తాము పరిశోధించి కనుగొన్న విషయాలను సామాన్య ప్రజా బాహుళ్యమునకు అందిస్తే ఈ శాస్త్ర విలువ హెచ్చింపబడుతుంది. మూసపోసిన విధానం కాక నూతన విషయాలకు కూడా ప్రాధాన్యత ఇచ్చి అట్టి పరిశోధించే వారికి మనం చేయూతనిస్తే ప్రపంచానికి మనకు శాస్త్ర విద్యా పాండిత్యాన్ని చాటి చెప్పగలం. అందుకనే శాస్త్ర పఠన లేనివారు ఈ శాస్త్రాన్ని తక్కువ తరగతి పేరు ప్రఖ్యాతుల కోసం కుహనా బుద్ధితో విమర్శించకూడదని నా మనవి.

గ్రహ సంచార ఫలం గూర్చి కూడా మనం తెలుసుకుందాము. ఏదైనా ఒక గ్రహం తన నీచస్థానము నుంచి ఉచ్ఛ స్థానమునకు పయనిస్తున్నప్పుడు ఆరోహణ గ్రహమని అలాగే ఉచ్ఛ స్థానము నుంచి నీచ స్థానమునకు పోవునపుడు అవరోహణ గ్రహం అని పిలుస్తారు. గ్రహం తక్కువ స్థితి నుంచి ఉచ్ఛస్థానమునకు పోతున్నపుడు శుభ ఫలితాలు ఇస్తాయి. అలాగే ఎక్కువ స్థితినుంచి తక్కువ స్థితికి పోతున్నప్పుడు పాపఫలితాలు ఇస్తాయని మనం అర్థం చేసుకోవాలి. ఉదాహరణకు గురువు మిథునం నుంచి కర్కాటకంలోని ప్రవేశించే కాలం శుభఫలితాలు ఇస్తాడు. ఎందుకంటే శత్రుస్థానంలోనుంచి తను ఉచ్ఛ స్థానంలోకి వెడుతున్నాడు.

అలాగే ఏ గ్రహమైనా శత్రు స్థానానికి పయనిస్తున్నప్పుడు ఎక్కువ శుభఫలితాలు ఇవ్వలేదని కూడా గ్రహించాలి. అలాగే ధనస్సు నుంచి కుజుడు ఉచ్ఛస్థానమైన

మకరంలోకి ప్రవేశించేటప్పుడు లేక శని కన్య రాశి నుంచి తులా రాశిలో ప్రవేశించేటప్పుడు ఫలితాలు వేరుగా ఉంటాయని మనం గ్రహించాలి. ఉదాహరణకు గురువు మిథునం నుంచి కర్కాటకంలోని సంక్రమణ చేసినప్పుడు ఆ ఫలితాలు వేరుగా ఉంటాయని కూడా మనం తెలుసుకోవాలి.

గ్రహాలకు సూర్యుని వల్ల అస్తంగత్వం సంప్రాప్తిస్తుంది. అంటే అత్యంత ఉష్ణము మరియు తేజస్సుతో వెలిగిపోయే ఆ సూర్యునితో కలిసి ఒక రాశిలో ఉన్న ఏ గ్రహమైన సూర్యభగవానుని శక్తి తేజస్సు ముందు తన యొక్క ప్రభావాన్ని కోల్పోతాడు. అలా బలహీనుడు అవడం వల్ల ఆ గ్రహం ఇచ్చే ఫలితాలు కూడ శక్తి హీనంగా ఉంటాయి. అంటే ఆ గ్రహం సూర్యుని ముందు దివిటిలాంటిది ఇలా క్షీణించిన గ్రహాన్ని అస్తంగత్వం అంటారు. లేక మౌఢ్యమి అంటారు. ఒక విషయం ఏమంటే మనకు భూమి మీద నుంచి కనబడే చంద్రుడు కూడ రవితో కలిసిన దినం పూర్తిగా అస్తంగతుడు అవుతాడు. ఎందుకంటే సూర్యుని ముందు చంద్రకాంతి కనబడదు. ఆ దినాన్నే మనం అమావాస్య అంటే సూర్యచంద్రులు ఇద్దరు ఒక రాశిలో ఒకే నక్షత్రంలో ఉన్నప్పుడు ఆ రోజును అమావాస్య అంటాం. అదేవిధంగా ఏ ఇతర శుభగ్రహమైనా ఈ అస్తంగత్వ సమయంలో తాము ఇవ్వవలసిన శుభఫలితాలు ఇవ్వలేవు. కావున గురు, శుక్రులు అస్తంగత్వమైనపుడు వారు ఏ శుభఫలితాలు ఇవ్వలేరు. ఆ గురు శుక్రులకు అస్తంగత్వం ఉన్నంత కాలము వివాహములు, ఉపనయనములు, గృహప్రవేశములు మొదలైన శుభకార్యములు చెయ్యలేము.

మీరు జాతక చక్రం పరిశీలించినపుడు కొన్ని గ్రహాలను (బ్రాకెట్‌లో) వేసి చూపించటం కాని లేక ఆ గ్రహం ప్రక్కన '(వ)' అని బ్రాకెట్‌లో చూపించడం లేదా చాలసార్లు చూచే ఉంటారు. అలా చూపించిన గ్రహం అంతరిక్షంలో తన కక్షలో వెనుకకు పయనిస్తుంది. ఇలా పయనించే సమయాన్ని వక్రగతి అంటారు. ఇలా వక్రగతిలో ఉన్న శుభగ్రహాలు పుణ్య ఫలితాలు ఇవ్వలేవు. కాబట్టి పండితులు జాతక చక్రం రచించినపుడు గ్రహాల వక్రగతిని తప్పకుండా చూపాలని వారు తెలుసుకోవాలి. చాలమంది వక్రగతిని చూపకుండ జాతక చక్రంలో గ్రహాలను సూచిస్తారు. ఇది చాల దోషభూయిష్టం. పైగా గ్రహము ఇచ్చే సంకేతం తప్పుగా విశ్లేషించడం

జరుగుతుంది. కాబట్టి విజ్ఞులైన పండితులు ఈ విషయాన్ని గమనించాలి. మనకు ఉన్న నవగ్రహాలలో పంచగ్రహాలు మాత్రమే వక్రగతిని పొందుతాయి. అవి కుజ, బుధ, గురు, శుక్ర, శని మాత్రమే. మిగిలిన గ్రహములైన రవి, చంద్రులకు వక్రగతి ఉండదు. ఎందుకంటే సూర్యుడు వక్రించినట్లయితే రాత్రి పగళ్లలో వ్యత్యాసం ఏర్పడి కాలప్రమాణ కొలమానమే ఆగిపోతుంది. ఇదే నిర్వచనం చంద్రునికి కూడ వర్తిస్తుంది. ఇక రాహుకేతువులు వీరి చక్రభ్రమణంలో ఎల్లప్పుడు అపసవ్యంగానే భ్రమిస్తారు. వారికి ఋజు మార్గసంచార గతి ఉండదు. ఎప్పుడు వక్రగతిలోనే సంచరిస్తారు.

గ్రహాలు ఒక నిర్దిష్టకాల ప్రమాణ నిర్ణయ ప్రకారం సంచరిస్తాయి. ఉదా : కుజుడు 45 రోజులు చక్రభ్రమణానికి తీసుకొంటాడు. అంటే తను ఉన్న రాశి నుంచి ప్రతి రాశి నుంచి సంచారం చేస్తూ తాను ఉన్న మొదటి రాశికి తిరిగి చేరడానికి 45 రోజులు తీసుకొంటాడు. ఇలాగే ప్రతిగ్రహానికి సంచార దినాలు ఎన్నో ప్రతిగ్రహానికి ఎన్నో చెప్పబడ్డాయి. కాని కొన్ని సమయాలలో ఒక గ్రహం తన భ్రమణ వేగాన్ని పెంచి నిర్ణీత సమయానికి ముందుగానే ఆ గ్రహం శీఘ్రగతిలో ఏ రాశినైనా దాటినపుడు ఆ గ్రహాన్ని అతిచార గ్రహమని అంటారు.

ఒక్కొక్కపుడు కొన్ని గ్రహములు నిర్దిష్ట కాల ప్రమాణానికి మించి ఒకే రాశిలో ఉన్నపుడు ఎంతకాలం అధికసమయం ఉంటుందో గృహస్తంభన అంటారు. ఉదా: కుజుడు సుమారు 31/2 రోజులు కన్నా ఎక్కువగా ఉన్నపుడు కుజ స్తంభన అంటారు.

ఏ గ్రహమైనా తమ సంచారంలో చంద్రునితో ఉంటే ఆ కలయికను సమాగమము అని అంటారు. ఎవరి జాతక చక్రంలోనైనా బుధ, గురు, శుక్ర, శనులతో కుజుడు కలిసి ఒక భాగమందు ఉంటే దానిని గ్రహయుద్ధం అని అంటారు. కుజునికి వెనుక భాగంలో ఉన్న గ్రహాలన్ని పరాజిత గ్రహాలనియు కుజునికి ముందున్న గ్రహాలన్ని విజేత గ్రహాలని అంటారు.

గ్రహాలకు కొన్ని అవస్థలు నిర్వచించబడ్డాయి. అవి దీప్తావస్థ స్వస్త, ముదిత, శాంత, శక్తి, పీడావస్థ, దీనావస్థ, వికల, కలా, భీతావస్థ అనేవి. ఆ దశమావస్థలు వల్ల కూడ గ్రహాలు తాము ఇచ్చే ఫలితాల్లో మార్పు ఉంటుంది. మనం ఫలితాలు చెప్పేటప్పుడు ఈ వైవిధ్యాన్ని గమనించాలి.

**దీప్తావస్థ** పొందిన గ్రహం వల్ల భోగభాగ్యాలు సంపద, సభాగౌరవం, పేరు ప్రతిష్టలు, వాహనసౌఖ్యం కలుగుతుంది.

**స్వస్తావస్థ** పొందిన గ్రహం వల్ల మంచి ఉన్నత విద్య, దైవ శాస్త్రాలలో పాండిత్యం, రచనావ్యాసంగములలో ప్రతిభాపాటవం, సంగీత సాహిత్యములలో వ్యాకరణ, అలంకార, ఛందస్సు మొదలైన అంశాలలో ప్రావీణ్యత సంపాదిస్తారు. మాతృభాషాభి మానం ఎక్కువగా ఉంటుంది. ధనార్జన బాగుంటుంది.

**ముదితావస్థ** పొందిన గ్రహం వల్ల మంచి లలిత కళలో ఉద్ధండడు అయి పేరు ప్రతిష్టలు సంపాదిస్తాడు. ఆ సమయంలోనే గాత్ర, సంగీత వాయిద్యాల మీద మంచి నేర్పు, సాహిత్య పఠన చేసి ఆ సాహిత్యానికి భాష్యం చెప్పగల్గే నేర్పు సంపాదిస్తాడు.

**శాంతావస్థ** పొందిన గ్రహం వల్ల మనో నిశ్చయం ఎక్కువ పెరుగుతుంది. వినయం, విధేయత, విజ్ఞానం బాగా ప్రదర్శించి సమాజంలో గుణవంతులుగా పేరు తెచ్చుకొంటారు. స్త్రీ సాంగత్యం, ఉత్తమ స్త్రీతో సంభోగం కలుగజేస్తాయి.

**శక్త్యావస్థ** పొందిన గ్రహం అంటే ఏ గ్రహమైనా వక్రీకరించినపుడు దానిని శక్త్యావస్థ గ్రహమంటారు. ఈ శక్త్యావస్థలో ఉన్న పుణ్యగ్రహాలు పాపఫలితాన్ని పాపగ్రహాలు పుణ్యఫలితాలు ఇస్తాయి.

**పీడావస్థ** పొందిన గ్రహం వల్ల ఏ జాతకుడైనా మానసిక దౌర్బల్యంతో బాధపడతాడు. బంధువిరోధం, మిత్రులతో భేదాభిప్రాయాలు, ఏమి చేయలేని నిస్సహాయతతో ఉండి పీడావస్థతతో బాధపడతాడు.

**దీనావస్థ** పొందిన గ్రహం వల్ల అనారోగ్యం, తీవ్రమైన రుగ్మతలు అలవికాని వ్యాధులతో బాధపడతారు. అనాచారం కలిగి ధన లోపంతో దీనుడుగా జీవిస్తాడు. అనారోగ్యం వల్ల స్వయం సానుభూతికి లోనవుతాడు.

**వికలావస్థ** పొందిన గ్రహం వల్ల బంధుమిత్రులతో విరోధం, దాంపత్య జీవితంలో జీవిత భాగస్వామితో వాదోపవాదాలు, అనారోగ్యం ఉంటాయి. అనారోగ్యం వల్ల మనస్సు వికలమవుతుంది కాని నిస్సహాయంగా ఉండిపోతాడు.

**కలావస్థ** పొందిన గ్రహం వల్ల స్త్రీల విషయాలలో అనవసరంగా జోక్యం చేసుకొని కలహాల చిక్కులలో ఇరుక్కుని వివాదాస్పదుడు అవుతాడు. స్త్రీల వల్ల నష్టం పొందుతాడు. మరియు స్త్రీల వల్ల ధననష్టం పొంది అవమానాలపాలవుతాడు.

**భీతావస్థ** ముందు అధ్యాయంలో ఏ గ్రహానికి ఎవరు మిత్రులో ఎవరు శత్రువులో మరియు ఎవరు సములో నేర్చుకున్నాం.

ఇప్పుడు గ్రహాలలో ఎవరు తాత్కాలిక మిత్రులో తెలుసుకొందాం. ప్రతిగ్రహం తాను ఉన్న రాశినుంచి రెండు,మూడు, నాలుగు, పది, పదకొండు, పన్నెండు స్థానములో ఉన్న గ్రహములన్నియు తాత్కాలిక మిత్రులుగా ఉంటాయి. మిగిలిన ఒకటి, అయిదు, ఆరు, ఏడు, తొమ్మిది రాశులలో ఉన్న గ్రహాలు తాత్కాలిక శత్రువులుగా ఉంటాయి. ఒకవేళ తానున్న రాశి నుంచి ఏ రాశిలోనైనా రెండు లేక అంతకన్నా ఎక్కువ గ్రహాలు ఉన్నా కూడా ఆ గ్రహాలన్నింటికి ఈ నిర్వచనం వర్తిస్తుందని గ్రహించాలి.

ఈ మిత్రశతృత్వాల నిర్ణయంలో మీరుఈ క్రింది ముఖ్యాంశాలను గమనించాలి.

1. ఏ గ్రహానికైనా సహజంగా మిత్రుడైన గ్రహం తాత్కాలిక మిత్రుడు అయితే పరమ మిత్రుడుగా భావించాలి.
2. సహజ మిత్రుడు తాత్కాలికంగా శతృవైతే సముడుగా భావించాలి.
3. సహజంగా సముడైనా గ్రహం తాత్కాలిక మిత్రుడైతే మిత్రుడుగానే భావించాలి.
4. సహజసముడు అయిన గ్రహం తాత్కాలిక శతృవైతే ఆ గ్రహాన్ని శత్రువుగానే భావించాలి.
5. సహజ శత్రువు తాత్కాలికంగా మిత్రుడైతే సముడుగా భావించాలి. సహజ శత్రువు తాత్కాలికంగా శత్రువైతే బద్ధ శత్రువుగా భావించాలి.


ఈ అధ్యాయంలో గ్రహాల గురించి నేను ఇచ్చిన వివరాలు మీరు ఒకటి రెండు సార్లు శ్రద్ధగా చదివితే గాని ఒక అవగాహన ఉండదు కాబట్టి ఈ అధ్యాయం మళ్లీమళ్లీ చదవండి. ఒక నవలలాగా కాకుండా పాఠ్య భాగంగా భావించి శ్రద్ధగా చదవటం చాలా ముఖ్యం. ఇప్పుడు గ్రహాల యొక్క స్థితుల గురించి నేర్చుకుందాము. అంటే ఏ గ్రహం ఏ రాశిలో ఉచ్ఛస్థానంలో ఉంటుందో అలాగే ఏ రాశిలో దుర్బలత్వం చెందుతుందో కూడా మీరు తెలుసుకోవాలి. ఇలా తెలుసుకున్నందువల్ల మీకు గ్రహబల

విశ్లేషణ చక్కగా బోధపడుతుంది. ప్రతిఫలాలు మీరు చక్కగా తప్పు లేకుండా ఊహించగలరు.

| **గ్రహం** | **ఉచ్చరాశి** | **దుర్బలత్వరాశి** | **మూలత్రికోణరాశి** | **భాగాలు** |
|---|---|---|---|---|
| రవి | మేషం $10^0$ | తుల | సింహం | $20^0$ |
| చంద్ర | వృషభం $3^0$ | వృశ్చికం | వృషభం | $27^0$ |
| కుజ | మకరం $28^0$ | కర్కాటకం | మేషం | $12^0$ |
| బుధ | కన్య $15^0$ | మీనం | కన్య | $15^0$ |
| గురు | కర్కాటకం $5^0$ | మకరం | ధనస్సు | $10^0$ |
| శుక్ర | మీనం $27^0$ | కన్య | తుల | $17^0$ |
| శని | తుల $20^0$ | మేషం | కుంభం | $20^0$ |
| రాహు | మిథునం $21^0$ | ధనస్సు | సింహం | – |
| కేతు | ధనస్సు $21^0$ | మిథునం | కుంభం | – |

ఇప్పుడు మీరు గమనించవలసినది ఏమంటే ఏ గ్రహమైనా ఏ రాశిలో ఉచ్ఛంలో ఉందో, ఆ రాశి నుంచి లెక్కపెట్టినప్పుడు దాని సప్తమ రాశిలో ఆ గ్రహం దుర్బలత్వం చెందుతోంది. అంతేకాకుండా ఎక్కడ పరమ ఉచ్ఛభాగంలో డిగ్రీలలో ఉందో అదే భాగంలో అదే డిగ్రీలలో దుర్బలత్వం కలుగుతుందని గ్రహించండి. మీ అవగాహనకు ఈ క్రింది చక్రం చూడండి.

| | | | |
|---|---|---|---|
| మీనం<br>శుక్రుడు – ఉచ్ఛ<br>బుధుడు – నీచ | మేషం<br>రవి – ఉచ్ఛ<br>శని – నీచ | వృషభం<br>చంద్రుడు – ఉచ్ఛ | మిథునం<br>రాహు – ఉచ్ఛ<br>కేతువు – నీచ |
| కుంభం<br>ఉచ్ఛ, నీచ లేదు | **సవ్య చక్రం** | | కర్కాటకం<br>గురువు – ఉచ్ఛ<br>కుజుడు – నీచ |
| మకరం<br>గురువు – నీచ<br>కుజ – ఉచ్ఛ | | | సింహం<br>ఎవరికీ<br>ఉచ్ఛ లేదు |
| ధనుస్సు<br>రాహువు – నీచ<br>కేతువు – ఉచ్ఛ | వృశ్చికం<br>చంద్ర – నీచ | తుల<br>రవి – నీచ<br>శని – ఉచ్ఛ | కన్య<br>శుక్రుడు – నీచ<br>బుధుడు – ఉచ్ఛ |




సింహరాశిలో ఎవరూ ఉచ్ఛంలో ఉండరని గ్రహించాలి. ఎందుకంటే గ్రహాధిపతియైన సూర్యుని కంటే ఎవ్వరూ ఉచ్ఛస్థానంలో ఉండరు – ఉండలేరు. కాబట్టి ఏ గ్రహానికీ కూడా సింహరాశిలో ఉచ్ఛస్థానం ఉండదు. అలాగే వృశ్చిక రాశిలో కూడా ఎవరికి ఉచ్ఛస్థానం ఉండదు. ఇక కుంభరాశిలో కూడా ఏ గ్రహమునకు నీచస్థానము గాని లేక ఉచ్ఛస్థానము గాని ఉండదు.

# అధ్యాయం - 10

## గ్రహాల కారకత్వాలు

ముందు అధ్యాయంలో మనం గ్రహాల గురించి చాలా విశదంగాను, విపులంగాను అన్ని విషయాలను నేర్చుకున్నాము. ఇప్పుడు మనం ఈ అధ్యాయంలో గ్రహాల కారకత్వాలు గుఱించి కూడా తెలుసుకుందాము.

**రవి కారకత్వములు :**

అతి ఉష్ణము, వేడి, ఉష్ణతీవ్రత, అతివేడి, జ్వలించే అగ్ని, ముళ్లకంపలు, ముళ్ల తీగలు, ఎడారిలో పెరిగే ముళ్ల చెట్లు, విరక్తి, వెగటు, అసంతృప్తి, వృద్ధాప్యములోని శరీర బాధ, ముసలితనము, దుష్టతత్వము, హానికరబుద్ధి, దౌర్జన్యము, ఎముకలు, ధైర్యము, సాహసము, పౌరుష ప్రతాపములు, ఉదర సంబంధమైన అంశములు, జీర్ణవాహిక, కడుపు, నేత్రములు, నాయకులు, దేశపాలకులు, వ్యాపార వ్యవహారములు, చతుష్పాద జంతువులు, దాహము, తాపము, నేత్రవ్యాధులు శరీరము, మంచిబుద్ధి, మంచి నడవడిక, కార్యసాధన, శిరోంగముల రుగ్మతలు, రక్తము, సమాజాభివృద్ధి, సంఘసేవ, నదీతీరములు, పగడము, తూర్పు పగ, ప్రతీకారం, శత్రువును జయించడం, సత్వగుణం, వ్యతిరేక బుద్ధి, రక్తచందనం మొదలగునవి సూర్యుని కారకత్వాలు.

**చంద్రుని కారకత్వములు :**

ఆలోచన విధానము, నిర్ణయ సామర్థ్యము, సుగంధ ద్రవ్యాల సువాసన, రుగ్మతలు, ప్రభుత్వములోని పెద్దలతో పరిచయము. బద్ధకం, సోమరితనం, జలుబు, శ్లేష్మవ్యాధులు, లోక విచక్షణా జ్ఞానం, పండిత సాంగత్యం, భావోద్రేకం, హృదయ స్పందన, స్త్రీ, మంచిచెడ్డలు, పుల్లటి వస్తువులు, నిద్ర, సుఖసౌఖ్యాలు, వెండితో చేసిన నగలు, వెండి వస్తువులు, చెరుకుపంట, యాత్రలు, పుణ్యతీర్థాల దర్శనము, బావి, చెరువు, తల్లి మీద భక్తి గౌరవాలు, ముత్యములందు ఆకర్షణ, తెలుపు వస్త్రములు,

క్షయరోగము, కంచు మొదలగు లోహములు, మనస్సు, ఉప్పు, వజ్రములు, శక్తి, ముఖకాంతి, దేవతా స్త్రీల యందు భక్తి శ్రద్ధలు, తేనె, గోధుమలు, ముఖవర్చస్సు, సూక్ష్మబుద్ధి, పెరుగు, తపోధనము, నాజూకైన శరీరతత్వం, రాత్రియందు బలము, పశ్చిమ ముఖము, కారము, నవరత్నములు భుజాలయందు రుగ్మత, ఛత్ర చామరాది రాజచిహ్నములు, ధాతుపుష్టి, జలచరములు, సర్పము, తెలివి, మెత్తటి మృదువైన వస్త్రములు మొదలగునవి చంద్రుని కారకత్వములు.

**కుజుని కారకత్వములు :**

భూమి, ఆయుధములు, శౌర్య పరాక్రమములు, యుద్ధమందు వాంఛ నాయక లక్షణములు, చోరబుద్ధి, విరోధము, అసూయా ద్వేషాలు, శత్రువును జయించుట, ఉదారత్వము, ఎఱ్ఱటి పూలు, దుంధుభి, యుద్ధభేరి – ఢంకా మరియు రణభేరి యందు ప్రీతి, మూర్ఖత్వము, అత్యంత కోపము, విదేశయానము, అగ్నితత్వము, ప్రభుత్వ ఉద్యోగము, సుబ్రహ్మణ్య మంత్రోపాసన, కాఠిన్యము, మాంసభక్షణ, ఇతరులను నిందించుట, దూషించుట, చేదు, గ్రీష్మ ఋతువు, పురుషుడు, గండ్రగొడ్డలి, వనచరములు, గ్రామాధిపతి, భార్యాభర్తలను విడదీయుట, ఖలుడు, దహింపబడిన స్థిరాస్తులు, మృష్టాన్నము, ధనుర్విద్య యందు ప్రావీణ్యత, సామవేదము, సోదరులు, క్రూరమృగములు, ఆగ్రహము, దండనాధికారము, నాగలోకము, వాహనసౌఖ్యము, రక్తదర్శనము ఇవన్నియు కుజుని కారకత్వములు.

**బుధుని కారకత్వములు :**

విద్య, అశ్వములు, ధనాగారము, బుద్ధి కుశలత, వాక్శుద్ధి, గణితమునందు ప్రావీణ్యత, బ్రాహ్మణత్వము, సైన్యము, లిపి, భాషా పరిజ్ఞానము, నూతన వస్త్రములు, ఆకుపచ్చరంగు వస్తువులు, ఆకుపచ్చ వజ్రము, మృదు సంభాషణ, జ్యోతిష శాస్త్రమునందు ప్రావీణ్యత, తీర్థయాత్రలు, వర్తకమందు నేర్పు, దేవాలయ దర్శనము, నగలు నాణ్యాలందిష్టము, తల్లిదండ్రులు, వేదాంతమందు ప్రవచనములు, పీడకలలు, నపుంసకత్వము, చర్మము, ఋతువులు, వైద్య, విద్య, నాశిక, నాలుక, నరములు, చేతులు, కంఠములు, భుజములు, జీర్ణకోశం, శిశువులు, దుష్టవీక్షణ, వినయ విధేయతలు, భయాందోళనలు, అనుమానము, నృత్యము, భక్తి, హాస్య చతురత,

హేమంత ఋతువు, శాంతి ప్రియత్వము, నాభి, కుటుంబ అభివృద్ధి, పక్షులు, ముఖ్యముగా చిలకలు మరియు వేదములు, మత సాంప్రదాయాలు, సరిసంఖ్యలు, సాత్వికత, సర్వసమానత్వము, పౌరాణిక విద్య, ఛందస్సు వ్యాకరణము, మరియు భాషా పాండిత్యము, పండిత ప్రావీణ్యము, మేనమామ, యంత్ర, తంత్ర, మంత్ర మొదలగునందు ప్రావీణ్యత ఇవన్నియు బుధుని కారకత్వములు.

**గురువు యొక్క కారకత్వములు :**

బ్రాహ్మణత్వము, ఉన్నతవిద్య, శాస్త్ర పరిజ్ఞానము, విధులు నిర్వర్తించుట, దైవశాస్త్రములు అంటే జ్యోతిష్య, సంగీత, నాట్య, న్యాయ, వైద్య శాస్త్రములందు ప్రావీణ్యత, పుత్రుడు, మనమడు, తర్క వేదాంతములు, వంశపారంపర్య స్థిరాస్తులు, పసుపు రంగు జ్యేష్ఠ సోదరుడు, శిశిర ఋతువు, రాజసన్మానము, సభా పూజ్యత, దైవభక్తి, ధర్మాధర్మ విచక్షణా జ్ఞానము, ప్రాణస్నేహము, వాక్శుద్ధి, గ్రాంధికభాష, చతురత, మంచి వాగ్ధాటి, పవిత్ర జలములు, లోక సంచారము, కావ్యములు, బలవంతులు, మాసములు, ద్రాక్షారసము, పానకము, తీపి వస్తువులు, సత్వగుణము, వినయము, విధేయత, సౌమ్యత, మంచి గ్రహణశక్తి, నగలయందు ప్రీతి, శివభక్తి, వాహన ప్రయాణము మొదలగునవి గురువు యొక్క కారకత్వములు.

**శుక్రుని కారకత్వములు :**

వివాహము, భార్యాభర్తల సఖ్యత, సుఖసంతోష దాంపత్య జీవితము, స్త్రీల మంచితనము, తెలుపురంగు,దంపతుల మధ్య శారీరక సౌఖ్యము, పులుపు, కుసుమము, యవ్వనాహంకారము, వికారవీక్షణము, పక్షములు, రజోగుణము, ముత్యములు, వేదములు, స్త్రీల వక్ష సౌందర్యము, సరస సల్లాపములు, జంతువులు, నడివయసు, గానము, భోగము, కళత్రసౌఖ్యము, నగలు నాణ్యాలు, ఆకర్షణీయమైన, అలంకార ప్రియత్వము, సుకుమార సున్నితము, సుగంధ ద్రవ్యములు, సువాసనగల పూలు, వీణ, వేణువు, వినోదము, ఐశ్వర్యము, అందము, ఆకర్షణము, మితాహారము, శాఖాహారమునే భుజించుట, వసంత ఋతువు, అధిక స్త్రీ సంభోగము. వేశ్యాతత్వము, అధిక కాముకత్వము, నేత్రములు, సత్యము, ధవళ వస్త్రములయందు ప్రీతి, నల్లని కేశములు, మాంగల్యధారణ, మర్మాంగాలకు సంబంధించిన వ్యాధులు ఇవి అన్నియు శుక్రుని యొక్క కారకత్వములు.

**శని కారకత్వములు :**

అడ్డంకులు, చర్మము, ప్రమాదములు, దుఃఖము, వ్యాధులు, గృహములలో విరోధములు, మానసిక వత్తిడి, ఆందోళన, ధననష్టము, స్థిరాస్తి కోల్పోవుట, అంగ వైకల్యము, మరణము, దానము, ఆయుర్ధాయము, అనాచారము, ఆత్మగౌరవము కోల్పోవటం, మోసగుణము, పౌరుషశూన్యము, అసత్యవాదన, అధిక కోపము, వార్ధక్యము, సంధ్యాకాలముయందు బలము, మలిన వస్త్రములు, శిధిలగృహము, దుష్టసాంగత్యము, నలుపురంగు, క్రూరత్వము, కాఠిన్యత, మణికట్టు, ఇనుము, పత్తి, నువ్వులు, నూనె, నల్ల కంబళి, క్రిందిచూపు, ఋణబాధలు, అజీర్ణము, తమోగుణము, విపరీతమైన స్త్రీ వాంఛ, క్షుద్ర దేవతలకు పూజ, వాచలత్వము ఇవి శని యొక్క కారకత్వములు.

**రాహువు యొక్క కారకత్వములు :**

ఛత్రములు, చెడువాసన, దుష్ట సంభాషణ, పాపపు పనులు, ఆచార్య హీనత, జూదము, నీచ స్త్రీ లేక దుష్ట స్త్రీతో సంభోగము. విదేశీయానము, అపరిశుభ్రత, ఎముకల వ్యాధులు అసత్య సంభాషణ, భ్రమించుట, మ్లేచ్ఛుల సాంగత్యము, వక్రగమనము, శిరోభాగముల రుగ్మతలు, విచారము, దుఃఖము, పాముకాటు, గర్భమందు పురుగులు, వృద్ధాప్యము, అపసవ్య లిపి, కఠిన సంభాషణము, విషపు ఆలోచనలు, హాని చేయుటకు ఉత్సాహము ఇవి రాహువు కారకత్వములు.

ఇప్పుడు మనము కేతువు యొక్క కారకత్వములు తెలుసుకుందాం. చిత్త చాంచల్యము, చపల చిత్తము, దైవచింతన, దేవతా ఉపాసన, అసాధ్య రోగములు, స్వర్గప్రాప్తి, పుణ్యము చేయుట, స్నేహము, పుణ్యనదుల స్నానము లేక, దేవాలయ దర్శనములు, మౌనవ్రతము, శత్రువులను పీడించుట. క్షుద్బాధతో విచారము, క్రూర సఖ్యత ఇవి కేతువు యొక్క కారకత్వములు.

మనము ఇంతవరకు గ్రహముల యొక్క కారకత్వములు తెలుసుకున్నాము. ఇప్పుడు ద్వాదశ భావముల ఫలితములు తెలుసుకుందాము.

మనము జాతక చక్రములో ద్వాదశ గళ్ళు చూస్తూ ఉంటాము. ఒక గడికి ఒక రాశిఅని పేరు ఉంటే జాతకచక్రంలో పన్నెండుగళ్ళకు పన్నెండు రాశులు ఉంటాయి.

మనము ముందు అధ్యాయాలలో ఏ రాశికి ఏ పేరో ఆ రాశి అధిపతి ఎవరో ఆ రాశిలో ఉండే నక్షత్రాలు వాటి పాదాలతో సహా మనము క్షుణ్ణంగా తెలుసుకున్నాము. ఇప్పుడు ఏ రాశి ఏ ఫలితాలిస్తాయో మనము వివరంగా తెలుసు కోవాలి. ఇలా తెలుసుకునే విషయాన్ని భావ విశ్లేషణ అంటారు. రాశులు పేరు భావములు వేరు. రాశులనేవి అంతరిక్ష కక్ష్యలో స్థిరముగా చూపబడతాయి. కాని భావములు చక్రమందు లగ్నముతోనో మరియు గ్రహము యొక్క సంచార స్థానములను పరిశీలించి ఏ స్థానములో ఏ గ్రహముందో ఆ గ్రహ ఫలితము ఏ భావము ఇస్తుందో కూడా తెలుసుకోవాలి ఎందుకంటే రాశిస్థానంలో భావం డిగ్రీలు, నిమిషములు కూడా సూచిస్తాయి. ఒక రాశిలో మనము మూడు భావములు చూడవచ్చు. మొదటి భావము పది డిగ్రీలు, రెండో భాగము పది డిగ్రీలు, మూడో భావము పది డిగ్రీలుగా భావార్థం చేసుకోవాలి. దీనికి 180 డిగ్రీలు దూరంగా ఉన్న ఆరు రాశులు కలిపితే దానిని సప్తమ భావ మధ్యమం అంటారు. ఇలాగే మనము జాతక చక్రాన్ని పన్నెండు భావములుగా విశ్లేషించారు. సూర్యోదయ మరియు సూర్యాస్తమయ ఆధారంగా కాల నిర్ణయము చేసి లగ్న ప్రభావమును లిఖించి తద్వారా ప్రథమ, మధ్యమ అంత్యాలు సాధించుకోవాలి.

ఇలాగే గ్రహముల యొక్క భావ ఫలితములను షడ్బబలాలను గ్రహములతో సరిచూచి ఒక నిర్ణయము చేయాలి.

ఇప్పుడు మనము తనూభావ రాశి యొక్క ఫలితాలను పరిశీలించుదాము. తనూ భావనలో జీవన స్థితిగతులు, కీర్తిప్రతిష్టలు, ఉత్సాహము, బద్ధకము, నిపుణత్వము, నైపుణ్యము, జీవితాశయము, పశుసంరక్షణ, వంశదూషణ, ఆరోగ్యము, వృద్ధాప్యము, శరీరము, శరీరములోని అంగములు, సుఖా సుఖములు, జ్ఞానము, జన్మస్థానము, భావోద్రేకత, కలలు, బలము, శరీర సౌష్టము, ఠీవి, ఆయువు, వారసుల పోలికలు, గర్వాహంకారములు జీవనశైలి ఇవి తనూభావ ఫలితములు.

ద్వితీయభావములో వాక్చాతుర్యము, వాక్పటిమ, ఐశ్వర్యము, సాంప్రదాయము, పూర్వాచారము, పరోపకార బుద్ధి, గోళ్ళు, భోగము, సత్యాసత్యములు, నాలుక, నేత్రములు, వస్త్రధారణ, నగలు, నాణ్యాలు, స్థిరబుద్ధి, కుటుంబ పరిస్థితి, ఔదార్యము,

స్నేహభావము, పాండిత్యము, వినయవిధేయతలు,నాసిక,మానసిక స్థితి, దానగుణము, మారకము, భోజనము, జీవనోపాయము ఇవి ద్వితీయ భావమును సూచిస్తాయి.

తృతీయ భావములో పరాక్రమము, శౌర్యము, పౌరుషము, యుద్ధపటిమ, చెవులు, కాళ్ళు, చపలచిత్తము, విజ్ఞానము, సుఖాసుఖములు, విచారము, భావోద్రేకత, రౌద్రాహంకారము, బంధుమిత్రులు, ప్రయాణములు, విందుభోజనము, స్థిరాస్తి విభజన, సత్ప్రవర్తనము, పాండిత్యము, శారీరక బలము, కార్యనిర్వాహణ శక్తి, కులమత సాంప్రదాయ వర్ణాశ్రమ ధర్మములు, గురువులు, పెద్దలు, శాంతము, కార్యదీక్ష, సమయస్ఫూర్తి ఇవి తృతీయ భావమునకు సూచనములు.

చతుర్థ భావములో విద్య, ప్రయాణములు, వాహన సౌఖ్యములు, పరిశుభ్రత, బంధు మిత్రులు, వస్త్రాలంకరణ, కూపతటాకములు, పాలు, సుగంధము, సుఖ జీవనము, పేరు ప్రతిష్టలు, విశ్వాసము, సత్యసంభాషణ, విజయము, కష్టార్జితము, వంశగౌరవము, స్వయం సంపాదన, స్థిరాస్తి, శీల రక్షణ, గుప్తాంశముల పరిశోధన, నిధి నిక్షేపములు, గ్రంధరచన ఇవన్నియు చతుర్థ భావమును సూచించును.

పంచమ భావములో సంతానము, తండ్రిచేసిన పుణ్యము, కళల యందు నైపుణ్యము, భావోద్రేకము, గర్భము ధరించుట, గర్భవిచ్ఛిత్తి, పుత్ర సంతానము, వస్త్రాలంకరణ, వాంఛలు, కోరికలు సిద్ధింప చేసుకొనుట, పిత్రార్జితము, దురాలోచన, స్త్రీ మూలముగా ధనలాభము, వేశ్యా స్త్రీ సంభోగము, రహస్యము, పేరు ప్రతిష్టలు, వినయ విధేయతలు, రచనా వ్యాసంగములు, గ్రంధ రచన, కార్యదీక్ష, మంత్రోపాసన, దాన గుణము, పాపపుణ్యముల విశ్లేషణాశక్తి, మేథో సంపద, సంగీత సాహిత్య, నాట్య, శిల్ప, చిత్రలేఖనము, వాద్య పరికరములు, నేర్పు. వీటిలో ఏదైనా ఒకదానిలో నేర్పు, వంశపారంపర్య అధికారము మొదలగునవి పంచమ భావమును సూచించును.

షష్టమ భావములో మేనమామలు, క్రూరప్రవృత్తి, ఉన్మాదము, రుగ్మతలు, శత్రుత్వము, లోభత్వము, ఋణములు, అపవాదములు, నిందలు, మనఃక్లేశము, విచార దుఃఖములు, ప్రజాద్వేషము, యాచకత్వము, వణుకు వ్యాధి, మూత్రవ్యాధి,

అతిసారము, చౌర్యము, విపత్తు, కారాగృహము సోదరులతో కలహము ఇవి షష్టమ భావములు సూచించును.

సప్తమ భావములో వివాహము, వ్యభిచారము, ప్రేమ వివాహములు, కులాంతర వివాహములు, దాంపత్య విచ్ఛిన్నము ద్వితీయ వివాహ దోషము, క్రమశిక్షణారాహిత్యము, ప్రయాణ భంగము పెరుగు, బుద్ధి మాల్యము, మూర్ఖత్వము, మొండిపట్టు, వస్త్రాలంకారము, పానీయములు సేవించుట, తేనె, పులుసు, భోజనము, దాత్రుత్వము, శక్తి నశించుట, నీచ స్త్రీ సాంగత్యము, నీచ పురుష సంబంధము, అక్రమ సంబంధములు, వాద ప్రతివాదనలు, అతికాముకత్వము, విదేశీయానము నందు ఉత్సాహము, కుటిలత స్త్రీలనాకర్షించుట, భార్య, చోరత్వము, తీపి పదార్ధ మందిష్టము ఇవి సప్తమ భావమును సూచించును.

అష్టమ భావముయందు ఆయుఃప్రమాణము, సుఖజీవనము పాపము చేయుట, జీవహింస, మాంసభక్షణము, అంగహీనము, శిరచ్ఛేదము, విపరీత దుఃఖము, ధన నష్టము, ప్రభుత్వ దండన వల్ల భయము, సోదరులతో శత్రుత్వము, కలహములు, ఆపదలు, కష్టములు, హీనము మరియు హేయము అయినటువంటి రచనలు చదువులు, దురదృష్టము, పాపపు పనులయందు అధిక శ్రద్ధ, చిత్త చాంచల్యము ఇవి అష్టమ భావమును సూచించును.

నవమ భావములో దాతృత్వము, ధర్మము, దైవచింతన, పండితులను, గురువును పెద్దలను గౌరవించుట. వారి యందు భక్తి, కులాచారములను పాటించుట, తీర్థయాత్రలు చేయుట, విద్యయందు ఉత్సాహము, వైభవము, భోగము, వాహన సౌఖ్యము, అధిక వాచాలత్వము, గ్రంధ పఠనము, సజ్జన సాంగత్యము, సంతృప్తికరమైన జీవితము, వంశపారపర్యంగా స్థిరాస్తి పొందడము, స్త్రీ మరియు పురుష సంతానము కలిగియుండుట అష్టైశ్వర్యములు, యజ్ఞయాగాదులు చేయుట, ధన వ్యాపారము మొదలగునవి నవమ భావమును సూచించును.

దశమ భావములో వ్యాపార, వర్తక నేర్పు, సభా గౌరవము, శరీర పుష్టి, భూతదయ, గురువు, యంత్రములు, తల్లి, పుణ్యము, మంత్రసిద్ధి, ఆయుర్వేదము,

వైద్యవృత్తి, సుఖజీవనము, కీర్తిప్రతిష్టలు, నిర్ణయాధికారము, ఓర్పు, సహనము, దండనాధికారము ఇవి దశమ భావములు సూచించును.

ఏకాదశ భావములో ఆయుర్దాయము, పిన్నతండ్రులు, పెద తండ్రులు, జేష్ఠ సోదరీ సోదరులు, విగ్రహారాధన, ఉపాసన శక్తి, ఉన్నత విద్య, మోకాళ్ళు, పిక్కలు, ప్రముఖ ప్రాంతమందు నివసించుట. నగలు నాణ్యాలు ధరించుట, మంత్రి పదవి, ధనసంపాదన, ఇష్టకార్యములు చేయుట, కళల యందు నేర్పరితనము, కళా నైపుణ్యము, ఆశ, భార్యను సంతృప్తి పరచుట ఇవి ఏకాదశ భావమును సూచించును.

ద్వాదశ భావములో నిద్రలేమి, మనోచింతన, స్త్రీలోలత్వము, ఋణ విమోచనము, రెండు కాళ్ళు, శత్రుభయము, వాహన సౌఖ్యము, వివాహము చేయుట, అధికారము తగ్గుట, మనోవికారము, శక్తిహీనము, శుష్క ప్రవచనములు, దేహపీడ, మరణము, విదేశయాత్ర, ధనవ్యయము, కళత్రహాని ఇవి ద్వాదశ భావములు సూచించును.

# అధ్యాయం - 11

## మేలాపకం

ఈ అధ్యాయంలో మనము ఇప్పుడు వధువు వరుల వివాహ నిర్ణయము చేసేముందు ఆ ఇద్దరి జాతకాలు ఎలా పరిశీలించాలో నేర్చుకుందాము. ఈ పరిశీలనను మేలాపకం అని కూడా అంటారు. మనము హిందువులము కాబట్టి, హిందూమత సాంప్రదాయాచారమును బట్టి ఏ చక్రములోనైనా గ్రహాల స్థితిని బట్టి, ఆ గ్రహాల వీక్షణల బట్టి మరియు ఆ గ్రహాల సంయోగస్థితిని బట్టి వారి జీవిత సరళిని, దాంపత్య జీవిత మధురిమ ఎలా ఉంటుందో పరిశీలించి ఆ విశ్లేషణను ప్రతిఫలముగా చెప్పటమే జాతక పరిశీలన అంటారు. అంటే దాంపత్య జీవితంలోని ముఖ్యాంశములైన విషయాలు అంటే భార్యాభర్తల మధ్య సఖ్యత సంతానం, అనురాగం, సుఖసంతోషాలు మరియు ఆయుర్దాయం, ఆనంద జీవితము వారి మధ్య ఉంటుందా అనే విషయం ముఖ్య అంశములుగా భావించాలి. అదే కాకుండా వారి ఇద్దరి యొక్క ఆరోగ్యస్థితి, సంతాన లాభము, దీర్ఘకాల వ్యాధులు, అకాల మృత్యువులు, తీవ్రమైన ప్రమాదాలవల్ల అంగవైకల్యం లాంటివి తప్పక గమనించాలి. ఇదే కాకుండా మనము ప్రత్యేకంగా గమనించాల్సింది ఏమంటే ఆ వధువరులు ఇద్దరికీ సంతాన విషయంలో జాతకచక్రంలో ఎటువంటి లోపము కనబడకూడదు. కన్య గొడ్రాలైనా, లేక వరునికి పురుష సామర్థ్యం లేకపోయినా మరియు ఇద్దరిలోను ఎవరికైనా ద్వికళ్యాణ దోషం ఉందా అని మనము ఆ చక్రమును పరిశీలించాలి. వరునికి గాని లేక వధువునికి గాని వారి ఆయుఃప్రామాణమును తప్పక క్షుణ్ణంగా పరిశీలించాలి. ఈ విషయంలో ఏ అలక్ష్యం పనికిరాదు. ఎందుకంటే ఉదాహరణకు వరునికి మధ్యమాయుర్దాయమే ఉంటే అది తీవ్ర లోపంగానే పరిగణించాలి. ఎందుకంటే ప్రస్తుతకాలంలో వైవాహిక జీవిత ఆయుఃర్దాయము రోజు రోజుకు తగ్గిపోతూ వుంది. ఇదివరలో కన్యకు 18 లేక 19 వయసులో వివాహం చేసేవారు. వరునికి 21 లేక

22లో వివాహం అయ్యేది. ఇద్దరు కలిపి కనీసం 45 సంవత్సరాలు లేక 50 సంవత్సరాలు కూడా అన్యోన్య వివాహ జీవితము గడిపేవారు. ప్రస్తుతకాలంలో ఈ వివాహ ప్రక్రియ కన్యకు 30 సంవత్సరాలు వచ్చినా, వరునికి 34 లేక 35 సంవత్సరాలు వచ్చినా వివాహము చేసుకోవడం లేదు దీనివల్ల దాంపత్య జీవిత కాలప్రమాణము ఒక దశాబ్దము వృధా అయిపోయినట్లే మనము సరిగ్గా గమనించినట్లయితే, ఒక కన్యకు 30 లేక 31 వయసు వివాహం జరిగితే ఆ వరునికి మూడు/నాలుగు సంవత్సరాలు వయోభేదమే ఉన్నా అతనికి మధ్యమాయుర్ధాయమే ఉంటే ఆ వరుడు నలభై ఐదు సంవత్సరాల తర్వాత మరణిస్తాడు. అంటే ఈ కన్యకు 40 సంవత్సరాలే వయస్సు ఉంటుంది. ఈ నడి వయస్సులో ఉన్న వివాహితకు కనీసం ఇద్దరు లేక ముగ్గురు సంతానం ఉంటుంది. ఈ వయస్సులో ఆ వివాహితకు వైధవ్యం ప్రాప్తిస్తే ఆమె ఆ వయస్సులో పునర్వివాహము చేసుకోలేదు సరికదా భర్త లేని స్థితిలో ఆ పిల్లలను పెంచి పెద్ద చేయలేదు. ఈరోజుల్లో ఉన్న స్వార్థపరత్వంతో సంకుచితమైన ఆలోచనలతో ఈ వివాహిత స్త్రీ యొక్క అత్తమామలు తమ కోడలిని ఆదుకోరు సరికదా పైగా ఒక్కొక్కప్పుడు తమ ఇంటి నుంచి బహిష్కరణ కూడా చేస్తారు లేక ఆమె తమ దగ్గర ఉండలేని పరిస్థితి కల్పిస్తారు. అప్పుడు ఈ స్త్రీ విధిలేక తల్లిదండ్రులని ఆశ్రయిస్తుంది. కాని ఆ తల్లిదండ్రులు వృద్ధాప్యంలో ఉంటారు కాబట్టి తాము తమ కుమార్తెకు ఏమి సహాయము చేయలేక శోకతప్త హృదయంతో తల్లడిల్లిపోతారు. ఆ పరిస్థితిలో అన్నదమ్ములు ఉన్నా వారి సంసారములలో వారు నిమగ్నమై ఉంటారు కాని తమ సోదరి పట్ల సానుభూతి మరియు శుష్క ప్రవచనాలే తప్ప ఏ సహాయము అందించరు. అందువల్ల ఆమె జీవితము చుక్కాని లేని నావ తీరున నడిసంద్రంలో చిక్కుకున్న దశాదిశలు లేని జీవితము అవుతుంది. మరియు ఆమె జీవితము నిజంగా నరకప్రాయమే అవుతుంది. అందువల్ల ప్రతి జ్యోతిష్యుడు అన్ని అంశాలను నేను పైన చెప్పినట్లుగా పరిశీలించి పొంతన విషయంలో ఒక నిర్ణయానికి రావాలే తప్ప మార్కులు పర్సంటేజీలు అంటూగాని, లేక గ్రహమైత్రి ఉంటే చాలు అని గాని వధూవరుల జీవితాలతో ఆడుకోవద్దని నా మనవి. ఈ విషయంలో నేను వ్రాసిన "కళ్యాణజాతక విశ్లేషణలో", "పంచాంగంలో పాయింట్లు " అధ్యాయంలో పూర్తిగా

విశదీకరించాను. తప్పకుండా చదవండి. ఎందుకంటే చాలామంది జ్యోతిష్యులు వధూవరుల జాతకాలు పరిశీలించినప్పుడు అన్ని విషయాలు క్షుణ్ణంగా పరిశీలిస్తే వివాహాలు కావని ఏదో పైపైన చూస్తే చాలని చాలామంది వక్రభాష్యం చెప్తున్నారు. ఇది సరికాదు ఎందుకంటే అలా వక్రభాష్యం చెప్పే ఎంతోమంది జ్యోతిష్యులు వారియొక్క అమ్మాయి లేక అబ్బాయికి వివాహం చేసే ముందు ఆ వధూవరుల జాతక చక్రాలను స్వయంగా నా దగ్గరకు వచ్చి చూపిస్తుంటారు. ఇది చాలా హేయం మరియు ఇతరుల జీవిత భవిష్యత్తు తేలికగా తీసుకోవడమేగాక, అమాయకులైన తల్లిదండ్రులను అజ్ఞానంలో తెలిసి తెలిసి ఉంచడమే కాక జ్యోతిషశాస్త్రాన్ని అపహాస్యము చేయడమే! అవునో కాదో మీరే ఆలోచించండి.

అందువల్ల విజ్ఞులైన పాఠకులు, జాతకచక్రం పూర్తిగా పరిశీలించి అన్ని రకాలుగా విశ్లేషించి ఒక నిర్ణయానికి వచ్చి అనుభవజ్ఞుడైనా జ్యోతిషశాస్త్రములో నిష్ణాతుడైనా పెద్ద కాలము నుంచి అనుభవము ఉన్నా వారు, కీర్తికాంక్ష, ధనకాంక్ష ఉన్నవారయితే వారి దగ్గరకు వెళ్లకూడదని మనము గ్రహించాలి. ఎందుకంటే ఒక వధువుకు తండ్రి తన కుమార్తెను ఎవరికి ఇచ్చి వివాహం చేయాలో అనే నిర్ణయం హక్కు అతనికే ఉంటుంది. తన హక్కు వినియోగించుకునే ముందు జ్యోతిష్యుని దగ్గరకు వచ్చి జాతక పొంతన పరిశీలించమని పండితుడిని అడిగినప్పుడు ఆ జ్యోతిష్యుడు ఈ వివాహము చేయమని చెపితే ఆ వివాహము చేస్తున్నారు. అలా కాకుండా వద్దు అని చెపితే మానేస్తున్నారు. అంటే తండ్రి తనకు ఉన్న హక్కు జ్యోతిష్యుడికి బదిలి చేస్తున్నాడు. అంటే ఈ జ్యోతిష్యుడు ఆ వధువుకు తండ్రి అవుతాడు. తన కుమార్తెకి వివాహ సమయము వచ్చినప్పుడు ఆ కుమార్తె యొక్క జాతక పొంతన ఎలా పరిశీలిస్తాడో అదే విధంగా ఇతరుల యొక్క జాతక పొంతన కూడా పరిశీలించడం జ్యోతిష్యుడి వృత్తిధర్మం. ఎందుకంటే తన దగ్గరకు వచ్చిన ప్రతి వధువు మరియు ప్రతి వరుడు తన సంతానమే అని భావించాలి. లేకపోతే ధన దాహానికి లోలుడై ఇతరుల జీవితాలతో రాజీపడటం ఎంతవరకు సమంజసం? జ్యోతిష్యం అనేది ఒక దైవశాస్త్రం బ్రహ్మరాసిన వ్రాతను చక్రరూపంలో లిఖించి ఆ చక్రప్రకారం గ్రహస్థితి గమనించి భవిష్యత్తులో జరగబోయే అంశాలు అన్ని ఒక

క్రమంలో చెప్పగలిగే మహాశాస్త్రమే జ్యోతిష శాస్త్రము. ఇటువంటి శాస్త్రాన్ని మరియు శాస్త్ర విద్యను ఆత్మవంచన చేసుకుని అమ్ముకోవటం ఎన్నటికి క్షంతవ్యం కాదు. కాబట్టి పండితులందరు ప్రజలకు ఈ విషయాన్ని విప్పి చెప్పగలిగితే ప్రజలు అజ్ఞానములో ఉండక కుహన పండితుల నుండి దూరంగా ఉంటారు.

ఇంకొక విషయం ఏమంటే కొందరు జ్యోతిష్యులు జాతక చక్రం చూడగానే ఆ వచ్చిన వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. శుద్ధ జాతకమైనా కూడా లేని లోపాలను తీవ్రమైన దోషాలున్నట్లుగా చెప్పి పూజలు చేయాలని, శాంతి చేయాలని, దానికి వేల రూపాయిలు ఖర్చు పెట్టాలని లేకపోతే దుష్ఫలితాలు సంభవిస్తాయని, పూజలు చేస్తే అశుభం అంతా తొలగిపోతుందని నమ్మబలికి అధర్మ సంపాదన చేస్తున్నారు. దీనివల్ల జ్యోతిష్యుల మీదే కాక శాస్త్రం మీద కూడా ప్రజలకు చిన్న చూపు కలిగి శాస్త్రం మీదే నమ్మకము సడలిపోతోంది. చాలామంది పూజల పేర్లతో వేలకు వేలు దండుకుని అమాయకులను మోసం చేస్తూండటం పరిపాటి అయిపోయింది. ఈ రోజుల్లో టి.వి.లలో కూడా ఈ విషయాన్ని ప్రతివారు చెప్పి చూపరులను ఊదరకొడుతున్నారు. ఈ పూజలవల్ల వివాహాలు అవుతాయా లేక జాతకాలలోని గ్రహాలు మారిపోతాయా అని మీకు మీరే ఆలోచించుకోవాలిగాని మోసం చేసేవారి ఆహార్యం, వేషభాషలు చూచి వారిని నమ్మకండి. పూజలు చేస్తే బ్రహ్మరాత మారిపోతుందా? అలా మార్చగలిగితే బ్రహ్మదేవుని కంటే పూజలు చేసే సిద్ధాంతులే గొప్పవాళ్లు. అటువంటప్పుడు గ్రహాలకు పూజచేయటం ఎందుకు? ఆ పూజలేవో ఈ సిద్ధాంతులకే చేస్తే దోషపరిహారమేమోగానీ వీళ్లే దేవుళ్లుగా సంతోషంతో చలామణి అవచ్చు. అందరి పాద నమస్కారాలు అందుకోవచ్చు. ఇప్పుడు టి.వి.లలో చెప్పే జ్యోతిష్యులు ఒకే దోషానికి వేరు వేరు పరిహారాలు వేరు వేరుగా చెప్తున్నారు. వారి ఫోన్ నెంబర్లు ఇస్తున్నారు మనం కలిసి మాట్లాడితే వేలరూపాయలు కన్సల్టేషన్ అవుతున్నాయి. పైగా మన మానసిక స్థైర్యం మీద దాడిచేసి పూజల రూపంలో దోచుకున్నారని అనేకమంది నాతో వాపోతున్నారు.

పూజావిధానం వ్రాసేముందు సమయం, సందర్భం రెండూ వచ్చాయి కాబట్టి నేను ఒక విషయాన్ని ఇక్కడ ప్రస్తావిస్తున్నాను. అదేమిటంటే మన హిందూమతంలో

గాని, నాకు తెలిసినంతవరకు ప్రపంచంలో ఏ మతంలోగాని పుణ్యం అనేది అమ్మడం లేక కొనుక్కోవడం అనే ప్రక్రియలేదు. మనకు కష్టనష్టాలు గాని మరేమైనా అనారోగ్య బాధలు గాని, మనం చేసే ఏ కార్యక్రమమైనా దిగ్విజయమవ్వాలని గాని కోరుకున్నట్లయితే అలాంటివారు తాము బాధల ఉపశమనం కోసంగాని, లేక మరేమైనా కష్టనష్టాల నుంచి బయటపడాలని గాని అనుకుంటే ఎవరికి వారు స్వయంగా తమ పూజలు తామే చేసుకోమనడం శాస్త్ర ఉవాచ మరియు ధర్మబద్ధం. అంతేకాని దేవునికి మనకు ఒక మధ్యవర్తిని సమకూర్చుకొని, ఆ మధ్యవర్తి పూజ చేస్తే అతనికి ఆ పూజ చేసిన పుణ్యం వస్తుంది. అందువల్ల ఆయనకు ధనం ఇచ్చి ఆ పుణ్యం కొనుక్కోవడం అనేది చాలా హాస్యాస్పదం. ప్రస్తుత కాలంలో ప్రతివారు తాము దైవపూజకుగాని, ప్రార్థనకు గాని సమయం కేటాయించలేమని అందువల్ల ఒక బ్రాహ్మణుడికి డబ్బు ఇచ్చి పూజ చేయించుకుంటామని చెప్తున్నారు. నిజంగా ఇది ఎంతవరకు సమంజసం? ఈ మనస్తత్వం గ్రహించే చాలామంది జాతకం చక్రం చూసిన వెంటనే ఈ దోషం ఉంది లేక ఆ దోషం ఉంది అనో, త్వరలో చాలా కష్టకాలం వస్తోందనో, లేక పూజ చేస్తే కాని వివాహం కాదనో చెప్పి భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. నా దగ్గరకు చాలామంది వస్తూంటారు. జాతకం చూపించి ఈ పూజలు చేయించాం, ఆ పూజలు చేయించాం వేలలో ధనం ఖర్చు పెట్టాము అయినా వివాహం కాలేదని బాధగా వారు చెప్పినప్పుడు నాకు వారి అమాయకత్వానికి సానుభూతి చూపాలో లేక వారి ధన మదాహంకారానికి విమర్శించాలో తెలియట్లేదు. ఎందుకంటే డబ్బు పారేసి పుణ్యాన్ని కొనుక్కుందామనే వాంఛ ధనమదహాంకరమే అవుతుంది. వేలరూపాయలు పారేయలేనివారు చాలామంది ఉన్నారు మరి వారి సంగతి ఏమిటి? ఎందుకంటే వారు చేయించిన పూజలకు వారి జాతకానికి సంబంధమే లేదు. కాలసర్పదోషం లేకున్నా ఉందని భయపెట్టి పూజలు చేయించమనడం లేక కుజదోషం లేకపోయినా తీవ్రదోషం ఉందని నమ్మించి పూజలు చేయమనడం సర్వసాధారణమై పోయింది. పేరు ప్రఖ్యాతులు సంపాదించి గొప్పపండితులుగా చలమాణి అవుతున్న వారు కూడా కొందరు ఇలాగే సంపాదిస్తున్నారు. అలా పూజలు చేసినా ఫలితాలు పొందలేక పోవడం వల్ల ఎవరి ద్వారానో నా పేరు తెలుసుకొని నా దగ్గరకు వస్తున్నారు. వారు

ఎవరి దగ్గఱ ఎలా మోసపోయిందీ, ఎన్నివేల రూపాయలు మోసపోతుంది నాకు పేర్లతో సహా చెప్తూంటే నాకు నవ్వాలో, ఏడవాలో తెలియడంలేదు. ఇలా భయానికి గురిచేసి ధనార్జన చేయడం మోసం, చౌర్యంతో సమానమని ధర్మనిరతి, నిష్ణాతుడైన ప్రతి సిద్ధాంతి మరియు ప్రతి పండితుడు ఒప్పుకొని తీరుతాడు. అందుకనే ప్రతి తల్లి తండ్రి కొంచెమైనా శాస్త్ర పరిజ్ఞానం కలిగి ఉండాలి. ఇది చాలా అవసరం. శాస్త్రమంటే శ్లోకాలు, సంస్కృత భాష, సంవత్సరాల కొద్ది కఠోర పరిశ్రమ అనే ఉద్దేశ్యంతో ఉన్న వారందరికీ నేను ఇచ్చే సలహా ఏమంటే సరళ భాష మరియు మన మాండలీకములో వ్రాసి ఉన్న పుస్తకాలు చాలా ఉన్నాయి. తక్కువ ఖర్చుతో ఎక్కువ విజ్ఞానాన్ని పంచి పెట్టే పుస్తకాలను చదవండి. ఈ విషయాన్ని మరిచి అయోమయానికి, భయానికి లోను కావద్దని నా సలహా. గమనించదగ్గ విషయం ఏమంటే వశిష్ట మహామునికి కోటిమంది శిష్యులు అని అందరికీ తెలుసు. ఆయన ప్రతి శిష్యుడిని "ఓం నమః శ్శివాయః" అని ఒక్కసారి అనమంటే అలా శిష్యులు అందరు కలిసి అన్నప్పుడు ఒక్కొక్కరు ఒక్కసారి అన్నా, కోటిసార్లు అన్నట్లే. ఒకవేళ ఒక్కొక్కరు 10 పదిసార్లు అంటే 10 కోట్లసార్లు శివమంత్రం జపించినట్లే. ఆ పుణ్యఫలం అందరి శిష్యుల దగ్గఱ వశిష్టుల వారు గ్రహిస్తే ఇంక ఆయన తపస్సు చేయనక్కరలేదు. కాని ఆయన స్వయంగా బ్రహ్మసాక్షాత్కారం కోసం తపస్సు చేసాడు. ఎందుకని? ఆయన పిచ్చివాడా? కాదు, మనసా, వాచా, కర్మణా ఆయన స్వయంభక్తితోనూ, శ్రద్ధగాను భగవంతుని ధ్యానముద్రలో ఉండాలని ఆయనకు తెలుసు. ఇంకొక చిన్న ఉదాహరణ చెప్తాను. రావణాసురిడిని రాక్షసుడైనా బ్రహ్మదేవునితో పోల్చడమే కాకుండా "రావణాబ్రహ్మ" అని కూడా సంబోధిస్తారు. ఇది అందరికి తెలిసిన విషయం. అలాంటి మహాజ్ఞానం కల రావణాసురుడు శివుని గురించి వెయ్యి సంవత్సరాలు తపస్సు చేసాడు. ఎందుకని? రావణుడు పిచ్చివాడా? లంకా రాజ్యంలో ఉన్న రాక్షసుల చేత "ఓం నమఃశ్శివాయ" అనే మంత్రజపం వారి చేత చేయిస్తే ప్రొద్దుటి నుంచి రాత్రి వరకు రాక్షసమూక రోజంతా మంత్రజపం చేస్తూ ఎగురుతూనే ఉంటారు. అందువల్ల ఎన్నో కోట్ల మంత్రజపం చేస్తూ ఎగురుతూనే ఉంటారు. అందువల్ల ఎన్నో కోట్ల మంత్రజపం చేసిన పుణ్యఫలం రాక్షసమూక నుంచి రావణాసురుడు ఏ విధంగానైనా పొందవచ్చు

గదా? అలా కాకుండా తానే స్వయంగా శివుని గూర్చి తపస్సు చేసాడు. ఎందుకని? ఎందుకంటే ఎవరైనా సరే తమ పూజలు తామే స్వయంగా చేసుకొని భగవదనుగ్రహం పొందాలే కాని ఎవరికో డబ్బు ఇచ్చి పూజ చేసి సంతృప్తి పడడం కంటే అమాయకత్వం మరొకటి ఉంటుందా? మీరే ఆలోచించండి. మీకు గాని, మీ అమ్మాయికిగానీ, లేక మీ అబ్బాయికి గానీ పూజ చేసుకోవడానికి సమయం లేదంటే మీలాంటి వారు కోటానుకోట్లు ఉన్న ప్రజానీకానికి సహాయం చేయడానికి దేవుడికి మాత్రం సమయం ఉంటుందా? ఒకవేళ పూజ చేసేముందు ఆ పూజ చేసే వ్యక్తి ఈ పూజ చేయాలి, ఆ పూజ చేయాలి అని, అదేకాక ఈ దానం, ఆ దానం ఇవ్వాలని వేలకు వేలు మీ చేత ఖర్చు పెట్టించడానికి వెనుకాడకుండా మీ ముందుకు వచ్చినప్పుడు మీరు ఆయన చెప్పిన సమయంలో అంటే మూడు నెలల్లో వివాహం అవుతుందని భరోసా ఇచ్చినప్పుడు, ఆయన మాట ప్రకారం ఆ వివాహం జరుగక పోతే కనీసం సగం డబ్బు అయినా వాపసు ఇస్తాడా? ఈ విషయం మీరు ముందే తేల్చుకోండి. ఎందుకంటే నిర్మొహమాటంగా ధనం వసూలు చేయటంలో ఒక్క రూపాయి కూడా తగ్గించనని ఆ పూజ చేసే వ్యక్తి పట్టు పట్టినప్పుడు మీరు కూడా కనీసం సగం డబ్బు వాపసు అడగడం తప్పేమీ కాదు. ఎందుకంటే ఇది ఒక వ్యాపార సరళి అయిపోయింది. అందువల్ల ఆయన పూజకు, శ్రమకు మీరు సగం డబ్బు గురుదక్షిణగా ఇస్తూనే ఉన్నారు. పైగా దానాలు, పూజా వస్తువులు ఆయనే తీసుకుంటాడు కాబట్టి ఆయన మీకు డబ్బు వాపసు ఇచ్చినా ఆయనకు నష్టం కాదు. కాని ఎక్కువ నష్టపోయింది మీరే. అవునా? కాదా? మీరే ఆలోచించండి. మీ ఆశ, భ్రమ మీకు నష్టం కలిగిస్తుందని గ్రహించండి. ఎందుకంటే డబ్బు వేలల్లో పోయింది కాని మీరనుకున్నది జరుగలేదు.

ఇంకొక విషయం ఏమంటే మీరు అర్చన చేయడానికి గుడికి వెళ్ళి పూజారికి పండ్లు, పూలు మొదలైన పూజాసామాగ్రి మరియు మీరు కొన్న అర్చన టిక్కెట్టు ఇస్తే ఆయన ఆ పూజా సామాగ్రి అందుకొని ఆ అర్చన కోసం కొన్న టిక్కెట్టు దేనికోసమో చూడనైనా చూడకుండా కొందరు పూజారులు నిర్లక్ష్యముగా నలిపి విసిరి పారేసి, మళ్ళీ మిమ్మల్నే "ఏమిటీ? అర్చన చేయాలా? అని అడుగుతాడు. ఇది మనం రోజూ

చూస్తూ ఉండే నగ్న సత్యం ఇది అహంకారమూ లేక మీరంటే నిర్లక్ష్యమా? మీ ఎదురుగుండానే ఆ పూజారి వాచక దోషం, రాగ దోషం, శ్రద్ధా దోషం, క్రతువు దోషం, సమయం దోషంలాంటి పంచదోషాలు చేస్తున్నాడా? లేదా? మీరు అన్నీ తెలిసికూడా నిస్సహాయంగా నిలబడి చూస్తూనే ఉంటారు. కాని ఏమీ అడగరు. "ఆయన పాపం ఆయనదే" అని ఆత్మతృప్తి చేసుకొని వెళుతున్నారా లేదా మీరే ఆలోచించండి. ఇలాంటి వ్యక్తులు మీ అబ్బాయి కోసం లేక మీ అమ్మాయి కోసం తన ఇంట్లో ఎన్నోవేల సార్లు భక్తి, శ్రద్ధలతో పూజ చేస్తారని నమ్మగలరా. అలా నమ్మితే ఆ నమ్మకానికి మూల్యం వేల రూపాయిలని తెలుసుకొనండి. ఇంకొక విచిత్రమేమంటే నవగ్రహ పూజకు ప్రతి ఒక్క గ్రహానికి ఒక పూజ సంఖ్య నిర్ణయించడం! ఎలాగంటే శనికి జపం, రాహువుకు జపం, కుజుడికి జపం అని నిర్ణయించి అన్ని వేలసార్లు జపం చేయాలని చెప్పటం. నాకు అర్థం కానిది, ఎవరూ అర్థం సరిగా చెప్పనిది ఏమంటే, మన పురాణాలలోగాని, ఇతిహాసాలలో గాని లేక రామాయణ, మహాభారతాలలో గాని ఏ గ్రహమైనా, ఎవరితోనైనా, ఎప్పుడైనా నాకు ఇన్ని వేలసార్లు జపం చేస్తే "నేను కరుణిస్తాను" అని చెప్పిందా? కనీసం అలా చెప్పినట్లు నేను ఎప్పుడూ వినలేదు. నేను చదివిన గ్రంథాలలో ఎక్కడా కూడా ఈ సంఖ్యా ప్రసక్తి లేదు. అదేకాక భస్మాసురిడిని ఇన్ని సంవత్సరాలు తపస్సు చేయమని శివుడు అడిగాడా? అలాగే ఏ దేవుడైనా, ఏ శక్తిమాత అయినా లేక నవగ్రహాలలో ఏ గ్రహమైనా అడిగిందా? అలా అడిగినట్లు మీరు గాని విన్నారా లేక ఏ గ్రంథంలోనైనా చదివారా? ధృవుడికి కాని లేక మార్కండేయుడికి గాని ఎవరైనా లెక్కపెట్టి ఇన్నివేల జపం చేయమని చెప్పారా? ఏమో నాకు మాత్రం తెలియదు. ఎందుకంటే, అలా ఎవరూ చెప్పినట్లు నేను చదవలేదు. వినలేదు. నాకు తెలియనంత మాత్రాన అది తప్పు అని చెప్పగలిగే ధైర్యం నాకు లేకున్నా, ఒక విషయం మాత్రం ఘంటాపథంగా చెప్పగలను. అది ఏమంటే, పూజతో మన మనసు ధ్యాన నిమగ్నమై ఉండాలిగాని మనం చేసే పూజా సంఖ్య మీద దృష్టి మళ్ళిస్తే అది శ్రద్ధాదోషం, మరియు భక్తి దోషం క్రిందకు వస్తుందని మాత్రం నాకు తెలుసు. నిజంగా ఏ దేవుడూ, ఏ గ్రహం సంఖ్యా నిర్ణయం చేయనప్పుడు మరి ఈ సంఖ్యా నిర్ణయం ఎవరు చేశారు? సిద్ధాంతులా? పూజారులా,

పురోహితులా లేక పూజా విధానం, ఆగమ శాస్త్రం మరియు కృష్ణ యజుర్వేదం చదువుకోని జ్యోతిష్యులా? ఎవరీ నిర్ణయం చేశారు? అదే నిజమైతే భక్తిశ్రద్ధలతో దైవధ్యానం చేయటంలో ఔచిత్యం లేదు ఎందుకంటే గ్రహాలకు సంఖ్య మాత్రమే ముఖ్యం. 7000లకు బదులు పొరపాటున 6950 చేస్తే శని ఎంత భక్తి శ్రద్ధలతో పూజ పూర్తి చేసినా కరుణించడా? అలా కరుణించకపోతే శని యొక్క మనసు కూడా భక్తుడు చేసే పూజా సంఖ్య మీదే ఉంటుంది కాని భక్తుని మీద కాదని స్పష్టంగా అర్థమవుతుందా కాదా? అలాంటప్పుడు పూజ చేసే బదులు టేప్ రికార్డరు వాడితే లేక కంప్యూటరు వాడితే? అదే లెక్క తప్పకుండా పూజామంత్రం చదివేస్తుంది. ఎంచక్కా మనం వేరే పని చేసుకోవచ్చు. ఇంకొక ముఖ్య విషయం మీరు గమనించాల్సింది ఏమంటే, 18,000 జపం ఒక్కరు చేయలేరు కాబట్టి ఆరుగురు కూర్చుని ఒక్కొక్కరు 1500 చొప్పున రెండు రోజుల్లో పూర్తి చేస్తాం అంటారు. ఆ ఆరుగురికి వేలలో ధనం ఇవ్వాలి. హాస్యాస్పద విషయం ఏమంటే దైవపూజ వాయిదాల పద్ధతిలో చేస్తామనడం! ఒక్కొక్కరు 3000 సార్లు జపిస్తే 6×3000=18,000 సార్లు అవుతుందని మిమ్మల్ని నమ్మించి ప్రలోభంలోకి దింపడం కంటే ధర్మ విరుద్ధం ఇంకొకటి లేదు. ఇదే నిజమైతే మీ ఇంట్లో మీరు వినాయక చవితి చేసుకున్నప్పుడు మీకు టైము లేదు కాబట్టి మీరు 15 నిమిషాలు, మీ శ్రీమతి 15 నిమిషాలు, మీ పుత్రుడు 15 నిమిషాలు, మీ కోడలు 15 నిమిషాలు కేటాయించుకొని ఒక్క 15 నిమిషాలలో ఎవరు ఎంతవరకు చేయగలరో అంతవరకు పూజ చేసి ఆపేసి అక్కడి నుంచి మీ శ్రీమతి 15 నిమిషాలు పూజ చేసి మళ్ళీ ఆపేసి మీ పుత్రుడు 15 నిమిషాలు పూజ చేసి ఆపేస్తే మీ కోడలు మిగిలిన 15 నిమిషాలలో వ్రతం పూర్తి చేస్తుంది. కాబట్టి మీరందరు కూర్చుని పూజా కార్యక్రమం పూర్తిగా చేయక వాయిదాల పద్ధతిలో చేస్తే బాగుంటుంది కదా? మీకు శ్రమ తగ్గుతుంది. మీ ఆవిడ పండగ వంట పూర్తి చేయగలదు. మీ అబ్బాయి తన కంప్యూటరు మీద ప్రాజెక్టు పని చేయగలడు. మీ కోడలు పూజాంతరాయం లేకుండా చక్కగా టి.వి. సీరియల్ చూసి ఆనందించవచ్చు. ఇది అందరికీ సంతోషమే కదా? మరి అందరూ కూర్చుని పూజా కార్యక్రమం అలా ఎందుకు రెండు గంటలు చేస్తారు? వాయిదాల పద్ధతిలో పూజా కార్యక్రమాన్ని

పూర్తి చెయ్యడం ఎంత బాగుంది కదా? నా సలహాను పాటించవచ్చేమో మీరే ఆలోచించండి. ఇహం, పరం రెండూ దక్కుతాయి. లేకపోతే నాకు ఒక రెండువేల రూపాయిలు మని ఆర్డరు చేయండి మీ అందరి తరుపున నేను, నా భార్య, పుత్రుడు, కోడలు వాయిదాల పద్ధతిలో పూజ చేస్తాము. మేమంతా కలిసి చేసిన పూజ వల్ల వచ్చిన పుణ్యఫలం మీరు రెండువేలకు మా దగ్గఱ కొనుక్కున్నారు కాబట్టి మీరు ఇంక పూజ చెయ్యనక్కరలేదు. దీనివల్ల ఉభయులకు లాభం కదా? మీరే ఆలోచించండి. ఇలాగే మీరు ఏమైనా వ్రతాలు, పూజలు చేయాలనుకున్నప్పుడు మీరు నన్ను సంప్రదిస్తే చాలు. ఉభయ తారకమంత్రం వల్ల ఇద్దరికి లాభం. మీరు మీ దైనందిక జీవిత కార్యక్రమంలో దైవపూజ అనే అడ్డు తొలగిపోతుంది. సమయ సమస్య ఉండదు. డబ్బు పారేస్తే పుణ్యం వస్తుంది. భేష్! చాలా బాగుంది. నన్ను మర్చిపోక కావల్సి వచ్చినప్పుడల్లా నన్ను దయచేసి సంప్రదించండి. మా ఆవిడ కూడా వరలక్ష్మి వ్రతాలు, నందికేశుని వ్రతాలు కూడా చేస్తుందట. కాబట్టి మీ ఆవిడ కూడా చక్కగా పూజలన్నీ పక్కన పెట్టి పక్కింటి పిన్నిగారితో కబుర్లు కాకర కాయలతో కాలక్షేపం పెట్టుకోవచ్చు ఈ విషయం మీ ఆవిడకు చెప్పండి సంతోషపడుతుంది. ఇన్ని సదుపాయాలు, సౌకర్యాలు, వెసలుబాటులు ఉన్నాయి కాబట్టే మన హిందూమతం చాలా గొప్పది. మనది కర్మభూమి అంటారు. ఎందుకంటే డబ్బుతో మనకు పట్టిన కర్మను వదిలించు కోవచ్చు. అందుకనే మనం హిందూమత సాంప్రదాయం కంటే ఉత్కృష్టమైన మతం ఏది లేదని, మనవాళ్లు గర్వంగా చెబుతున్నారు. మిగిలిన మతాల వాళ్ళు పిచ్చివాళ్ళు, మహమ్మదీయులు, కిరస్తానులు, జైనులు, బౌద్ధులు, ఆర్య సమాజస్థులు లేక సిక్కులు పుణ్యాన్ని కొనుక్కోరు. వారికి దేవుడికి మధ్య కమీషన్ ఏజంట్లు లేక బ్రోకర్లు ఉండరు అందుకనే మనం నిజంగా ఎంతో గొప్పవాళ్ళం, మరీ మరీ అదృష్టవంతులం!

ఆఖరి మాట కాకపోయినా, మరొక సత్యమైన వివరణ ఇస్తాను. మీ యింటికి డబ్బుకోసం వచ్చి డబ్బు తీసుకొని రేపు పంచమి గురువారం అని చెప్పి రేపటి నుంచి పూజ మొదలుపెడతాను అని పూజ చేసే బ్రాహ్మణుడు అంటాడు. మీరు సరేనని వేలరూపాయిలు అతనికి అందిస్తారు. క్యాలెండరు చూస్తే ఆరోజు సాయంత్రం 5 గంటలకు పంచమి వచ్చింది. మీరు సంతోషపడతారు. మంచిరోజున పూజ మొదలు

పెడుతున్నామని ఆనందిస్తారు. కాని పూజా ప్రక్రియలో ఉన్న లోపాన్ని మీరు విశ్లేషించలేరు. విశ్లేషించే జ్ఞానం కలవారు మీకు చెప్పరు. ఎందుకంటే శాస్త్ర పరిజ్ఞానం ఉండాలని గాని, పూజా ప్రక్రియను తెలుసుకుందామనే జిజ్ఞాస అసలు మీకు ఉండదు. సత్యం ఏమంటే పుణ్యం కొనుక్కుందామనే ధీమా, తపన తప్ప మరేమీ కాదు. “ఆశ ఆవులిస్తే, తపన తుమ్ముతుంది అనేది నిజం. ఇపుడు పూజా విధానం ఆ వ్యక్తి ఎలా చేస్తాడో ఒకసారి విశ్లేషించుకుందాం. మీరు డబ్బు ఇచ్చినది పంచమి తిథి, ఆ తిథి ఆ రోజు సాయంత్రం అయిదు గంటలకు వచ్చింది. ఏ తిథి అయినా సుమారుగా ఒకరోజు అంటే 24 గంటలు ఉంటుంది. అంటే ఇవాళ ఐదు గంటలకు పంచమి వస్తే మరునాడు దాదాపు 5 గంటల వరకు పంచమితిథి ఉంటుంది. డబ్బు తీసుకున్న బ్రాహ్మణుడు ఆ రాత్రి భోజనం చేస్తాడు. ఆ తరువాత భార్యాసుఖం అనుభవించాడు. తదుపరి శయ్యాసుఖం అంటే హాయిగా తృప్తిగా నిద్రపోతాడు. మరునాడు ఉదయం స్నానం చేసి పూజా కార్యక్రమాన్ని ప్రారంభిస్తాడు. అంటే ఆ పూజ చేసే బ్రాహ్మణుడు పంచమిలో భోజనం చేశాడు. పంచమిలోనే భార్యా సుఖం జరిపాడు. పంచమిలోనే నిద్ర పూర్తి చేసిన తరువాత పూజ పంచమిలోనే మొదలు పెట్టాడు. అంటే ఒకే తిథిలో పూజకు ముందే భోజనం, స్త్రీ సుఖం, నిద్రా సుఖం అనుభవించి ఆ తర్వాత పూజా కార్యక్రమాన్ని చేపట్టినాడు. ప్రశ్న ఏమిటంటే, ఎప్పుడైనా పూజానంతరం భోజనమా లేక పూజకు పూర్వమే తన అవసరాలు తీర్చుకొన్న తర్వాత పూజ చేయడమా? మీరే ఆలోచించండి. అందుకనే పెద్దల ఆబ్దీకము పెడుతున్నప్పుడు ముందు రోజు రాత్రి భోజనం చేయకూడదు. మరియు దాంపత్య సుఖం పొందకూడ దనేది నియమం. ఎందుకంటే ముందురోజు ఉన్న తిథి మరునాడు కూడా ఉండవచ్చు అందుకనే మన పెద్దలను ఆవాహన చేసి వారిని సంతృప్తిపరచి ఆ తర్వాతే మనం భోజనం చేయాలనే నియమం మన అందరికి తెలుసు. ఇలా తెలిసి కూడా మనం మధ్యవర్తికి డబ్బు ఇచ్చి పూజ చేయించడం ఎంత దోషం? ఆ పూజకు ఏమైనా ప్రతిఫలం ఉంటుందా? మీరే ఆలోచించండి. అందువల్ల మన పూజలు మనమే చేసుకోవాలి. అలాగే మీరు ఏ వ్రతంగాని, పూజ గాని సాయంత్రం చేసేటట్లయితే ఉదయం నుంచి ఉపవాసం ఉండాలని మీకు తెలుసు. అంతేకాని ఉదయం సుష్టుగా భోజనం చేసి సాయంత్రం పూజ ఎవరైనా చేస్తారా? ఆబ్దీకాలు

కాని, పూజలు అంటే సత్యనారాయణ స్వామి వ్రతం కాని ఎవైనా సరే బ్రాహ్మణులు తాము మంత్రపఠన చేస్తూ మనచేత చేయిస్తారు కాని వారు చేయరు. వారు మన తరుపున తద్దినాలు పెడతారా? పెట్టనప్పుడు పూజలు మాత్రం ఎలా చేస్తారు? మీరే ఆలోచించండి. అంధకారంలో మిమ్మల్ని ముంచి ధనార్జనే ధ్యేయంగా పెట్టుకొనే స్వార్ధపూరిత వ్యక్తులను దూరంగా ఉంచకపోతే మీరు నష్టపోవడమే కాక మీ అమ్మాయో లేక మీ అబ్బాయో మేము నష్టజాతకులమనే భయానికి లోనయి తప్పటడుగులు వేయడానికి వెనుకాడక పోవచ్చుననేది నా ఊహ. నేను చేసినది విమర్శ కాదు. ఒక విశ్లేషణ మాత్రమే సరైనదో కాదో మీ నిర్ణయానికి, మీ విజ్ఞతకే వదిలి వేస్తున్నాను. చెప్పడం వరకు నా ఇష్టం. పాటించడం, పాటించకపోవడం మీ ఇష్టం. నా అభిప్రాయాలు నావి. మీ అనుభవాలు మీవి. ఇందులో ఎవరినీ విమర్శించడం గాని, చిన్నబరచడం గాని నా ఉద్దేశ్యం కానేకాదు. నాకు తెలిసినది నేను చెప్పగలగడం ఒక సాహసం కాదు. ఎందుకంటే మీలో జాగరూకత, శాస్త్ర పరిజ్ఞానం పెంపొందించడమే నా లక్ష్యం, ధ్యేయం మరియు నా తపన ఇందులో విమర్శలకు, వ్యతిరేకతలకు జవాబు చెప్పే సమయం, ఇచ్ఛ రెండూ నాకు లేవు. ఈ విషయాల గురించి తర్జన భర్జనలకు నేను అతీతుడను కాబట్టి నా మౌనమే నా వ్రతమని చదువరులు గ్రహించమని నా మనవి.

పైన వ్రాసిన విశ్లేషణ పూర్తిగా నా స్వంత అభిప్రాయాలు. ఈ అభిప్రాయాలతో ప్రచురణ కర్తలకు ఎటువంటి సంబంధం లేదు. నా అభిప్రాయాలతో వారు ఏకీభవిస్తారో లేదో కూడా నాకు తెలియదు. కాని నేను వ్రాసిన ఈ అధ్యాయం అచ్చు వేస్తే వారు ఎవరి అభిప్రాయాలనైనా గౌరవించి వాటిని ప్రజా నిర్ణయం కోసం ప్రచురించే ఔన్నత్యం ఉందని పక్షపాతానికి వారివద్ద తావు లేదని నేను గ్రహిస్తాను.

# అధ్యాయం - 12

## వధూవరుల జాతక పరిశీలన

మనము ఇప్పుడు రెండు జాతకాలు పొంతన కోసం మన దగ్గరకు వచ్చినప్పుడు ఎలా విశ్లేషించాలో ఒక క్రమబద్ధంలో నేర్చుకుందాము.

ఇలా నేర్చుకునేటప్పుడు కొన్ని నియమాలు తప్పక పాటించి తీరాలి. అవి ఏమిటంటే మొదటిది వధూవరుల రెండు జాతక చక్రాలు ఒకే సిద్ధాంతంలో వేసి ఉండాలి అంటే వధువు జాతకం. కె.పి. పద్ధతిలోను మరియు వరునిది బి.వి.రామన్ పద్ధతిలో వేసి ఉండకూడదు. అలా వేసి ఉంటే ఆ రెండు జాతకాలకు మనము ఒకే పద్ధతిలోకి మార్చుకోవాలి. ఒకవేళ మీకు ఈ రెండు పద్ధతులయందు మంచి అవగాహన లేకపోతే మీరు ఏ పద్ధతిలో నేర్చుకొన్నారో ఆ పద్ధతిలోనే ఈ రెండు జాతకాలను మళ్ళీ మీరు కొత్తగా వేసుకోవాలి. ఉదాహరణకు మీరు పూర్వపరాశర సిద్ధాంతములో అనుభవం ఉన్నప్పుడు ఆ వధూవరుల జాతకాలు రెండు పూర్వ పరాశర సిద్ధాంతము లోనే వేసుకోవాలి. ఎందుకంటే ఒక్కొక్కప్పుడు కె.పి. పద్ధతిలో లగ్నాలే మారిపోతుం టాయి. మనము ఏ స్థానం నుంచి లెక్కపెట్టిన ఆ స్థానం లగ్నం నుంచే లెక్కపెడతాము. అంటే ఒకే జాతక చక్రాన్ని రెండు పద్ధతుల్లో వేసినప్పుడు రెండు లగ్నాలు భిన్నరాసులలో చూపించినప్పుడులగ్నభావాలు మారిపోతాయి. అదే కాకుండా లగ్నం నుంచి రాశిస్థానం కూడా మారిపోతుంది. కాబట్టి ప్రతి జ్యోతిష్కుడు జాతక చక్రం వేసినప్పుడు ఆ చక్రాన్ని ఏ పద్ధతిలో వేశారో అని సూచించటం తప్పనిసరి. ఇంకొక విషయంఏమంటే కొందరు జ్యోతిష్కులు చక్రం అపసవ్యంగా వేసి గ్రహాలను సవ్యపద్ధతిలో వేయడం లేక సవ్యచక్రం వేసి గ్రహాలను అపసవ్య పద్ధతిలో వేయడం ఒక దురలవాటుగామారి పోయింది ఎందుకంటే ఇలా సవ్యాపసవ్య గ్రహ పొందిక ఉందని సూచించక పోవడం వల్ల వధూవరుల జాతక చక్రాలు రెండు పరిశీలించేటప్పుడు తీవ్రమైన దుష్ఫలితాలు సంభవిస్తాయి. కాబట్టి పండిత శ్రేష్టులు ఈ దుష్ట సాంప్రదాయాన్ని అవలంభించ కూడదని ఎవరైనాఅలా చేస్తే చేయకూడదని తమ శిష్యులకు బోధించాలనినా మనవి.

మనము జాతక పొంతన పరిశీలించేటప్పుడు ఎప్పుడూ కూడా వధువు యొక్క జాతకం నుంచి వరుని యొక్క జాతకం పరిశీలించాలి గాని వరుని నుంచి వధువు జాతకం పరిశీలించకూడదు. తారాబలం పరిశీలించేటప్పుడు వధువు నుంచి వరునికి మరియు వరుని నుంచి వధువుకి కుదరాలి అని భ్రమలో ఉంటారు. ఇది పూర్తిగా తప్పు. ఎందుకంటే సంపత్తార మరియు పరమమిత్రతార అయినప్పుడే ఇద్దరికి తారాబలం కుదురుతుంది. ఉదాహరణకి జన్మ తారగాని విపత్తార గాని ప్రత్యక్తారగాని నైధునతార గాని వచ్చినప్పుడు వధువరుల నక్షత్రాలు మీరే పరిశీలించి చూడండి. ఒకరికి అనుకూలంగాను మరి ఒకరికి ప్రతికూలంగానే ఫలితం వస్తుంది. కాబట్టి 'అటునుంచి ఇటు' 'ఇటునుంచి అటు' అనే పద్ధతి శాస్త్రంలో ఎక్కడ చెప్పబడలేదు. కొంతమంది వివాహ విషయంలో తారాబలం చూడవలసిన అవసరం లేదని అలాగే మరికొంతమంది ఇద్దరి గణపొంతన కుదరకపోతే ఆ వివాహం చేయకూడదని ఎవరికి తోచినట్లుగా వారివారి రచనలలో మరియు వ్యాసములలోను ఉటంకిస్తున్నారు. ఇది కూడా తప్పు ఎందుకంటే ఉదాహరణకి వధూవరుల జాతకాలలో గ్రహమైత్రి బలంగా ఉన్నప్పుడు గణపొంతన పరిహారం అవుతుంది. ఇంకొక ముఖ్య విషయం ఏమంటే ఆశ్లేష, చిత్త, విశాఖ, జ్యేష్ఠ, మూల, శతభిషం ఈ నక్షత్రాలలో జన్మించిన కన్యకు స్త్రీ రాక్షస గణం అయినను దోషం లేదు. అలాగే లగ్నం నుంచి రాశిగాని ఏకాధిపత్యం అయినప్పుడు అలాగే నాడిపొంతన శుభముగా ఉన్నప్పుడు గణపొంత నలో దోషము ఉన్ననూ దుష్ఫలితాలు ఉండవు. విజ్ఞులైన పండితులు మరియు విద్యార్థులు ఈ విషయాన్ని గ్రహించాలి.

జాతక పొంతన పరిశీలించేటప్పుడు మధ్యలో ఎటువంటి అవాంతరాలు తమకు తామే కల్పించుకోకూడదు. ఒకవేళ జాతక పరిశీలన మనము చేస్తున్నప్పుడు వారు ఏ విధమైన ఆటంకాలు అంటే మధ్యలో ప్రశ్నలు వేయటం పిచ్చాపాటి మాట్లాడటం లేక సెల్‌ఫోన్ వల్ల ఆటంకం కలిగించడం చేయనివ్వకూడదు. జాతక చక్రం పూర్తిగా పరిశీలించేవరకు నిశ్శబ్దంగా ఉండమని సెల్‌ఫోన్ ఆపివేయమని నిర్మొహమాటముగా చెప్పాలి ఎందుకంటే వాళ్ళ అమ్మాయి భవిష్యత్తు గురించి మనము జాతక పరిశీలన చేసేటప్పుడు జ్యోతిష్య పండితులను ఏవిధమైన చికాకు కల్పించిన,ఆ

చికాకు వల్ల జాతక పరిశీలనలో పొరపాటు వస్తే వాళ్ళ అమ్మాయే నష్టపోతుందని స్పష్టంగా తెలియచెప్పాలి. ఇంకొక ముఖ్య విషయం ఏమంటే జాతక పరిశీలన చేసేటప్పుడు మనము అమ్మాయి జాతకాన్ని మరియు అబ్బాయి జాతకాన్ని ఎప్పుడూ ఒకే క్రమపద్ధతిలో పెట్టుకోవాలి. అంటే మనము బల్లమీద ఎడమచేతి ప్రక్కన అమ్మాయిని కుడిచేతి ప్రక్కన అబ్బాయిని పెట్టుకోవాలి. ఆ స్థానాలను కదల్చకుండా జాతక చక్రాలను పరిశీలించాలి గాని ఎటువంటి పరిస్థితిలోను ఆ జాతకచక్రాలను తారుమారు చేయకూడదు. ఎందుకంటే చాలామంది ఇద్దరి జాతకాలను చేతిలో పట్టుకుని జాతక పరిశీలన చేయటం చూశాను. అలా చేస్తున్నప్పుడు కుడిచేతిలోనిది ఎడమ చేతిలోనికి ఎడమ చేతిలోనిది కుడిచేతిలోకి అసంకల్పిత ప్రతీకార చర్యగా మారిపోతుంది. అలా మారడంవల్ల కొన్ని అమ్మాయి నుంచి అబ్బాయికి మరికొన్ని అంశాల అబ్బాయి నుంచి అమ్మాయికి పరిశీలన చేయడం జరుగుతోంది. ఇది చాలా దోషభూయిష్టం మరియు శాస్త్రవిరుద్ధం కాబట్టి ఈ విషయాన్ని మర్చిపోకూడదు. అందువల్ల జాతక చక్రములను రెండూ కలిపి చేతుల్లో పట్టుకుని పరిశీలించకూడదు. నేను చెప్పినట్లుగా ఒక అమ్మాయి జాతక చక్రాన్ని ఎడమ వైపు మరియు అబ్బాయి జాతక చక్రాన్ని కుడివైపు పెట్టుకుని అలవాటు చేసుకొని జాతక చక్రాలు స్థానభ్రంశం కాకుండా పరిశీలించాలి. లేకపోతే మనకు తెలియకుండానే ఇతరులకు తీవ్రమైన అన్యాయం చేసినట్లు అవుతుందని మనము ఎన్నటికి మర్చిపోకూడదు. ఇది చాలా చిన్న విషయమే కాని లోపం మాత్రం చాలా పెద్దది అని మనం గ్రహించాలి.

ఇప్పుడు మనం జాతకచక్రాన్ని ఎలా పరిశీలించాలో ఏ అంశాలు పరిశీలించాలో వివరంగా నేర్చుకుందాము.

**1.** లగ్నాధిపతులు వధువు జాతక చక్రంలో లగ్నాధిపతి ఎవరో చూసి అలాగే వరుని జాతక చక్రంలో కూడా లగ్నాధిపతి ఎవరో చూసి ఈ లగ్నాధిపతుల్దిరూ మిత్రులా,సములా, శత్రువులా అని చూడాలి ఒకవేళ లగ్నాధిపతి ఇద్దరూ శత్రువులయితే లగ్నాధిపతి శత్రువులు అని మనము జాతక విశ్లేషణ పట్టికలో లగ్నాధిపతి అనే గడిలో శత్రువులు అని వ్రాయాలి. అలాగే మిత్రులైతే మిత్రులు అని లేక సములైతే సములు అని వ్రాయాలి.

ఒకవేళ ఇద్దరి లగ్నస్థానాలు ఒకటే అయితే లగ్నాధిపతి ఉన్న గడిలో ఏకలగ్నం అని వ్రాయాలి ఇంకొక విషయం ఏమంటే వధూవరులిద్దరిది వేరు వేరు లగ్నాలయిన అధిపతి ఒకడే ఉండచ్చు. అలా ఉన్నప్పుడు ఏకాధిపత్యం అని వ్రాసుకోవాలి ఒక ముఖ్య విషయం ఏమంటే వధువు లగ్నస్థానం నుంచి వరుని లగ్నస్థానం సప్తమ స్థానం అయితే వరుని లగ్నస్థానం నుంచి వధువు లగ్నస్థానం కూడా సప్తమమే అవుతుంది ఇలా ఇద్దరి లగ్నాలు ఒకటికి మరొకటి సప్తమస్థానం అయినప్పుడు ఈ గ్రహస్థితిని సమసప్తమాలు అంటారు లేక సప్తాసప్తమాలు అని అంటారు. ఈ సమసప్తమాలు ఎప్పుడూ మిత్రులుగా ఉండరు. సములుగాని, శత్రువులుగాని ఉంటారు. అయినా కూడా సమసప్తమాల గ్రహస్థితి ఎప్పుడూ శుభఫలితాలనే ఇస్తాయి కాని సింహ, మకర, స్థానాలు సమసప్తమాలైన అవి శుభఫలితాలు ఈయవు కాబట్టి సింహ, మకర రాశుల స్థానాలను సమసప్తమాలుగా భావించకూడదు. ఎందుకంటే సింహ, మకర రాశుల అధిపతులు రవి, శనులు కాబట్టి ఇద్దరూ కూడా తండ్రి కొడుకులైన శత్రుత్వపు ప్రకోపము ఎక్కువ కాబట్టి ఇవి సమసప్తమాలుగా తీసుకోకూడదు.

**2.** రాశ్యాధిపతులు ఎవరి జాతక చక్రంలో అయినా సరే చంద్రుడు ఏ స్థానంలో ఉంటాడో ఆ స్థానాన్ని రాశి అంటారు. ఉదాహరణకు మీనంలో చంద్రుడు ఉంటే ఆ జాతకునిది మీనరాశి అవుతుంది అలాగే చంద్రుడు మేషంలో ఉంటే ఆ జాతకునిది మేషం అవుతుంది. ఇలాగే పన్నెండు రాశులలో ఏ రాశిలో చంద్రుడు ఉంటే ఆ జాతకునిది చంద్రుడు ఉన్న స్థానం రాశి అవుతుంది. ఇప్పుడు వధువు జాతకచక్రంలో చంద్రుడు ఉన్న స్థానాధిపతి మరియు వరుడి జాతకచక్రంలో చంద్రుడు ఉన్న స్థానాధిపతి ఈ ఇద్దరు మిత్రువులా, శత్రువులా లేక సములా నిర్ణయించుకుని ఆ పట్టికలో రాశ్యాధిపతులు అనే గడిలో మిత్రులు అయితే మిత్రులు, సములు అయితే సములు లేక శత్రువులు అయితే శత్రువులు అని రాసుకోవాలి.

**3.** లగ్నకూటమి వధువరుల లగ్నాధిపతి మిత్రులైన ఆ లగ్నస్థానాలు కూటమి ఎలా ఉందో కూడా మనము పరిశీలించాలి. అలా పరిశీలించినప్పుడు వచ్చే ఫలితం అనుకూలము,మధ్యమము లేక ప్రతికూలము అవుతుంది. లగ్నకూటమి అనే గడిలో ఏ ఫలితం వచ్చిందో ఆ ఫలితం రాయాలి. ఈ లగ్నకూటమి ఎలా చూడాలో ఈ క్రింది పట్టి చూస్తే మీకు అర్థం అవుతుంది.

| రాశిపేరు | అనుకూలం | మధ్యమం | ప్రతికూలం |
|---|---|---|---|
| 1. మేషం | సింహం -ధనుస్సు | తుల | కర్కాటకం-మకరం |
| | మిథునం-వృశ్చికం | వృషభం | కన్య-మీనం-కుంభం |
| 2. వృషభం | కన్య-మకరం | వృశ్చికం | సింహం-కుంభం |
| | కర్కాటకం-మీనం | మిథునం | తుల-ధనస్సు-మేషం |
| 3. మిథునం | తుల-కుంభం | ధనస్సు | కన్య-మీనం |
| | సింహం-మేషం | కర్కాటకం | వృశ్చికం-మకరం-వృషభం |
| 4. కర్కాటకం | వృశ్చికం-మీనం | మకరం | తుల-మేషం |
| | కన్య-వృషభం | సింహం | ధనస్సు-కుంభం-మిథునం |
| 5. సింహం | మేషం-ధనుస్సు | కుంభం | వృశ్చికం -వృషభం |
| | తుల-మిథునం | కన్య | మకరం-మీనం-కర్కాటకం |
| 6. కన్య | మకరం-వృషభం | మీనం | ధనస్సు-మిథునం |
| | వృశ్చికం -కర్కాటకం | తుల | కుంభం-మేషం-సింహం |
| 7. తుల | కుంభం-మిథునం | మేషం | మకరం-కర్కాటకం |
| | ధనస్సు-సింహం | వృశ్చికం | మీనం-వృషభం-కన్య |
| 8. వృశ్చికం | మీనం-కర్కాటకం | వృషభం | కుంభం-సింహం |
| | మకరం -కన్య | ధనస్సు | మేషం-మిథునం-తుల |
| 9. ధనస్సు | మేషం-సింహం | మిథునం | మీనం-కన్య |
| | కుంభం-తుల | మకరం | వృషభం -కర్కాటకం-వృశ్చికం |
| 10. మకరం | వృషభం-కన్య | కర్కాటకం | మేషం-తుల |
| | మీనం-వృశ్చికం | కుంభం | మిథునం-సింహం-ధనస్సు |
| 11. కుంభం | మిథునం-తుల | సింహం | వృషభం - వృశ్చికం |
| | మేషం-ధనస్సు | మీనం | కన్య-మకరం-కర్కాటకం |
| 12. మీనం | కర్కాటకం -వృశ్చికం | కన్య | మిథునం-ధనస్సు |
| | వృషభం-మకరం | మేషం | తుల-సింహం-కుంభం |

పై పట్టికలో ఉన్నట్లుగా వధూవరుల పొంతనను పరిశీలించి లగ్నకూటమి గడిలోవచ్చినఫలితము అనుకూలము. మధ్యమము లేకప్రతికూలముఅని వ్రాసుకోవాలి.

## 4. వధూవరుల జాతకాలలో వారియొక్క తారాబలం :

జన్మనక్షత్రాలను బట్టి తారాబలం పొంతన కూడా చూడాలి. వధువు జన్మ నక్షత్రము నుంచి వరుని జన్మనక్షత్రము వరకు లెక్కపెట్టినప్పుడు ఆ వచ్చిన సంఖ్యను తొమ్మిదిచేత భాగించి శేషము సరిసంఖ్య వస్తే ఆ సంఖ్యను బట్టి తారాబలము ఎలా ఉందో నిర్ణయించాలి. శేషం ఒకటి వస్తే జన్మతార అవుతుంది. రెండు కనక వస్తే సంపత్తార అవుతుంది. మూడు వస్తే విపత్తార అవుతుంది. నాలుగు వస్తే క్షేమతార అవుతుంది. ఐదు వస్తే ప్రత్యక్తార అవుతుంది. ఆరు వస్తే సాధన తార అవుతుంది. ఏడువస్తే నైధన తార అవుతుంది. ఎనిమిది వస్తే మిత్రతార అవుతుంది. తొమ్మిది వస్తే పరమమిత్ర తార అవుతుంది. ఈ క్రింది పట్టికలో వధూవరుల నక్షత్రాల పొందికలో తారాబలం ఎలా ఫలితం ఇస్తుందో చూపబడింది. కాబట్టి తారాబలం ఏది మంచిదో ఏది విసర్జించాలో మీకు తేలికగా అర్థం అవుతుంది.

| శేషం | తారపేరు | ఫలితం | పొంతన |
|---|---|---|---|
| 1. | జన్మ తార | ఒకరి మరణం సంభవించవచ్చు | మంచిదికాదు |
| 2. | సంపత్తార | ధనం – అభివృద్ధి | మంచిది |
| 3. | విపత్తార | ప్రమాదాలు మొదలైనవి | మంచిది కాదు |
| 4. | క్షేమ తార | ప్రేమానురాగాలు | మంచిది |
| 5. | ప్రత్యక్ తార | కష్టాలు, కలహాలు | మంచిది కాదు |
| 6. | సాధన తార | అభివృద్ధి | మంచిది |
| 7. | నైధన తార | కష్టనష్టాలు | మంచిది కాదు |
| 8. | మిత్ర తార | ఇద్దరి మధ్య స్నేహభావం | మంచిది |
| 9. | పరమమిత్రతార | మిక్కిలి అనురాగం | మంచిది |

## 5. చంద్రస్థానం :

వధువు యొక్క జాతకంలో చంద్రుడు ఏ స్థానంలో ఉన్నాడో ఆ స్థానం నుంచి వరుని జాతక చక్రంలో చంద్రుడు ఏ స్థానంలో ఉన్నాడో ఆ స్థానం వరకు లెక్కపెట్టి చంద్రస్థానం అనే గడిలో లెక్కపెట్టగా వచ్చిన సంఖ్యను వేసుకోవాలి. ఒకవేళ ఇద్దరి

జాతకాలలోను చంద్రుడు ఒకే స్థానంలో ఉంటే ఆ ఇద్దరిది ఒకే రాశి అవుతుంది. అలా ఒకే రాశి అయినప్పుడు ఏకరాశి అని రాసుకోవాలి. ఇంకొక విషయం ఏమంటే వధూవరుల జాతకాల చక్రాలలో ఇద్దరి చంద్రులు వేరు వేరు రాశులలో ఉన్నా, ఆ రెండు రాశులకు అధిపతి ఒకరే అయినప్పుడు చంద్రస్థానం అని ఉన్న గడియలో "ఏకాధిపత్యం" అని రాసుకోవాలి. అంటే ఇద్దరి చంద్రస్థానాల ఆధిపత్యం ఒకరే కాబట్టి ఏకాధిపత్యం అంటారు. ఏకరాశి అయినా లేక ఏకాధిపత్యం అయినా ఆ గ్రహస్థితి శుభం అని మనం తెలుసుకోవాలి. ఒకవేళ కన్య చంద్రస్థానం నుంచి లెక్కపెట్టినప్పుడు వరుని యొక్క చంద్రస్థానం సప్తమస్థానం అయినప్పుడు ఆ వరుని స్థానం నుంచి కన్య చంద్రస్థానం మళ్ళీ సప్తమ స్థానమే అవుతుంది అంటే ఈ గ్రహస్థితిని సమసప్తమాలు అంటారు. దీనివల్ల ఆ దాంపత్య జీవితంలో సఖ్యత, అనురాగం, సహాయసహకారాలు ఉండి సంతోషకరమైన దాంపత్య జీవితం గడుపుతారని మనం గ్రహించాలి.

### 6. కాలసర్పదోషం :

వధువు జాతకంలో కాని లేక వరుని జాతకంలో కాని అన్ని గ్రహాలు రాహువు, కేతువు మధ్యలో బంధించబడి ఉంటే ఆ గ్రహస్థితిని కాలసర్ప దోషం అని అంటారు లేక నాగబంధన దోషం అని అంటారు. నాగబంధన అంటే రాహువు కేతువులు ఇద్దరు సర్పమే కాబట్టి ఈ మహాసర్పము మధ్యలో అన్ని గ్రహాలు బంధించబడి ఉండటం వల్ల దోషం ఏర్పడుతుంది. రాహువు, కేతువులు ఎప్పుడూ అపసవ్యంగానే చక్రభ్రమణం చేస్తారు. అంటే అన్ని గ్రహాలు సవ్యంగా తిరుగుతూ ఉంటే రాహువు, కేతువులు మాత్రం అపసవ్యంగా తిరుగుతారు. అందువల్ల కాలసర్ప దోషం నిర్ణయించేటప్పుడు సవ్యచక్రంలో అపసవ్యంగాను, అపసవ్య చక్రంలో సవ్యంగాను చూడాలి. రాహువు కేతువుల మధ్య ఏదైన ఒకరాశి శూన్యస్థానమైనా, లేక లగ్నం రాహువు కేతువుల మధ్య ఉన్నా లేకున్నా, మరియు రాహువు కేతువులతో ఏ గ్రహమైనా కలిసి ఉన్నా లేక రాహువు కేతువులు ఒంటరిగా ఉన్నా కాలసర్ప దోషం ఉందని మనం నిర్ణయించాలి. ఏ ఒక్క గ్రహం అయినా రాహువు కేతువుల మధ్యలో ఉండకుండా కేతువు రాహువుల మధ్యలో ఉంటే కాలసర్పదోషం భంగం అవుతుంది

(నేను రాసిన కాలసర్పదోషం అనే గ్రంథం చదివితే మీకు కాలసర్పదోషంలోని రకాలు వాటి ఫలితాలు మరియు ఆ దోష పరిహారాలు తెలుసు కోవచ్చు) ఇప్పుడు కాలసర్పదోషం గడిలో అబ్బాయికి ఉంటే అబ్బాయికి ఉంది అని రాసుకోవాలి. అలాగే అమ్మాయికి ఉంటే అమ్మాయికి ఉంది అని వ్రాసుకోవాలి. కాని పైవిధంగా కాకుండా ఊరికే ఉంది అని రాస్తే భవిష్యత్తులో ఎవరికి ఉందో తెలియదు కాబట్టి ఎవరికి ఉంటే వారికి ఉన్నట్లుగా వ్రాసుకోవాలి. కాలసర్పదోష నివారణార్థం రాహువు కేతువులకు ఎవరికి ఉంటే వారు వివాహానికి పూర్వమే పూజ చేయించుకోవాలి.

**7. మాంగల్యబలం :**

ముఖ్య విషయం ఏమంటే మాంగల్యబలం అంటే వధూవరుల దాంపత్య జీవితంలో వియోగం, విడాకులు, అక్రమ సంబంధాలు, దీర్ఘకాల మొండి వ్యాధులు ద్వికళత్ర దోషం లేక ద్వికళ్యాణ దోషము, మారకత్వ దోషం మరియు వైధవ్య, విధురత్వ దోషం వీటిలో ఏ ఒక్క దోషం ఉన్నా మాంగల్య దోషంగానే భావించాలి. ఈ మాంగల్యబలం గురించి వివరంగా ముందు అధ్యాయాలలో వివరించాను. మళ్ళీ ఇక్కడ వ్రాయటం అప్రస్తుతం కాబట్టి ముందు అధ్యాయాలు మీరు చదవండి.

**8. కుజదోషం :**

కుజదోషం అనేది ఎవరి జాతకచక్రంలో అయినా సరే తీవ్ర దుష్ఫలితాలు ఇస్తాయి. అంటే కుజుడు వల్ల వధూవరుల దాంపత్య జీవితం విచ్ఛిన్నమయిపోవడం, దీర్ఘకాల వియోగము, స్త్రీలకైతే పరపురుష సంబంధం, పురుషుడికైతే నీచ స్త్రీ సాంగత్యం, వైధవ్య దోషం లాంటి తీవ్రమైన దుష్ఫలితాలు కుజుని వల్ల కలుగుతాయి. ఈ కుజదోషాన్ని పరిశీలించేటప్పుడు చాలా జాగరూకత వహించాలి. ఇద్దరూ దోషం ఉన్నా లేక ఇద్దరిలో దోషం లేకపోయినా లేక ఇద్దరికీ దోషముండి పరిహారమైన వివాహం చేయవచ్చని అందరూ అంటూ ఉంటారు. ఇది కొంతవరకు నిజమైన పూర్తిగా సత్యము కాదు. ఎందుకంటే కుజదోషంలోని వ్యత్యాసాలు క్షుణ్ణంగా పరిశీలించాలి. ముందు అధ్యాయాల్లో నేను రాసిన కుజదోషం అనే అధ్యాయం మీరు పూర్తిగా చదివితే అన్ని వివరాలు మీకు తెలుస్తాయి. అయినా ఇక్కడ మౌలికంగా కొన్ని సూచనలు చేస్తున్నాను. ఒకటి వీక్షణ దోషం రెండు స్థితి దోషం మూడు

సంయోగ దోషం. ఈ మూడుగాని లేక ఈ మూడులో ఏదైన ఒకటి ఉన్నా కుజదోషం ఉన్నట్లే. ఇలా పరిశీలించి కుజదోషం ఎవరికి ఉంటే వారికి ఉన్నట్లుగా కుజదోషం అనే గడిలో అమ్మాయికి ఉంటే అమ్మాయికి ఉంది అని గాని లేక అబ్బాయికి ఉంటే అబ్బాయికి ఉంది అని గాని అదేకాక ఇద్దరికి ఉంది గాని లేక ఇద్దరికి లేదు అని గాని వ్రాసుకోవాలి.

## 9. ద్విద్వాదశ దోషం :

కన్య చంద్రస్థానం నుంచి లెక్కపెట్టినప్పుడు రెండవ రాశిలో చంద్రుడు ఉన్నట్లయితే అది ద్విద్వాదశ దోషం అవుతుంది. అంటే కన్య జాతకచక్రంలో చంద్రుడు ఏ రాశిలో ఉన్నాడో ఆ తర్వాత రాశిలో వరుని యొక్క జాతకచక్రంలో చంద్రుడు ఉండకూడదు. ఉదాహరణకు వధువుకు మీనరాశిలో చంద్రుడు ఉన్నప్పుడు తర్వాత రాశి మేషరాశి అవుతుంది. ఆ మేషరాశిలో చంద్రుడు ఉండకూడదు. అలా ఉంటే దోషమని, ఈ దోషం వల్ల ఆయుర్దాయం లోపం అని గ్రహించాలి, కాని వధువుకు చంద్రుడు ఉన్న రాశి అధిపతి గురువు. వరునికి చంద్రుడుఉన్న స్థానాధిపతి కుజుడు.

ఈ రాశ్యాధిపతులు మిత్రులు కాబట్టి ద్విద్వాశ దోషం ఉండదు మనం గ్రహించాలి. అలా మిత్రులు అయితే ద్విద్వాశ దోషం అనే గడిలో "శుభ ద్విద్వాశము" అని రాసుకోవాలి. ఆ ఇద్దరు మిత్రులు కాక సములైతే నవాంశ చక్రం పరిశీలించాలి. అక్కడ కూడాసములైతే ద్విద్వాశ దోషం ఉన్నట్లే. శత్రువులైతే ద్విద్వాదశ దోషం ఉన్నట్లే.

## 10. నవపంచమ దోషం :

వధువు యొక్క జాతకచక్రంలో చంద్రస్థానం నుంచి వరుని యొక్క జాతక చక్రంలో చంద్రస్థానం ఉన్న రాశి వరకు లెక్కపెట్టినప్పుడు వరుని స్థానం పంచమస్థానం కాకూడదు. అలా అయితే మిత్రులా, సములా, శత్రువులా అని చూసి నవపంచమ దోషం అనే గడిలో దోషం ఉంటే ఉంది అని లేకపోతే లేదు అని వ్రాసుకోవాలి.

## 11. షష్టాష్టక దోషం :

వధువు చంద్రస్థానం నుంచి వరుని యొక్క చంద్రస్థానం వరకు లెక్కపెట్టి నప్పుడు వరుని జాతకచక్రంలో చంద్రుడు ఉన్న స్థానం ఆరవ స్థానం కాకూడదు. అలా అయితే దోషం అని గ్రహించాలి. అపుడు మిత్రులా, శత్రువులా, సములా అని

చూసి దాని ఫలితం షష్టాష్టక దోషం అనే గడిలో దోషం ఉంటే ఉందని లేకపోతే లేదని వ్రాసుకోవాలి.

## 12. వధువు/వరుల ద్వితీయం :

ఎవరి జాతక చక్రంలో అయినా సరే ద్వితీయ స్థానంలో మనం వారియొక్క ధనాఢ్యక మరియు కుటుంబ పరిస్థితి తెలుసుకోవచ్చు అంటే లగ్నం నుంచి రెండవ స్థానంలో పుణ్యగ్రహాలు ఉన్నా, లేక ఉన్న గ్రహాలు మీద శుభగ్రహవీక్షణ ఉన్నా వారి కుటుంబస్థితి మేలుగా ఉంటుందని మరియు ధనలోపం ఉండదని గ్రహించాలి. ఇప్పుడు వధువు యొక్క జాతకచక్రంలో పుణ్యగ్రహాలు ఉండి వరుని జాతకచక్రంలో సమగ్రహాలు ఉన్నా, వారి ద్వితీయ స్థానాలు మేలు చేస్తాయనే భావించాలి. ఒకవేళ శుభగ్రహాలు ఉన్నా, ఆ గ్రహాలు వక్రగతి పొంది ఉన్నట్లయితే శుభఫలితాలు ఇవ్వవు. ఇద్దరి ద్వితీయ భావములో పాపగ్రహాలు ఉంటే దాని మీద శుభవీక్షణ లేకుండా ఉన్నప్పుడు వారి కుటుంబస్థితి బావుండదని నిర్ణయించాలి. అందువల్ల వధువు జాతక చక్రంలో పన్నెండవ గడిలో "వధువు/వరుని" ద్వితీయ స్థానంలో వధువు ద్వితీయ స్థానంలో ఏ గ్రహాలు ఉన్నాయో వ్రాసుకోవాలి. అలాగే వరుని జాతక చక్రంలో అతని ద్వితీయ స్థానములో ఏ గ్రహాలు ఉన్నాయో కూడా వ్రాసుకోవాలి. ఉదాహరణకు వధువు ద్వితీయ రాశిలో గురువు, కేతువు ఉన్నప్పుడు అలానే వరుని జాతకచక్రంలో ద్వితీయ స్థానంలో బుధుడు, శుక్రుడు ఉన్నప్పుడు "గురువు, కేతువు/ బుధుడు, శుక్రుడు అని వ్రాసుకోవాలి. ఇలా వ్రాసుకొన్నందువల్ల వారిద్దరి ద్వితీయ రాశులలో మిత్రగ్రహాలే ఉన్నాయి కాబట్టి కుటుంబ భావం మరియు ధన భావం శుభంగా ఉందని నిర్ణయించాలి.

## 13. వధువు/వరుల పంచమం :

పైన చెప్పిన విధంగానే ఇద్దరి పంచమస్థానాలలో గ్రహాలను యధాతథంగా వ్రాసుకోవాలి. అప్పుడు పంచమ భావం సంతానం గురించి తెలుసుకోవచ్చు. కాబట్టి ఆ గ్రహస్థితి బట్టి వారికి సంతానం ఉంటుందా, ఉండదా అని నిర్ణయించాలి. ముఖ్యవిషయం ఏమంటే స్త్రీ జాతకంలోని పంచమ స్థానంలో రాహువు ఉంటే ఆ స్త్రీకి సాధారణంగా ప్రధమ గర్భం విచ్ఛిన్నమైపోతుంది. అంటే ఆ స్త్రీకి మొదటి

గర్భం ఫలించక గర్భస్రావము అయిపోతుందని తెలుసుకోవాలి. అలాగే గురువు ఉన్నా కూడా అశుభ ఫలితం కలగొచ్చు. ఎందుకంటే “కారకోభావనాశాయ” అనే సూక్తి ప్రకారం పుత్రసంతానం లేకపోవచ్చు. ఒకవేళ రాహువు, గురువులిద్దరు కలిసి ఉంటే పైగా పాపవీక్షణ కూడా ఉంటే ఆ స్త్రీని గొడ్రాలిగా చెప్పవచ్చు. ఎందుకంటే ఆమెకు సంతానయోగం ఉండదు. ఒకవేళ గర్భం వచ్చినా గర్భస్రావం మృతశిశువు జన్మించటం లేక జన్మించిన శిశువు మరణించడంలాంటి దుష్ఫలితాలు సంభవిస్తాయి. ఒకవేళ పురుషుని పంచమ భావం బలంగా ఉంటే స్త్రీ సంతానం ఉండచ్చు కాని పురుష సంతానం మాత్రం ఉండదు.

## 14. వధువు/వరుల సప్తమ స్థానం :

ఎవరి జాతకంలో అయినాసరే సప్తమ స్థానం కళత్రస్థానంగా చెప్పబడుతుంది అంటే జీవిత భాగస్వామి యొక్క గుణగణాలు దాంపత్య జీవిత సరళి తెలుసుకోవచ్చు. ఈ సప్తమ స్థానంలో పాపగ్రహాలు ఉండకూడదు. ముఖ్యంగా కుజుడు లేక కుజశుక్రుల కలయిక మరియు శుక్రుడు ఉండి దాని మీద కుజవీక్షణ ఉన్నా, వారి వివాహ జీవితం దుఃఖమయమైపోతుంది. ఎందుకంటే వారి మధ్య వైషమ్యాలు బలంగా పెరిగి తప్పకుండా విడాకులు తీసుకుంటారు.

## 15. వధువు/వరుల అష్టమ స్థానం :

వధూవరుల జాతకంలో అష్టమస్థానం ఆయుర్దాయం గురించి చెబుతుంది. కాబట్టి ఆ స్థానంలో పాపగ్రహాలు ఉండటం కాని పుణ్యగ్రహాలు ఉన్నా వక్రగతి పొందటం కాని పాపవీక్షణ ఉండటం కాని లేక రెండుకంటె ఎక్కువ పాపగ్రహాలు ఉండటం కాని శుభంకాదు. కాబట్టి అష్టమ స్థానాన్ని మనం జాగ్రత్తగా పరిశీలించాలి. ఈ స్థానం ముఖ్యంగా ఆయుర్దాయం గురించి చెపుతుంది. కాబట్టి ముందు అధ్యాయాల్లో వ్రాసిన వైధవ్యదోషం ద్వికళత్ర దోషం బాగా నేర్చుకోవాలి. ఈ స్థానం నిర్ణయ విషయం ఎట్టి అలక్ష్యం పనికిరాదు.

## 16. గుణమేళన :

ప్రస్తుత కాలంలో అందరూ ఈ గుణమేళనను ప్రజలు పంచాంగంలో పాయింట్లు అని వ్యవహరిస్తున్నారు. ఈ పాయింట్లు పూర్తిగా ఉపయుక్తము కాదు

మరియు శాస్త్ర సమ్మతము కాదు. ఎందుకంటే ఈ పాయింట్లలో కొన్ని అంశాలు మాత్రమే తీసుకొని మిగిలిన గుణమేళన అంటే పాయింట్లు ఎన్ని వచ్చాయి అనే ధోరణే తప్ప అతి ముఖ్యాంశాలను వదిలివేయటం వల్ల మనకు పూర్తి గ్రహస్థితి, ఆ గ్రహాలు ఇచ్చే ఫలితాలు ఎవ్వరూ చదవటం లేదు. దీనివల్ల మేలాపకం దోషభూయిష్టమై అశుభ ఫలితాలు ప్రతిబింబిస్తున్నాయి. కాబట్టి గుణమేళనంలో మార్కుల ప్రాధాన్యం మనం చూడకూడదు. ఎందుకంటే ఇద్దరి మనుష్యుల మధ్య ఉండే ప్రేమ, వాత్సల్యం, అనురాగం, సఖ్యతలను కొలవడానికి గ్రహస్థితి పరిశీలనే ముఖ్యముగాని మార్కులు పర్సంటేజీలు పనికిరావు అని అందరూ గ్రహించాలి. నేను వ్రాసిన "జాతక కళ్యాణ విశ్లేషణ" పుస్తకంలో "పంచాంగంలో పాయింట్లు" అనే అధ్యాయం పూర్తిగా చదవండి.

## 17. గణపొంతన :

శాస్త్రరీత్యా మానవుల గుణగణాలను మూడు విధములుగా విభజింపబడ్డాయి. అవి (1) దైవము, (2) మానవ (3) రాక్షస. మౌలికంగా వారి యొక్క మనస్సులోని ఆంతర్యం గ్రహించడానికి విభజన ఎక్కువగా తోడ్పడుతుందనేది సత్యము. అంటే రాక్షస గణమైనప్పుడు ఆ జాతకుడు లేక ఆ జాతకురాలు రాక్షసులు అని అర్థం కాదు. కాని వారి మనస్తత్వ రీత్యా కాఠిన్యము, పట్టుదల, మూర్ఖత్వము, దౌర్జన్యము మొదలగునవి మనము గ్రహస్థితిని బట్టి అర్థము చేసుకోవచ్చును. అలాగే మానవ, దైవ గణములను కూడా వారి గ్రహస్థితులను బట్టి ఊహించగలము. చాలామంది రాక్షసగణము కలిగిన వరునితో మానవ లేక దైవ గణమును కలిగిన కన్యతో వివాహము చేయకూడదని వాదిస్తూంటారు. ఈ వాదన సరికాదు, ఎందుకంటే ఈ పొంతన పరిశీలించేటప్పుడు కొన్ని పరిహారాలు కూడా శాస్త్రప్రకారం ఈయబడ్డాయి. అందువల్ల పరిహారములు విశ్లేషించుకొని జాతకపొంతన చూడాలి. ఉదాహరణకు ఇద్దరి యొక్క రాశులు ఒకటే అయినప్పుడు కాని అలాగే ఏకలగ్నమయినప్పుడు కాని మరియు కొన్ని నక్షత్రములకు రాక్షసదోషమైన పరిహారములు చెప్పబడ్డాయి. ఉదాహరణకు ఆశ్లేష, చిత్త, విశాఖ, జ్యేష్ఠ, మూల శతభిషం ఇలాంటి నక్షత్రాలలో స్త్రీకి, రాక్షసగణమైనను దోషం లేదు. అలాగే నాడి దోషం లేనప్పుడు, గ్రహమిత్రత్వం ఉన్నప్పుడు స్త్రీలకు రాక్షసగణదోషం ఉండదు. కాబట్టి మీరు ఈ విషయం గమనించాలి.

## 18. నాడిదోషం :

ఈ దోషం చాలా తీవ్రమైనదిగా భావించాలి. ఎందుకంటే ఇది ఆరోగ్యపరంగా నిర్ణయించే అంశము. కాబట్టి ఎటువంటి అలక్ష్యము పనికిరాదు. నాడి దోషమును మూడు విధాలుగా వర్ణించారు. (1) ఆదినాడి (2) మధ్యమనాడి (3) అంత్యనాడి. వధూవరుల ఇద్దరి యొక్క నక్షత్రాలు ఒకే నాడి కాకూడదు. అలా అయితే మారకత్వం సంభవిస్తుందని పండితాభిప్రాయం కాబట్టి మనము నాడి దోషము ఉన్నప్పుడు వివాహము వారి ఇద్దరి మధ్య చేయకూడదు. కాని ఈ దోషానికి పరిహారాలు పండితులు విపులంగా విశదీకరించారు.

నాడి అంటే గుండె కొట్టుకోవడం మనకు నరాలరీత్యా తెలుస్తుంది. ఆయుర్వేద శాస్త్రంలో గాని లేక ఏ వైద్యుడైన నాడిని పరీక్షించినప్పుడు ఆ నాడి చలనం వలన ఆ రోగి గుండె ఎలా కొట్టుకుంటుందో అర్థం చేసుకుంటాడు. దాన్ని బట్టి వాతనాడి, పిత్తనాడి మరియు శ్లేష్మనాడి అని గ్రహిస్తాడు. వాతనాడి వల్ల అతని మనస్తత్వం మరియు శరీరములోని వాతవాయువు గమనిస్తాడు. అలాగే శ్లేష్మనాడి వల్ల ఆ రోగి శరీరములోని శ్లేష్మమునకు సంబంధించిన వ్యాధులను గుర్తిస్తాడు. దానివల్ల దంపతుల శరీర ఆరోగ్యమును గమనించి వారి ఇద్దరి కలయిక వల్ల సంతానము మరియు సంభోగ వ్యాధులు నిర్ణయిస్తారు. కాబట్టి నాడిదోషము ఉన్నప్పుడు ఆ దోష పరిహారం ఉందా లేదా అని చూడాలి. అంటే వధూవరుల ఇద్దరి నక్షత్రాలు ఏకనాడి అయిన వారి శరీరతత్వములు జన్మవల్ల అంటే నక్షత్రరీత్యా పొంతన కుదురుతుంది. అలా పొంతన కుదిరినప్పుడు వారికి వివాహము చేయవచ్చు. మీ సౌలభ్యం కోసం ఈ క్రింద ఏ నక్షత్రాలు ఒకే నాడిలో ఉన్నా చేయవచ్చో వ్రాస్తున్నాను.

**1. ఆదినాడి** – ఉత్తర, శతభిషం, పూర్వాభాద్ర, పునర్వసు, ఆరుద్ర, మూల, అశ్వని, నక్షత్రములలో దంపతుల నక్షత్రములు ఉండినను ఏకనాడి అయినా కూడా వివాహము చేయవచ్చు.

**2. మధ్యనాడి** – పూర్వాషాఢ, అనూరాధ, ధనిష్ట పుష్యమి, చిత్త, పుబ్బ, మృగశిర, నక్షత్రములలో దంపతుల నక్షత్రము ఉండినను మధ్యమనాడి దోషము ఉండదు.

**3. అంత్యనాడి** – కృత్తిక, విశాఖ, ఆశ్లేష, శ్రవణం, మఖ, ఉత్తరాషాఢ, రోహిణి నక్షత్రములలో దంపతుల ఇద్దరి నక్షత్రములు ఉన్ననూ అంత్యనాడి దోషము ఉండదు.

పంచాంగములో ఇచ్చే వధూవరుల నాడిదోషానికి ఎనిమిది పాయింట్లు ఇచ్చారు అంటే ఈ నాడి విషయానికి ఎంత ప్రాముఖ్యత ఇచ్చారో మనము అర్థం చేసుకోవాలి. ముఖ్యంగా మధ్యమనాడి వల్ల మారకత్వం వస్తుంది కాబట్టి. ఈ విషయాన్ని తేలికగా తీసుకోకూడదు. కాని నాడీదోషానికి పరిహారాలు కూడా ఉన్నాయి. నాడి దోషమున్నపుడు పరిహారం అయిందా లేదా అనే విషయాన్ని పరిశీలించిగాని ఒక నిర్ణయానికి రాకూడదు.

## 19. మృగవైరం :

ఈ మృగ వైరము వల్ల వధూవరుల దాంపత్య జీవితంలో వారికి సఖ్యతఎలా ఉంటుందో నిర్ణయించుకోవచ్చు. వధూవరుల ఇద్దరి పరస్పర మృగవైరం వల్ల సుఖసంతోషాలు లేకపోవడం,అసంతృప్తి కలుగుతాయి. ఎందుకంటే సఖ్యత లేని జీవనం వారిలో మానసిక దౌర్బల్యాన్ని ప్రకోపిస్తుంది. ఈ మృగవైరాన్ని కొందరు యోనిపొందిక అని కూడా అంటారు. అంటే ఇద్దరి మధ్య శారీరక ఎలా ఉంటుందో నిర్ణయించు కోవచ్చు. తర్వాత ఒకవేళ ఇద్దరిది ఏకమృగం అయితే శుభం అని మనముగ్రహించాలి. గ్రహ మైత్రి పొంతన బాగాఉన్నప్పుడు ఈ విషయానికి అంత ప్రాముఖ్యత ఇవ్వనవసరము లేదు.

## 20. లగ్నాధిపతి నివాసం :

వధువు జాతకంలో కాని లేక వరుని జాతకంలో కాని వారి వారి లగ్నాధిపతులు వారి జాతక చక్రంలో షష్టమ, అష్టమ మరియు ద్వాదశ రాశులలో ఉండకూడదు. ఎందుకంటే లగ్నాధిపతి షష్టమం రాశిలో ఉంటే అనారోగ్యం మరియు రుగ్మతతో దీర్ఘకాలం బాధపడడం వల్ల సరియైన దాంపత్య జీవితం ఉండదు. అష్టమ రాశిలోఉంటే మూర్ఖ ప్రవర్తన, వితండవాదాలతో భార్యను హింసిస్తారు. శృతి మించిన కామవాంఛతో భార్యను వేధిస్తాడు. ఇక ద్వాదశరాశిలో ఉంటే దారిద్ర్యంకు లోనవుతారు. వివేక శూన్యులై ఆవేశంగా ప్రవర్తిస్తారు. లగ్నాధిపతి శత్రుక్షేత్రంలో ఉన్నా, పాప గ్రహాలతో సంయోగం చెంది ఉన్నా, పాపవీక్షణ ఉన్నా అది లోపమే అని అర్థం చేసుకోవాలి.

**21. సప్తమాధిపతి స్థితి :**

(a) సప్తమాధిపతి లగ్నంలో ఉండకూడదు.

(b) సప్తమాధిపతి అష్టమములో ఉండకూడదు.

(c) సప్తమాధిపతి వక్రగతి పొంది ఉండకూడదు. ఒకవేళ సప్తమాధిపతి పాపగ్రహమైతే వక్రగతి వల్ల పుణ్యఫలితాలనిస్తాడు.

(d) సప్తమాధిపతి శత్రుక్షేత్రంలో ఉండకూడదు. అలాగే శత్రువీక్షణగాని లేక పాపవీక్షణగాని ఉండకూడదు.

(e) సప్తమాధిపతితో కుజ సంయోగం చాలా దుష్ఫలితాలు ఇస్తాయి.

**22. అష్టమాధిపతి స్థితి :**

(a) అష్టమాధిపతి సప్తమములో ఉండకూడదు.

(b) అష్టమాధిపతి పాపగ్రహాలతో కలిసి ఉండకూడదు.

(c) అష్టమాధిపతి శత్రుక్షేత్రంలో ఉండకూడదు.

(d) అష్టమాధిపతి ద్వితీయ స్థానంలో ఉండకూడదు.

**23. రజ్జు దోషం :**

రజ్జు దోషం అంటే మనకున్న 27 నక్షత్రాలను నాలుగు భాగాలుగా విభజించారు. (1) శిరోరజ్జు (2) కంఠ రజ్జు (3) నాభి లేక ఉదరరజ్జు (4) పాదరజ్జు వధూవరుల ఇద్దరి నక్షత్రాలు ఏకరజ్జు కాకూడదు. ఈ క్రింద పట్టిక చూడండి.

**సంఖ్య రజ్జుపేరు రజ్జుదోషం ఉన్న నక్షత్రాలు**

1. శిరోరజ్జు : మృగశిర – చిత్త – ధనిష్ట
2. కంఠరజ్జు : రోహిణి–ఆరుద్ర, హస్త–స్వాతి,శ్రవణం–శతభిషం
3. నాభిరజ్జు :కృత్తిక, పునర్వసు– ఉత్తర–విశాఖ, ఉత్తరాషాఢ–పూర్వాభాద్ర.
4. ఊరువు : రజ్జు భరణి, పుష్యమి–పుబ్బ–అనూరాధా– పూర్వాషాఢ–ఉత్తరాభాద్ర.
5. పాదరజ్జు : అశ్విని,–ఆశ్లేష–మఖ–జ్యేష్ట–మూల–రేవతి

గ్రహమైత్రి శుభమైనప్పుడు గాని, ఏకాధిపత్యం లగ్నరీత్యాగాని, రాశిరీత్యాగాని

అయినప్పుడు లేక ఏకరాశి, ఏక లగ్నం అయినప్పుడు రజ్జు దోషం ఉండదు.

శిరోరజ్జు మరియు కంఠరజ్జు ఈ రెండూ మారకత్వాన్ని సూచిస్తాయి. అంటే వధూవరులిద్దరిది ఏకరజ్జు కాకూడదు. ఒకరి రజ్జు శిరోరజ్జు అయినపుడు మరొకరిది వేరే రజ్జు కావాలిగాని అదే రజ్జు కాకూడదు. అలాగే పైన పట్టికలో చూపిన విధంగా ఒకే రజ్జులో ఉన్న నక్షత్రాలతో వధూవరుల నక్షత్రాలు ఉండకూడదని గ్రహించాలి.

ఈ అధ్యాయంలో నేను అన్ని విషయాలు ఒక క్రమపద్ధతిలో వ్రాసినా, అన్ని విషయాలు సూక్ష్మంగానే వ్రాయటం జరిగింది. ఎందుకంటే ఈ జాతక పరిశీలన మీద నేను అదే ఒక ముఖ్య అంశంగా తీసుకొని "కళ్యాణ జాతక విశ్లేషణ" అంటే కళ్యాణము కొరకు జాతకములను ఎలా విశ్లేషించాలి అనే వివరణతో ప్రత్యేకముగా ఒక పుస్తకము వ్రాసాను కాబట్టి అన్ని విషయాలు కూలంకషంగా తెలుసుకోదలచినవారు మరియు ఔత్సాహికులు ఆ పుస్తకం చదివితే వారికి అన్ని విషయాలు చక్కగా బోధపడుతాయి.

# అధ్యాయం - 13

## జాతకంలో దోషాలు

ముందు అధ్యాయంలో మనం వధూవరుల పొంతనలో ఎన్ని ముఖ్యాంశాలు చూడాలోఅవిఎలా చూడాలో తెలుసుకున్నాము.నేను పైన చెప్పిన అంశములు అన్నియు ముఖ్యమైనవి. మరికొన్ని అత్యంత ప్రధానమైన విషయాలు కూడా చూడాలి. అవి వైధవ్యప్రారబ్ధం, మారకత్వ దోషం మరియు ద్వికళత్రదోషం లాంటివి. ఇవి చాలా తీవ్రమైన దోషాలు. ఎందుకంటే మారకత్వం కంటే మిక్కిలి దోషం ఇంకొకటి ఉండదు. అందువల్ల నేనుయిప్పుడు వైధవ్య దోషం ఎలా చూడాలోఒక క్రమపద్ధతిలో ఇస్తున్నాను.

1. ఏ జాతకంలోనైనా లగ్నస్థానంలో కుజుడు ఉండి ద్వితీయ స్థానంలో గాని లేక సప్తమ స్థానంలో శనిగ్రహంగాని లేక కేతుగ్రహం కాని ఈ ఇద్దరు కలిసి ఉన్న లేక ఒంటరిగా ఉన్నా వైధవ్యదోషం విధురదోషం సంప్రాప్తిస్తుంది.
2. ఎవరి జాతకంలోనైనా అష్టమస్థానంలో శని ఉండి ద్వితీయంలో గాని సప్తమంలోగాని కుజుడు ఉంటే వైధవ్య లేక విధురత్వ దోషం కలుగుతుంది.
3. సప్తమాధిపతి మరియు అష్టమాధిపతి కలిసి కేంద్రస్థానాల్లో ఉండటం తీవ్రదోషం.
4. సప్తమాధిపతి శనితో కలిసి ఉండి దాని మీద కుజవీక్షణ ఉంటే దోషమని గ్రహించాలి.
5. అష్టమ స్థానంలో కుజరాహులు ఉంటే దోషమే.
6. అష్టమాధిపతి సప్తమాధిపతి కలిసి కుజునితో కలిసి ఉండకూడదు.
7. అష్టమంలో చంద్రరాహులు కలిసి ఉండరాదు.
8. అష్టమంలో శని రాహువు కుజుడు ఈ మూడు పాపగ్రహాలు కలిసి ఉండటం మిక్కిలి దోషం.
9. నవమాధిపతి, గురువు ఈ ఇద్దరు రవితో కలిసి ఉండడం మిక్కిలి దోషం. ఒకవేళ షష్టమ, అష్టమ, ద్వాదశ స్థానాలలో నవమాధిపతి, గురువు, రవి

కలిసి ఉంటే నవమాధిపతి మహర్దశ వచ్చినపుడు వైధవ్యం కలుగుతుంది.

10. సప్తమంలో కుజశనుల కలయిక కూడా అశుభఫలితం యిస్తుంది.


11. సప్తమాధిపతి మీద కుజశనుల వీక్షణ వల్ల దోషం ఉంటుంది.


12. సప్తమాధిపతి, అష్టమాధిపతి మరియు కుజుడు కలిసి ఏ జాతక చక్రంలో ఏ రాశిలో ఉండరాదు. అలా ఉంటే తీవ్ర దోషమని గ్రహించాలి.

13. సప్తమంలోగాని అష్టమంలోగాని కుజశని రాహుల కలయిక మిక్కిలి దోషం.

14. లగ్నంలో కుజుడు ఉండి ద్వితీయంలో గాని సప్తమంలోగాని శనికేతువులు ఇద్దరు గాని లేక ఏ ఒక్కరు గాని వైధవ్య దోషం ఉంటుంది.

15. కోణస్థానాలలో అన్నిటిలోను పాపగ్రహాలు ఉండటం తీవ్రదోషంగా పరిగణించాలి. కేంద్రస్థానాలంటే లగ్న, సప్తమ మరియు నవమ స్థానాలని మనకు ముందే తెలుసుకున్నాము. ఇలా ఉంటే కూడా వైధవ్య దోషమనే మనం అర్థం చేసుకోవాలి. ఈ క్రింది చక్రం చూడండి.






పై చక్రంలో లగ్నం మీనరాశి అయినది. ఈ లగ్న స్థానంలో కుజుడు ఉన్నాడు. పంచమ స్థానం కర్కాటకం అయినది. ఈ పంచమ స్థానంలో పాపగ్రహమైన శని ఉన్నాడు. ఇక నవమ స్థానము వృశ్చిక రాశి అయినది. ఈ వృశ్చిక స్థానములో పాపగ్రహమైన రవిచంద్రులు కలిసి ఉన్నారు. అంటే అన్ని కోణస్థానాలు పాపగ్రహాలలోనే ఉన్నాయి. కాబట్టి ఈ గ్రహస్థితి మిక్కిలి దోష ఫలితాలు ఇస్తాయని మనం గ్రహించాలి.

16. లగ్నంలో రెండు పాపగ్రహాలు ఉన్నా శుభప్రదమని వెంటనే భావించకూడదు. ఈ రెండూ శుభగ్రహాలయిన పరస్పర శత్రుగ్రహాలుగా ఉండకూడదు.

చక్రం -1






గురుబుధుల శత్రుత్వం




గురుబుధుల శత్రుత్వం

అలాగే ఈ రెండూ శుభగ్రహాలైనా కుజునితోగాని శని, రాహువులతోగాని కలిసి ఉండకూడదు. ఇంకొక విషయంలో ఏమంటే ఎప్పుడైనా సరే లగ్నస్థానంలో శుభగ్రహం ఉన్నా, ఆ శుభగ్రహం లగ్నాధిపతికి శత్రువు కాకూడదు. ఈ క్రింది చక్రం గమనించండి.









పై చక్రంలో బుధశుక్రులు ఇద్దరూ పరస్పర మిత్రులే పైగా శుక్రుడు మిత్ర క్షేత్రంలో మిత్రునితో కలిసి ఉన్నాడు. కాని ఈ బుధ శుక్రులు పుణ్యగ్రహాలైనా కూడా పాపగ్రహమైన కుజుని సంయోగం వల్ల దుష్ఫలితాలే వస్తాయి.

చక్రం మూడు పరిశీలించండి.

చక్రం -3




ఈ చక్రంలో లగ్నం సింహ లగ్నం అయినది. ఈ సింహలగ్నానికి అధిపతి రవి. లగ్నంలో పుణ్యగ్రహమైన శుక్రుడు ఉన్నాడు. కాని లగ్నాధిపతి అయిన రవి శుక్రునికి శత్రువు కాబట్టి దోషమే.

# అధ్యాయం - 14

## పుత్రసంతానం

జాతకపొంతన పరిశీలించి వధూవరుల జాతకాలు బాగా కుదిరినవని చెప్పినా వివాహం అయిన తరువాత వీరికి పుత్రసతానం ఉంటుందాయని అడుగుతారు. సహజంగా ప్రతివారు తమ పుత్రునికి పుత్రసంతానం ఉండాలని కోరుకుంటారు. అలా అడిగినప్పుడు పుత్రసంతానం కలుగుతుందో లేదో మనం జాతకాలను పరిశీలించి చెప్పవచ్చు. పుత్ర సంతానహీనత వధూవరుల జాతకాలలో గ్రహశక్తి ఎలా ఉంటుందో ఈ క్రింద వివరిస్తున్నాను.

1) పంచమస్థానంలో శని రాహుల కలయిక వల్ల పుత్రసంతానం ఉండదు.

2) పంచమాధిపతి పాపగ్రహమై పంచమస్థానంలో పాపగ్రహాలు ఉంటే పుత్రసంతానం ఉండదు.

3) పంచమాధిపతి పాపగ్రహమైదాని మీద రాహువీక్షణ ఉంటే పుత్ర సంతానం ఉండదు.

4) పంచమస్థానంలో గురు రాహువుల కలయిక వల్ల పుత్రసంతానం ఉండదు.

5) పంచమాధిపతి భంగపడితే అంటే ఆ పంచమాధిపతి పాపగ్రహమై పాపగ్రహాలతో కలిసి ఉన్నా లేక పుణ్యగ్రహం పంచమస్థానంలో ఉండి దాని మీద పాపవీక్షణం ఉండి లేక ఆ పుణ్యగ్రహానికి పంచమస్థానం శతృక్షేత్రమైనా, పురుష సంతానం ఉండదు.

6) వధూవరుల జాతకాలలో ఇద్దరివి పంచమ స్థానాలు బుధక్షేత్రాలు అయితే పుత్రసంతానం కల్గదు. అంటే వధూవరుల పంచమస్థానాలు మిధున కన్యారాశులు కాకూడదని గ్రహించాలి.

7) లగ్నాధిపతి రాహువు కలిసి పంచమస్థానంలో ఉండకూడదు. అలాగే పంచమాధిపతి మరియు రాహువు కలిసి పంచమస్థానంలో ఉండరాదు.

8) రవి రాహువు కలిసి సప్తమ స్థానంలో ఉండకూడదు.

9) పంచమాధిపతి పురుషగ్రహమై మరొకరికి కూడ పంచమాధిపతి పురుషగ్రహమై యీ ఇద్దరి యొక్క లగ్నాధిపతులు పురుష గ్రహాలు అయినా లేక పురుషస్థానాలు అయినా పుత్రసంతానం ఉండదు.

ఇంతవరకు మీ సౌలభ్యం కోసం కొన్ని ముఖ్యాంశాలే ప్రస్తావించాను. కాని విపులంగా శాస్త్రచర్చ చెయ్యలేదు.

## జాతకపొంతనలో ఇతర అంశాలు

మానవ జీవితాలలో ఎవరికైనా సరే ఒకే గ్రహదశ ఉండదు. గ్రహదశ మారుతూనే ఉంటుంది. ఒక్కొక్క గ్రహ దశకు ఒక్కొక్క నిర్ణీత సమయం ఉంటుంది. ఒక దశ పూర్తి అయిన తర్వాత మరియొక దశ ప్రారంభమవుతుంది. ఒకవేళ పాపగ్రహదశ వస్తే పాపగ్రహం వల్ల ఆ జాతకుడు పీడించబడవచ్చు. అదే జాతకుడు మళ్ళీ శుభగ్రహదశ వచ్చినప్పుడు శుభ ఫలితాలను పొందుతాడు. అందువల్లే, మానవ జీవితంలో సుఖదుఃఖాలు అనేవి రెండూ ప్రతివారు అనుభవిస్తూనే ఉంటారు. కొందరికి శుభదశలు వరుసగా వస్తాయి. అలాంటప్పుడు ఆ కాలమంతా సుఖసంతోషాల సౌభాగ్యంతో గడిచిపోతుంది. ఆ శుభగ్రహాలు తమ సంచారం పూర్తి చేసుకున్న తర్వాత పాపగ్రహాల దశలు ప్రారంభమయినప్పుడు, దుష్ఫలితాలు అనుభవించక తప్పదు.

ఒక గ్రహాంతర దశ పూర్తి చేసుకుని మరియొక్క రాశిలోకి మారే అంత్య సమయంలోనూ, మరియొక గ్రహం క్రొత్తగా ప్రవేశించే దశా సమయానికి ఉన్న మధ్యకాలాన్ని దశాసంధి అంటారు. ఒక్కొక్కప్పుడు ఈ సమయం చాలా దుష్ఫలితాలు ఇవ్వవచ్చు. ఎలాగంటే ఒక గ్రహం తన దశను పూర్తి చేసుకొని వెళ్లే గ్రహము పాపగ్రహమై దాని స్థానంలో క్రొత్తగా ప్రవేశించే గ్రహం కూడా పాపగ్రహమైనప్పుడు ఈ రెండు గ్రహాలు మారే మధ్య సంధికాలం చాలా దుష్ఫలితాలు ఇస్తాయి. అందువల్ల వధూవరుల జాతకాలలో గ్రహదశ సమయమార్పు కూడా కొంతమంది చూస్తారు. కాని వధూవరుల ఆయుస్థానం బలంగా ఉన్నా, క్రొత్తగా వచ్చే గ్రహం తన ఉచ్ఛస్థానంలోకి ప్రవేశిస్తున్నా, లేక ఆ గ్రహాలు వర్గోత్తమమైనా దుష్ఫలితాలు ఉండవు.

అలాగే గ్రహాల పరివర్తన అయినా దోషము కాదు. ముఖ్య విషయం ఏమంటే వధూవరుల జాతక చక్ర పరిశీలనలో ఇది అంత ముఖ్యము కాదు. మరియు దీనిని గొప్ప అంశంగా తీసుకొని భయపడనవసరము లేదు.

## స్త్రీ దీర్ఘము

స్త్రీ దీర్ఘములో వధువుకు నక్షత్రం నుంచి వరుని నక్షత్రం వరకు లెక్కపెట్టినపుడు వరుని నక్షత్రం పదమూడవ నక్షత్రం తర్వాత ఉండాలని చెబుతుంది. అంటే మనకున్న 27 నక్షత్రాలలో 13 నక్షత్రాలు వదలి వేస్తే మిగిలినవి 14 నక్షత్రాలు మాత్రమే. మళ్లీ అందులో ఏక నక్షత్రాలు పనికిరానివి. 8 నక్షత్రాలు శలవిచ్చారు. అంటే 14లో 8 పోతే 6 నక్షత్రాలే చూడాలి అన్నమాట. ఈ ఆరు నక్షత్రాలలో తారాబలం 1-3-5 జన్మతార, విపత్తార మరియు ప్రత్యక్తార అవుతారా అంటే మళ్లీ 6 నక్షత్రాలలో 3 నక్షత్రాలు వద్దనుకుంటే మిగిలేవి లేక కుదిరే నక్షత్రాలు ఎన్ని? వివాహం అవుతుందా మీరే నిర్ణయించుకోండి.

ఇంకొక విషయం ఏమంటే వధువు నక్షత్రం నుంచి మొదటి 13 నక్షత్రాలు వదలివేయాలంటే తారాబలానికి అర్థం లేదని చెప్పకనే చెప్తున్నారు. అందుకనే వివాహానికి తారాబలం చూడక్కరలేదనే విపరీతార్థాలు కొంతమంది చెప్తున్నారు. ఇది శాస్త్ర సమ్మతం కాదు. ఎందుకంటే వధూవరుల నక్షత్రాలబట్టే ముహూర్త నిర్ణయం చేస్తాము. అలాంటప్పుడు తారాబలం చూడడం అవసరం లేదంటే ఇంక ముహూర్తమెందుకు? అలా పెట్టిన ముహూర్తానికి ఒక విలువ మరియు ముహూర్తబలం ఉంటుందా? కాబట్టి స్త్రీ దీర్ఘం మనేది మనం పరిగణనలోకి తీసుకొనకూడదు. దీనికి వేరే అర్థాలు చెప్పే కుహనా పండితుల వ్యాఖ్యలు పాటించకండి.

**జ్యోతిష్య సర్వార్థ చంద్రిక**

ప్రథమ స్కంధము

సమాప్తం.

# జ్యోతిష్య సర్వార్థ చంద్రిక



రచయిత : "జ్యోతిషాచార్య"
డా॥ పండిట్ మల్లాది మణి, Ph.D
స్వస్థలం : విజయవాడ
నివాసం : హైదరాబాద్
వయస్సు : 72 సం॥
వృత్తి : బ్యాంకు ఉద్యోగం చేసి
2000 సం॥లో ఉద్యోగ విరమణ

ఇతర రచనలు :
1. కళ్యాణ జాతక విశ్లేషణ
2. జాతక మోక్ష ప్రదాయిని
3. జాతక సుధాసారమ్
4. సర్వాంగ ముహూర్త సారణి
5. కాలసర్ప దోషం
6. జాతకయోగ ప్రాశస్త్యం
7. జాతక రాశ్య సంభావన

## ఈ పుస్తకం గురించి

శ్రీ మల్లాది మణిగారు వ్రాసిన ఈ పుస్తకాన్ని చదివినవారికి తాము ఎంత లోక జ్ఞానం సంపాదించామో, సామాజిక న్యాయం అంటే ఏమిటో, అసలు జ్యోతిషం అంటే ఏమిటో, జ్యోతిషుల పాత్ర, ప్రజాస్రవంతిలో ఎలా ఉండాలో ఒక వినూత్న పంథాలో జనబాహుళ్యాన్ని ఎలా ఉత్తేజపరచాలో, అనేదే కాక హిందూ మత సాంప్రదాయాల సంస్కారాలు ఎలా ఉన్నాయో ఒక సద్విమర్శ చేస్తూ అనుభవపూర్వకంగా అద్భుత వ్యవహారిక సరళశైలిలో వ్రాసిన ఈ గ్రంధరాజం అతివిశిష్టమైనదే కాక మూల్య విలువను వెలకట్టలేమని మేము అర్థం చేసుకుని, ఈ పుస్తకరాజాన్ని ఆంధ్రదేశానికే మకుటాయమానంగా, పండిత పామరులందరకు విజ్ఞాన దాయకంగా ఉంటుందని వాక్సుద్ధిగల జ్యోతిషాచార్య కలం నుంచి వెలువడిన ఈ పుస్తకం ప్రచురించే ఆ అదృష్టం మాకు కలిగిందని విశ్వసిస్తూ దీన్ని మీరందరూ చదవాలని గ్రహాలదీవెన అంటే ఏమిటో మీరే గ్రహించి గ్రహాల శుభఫలితాలు పొంది సుఖసంతోషాలతో మీ జీవననౌక ప్రశాంతతో పయనిస్తుందనే దృఢ విశ్వాసంతో ఆంధ్రావనికి మా మరో జ్యోతిషశాస్త్ర పుష్పగుచ్ఛం సమర్పిస్తున్నాము.

– పబ్లిషర్స్